UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

Cl. No. T294.5925 Acc. No. 39026
C43S
6.4

DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

పి స

ద్రవ్యసాహాయ్యమున ముద్రింపఁబడినది

ప్రకాశకుఁడు
పినుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి
చిదంబరగ్రంథమాల
రామారావుపేఁట - కాకినాడ
1956

[సర్వస్వామ్యములు ప్రకాశకునివి.

శ్రీమదాంధ్రపద్మపురాణము

ప్రథమసంపుటము	క్యాలికోబైండు	8-0-0
ద్వితీయసంపుటము	,,	4-0-0
తృతీయసంపుటము	,,	5-0-0
చతుర్థసంపుటము	,,	6-0-0

పుస్తకములు దొరకుచోట్లు

శ్రీ చిదంబర గ్రంథమాల
రామారావుపేట-కాకినాడ

విద్వాన్ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రి
ఆంధ్రాధ్యాపకుఁడు
వేంకటగిరిరాజకళాశాల - నెల్లూరు

ముద్రాపకులు
ప్రకాశ ప్రెస్సు - నెల్లూరు

భూమిక

శ్రీపరమేశ్వరకరుణాకటాక్షవీక్షణమున నేటికి శ్రీమదాంధ్రపద్మపురాణము నందుఁ గడపటి దగుచతుర్థసంపుటమును సైతము ముద్రించి ప్రకటింపఁగలభాగ్యము చేకూరినది. కృతికర్త యేతత్పురాణముద్రణకార్యభారమును సోదరుల మైనమామీఁద మోపుటయు నేనును నాసోదరుఁడు చిరంజీవి విశ్వేశ్వరశాస్త్రియు నాంధ్రమహాశయుల తోడ్పాటుతోఁ గ్రమముగా నాదిభూమిబ్రహ్మఖండములను బ్రథమసంపుటముగను పాతాళఖండమును ద్వితీయసంపుటముగను సృష్టిఖండమును దృతీయసంపుటముగను ముద్రించి ప్రకటించుట పాఠకులకు విదితచరము.

ప్రకృతము చతుర్థసంపుటముగా వెలువడినయీయుత్తరఖండమున సకలపథమానవులిహపరసౌఖ్యములు చూఱకొనుట కనువగుమార్గము లనేకములు గలవు.

౧. నానాభక్తస్వరూపకథనమున ననుబదిమూఁడుపద్యము లున్నవి. కవి దాదాపు ప్రతిపద్యము ననేకోపమాదృష్టాంతములతో నలంకరించి భక్తిసౌందర్యమును బుట్టించి పాఠకహృదయములు పరవశము లగునట్లు చేసియున్నాఁడు. ఒకచిన్నిపద్యము.

గీ. నడుచుచున్నను గనుచున్న నుడువుచున్న, సలిలమును గొనిపోయెడిజనునిమనము
ఘటముననె నిల్చుగతి నెంతయుఁ గదలకుండ, శ్రీధరునియంద భక్తునిచిత్తవృత్తి.

౨. మార్కండేయయమసంవాదమునందు యమునిధృష్టవచనములలో సకలమానవులు ననుసరింపఁదగినముఖ్యధర్మము లెన్నియో యున్నవి. భక్తిపరవశుఁడైన మార్కండేయునిధీరసమాధానములు చదువునపుడు శరీరమున గగుర్పాటు గలుగకమానదు. మత్తకోకిలవృత్తములతోఁ బ్రవర్తిల్లినమార్కండేయునిమృత్యుంజయస్తోత్రము వక్తృశ్రోతల నుత్సాహడోలికలలో నూఁగించి శివభక్తిపరాకాష్ఠ నందుకొనునట్లు చేయుచున్నది.

మత్తకోకిలము. బాలచంద్రకళావిభూషణభాసమానకపర్దినిన్
వ్యాళరాజగుణోపపన్నసువర్ణశైలశరాసనున్
నాళికేక్షణబాణునిన్ గణనాథునిన్ ద్రిపురఘ్నునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్.

౩. జాలంధరోపాఖ్యానములోఁ జిత్రవిచిత్రము లైనరాక్షసులమాయోపాయములు యుద్ధనైపుణ్యము లోకాతీతజాలంధరపరాక్రమాదులు వర్ణితము లైనవి. బలాసురదేహఖండములనుండి నానావిధమణు లావిర్భవించుటయు గతప్రాణుఁడైనబలునిచే శుక్రాచార్యుఁడు మాటలాడించుటయు మొదలగుచోద్యములు గలవు.

౪. భగవద్గీతయందలియష్టాదశాధ్యాయములకుఁ గూడ మాహాత్మ్యములు మనోహరము లైనకథలతో నిరూపింపఁబడియున్నవి. దీనిని జదివినను వినినను నెట్టివాని కైనను నిత్యము భగవద్గీతాపారాయణము చేసితీరవలయు ననునభినివేశము కలుగును.

౫. భాగవతమహిమ సప్తాహమహిమ మాఘమాసమాహాత్మ్యము వీనియం దద్భుతము లగుకథలు చక్కని వర్ణనములు ననంతము లైనధర్మములు మానసతీర్థములు భౌమతీర్థములు వానిలక్షణములు తారతమ్యములు వాసికారణములు వివరింపఁబడియున్నవి.

౬. శ్రీప్రకమారగంధర్వకన్యావర్ణనములు వారిధర్మప్రేమవాదములు గంధర్వకన్యలవిరహవర్ణనము మనోరంజకము లైనభావములతో ముద్దుంగులికెడిపద్దెములతో సహృదయహృదయంగమము లై యలరారు చున్నవి. మచ్చున కొకపద్యము.

సీ. నీమానసమునకు నిలుకడయే లేదొ, మానిూద నీకు నమ్మకము లేదొ
చిత్తంబులోనికిఁ జేర నేర్చితి వేమొ, చేరి యీవలకు రానేర వేమొ
యపరాధములు లేనియబలామణుల నేచ, నెఱిఁగియుఁ బరదుఃఖ మెఱుఁగ వేమొ
క్రూరాత్ముఁడవొ సుందరులమానధనమును, దస్కరించెడిమేటితస్కరుఁడవొ
గీ. మాయ లెఱిఁగినవాఁడవొ మాంత్రికుఁడవొ, మమత లేనట్టివాఁడవొ మముఁ బరీక్ష
సలుపఁ దలపెట్టితివొ కార్యసాధకుఁడవొ, పలుకు మొకమాట నాథ నీపైఁడినోట.

౭. అదత్తదానుఁ డగువసుబ్రాహ్మణునివిలాపము సువ్రతునివిచారము నెన్నిమార్లు చదివినను దనివితీఱదు పైపెచ్చంతటిపాషాణహృదయము నైనను ధర్మప్రవణముగా నొనర్చితీఱును.

౮. శ్రీకుండలవికుండలులవృత్తాంతమునందలిసుగతిదుర్గతిహేతుకర్మకథనమున వచియించిన యమలోకవిశేషము లెల్లరును దెలిసికొనఁదగినవి. దేవద్యుతి చేసినయోగసారస్తవములో సాంఖ్యచార్వాకాదిమతములసిద్ధాంతములు వాని కన్నింటికిని శ్రీమహావిష్ణువునందే వినియోగ మనుసమన్వయము సాకారనిరాకారసమన్వయవర్ణనములు నత్యద్భుతశైలిలో నడిచి పాఠకుల విజ్ఞానామృతప్రవాహములో నోలలాడించు చున్నవి. ఒక పద్యము.

సీ. కొలుచు చుండెదరు సాంఖ్యులు ప్రధానమునకఁ, బరుఁడై ప్రకాశించుపురుషునిఁగను
శ్లాఘించు చుందురు సౌగతుల్ బుద్ధిఁగాఁ, దర్కోపతర్కవితర్కములను
ధ్యానించు చుందురు జైనశాస్త్రజ్ఞులు, దేహప్రమాణప్రదీపితునిఁగ
వచియించు చుందురు చార్వాకులు యోగవి, ద్యాప్రౌఢభూతచైతన్యముగను
గీ. సచ్చిదానందరూపుని జన్మమృత్యు, వర్జితుని భేదశూన్యుని వాస్తవికుని
యౌపనిషదవచోలక్ష్యు మైనవాని, నద్వితీయునిఁ బరుని నవ్యయుని నిన్ను.

త్రిపాద్విభూతి వైకుంఠవ్యూహము క్షీరసాగరవ్యూహము న్యాసమంత్రమంత్రార్థము మొదలైన యెన్నియో ఘట్టము లపూర్వాద్భుతవిషయబోధకములు జన్మతారకములు శాంతిదాయకములు చిత్తమలాపహారకములు నై యలరారు చున్నవి.

ఈచతుర్థసంపుట మాంధ్రదేశమున కలంకారభూత మైనగోదావరీమండలములో జగదుద్ధరణార్థమై యవతరించి రత్నాద్రియం దధివసించిన శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామివారి ద్రవ్యసాహాయ్యముతో ముద్రింపఁబడినది. ఈ యుత్తరఖండము శ్రీమహావిష్ణువును బరదైవముగా నిర్ణయించుటయు దీనిని శ్రీమదన్నవరరత్నాద్రీశ్వర శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామి యుద్ధరించుటయుం జూడ శ్రీమన్నారాయణమూర్తి తనమహిమను దానే లోకోద్ధరణార్థమై యీపురాణముఖమున వెల్లడించికొనినట్లు తోఁచుచున్నది. ఈయన్నవరదేవస్థానము గలపర్వతము రత్నాద్రి యనియు దేవాలయమునఁ గలయంత్రము త్రిపాద్విభూతిమహానారాయణయంత్ర మనియుఁ బండితులు పలుకుచుందురు. ఈయంత్రము త్రిపాద్విభూతిమహానారాయణోపనిషత్తులో విశదముగా వివరింపఁబడియున్నది. ఈయుపనిష త్తష్టోత్తరశతోపనిషత్తులలో నొకటి. ఇది యద్వితీయబ్రహ్మమును బోధించుమహోపనిషత్తు. అథర్వవేదమున దేవదర్శి యనుశాఖయం దియ్యది గలదు. ఈయుపనిషత్తునం దెనిమిదియధ్యాయములు గలవు. ఈయంత్రము సప్తమాధ్యాయమునందు వివరింపఁబడియున్నది. దీనికిఁ బందొమ్మిదియావరణము లున్నవి. ఆయాయావరణములలో సకలదేవతలుం గలరు. ఇట్లు సకలదేవతాసాన్నిధ్యము గలయీయంత్రరాజమునకు శిరోభాగ మగుబిందుస్థానమునం దావరణదేవతాసమష్టిరూపుఁ డగు త్రిపాద్విభూతిమహానారాయణమూర్తి నివసించియుండు నని పై యుపనిషత్తు నుడువు చున్నది. ఏతదుపనిషన్నిరూపితయంత్రమే యన్నవరదేవస్థానములోఁ గలయంత్రము. ఆయంత్రమందుఁ బ్రతిష్ఠితుఁడైన శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామియే త్రిపాద్విభూతిమహానారాయణమూర్తి.

ఇట్టి శ్రీవీరవేంకటసత్యనారాయణస్వామి వారిప్రసాదమున నీయాంధ్రపద్మపురాణ చతుర్థసంపుటము ముద్రింపఁబడుట కృతికర్తలపుణ్యఫలము. ఈపవిత్రకార్యమున మేము నిమిత్తమాత్రులముగా నుండుటచే మాజన్మములు ధన్యములు.

మా కీచతుర్థసంపుటముద్రణకార్యమునందు సమగ్రముగా సహాయపడి ద్రవ్యమిప్పించినదయార్ద్రహృదయులు దైవభక్తిసమన్వితులు దేవస్థానములడిప్యూటీకమీషనరు నగు రా. శే. శ్రీ సి. వి. యల్. వరప్రసాదరావు. B. A. B. L. గారియెడ మేము సర్వదా కృతజ్ఞులము. వారికి భగవంతుఁడు శాశ్వతమై కుశలనివాసభాగ్యము ననుగ్రహించుఁగాక.

ఈగ్రంథగుణమును బవిత్రతను గ్రహించి మావినతిపత్త్రము నంగీకరించి ద్రవ్యసాహాయ్యము చేసి స్వీయవంశక్రమాగత మైనయుదారభావమును గనఁబఱచిన దేవస్థానధర్మకర్తలగు శ్రీరాజా యినుగంటిరాజగోపాలరాయణింగారికి మాకృతజ్ఞతాపూర్వకాభినందనము లర్పించు చున్నారము.

ఇట్లు

ప్రకాశకుఁడు

పినుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి

వెల్లూరు
4—5—1956

విషయసూచి

విషయము	ఉత్తరఖండము	పౌరట.
బదరికాశ్రమవృత్తాంతకథనము	,,	1
జాలంధరాఖ్యానకథనము	,,	2
బలాసురవధవృత్తాంతకథనము	,,	6
శ్రీశైలవృత్తాంతకథనము	,,	23
హరిద్వారమాహాత్మ్యకథనము	,,	,,
నానాధర్మకథనము	,,	30
గల్లికామహానదీమాహాత్మ్యము	,,	31
ఋషిపంచమీవ్రతమాహాత్మ్యము	,,	32
కృష్ణుఁడు కల్పవృక్షంబుం దెచ్చుట	,,	34
సత్యభామ తులాపురుషదాన మొసంగుట	,,	,,
సత్యభామాపూర్వజన్మవృత్తాంతకథనము	,,	35
కార్తికమాసమాహాత్మ్యకథనము	,,	36
చోళభూపాలవిష్ణుదాసవృత్తాంతకథనము	,,	45
ముద్గలవంశ్యవిశిఖత్వహేతుకథనము	,,	47
జయవిజయవృత్తాంతకథనము	,,	48
కృష్ణావేణ్యాదినదీజన్మచరిత్రకథనము	,,	49
స్వరదేవతల నెల్ల నదులుగా శపించుట	,,	,,
అదత్తపుణ్యపాపప్రాప్తికథనము	,,	50
చతురశీతినరకకథనము	,,	53
పార్వతి దేవతలను వృక్షములుగా శపించుట	,,	54
అశ్వత్థస్పర్శయోగ్యవారకథనము	,,	,,
మాసోపవాసవ్రతవిధానకథనము	,,	58
జాగరలక్షణకథనము	,,	60
నానాభక్తిస్వరూపకథనము	,,	63
విష్ణుతీర్థనామకథనము	,,	69
వేత్రవతీమాహాత్మ్యకథనము	,,	70
సాభ్రమతీమాహాత్మ్యకథనము	,,	71
బ్రహ్మచారితీర్థమాహాత్మ్యము	,,	72
వికీర్ణతీర్థమాహాత్మ్యము	,,	73

విషయము	ఉత్తరఖండము	పుట
శ్వేతతీర్థమాహాత్మ్యము	,,	73
గణతీర్థమాహాత్మ్యము	,,	74
అగ్నితీర్థమాహాత్మ్యము	,,	,,
హిరణ్యాసంగమతీర్థమాహాత్మ్యము	,,	75
అప్సరస్తీర్థమాహాత్మ్యము	,,	,,
ధర్మతీర్థమధురాతీర్థమాహాత్మ్యము	,,	,,
కంబుతీర్థమాహాత్మ్యము	,,	76
కపితీర్థమాహాత్మ్యము	,,	77
ఏకధారతీర్థమాహాత్మ్యము	,,	,,
సప్తధారతీర్థమాహాత్మ్యము	,,	,,
శంఖతీర్థమాహాత్మ్యము	,,	,,
బ్రహ్మవల్లీతీర్థమాహాత్మ్యము	,,	78
వృషతీర్థమాహాత్మ్యము	,,	,,
సంగమేశ్వరతీర్థమాహాత్మ్యము	,,	,,
రుద్రమహాలయతీర్థమాహాత్మ్యము	,,	79
ఖడ్గతీర్థమాహాత్మ్యము	,,	,,
చిత్రాంగవదనతీర్థమాహాత్మ్యము	,,	,,
వందనతీర్థమాహాత్మ్యము	,,	80
జంబుతీర్థమాహాత్మ్యము	,,	,,
ఇంద్రగ్రామతీర్థమాహాత్మ్యము	,,	,,
బాలాపతీర్థమాహాత్మ్యము	,,	83
కావ్యతీర్థమాహాత్మ్యము	,,	84
ఖడ్గధారతీర్థమాహాత్మ్యము	,,	,,
దుర్గేశ్వరతీర్థమాహాత్మ్యము	,,	86
చంద్రతీర్థమాహాత్మ్యము	,,	87
పిప్పలాదతీర్థమాహాత్మ్యము	,,	,,
నింబార్కతీర్థమాహాత్మ్యము	,,	88
సిద్ధతీర్థమాహాత్మ్యము	,,	,,
తీర్థరాజమాహాత్మ్యము	,,	89
సోమతీర్థమాహాత్మ్యము	,,	,,
కాపోతతీర్థమాహాత్మ్యము	,,	,,
గోతీర్థమాహాత్మ్యము	,,	90

శ్రీమదాంధ్రపద్మపురాణము

ఉత్తరఖండము

కాళహస్తివరదా
కాళోదరభూష నిత్యకల్యాణగుణా
నీకు చిదంబరరచిత
శ్లోకప్రియ విశ్వనాథ సురుచిరగాథా. 1

వ. నైమిషారణ్యంబున శౌనకుండు మహర్షిబృందసమేతుండై పద్మపురాణశేషముం
దెల్పు మని యడుగుటయు నత్తపోధనునకు సూతుం డి ట్లనియె. 2

ఆ. మునివరేణ్య వినుము మును నారదుఁడు రజ, తాచలమున కేఁగి హరుని గాంచి
బదరికాశ్రమప్రభావంబు నడుగంగ, నమ్మహర్షి కిట్టు లనియె శివుఁడు. 3

—: బదరికాశ్రమవృత్తాంతకథనము :—

ఆ. ఉర్విలోన నద్రు లొకలక్షయును నిర్వ, దేనువేలు గలవు వానిలోన
నధికపుణ్య మైనయది యొకబదరికా, శ్రమమహీధరంబ సంయమీంద్ర. 4

క. నరనారాయణు లనియెడి, పరమపురుషు లుండి రచటఁ బాండురవర్ణో
త్తరుఁ డొకఁడు కృష్ణవర్ణో, త్తరుఁ డొక్కఁడు వారు లోకధారణదక్షుల్. 5

సీ. అచ్చటఁ గలవు ఋష్యాశ్రమంబులు పెక్కు, నసియింతు రచట దేవతలు సతము
వినఁబడు నిరతంబు వేదఘోషము లందు, నగ్నిహోత్రము లుండు నచట నెపుడు
నుత్తరాయణమున నొనరింపఁబడు మర్త్య, పూజ యాదేవతాపుంగవులకు
నలవిగా దొరులకు నరుగ నచ్చోటు దక్షి, ణాయనంబున హిమవ్యాప్త మగుట

గీ. నమ్మహాదేవతలదర్శనమ్మువలన, జన్మశతకోటిపాతకసంఘ మెల్ల
భస్మ మైపోవు క్షణములోపలనె తరమె, బదరికాశ్రమతీర్థప్రభావ మెన్న. 6

ఆ. అచట నలకనంద యనుగంగలోపల, స్నాన మాచరించినను నశేష
విశ్వసేవ్యుఁ డైనవిశ్వేశ్వరుని నటఁ, జూచినను సమస్తశుభము లొదవు. 7

క. చలిపితి నే నొకపరి నా, స్థలమున నొకవత్సరంబు తపమును దానన్
సులభంబుగ నాయెదుటను, నిలిచెను నారాయణుండు నిజరూపముతోన్. 8

సీ. అపుడు నేను బ్రసన్నుఁడై నగోవిందునిఁ, దిలకించి హర్షంబు మొలకలెత్త
సాష్టాంగవందనం బాచరించితి దాని, కచ్యుతుం డెడఁద నాహ్లాద మొంది
యీశ కోరుము వరం బిచ్చెద నావుడు, వాంఛించితిని నేను వరయుగంబు
విష్ణుభక్తుండ నై వెలయునట్లును ముక్తి, దాతృత్వమును నేను దాల్చునట్లు
ఆ. నామనోరథంబునకు సంతసము నొంది, వాసుదేవుఁ డట్లె వరము లొసఁగె
నదియె మొదలు గాఁగ హరిభక్తిపరుఁడ నై, యేను ముక్తి శ్రితుల కిచ్చుచుంటి.
వ. అని నుడువుటయు నారదుండు సంతోషించుచుఁ దదనుమతిం గొని పాండవులం
జూచువేడ్కతోడఁ గామ్యవనంబునకుం జనియె. 10
సీ. అపుడు పాండవు లెల్ల నమరతపస్వికి, సముచితపూజలు సలుపుటయును
వారిభక్తికి మెచ్చి నారదుం డాశీర్వ, దించెఁ దద్దుఃఖంబు దీఱునట్లు
ధర్మజుం డప్పు డాతనిఁ జూచి మహనీయ, తెలుపు మేకర్మంబువలన మాకుఁ
గాననవాసదుఃఖము సంభవించెనో, నాఁగ నిట్లనియెను నారదుండు
గీ. ధర్మజ యెవండు సుఖి భవోదధిని గూలి, పరితపించెడివారిలో నరసిచూడఁ
గానరాఁ డొక్కఁడును సుఖి కడకు నాకు, దేహములను ధరించినదేహులందు. 11
సీ. ప్రత్యక్షదైవ మై పరగుసూర్యుఁడె సుఖి, యన్న రాహుగ్రస్తుఁ డయ్యె నతఁడు
రవిబింబము గ్రసించురాహువె సుఖి యన్న, హరి చక్రమునఁ ద్రుంచె నతనిశిరము
చక్రధరుం డైనశౌరియె సుఖి యన్న, నులిచె జాలంధరుం డుదధి నతనిఁ
జక్రి నోడించిన జాలంధరుఁడె సుఖి, యన్న నీశ్వరహతుం డయ్యె నతఁడు
గీ. నావుడు యుధిష్ఠిరుండు మానసమునందు, విస్మయము నొంది మునివర్య వేడ్క గలిగె
వినఁగ జాలంధరునిచరిత్రను వచింపు, మనుటయును నిట్టు లనియె నయ్యమరమౌని. 12

—: జాలంధరాఖ్యానకథనము :—

సీ. వినుము ధర్మజ తెల్పెదను మున్నొకప్పుడు, సపరివారముగను శతమఖుండు
కైలాసమున కేఁగి నీలకంఠునియొద్ద, నద్భుతంబుగను నాట్యంబు సేసె
దానికి శంకరుం డానందభరితుఁ డై, వాసవ కోరుము వరము ననియె
నంతట వాసవుం డతిగర్వమును బొంది, హరసన్నిభునితోడ నాజి గోరెఁ
గీ. గాలకంధరుఁ డాతనిగర్వమునకు, నాత్మలోఁ గ్రోధ ముదయింప నణఁచి దాని
నప్పటికిఁ బైకి నవ్వుచు నమరనాథ, వరము నిచ్చితి నట్లె నీ వరుగు మనియె. 13
వ. అంతట మహేంద్రుండు సంతోషించుచు సపరివారంబుగాఁ ద్రిదివంబునకుం జనియె.
క. ఆతఁడు పోయినవెంటనె, చేతంబునఁ గ్రోధ మెచ్చి శితికంఠునకున్
భూతములు బెగడ మూర్తి, భూతం బయి నిలిచె హరుఁడు పొడగని దానిన్. 15
సీ. క్రోధంబ సింధువార్ధులకు వేగమె యాత్మ, జాతుండ వై నీవు జనన మంది
యమరనాథునిగర్వ మణఁగింపు మని యాజ్ఞ, యీయంగ నాక్రోధ మేఁగి యపుడ

యబ్ధిసింధునదీసమాగమవేళను, బాడమైను వారికిఁ బుత్రుఁడుగను
నాకుమారుఁడు పుట్టినప్పు డేడ్చినయేడ్పు, వలనఁ గంపించె భూవలయ మెల్ల
గీ. నిండె జగముల నెల్లఁ దన్నినద మపుడు, చెడుటను సమాధిముద్ర నిశ్చేష్టుఁ డగుచుఁ
గొంతసే పుండి యావలఁ గుతలమునకు, హంసయానంబుతో బ్రహ్మ యరుగుదెంచి.
గీ. అది పయోనిధిగర్జన మని తలంచి, యబ్ధికడ కేఁగి యతనిచే నర్చ నొంది
జలధి నీ వేల గర్జింపవలసివచ్చె, నెల్లలోకంబులును దల్లడిల్లఁ జెపుమ. 17
సీ. అనవుడు వార్ధి యి ట్లనియె లోకేశ నీ, యాజ్ఞలో వర్తించునట్టినేను
గంపింప లోకముల్ గర్జింతునె మహాత్మ, భవ్యుఁ డేడ్చె నిపుడె యుద్భవము నొంది
యేమి యేడుపో యిదె యెఱుఁగంగరాదాయె, రక్షపెట్టుము లోకరక్షకుఁడవు
నా విని తత్పుత్త్రు నందనునిం గొని, వచ్చె సింధువు మ్రొక్కి వనజజునకుఁ
గీ. గూరుచుండంగఁ బట్టు నాకొడుకుఁ గుఱ్ఱ, నజునితొడమీఁద నంత నాయర్భకుండు
బ్రహ్మగడ్డము గట్టిగాఁ బట్టుకొనఁగ, నజుఁడు విడిపించుకొన లేక యఱవ సాగె. 18
గీ. అంత నుద్వేగమున లేచి యబ్ధి మహాత్మ, బలము నెల్లను వినియోగపఱిచి యెట్లొ
కడకు విడువంగఁజేసె నక్కొడుకు కేలు, స్రష్ట యప్పుడు మిగుల విస్మయము నొందె.
వ. ఆయర్భకునకు జాలంధరుం డను నామకరణంబు గావించి సంతోషంబున ననేకవరంబు
లొసంగి హంసవాహనారూఢుం డై నిజనివాసంబునకుం జనియె. 20
సీ. అంతటఁ గ్రమముగా నాయర్భకుఁడు వృద్ధి, నొందుచు బలవృద్ధిఁ బొందు చుండ
నాటలాడుచును హర్యక్షవారణవరా, హాదులతోడ నత్యద్భుతముగఁ
బడఁగొట్టుచును వ్యోమపథమున కెగిరి ఖే, చరవిమానములను ధరణిమీఁదఁ
గింధి యెల్లను నల్లకల్లోలముగ నీఁదు, లాడుచు సత్త్వంబు లంత మొందఁ
గీ. గడపి బాల్యంబు యౌవనాక్రాంతకాయుఁ, డై విరాజిల్లుచుండంగ నపుడు శుక్రుఁ
డరుగుదెంచి పయోధియభ్యాశమునకుఁ, దత్సపర్యాప్రతుష్టచేతస్కుఁ డగుచు. 21
సీ. అనఘ జంబుద్వీపమున నుండె నొకమహా, పీఠంబు యోగిప్రీతిదంబు
మును నీవు దానిని ముంచితి వది నేఁడు, జాలంధరునకు రాష్ట్రముగ నిమ్ము
దానిలో నుండి యీతం డభేద్యుండు గా, నెల్లజగంబుల నేలఁగలఁడు
నావుడు వారిధి నందనప్రేమంబు, వలన నాదేశంబు వదలిపెట్టె
గీ. నంతటఁ ద్రిశతయోజనాయతియును శత, యోజనవిశాలతయుఁ గల్గియుండినట్టి
యాస్థలంబున వసియించి యచట నేరు, పఱచుకొనియెను నొకదివ్యపత్తనంబు. 22
వ. ఆస్థలంబు జాలంధరదేశం బనియును నాపురంబు జాలంధరపురం బనియును నమ్మహా
పీఠంబు జాలంధరపీఠం బనియును దన్నామంబున విశ్రుతంబు లయ్యె: సాగరుం
డాత్మోదరోద్భవం బగుమహాపద్మసహస్రసైన్యంబును శుక్రుండు సమస్తశస్త్రాస్త్ర
విద్యలును జాలంధరునకుఁ బ్రీతిపూర్వకంబుగా నొసంగిరి. 23

గీ. అపుడు శుక్రోపదేశంబు ననుసరించి, వర్తిలుచు వాఁడు పాతాళవాసులైన
దానవుల నెల్ల రావించి తనసమక్ష, మందు నుంచికొనియె బలం బగ్గలింప. 24

గీ. అట్లు సైన్యంబు సమకూడినంత శుంభుఁ, డనునిశాచరవరుని సైన్యాధిపతిగఁ
జేసి జాలంధరుఁడు తనసీమ నెల్ల, నేలఁ దొడఁగెను నిజధాటి కెదురు లేక. 25

ఆ. అట్లు కొంతకాల మరుగంగఁ గ్రౌంచప్ర, పాదమునను జేసి స్వర్ణ యనెడి
యప్సరసకుఁ బుట్టినట్టిబృందను బెండ్లి, యాడె శుక్రునాజ్ఞ నబ్ధిసుతుఁడు. 26

ఆ. అట్లు పెండ్లియాడి యఖిలజగన్మోహ, నాంగి యైనబృంద నబ్ధిసూనుఁ
డామెతోడఁ గూడి యఖిలసౌఖ్యములను, ననుభవించు చుండునట్టితఱిని. 27

సీ. దైత్యగురుండు తత్సవిధంబునకు వచ్చి, యతనియదృష్టంబు నభినుతింప
నది విని సోత్సాహుఁ డగుచు నబ్ధిసుతుండు, కావ్యుని నెంతేని గౌరవించి
యాచార్య యమరుల కాధిక్య మేర్పడ, నేమి కారణమొ నా కెఱుఁగఁ జెపుమ
యని యడుగుటయు శుక్రాచార్యుఁ డసురకా, ర్యంబు సాధింపంగ నద నెఱింగి
గీ. వినిచి క్షీరాబ్ధిమథనగాథను సుపర్వు, లందులోఁ బుట్టినమహాపదార్థములను
నపహరించినకతమున నధికులైరి, యని నుడివి యూరకుంటయు నతఁడు కినిసి. 28

సీ. దుర్వారణుం డనుదూతను రావించి, యెల్లరు వినఁగఁ దా నిట్టు లనియె
దూత దుర్వారణ తూర్ణంబుగను నీవు, చని దివంబునకు వాసవునిఁ గాంచి
తెలుపుము నావాక్యములుగ వానికి నిట్లు, జాలంధరుఁడ నేను శక్ర వింటె
నాపితృవ్యుఁడు పయోఽర్ణవము వానిని మీరు, ద్రచ్చి తద్గతపదార్థముల నెల్ల
గీ. నపహరించితి రనుమాట యిపుడు నాకుఁ, దెలిసె నవి యన్నియును నేఁడు తెచ్చి యిచ్చి
స్వర్గమును వీడి పొమ్ము నిర్జరులతోడ, నాశ గల దేని బ్రతుకుపై నాత్మలోన. 29

క. అనవుడు దుర్వారణుఁ డా, తనియాజ్ఞను శిరమునందుఁ దాల్చి రయమునన్
జని దివమున కింద్రునిఁ గనుఁ, గొని వారిధిసుతోక్తు లెల్లఁ గొంకక తెలిపెన్. 30

సీ. అపుడు నవ్వి మహేంద్రుఁ డతని కిట్లనియె దు, ర్వారణ మామకవాక్యములను
వినిపింపు మబ్ధిసూనున కిట్లు సాగర, నందన క్రోధంబు నొంద నేల
నాశత్రువైన మైనాకుండు దాఁగంగఁ, దనకుక్షిలోపలఁ దాఁ నొసంగె
జగముల దగ్ధంబు సలిపినబడబాగ్ని, దాఁగంగఁ దనలోనఁ దావు నిచ్చె
గీ. ధర్మవిద్వేషులైనట్టిదానవులకు, నాశ్రయం బయి క్షీరదధ్యాజ్యములను
గోరకయె యీయఁ దొడఁగె నాకారణముల, క్షీరపాథోనిధిని మథించితిమి మేము.

గీ. హీనగుణములు గలిగినహేతువుననె, సింధునాథుని మున్ను శోషిల్లఁ జేసెఁ
గుంభజన్ముఁడు గూడ దుర్గుణుల సైఁప, క్షణములో భస్మమైపోవె జగములెల్ల.

క. కావున వ్యర్థంబుగ మా, తో వైరముఁ బూని నీవు దుర మొనరింపం
గా వచ్చుపక్షమున సప, రీవారంబుగను నంతరించెదవు సుమీ. 33

క. అని చాలించుటయును గ్ర, క్కున దుర్వారణుఁడు వచ్చి క్షోణీస్థలికిన్
వినిపించెఁ బూస గ్రుచ్చిన, యనువున జాలంధరునకు హరిభాషణముల్. 34

గీ. ఆమహేంద్రునివచనంబు లాలకించి, మండిపడి లయకాలరుద్రుండుపోలె
నబ్జశతకోటిదైత్యసైన్యంబుతోడ, హంసకోటియుతవ్యోమయాన మెక్కె. 35

సీ. ప్రస్థితుండై మందరంబునకుం జేరి, ప్రథమదినమున నాపర్వతమును
ఖండించి ముక్కముక్కలుగ రెండవనాఁడు, మేరుభూధరమును జేరి దానిఁ
జెండాడి కూల్చి తచ్ఛిఖరంబులను దాని, పై నున్న వనములు పాడుచేసి
యచ్చట నుండుసిద్ధాంగనాజనముల, వ్రతభంగములు గాఁగఁ గుతిలపఱచి

గీ. పిమ్మట సుమేరుమేదినీధ్రమ్ము నాల్గు, దెసలు చెల్లాచెదరు చేసి దిక్పతులను
దుప్పదూలంగఁ గొట్టి ఖద్యోతవిధుల, ద్రోవ లరికట్టి చెఱపట్టె దేవతలను. 36

క. అంతట దేవత లెల్లరుఁ, జింతాకులహృదయు లగుచుఁ జిత్తంబుల దై
త్యాంతకుని శరణు వేఁడఁగ, నంతరమున నెఱిఁగి శార్ఙ్గి యమరావస్థన్. 37

ఉ. తాలిచి చేతఁ జక్రమును దార్క్ష్యుని నెక్కి సుపర్వకోటికిన్
మే లొనగూర్ప నెంచి గమనింపఁ గడంగుచు నుండ నంతలో
శ్రీలలితాంగి శార్ఙ్గి దరిఁ జేరి మనోహర నాసహోదరుం
డాలమునన్ భవన్నిహతుఁ డౌ నని భీతి జనించె నెమ్మదిన్. 38

క. అనవుడు మాధవుఁడు వరా, నన భీతిల వలదు పొమ్ము నావుడు హర్షం
బునఁ జనియె లక్ష్మి యంతటఁ, జనుదెంచె మురాంతకుండు స్వర్గంబునకున్. 39

ఆ. అపుడు వజ్రపాణి యుపగతధైర్యుఁడై, యబ్ధిసుతునితోడ నాహవంబు
సలుప నిశ్చయించి స్వబలంబుతోఁ గూడి, నిలిచెఁ జక్రధరునినికటమందు. 40

వ. అంతట గోవిందుండు సకలామరసైన్యంబుతోడం గూడి జాలంధరునిపై దాడివెడలుటయు జాలంధరుండు సకలదైత్యసైన్యసమేతుండై మాధవునితోడ యుద్ధంబునకు సిద్ధంబయ్యె.

ఆ. అపుడు మేరుమందరావనిధరమధ్య, భూమి యయ్యె యుద్ధభూమి యుభయ
పక్షసైన్యములకుఁ బ్రారంభ మొనరించి, రని నొనర్ప దితిజు లదితిజులును. 42

క. వారలవీరధ్వనులను, వారలశరవర్షములను వ్యాప్తం బగుటన్
బోరుకొనెఁదోడఁగె ధర ది, గ్వారణములు గికవెట్టఁ గడఁగెన్ భీతిన్. 43

క. ప్రదరాసిముఖాయుధముల, విదళితులై యుభయపక్షవీరులు కూలన్
నదు లయి రక్తము పాఱెన్, గదనక్షితి యరుణజలధిగాఁ గనఁబడియెన్. 44

గీ. అధిపుఁ డగుటను రాజయక్ష్మయుంబు, సకలరోగంబులకును దానికి యముండు
ప్రభు వగుట సర్వరోగముల్ ప్రబలి ఘోర, యుద్ధ మసురులతోఁ జేసి యోడి పాఱె.

—: బలాసురవధవృత్తాంతకథనము :—

క. అంతట బలాసురుండు ది, గంతము లదరంగ నార్చి యనిమిషబలమున్
వింతగను జయించి శచీ, కాంతునిపై కుఱికెఁ బ్రళయకాలుఁడుపోలెన్. 46

సీ. అపు డింద్రుఁ డతనిపై నఖిలాస్త్రముల వేయ, నవి విశీర్ణము లయ్యె నతనిఁ దాఁకి
యంతట నతిబలుం డగుబలుం డమరేంద్రు, నురమును మోఁదె ముద్గరముతోడ
దానికి సురపతి తాళఁ జాలక యార్చె, నది గని పకపక నసుర నవ్వె
నానవ్వుతోఁ దదాస్యమునుండి విస్మయ, కరము గాఁగను మౌక్తికములు రాలె

గీ. నది విలోకించి వాసవుఁ డడలి వాని, విక్రమమునకు యుద్ధాశ విడిచి యతని
నుతి యొనర్పంగఁ దొడఁగె నద్భుతము గాఁగ, దానికి బలాసురుండు సంతసము నొంది.

గీ. ఇంద్ర నీవాంఛితార్థంబు నిచ్చువాఁడఁ, గోరుకొను మన జంభాసురారి దైత్య
నాథ నీమే నొసంగుము నాకు ననుడు, నాతఁ డిచ్చితిఁ బుచ్చుకొ మ్మనియె నంత.

వ. పురందరుండు వజ్రంబుచే నయ్యసురుని దేహంబు వ్రక్కలొనరింపఁ బ్రథమఖండంబు కనకాచలంబునందును ద్వితీయఖండంబు హిమాచలంబునందును దృతీయఖండంబు గోనగంబునందును జతుర్థఖండంబు దేవనదియందును బంచమఖండంబు మందరపర్వతంబునందునుం బడియె. తచ్ఛరీరావయవంబు లన్నియు రత్నబీజత్వముం జెందె. తదస్థికణంబులు షట్కోణాకారమణు లయ్యె. లోచనంబులవలన నింద్రనీలంబులును శ్రోత్రంబులవలన మాణిక్యంబులును రక్తంబువలనఁ బద్మరాగంబులును మేదస్సువలన మరకతంబులును స్ఫాటికంబులును జిహ్వావలనను మాంసంబువలనను బ్రవాళంబులును దంతంబులవలన మౌక్తికంబులును నాదంబువలన వైడూర్యంబులును జనియించె. ద్విపేంద్రజీమూతసరాహభేకమత్స్యాహిశుక్త్యంబుధివేణుజాతంబు లగురత్నంబుల కన్నింటికిని నివియె జన్మస్థానంబులు. సితవృత్తగురుస్నిగ్ధకోమలనిర్మలనూపమగుణయుక్తం బగునది మౌక్తికంబు. దానిని హాటకఖచితంబు గావించి ధరించె నేని సర్వగ్రహదారిద్ర్యాదిభయంబు కలుగనేరదు. పురీషంబువలనఁ గాంస్యంబును వీర్యంబువలన రజతంబును మూత్రంబువలనఁ దామ్రంబును సంగోద్వర్తనంబువలనఁ బిత్తలంబును నఖంబులవలనఁ గనకంబును నుత్పన్నంబు లయ్యె. 49

క. బలదైత్యునిసాహసమును, వలదె ప్రశంసింప సహజవైరుల కైనన్
గలదె యదేయం బనునది, తిలకింపఁగ నెందు నేని ధీరాత్ములకున్. 50

గీ. అంధునకుఁ బద్మపత్త్రాయతాక్షిపగిది, మధురసంభాషణముపోలె బధిరునకును
శవమునకుఁ బుష్పమాలికచందమునను, వ్యర్థము కదర్యునకుఁ గలయర్థ మెల్ల. 51

గీ. నఱుకు చున్నను గత్తి కంఠమునఁ బెట్టి, దుర్జనాదులను ననుగ్రహింతురు మహాత్ము
లంబుధిని జేర్పవె సపత్నులైనఁ గూడ, శైలతటినుల గంగాది శైవలినులు. 52

క. పరహితతత్పరు లగుస, త్పురుషులు స్వవినాశకాలమునను వికృతి నొం
దరు ఛిన్నం బగు చున్నన్, బరశువునకు నీడె చందనద్రువు తావిన్. 53

గీ. అనుపకారుల కుపకార మాచరించు, నట్టివారలె సాధువు లాత్మకార్య
వశమునను జేయుదురు దుష్టవర్తనులును, బరుల కుపకారముల నది పాటి యగును.

సీ. అంతట వజ్రిచే హతుఁ డయ్యె బలదాన, వాగ్రణి యనుపల్కు లాలకించి
విలపించుచును వానివెలఁది ప్రభావతి, శీఘ్రంబుగను రణక్షితికి వచ్చి
యటఁ బడియున్న బలాసురకాయంబు, వీక్షించి యేడ్చుచు వెక్కివెక్కి
నాథ నీనోటను నా కొకమాట చె, ప్పక యున్న విడుతు నాప్రాణములను

గీ. నని కృతాత్మతనూపరిత్యాగబుద్ధి, యగుచు నుండంగ వీక్షించి యబ్ధిసుతుఁడు
దానవాచార్యుని మహాత్మ వీని నెట్టు, లేని బ్రతికింపు మన శుక్రుఁ డిట్టు లనియె. 55

క. కోరి మరణంబు నొందిన, వారిని బ్రతికింప నాకు వలనుపడదు నీ
కోరికనిజేసి యబ్ధికు, మారక యొకసారి వీని మాటాడింతున్. 56

క. అనవుడు జాలంధరుఁ డి, ట్లనియెను గురువర్య చేయు మట్టులె నాఁగన్
దనుజాచార్యుండు విలో, చనములు మూసికొని ధ్యానసంస్థితుఁ డయ్యెన్. 57

గీ. అట్లు ధ్యానించు చుండ నిశాటగురుఁడు, బలముఖోద్గతమై యొక్కపలుకు సాధ్వి
లీన మొనరింపు మింక నీమేను మామ, కావయవములలోపల నని శమించె. 58

వ. అంతట నామాట యాదేశంబుగం గైకొని ప్రభావతి తత్క్షణంబ నదీరూపముం బడసి బలాంగవిలీన యగుచు సుమేరువునకుఁ బూర్వవాహిని యై ప్రవహింపందొడంగె. దానంజేసి తత్తోయంబున రత్నంబుల కెల్ల నుత్తమకాంతి యేర్పడియె. 59

క. అంతట జాలంధరుఁ డ, త్యంతక్రోధమున రేఁగి యనిమిషులను వి
క్రాంతిమెయిం గూల్చి శచీ, కాంతునిపై నిశితసాయకంబుల నించెన్. 60

క. అపు డాశరముల నెల్లను, నిపుణంబుగఁ ద్రుంచి యమరనేత స్వనారా
చపరంపర నంబుధిసుతు, నిపయిన్ గురియించె భూరినిశితాశుగముల్. 61

సీ. ఆబాణముల నెల్ల నబ్ధిసూనుఁడు హస్త, ములఁ బట్టి ముక్కముక్కలుగఁ జేసి
యింద్రునిపైఁ గురియించె నత్యద్భుత, శక్తియుక్తము లైనసాయకముల
నవి తాఁకి వాసవుం డట్టిట్టు లయి చేష్ట, లుడిగి రథంబుపై నొఱగి వ్రాలె
నది చూచి యాకసం బంట నార్చెఁ బయోధి, నందనుం డాసింహనాదమునకు

గీ. వాసవుఁడు లేచి దిగ్గన వాని నపుడె, యంతమొందింపఁ దలఁచి వజ్రాయుధమును
వైచుటయుఁ బట్టుకొని దాని వార్ధిసుతుఁడు, వజ్రిని వధింప బిరబిర వచ్చుచుండ.

గీ. అపుడు గడగడలాడుచు నమరనేత, స్యందనమునుండి దిగ్గనఁ గ్రింది కుఱికి
యొక్కపరువున దైత్యారియొద్ద కరిగి, పట్టుకొనియెను దత్పాదపద్మములను. 63

వ. అంతట జాలంధరుండు పురందరునిరథంబు నధిష్ఠించి మాతలిని సారథిగాఁ జేసికొని నిరంకుశంబుగాఁ దిరుగుచు నమరసైన్యంబు నెల్లఁ జెండాడందొడంగె. 64

సీ. అపుడు జనార్దనుం డాగ్రహంబును జెంది, గరుడాధిరూఢుఁడై సురలతోడ
నాజిభూమిని జొచ్చి యసురవాహిని నెల్లఁ, బరిమార్పఁ దొడఁగె నుద్భటము గాఁగ
నచ్యుతహత మైనయసురసైన్యంబు నె, ల్లను దిలకించి జాలంధరుఁడు
ప్రళయాగ్నివలె మండిపడి దైత్యయోధుల, కంబుజాక్షునిఁ గూల్ప నాజ్ఞ యొసఁగె
గీ. నంతటను జెలరేఁగి యోధాగ్రగణ్యు, లందఱును నొక్కమూఁకయై యాశుగములఁ
గ్రుమ్మరించిరి హరిపైనిఁ గుతల మెల్ల, నతలకుతలము గాఁగఁ దదారభటుల. 65

గీ. ఆశరంబులు చని శౌరి నావరింప, హరి కనంబడఁడాయె మేఘావృతాద్రి
కైవడిని ధూమసంఛన్నగగనమట్లు, షట్పదాకీర్ణతామరసంబువోలె. 66

గీ. అట్లు క్షణకాల ముండి దైత్యాంతకుండు, తపనుఁడు హిమంబుఁబోలెఁ దద్బాణతతిని
క్షణములో రూపుమాపి రాక్షసుల శుష్క, పర్ణముల నాశుగమువోలెఁ బాఱఁగొట్టె.

ఉ. అప్పుడు శైలరోముఁ డనునాశరవీరుఁడు పైకి దూఁకి రా
నిప్పులు రాలుకోలలను నీరజనాభుఁడు వానిమేనిపైఁ
గుప్పెను గాని తద్విశిఖకోటులు తాఁకి తదీయదేహమున్
గుప్పనఁ గూలె ముక్కలయి క్షోణిపయిన్ దనుజుల్ హసింపఁగన్. 68

చ. అది గని మాధవుండు హృదయంబున నాగ్రహ మగ్గలింపఁగాఁ
గదనధరాతలంబునకు గ్రక్కున దూఁకి నిశాటసైన్యమున్
జిదురుపలై పడంగ గదచేతను మోఁదుచు శైలరోమునిన్
గదిసి తదీయశీర్షమును ఖడ్గమునన్ నఱకెన్ గటుక్కునన్. 69

క. ఖండితశిరుఁ డయ్యును నా, తండు భుజాదండములను దార్క్ష్యునిఁ బట్టన్
ఖండించెఁ జక్రి తద్భుజ, దండంబుల నంత వాఁడు ధరణిం గూలెన్. 70

వ. అప్పుడు జాలంధరుండు ఖడ్గరోమాసీతం బగురథంబు నెక్కి నిర్జరసైన్యంబు ఛిన్న భిన్నంబుగాఁ గొట్టుచు వాసుదేవునిసమీపంబునకుం జేరి. 71

క. గోవింద నిన్నుఁ గూల్చెడి, భావంబున వచ్చినాఁడఁ బ్రథమమున ననున్
నీవు ప్రహరింపు మావలఁ, గావించెద నేను జేయఁగలకార్యంబున్. 72

చ. అనవుడు వాసుదేవుఁడు క్రుధారుణలోచనుఁడై శరాసనం
బున విశిఖంబులం దొడిగి ముందుగ నేసెఁ బయోధిసూతిమే
నను దరువాత నంబునిధినందనుఁ డయ్యవి యొక్కకోలచేఁ
దునిమి మఱొక్కబాణమునఁ దుప్పలుదూలఁగ నేసెఁ దార్క్ష్యునిన్ 78

క. ఆశరఘాతంబున నా, గాశనుఁడు విచేష్టుఁ డగుచు నవనిం గూలన్
దాశార్హుఁ డతని విగత, క్లేశునిఁ గావించి తాఁకి కేలను లేపెన్. 74

వ. అంతట గరుడుండు ప్రబుద్ధుం డై లేవ నాతని నధిష్ఠించి వాసుదేవుండు తనపయిం
బడుదానవసైన్యంబుతోడ యుద్ధంబు గావింపం దొడంగె. 75

ఆ. అపుడు వీతిహోత్రుఁ డనిలసహాయుఁ డై, తగులఁబెట్టు చుండ దానవులను
బ్రతుకఁజేయు చుండె భార్గవుఁ డాత్మవి, ద్యాప్రభావమున గతాసువులను. 76

సీ. అంత జాలంధరుం డపగతమరణ మై, చెలరేఁగుదానవసేనఁ గూడి
ఛిన్నభిన్నంబుగాఁ జేయ నిర్జరులను, క్షతగాత్రమై దేవసైన్య మెల్ల
నమరత్వమునఁజేసి ప్రాణావశేష మై, తద్రణస్థలిఁ బతితంబు గాఁగ
గురుఁడు ద్రోణాద్రికి నరిగి శీఘ్రముగ నా, శైలంబునుండి యోషధులఁ దెచ్చి

గీ. తన్మహత్త్వంబుచే దేవతలను స్వస్థ, దేహులను జేయ వారలు తేజరిలుచు
లేచి రణభూమినుండి నిశాచరులను, జక్కఁ గావింపఁ దొడఁగిరి మిక్కుటముగ.

ఆ. అప్పుడు దైత్యసైన్య మంత కంతకుఁ దగ్గి, పోవు చుండ నబ్ధిపుత్త్రుఁ డడలి
యసురగురుని నడిగె నాశరబల మెల్ల, క్షైణ్య మొందుటకును గారణంబు. 78

గీ. అంత భార్గవుఁ డతనికి నమరగురుని, చేష్టితం బెల్లఁ దెలుపంగ సింధుసుతుఁడు
సరభసంబుగఁ జని క్షీరజలధికడకుఁ, దం(డ్రి ముంపుము ద్రోణభూధరము నిపుడె. 79

చ. అనవుడు క్షీరవార్ధి వినయంబున నిట్లనియెన్ గుమార నే
నొనరుపఁజాల నట్టిపని యొక్కపుడున్ శరణార్థులన్ వధిం
చిన నిహమున్ బరంబును నశింపవె నావుడు ద్రోణశైలమున్
వనధిసుతుండు క్రోధమున వామపదంబునఁ దన్నె నుగ్గు గాన్. 80

గీ. ఆపదాఘాతమునకు ద్రోణాచలంబు, మేను చూర్ణంబు గా నాఁగలేనికతన
వేఁడికొని వార్ధితనయుని విడిచి క్షీర, జలధిని రసాతలమునకుఁ జనియె నంత. 81

సీ. జాలంధరుఁడు వాయుజవమున మరల నే, తెంచి యాయోధనదేశమునకు
దైతేయయోధసమేతుఁ డై దేవసై, న్యము నెల్లఁ జీల్చి చెండాడఁ దొడఁగె
నంతట నమరసైన్యం బంతయును బడి, పోవ నాయోధనభూమియందు
ధిషణుండు మునుపటితీరున క్షీరాబ్ధి, కరిగి ద్రోణాచలం బందు లేమిఁ

గీ. జింత నొందుచుఁ దిరిగి విచ్చేసి యమరు, లార ద్రోణాద్రి క్షీణించె నాశ లుడిగి
పాఱిపొం డింక నన నపాంపతిసుతుండు, గురునిజందెంబు సిగయును గోసి విడిచె.

క. అంతట బ్రతికితి ననుకొని, సంతసమున నమరగురుఁడు చనియెను సురలున్
వింతగఁ దారిరి యపు డసు, రాంతకజాలంధరులకు నాహవ మయ్యెన్. 83

సీ. అపుడు జాలంధరుం డతితీవ్రసాయక, వ్యూహంబులోన నచ్యుతునిఁ ద్రోసె
నాసాయకవ్యూహ మడఁగార్చి గోవిందుఁ, డాశుగాగ్నినిఁ గూల్చె నబ్ధిసుతుని
నాయాశుగాగ్నిఁ జల్లార్చి వార్ధిసుతుండు, బంధించె హరి నిషుపంజరమున
నాయిషుపంజరం బబ్జాక్షుఁ డగలించి, శరవర్షమున ముంచె జలధిసుతుని

గీ. నంతట రథంబు డిగి సాగరాత్మజుండు, వచ్చి బిరబిరఁ గదలంగ వసుధ యెల్లఁ
బక్షిరాజును నొకకేలఁ బట్టి గగన, మందుఁ ద్రిప్పి క్రౌంచద్వీపమందు వైచె. 84

క. విరథుం డై మాధవుఁ డపు, డరిమండలభయద మైనయాకృతితోడన్
ధరమీఁద నిలిచి జాలం, ధరునిరథము నొక్కకోల ధరపైఁ గూల్చెన్ 85

ఉ. అంతట వారి కిర్వురకు నద్భుత మైనసమీక మయ్యె ది
గ్దంతులు బెగ్గడిల్ల వసుధాస్థలి కంపము నొంద భూనభో
భ్యంతరసీమ బోరుకొన నాశరకోటులు దేవకోటులున్
భ్రాంతిని జెంది నిల్వబడఁ బట్టినశస్త్రము లట్టె యుండఁగన్. 86

క. పురుషోత్తముఁ డపు డాసం, గరమున కంతంబు కానగారామిఁ గ్రుధా
భరమునఁ జేకొని శక్తిఁ ద, దురస్స్థలముఁ గాఁడి పాఱ నురవడి వైచెన్ 87

క. ఆశక్తిఘాతమునఁ జే, ష్టాశూన్యుం డగుచు నిలఁ దటాలునఁ బడి తా
నాశరథిజుఁ డొకత్రుటిలో, నాశరబల మెల్ల హర్ష మందఁగ లేచెన్. 88

ఆ. అట్లు లేచి సాగరాత్మజుఁ డాగ్రహ, మ్మగ్గలింప శౌరి నాశుగముల
నేయ శార్ఙ్గి లక్ష్మియిష్టముఁ దీర్పంగ, నెదిరి నేయ మాని పృథివిఁ బడియె. 89

సీ. అప్పు డేడ్చుచు లక్ష్మి యచ్చటి కరుదెంచి, యనుజ బావను గూల్ప నర్హ మగునె
జితుఁ డయ్యె నీచేత శ్రీపతి మానుము, వైర మింక మదీయవాంఛఁ జేసి
యని వేఁడ వార్ధిసూనుని వాఁడు భక్తితో, భగినికి బావకుఁ బ్రణతిఁ జేసి
నిలువంగఁబడుటయు నీరజాక్షుఁడు లేచి, యాతనిశౌర్యంబు నభినుతించి

గీ. వత్స నీవాంఛ దీరంగ వరము నిత్తుఁ, గోరుకొను మన దేవ నాకోర్కె తీర్ప
నిచ్చ గలదేని లక్ష్మితో నీవు క్షీర, వార్ధిని వసింపు మని వేఁడె వార్ధిసుతుఁడు. 90

గీ. అప్పు డాతనికోర్కెకు నచ్యుతుండు, సంతసము నొంది గరుడుని సంస్మరించి
యాతఁ డరుదేర వానిపై నధివసించి, కమలతో నేగి పాలసంద్రమున నుండె. 91

క. అది మొదలుగ నేర్పడియెం, బదముగ వసియింప శ్వాశురమందిరము రమా
సుదతీమనోహరునకున్, గదనంబు సమాప్త మయ్యె నాయకుఁ డేఁగన్. 92

సీ. జాలంధరుం డంత శాత్రవశూన్యుఁ డై, స్వర్గంబునకు నేఁగి స్వైరముగను
స్థాపించి స్వర్గరాజ్యమున శుంభుని నిశుం, భుని యువరాట్పదంబునను నిల్పి
ధరణికి వచ్చి తామరల వసించి జా, లంధరపీఠస్థలంబునంద
యబ్దార్బుదద్వయం బఖిలరాజ్యము నేలె, నప్రతిభటముగా నమితశక్తి

గీ. వనధిసంభవురాజ్యపాలనము నందు, వంధ్యలు దరిద్రులును విధవలును నరక
గాములు కురూపులును బ్రతిగ్రహణపరులు, రోగులును దస్కరులును జారులును లేరు.

గీ. సస్యసంపూర్ణ యై ధాత్రి సంతతమును, గనులపండువు గావించుఁ గలను గూడ
నశుభవార్తలు వినఁబడ వర్థు లైన, ప్రజలె కనరారు వార్ధిజురాజ్యమందు. 94

వ. అంతట నింద్రాదిదేవత లెల్లరును స్వర్గభ్రష్టు లై యమృతప్రాప్తియును యజ్ఞహవిః
ప్రాప్తియును లేక కానలం దిరుగుచు నెంతకాలంబునకును దముదురవస్థలు దీఱమికి
వగచుచు నొక్కనాఁడు బ్రహ్మలోకంబున కరిగి ప్రాణాయామంబుచేఁ బరమాత్మ
యందు మనోలయంబు గావించి సమాధినిష్ఠాగరిష్ఠుం డై యుండుచతుర్ముఖుని దర్శించి
మొఱవెట్టుటయుఁ బితామహుండు సమాధివిరతుం డై వారల నవలోకించి తద్దీన
దశకు దురపిల్లుచు వారలతోడం గూడి కైలాసంబున కేఁగి పార్వతీపతిని స్తుతింప
నీశ్వరుండు ప్రసన్నుం డై మహేంద్రునిం దిలకించి నవ్వుటయు నింద్రుండు లజ్జావనత
వదనుం డై యూరకుండె. 95

సీ. అంతట నీశ్వరుం డబ్జోద్భవునిఁ జూచి, జాలంధరుఁడు మహాశక్తియుతుఁడు
విష్ణుశస్త్రము గాని జిష్ణుశస్త్రము గాని, వధియింపఁజాలవు వార్ధిసుతుని
నింత యేటికిఁ బూర్వసృష్టాయుధంబు లే, వైనను వ్యర్థముల్ వానియెడల
నాసత్త్వమున కాఁగునవ్యాయుధమును మీ, రెవ రైన సృష్టించి యిచ్చునెడల
గీ. వాని నిప్పుడె వధియించువాఁడ నేను, నావుడుఁ బితామహుండు పినాకపాణి
యెఱుఁగఁజాలము నీశక్తి నెవ్వరమును, నీవె దక్షుఁడ వాపని నిర్వహింప. 96

వ. అని ప్రార్థించుటయు శంకరుండు ధ్యానశక్తిచే నచ్యుతుని నాహ్వానింపఁ దత్క్షణంబ
వాసుదేవుం డరుదెంచి యెదుట నిలిచె. 97

సీ. అంతట శంభుఁ డి ట్లనియె గోవింద జా, లంధరనాశకాలంబు వచ్చె
వదలు మిచ్చోట భవత్క్రోధతేజంబు, ననవుడు మాధవుం డట్లె విడిచె
నవల ధాతకు శంభుఁ డట్లె చెప్పఁగ ధాత, యగజాధవుఁడు కోరినట్ల చేసె
నటుమీఁదఁ ద్ర్యంబకుం డనిమిషులకు నట్లె, చెప్పంగ సురలును జేసి రట్లె
గీ. యంతటను దన్మహాతేజ మఖిలలోక, ములను గ్రసియించుశక్తితో వెలుఁగుచుండఁ
దాండవం బాడె వామపాదంబుతోడ, దానిమీఁద మహేశుఁ డందఱును బెగడ. 98

వ. అంత నమ్మహాతేజఃకూటంబు మహేశ్వరతాండవమర్దనంబున నరలక్షత్రయోపేతం
బును నస్థికోటివ్యాకీర్ణంబును నగుచక్రంబుగా నేర్పడియె. దాని నుంచుటకు లోహ
తేజఃపృథ్వీకాఠిన్యంబుం గైకొని విశ్వకర్మ నిర్మించిన కోశంబు తత్స్పర్శమాత్రంబున
నిర్దగ్ధం బయ్యె. 99

సీ. తద్దర్శనమున సంత్రస్తు లై సుర లెల్లఁ, బరువు లెత్తుచు నుండ స్మరహరుండు
వలదు భయం బని వారిని రావించి, తచ్చక్రమును గొని తాను గేల
దానికిఁ బెట్టె సుదర్శనం బనుపేరు, ధాతచేతికి నిచ్చెఁ బ్రీతితోడ
బ్రహ్మ చేకొని దానిఁ బరికించుచుండఁ ద, జ్జ్వాలల నజునికూర్చంబు గాలె
గీ. నంతటను సత్వరంబుగ హరుఁడు దానిఁ, గైకొని విధాతృహస్తపంకజమునుండి
కానఁబడకుండ నొరులకు గర్భమందు, దాఁచికొనియెఁ గదర్యుఁడు ధనమువోలె. 100

గీ. అప్పు డవి యెల్లఁ జూచి నే నబ్ధిసుతుని, కడకు శీఘ్రంబ చని నిన్నుఁ గేడు నెంచి
యత్న మొనరించు చున్నవాఁ డంధకారి, యని వచింప మదుక్తి వాఁ డాలకించి.

క. మునివర నిరామిషం బగు, నని కూడదుగాన శంకరాలయమున నుం
డిన శ్రేష్ఠవస్తు వే దై, నను దెల్పుము కలహకారణంబుగ నుండన్. 102

వ. అని యడుగుటయు నే నాలోచించి జాలంధరునితో ని ట్లంటి.

క. కరమున భిక్షాపాత్రము, కరిచర్మము మొలను మేనఁ గాకోదరముల్
గరళము గళమునఁ దాలిచి, హరుఁ డుండు గజముఖషణ్ముఖాత్మజయుతుఁ డై

గీ. వాహనము జీర్ణవృషభంబు వాసభూమి, వల్లకాఁ డింక నాతని వైభవంబు
తెలిసికొను మీవె యూహించి తెలుప నేల, కాని యొక్కవిశేషంబు కలదు వినుము.

క. కామహరుం డగువానికి, భామామణి యొకతె కలదు పార్వతి యన నా
సోమానన సౌందర్యము, నేమానినియందుఁ గాన మిప్పటివఱకున్. 106

క. కాంచితి రంభను దారను, గాంచితిఁ గాంచితిని బుంజికస్థలి బృందన్
గాంచితి నింకను జెలువలఁ, గాంచితి నెందఱనో యేల గణుతింపంగన్. 107

క. ఆరామామణు లందఱు, గౌరీపదనఖమునకును గారు సమానల్
కోరితివి గానఁ జెప్పితి, వారాంనిధితనయ పోయివచ్చెద నింకన్. 108

క. అని యాతనియనుమతిఁ గొని, చనుదెంచితి నేను సింధుజన్ముం డంతన్
బనిచెను దౌత్యము నడుపం, గను స్వర్భానువును నీలకంఠునికడకున్. 109

సీ. సైంహికేయుం డంత శంభుసన్నిధి కేఁగి, హరునకు వందనం బాచరించి
రుద్ర నే జాలంధరునిదూత నతఁడు పం, పంగ వచ్చితిని నీచెంగటికిని
నీవు విరాగివి నిర్గుణుండవు పిత్రు, వనవాసివి శౌర్యవర్జితుఁడవు
జాలంధరుఁడు మహాశౌర్యరాశి త్రిలోక, సామ్రాజ్యభోక్త ప్రశస్తిశాలి
గీ. భువనమోహిని యైననీపూవుఁబోఁడి, నతఁ డపేక్షించు చున్నవాఁ డతని కిచ్చి
బ్రతుకుము సుఖంబుగను భైక్ష్యపరుఁడ వగుచు, నట్లు గాకున్నఁ దప్పదు హాని నీకు.

సీ. అని పల్కుటయు వినాయకబాహులేయులు, తలలు వంచిరి భూతతతి వడంకెఁ
వాసుకి నేలపై వ్రాలి హేరంబవా, హనపుచ్ఛమును బట్టుకొనియె నంతఁ
గేక వైచెను గేకి కేకేకారవం, బున వాసుకి త్యజించి మూషికమును
గట్టిగా ధూర్జటికంధరంబును బట్టి, విడువక యూర్పులు విడువఁ దొడఁగె
గీ. హరలలాటాగ్ని తత్పవనారభటిని, బ్రజ్వలింపంగఁ దచ్ఛిఖాస్పర్శమునను
గరఁగి మృడశీర్షశశికళ కాఱె యమృత, మీశగళకకపాలము లెల్లఁ దడిసె.

క. అమృతాప్లావిత మగుటను, గమలజరుండములు జీవకళ గల వై వే
దములఁ బఠింపం దొడఁగెను, భ్రమ మొదవఁగ నెల్లరకును బహుచిత్రముగన్. 112

వ. అంత భూతనాథునిజటాజూటంబునుండి త్రివదనుండును ద్విచరణుండును ద్విపుచ్ఛుండును సప్తహస్తుండును బింగళాకారుండును జటిలుండును నగుకీర్తిముఖుం డనురుద్రగణాధీశ్వరుం డుదయించి మహేశ్వరునకు సాష్టాంగప్రణామంబు గావించి. 113

సీ. తండ్రి యాఁకలికి నేఁ దాళఁజాలక యుంటి, నాజ్ఞ యిచ్చితి వేని యారగింతు
నొక్కగ్రాసముగ జేసికొని లోకమ్ముల, నెల్ల నిప్పుడె నాఁగ నీశ్వరుండు
గణనాథ సంగరాంగణహతు లగువారి, భక్షించి క్షుద్బాధఁ బాపికొనుము
నావుడు నపుడు రణం బేదియును లేమి, నారగించెను స్వదేహమునె యతఁడు

గీ. వానిభక్తికి మెచ్చి యీశ్వరుఁడు వీర, నీవు నాయాలయముననె నిలువు మెవరు
నన్నుఁ గనవచ్చి తలఁపరో నిన్ను వారు, చెడుదు రనఁ గీర్తిముఖుఁ డుండె శివునికడనె.

గీ. అప్పు డేమియు ననకుండ నష్టమూర్తి, సలుప భ్రూసంజ్ఞ నంది తత్సంజ్ఞ నెఱిఁగి
రాహువును గౌరవించి శీఘ్రముగఁ బనిచె, నంతరాహువు విస్మితుఁ డగుచు నేఁగి.

క. హరునిసమక్షమునందున్, జరిగినవిషయమును దెలుప సర్వము జాలం
ధరుఁడు విని శివుఁడు తనకున్, బరిభవ మొనరించె ననుచు భావించి మదిన్. 116

వ. సముచితోక్తులచే జాలంధరపీఠంబునందుఁ దనసతీమణి యగుబృందను నెలకొల్పి స్వర్గమర్త్యపాతాళరసాతలసప్తసాగరగర్భసమాయాతదైత్య దానవకోటిచతురంగ బలసమేతుం డై ఖడ్గరోమానీతం బగుమహారథంబు నధిష్ఠించి యుద్ధయాత్రాదుందుభిధ్వానంబు గావించె. 117

ఆ. ఆనినాదమునకు నవనిచక్రం బెల్లఁ, గంప మొందెఁ బడియె క్ష్మాధరములు
గతులు దప్పిపోయె గ్రహముల కష్టది, ఙ్మండలములు బెరసి మాఱుమ్రోఁగె. 118

వ. అట్లు యుద్ధయాత్రాభేరీనాదంబు గావించి జాలంధరుండు కైలాసంబునకుం బ్రస్థితుం డయ్యె. 119

గీ. అపుడు దానవసైన్యంబు లరుగు చుండ, నయ్యె గజహయరథమయ మవని యెల్లఁ
జామరాత్మక మయ్యె దిక్చక్ర మెల్ల, గగన మెల్ల ఛత్త్రధ్వజాకార మయ్యె. 120

వ. అట్లు చనిచని జాలంధరుం డొక్కదినంబులోఁ గైలాసంబునకుం జేరి యచ్చటఁ గృత్తివాసుండు లేమింజేసి తనభయంబున నాతండు పాఱిపోయె నని తలంచి యోగదృష్టిచే భార్గవుండు చెప్పినమార్గముంబట్టి షష్టిసహస్రయోజనసముచ్ఛ్రితం బగుమానసోత్తరమహాశైలంబున కరిగి తదారోహణంబు గావించి ధూర్జటిమందిరంబు ముట్టడించె.

గీ. అపుడు మృత్యుంజయుండు తదద్రిశృంగ, మందు నునిచి సఖీయుత యైనయుమను
బ్రమథపతి యైననందినిఁ బ్రధనమునకుఁ, బనుప నంది హరాజ్ఞానిబద్ధుఁ డగుచు. 122

వ. ద్వాత్రింశదశ్వయుక్తంబును షోడశచక్రమండితంబును షష్టిధ్వజసంయుతంబును ద్వాత్రింశద్యోజనాయతంబును సర్వశస్త్రసమేతంబును గాకతుండసారథిసమానీతంబును నగు సాంగ్రామికరథంబు నధిష్ఠించి వినాయకస్కందులు చక్రరక్షకులుగా నుండ గణాగ్రేసరులతోడం బ్రస్థితుం డై దైత్యవీరులతో ఘోరయుద్ధంబు గావింప దైత్యసైన్యం

బంతియు భిన్నభిన్నంబై రుద్రగణశరప్రహారంబుల కోర్వంజాలక శైలంబును విడిచి
భూతలంబునం బడి పఱవం దొడంగుటయు రుద్రగణంబు దాని వెంటబడి తఱుమం
జొచ్చె. 123

గీ. శంభుగణపాతితనిశాటసైన్యరవము, ప్రళయకాలంబునందు నర్ణవము లేదుఁ
జలుపుఘోషంబుకైవడి సకలలోక, భీకరంబయి ప్రజలఁ జీకాకుపఱిచె. 124

వ. అట్టిసమయంబున భీరువులై పాఱిపోక నిలువంబడి శుంభుండు నందితోడను నిశుం
భుండు మహాకాలునితోడను గాలుండు లోకేశ్వరునితోడను శైలరోముండు పుష్ప
వంతునితోడను మహాబలుండు మాల్యవంతునితోడను గోలాహలుండు మాయా
బలునితోడను భయానకుండు చండితోడను రాహువు స్కందునితోడను సప్త
రోముండు కూష్మాండునితోడను ఘర్ఘరుండు మదనునితోడను గేతుముఖుండు
శుభ్రునితోడను జంభుండు వినాయకునితోడను బాతాళకేతుండు హాసునితోడను
రోమకంటకుండు భృంగీశునితోడను మఱియుం గొందఱు దైత్యమహావీరులు మిగి
లినరుద్రగణంబులతోడను ఘోరంబుగాఁ బోరాడి రుద్రగణంబులదేహంబులు పఱి
యలుగాఁ గొట్ట రుద్రగణంబులు దైత్యప్రహారంబులకు గాత్రంబులనుండి రుధిర
ప్రవాహంబులు ప్రవహింప నిలువంజాలక శైలంబుమీఁదికిం బఱచి మహేశ్వరుని
పాదంబులపయిం బడిరి. 125

సీ. అంతట ధూర్జటి యానతీయఁగ వీర, భద్రుండు సుసిద్ధపఱిచి వృషము
నగజకుఁ జెప్ప నాయమ శీఘ్రముగ వచ్చి, తిలకంబుఁ బెట్టె తద్వృషభమునకు
వృషభేంద్ర యొకక్షణం బేనియు విడువక, స్వామిని రణమందు జయము వడసి
సత్వరంబుగ రమ్ము స్వామితో ననిపల్కెఁ, దలయూఁచె వృషభంబు తత్క్షణంబ
గీ. యప్పుడు గౌరిని దిలకించి యష్టమూర్తి, దేవి మాయావు లసురులు నీవె నిన్ను
రక్షణము చేసికొనుము జాగ్రత్తతోడ, నేను గణసావృతుండనై యేఁగుచుంటి.

వ. అని చెప్పి వృషభంబు నారోహించి త్రింశన్మహాపద్మసహస్రప్రమథగణపరివేష్టితుండై
వీరభద్రుండు హర్యక్షయుక్తస్యందనంబు నధిష్ఠించి వామపార్శ్వంబునను మణి
భద్రుండు తురంగసమేతరథంబు నారోహించి దక్షిణపార్శ్వంబునను నంగరక్షకులుగా
నుండ శైలంబునుండి క్రిందికిం దిగియె. 127

గీ. అంత దానవబలము దిగ్దంతు లడల, సింహగర్జనములు చేసి శివగణంబు
పైనిఁ బడుటయు దానవబలమునకును, బ్రమథగణములకును మహాప్రధన మయ్యె.
క. ఆరణమున రాత్రించర, వీరులు చెలరేఁగి ప్రమథవీరుల నెల్లన్
ఘోరాస్త్రశస్త్రదళితశ, రీరుల నొనరించి యావరించిరి శూలిన్. 129
ఉ. అప్పుడు శూలి రేఁగి ప్రళయాగ్నిదెఱంగునఁ బ్రజ్వరిల్లుచున్
దుష్టులు దూలఁ గొట్టి రణధూర్వహులైన నిశాటవీరులన్

బిప్పి యొనర్చెఁ గ్రవ్యభుగనీకము నెల్లను నంతఁ గన్నులన్
నిప్పులురాల మండుచును నీరధిసూనుఁడు శస్త్రపాణి యై. 130

వ. సదాశివునిపైఁ గేతెంచుచుండ వీరభద్రమణిభద్రులు శరవర్షంబుచే వాని నిరోధించి బాధింప జాలంధరుండు వారితోడ దారుణప్రవిదారణంబు గావించి వారల జయించి శంకరునితోడ ఘోరయుద్ధంబు గావించి విజయంబు నొందం జాలక ఖిన్నుండై పార్వతీపాతివ్రత్యభంగంబు గావించినం గాని హరుండు సమయఁ డని తెలిసికొని మాయావి యగుటం జేసి తనరూపంబు దాల్చి తానుబోలె రుద్రగణంబుతోడ సంగ్రామంబు గావింప శుంభుని నియోగించి దుర్వారణసహితుండై సంగ్రామరంగంబు విడిచి యెవ్వరికినిం దెలియకుండ మానసోత్తరశైలంబు నారోహించి తాను హరరూపంబు ధరించి నందిరూపధరుం డగుదుర్వారణునిస్కంధముం బట్టికొని బడలు వడుచు రక్తసిక్తగాత్రాంబరంబులతోడఁ బార్వతీమందిరసామీప్యంబునకుం జనియె.

సీ. అపుడు ససంభ్రమ లై మృడానీసఖు, లరుదెంచి తమవెంట నగజ రాఁగ
స్వామి యే మయ్యెను సంగ్రామ మిట్లు నీ, వేతెంచుటకుఁ గలహేతు వేమి
సామాన్యసంసారిచందంబునను సదా, శివుఁడును దపియింపఁ జిత్ర మయ్యె
నని పల్కుటయు నంది యటఁ బడవైచెఁ దాఁ, గట్టినయంబరగ్రంథి విప్పి

గీ. మృతఫణిశరీరములను ఖండితగణేశ, శక్తిధరమస్తకముల నాశ్చర్యముగను
నవి గనుంగొని పార్వతి హాగణేశ, హాకుమార యటంచు బిట్టార్చి యేడ్చె. 132

గీ. అంతటను గొల్లు మని యేడ్చి రామెచెలులు, కాలువలుగను గన్నీరు జాలువాఱ
నపుడు మాయాశివుం డిట్టు లనియె దేవి, యేడ్వకుము నేను బ్రతికితి నింతె చాలు.

సీ. అనుటయు గౌరి యి ట్లనియెను దేవ యె, క్కడ కేఁగె వృషభంబు కాననైతి
ననవుడు నాతఁ డి ట్లనియె జాలంధరుం, డొక్కదెబ్బనె దానిఁ జక్కడంచె
నాపుడు స్వామి నానయనంబులకు నీవు, గోచరించితి విదె కోటి నాకు
శరజాలఘాతజర్జరవిగ్రహుఁడ వైన, నీకుఁ బ్రియం బేమి నే నొనర్తు

గీ. నని విషాదంబునను బల్క నతఁడు దేవి, యొక్కపరి కౌఁగిలించి న న్నూరడింపు
మదియె నీ విట్టిసమయమునందు నాకుఁ, జేయవలసినప్రియ మేల చెప్ప నీకు. 134

వ. అని పల్కుటయు నించుక సంశయంబు గలిగి యాతనికిఁ బార్వతి యి ట్లనియె.

సీ. దేవ సర్వంబును దెలిసిననీ విట్టి, యసమయంబున నిట్టు లాడఁ దగునె
పుత్రశోకంబునఁ బొగిలెడిసే నేడ, లీలార్థమైనయాశ్లేష మేడ
ననవుడు నాతఁ డి ట్లనియె భామిని యేల, ప్రతివచనంబును బలికె దీవు
పతివాంఛ దీర్పనిసతికి దుర్గతి గల్గు, నని పల్కుబుధులవాక్యంబు వినవె

గీ. లేరు ప్రమథులు పుత్రులు లేరు మఱియు, లేదు సతి యుండియును గూడ లేని దాయె
సర్వశూన్యుండ నైతి నే జావకుండ, బ్రతుకుటయె తప్పు నేఁటి కీపాట్లు వచ్చె.

క. పోవుదము నంది రమ్ము శు, భావహ మగుచోట విడువఁ బ్రాణములను నేఁ
గావించితి సంకల్పము, నావుడు సంక్షోభ మొదవె నగజాత కెడన్. 137

క. ఏయమచే క్షోభింపం, జేయఁబడునొ జగము లెల్ల సింధుసుతునిచే
నాయంబయు క్షోభింపం, జేయఁబడియె నేమి చెప్ప సృష్టిమహిమముల్. 138

సీ. ఆపార్వతీక్షోభ మావిర్భవింపంగఁ, జేయ సంక్షోభంబు శ్రీధవునకు
వనజాక్షుఁ డదరిపాటునఁ జివుక్కున లేచి, శేషతల్పమునుండి శీఘ్రముగను
గమనించి సంక్షోభకారణంబును నెంచి, జాలంధరుని వినాశము నొనర్పఁ
దద్వినాశనము బృందావ్రతభంగంబు, నొనరింప కున్నఁ గా దని యెఱింగి

గీ. తాపసాకృతి ధరియించి తాను దనకుఁ, జేసికొని యాదిశేషుని శిష్యునిగను
నరిగి యొకకాననంబున కచట నుండి, మంత్రశక్తిని బృందను మరులుకొలిపె. 139

ఉ. అంతట బృంద భర్తృవిరహానలతప్తమనశ్శరీర యై
కాంతుని సంస్మరించుచును గాఁకకు నోరువలేక దేవతా
కాంతలు దైత్యభామలును గాంచి తదార్తిని జేయుసేవ లొ
క్కింతయుఁ దాప మార్పమిని నేమియుఁ దోఁపక వంత నొందుచున్

ఉ. కంటికి నిద్ర పట్టమిని గాములుగాఁ గనుపట్టుటన్ జనుల్
వంటక మింపు గామి నొకవత్సర మై క్షణకాల ముంటచే
నింట వసింపలేక వసియించుచు నెట్టులొ శయ్యపైనిఁ దా
నొంటిగఁ బండి మూయఁ గను లొక్కచతుర్దశినాఁటి వేకువన్. 141

సీ. ఛిన్నకర్ణంబును ఛిన్ననాసికమును, రూక్షపాండురభస్మరూషితమును
రక్తసిక్తమును గృధ్రవికృష్టలోచనం, బును నై నజాలంధరునిశిరంబు
కృష్ణవర్ణయు ముక్తకేశియు నరుణవ, స్త్రయు నగుకాళి హస్తమునఁ బట్టి
మురియుచుఁ దద్రక్తమును ద్రావు చున్నట్లు, స్వప్నంబు రా గుండె జల్లు మనఁగ

గీ. శయనమునునుండి లేచి దుస్స్వప్నఫలము, నడిగి బ్రాహ్మణులను వార లశుభ మనుచుఁ
జెప్పి తచ్ఛాంతిదానముల్ చేయు మనుడు, నట్లు కావించియును దుఃఖ మాఁగ కునికి.

గీ. ఇంట నుండంగఁ జాలక యెదకు శాంతి, యొదవు ననియెడిభ్రాంతిచే నొక్కనాఁడు
ప్రాణసఖి స్మరదూతితో రథము నెక్కి, యరిగి సౌభాగ్యవనమున కచటఁ దిరిగి. 143

క. అప్పటికిఁగూడ దుఃఖం, బెప్పటివలె నుంట నేఁగె నిం కొకవనికిన్
దప్పించుకొనఁగ శక్యమె, యెప్పగిదిని విష్ణుమాయ యెవ్వారి కేనిన్. 144

సీ. అతిభీకరం బైన యాకాననంబును, బృంద విలోకించి భీత యగుచు
సఖి త్రిప్పుము రథంబు చయ్యన నింటికి, ననవుడు సఖి భ్రాంతి యావహిల్ల
దేవి కానఁగరాదు త్రోవ యేదియు నిందు, నెటు పోవవలయునో యెఱుఁగ నైతి
విడిచెదఁ బ్రగ్గముల్ విధి యెట్టు లుండునో, యట్టులె యగుఁగాక యనుచు విడిచె

గీ. నంతటను నశ్వతరులు స్వేచ్ఛానుగతిని, నరుగుచు మ శోకకాననమందుఁ జొచ్చి
నిలిచెఁ గదలక యచట మేనులు వడంక, నది కనుంగొని స్మరదూతి యడలి లోన.
గీ. ఏది యేనియు భయహేతు విచట నుండ, వచ్చు నని బృందతోడ వాక్రుచ్చు చుండఁ
బిడుగుపడినట్లు చెవులలోఁ బడియె నొక్క, దారుణధ్వని గుండెలు తల్లడిల్ల. 146
సీ. ఆధ్వనివెంటనె యతిభయంకరుఁడు త్రి, పాదసమేతుండు పంచకరుఁడు
సప్తనేత్రుఁడు హరిస్కంధాననుఁడు వ్యాఘ్రు, కర్ణుఁడు పింగళకాంతియుతుఁడు
ప్రస్తదీర్ఘారుణజటిలకేశుండును, నై నరాక్షసుఁ డొక్కఁ డరుగుదెంచె
వాని నాలోకించి వా రిర్వురును రథ, మందు వ్రాలిరి వివశాంగు లగుచు
గీ. నంతటను వాఁడు రథ మెత్తి హస్తమునను, ద్రిప్పి గిఱ్ఱునఁ గొట్టె ధరిత్రిమీఁద
నశ్వతరులను రథమును నాహరించి, బృంద నొకకేలఁ గొని యెత్తి మ్రింగ నుండ.
సీ. ఆసమయంబున నరుదెంచి మునివేష, ధరుఁ డైన దైత్యారి త్వరితముగను
గనియె నారాత్రించరునిఁ దీక్ష్ణదృష్టిచే, భస్మ మై కూలె నాపాపి దాన
నప్పుడు బృంద వ్యాఘ్రాస్యమధ్యచ్యుతి, నొందినమృగివోలె నూర్పు విడిచి
యత్తపోధనునిపాదాంబుజంబులమీఁద, వ్రాలి యి ట్లనియెను ప్రాణదాత
గీ. కాచితివి నన్ను రక్షోర్వ్యాకాలమందు, నార్తరక్షకుఁ డైన నారాయణుడవు
కాని కేవలమౌనివి గావు నీవు, నావుడుఁ దపస్వి సంత్రస్తభావుఁ డగుచు. 148
క. సతి నేను దేవశర్మను, సుతుఁడ భరద్వాజమునికి సుఖముల నెల్లన్
విత యని రోసి యరణ్య స్థితి నొంది తపించు చుంటి శిష్యునితోడన్. 149
గీ. తెలిసికొందుఁ ద్రికాలవార్తలను నేను, సిద్ధు లన్నియు నుండు నాచేతిలోన
నిట్టిదురవస్థలో నీకు నేమి చెప్ప, వే శోకవిషాదవార్త సాధ్వీలలామ. 150
క. అని యూరకుండుటయు న, వ్వనధితనూభవునిరాణి వగచుచుఁ జిత్తం
బున దుస్స్వప్నఫలంబును, వినఁగల్గునో యేమొ యనెడివెఱ బాధింపన్. 151
గీ. తాపసోత్తమ చెప్పుము దాఁపకుండ, విధివిధానంబు తప్పునె వెఱచి పఱవ
ననుచు వేఁడికొనంగ ని ట్లనియె మౌని, యుస్సు రని నోట వెడినిట్టూర్పు విడిచి.
సీ. అమలాంగి నీనాథుఁ డైన జాలంధరుం, డాజి గావించుచు హరునితోడ
హరచక్రవిచ్ఛిన్నశిరుఁ డయి పడిపోయె, ననుడు బృంద విచేష్ట యగుచుఁ బడియె
నంతట నూరార్చి యమి యాయమను దేర్చి, వెలఁది పై జరిగినవిధము వినుము
త్వత్సతీత్వప్రభావమున నత్తల వచ్చి, పడియె మాయాశ్రమభవనమందు
గీ. దాని నే దాఁచి యుంచితిఁ దద్విశేష, మంతయును యోగదృష్టిచే నరసికొనుట
నింతలో నీవె వచ్చితి విటకు శుభము, గలుగవలసినవిధి యున్న కారణమున. 153
గీ. అని వచింపంగ బృంద యి ట్లనియె స్వామి, తాపసులనోటిమాటలు తప్ప వనెడి
ధైర్యమునఁ గోరు చుంటిని దానివలనఁ, గలుగుశుభ మేదొ తెలుపుము కరుణతోడ.

క. అని ప్రార్థింపఁగ ముని యి, ట్లనియెను సతి యిది మహారహస్యము దీనిన్
వినఁ గూడ దొరులు చెప్పం, జన దేనును గాని నీకు సర్వము వినుతున్. 155

క. విను మామస్తకము భవ, త్తనుసంపర్కమున సాంగతను జెంది సచే
తన మగు నద్దానను నీ, మనమునఁ గలదుఃఖ మెల్ల మాయుంగలుగున్. 156

వ. అని నుడువుటయు బృంద సాభిలాషముగా నిట్లనియె. 157

ఆ. అనఘ ప్రాణదానమునొక భర్తృదా, నమును జేయఁ దలఁచినాఁడ వీవు
నీఋణంబుఁ దీర్ప నేర్చునె నాబోఁటి, యల్పురాలు నాఁగ నత్తపస్వి. 158

ఆ. చాన యిట్లు మమ్ము శ్లాఘింపవల దేను, జేసినట్టిహెచ్చుచేఁత యేమి
సతతమును బరోపకృతిని గావించుట, సహజగుణము చూవె సాధువులకు. 159

గీ. అనుటయును బృంద సఖితోడ నతనివెంటఁ, జని తదాశ్రమమును జొచ్చి స్వామి యచట
నుండె నావల్లభునిశిరం బొక్కసారి, చూచి కనులార విడిచెద శోకజలము. 160

చ. అనవుడు నత్తపస్వి విమలాంగి తపస్సమయం బతీత మై
చనియెడు మాకు నీవు చని చయ్యన నాకుటజంబులోపలన్
గనుఁగొను మొక్కశయ్యపయిఁ గన్పడు నీపతిమస్తకంబు నా
ననుచరితోడ బృంద చని యక్కడకున్ గని శయ్య నచ్చటన్. 161

ఆ. దానిమీఁద నున్నతనపతిశీర్షంబు, గాంచి దేహ మెల్లఁ గంప మొంద
నెడఁదలోన మిగుల దడ పుట్ట నేడ్చుచుఁ, గన్నునీరు పాఱఁ గాల్వలుగను. 162

సీ. హస్తంబునను గొని యాశిరంబును నాథ, కనుఁగొను మొకసారి కన్ను లెత్తి
నేను నీబృందను నీప్రాణకాంతను, దైవంబుగను నిన్నె తలఁచుదాన
ననుఁ బాసి యొక్కక్షణంబును నెచటను, నిద్రింప విం దెట్లు నిద్రపట్టె
నాకర్మ మి ట్లుండ నీ కెట్లు హరునితో, యుద్ధంబు తగ దనుబుద్ధి పుట్టు

గీ. నని పలికి కన్నులకు నద్దుకొని యురంబు, నందుఁ జేర్చికొని యాస్యమందుఁ బెట్టి
కొని యిముడ కుక్కి దుఃఖంబు కొట్టకొనకు, గట్టిగను గౌఁగిలించి బిగ్గఱఁగ నేడ్చె.

గీ. అప్పు డామస్తకం బఖిలాంగపూర్ణ, మగుచు జాలంధరాకృతి నంది నిలిచె
నది కనుంగొని మౌనివాక్యము యథార్థ, మని తలఁచి బృంద యాహ్లాద మంకురింప.

క. పరవశ యగుచును నాతని, చరణంబులపైని వ్రాలె సఖియుఁ బ్రమోద
స్ఫురితాంతరంగ యగుచున్, గరములు జోడించి మ్రొక్కి కడగా నిలిచెన్. 165

సీ. అపుడు జాలంధరుం డవలి కేఁగఁగఁ గంట, పైఁగ గావింపంగ సఖి గ్రహించి
చనియె నవ్వలకుఁ దత్క్షణమంద యతఁ డంత, బృందాంగనను లేవనెత్తి కేల
ననునయించుచును బర్యంకంబునందుఁ గూ, ర్చుండఁగఁ బెట్టి కూర్చుండి తాను
దనశీర్ష మామెస్కంధమున వ్రాల్చి స్వవామ, కరమున నామెను గౌఁగిలించి

గీ. యింతి నీమాట వినకుండ నేను నాఁడు, సాహసంబున నేగి యీశ్వరునితోడ
దురము ఘోరంబుగ నొనర్చి తుదిఁ దదీయ, చక్రధారానికృత్తమస్తకుఁడ నైతి.
వ. అంతట నామస్తకంబు త్వదీయపాతివ్రత్యప్రభావంబునంజేసి యిచ్చోటం బడి భవత్తనుసంసర్గంబువలన నేఁటికి సాంగత్వంబు నొందె. 167
గీ. చచ్చి బ్రతికితి మరల నీసరణి నింకఁ, బ్రాప్తనవిషాద మంతయుఁ బాసి నన్ను
హర్షవారిధిలో నోలలార్పు మీవు, గననిధర్మంబు లెం దేని కలవె సాధ్వి. 168
క. అని పలుకుటయును నాయమ, తనభర్తయె యతఁ డటంచుఁ దాపసవచనం
బునను దదీయోక్తులవల, నను నాకృతిసామ్యమునను నమ్మి యెడందన్. 169
క. ఆతనిపాదము లొత్తుచుఁ, బ్రీతిన్ గనఁబఱుప నతఁడు ప్రియ మెసలారన్
జేతోజాతశిలీముఖ, ఘాతవివశుఁ డగుచుఁ జేర్చి కౌఁగిట నామెన్.
ఆ. చిబుక మెత్తి కేలఁ జిఱునవ్వు నవ్వుచుఁ, జలిపె నధరపాన మలవు మెఱయ
నంత బృంద పులకితాంగి యై యెదురొత్తు, లీయఁదొడఁగె నతఁడు హాయి చెంద.
ఉ. అంతట వార లిర్వురును నంగజసంగరముం బొనర్చి రే
కాంతమునస్కు లై చిలువ లట్టు లనంగి పెనంగుచున్ గడున్
సంతస మొప్పఁ గొన్నిదివసంబు లటుల్ సన నొక్కనాఁడు ర
త్యంతమునన్ గనంబడియె నంసగతుం డయి మాని బృందకున్.
సీ అప్పుడు బృంద క్రోధారుణనేత్ర యై, స్వభుజబంధమునుండి వాని విడిచి
యుత్థిత యై శయ్యనుండి చివ్వుక్కునఁ, దాపస నీ విట్లు తగునె చేయ
నెవఁడవో నీవు నా కెఱుఁగింపుము నిజంబు, ననుడు మురారి యై యతఁడు నిల్చి
తన్వంగి నేను మాధవుఁడను నీమీఁదఁ, గిలరక్తిచే నిన్నుఁ గలిసినాఁడ
గీ. నీమనోనాథుఁ డగుజలనిధిసుతుండు, హరునితో యుద్ధ మొనరించి యతనిచేత
నిహతుఁ డయ్యెను దాన నిందీవరాక్షి, నన్నుఁ జేపట్టి లోకమాన్యతను గొనుము.
క. నినుఁ గనుఁగొనినది మొదలుగ, వనజేక్షణ నామనంబు వారిధితనయున్
గిన నొల్లదు కల్గెను నీ, తనుసంసర్గమునఁ జేసి ధన్యత నాకున్. 174
సీ. అనవుడు బృంద యి ట్లనుఁ జక్రి నామనో, హరుఁడు నీ కొనరించినట్టిమేలు
భస్మంబులోఁ బోయఁబడినయాజ్యహవిస్సు, చాయను నిష్ప్రయోజనత నొందెఁ
బరసతీదేహసంపర్కంబు నొనరింప, నగునె ధర్మత్రాత వై ననీకుఁ
గావించితివి మహాఘంబుఁ జేసినకర్మ, మనుభవింపక తీఱ దజున కైన
ఆ. మాయచేసి నన్ను మాయాతపస్వి వై , కొనినచందముననె కొని త్వదీయ
మహిళ నేఁగుఁగాక మాయాతపోధనుఁ, డొకఁ డటంచు శాప మొసఁగె నఁత. 175
క. కమలానాథుఁ డదృశ్యత్వము నొందె నతండు చనినతత్క్షణము కుటీ
రము శయనమును దదుపకర, ణములును నాశ్చర్యముగఁ గనంబడ వాయెన్.

సీ. అప్పుడు సర్వశూన్యం బైనయక్కానఁ, దిలకించి బృంద లోఁ గలుగ భీతి
స్మరదూతికను గని సఖి విలోకించితె, దైత్యారిమాయావిధాన మెల్ల
విడిచితిఁ బురమును విడిచితి రాజ్యంబు, పడితి శూన్యం బైనయడవిలోనఁ
గాంతుఁడు సంశయగ్రస్తజీవితుఁ డయ్యె, నెచటికిఁ బోదు నే నెచట నుందు
గీ. నిచ్చటనె మరణించెద నింకఁ గడచి, యౌవనము నెట్టు లేని నీ వేఁగు మనియె
నంత ని ట్లనియెను సఖి యమ్మ నాకుఁ, బ్రాణమవు నీవు నిన్ను నేఁ బాయఁజాల.
చ. అనవుడు బృంద యేమియును నాడఁగలేక సఖీసమేత యై
చనుచును నవ్వనంబుననె సాహస మేర్పడ నొక్కచోటఁ గ
న్గొని యొకయుజ్జ్వలహ్రదము గ్రుంకి యటన్ దరి కేఁగుదెంచి చ
య్యన నటఁ గూరుచుండి విషయంబులనుండి మరల్చి చిత్తమున్.
గీ. అన్యసంపర్కదూషితం బైనమేను, దగ్ధ మొనరింప నెంచి చిత్తమున ఘోర
తపము గావింపఁ దొడఁగెఁ దత్తీక్ష్ణమునకుఁ, దాళఁజాలక లోకముల్ తల్లడిల్ల. 179
సీ. అప్పు డచ్చర లెల్ల నరుదెంచి కళ్యాణి. యీఘోరతపము నీ కేల చేయ
స్వర్గంబునందు శాశ్వతముగా మాతోడఁ, గలిసి వసింపుము కాంక్షదీర
ననవుడు బృంద యి ట్లనియె నచ్చరలార, నా కేల మీస్వర్గలోకవసతి
మత్పతిజిత మైనమఖభుగాలయమున, నెఱుఁగనె మీ రెల్ల నెనయుసుఖము
గీ. తనవు పావన మొనరించుకొనఁ దలంచి, తపము గావించు చుండినదానఁ గాని
క్షుద్రనాకసుఖంబుపైఁ గోర్కి లేదు, పొండు మీమీనికేతనంబులకు మీరు. 180
చ. అనవుడు వార లందఱును నామెమనోదృఢవృత్తికిన్ ముదం
బెనయఁగ సన్నుతించుచును నేఁగిరి వచ్చినత్రోవ నంతటన్
వనధిజకాంత జ్ఞానదహనంబునఁ గాల్చి గుణప్రతానమున్
దనువు నొనర్చి యోగశిఖిదగ్ధము గాఁగను బొందె మోక్షమున్.
ఆ. అప్పు డామెదేహమం దుండువహ్నిని, రవులుకొల్పి సఖి విరక్తితోడ
నందు నిజశరీర మాహుతి గాఁ జేసి, పడయ రానిపరమపదము నొందె. 182
గీ. ఎచట దేహంబు విడిచెనో బృంద యచటె, యెనసె బృందావనంబు నాఁగను బ్రసిద్ధి
శౌరి బృందావియోగార్తి సైఁప లేక, మరల నరుదెంచి యటనె క్రుమ్మరఁ దొడంగె.
సీ. అపుడు గోవిందునివ్యామోహమును మాన్ప, నుతియింప మూలప్రకృతిని సురలు
వ్యోమాంతరస్థ యై యామహామాయ యి, ట్లనియె బృందారకులార నేనె
గౌరీతనువున ధాత్రీరూపమునను ల, క్ష్మీరూపమున నుల్లసిల్లు చుందు
సృష్టిస్థితిలయముల్ చేయుదానను నేనె, యుండెదఁ ద్రిగుణంబు లొంది నేనె
గీ. యని పలికె యూర కుంటయు నమరు లెల్ల, ధాత్రి లక్ష్మిని గౌరిని దలఁచికొనఁగ
వారు మువ్వురు గూడ బృందారకులకుఁ, దనరఁగను సంతసంబు దర్శన మొసంగి.

సీ. అనిమిషులార మీరాయూకాంక్షితార్థంబు, శీఘ్రకాలంబున సిద్ధి నొందు
విరహార్తుఁ డై శౌరి తిరుగుచోటను జల్లుఁ, డని చెప్పి మూఁడువిత్తనము లిచ్చి
యంతర్హితలు గాఁగ నమరు లాబీజంబు, లను గొని మిగుల నాహ్లాద మొదవ
బృందాచితాభూమి కేతెంచి యచ్చోట, నవి చల్లి యేఁగిరి యమరపురికి

గీ. నంత గౌరీప్రదత్త మైనట్టిబీజ, మయ్యెఁ దులసి రమాదత్త మైనబీజ
మామె మాలతి ధాత్రిచే నీయఁబడిన, బీజ మామెను ధాత్రీమహీజ మధిప. 185

క. ఆవృక్షములను గని హరి, భావంబునఁ జెప్పలేనిప్రమదంబును బృం
దావిరహార్తిక్షితియును, నావహిలఁగఁ దత్ప్రసక్తుఁ డై వర్తించెన్. 186

వ. అది మొదలుగా నమ్మహీజంబులు విష్ణుసంప్రీతిదాయకంబు లయ్యె. ఇది యిట్లుండ నచ్చటఁ బార్వతి సంక్షుబ్ధమానస యై యేమియుం బలుకక తపంబుచే హరమనఃప్రీతి గావింప నెంచి యచ్చటనుండి బయలుదేఱి బ్రహ్మవదనగళితం బగుశ్రుతిపూరధార వోలె మనోజ్ఞాకారంబునం బొలుచుగంగానదిని విలోకించి తత్తీరంబునం గూరుచుండి తనప్రియసఖి యగుజయతోడ ని ట్లనియె. 187

సీ. జయ సత్వరంబుగఁ జని నీవు మద్వేష, ధారిణి వై యిందుధరునికడకు
నతఁడు మాయాశివుం డగునొ మత్స్వామియొ, యగునొ పరీక్షించి యరుగుదెమ్ము
నావుడు జయ తదాజ్ఞావశబద్ధ యై, పార్వతీదేవిరూపమును దాల్చి
శీఘ్రంబుగను వానిచెంతకుఁ జని నిల్వ, నతఁడు గౌరియె వచ్చె నని తలంచి

గీ. మదనబాణనిపీడితహృదయుఁ డగుట, శంక లేకుండ నామెహస్తములు వట్టి
గాఢముగఁ గౌఁగిటను జేర్చి గళితవీర్యుఁ, డయ్యె నది కాంచి జయ యిట్టు లనియె నవ్వి.

క. శివుఁడవె నీ వల్పేంద్రియుఁ, డవు వంచిత యగునె మామృడాని భవాదృ
గ్భవపాదరేణువులచే, భవదపచారంబె నిన్నుఁ బ్రహత మొనర్చెన్. 189

క. నేను భవానీభృత్యను, గాని యుమను గాను నన్నుఁ గను మని యెదుటన్
గానంబడిచి స్వరూపముఁ, దా నుమకడ కేఁగి చెప్పెఁ దదుదంతంబున్. 190

గీ. అంతట భవాని గడగడలాడి వార్ధి, తనయుఁ డేమి యొనర్చునొ యనెడిభీతి
భ్రమరి యై చొచ్చెఁ బద్మమధ్యమున నండె, తిరుగఁజొచ్చిరి తత్సఖుల్ తేఁటు లగుచు.

వ. తత్కారణంబునంజేసి పార్వతి భ్రమరాంబిక యనం బరగె. 192

సీ. అంతలోపల శుంభుఁ డాలించి బృందను, హరియించెను మురారి యనెడివార్త
చండముండులఁ బంచె సత్వరంబుగ సింధు, తనయునికడకుఁ దద్వార్తఁ దెలుప
నంతట వా రేఁగి యబ్ధిసూనునిఁ గాంచి, విన్నవించిరి విన్నవిషయ మెల్ల
నపుడు జాలంధరుం డాగ్రహావిష్టుఁ డై, భవరూపమును వీడి బయలుదేఱి

గీ. యరుగుదెంచుచు మార్గమధ్యంబునందుఁ, గాంచి దుర్వారణునిఁ దాత కంసవైరి
మెంతపని చేసె జామాత నింట నుంచు, కొనుటకంటెను వెంగలితనము లేదు. 193

సీ. అని వచించుటయు ని ట్లనియె దుర్వారణుం, డధిప చేసినకర్మ మట్టిపోదు
హరునిభార్యను నీవు హరియింప నెంచిన, హరియించె నీభార్య నచ్యుతుండు
దీనికై నీవు చింతించిన ఫల మేమి, కడఁగుము కర్తవ్యకార్యమునకు
నావుడుఁ బాథోధినందనుండు క్షణంబు, మౌనియై పరికించి మానసమున
గీ. ననఘ వచియింపు మొదటను హరిని గెడప, నరుగు టుచితమొ లేకున్న హరునిఁ గూల్ప
నేఁగు టుచితంబొ నాఁగ వాఁ డిట్టు లనియె, స్వామి చేసెడియుద్ధంబు చనదు నిలుప.
క. అరియై నిలువంబడి సం, గరము సలుపుచుండువానిఁ గడ తేర్పక వే
ఱొరునిఁ గొనితెచ్చుకొనునెడ, నిరువురునుం గలిసి నిన్ను హింసింపరొకో. 195
క. అని పలుకుటయును వారిధి, తనయుఁడు దుర్వారణునిహితంబును విని శం
భునితోడనె సంగ్రామము, నొనరింపఁగ నెంచి మొదట నుత్సాహమునన్. 196
క. చనుదెంచి యుద్ధభూమికిఁ, గనుఁగొని వృషభస్థుఁడై నకందర్పారిన్
గనులను నిప్పులు రాలఁగఁ, గినియుచుఁ జేఁ బూని కాలకేదారంబున్. 197
శా. దానన్ దీక్ష్ణశిలీముఖంబులను సంధానించి యేసెన్ బటు
జ్యానాదంబున మాఱుమ్రోఁగఁగను దిక్చక్రంబు కామారిపై
నానారాచసమూహమున్ దునిమి భూతాధీశుఁ డొక్కమ్మునన్
గ్లానిం జెందఁగ నేసె వేఱ యొకకోలన్ సింధుసంజాతుపై. 198
సీ. ఆబాణహతిచేత నట్టిట్టులై వార్ధి, తనయుండు మరల స్వాస్థ్యంబు నొంది
సంధించి శతసహస్రశరంబులను వింట, నుగ్రునిపై నేసె నొక్క పెట్టఁ
దద్బాణపూరితతను వయి భాసిల్లెఁ, బార్వతీహృదయాబ్జబంభరంబు
ఖగగణవ్యాకీర్ణగగనదేశముపోలెఁ, దరుచయచ్ఛన్నభూధరముపోల
గీ. నట్లు భాసిల్లుచుఁ బినాకి యంతకాల, వహ్నిపోలె విజృంభించి వార్ధిసుతుని
కవచమును నొక్కకోలను బవులఁ గొట్టి, నతఁడు వెలుగొందె మేఘముక్తాద్రిపోలె
సీ. అట్లు వెలుంగుచు నబ్ధిసూనుఁడు బాణ, వర్షంబుఁ గురిసె నీశ్వరునిమీఁద
నాబాణవర్షంబునందు మునింగియు, హరుఁ డేసె నతనిపై శరశతంబు
తద్బాణహతి నబ్ధితనయునిదేహంబు, బ్రద్దలై ప్రవహించె రక్తతటిని
యారక్తనదిఁ జూచి యాజిరంగము వీడి, బలము లన్నియు భీతిఁ బఱవఁ దొడఁగె
గీ. నంతజాలంధరుండు రక్తావృతాంగుఁ, డగుచు సాహసమున నేయ నర్ధచంద్ర
మార్గణసహస్రమును జంద్రమౌళిమీఁద, నవి చని విభూషణము లయ్యెఁ ద్ర్యంబకునకు.
వ. అంతట వీరభద్రమణిభద్రులు జాలంధరునితోడ నెదుర్కొని ముష్టీముష్టి బాహాబాహి కచాకచి యుద్ధంబులం గావించి తత్ప్రతాపంబునకు నిలువం జాలక యోడి రణభూమిం బడిరి.

చ. అది గని నందికేశ్వరుఁ డుదగ్రగతిన్ గణసైన్యయుక్తుఁ డై
గద గొని కేల వచ్చి రణకౌశలముం బ్రకటింప నుండఁగా
నెదురుగ నేఁగుదెంచి చలియింపక శుంభనిశుంభు లిద్దఱున్
గదనముఁ జేయఁ జొచ్చిరి యఖండపరాక్రమ మొప్ప నందితోన్.

గీ. అపుడు రుద్రగణంబుల కసురులకును, ఘోర మగునాహవం బయ్యెఁ గోణపులకు
జయము చేకూరుటను నందు శంకరుండు, క్రుద్ధుఁ డై దానవుల నెల్లఁ గూల్పఁ దొడఁగె.

సీ. అపుడు దానవసైన్య మల్పశేషము గాఁగఁ, గనుఁగొని శుక్రుని వనధిసుతుఁడు
స్వామి క్షీణం బయ్యె సైన్య మంతయు నీవు, సమయంబున నుపేక్ష సలుపఁ దగునె
యనవుడు భార్గవుం డభిమంత్రణ మొనర్చి, బ్రతికించెఁ జచ్చినబలము నెల్ల
హత మైనదైత్యసైన్యం బెల్ల మరల వ, చ్చుచు నుండ గ్రహియించి శూలపాణి

గీ. శీఘ్రముగ వచ్చి శుక్రునిసిగను బట్టి, శూల మెత్తంగఁ బొడువగా శుక్రుఁ డడలి
భర్గ వధియింపకుము నేను బ్రాహ్మణుఁడను, బ్రాహ్మణవధంబునను గల్గు బ్రహ్మహత్య.

వ. అని పలుకుటయు మృత్యుంజయుండు తాను మున్ను బ్రహ్మహత్యవలనఁ బడిన పాటుమ స్మరించుకొని ప్రాణహరుం డైనను బ్రాహ్మణుం డగువానిని వధింపం దగదని నిశ్చయించి శూలంబును విసర్జించి యుద్ధసమాప్తి యగునంతవఱకును శుక్రుని స్త్రీయోనిగతునిం జేయ సంకల్పింప నంతలోన హరునితృతీయలోచనంబునుండి యత్యుగ్రాకారయును వివస్త్రయును మహోదరయును ముక్తకేశియును స్థూలలంబస్తనియును నగుకృత్య ప్రాదుర్భవించి భార్గవునిం బట్టికొని స్వయోనిస్థాపితునిం జేసి జాలంధరుండు తనపై కరుదెంచునంతలోన నదృశ్యత్వముం జెందె. 205

ఉ. అంతట సాగరాత్మజుఁ డనంతనిశాచరసైన్యయుక్తుఁ డై
పంతమువట్టి ధూర్జటిని భండనమందు వధింతు నంచుఁ గా
లాంతకుఁడా యితం డనఁగ నార్చి యుమాపతిపైకి దూఁకె ది
గ్దంతులు గీఁకవెట్టఁగను దన్నినదంబునకున్ వడంకుచున్. 206

ఉ. అప్పుడు చంద్రమౌళి కరమందుఁ బినాకముఁ బట్టి యాగ్రహం
బుప్పతిలన్ శిలీముఖము లొక్కమొగిన్ జడివానకైవడిన్
గుప్పెఁ బయోధిసూతిపయి గ్రుక్కును ద్రిప్పికొనంగ లేక వాఁ
డప్పటుబాణఘాతమున కవ్వలకుం జని యార్చి క్రమ్మఱన్. 207

క. అతినిష్ఠురసాయకసం, తతులను సంధించి ధనువునను రుద్రగణ
ప్రతతిపయిఁ గురిసె నవ్వల, శితికంఠుఁడు దైత్యబలముఁ జెండఁదొడంగెన్ 208

క. అంతట దానవసైన్యం, బంతయు క్షీణించు చుండ హరశరనిహతిన్
స్వాంతమున సింధుసూనుఁడు, చింతించుచు మాయచేత శివుని జయింపన్ 209

సీ. ఒనరించి మాయాజయుని జయ నీ వేగి, మోహింపఁజేయుము మొదట శివుని
ననవుడు జయ వానియాజ్ఞ నౌదలఁ దాల్చి, యేఁచ్చుచుఁ జని వేగ మృడునికడకు
స్వామి పాపాత్ముఁడు జాలంధరుఁడు వచ్చి, కొనిపోయె గౌరిని గొంప మునిఁగె
నని పల్కుటయు శర్వుఁ డపుడు పుట్టఁగ లోన, జయ హరింతురు నిశాచరులు నిన్ను
గీ. సత్వరంబుగ రమ్మ నాసవిధమునకు, ననుడు నాయమ స్వామి మాయమ్మ నుడిగి
నేను జీవింపఁజాలను నిమిష మేని, యామెయుండెడునెడకె నే నరుగుదాన. 210
క. అని చెప్పి సత్వరంబుగఁ, గనఁబడకుండంగఁ జనుడు గంగాధరుఁ డా
త్మను వగచుచు మతి పోయిన, యనువున నిలఁబడియె సంగరావనియందున్. 211
సీ. అపుడు సింధుజుఁడు మాయాగౌరిని సృజించి, రమణీయ మగునిజరథమునందుఁ
గూరుచుండఁగఁ బెట్టుకొని తనచెంతను, నాయోధనక్షితి కరుగుదెంచె
నది చూచి విభ్రాంతుఁ డై సదాశివుఁ డుండ, నశ్రువుల్ దొరఁగ మాయాభవాని
హా మహాదేవ హా ప్రాణనాథ యటంచు, నెలుఁగెత్తి గొల్లున నేడ్వఁ దొడఁగె
గీ. నంత నీశుఁడు దైత్యమాయావిమోహి, తాత్ముఁ డై చింతిలుచు నుండ నతివకొఱకు
నబ్ధిసూనుఁడు కనుఁగొని యతని రుద్ర, యేల యేడ్చెదు నీసతి నిత్తుఁ గొనుము.
క. అని పలికి విసరివై వఁగఁ, గొనఁ జేతులు చాఁప హరుఁడు గొనకొని నడుమన్
గొనిపోయి శుంభుఁ డామెను, బొనరింపఁ దొడంగె గగనమున నృత్యంబున్. 213
క. అది గనుఁగొని మృత్యుంజయుఁ, డెద నాగ్రహ మొదవ శూల మెత్తి యతనిపైఁ
గదియంగ వ్రేయ నామెను, వదలి యతఁ డదృశ్యుఁ డయ్యె వైశమ యంతన్.
క. ఆశూలముపైఁ బడి యా, కాశంబుననుండి ఛిన్నగాత్ర యగుచు మా
యాశాంభవి విలపించుచు, నీశానునిమ్రోలఁ గూలి యెడసె నసువుల్. 215
సీ. అంత గతప్రాణ యైనశర్వాణిని, గనులారఁ జంద్రశేఖరుఁడు చూచి
హా ప్రియ హాదేవి హా చంద్రముఖి యని, కన్నీరు కాల్వలు గట్ట నేడ్చి
నిశ్చేష్టుఁ డై పడి నేలపైఁ గొంతసే, పటికి నెట్టులొ సంజ్ఞఁ బడసి లేచి
సపరివారముగ నాశంబును గోరిచే, బడయ శుంభునకు శాపము నొసంగె
గీ. నాకతంబునఁ బూర్వమన్వంతరమున, నార్యచే హతు లైరి శుంభాదు లెల్ల
నట్లు శపియించి హరుఁడు ప్రియావియోగ, శోకమును నాఁపికొన లేక స్రుక్కుచుండ.
సీ. అమరబృందముతోడ నరుదెంచి పరమేష్ఠి, ప్రమథాధిపతికి దర్శన మొసంగి
శంకర నీవు సంసారవర్జితుఁడవు, సర్వేశ్వరుండవు శాశ్వతుఁడవు
బంధశూన్యుండవు బ్రహ్మణ్యుఁడవు సము, ద్రతరంగగతిఁ డై నతరణివోలెఁ
గన్పట్టు చుంటి వొక్కండ వయ్యును ననే, కాకారములతోడ లోకమందు
గీ. నీపదంబును జెంద ధ్యానించు చుందు, రనిశమును యోగనిష్ఠు లై నట్టివారు
నీయథార్థస్వరూపంబు నేను హరియు, నిర్జరులును నెఱుంగము నిక్కముగను. 217

ఆ. నీకుఁ గూడ నిట్లు శోకమోహంబులు, చేకుఱుటను జూడఁ జిత్రమయ్యె
నని నుతించి చెప్పి యాథార్థ్య మంతయు, నరిగె నంత నుగ్రుఁ డాగ్రహమున. 218
క. ధరియించి పినాకంబును, గరమున సంధించి నిశితకాండము లందున్
శరధికుమారునిమీఁదన్, గురిసెఁ బయోదంబు వాన కురిసినభంగిన్. 219
సీ. అంత జాలంధరుం డాకాశభూమధ్య, మున మాయచే ధరిత్రిని సృజించి
యచట జగన్మోహనాకార లగుదివ్య, వేశ్యామణుల నుద్భవింపఁజేసి
తాను గంధర్వుఁ డై తాండవించుచు వారి, చేతను బాడించె శిలలు గరఁగ
నాపాట విని మోహితాత్ముఁ డై శర్వుఁడు, విస్మరించె రణంబు విడిచి ధనువు
గీ. నెక్కి వృషభంబు నచ్చటి కేఁగి వివశుఁ, డగుచుఁ దత్సంప్రయోగంబు నరయు చుండఁ
బ్రమథగణములపైఁ బడి రాత్రిచరులు, కొట్టి కూల్పఁ దొడంగిరి గుట్టలుగను. 220
వ. అంత మాధవుండు మహేశ్వరునికడకుం జని జాలంధరమాయాసంమోహితుం డై కదల కుండుస్థాణుని నుపలక్షించి. 221
సీ. సర్వజ్ఞ యిది యెల్ల జాలంధరునిమాయ, తెలియంగరానిది కలదె నీకు
నిట్లు మోహితుఁడ వై యీ వుండ దైత్యులు, చెలరేఁగి నీబలంబులను నెల్ల
బలియిచ్చు చుండిరి ప్రధనధరిత్రికిఁ, గై కొమ్ము శీఘ్రమ కార్ముకమ్ము
నని పల్కుటయు రుద్రుఁ డపగతమోహుఁ డై, చూచెఁ గ్రోధారుణాలోచనముల
గీ. నప్పు డది యెల్ల శూన్య మై యాకసముగఁ, గానఁబడుటయు ధూర్జటి మానసమున
విస్మయము నొంది వెంటనె వృషము మీఁదఁ, బ్రధనరంగంబునకు వచ్చి పట్టె ధనువు.
చ. అసురబలంబు నెల్లఁ గదనావనికిన్ బలియిచ్చు చుండ సా
ధ్వసమునఁ బాఱిపోయి బలిధామముఁ జొచ్చిరి శుంభముఖ్యరా
క్షసభటవీరు లెల్ల నది గాంచియు ధైర్యముతోడ నొక్కవా
ర్ధిసుతుఁడు నిల్చె సంగరధరిత్రిని యుద్ధ మొనర్ప శూలితోన్. 223
సీ. అపుడు భర్గుఁడు త్రిశూలాయుధంబును ద్రిప్పి, కంధిసూనునిఱొమ్ము గాఁడ వ్రేసె
నా వ్రేటునకుఁ బుట్టె యతనివక్త్రమునుండి, నరరూపసింహాననములతోడ
జంభజ్వరంబు ధూర్జటిపైకి దూఁకంగ, హుంకరించెఁ బినాకి యుగ్రుఁ డగుచు
జనియించి యాహుంకృతిని శరభంబు జం, భజ్వరంబును జీల్చి పాఱవైచె
గీ. నంత జాలంధరుండు సహస్రబాహుఁ, డగుచు బిరబిర నేతెంచి యుష్ట్రమూర్తి
వృషభమును బట్టి గిరగిరఁ ద్రిప్పి కేలఁ, బాఱవైచెను నీహారపర్వతమున. 224
గీ. అంత నపగతవాహనుఁ డై శివుండు, ధరణిపై నిల్చి సాగరాత్మజునిరథము
సారథినిఁ గార్ముకంబును శస్త్రములను, భస్మ మొనరించెఁ గాలాగ్నిబాణమునను.
క. వారిధిసుతుఁ డప్పుడు గత, సారథిరథకార్ముకాస్త్రశస్త్రుం డయ్యున్
ధీరత్వంబును విడువక, ఘోరాకారముగఁ దాల్చి కోటికరములన్. 226

క. పరువిడుచుఁ బోయి శూలిని, గరముల బంధించె నపుడు కరవాలముచే
స్మరహరుఁడు నఱికె యాతని, కరకోటిని గాచికొనియెఁ గాయము నంతన్. 227

వ. జాలంధరభుజాబంధనంబునం జేసి రుద్రుండు నీలలోహితుం డయ్యె. 228

క. వనధిసుతుఁ డంత శిరమున, నని చేయఁ దొడంగె నపుడు హరుఁ డంబుధినం
దన మెచ్చితి నీధృతికిన్, గొను మిచ్చెద నేను నీకుఁ గోరినవరమున్. 229

గీ. అనుటయును సింధుసూనుఁ డి ట్లనియె శర్వ, సంతసించితి వేని నాశక్తి కీవు
నశ్వరము గానిపదమును నా కొసంగు, మీయకుండిన నిను వధియింతు నిపుడె.

క. అని పలికి కోటిభుజముల, మునుపోలెను దాల్చి నిలిచె ముంగల నది గ
న్గొని విస్మయముం జెందుచుఁ, బినాకి శూలమునఁ బొడిచె బిద్దఁగ వానిన్. 231

క. ఆశూలఘాతమునకున్, లేశంబును లెక్కగొనక నీరధిసుతుఁ డా
వేశమున గ్రుద్దెఁ బిడికిట, నీశానునియురము ప్రమథు లెల్ల వడంకన్. 232

క. ఆపిడికిటిపోటునకు ను, మాపతి యుస్సు రని యూర్చి మాపఁగ నతనిన్
జేపట్టఁగను బినాకముఁ, గోపంబున వాఁడు లాగికొనియెను దానిన్. 233

ఆ. అపుడు ధూర్జటికిని నబ్ధిసూనునకును, ద్వంద్వయుద్ధ మయ్యె దారుణముగ
నంత మొంద కునికి నబ్ధిజుం డందును, జంత నొందఁ దొడఁగె శితిగళుండు. 234

ఉ. అప్పుడు మాధవుండు సరయంబుగ వచ్చి మహేశ నీకు నేఁ
జెప్పఁగ నేల చక్రమును జేకొను మింక నుపేక్ష సేయఁగా
నొప్పదు నాఁగ ధూర్జటి నిజోదరమధ్యగ మైనచక్రమున్
జప్పున లాగి పై కుదధిజన్మునిశీర్షముఁ ద్రుంచె దానిచేన్. 235

సీ. ఆమస్తకము ప్రవదస్రధారంబుగాఁ, జలుపుచు ఘోరనిస్వనము నెగిరి
గమియింప బ్రహ్మలోకమునకు దానివెం, బడిఁ బడి ధూర్జటి పరువు లిడుచు
నటునుండి పడుచుండ నది వాయుజవమునఁ, దత్పృష్ఠమున వచ్చి తాను గూడఁ
జక్రంబుచే రెండుశకలంబులు గ దాని, నఱక నా రెండుఖండములనుండి

గీ. ప్రబల మగు తేజ మొక్కటి బయలు వెడలి, హరునిలోపలఁ జొచ్చె నత్యద్భుతముగ
నంత నాశీర్షఖండద్వయంబు గమన, శక్తివిరహిత మగుచు నచ్చటనె పడియె. 236

సీ. అంత నాఖండద్వయమునుండి రక్తంబు, కాఱంగఁ దొడఁగెను గాల్వలు గను
నారక్తముననుండి యావిర్భవింపంగ, సాగిరి దైత్యు లసంఖ్యముగను
శర్వుఁ డప్పుడు చతుష్షష్టియోగినుల ని, యోగించి తద్రక్త మూడ్చి త్రావఁ
దా నుద్భవించెడి దైత్యకోటుల నెల్ల, సంహరింపఁ దొడంగెఁ జక్రమునను

గీ. ద్రావి నిశ్శేషముగను దద్రక్తనదుల, యోగినులు పిప్పి యొనరించి యుజ్జగించి
యాశిరఃఖండముల నిల్వ హరునియెదుట, శంకరుఁడు దానవుల నెల్ల సంహరించి. 237

క. కని యోగినీగణంబును, జనియింపఁగ సంతసంబు స్వాంతంబున యో
గినులార మెచ్చితిని మీ, పనికిం గోరుండు కోరుఫలము నొసఁగెదన్. 238

సీ. అనవుడు మ్రొక్కి యోగినులు మహేశ్వర, మముఁ గొల్చుచుండెడిమానవులకుఁ
గలుగంగ భోగమోక్షములు ప్రసాదింపు, మని వేఁడుటయును నిట్లనియె శూలి
యోగినులార మీయుత్తమప్రార్థన, నెఱవేర్చుటయె కాక నేను మఱియు
నెవరు ద్వేషింతురో యిల మిమ్ము వారిపు, ణ్యమ్ము భైరవుఁడనై యపహరింతు

గీ. ననుటయును సంతసించి యోగినులు చనఁగ, శితిగళుండు స్మరించెఁ బార్వతిని వృషము
నంత గౌరియు వృషమును నరుగుదేర, హర్షపరవశుఁ డయ్యె నయ్యష్టమూర్తి. 239

ఆ. అపుడు పుష్పవర్ష మాకసముననుండి, కురిసె దుందుభులును మొరసె దివిని
హరివిరించిమఘవదాదిబృందారకు, లేఁగుదెంచి పొగడి రీశమహిమ. 240

క. అంత నుమాప్రాణేశుఁడు, సంతోషించుచును త్రిదశసన్నిధిలో దై
త్యాంతకున కిచ్చెఁ జక్రము, నంతర్హితుఁడగుట శార్ఙ్గి యది గైకొనియెన్. 241

ఆ. అపుడు విగతవైరు లగుట హర్షించుచు, నమరపురికి నేగి రమరు లెల్లఁ
జనియె బ్రహ్మలోకమునకు స్వాయంభువు, క్షీరవారినిధికిఁ జేరె శౌరి. 242

ఆ. అధిప యిప్పటికిని నబ్ధివాసము తప్ప, దాయె మాధవునకు నందువలన
స్వకృతకర్మఫలము సర్వేశ్వరుండైన, ననుభవింపవలయు ననుట ధ్రువము. 243

గీ. దేహ మున్నంతవఱకను దేహి కర్మ, మొనరుపక తప్ప దాకర్మమునను జేసి
కలుగకుండఁగఁ బోదు దుఃఖంబొ సుఖమొ, యనుభవింపక యది తప్ప దవశుఁ డగుచు.

గీ. ప్రాప్తమయ్యెను దేహసంబంధమునను, సుఖము దుఃఖంబు కృష్ణాదులకును నింక
నితరులకు నేమి చెప్ప నీ వెఱిఁగి కర్మ, గతిబలీయస్త్వమును దొఱంగకుము ధృతిని.

క. జ్ఞానము వైరాగ్యంబును, లేనినరుల్ తప్పికొనఁగలే రతిచిత్రం
బైనట్టికర్మగతికిం, గాన క్షమను దాల్చి కొంతకాలం బున్నన్. 246

క. అరుల జయింతువు రాజ్యము, భరియింతువు దీనజనులఁ బాలింతువు భూ
సురులను దాపసులను ని, ర్జరులను బూజింతు కాంతు సౌఖ్యము లెల్లన్. 247

సీ. ఇపుడు నేఁ జెప్పినయితిహాసమును విన్న, జ్ఞానంబుఁ బడయును తామసురుండు
క్షత్త్రియుం డొందు రాజ్యమును రాజ్యభ్రష్టుఁ, డగుతేఁడు మరల రాజ్యంబుఁ బడయు
నూరుజుం డొందు నపారధనంబును, నవరవర్ణుఁడు చెందు నధికసుఖము
కలుగవు మోహశోకము లాపదలు రావు, పాపంబు లెల్లను రూపుమాయు

గీ. సర్వకార్యంబులందును జయము గలుగు, సంఘటిల్లును స్వర్గమోక్షములు తుదకు
వాచకున కాలకించినవారికంటె, నధికఫల ముండుటను బూజ్యుఁ డగు నతండు. 248

వ. అని నుడువుటయు యుధిష్ఠిరుండు చిత్తభేదం బుడిగి మహాత్మా యింక శ్రీశైలవృ
త్తాంతముం దెల్పు మని యర్థింప నారదుం డాతని కిట్లనియె. 249

—: శ్రీశైలవృత్తాంతకథనము :—

సీ. వినుము మహారాజ వినిచెద శ్రీశైల, వృత్తాంతమును నీకు విశదముగను
శ్రీశైల మనెడిభూభృద్వరం బొక్కటి, దక్షిణదిశయందుఁ దనరు చుండు
దానిపై సకలపాదపశోభితం బైన, కాననం బొక్కటి గ్రాలు చుండు
మఱియును నచ్చోట మల్లికార్జునుఁ డను, పేర శ్రీకంఠుఁ డొప్పారు చుండు
గీ. నచటఁ బాతాళగంగయు నాశ్రమములు, నదులును దటాకములును బుణ్యదము లెన్నొ
కల వవియె కాక యెందఱొ కలరు మోక్ష, మార్గమును గోరి తపియించుమాను లచట.
గీ. కనిన శ్రీశైలశిఖరముఁ గాశిలోనఁ, జెందినను మృతి కేదారమందు జలము
ద్రావినను దేహి మాతృగర్భమును మరలఁ, జేరఁ డని మున్ను మాతండ్రి చెప్పె నాకు.
క. పాతాళగంగలోపల, స్నాతుం డయినంతలోనె సకలవిధమహా
పాతకవిరహితుఁ డగు నా, హేతువున లభించు జ్ఞానదృష్టి యతనికిన్. 252
క. శ్రీశైలమె కైలాసము, శ్రీశైలమె విష్ణుపురము శ్రీశైలమె లో
కేశభవనంబు సర్వము, శ్రీశైలమె ముక్తి గలుగఁజేసెడికతనన్. 253
గీ. అనఘ శ్రీశైలమల్లికార్జునుఁ డొకండె, కాంచె విజ్ఞానదేవవిఖ్యాతి దాన
నాశ్రయింతురు మోక్షార్థులైనవారు, సంతతంబును మహాఘనాశకుని నతని. 254
వ. అని చెప్పుటయు యుధిష్ఠిరుం డత్యానందముం జెంది హరిద్వారమాహాత్మ్యంబు విన
వేఁడుటయు నాతనికి నారదుం డిట్లనియె. 255
క. మనుజాధిప నీ విప్పుడు, ననుఁ గోరినయట్లె యొకదినంబున గౌరీ
శుని నేను గోర శర్వుఁడు, గనుఁగొని ననుఁ గరుణ యొదవఁగా నిట్లనియెన్. 256

—: హరిద్వారమాహాత్మ్యకథనము :—

సీ. మును భువి రవివంశమున నుండె నొకఱేఁడు, సత్యసంధుఁడు హరిశ్చంద్రుఁ డనఁగ
నతనికిఁ గల్గె రోహితుఁడు నా నొకపుత్త్రుఁ, డచ్యుతభక్తిపరాయణుండు
వానికి వృకుఁ డనుసూనుఁ డొక్కఁడు వుట్టె, ధర్మసంరక్షణతత్పరుండు
జనియించె నతనికిఁ దనయుఁ డొక్కండు వం, శోద్ధారకుఁడు సుబాహుండు నాఁగ
గీ. నతని కుదయించె గరుఁ డనుసుతుఁ డొకండు, పరమనిర్భాగ్యుఁ డన్యాయపాంసనుండు
వాఁడు దుష్టప్రవర్తనవలన రాజ, దండితుం డయి స్వపురమం దుండ లేక. 257
సీ. చని భార్గవాశ్రమంబునకుఁ గుటుంబస, మేతంబుగను దనహీనదశను
మనవి చేయఁగ భార్గవునకుఁ గృపాళువై, యతఁ డుంచె గరుని నిజాశ్రమమున
నటు లుండఁగను భార్గవాశ్రమంబున గరుం, డతనికి సగరుఁ డన్ సుతుఁడు పుట్టె
క్షత్త్రియోచిత మైనసంస్కారముల నెల్ల, గరతనూజునకు భార్గవుఁడు చేసె
గీ. వేదశాస్త్రంబులను జెప్పి విధియుతముగఁ, బావకాస్త్రంబు నొసఁగె నప్పావకాస్త్ర
మునను సగరుండు హైహయులనుజయించి,స్వవశమొనరించుకొనిస్వరాజ్యమ్మును మరల,

వ. స్వరాజ్యాపహారు లగుహైహయులకుం దోడ్పడినశకయవనకాంభోజపారదపహ్లవులను వధియింపఁ బ్రతినవట్టి వారిపై నాగ్నేయాస్త్రంబు ప్రయోగించుటయు వారలు తత్ప్రదాహంబునకుఁ దాళం జాలక వసిష్ఠమహామునిపాదంబులపైఁ బడ వసిష్ఠుండు కరుణార్ద్రహృదయుం డై వారల కభయంబు నొసంగి పరాభవంబు మరణతుల్యంబ యగుం గాన వీరిని బరాభవం బొనరించి విడువు మని యాదేశింప సగరుండు వసిష్ఠాదేశంబు నౌదలం దాల్చి యాగ్నేయాస్త్రంబు నుపసంహరించి శకుల కర్ధశిరోముండనంబును యవనులకును గాంభోజులకును సర్వశిరోముండనంబును గావించి పారదులను ముండకేశులుగను బహ్లవులను శ్మశ్రుమాత్రావశేషులుగనుం జేసి యెల్లరను విడిచిపుచ్చె.

గీ. అట్లు సగరుఁడు రిపులను హతులఁ జేసి, ప్రభు వయి సమస్తవసుమతీరాజ్యమునకు
నశ్వమేధాధ్వరంబుఁ జేయం దలంచి, విడిచె నశ్వంబు జగదేకవీరుఁ డగుట. 260

ఆ. అశ్వరక్షకులుగ నరిగిరి షష్టిస, హస్రసంఖ్య గలనిజాత్మభవులు
హయము సంచరించి యవని నెల్లను బూర్వ, దక్షిణాబ్ధివేల దరిసి నిలిచె. 261

ఆ. అట్లు నిలిచి తురగ మంతర్హితం బయ్యె, నందఱకును విస్మయంబు గలుగ
నంత సగరపుత్రు లద్దానిఁ గొనిపోయె, నెవఁడొ యని ధరిత్రి నెల్ల వెదకి. 262

క. కనఁబడమిని నది ధరపయి, వననిధివేలానుబద్ధవసుమతి యెల్లన్
ఖనన మొనర్చి యపారము, గను లోపలఁ జొచ్చి యచటఁ గని యొకతపసిన్. 263

అ. అతనిచెంత నున్నయశ్వంబు నీక్షించి, యశ్వచోరుఁ డతఁడె యని తలంచి
కొట్టి వానిఁ దత్ప్రకోపాగ్నికీలల, భస్మరాసు లగుచుఁ బడిరి యచట. 264

వ. అంతట సగరుండు తనద్వితీయపత్నియందు జనించినపంచజనహృషీకేతుసుకేతుధర్మరథు లనునలువురు పుత్రులం బనుచుటయు వార లాప్రదేశంబునకుం జని యచ్చటఁ దపోనిష్ఠాగరిష్ఠుండును నాదిపురుషుండును నగుకపిలునిం జూచి సవినయంబుగా నమస్కరించి నిజాగమనప్రయోజనంబు నెఱింగింప నమ్మహాముని సుప్రసన్నుం డై జరిగిన విషయముం జెప్పి యశ్వంబుం గొనిపొం డని యనుగ్రహించుటయు వార లశ్వముం గొనివచ్చి తండ్రి కొప్పగించిరి. 265

సీ. అంతట సగరభూకాంతుండు హయమేధ, శతమును గావించె సక్రమముగ
నతనిధర్మోత్తరమతికి జనార్దనుం, డంతరంగంబున హర్ష మొంది
వంశకీర్తితనూజవార్ధిమోక్షములను, వరపంచకంబుగా వాని కిచ్చె
నతనినల్వురుపుత్రు లన్వయకరు లైరి, ప్రభు వయ్యె వారిలోఁ బంచజనుఁడు

గీ. పంచజనునకు జన్మించె బహుళశౌర్య, శాలి యగునంశుమంతుఁడు జనన మయ్యె
నంశుమంతునకు దిలీపుఁ డనుసుతుండు, వానికి భగీరథుం డనుసూనుఁ డొదవె. 266

వ. భగీరథుండు తనపూర్వికుల నుద్ధరించుటకు గంగను ధరిత్రికి రావింపం దలంచి హిమ

వత్సరత్రితంబునఁ బదివేలయేండ్లు ఘోరతపంబు గావింప మహావిష్ణువు తత్తపంబునకు
మెచ్చి గంగను విడిచె. 267

సీ. అప్పు డాగంగ మహావేగమున వచ్చు, చుండంగ నద్దానియుదుటు చూచి
తద్వేగమున కుర్వి తాళలే దని యెంచి, దానిని నాకపర్దంబునందు
నిలిపితి నయుతాబ్దములవఱకును భగీ, రథు డది ధ్యానమార్గమున నెఱిఁగి
చనుదెంచి కైలాసమునకు నన్నుగుఱించి, దారుణంబుగఁ జేసెఁ దపము నంత

గీ. నొకజటాజూటకేశమునుండి నేను, వదలఁగను గంగ దిగి మొట్టమొదట బదరి
కాశ్రమంబున కలకనందాఖ్య నచటఁ, బొంది పిదప హరిద్వారమునకుఁ జేరి. 268

ఆ. పడసి యచట విష్ణుపాదోదకి య టన్ను, యాఖ్య సురలకును దురాప మైన
తీర్థరాజ మయ్యెఁ దెలుపంగ నాకును, దరము గాదు చూవె దానిమహిమ. 269

ఆ. దానిలోన నెవఁడు స్నానంబు గావింపఁ, దలఁచి తత్తటమున నిలువఁబడునొ
యతనియఘము లెల్ల నపుడె దగ్ధము లగు, నింక స్నానఫలము నేమి చెప్ప. 270

గీ. దైవికంబుగ నే నొకతరుణమందుఁ, జని హరిద్వారమునకు నచ్చటను గాంగ
జలములో స్నాన మొనరింపఁ దలఁచుచుండ, నంతలో మాధవుఁడ నైతి నద్భుతముగ.

క. అరిగి హరిద్వారమునకు, సురనిమ్నగలోన మునిఁగి శుద్ధాత్ముం డై
హరిదర్శన మొనరించిన, నరుడె చతుర్వర్గసిద్ధి యతనికిఁ గలుగన్.

గీ. నదులలో నెల్ల నుత్తమనది యనంగ, గంగ యొక్కఁడె దేవతాగణములందు
నుత్తమం బగు దైవత మొక్క హరియె, వేడుకకుఁ జెప్పుమాటలు వేయి యేల.

గీ. సకలతీర్థంబులందును స్నాన మాడి, నట్టిఫల మొక్కగంగలో నాచరించు
స్నానమునఁ బ్రాప్తమగు దాన సంతతమును, నధివసింతురు తత్తీరమందె బుధులు. 274

క. కాన హరిద్వారనివా, సానందము నాకు రాజతాచలమందున్
గానఁబడ దాకతంబున, నేను హరిద్వారమందు నెలకొని యుందున్. 275

క. అని వచియించుటయును నే, ననవధికం బై హర్ష మామతిలంగన్
జనుదెంచితి నని చెప్పి త, దనుమతిఁ గొని దేవమాని యరిగెను దివికిన్. 276

—: నానాధర్మకథనము :—

సీ. ఒకనాఁడు పార్వతి యుత్సుకత్వము గల్గ, ధర్మంబులను వినఁ దలఁపునందు
భర్గునిఁ గనుఁగొని ప్రాణేశ ధర్మంబు, లే వేని నీవు నా కెఱుఁగఁ జెపుమ
యని వేఁడుటయును ని ట్లనియె నీశుఁడు దేవి, లోకకళ్యాణంబు చేకుఱంగ
వినుము ధర్మము ధర్మమునకె యర్థంబును, గామంబు మోక్షంబు గల్గుచుండు

గీ. దానఁ బ్రాజ్ఞులు నిరతంబు ధర్మమందె, సక్తులై యుందు రది తపశ్చర్యవలన
దానమున నియమమున వ్రతంబువలనఁ, బ్రాప్తమగు వేఱొకంటఁ బ్రాప్తంబు గాదు.

వ. తపంబు సాత్త్వికరాజసతామసరూపంబులఁ ద్రిప్రకారంబుగా నుండు. 278

గీ. సాత్త్వికతపంబుచేతను స్వర్గ మొదవు, నది యనుభవించి తుది నిల కరుగుడెంచి
యేలి రాజ్యంబు సద్గుణోపేతుఁ డగుచు, మోక్షపదము జన్మాంతరమునను చెందు.

వ. రాజసతపంబుచే రాజసగుణయుక్తుం డై జన్మాంతరంబున రాజ్యముం బడయు. తామ
సతపంబుచేఁ గ్రూరకర్ముం డై భుక్తిలాభముం బొందు. తామసతపంబున రాక్షసులు
మహాబలశాలు లై రి. రాజసతామసతపంబులకంటె సాత్త్వికతపం బత్యుత్తమంబు.

సీ. గృహమునం దుండి నివృత్తదురాశుఁ డై, కామింపకుండఁ గుకర్మములను
నెఱవేర్చికొనుచును నిజధర్మములను వ, ర్తిలుగృహస్థుండు సాత్త్వికతపస్వి
దేవతాబ్రాహ్మణాతిథులఁ బూజించుట, నన్నంబు నిడుట క్షుధార్తులకును
శరణం బగుటఁ బాంధజనులకు సంతృప్తి, గలిగించుటను జంతువులకు నెల్ల

గీ. మహిత మైనది సర్వాశ్రమములకంటె, నొకగృహస్థాశ్రమంబ దానికి సమాన
మైనయాశ్రమ మొండు లే దందువలన, నది సమస్తాశ్రమముల జ్యైష్ఠ్యంబు వడసె.

వ. గృహస్థాశ్రమంబునం జేయంబడుసాత్త్వికతపోదానవ్రతనియమంబులచే ధర్మంబు
సాధితం బగు. తద్ధర్మంబున నర్థకామమోక్షంబులు సిద్ధించు. 282

గీ. దేవతలకును మేదినీదేవతలకు, నతిథులకును నశేషపుణ్యంబులకును
నాశ్రయీభూత మగుగృహస్థాశ్రమంబు, తీర్థములలోన నుత్తమతీర్థ మబల.

వ. దేశకాలపాత్రంబుల నెఱింగి చేయుదానంబు సర్వోత్తమంబు. శతానీకుండు దానంబు
వలన స్వపుత్రులచే నరకంబునుండి యుద్ధరింపంబడియె. 284

క. కామింపఁ గాయశుద్ధిని, గామించు నఘక్షయంబుఁ గామించును బు
ణ్యావిర్భావము దానము, దేవి తదీయోపకృతులు తెలుపంజాలన్. 285

వ. మాతృహత్యారాజహత్యామహాపాపదూషితుండగుపరశురాముండు పితామహబోధిత
తులావృషభదానంబు గావించి పాపనిర్ముక్తుం డయ్యె. అభక్ష్యభక్షణభ్రూణహత్యా
గురుతల్పగమనానృతభాషణాయాజ్యయాజననిందితధనప్రతిగ్రహసాధుపీడనధర్మ నిందా
కృతఘ్నతావిశ్వాసఘాతుకత్వాదినానాపాపదూషితులును దానంబునఁ బావనత్వముం
జెందుదురు. 286

ఆ. అన్యధనముచేత నైనను సురలను, బ్రాహ్మణులను దృప్తిపఱచువాఁడు
నరకలోకదర్శనముమాత్ర మొనరించి, తిరిగివచ్చి పొందుఁ బరమపదము. 287

గీ. దానమున నెందఱెందఱో దగ్ధపాపు, లగుచు వైకుంఠమునను నాయంతికమున
బ్రహ్మలోకంబునందు స్వర్గంబునందు, నున్నతస్థానములు గొని యున్నవారు. 288

—: గల్లికామహానదీమాహాత్మ్యము :—

సీ. కలదు పార్వతి గల్లికామహానది యొండు, స్థిరనది యుత్తరదిక్ప్రభూత
తద్దర్శనమున స్వేదజము లుద్భిజ్జము, లండజంబులును జరాయుజములు

పుణ్యరూపంబులఁ బొందు దాని స్మరించి, నంతనె యడఁగారు నఘము లెల్లఁ
గలవు సాలగ్రామశిల లందు విష్ణుద, శావతారస్వరూపాంకితములు
గీ. మఱియు నిరువదినాల్గునామముల నొప్పు, విష్ణుశిలలును శ్రీమహావిష్ణుశిలయు
నందు సంభూతి నొందె నారాయణుఁడు, నిత్యమును దత్తటంబున నిలిచియుండు.
వ. మఱియును నందు ననేకసాలగ్రామదివ్యమూర్తు లావిర్భావంబు నొందె. 290
క. అది గంగావేణీసమ, నది దానిమహత్త్వ మజుఁడు నా కెఱిఁగించెన్
సుదతీమణి యే మని చె, ప్పుదు నొసఁగును స్పర్శమాత్రమున నది ముక్తిన్.
సీ. నే నచ్చటికిఁ బోయి నియతంబుగను బ్రతి, సంవత్సరమును నాషాఢమందు
గల్లికానదిలోనఁ గావించి స్నానంబు, దామోదరునిసన్నిధానమందుఁ
దారకంబును నిరంతరమును జపియించు, చుండుటచే వైష్ణవుండ నైతి
నచ్చోట మరణించినట్టివారికిఁ గల్గు, శంఖచక్రములు భుజంబులందు
గీ. గల్లికాసమతీర్థంబు గానరాదు, ద్వాదశీవ్రతతుల్యవ్రతంబు లేదు
కానఁగా రాఁడు విష్ణుసమానుఁ డైన, దేవుఁ డెందును నిందు సందియము లేదు.
క. ఏతన్నదీమహత్త్వము, చేతోమోదంబు గదురఁ జెప్పెడివారల్
శ్రోతలును విగళితాఘులు, పాతకు లయి విష్ణుపదముఁ బడయుదురు తుదిన్. 293
వ. మఱియును నిం కొక్కముఖ్యవిషయంబు చెప్పెద వినుము. 294

—: ఋషిపంచమీవ్రతమాహాత్మ్యము :—

గీ. ఒక్కనాఁ డే నుపేంద్రునియొద్ద కరిగి, యచ్యుత వచింపు మొక్కపుణ్యవ్రతంబు
ఘోరపాతకవిధ్వంసకారకంబు, నావుడు జనార్దనుం డిట్లు నాకుఁ దెల్పె. 295
సీ. శర్వ పూర్వము దేవశర్మ నా నొక్కబ్రా, హ్మణుఁ డుండె మేదినీమండలమున
నారత్నగర్భాసుధాశనుం డొకదివ, సంబున నిజపితృశ్రాద్ధ మగుట
సాంగవేదాధ్యేత లగువిప్రవర్యులఁ, బూర్వదినంబున భోక్తలు గను
నియమించి మఱునాఁడు నిజపత్ని పాకంబు, చేయ శ్రాద్ధక్రియ చేసి పిదప
గీ. జ్ఞాతులకు బాంధవులకు భోజనము వెట్టి, తాను భుజియించి కూర్చున్నతఱిని వచ్చి
యొక్కశుని తద్గృహంబున నున్నవృషభ, మును గనుంగొని దానితో ననియె నిట్లు.
గీ. నాథ నీతండ్రిశ్రాద్ధదినమున మున్ను, నేను ఋతుమతి నై జ్ఞానహీన నగుటఁ
బాక మొనరించుటను జేసి ప్రాప్తమయ్యె, నీశునీరూప మిది నాకు నెట్లు తొలఁగు.
క. నే నేనాఁటికి నింకన్, మానవజాతిని జనింతు మత్కర్మంబుల్
బో నడఁచువాఁ డెవండును, గానంబడఁ డంచు నేడ్చెఁ గన్నీ రొలుకన్. 298
సీ. అంతట దానియే డ్పాలించి వృషభంబు, ప్రేయసి నే నేమి చేయువాఁడ
నజ్ఞానదశను నీ వాచరించినపని, కవివేకమునను నే ననుమతింప

సకుమారా రె నా కీవృషభజన్మ మీనాఁడు, కలిచినపం ఢ్లుండొ గెలిచినట్ల
బంధింపఁబడి నేను బడియుంటిఁ జండాల, పంబులోఁ జొంగెలువారి నోట

గీ. నాలనరాజుఁడు బంధుసంతతుల నెల్లఁ, దృప్తిపఱచియు నా కింత తృణము నైన
జలము నైనను నిడఁడాయెఁ జలిపినట్టి, పాపము సహింపలే నన్నుఁ బాసి చనునె.

క. అని దీనంబుగఁ బల్కుట, యును విని యా దేవశర్మ యుభయవచనముల్
తనజననీజనకులె యవి, యనుకొని తదవస్థ కాత్మయందు వగచుచుఁన్. 300

సీ. చని వసిష్ఠాశ్రమమునకు శీఘ్రంబుగాఁ, బ్రణమిల్లి యమ్మునిపాదములకుఁ
దనకుఁ గల్గినదుఃఖమును జెప్పి పితృతార, ణోపాయమును వేడ నొక్కమొగిని
గని యోగదృష్టి నమ్ముని యంతయును మహీ,సుర నిక్కము వచించె శునియు వృషము
తలిదండ్రులను నీవు తరియింపఁజేయంగఁ, దలఁపు గల్గిన నొక్కపలుకు వినుము

గీ. భాద్రపదశుక్లపంచమీపర్వకాల, మందు ఋషిపంచమీవ్రతం బాచరించి
ధారవోయుము వారికిఁ దత్ఫలంబు, నుడిగి దాన రజోదోష మొదవు ముక్తి. 301

వ. అని చెప్పుటయు దేవశర్మ సంతుష్టమానసుం డై తనగృహంబునకుం జనుదెంచి సతీ
యుతుం డై నిజమందిరంబున గోమయంబుచే మండలంబు గావించి యందుఁ గుం
భంబు స్థాపించి దానిపైఁ బాత్రంబు నుంచి యందు ఋషిధాన్యంబు సంపూర్ణంబుగాఁ
బోసి యందు యజ్ఞోపవీతంబును హిరణ్యఫలంబులను నునిచి కల్పోక్తవిధానంబున
నచ్చట సప్తర్షులను స్థాపించి యావాహనాదివిధులచేఁ బూజించి ఋషిధాన్యంబు
నైవేద్యం బొనరించి కథాశ్రవణంబు గావించి. 302

క. సప్తర్షులార మీరలు, తృప్తులయి మదర్చనమున నే నిచ్చెడియీ
సపార్ఘ్యంబులఁ గైకొని, ప్రాప్తరజోదోష ముడుపుఁ డవ్యాజకృపన్. 303

వ. అని ప్రార్థించి సప్తర్షులకును సపార్ఘ్యంబు లొసంగి తత్పూజాద్రవ్యం బంతయును
సప్తర్షిప్రీతి గలుగ భావించి ఘృతపాత్రదక్షిణాసహితంబుగా బ్రాహ్మణులకు సమ
ర్పించి యాదినంబు ఋషిధాన్యంబుచే నేకభక్తంబు గావించి స్వకృతఋషిపంచమీ
వ్రతఫలంబుఁ దనజననీజనకులకు ధారవోసె. 304

క. అంతట వృషభము శునియును, నంతర్ధానంబు నొంది యతిమానుషదే
హాంతరములతోఁ జనియె న, నంతపథంబునను దివికి నందఱుఁ జూడన్. 305

ఆ. చాన లీవ్రతంబు సలిపినయెడ రజో, దోష మెడలి గళితదురిత లగుచు
ననుభవించి యిహమునందు సౌఖ్యము లెల్లఁ, జనుదు రంతమందు స్వర్గమునకు. 306

క. అని తెల్పుటయును బార్వతి, విని సంతోషమును బొంది విశ్వేశ్వరునా
జ్ఞను గొని చనియెను మఱియును, వినిపించెదఁ గొన్నిధర్మవిషయము లింకన్ 307

సీ. నారదుఁ డొకనాఁడు ద్వారకాపురమున, కరుదెంచి కృష్ణుని నాదరమున
దర్శించి పారిజాతప్రసూనంబును, నర్పించి యతనికి నరిగె దివికి

నంతట మఱచి సత్యను గృష్ణుఁ డాపుష్ప, ములు తక్కునిజవధూటుల కొసంగె
నది విని సత్రాజిదాత్మజ యవనత, వదన యై లోలోన వగచు చుండ
గీ. నపుడు కృష్ణుఁడు చనుదెంచి యామెకడకుఁ, దన్ముఖంబును వీక్షించి తలిరుఁబోఁడి
నిన్నుఁ గన నేదొ చింతించు చున్నపగిదిఁ, గానఁబడు చుంటి వేమి తత్కారణంబు.

చ. అనవుడు సత్యభామ కనకాంబరధారి భవన్మనఃప్రియాం
గన ననుకొంచు నింతదనుకన్ ముద మొందుచు నుంటి నేను నా
మనమునఁ బారిజాతకుసుమంబుల నిచ్చెడివేళ నీవు నీ
వనితల కంతయున్ దెలిసె వాస్తవ మంచు వచించి యేడిచెన్. 309

ఉ. అంతటఁ గృష్ణుఁ డామెహృదయంబు గ్రహించి వరాంగి దీనికై
చింతిల నేల స్థాపనముచేసెదఁ జూడుము నీనికేతనా
భ్యంతరమందు నీసవతు లందఱున్ దలవంపు లేర్పడన్
వింతగఁ గల్పవృక్షమునె వేడుకమాటలు గావు నావుడున్. 310

ఆ. ప్రమద మొదవ సత్యభామ వికస్వర, వదనపద్మ యగుచు వంచికొనిన
శిరము నెత్తి చూచెఁ బురుషోత్తమునివంక, హరి ప్రసన్నహృదయుఁ డగుచు నంత.

క. స్మరియించె నెదను దార్క్ష్యుని, స్మరియించినమాత్రముననె చనుదెంచి ఖగే
శ్వరుఁ డెదుట నిలిచె శౌరికిఁ, బరమానందమున భక్తిపరవశుఁ డగుచున్. 312

—: కృష్ణుఁడు కల్పవృక్షంబుం దెచ్చుట .—

సీ. అంతటఁ బుండరీకాక్షుఁ డధిష్ఠించి, పతగనాథుని సత్యభామతోడ
సత్వరంబుగ నేఁగి స్వర్గంబునకుఁ గల్ప, వృక్షంబుఁ బెకలించి వేళ్లతోడ
దానిని దార్క్ష్యునిపై నుంచికొని యరు, దెంచుచుండఁగ నాదితేయు లెల్ల
శౌరితో యుద్ధంబు సలుపఁ జాలక భయం, పడు చుండఁగను వజ్రపాణి కనిసి
గీ. వైనతేయునిపై వైచె వజ్ర మెత్తి, గరుడుఁ డద్దానివ్రేటును సరకుగొనక
భిదురమునకు నగౌరవం బొదవు ననెడి, తలఁపుచే వీడి యొకయీఁక తరలిపోయె.

వ. తద్వజ్రప్రహారంబువలన మయూరకుక్కుటచాషము లనుమూఁడుపక్షులు జనియించె.

గీ. అల్లు కృష్ణుఁడు ద్వారక కరుగుదెంచి, సత్యభామ వసించెడిసదనమందు
ఘనముగను బాదుకొల్పె నాకల్పతరువు, సమధికానందమును జెంద సత్యభామ. 315

—: సత్యభామ తులాపురుషదాన మొసంగుట :—

సీ. అంతట నొక్కనాఁ డరుదెంచి సురమౌని, సత్యభామ వసించుసదనమునకు
నామెపై భవమును నభినుతింపఁ దొడంగ, నెద నమితామోద మొదవ సత్య
సంయమీశ్వర జన్మజన్మంబునకు నాకు, నిట్టికల్పద్రుమం బిట్టిపతియుఁ
బ్రాప్తింపఁగలుగునుపాయ మే దేనియు, నానతి మ్మనుడు ని ట్లనియె మౌని

గీ. బుద్ధిమతి యిచ్చునెడఁ దులాపురుషదాన, మామతిల్లు భవద్వాంఛితార్థసిద్ధి
యనుడు నాయమ నారదమునికొసంగెఁ, గల్పతరుకృష్ణులకుఁ దూఁగుకాంచనంబు.

క. అది గైకొని నిర్జరముని, త్రిదివంబున కరిగె నంత రెక్కొన హర్షం
బెదలోన సత్య యాత్మా, భ్యుదయమునకు మురిసికొనుచు నుత్సాహమునన్. 317

క. హరిని గనుంగొని ప్రాణే, శ్వర నిన్నొకమాట యడుగ వాంఛ జనించెన్
గరుణించి చెప్పెదవె నా, కరమర యిసుమంత లేక యడిగినదానిన్. 318

చ. అనవుడుఁ గృష్ణుఁ డి ట్లనియె నంబుజలోచన నానితంబినీ
జనములలోన నీవు గడుఁ జక్కనిదానవు ప్రాణమెత్తుగాఁ
గనుఁగొనుచుందు ని న్నెపుడుఁ గాంక్ష జనించిన నీకు దేని నై
నను నుడువంగ నీయఁగ నొనర్పఁగ నేను నిరాకరింతునే. 319

గీ. అడుగుము లతాంగి సంశయం బుడిగి నీవు, చెప్పఁదగనిది యనుచును జేయరాని
దనుచు నీయంగఁ గూడని దనుచు నొకటి, నీయెడల లేదు సుమి నాకు నిక్కవముగ.

—: సత్యభామాపూర్వజన్మ వృత్తాంతకథనము :—

సీ. అనుటయు సత్య యి ట్లనియె జనార్దన, మానవజాతిజ నైననాకు
దేవతలకును బ్రాప్తింపనిభాగ్యంబు, ప్రాప్తింప నేమి కారణము చెపుమ
సకలలోకారాధ్య చరణారవిందుఁడ, వీ వెఱుంగనిది యే దేనిఁ గలదె
నావుడుఁ జిఱునవ్వు నవ్వి గోవిందుఁడు, ప్రేయసి యట్లె చెప్పెదను వినుము

ఆ. మున్ను కృతయుగాంతమున నుండె మాయాపు, రంబునందు నొక్కబ్రాహ్మణుండు
దేవశర్మనామధేయుఁ డాత్రేయగో, త్రాన్వితుండు రవ్యుపాసకుండు. 321

క. అతనికి గుణవతి నాఁగను, సుత యొక్కతె యుండె సకలసుగుణగణాలం
కృత యగునాకన్యక నా, క్షితిదేవుఁడు చంద్రుఁ డనెడిశిష్యున కొసఁగెన్. 322

ఆ. అట్లు కన్య నొసఁగి యాబ్రాహ్మణుఁడు పుత్ర, రహితుఁ డగుట నాత్మగృహమునందె
కుతుకమునను నుంచికొనియె నల్లుని నాతఁ, డుండె మామయింట యోగ్యముగను.

సీ. అంతట నొక్కనాఁ డాయిర్వురును నిధ్మ, ములకు నై యొకవనంబునకు నేఁగి
చరియించుచుండ నచ్చట నొక్కరాక్షసుం, డరుదెంచి వారల నాహరించె
నపుడు వారికిఁ బ్రాప్తమయ్యె వైకుంఠంబు, భాస్కరోపాసనాఫలము గాఁగ
నన్నె పొందుదురు వైష్ణవశైవగాణప, శాక్తేయసౌరులు శాశ్వతముగ

గీ. శక్తిశివవిష్ణుగణపభాస్కరులు నాఁగ, నేనుపేళ్లను బరగుదు నే నొకండ
వారు నాకంటె భిన్నులు గారు దేవ, దత్తుఁ డొకఁడె పుత్త్రాదిశబ్దములఁ గొనఁడె.

సీ. తరువాత గుణవతి తనతండ్రియును దన, భర్తయుఁ జచ్చినవార్త యెఱిఁగి
కన్నీరు గాల్వలు గట్ట నేడ్చుచు నేల, వ్రాలి వాతాహతరంభవోలె

దుఃఖించి దుఃఖించి తుదకు దుఃఖముచేతఁ, గలిగెడిలాభంబు గానఁబడమిఁ
దెలివి దెచ్చికొని వారలకుఁ గావింపంగఁ, దగినట్టికర్మ మంతయును జరిపి
గీ. నాపదంబులపై నెమ్మనంబు నిల్పి, కాయ ముడిగెడిదాఁకను గార్తికవ్ర
తంబు సేయుచు వృద్ధ నై తానమాఁడు, వేళ నొకనాఁడు గంగలో విడిచె మేను.
ఆ. అట్లు మేను విడిచి యామె యాక్షణమంద, కార్తికవ్రతాధికత్వమునను
దేవయాన మెక్కి దివ్యవైభవముతో, నేఁగుదెంచె మత్సమీపమునకు. 326
క. చనుదెంచినయాకాంతను, గనుఁగొనినక్షణంబునంద కలిగెను నాకున్
మనమున నమితప్రేమము, గని మాయిందిరయు నొందఁగను విస్మయమున్.
సీ, అంతట బ్రహ్మాదు లరుదెంచి నను భూమి, నవతరింపఁగఁగోర నట్టితఱిని
నే నేఁగుదెంచితి నిలకు నాపరివార, వర్గంబు నాతోడ వచ్చె నిటకె
త్వత్పిత యైనసత్రాజిద్వసుంధరా, ధీశ్వరమాళియె దేవశర్మ
యాదవగణమె నాయతిముఖ్యసహచర, సంఘ మక్రూరుండె చంద్రశర్మ
గీ. గుణవతివి నీవె త్వద్గృహాంగణమునందు, నిప్పు డుండినకల్పమహీరుహంబె
మున్ను నాయాలయద్వారమునను నీవు, మొలక లెత్తంగ నాఁటినతులసి చూవె.
సీ. మఱియును గార్తికమాసంబునను నీ వొ, నర్చినదీపదానంబువలనఁ
జేకుఱె నీ కిట్టిసిరలక్ష్మి పతిరూప, మున నన్ను భావించి మనములోన
నర్చించుటను గార్తికాచరితవ్రత, ఫలము నా కైతివి భార్య వీవు
కార్తికవ్రతమును గావించుటను మేను, విడుచుదాఁకను దీక్ష విడువకుండఁ
గీ. కలుగ దిఁక నెప్పటికిని నిక్కముగ నీకు, మద్వియోగంబు కార్తికమాసమందు
నాచరించెడివ్రతమున కధ్వరములు, స్నానదానంబు లేవియు సాటి గావు. 329
క. అని తెల్పుటయును సత్యా, వనజేక్షణ యిట్టు లనియె వల్లభ నాకున్
వినిపింపుము విశదంబుగ, వినఁ గార్తికమాసమహిమ వేడ్క జనించెన్. 330

—: కార్తికమాసమాహాత్మ్యకథనము :—

వ. అని యడుగుటయు వికసితవదనుం డై కృష్ణుండు సత్యభామ కిట్లనియె. 331
సీ. శంఖాసురుం డనుజలధిసూనుఁ డొకండు, కలఁడు మున్నిలలోన ఘనబలుండు
వాఁడు జయించి దేవతల నెల్లను దత్త, దధికారపదముల నాక్రమింపఁ
దద్భయంబున దేవతలు స్వర్గమును వీడి, సరగునఁ జని మేరుశైలమునకుఁ
దద్గుహాభ్యంతరస్థలములందు వసించి, యారగించుచు నుండ హవ్యములను
గీ. శంఖుఁ డపుడు సుపర్వులశక్తి యుడుగ, ధ్వంస మొనరింపవలయు వేదముల ననుచు
నెంచి మదిలోనఁ జక్రి నిద్రించుతఱిని, నజుని దండించి వేదంబు లపహరించె. 332
క. అప్పుడు వేదము లన్నియు, నప్పలలాశనునిఁ జూచి యడలుచు జలధిన్
గుప్పునను దూఁకి ప్రాణము, లప్పటికిం గాఘుకొనుచు నచ్చట నుండెన్ 333

గీ. అంత శంఖుఁడు వేదంబు లబ్ధిలోనఁ, బహట గమనించి వానిని బట్టికొనఁగ
నాత్మలో నెంచి వారిధియందుఁ జొచ్చి, తోడఁగె వెదకంగఁ గడలినల్గడలయందు.
సీ. అప్పుడు వానియుద్యమము ధర్మమునకు, హాని గల్గించెడునట్టి దగుట
భయపడి బ్రహ్మ సుపర్వులతోఁ గూడి, కైకొని పూజోపకరణములను
గార్తికశుక్లపక్షమున నేకాదశి, నాఁ డేగి దానవాంతకునికడకు
నర్చించి తచ్చరణాంబుజంబుల యథా, విధిగ స్తోత్రంబు గావించు చుండ
ఆ. జలధిలోన శేషశయ్యాతలంబునఁ, బండి నిద్ర నొంది యుండుశౌరి
కనుఁగు విచ్చి చూచి వనజాసనాదుల, నిట్టు లనియె హర్ష మెసక మెసఁగ. 335
సీ. అజముఖ్యులార మీ రాచరించినపూజ, కపరిమితానంద మయ్యె నాకుఁ
గార్తికశుక్లపక్షసమాగతైకాద, శీనిశాతుర్యాంశ శేషమందు
మీరు మేల్కొల్పినతీరున సేవ సేసి, నను మేలుకొల్పిన నాకు వారె
పరమాప్తులైనట్టిభక్తులు సతతంబు, నుందురు వారు నే నుండుచోట
గీ. శ్రుతిహరుం డైనశంఖుని హతము చేసి, యిచ్చెదను మీకు వేదము లిదియుఁగాక
కార్తికకమాసమున నుదకంబునంద, విశ్రమింతుము నేనును వేదములును. 336
క. కావునఁ బ్రాతస్స్నానము, గావించినయెడలఁ గార్తికమున నఖిలయ
జ్ఞావభృథస్నానంబును, గావించినఫలముఁ జెందఁగలుగును వారల్. 337
సీ. కార్తికవ్రతమును గావించువారిని, నాకడఁ జేర్పు మంతమున శక్ర
కార్తికవ్రతమును గావించువారికిఁ, గలుగనీయకుము విఘ్నములు శమన
కార్తికవ్రతమును గావించువారికి, నర్థిల్లఁజేయు మన్వాయము వరుణ
కార్తికవ్రతమును గావించువారికి, నెన లేనియైశ్వర్య మిమ్ము ధనద
గీ. కార్తికస్నానదానాదికరులు మత్స, మాను లగుట జీవన్ముక్తులైనవార
ప్రతిదినంబును వారిదర్శనము చేయు, నట్టివారును నను జేరునట్టివార. 338
క. అని చెప్పి మత్స్యరూపం, బును దాల్చి యంతరిక్షముననుండి రయం
బునఁబడియె వింధ్యకానన, మున నర్ఘ్యము నొసఁగుకశ్యపునియంజలిలోన్. 339
సీ. అంతటఁ గశ్యపుం డామత్స్యమును గొని, తనకమండలుజలంబునను విడిచి
యాజలంబును మించి యది యుండుటను జూచి, యొక్కహ్రదంబున నుంచి దాని
హ్రదజల బును గూడ నది మీఱుటను జూచి, కడలిలోపల దాని విడిచిపెట్టె
నంత వృద్ధిని జెంది యామీనము పయోధి, యంతయుం గూడను నాక్రమించి
గీ. జలధిలో నున్నశంఖుని సంహరించి, తిరిగి నిజరూపమును దాల్చి సురలు వెంట
నరుగుదేరఁ బ్రయాగమునందుఁ జేరి, దర్శనం బిచ్చి బ్రహ్మర్షితల్లజులకు. 340
సీ. మునులార మీ రెల్లఁ జని శీఘ్రముగ సము, ద్రములోనఁ బడినవేదముల నెల్ల
వెదకి కైకొని రండు కొదువ లేకుండ నీ, రరుగుదెంచెడిదాఁక సురలతోడ

నుండు నే నీస్థలమం దని యానతీ, యఁగ మాను లెల్లఁ దదాజ్ఞ వడసి
చని నిజబ్రహ్మవర్చసబలంబునఁ జొచ్చి, యుదధిలో వేదముల్ వెదకి తెచ్చి
గీ. యచ్యుతున కప్పనముచేసి రది మొదలుగ, నెవ్వ రెవ్వరు తెచ్చిరో యెంత యెంత
యంత కంతకు వారు వా రైరి ఋషులు, దాన సంతుష్టహృదయుఁడై దానవారి.
గీ. వేదముల నిచ్చె బ్రహ్మకు విధి గ్రహించి, హర్షమున వాని నెల్లను నశ్వమేధ
యాగసంకల్ప మొనరించి యాక్షణంబ, సలిపె హయమేధమును జగచ్ఛ్లాఘ్యముగను.
సీ. హయమేధసవనాంతమందు దేవతలును, బ్రహ్మర్షులును మురారాతి కెరఁగి
స్వామి నిల్చె భవత్ప్రసాదంబుచేత వే, దములును దత్ప్రోక్తధర్మములును
గావించె బ్రహ్మ యాగంబు నిచ్చట వేద, విహితంబుగను లోకవిశ్రుతముగఁ
గావున నీప్రయాగము భుక్తిముక్తిప్ర, దం బగుతీర్థరాజంబు గాఁగ
గీ. వరము దయచేయు మని వేఁడ వాసుదేవుఁ, డమితసంతోషమున నట్లె యగుటకాక
ప్రాప్త మగును బ్రహ్మక్షేత్ర మనెడిప్రథయు, నీప్రయాగంబునకు నని యిచ్చె వరము.
సీ. రవివంశజుఁడు భగీరథుఁ డిచ్చటికిఁ దెచ్చె, గంగను దానితోఁ గలియు యమున
నివసించు బ్రహ్మతో నే నిచ్చటనె సుర, లందఱు మాతోడ నుందు రిటనె
యిచటఁ జేసెడిధర్మ మే దేనియును గోటి, గుణిత మై చేర్చు వైకుంఠమునకు
నిట శరీరత్యాగ మెవరు గావింతురో, వారు నాతనువులోఁ జేరువార
గీ. మాఘమున సూర్యుఁ డుండంగ మకరమందుఁ, గార్తికంబున రవి తులాగతుఁడు గాఁగ
నిచటఁ జేయఁ బ్రాతస్స్నాన మెవ్వ రేని, గర్భనరకనివాసంబు గనరు వారు.
గీ. అన్యతీర్థంబులందు దశాబ్దములకు, సిద్ధి నొందెడితప మిందు సిద్ధి నొందు
నొక్కదివసంబుననె దీనియుత్తమత్వ, మింతకంటెను మీకు నే నేమిచెప్ప. 345
క. ఈతీర్థము గనినంతనె, పాతక మంతయు రవిప్రభాస్పృష్టతమో
వ్రాతముకైవడి భస్మీ, భూతం బగు నింక నేల భూరివచనముల్. 346
క. అని చెప్పి యదృశ్యత్వం, బును బొందె లతాంగి వినుము పూర్ణంబుగ నే
వినిపించువాఁడఁ గార్తిక, మున నున్నమహత్త్వ మెల్లఁ బూజ్యం బగుటన్. 347
గీ. మాధవునిఁగూర్చి కార్తికమాసమందు, నాజ్యదీపంబు వెలిఁగించునట్టివారు
పడయుచుందురు సులువుగాఁ బ్రతిదినంబు, నశ్వమేధంబు గావించినట్టిఫలము. 348
సీ. మున్ను త్రేతాయుగంబున నుండె వైకుంఠుఁ, డనెడిబ్రాహ్మణుఁ డొక్కఁ డవనియందు
నతఁడు కార్తికమాసమందు గోవిందుని, యెదుట దీపము వెట్టి యింటి కరిగె
నటుమీఁద నొకయాఖు వరుదెంచి తద్దీప, వర్తిని ద్రోసి యావలకు మొదటఁ
ద్రావఁదొడంగఁ దత్పాత్రస్థితఘృతంబు, వెలుఁగఁజొచ్చెను వర్తి వెగ్గలముగ
గీ. నప్పు డాజ్వాల కాయాఖు వాఁగలేక, పఱవ నొక్కబిలంబులోపలికి దాని
గఱచె నం దున్నయొకభుజంగంబు విడిచె, నంతఁ బ్రాణంబులను నాఖు వాక్షణంబ.

సీ. అంతట యమదూత లరుదెంచి దానిని, బంధించి గట్టిగాఁ బాశములను
గొనిపోవఁగను నంతకునిసన్నిధికిఁ బ్రయ, త్నము సేయుచుండ న త్తరుణమందుఁ
జనుదెంచి శీఘ్రంబుగను విష్ణుభటులు త, త్పాశంబులను ద్రెంచి పాఱవైచి
దాని నుంచికొని విమానంబునను బోవఁ, గడఁగుచు నుండ నక్కాలభటులు
గీ. దూరముగ నిల్చి భయమున దోసిలొగ్గి, శౌరిభటులార యీపాపి సలిపినట్టి
పుణ్య మేమియొ విన మాకు బుద్ధి గలిగెఁ, జెప్పుఁ డని వేఁడ వారలు చిత్తగించి.
ఆ. కాలభృత్యులార యాలకింపుఁడు కార్తి, కమున విష్ణుమందిరమునఁ బెట్టి
నట్టిదీపవర్తి నాజ్యాశ నెగఁద్రోయ, దాన విష్ణుపదము దీని కొదవె. 351
గీ. ఇచ్ఛ లేకుండినను విష్ణుగృహమునందు, దీపము జ్వాలింపఁజేసినఁ బాపరాశి
యంతయు నశించి వైకుంఠ మబ్బు నింకఁ, దెలుపఁదరమె యిచ్ఛాకృతదీపఫలము.
క. ఘృతదీపముఁ బెట్టిన న, చ్యుతాలయంబునను జాలు నూర్జంబున స
ద్గతి గలుగ నేల వ్రతములు, క్రతువులు తీర్థాటనములు శ్రమదాయకముల్. 353
గీ. మాధవునిఁగూర్చి కార్తికమాసమందుఁ, బెట్టునెడ దీపమును వారు కట్టకడకు
నరుగుదురు విష్ణుపురమున కధ్వరములు, సలుపువారలు పోదురు స్వర్గమునకు. 354
క. అని చెప్పి యాఘువుం గొని, చని రచ్యుతధామమునకుఁ జయ్యన నంతన్
మనుశతము గడుచుదాఁకను, ననువుగ నాయాఘు వుండి యచటనె పిదపన్. 355
క. జనియించి మేదినీతల, మున రాజేంద్రునినిశాంతమునఁ గన్యక యై
కని నానాసౌఖ్యంబులు, గొన కొందెను విష్ణుకృపను గోలోకంబున్. 356
క. ధరణిని రాధాదామో, దరులను బూజించుచును వ్రతం బూర్జమునన్
దురితాత్ము లేని చేసినఁ, బరిశుద్ధిని జెంది ముక్తిఁ బడయుదురు తుదిన్. 357
క. భూమిసురున కూర్జంబున, నేమాత్రం బేని దాన మిచ్చిన రాధా
దామోదరసంప్రీతిగ, నామతిలెడిపుణ్య మక్షయము దాతలకున్. 358
గీ. ధాత్రిలోపల మున్ను త్రేతాయుగంబు, నందు సౌరాష్ట్రదేశమునందు శంక
రుం డనుజఘన్యజుం డొకఁ డుండె నుండె, నతని కొక గేహిని కలిప్రియాభిధాన. 359
సీ. ఆయింతి కాముకి యై యొక్కజారునిఁ, జేపట్టి వానితోఁ జేరి సతము
సరససల్లాపముల్ సలుపుచు నెవ రైనఁ, జూతు రేమొ యటన్నభీతి విడిచి
చరియించు చుండ స్వేచ్ఛావిహారంబు గా, నది చూచి తద్భర్త యాగ్రహింపఁ
గలహించుచును బ్రతిక్షణమును వానితో, నతనిపోరు మఱింత యధిక మగుట
గీ. మగని నెల్లని వధియింప మనసులోన, నాపె చింతించి యొకరేయి నతనియొద్దఁ
బండుకొని వాఁడునిద్రించు చుండుతఱిని, గత్తిచేఁ దచ్ఛిరంబును గత్తరించె. 360
క. అంతట నది యంతయు విని, సంతోషముతోడ వచ్చి జారుఁడు చెలి య
భ్యంతరము తొలఁగె మన మికఁ, గంతువిలాసములఁ దేలుకాలము వచ్చెన్. 361

క. అని పలికి జారవాక్యము, లను ధైర్యముగోల్పి యావిలాసినితోడన్
జననింద సరకుసేయక, యనుదినము సుఖాబ్ధి నోలలాడం దొడఁగెన్. 362

ఆ. అట్లు కొంతకాల మరుగంగ నొకనాఁడు, చనుచు జారుఁ డొక్కవనమునందుఁ
దనయఘంబు పండె నవ నొక్కపులినోటఁ, బడి తపించి విడిచెఁ బ్రాణములను. 363

క. ఆవార్త విని కలిప్రియ, భావమున విషాదవహ్ని భగ్గున మండన్
గావించి రోదనంబును, జీవితమున రోఁత పుట్టఁ జిట్టచివరకున్. 364

ఉ. పావనుఁ డైనభర్తకు సపర్య యొనర్పమి యట్టు లుండ నా
జీవిత మెల్లఁ గీడ్పడఁగఁ జేసితి హింసను జేతులార నా
కేవిధిఁ గల్గు నింక గతు లెక్కడ కేఁగుదు నేమిదిక్కు చీ
తావు లభించునే నిలువ దారిని దప్పినభ్రష్టురాలికిన్. 365

క. దైవము నా కేమని తాఁ, గావించును మేలు వేయికన్నులవాఁ డా
దేవుఁ డెఱుంగఁడె నే నీ, జీవితమునఁ జేసినట్టిచేఁతల నెల్లన్. 366

క. నలువురిలోఁ దలవంపులు, గలుగఁగ నే నిలను బ్రదుకుకంటెను బ్రాణం
బులు విడనాడుట మే లని, తలఁచి సమీపస్థనర్మదానది కరిగెన్. 367

గీ. అరిగి యట్లు కలిప్రియ యందు స్నాన, దానహరిపూజలను జేయుమానినులను
గాంచి వినయంబునను వారికడకుఁ జేరి, యడిగె మీచేయునది యేమొ నుడువుఁ డనుచు.

క. అంతట వారలు గని యా, కాంతను ని ట్లనిరి కార్తికవ్రత మిది జ
న్మాంతరకోటికృతాఘం, బంతయు నశియించు నేతదాచరణమునన్. 369

క. సోదరి యిట రాధాదా, మోదరులకుఁ బూజ సేయు చుంటిమి దీనన్
ఖేదవివర్జిత మగుదా, మోదరధామము లభించు నొప్పుగఁ దుదకున్. 370

క. అని పల్కుటయుఁ గలిప్రియ, విని మరణోద్యమము నుడిగి విహితవిధానం
బునఁ గార్తికమాసవ్రత, మును జేయుచు నుండె నొక్కపున్నమనాఁటన్. 371

గీ. అపుడు యమదూత లరుదెంచి యామెకడకు, వేచికొని యుండఁ గొనిపోవ విష్ణుభటులు
శీఘ్రముగ వచ్చి వారలఁ జెదరఁగొట్టి, యాయమను నుంచికొని వ్యోమయానమందు.

క. గోలోకమునకుఁ జని గో, పాలునిసన్నిధిని నిలుపఁ బద్మాక్షుం డా
శీలవతిని గరుణాద్య, జ్వాలికల నలంకరించి మన్ననచేసెన్. 373

సీ. ఆశ్వినపూర్ణిమ నారంభ మొనరించి, కార్తికపూర్ణిమ గడచువఱకుఁ
గావింపఁగాఁదగుఁ గార్తికవ్రతమును, విను తద్విధానంబు విశదముగను
వ్రతపూర్తిదాఁకను బ్రతిదినంబును శాస్త్ర, విహితంబు లగుకార్యవిధు లొనర్చి
దామోదరప్రీతిదాయకంబుగను సం, కల్పించి ప్రాప్తోదకంబునందు

గీ. స్నాన మొనరించి ధౌతవస్త్రములు దాల్చి, తిలకము ధరించి శార్ఙ్గినిఁ దులసిఁ గొలిచి
కార్తికపురాణకథ విని కట్టకడను, నాచరింపంగఁదగు వ్రతోద్యాపనంబు. 374

క. చను వర్జింపఁ బరాసన, మును బరశయ్యాయుఁ బరాన్నమును బరకాంతల్
మనుజుం డెపుడును నందును, జను నవి ముఖ్యముగ విడువ సతి యూర్జమునన్.

వ. కార్తికవ్రతస్థునకు క్షౌద్రసౌవీరకశ్రీఫలకళింగరాజమాషధాత్రీఫలబదరీఫలనారికేళజంబీరపర్యుషితాన్నభూమిజలవణద్విజవిక్రీతరసద్రవ్యపల్వలసలిలతామ్రపాత్రస్థగవ్యఛత్రాకనాళికహింగుపలాండుతిలతైలలశునగృంజనశిగ్రుశ్లేష్మాతకాలాబుకపిత్థపతితరజస్వలామ్లేచ్ఛకాకాదిస్పృష్టాన్న దూషితాన్న దగ్ధాన్న ద్విపాచితాన్న సూతకాన్న ద్వికాలాన్నంబులును శయ్యాస్త్రీసంగకాంస్యభోజనమధ్యమపత్త్రభోజనంబులును ప్రతిగ్రహంబును వర్జనీయంబులు. బ్రహ్మచర్యంబును దుర్యకాలభోజనంబును బత్త్రభోజనంబును స్థండిలశయనంబును గర్తవ్యంబులు. కూశ్మాండంబున ధనహానియును బటోలంబున శైణ్యంబును మూలకంబున బలహానియును బిల్వంబునఁ గళంకంబును నింబకంబునఁ దిర్యగ్యోనిజన్మంబును దాళంబున శరీరనాశంబును బృహతీఫలంబున హరిస్మరణాభావంబును నారికేళంబున మూర్ఖ్యంబును వృంతాకంబున సుతనాశనంబును మాషంబున దీర్ఘరోగంబును మాంసంబున బహుపాపంబును సంభవించుఁగాన నయ్యవి వర్జనీయంబులు. గోమాంసతుల్యం బగుటచేఁ దుంబియును గోవధతుల్యం బగుటచేఁ గళిందకంబును బాపకరం బగుటచే శింబియును బ్రహ్మఘాతిక యగుటచేఁ బరాతికయును నిషిద్ధంబు లయ్యె.

గీ. విష్ణుసంప్రీతికొఱకు నై విడువఁబడిన, యట్టిద్రవ్యంబును వ్రతాంతమం దొసంగి
యవనిసురునకు భుజియింపనగును బిదపఁ, గార్తికవ్రతి కద్దానఁ గలుగు మేలు. 377

క. కనుఁగొనినఁ గార్తికవ్రత, మును విధ్యుక్తముగఁ జేయుపుణ్యాత్ములఁ గా
లునిభటులు పాఱిపోదురు, కనునెడఁ బంచాననమును గజములుఁబోలెన్. 378

క. త్రికరణకృతంబు లగుపా, తకములు విలయంబు నొందుఁ దత్క్షణమునఁ గా
ర్తికమాసమహావ్రతకా, రకులను దర్శించునెడఁ బరాకున నైనన్. 379

వ. కార్తికమాసంబున నేకాదశి మొదలుకొని పూర్ణిమవఱకుం గలదినపంచకంబు విష్ణుపంచకంబు నాఁబడు. 380

క. ఆవిష్ణుపంచకంబునఁ, గావించినపుణ్యమునకుఁ గావు సమంబుల్
భూవలయదాన మిచ్చినఁ, గావించినఁ గ్రతుశతంబుఁ గలుగుఫలంబుల్. 381

క. రాధామాధవసేవా, రాధనము లొనర్చి జాగరము చేసినచో
మాధవపంచకమున ని, ర్బాధకముగ వాఁడు విష్ణుపదమున నుండున్. 382

ఆ. విష్ణుపంచకంబు వివిధపాపంబుల, నడఁచు తీర్థరాజ మగుట నందుఁ
జేయుస్నానమునను జేకుఱు సర్వతీ, ర్థావగాహజనిత మైనఫలము. 383

వ. విష్ణుపంచకంబులో విధివిధానంబున నేకాదశినాఁడు గోమయంబును ద్వాదశినాఁడు గోమూత్రంబును త్రయోదశినాఁడు గోక్షీరంబును జతుర్దశినాఁడు గోదధియును బ్రాశనంబు గావించి పూర్ణిమనాఁడు బ్రాహ్మణసమారాధనంబు చేసి నక్తంబునఁ బంచగవ్యప్రాశనంబు గావింపవలయు. 384

క. చలుపంగ నీవిధంబునఁ, గలుగనియెడ శక్తి పంచకవ్రతకారుల్
ఫలమూలహవిష్యాన్నం, బులలో నే దేని యొకటి భుజియింప నగున్. 385

క. తులసీదళములచేతను, జలుపుచు హరిపూజ వ్రతము సలిపినయెడలన్
జలజాతపంచకంబునఁ, గలుగును హరిరూప మావికలుపాత్ములకున్. 386

సీ. మున్ను త్రేతాయుగంబున దండకరుఁ డను, శూద్రుఁ డొక్కఁ డుండె క్షోణియందు
వాఁడు దుష్టాత్ముఁ డై వచియింపఁగారాని, కలుషంబు లన్నియుఁ జలుపు చుండ
నది సహింపఁగలేక యాతనిబంధువుల్, వెడలఁగొట్టిరి వాని విపినమునకు
నంతట వాఁ డుండి యడవిలోఁ బాంథులఁ, గొట్టి తద్ద్రవ్యంబు గొనుచు నుండె
గీ. నపుడు పాంథులు భయపడి యాపథంబు, విడిచి వేఱొకత్రోవను నడువఁదొడఁగి
రంత దండకరుండు క్షుధార్తుఁ డగుచుఁ, దిరుగుచును జేరె నొకనదీతీరమునకు. 387

ఆ. ఆళ్లు చేరి వాఁడు హరిపూజ నచ్చటఁ, జేయు చున్నజనులచెంత కరిగి
మ్రొక్కి వారి కెల్ల నొక్కముద్దయొసంగుఁ, డయ్యలార నాకు ననుచు వేఁడె. 388

సీ. అంతట వా రెల్ల నాతని వీక్షించి, పాపి యిద్యాది విష్ణుపంచకంబు
తినఁగూడ దీయేనుదినములలోపల, నన్నంబు నది నరకావహంబు
నినుఁ జూడఁ బాతకి వని తోఁచెడిని మాకు, నిట నుండఁదగదు నీ వేఁగు మింక
ననవుడు నాత్మలో ననుతాప ముదయింపఁ, దనగాథ వారికి వినిచి వాఁడు
గీ. శరణుచొచ్చినవాఁడ మీచరణములనె, యుద్ధరింపుఁడు నన్ను లేకున్న నిటనె
సలిపి యుపవాసములు ప్రాణములను విడుతు, నేను జేసినకొలలకు నిష్కృతిగను.

క. అని పలుకుటయును వారా, తనియనుతాపమును జూచి తత్పాతకముల్
సన విష్ణుపంచకవ్రత, మును జేయించిరి యథోక్తముగ నాతనిచేన్. 390

ఉ. అంతట వాని కాక్షణమునందె విచిత్రము గాఁగ వచ్చె దై
త్యాంతకరూపధేయ మపు డాతఁడు వ్యోమవిమాన మెక్కి య
త్యంతముదంబునన్ జనియె నభ్రపథంబున కెల్లవారలున్
వింతగఁ జూచుచుండ దివి నిండ దృగుత్పలమాలికావళుల్. 391

క. గురుదేవవిప్రగోవ్రతి, తరుణీనృపసాధునింద తగ దొనరింపన్
హరిపంచకవ్రతంబును, బరితోషంబున నొనర్చుభక్తాగ్రణికిన్. 392

వ. నరకచతుర్దశీదినంబునం దప్ప నితరదినంబులందుఁ దైలాభ్యంగస్నానంబు గావింపందగదు.

గీ. తగదు భాషింప విప్రనిందకునితోడ, వేదబాహ్యునితోడఁ గువాదితోడ
ఋతుమతీమ్లేచ్ఛపతితదుర్మతులతోడఁ, గార్తికవ్రతదీక్షాధికారయుతులు. 394

గీ. భుక్తిముక్తిప్రదంబు లై భూతలమున, నున్నక్షేత్రంబు లన్నియు నుండు నొక్క
కార్తికవ్రతకారునికాయమందుఁ, గానఁ దద్దర్శనము సర్వకలుషహరము. 395

గీ. ప్రభువునకుఁ గింకరులుఁబోలెఁ బాకశాస, నాదినిర్జరు లెల్లరు ననుపదంబుఁ
గార్తికవ్రతి కంగరక్షకులు గాఁగ, నుందు రాతఁడు విష్ణ్వంశయుక్తుఁ డగుట. 396

క. కనుఁగొన నూర్జవ్రతముం, బొనరించెడివాఁడు ప్రేతభూతాదులు భ
గ్గున మంట మండ మేనుల, వనరుచు శతయోజనములవఱకుఁ బఱచున్. 397

క. కలుగవు దుస్స్వప్నంబులు, నిలువవు రోగములు మేన నిఖిలాఘములున్
దొలఁగి చను నూర్జవిధులను, జలిపెడిపరమార్థవిదుల సందర్శింపన్. 398

వ. కార్తికమాసంబున ధాత్రీపత్త్రిచ్ఛేదంబు గావించె నేని నానానిరయవాసంబు చెందం గలుగు. కార్తికంబున ధాత్రీచ్ఛాయయందు భుజించె నేని యావత్సరంబును గావించిన యన్నసంసర్గపాపంబు నశించు. కార్తికంబున ధాత్రీమూలంబున శౌరి నర్చించె నేని సకలక్షేత్రంబులందును మాధవుని నర్చించినఫలంబు చేకూరు. 399

గీ. అర్యముఁడు తులాగతుఁ డైనతఱిని, సర్వతీర్థంబులును సర్వసవనములును
నిఖిలతాపసులును సర్వనిర్జరులును, ననిశమును నుండెదరు ధాత్రి నాశ్రయించి. 400

గీ. తులసియును నామలకితరుఫలము ద్వార, కోద్భవం బైనమృత్తికయును నెవండు
తాల్చు చుండునో మేన సంతతము వాఁడె, యవనియందు జీవన్ముక్తుఁ డనఁగఁ బరగు.

క. తులసీధాత్రీపాదప, ములనీడను బిండదానమును నొనరిచినన్
జలిపినను దర్పణంబును, గలుగున్ బితరులకు నూర్ధ్వగతులు సతంబున్. 402

వ. ఇంకఁ గార్తికవ్రతోద్యాపనవిధానముం జెప్పెద వినుము. కార్తికశుక్లచతుర్దశినాఁడు తులస్యుపరిభాగంబునఁ జతుర్ద్వారంబును బుష్పచామరశోభితంబును సుతోరణంబును నగుమండపంబు నేర్పఱిచి ద్వారంబులందుఁ బుణ్యశీలసుశీలజయవిజయు లనుమృణ్మయ ద్వారపాలకులం బూజించి తులసీమూలదేశంబున సర్వతోభద్రమండలంబు చతుర్వర్ణ చూర్ణంబులచేఁ గావించి దానిమీఁదఁ బంచరత్నఫలసహితం బగుకలశంబు నుంచి దానిమీఁద సువర్ణలక్ష్మీనారాయణులను లోకపాలురను స్థాపించి పూజించి యాదినం బెల్ల నుపవసించి రాత్రి జాగరంబు గావింపవలయు. 403

గీ. జాగరంబు నొనర్చెడిసమయమందు, నొనరిచిన నృత్యమును గాన మొనరిచినను
జలిపినను వాద్యఘోషంబు శార్ఙ్గి కథలు, చదివిన ననంతపుణ్యంబు సంఘటిల్లు. 404

వ. అట్లు జాగరంబు గావించి పూర్ణిమయందు దామోదరప్రీతికరంబుగా వ్రతోపదేష్ట యగుగురువును దత్కళత్రంబును సపత్నీకు లగుత్రింశద్బ్రాహ్మణులను గాని శక్తి లేని యెడ సపత్నీకుం డగునొక్కబ్రాహ్మణునిఁ గాని వస్త్రాలంకారాదులచే నర్చించి "యతో దేవా" యనుమంత్రద్వయంబుచేఁ దిలపాయసహోమంబు గావించి కపిలగోవును బూజాపురస్సరంబుగా గురువున కొసంగి యెల్లరకును సంతృప్తికరంబుగా భోజనంబు వెట్టి యావాహితసకలదేవతలకును దులసికిని బునఃపూజ గావించి గురువున కర్చాప్రతిమాదుల నెల్ల నొసంగి.

సీ. బ్రాహ్మణవంశవర్ధనులార నేను గా, వించినవ్రతము ఫలించునట్లు
శౌరి నాయెడ సుప్రసన్నుండు గాఁగను, నాపాప మెల్లను నాశ మొంద

సంఘటిల్లఁగను సత్సంతతియును వాంఛి, తార్థసిద్ధియును నిత్యమును నాకు
సతతంబు దేహావసానంబునను నేను, నివసింప విష్ణుసాన్నిధ్యమందు
గీ. ననుఁ బ్రసాదింపుఁ డనుచుఁ బ్రార్థన యొనర్చి, పంపి వారల నెల్లను భక్తితోడఁ
దాను భుజియింపవలయు బాంధవసమేతుఁ, డగుచు నూర్జవ్రతము చేసినట్టివాఁడు.
ఆ. సర్వతీర్థఫలము సర్వవ్రతఫలంబు, సర్వదానఫలము సంఘటిల్లుఁ
గార్తికవ్రతంబు గావించువారికి, నఖిలశక్తు లుంట నావ్రతమున. 407
క. ఈకార్తికమాహాత్మ్యము, వాకొనినను వినిన నట్టివారికి నైనన్
జేకుఱు నూర్జవ్రతఫల, మాకతమునఁ బాతకంబు లన్నియుఁ దొలఁగున్. 408
సీ. మును సహ్యశైలసీమను నుండెఁ గరవీర, మనుపేర నెసఁగు పత్తన మొకండు
తత్పురంబున నుండె ధర్మదత్తుఁడు నాఁగ, విష్ణుభక్తుం డైన విప్రుఁ డొకఁడు
కైకొని పూజోపకరణంబు లొకరేయి, హరిగృహంబున కతఁ డరుగుచుండ
నడిత్రోవలో నిల్చె నగ్న యై సాధ్వసం, బొదవఁ జేసెడిమేన నొకపిశాచి
గీ. ధర్మదత్తుఁడు వీక్షించి దాని నపుడు, త్రాసమును జెంది హరి నెదఁ దలఁచికొనుచుఁ
జల్లెఁ దులసీవిమిశ్రితజలము దాని, పైని నది దాన విగళితపాప యయ్యె. 409
గీ. అట్లు విగళితపాప యై యాపిశాచి, పొంది పూర్వజనుస్స్మృతి భూమిసురుని
పాదములమీఁదఁ బడి మ్రొక్కి భక్తితోడ, స్వీయవృత్తాంత మిట్లు వచింపఁదొడఁగె.
సీ. ద్విజవర్య సౌరాష్ట్రదేశంబునను భిక్షు, వను విప్రుఁ డొకఁడు మున్నవని నుండె
నతనికి నే భార్య నై యుంటి నాపేరు, కలహ నాదుర్బుద్ధికారణమున
నొకనాఁడు గూడ నే నొనరింపనై తిని, భాషణంబున నైనఁ బతికి మేలు
కలహించుచుండినకతన నే ననిశంబు, నాబాధ పడలేక నాధవుండు
గీ. వేఱొకర్తను బెండ్లి గావించుకొనఁగ, యత్న మొనరించుచుండ నే నది యెఱింగి
త్రావి విషమును విడిచితిఁ బ్రాణములను, నంతటను గాలకింకరు లరుగుదెంచి.
క. ననుఁ గట్టి పాశములచేఁ, గొనిపోవ యమాంతికమునకుం గాలుఁడు నే
నొనరించినపాపములకు, ననువుగ శిక్షింప భటుల కాజ్ఞాపించెన్. 412
వ. అంతట యమభటులు నన్ను నానాదుర్భరనరకయాతనలం గుడిపి విడిచిపెట్టుటయు నేను మత్కర్మశేషంబునం జేసి వల్గులీయోనియందు జన్మించి స్వవిష్ఠాద నగుచుఁ గొంతకాలంబును సూకరీయోనియందు జన్మించి విష్ఠాద నగుచుఁ గొంతకాలంబును బిడాలీయోనియందు జన్మించి స్వజాతాపత్యభక్షిణి నగుచుఁ గొంతకాలంబును గడపి పంచశతాబ్దంబులనుండి పిశాచదేహంబుతోడ క్షుత్పిపాసాపీడిత నై తిరుగుచు నొక్కనాఁ డొక వైశ్యునిదేహంబునం బ్రవేశించి దక్షిణదేశంబున కేతెంచి కృష్ణావేణీసంగమతీరంబునందు శివవిష్ణుభృత్యగణంబులచేఁ దచ్ఛరీరంబునుండి నిష్కాసిత నై దురపిల్లుచు నిచ్చోట దైవవశంబున నిన్నుం గాంచి త్వత్కరక్షిప్తతులసీజలసేకంబున విగళితపాప నై పూర్వజన్మస్మృతిం బడసి నావృత్తాంతం బంతయు విన్నవించితి.

నన్నీపిశాచదేహంబునుండి యుద్ధరింపు మని ప్రార్థింప ధర్మదత్తుండు కరుణార్ద్ర
హృదయుం డై. 413

గీ. దానతీర్థవ్రతాదికృత్యములచేత, నఘములు నశించు నట్టికార్యములు చేయ
నీపిశాచశరీరమం దెంచి చూడ, లేదు నీ కధికారంబు లేశ మేని. 414

గీ. కాన నీదుర్దశను నేను గాంచఁజాల, కునికి నూర్జవ్రతఫలంబు నొసఁగువాఁడ
నెడపి నీచేసినయఘంబు లెల్ల దీనఁ, గలుగుఁ బ్రేతత్వముక్తి నిక్కముగ నీకు. 415

సీ. అని చెప్పి తాను జేసినకార్తికవ్రత, మునను బ్రాప్తించినపుణ్యమందు
నర్ధంబు తదుపకారార్థంబు దానికి, శౌరి సాక్షికముగ ధారవోసె
నంతట నది పిశాచాకారముక్త మై, దివ్యరూపంబుతోఁ దేజరిలుచు
ధర్మదత్తునిపదద్వంద్వంబుపై వ్రాలి, ధర్మాత్మ నీదయ ధన్య నైతి
గీ. పాపపాథోధిమగ్న నై పార మొంద, లేక యల్లాడునా కీవు నౌక వైతి
వని నుతించుచు నుండంగ నంతలోన, వచ్చె విష్ణువిమానంబు వారికడకు. 416

వ. అంతట నావిమానంబునుండి దిగి వైకుంఠద్వారపాలకు లిరువు రాపుణ్యవతిని విమా
నంబుపై నధిష్ఠింపం జేసి యరుగ నుద్యమించుచుండ ధర్మదత్తుండు వారలకు సాష్టాంగ
ప్రణామంబు గావించుటయు వారలు సంతసించి బ్రాహ్మణోత్తమా నీవు కావించిన
కార్తికవ్రతపుణ్యార్ధభాగదానంబుచే నీకు ద్విగుణపుణ్యంబు ప్రాప్తించుటయె కాక
యీయంగనకుఁ బూర్వజన్మాంతరశతోద్భూతపాతకప్రణాశంబును విష్ణువిమానప్రాప్తి
యును దేజోరూపప్రాప్తియునుం గలిగె. దానంజేసి యీయమ వైకుంఠమందిరనివాస
భాగ్యంబునకుం బాత్రం బయ్యె. నీవును దేహావసానంబున నీయిరువురుభార్యలతోడం
గూడి విష్ణుసాన్నిధ్యంబునకుఁ జేరంగలవు. 417

క. ఆరాధితురో యెవరు ము, రారిని నిర్వ్యాజభక్తి యీమతిలంగన్
వారు కృతార్థులు తత్పద, సారసములఁ గొల్చువారు సన్నుతిపాత్రుల్. 418

వ. విష్ణుభక్తిచే ధ్రువుండు ధ్రువపదంబు నొందంగలిగె. విష్ణునామస్మరణంబుచే జయ
విజయులకు విష్ణుమందిరద్వారపాలకత్వముం బడయంగలిగె. 419

సీ. హరిభక్తినిరతుండ వగునీవు బహువత్స, రంబులు హరిమందిరమున నుండి
త్వద్వ్రతపుణ్యంబు తఱుగింగ నిలలోన, జనియించి సూర్యవంశంబునందు
దశరథుం డనియెడిధరణీధవుండ వై, భార్యాద్వయంబును బడసి మరలఁ
ద్వత్పుణ్యభాగపాత్రం బై నయీపద్మ, పత్త్రాక్షి మూఁడవభార్య గాఁగఁ
గీ. దనరుచును విష్ణునిఁ దనూభవునిగఁ బడయఁ, గలిగెదవు దేవకార్యసంఘటనమునకుఁ
బ్రాప్త మగుటకు నట్టిభాగ్యంబు నీకుఁ, గార్తికవ్రతపుణ్యంబె కారణంబు. 420

—: చోళభూపాలవిష్ణుదాసవృత్తాంతకథనము :—

వ. ఇంక మావృత్తాంతములు వినుము. 421

సీ. మున్ను కాంచీపురంబునఁ జోలుఁ డనియెడి, భూమిపాలుఁ డొక్కఁడు గలఁడు భువిని
దత్పరిపాలితత్వమున నాదేశంబు, చోలదేశం బనుస్తుతికి నెక్కె
నాతఁడు కావించి యధికదానంబులు, సలిపి సంఖ్యాతిగసవనములను
తామ్రపర్ణీనదీతటయుగ్మమునఁ బ్రతి, ష్ఠాపించెను సువర్ణయూపములను
గీ. నొక్కదినమున నాభూవరోత్తముండు, చని యనంతశయనమున కెనయ భక్తి
యోగనిద్రాప్రసక్తుఁడై యున్నపద్మ, నాభునకు దివ్యరత్నార్చనం బొనర్చి. 422
సీ. ఆదివ్యశోభ నాహ్లాదంబుతోడను, గనులారఁ గనుచున్నకాలమందు
విష్ణుదాసుం డనువిప్రుఁ డొక్కఁడు వచ్చి, సంస్తవం బొనరించి శార్ఙ్గధరునిఁ
దులసీదళంబులతోడఁ బూజింపంగ, నారత్నములదీప్తి యడఁగిపోయె
నంతట భూపాలుఁ డాగ్రహంబును బొంది, భూసురాధమ నీకు బుద్ధి లేదె
గీ. రాజమానంబు లగుదివ్యరత్నములను, దులసిచేఁ గప్పివైచితి తొలఁగ శోభ
యనుచుఁ గ్రోధంబు నొంది బ్రాహ్మణుఁడు రాజ, భక్తి నెఱుఁగనిమాటలు పలుకరాదు.
చ. అనవుడుఁ జోలుఁ డిట్లనియె నగ్రకులస్థుఁడ నన్నగర్వమొం
దినఫల మేమి నిస్స్వుఁడవు నీవు ప్రతిష్ఠ జనింప శౌరికే
మొనరుపఁగల్గె సమర్థుఁడవు యోగ్యత దేనికిఁ గూడ లేనినీ
వనఁదగనట్టిభాషణము లాడిన సైతుకె భక్తపుంగవుల్. 424
క. కనఁబఱచెద నాభక్తిని, గనుఁగొను మని పల్కి నిజనికాయ్యంబునకున్
జనుచెంచి ముద్గలాజ్ఞను, బొనరింపఁగ దీర్ఘసత్రమును దలఁచి మదిన్. 425
సీ. నియమించి యాచార్యునిగ ముద్గలుని వరి, యించి ఋత్విజులుగ ఋషిగణంబు
నారంభ మొనరించె నధ్వరంబును గయా, క్షేత్రంబునను స్తోత్రపాత్రముగను
విష్ణ్వాలయమునందె విష్ణుదాసుం డుండి, సలుపుచు ద్వాదశాక్షరజపంబు
చేయుచు నేకాదశీమాఘకార్తిక, వ్రతతులసీవనరక్షణములు
గీ. సలుపుచును విష్ణుపూజను సర్వవేళ, లందును స్మరించుచును హరి నాత్మలోనఁ
గడపఁదొడఁగెను గాల మాకరణి వార, లిరువురును విష్ణుకైంకర్యపరత నుండ. 426
వ. ఒకనాఁడు విష్ణుదాసుండు విష్ణునైవేద్యంబు గావింపఁ బాకంబు గావించి తత్పాకపాత్రంబు
నొకచోట నుంప నది యదృశ్యంబయ్యె. దాన నతఁ డాదినం బెల్ల నుపవసించి మఱు
నాఁడు పాకంబు గావింప నయ్యదియు గతదినంబునంబోలెఁ గానంబడ దాయె. 427
ఆ. అట్లు సప్తదినము లంతరించుటయును, బాకభాండ మతఁడు పద్మనాభు
నకు నివేదనం బొనర్పక భుజియింప, నట్టివాఁడు గాన నల్లె యుండి. 428
ఆ. ఎనిమిదవదినంబునను దానిమర్మంబుఁ, దెలిసికొనఁ దలంచి తేటపడఁగ
మున్నుపోలెఁ బాకమును జేసి తత్పాత్ర, మునిచి పాకవహ్ని యున్నకడనె. 429

క. దానిం గొనిపోవఁగ నెవఁ, డైనను నేతెంచు నేమొ యని కనిపట్టం
గా నెంచి పొంచియుండెను, గానంబడకుండ నొక్కకడ గోప్యముగన్. 430

సీ. అట్లు గోప్యంబుగా నతఁ డుండఁ బాకశా, లకు నేఁగుదెంచి పుల్కసుఁ డొకండు
తత్పాకభాండంబుఁ దా నెత్తుకొని శీఘ్ర, ముగఁ బోవుచుండంగ మున్నువోలెఁ
జూచి శల్యావశిష్టుం డైనవాని నా, విష్ణుదాసుఁడు కృప వెలయ మదిని
నుండు ముండు మటంచు నొక కేక వైచి యా, జ్యము గొనివచ్చుచున్నంతలోన

గీ. నంత్యజుఁడు పరువెత్తి వృద్ధగుట నొక్క, చోటఁ బడుటయు విష్ణుదాసుండు వచ్చి
వానిశ్రమ దీర విసరుచు వసనమునను, నొత్తుచును దత్పదంబుల నున్నతఱిని. 431

ఆ. అంత్యజుండు లేచి యట్టిట్టు లిలకించి, వణఁకుచుండ విప్రవరుఁడు తాత
వలదు భీతి లినుము వడ్డింతు నాజ్యము, నని ఘృతంబు వోసె నన్నమందు. 432

సీ. అంతట నంత్యజుం డతనిముందుఁ జతుర్భు, జంబులతో నిల్చి శార్ఙ్గి యగుచు
వత్స సంతసమయ్యెఁ ద్వద్భక్తి కెంతేని, యిచ్చితి నారూప మిపుడె నీకు
రమ్ము వైకుంఠలోకమ్మున కనుచు నా, విష్ణుదాసుఁడు చెంది విష్ణుకళను
నధివసించి విమానమం దెల్లరును జూడ, నద్భుతంబుగ దివి కరుగుచుండ

గీ. నతనిఁ గనుఁగొని దీక్షితుం డైన చోల, భూవరుం డాత్మలోపలఁ బొడమఁ జింత
స్వగురు వగుముద్గలునిఁ జూచి భూసుపర్వ, నీవు చేసినపని యెల్ల నిష్ఫలంబ. 433

సీ. నీయజ్ఞ చొప్పున నేనుఁ జేయుచునుంటి, నవధిశూన్యం బైనయధ్వరంబు
కావించుచుంటి నఖండాన్నదానంబు, హెచ్చుగా దక్షిణ లిచ్చుచుంటిఁ
గోరినవారికిఁ గోరినద్రవ్యంబు, వెదచల్లుచుంటిని గొదువ లేక
సలుపుచు నుంటిని సంఖ్యాతిగంబు గా, గౌరవార్హులకు సత్కారములను

గీ. శౌరి కాఁడాయె నాకుఁ బ్రసన్నుఁ డింత, వఱకును గనుంగొనుము భక్తి వలన విష్ణు
దాసుఁ డేఁగెడి వైకుంఠధామమునకు, సవము లెన్నేని భక్తికి సాటి గావు. 434

క. అని వచియించి స్వభగినీ, తనయుని నిజరాజ్యమందు స్థాపించి ప్రజా
వన మొనరింపఁగ మరలన్, జనుదెంచి మఖాగ్నిహోత్రసవిధంబునకున్. 435

—: ముద్గలవంశ్యవిశిఖత్వహేతుకథనము :—

సీ. అగ్నిప్రదక్షిణం బాచరించి తదగ్ర, భాగంబునను నిల్చి భక్తితోడ
దేవ జనార్దన స్థిరముగా నామదిఁ, బాదుకొల్పుము భవత్పాదభక్తి
యని పల్కి మూఁడుమా ర్లాశుశుక్షణిమధ్య, మున దూఁకె నది చూచి ముద్గలుండు
క్రుద్ధుఁ డై తనసిగ కోసి పాఱఁగవైచె, శిఖలోనఁ దనమాట చెల్లకునికి

గీ. నప్పు డాయగ్నికుండంబునందు శౌరి, పొడమి చోలుని స్వవిమానమునను నుంచి
కొని ముదంబున నేఁగి వైకుంఠమునకు, నాత్మసారూప్యమును వాని కపుడె యొసఁగె.

గీ. అదియె మొదలుగఁ జోలదేశాధిపతుల్లు, రాజభగినీసుతులుగ నేర్పడిరి ముద్గ
లాన్వయులు విశిఖులుగను నైరి విష్ణు, దాసవోలవసుంధరాధవుల మేము. 437

ఆ. విష్ణుభక్తివలన విష్ణుధామంబును, జెంది తొల్చితిమి సుశీలపుణ్య
శీలనామములను శ్రీపతిమందిర, ద్వారపాలకప్రవరుల మేము. 438

ఆ. అని వచించుటయును విని ధర్మదత్తుఁ డి, ట్లనియెఁ బుణ్యవంతులార వినఁగ
జయవిజయులగాథ సర్వంబు జనియించె, వేడ్క నాకుఁ జెప్పుఁడు విశదముగను. 439

వ. అని యడుగుటయు ధర్మదత్తునకు సుశీలపుణ్యశీలు లి ట్లనిరి. 440

—: జయవిజయవృత్తాంతకథనము :—

సీ. తృణబిందుసుత యైనదేవహూతికిఁ గర్ద, మునిదృష్టిసంపర్కమునను మున్ను
గలిగిరి జయుఁడు నాఁగను విజయుండు నాఁ, గను గపిలుండు నాఁ దనయు లిలను
నందులో జయవిజయాహ్వయు లిరువురు, హరిని గొల్వఁ దొడంగి రద్భుతముగ
నటు లుండ నొక్కనాఁ డధ్వరం బొనరింపఁ, దలఁచి మరుత్తభూధవుఁడు పిలువ

గీ. వార లిరువురుఁ జని తత్సవమున కందు, జయుఁడు బ్రహ్మపదంబు యాజకపదంబు
విజయుఁడును బొంది మఖమును విధియుతముగఁ, బూర్తి గావించి రంతట భూవరుండు.

ఆ. తత్తదర్హమైనదక్షిణ లర్పించి, గౌరవమునఁ బనుప వారు మరల
వచ్చి స్వాశ్రమమున కచ్చోట వేర్వేఱ, సలుప నెంచి విష్ణుసవనములను. 442

వ. అమ్మరుత్తుం డర్పించినద్రవ్యంబును బంచికొనఁ దలంచుటయు నందు జ్యేష్ఠుం డగు జయుండు తద్ద్రవిణంబు రెండు సమానభాగంబులు చేసి యొక్కభాగంబు దానును మఱియొక్కభాగంబు విజయుండును గ్రహియించునట్లు నిర్ణయింప విజయుం డాదుల కియ్యకొనక తన కుపలబ్ధం బయినధనంబు దానును జయున కుపలబ్ధం బయినధనంబు జయుండును గ్రహించునట్లు నిర్ణయించె. 443

ఆ. అంత జయుఁడు వాని కడ్డుమాటాడంగ, నాడె విజయుఁ డతని కడ్డుమాట
యొకనిమాట పొసఁగకుండుట నొకనికి, వారి కిరువురకు వివాదమయ్యె. 444

ఆ. ఆవివాద మంతకంతకు హెచ్చుగా, నపుడు జయుఁడు క్రుద్ధుఁ డై శపించె
గ్రాహరూప మొందఁగా విజయుని నంత, జయునిఁ దిట్టె వాఁడు సామజముగ. 445

సీ. పిమ్మట వారు ఖేదమ్ము నొంది యమర్ష, సముపలబ్ధము లైనశాపములకుఁ
బ్రార్థింపఁ దమస్వామి యగుహృషీకేశుని, నపుడు ప్రత్యక్షమై యచ్యుతుండు
మీరు నాభక్తులు మీమాటలు ఋతంబు, లవి ద్రిప్ప నాకును నలవి గాదు
ప్రహ్లాదవాక్యంబుఁ బట్టి స్తంభంబున, నావిర్భవింపంగ నయ్యె నాకు

గీ. నంబరీషునివాక్యంబు ననుసరించి, గర్భవాసశ్రమంబు నేఁ గాంచవలసెఁ
గనుక మీకర్మఫలముల ననుభవించి, రండు నాసన్నిధానమం దుండ మరల. 446

క. అని కరుణించి నిమేషం, బున నొందె నదృశ్యభావమును వా రంతన్
జనుదెంచి యిలకు నక్రము, గను సామజముగను బుట్టి క్ష్మాతలమందున్. 447

వ. గండకీనదీతీరంబునం జొచ్చి జాతిస్మృతి గలుగఁగాంజేసి శీఘ్రంబుగా విష్ణుసన్నిధికిం జేరం
బరితపించుచు నారాయణపాదపద్మనిష్ఠాగరిష్ఠభావంబుతోడఁ దిరుగుచుండ. 448

క. ఒకనాఁడు సామజము కా, ర్తికంబునను దీర్ఘమాఘస్నానాహతోఁడను గం
డకిలోనం జొరఁగ నచటనె, మకరంబును జొచ్చి పట్టె మాతంగాగ్రణుల్. 449

క. జలజాతుని స్మరియించుచు, సలిలములోపలికి లాగిసాగఁగ నంతన్
వెలుపలికి లాగిసాగెన్, దలఁచుచు వారణము హరిపదంబుల నెదలోన్. 450

ఆ. అట్లు లాగికొనుచు నన్యోన్యయుద్ధము గ్రాహ, వారణములు రెండు దారుణముగఁ
బోరు చుండఁ గడచిపోయెఁ గొన్నిదినంబు, లంత నేగి డస్సి యాఁగలేక. 451

ఉ. పోయె నశక్తిచే మదిఁ గలఁగూరిబలం బఖిలంబు చిత్తమం
దేయెడ నేని ధైర్యమొకయింత యిఁకన్ వశదామెఁ బ్రాణముల్
పోయెడివే, వచ్చు స్మృతి వేఁపుమనంగ దయాసముద్ర నా
రాయణ నీవె తప్ప నితరంబు శరణ్యము లేదు నాకికన్. 452

క. అని మొఱపెట్టుటయున్ విని, వనజాక్షుం డరుగుదెంచి వైళమ మొరం
బును మనిమిఁ జక్రిధారిని, గనికర మొదవంగఁ గేలఁ గరిని స్పృశించెన్. 453

క. అంతట గజనక్రంబులు, వింతగ జయవిజయు లగుచు విష్ణుపురికి న
త్యంతానందం బొదవఁగ, నంతరిక్షులయందుఁ జనియె నమరులు పొగడన్. 454

వ. ఆది మొదలుగా గజనక్రంబులు విముక్తంగా చినపలంబు హరిక్షేత్రం బనువిశ్రుతింజెందె

గీ. చక్రస ఘట్టమునఁ జేసి చక్రచిహ్నం, బులందులు నుండి యచట చక్రప్రసరము లెల్లఁ
దన్మహాక్షేత్రమహిమను గాంచ నరము గాదు, పుష్పులంబుగ వాక్రువ్వ బ్రహ్మకైన.

క. అని నుడివి కలనాకోతను, జనిరి విమానంబు నెక్కి సత్వరరీతిన్
వనజాక్షునిసన్నిధిన్, మనమున నాశ్చర్య మొదవ ముమ్మోదేవునకున్. 457

గీ. అంతటను గోతకాల మయ్యవనిసురుఁడు, మాధవధ్యాననిష్ఠావిమగ్నుఁ డగుచు
నుండి ధరలోన నిజసతియుగముతోడఁ, జనియె నంతంబునను విష్ణుసదనమునకు. 458

— కృష్ణావేణ్యాదినదీజన్మచరిత్రకథనము. —

సీ. మానిని చాక్షుషమన్వంతరమునం బూ, ర్వము సహ్యగిరిశిఖరమున బ్రహ్మ
సంకల్ప మొనరించి జన్నంబు సేయ మూ, ర్తమున రావించి నిర్జరుల నెల్ల
స్వజ్యేష్ఠసతి యైనస్వర రామి సుముహూర్త, సమయంబునకు సర్వసమ్మతముగ
నారంభ మొనరించె నాత్మకనిష్ఠమా, ర్గ యగుగాయత్రితో నధ్వరంబు

గీ. నంతటను స్వర యేతెంచి యజ్ఞదీక్ష, గొన్నగాయత్రి నచ్చోట నన్నుసకల
దేవతలఁ జూచి క్రోధసందీప్త యగుచు, నెఱ్ఱవాఱంగ నేత్రము లిట్టు లనియె. 459

— స్వర దేవతల నెల్ల నదులుగ శపించుట :—

గీ. పూజ్యపూజావ్యతిక్రమంబున నపూజ్య, పూజయును గలచోటను బుట్టు భీతి
మరణదుర్భిక్షములు మూఁడు మస్పదమున, నిలుపఁగను మీర లెల్లఁ గనిష్ఠ నగుచె.

క. అనుభావ్యము గాకుండఁగఁ, జన దేనాఁటికిని గూడఁ జలిపినకర్మం
బని పల్కి నిమ్నగలు గాఁ, గను శాపం బిచ్చె నచటఁ గిలవారలకున్. 461

గీ. అపుడు గాయత్రి రోషతామ్రాక్షి యగుచు, నోసి దుర్బుద్ధి శపియింప నుచిత మగునె
నీకె భర్తయె పరమేష్ఠి నాకుఁ గాఁడె, యగుము నీవును నిమ్నగ వని శపించె. 462

సీ. అంతట హరిహరాద్యఖిలదేవతలును, హాహానినాదంబు లామతిల్ల
దేవి మే మెల్ల నదీరూపములు దాల్ప, లుప్త మైపోవె ముల్లోకములును
శాపం బుడుపు మని స్వరను బ్రార్థింపంగ, నెదను బశ్చాత్తాప మొదవ నామె
యనిమిషులార యజ్ఞారంభమున వినా, యకునిఁ బూజింపమి నయ్యె నిట్లు

గీ. కాని నావాక్కు తిరుగదు గాన మీరు, స్వాంశములచేత నిమ్నగ లగుఁడు పొందు
స్వాంశముల నేను గాయత్రి యాపగాత్వ, మొందె సావిత్రి యనుఖ్యాతి నొందఁగలము.

వ. అని వచియించి యూరకుండుటయు నంత స్వస్వాంశంబులచే విష్ణువు కృష్ణానదీత్వంబును మహేశ్వరుండు వేణ్యానదీత్వంబును బ్రహ్మ కకుద్మతీనదీత్వంబును నిర్జరు లెల్లరును బహువిధనదీరూపంబులనుం బడసి సహ్యాద్రిశిఖరంబునుండి పూర్వవాహినులుగను దత్పత్నులు స్వాంశంబులచేఁ బశ్చిమవాహినులుగను బ్రవహింపం దొడంగిరి. 464

గీ. అందుఁ జేసెడిస్నానదానాదు లెల్లఁ, గార్తికంబున సంతృప్తి గలుగఁ జేసి
త్రిదశసంతతులకు నుద్ధరించు నరుల, నమితపుణ్యఫలప్రదాయకము లగుట. 465

గీ. భూరుహములందుఁ దులసియు ద్వారకాపు, రంబు క్షేత్రంబులందు మాసంబులందుఁ
గార్తికము తిథులందు నేకాదశియును, మత్ప్రియంబులు తత్సేవి మత్ప్రియుండు.

గీ. మత్ప్రసాదంబు గలుగుట మత్ప్రియుండు, బ్రహ్మహత్యాదిఘోరపాపముల కేని
యంతకున కేని భీతిల్ల నట్టివాఁడు, వాస్తవముఁ జెప్పితిని నీకు వారిజాక్షి. 467

చ. అనవుడు సత్యభామ మనమందు జనింపఁగ సంప్రమోద మి
ట్లనియెను బ్రాణనాథ కలహాంగనకున్ బరదత్తపుణ్యముల్
గొనుటను విష్ణుధామ మొడఁగూడెను దత్తము గానిపుణ్య మే
యనువున నైన రాఁగలదె యావిషయంబు వచింపు మంతయున్. 468

—: అదత్తపుణ్యపాపప్రాప్తికథనము :—

క. అని యడుగుటయును గృష్ణుం, డెనయఁగఁ బ్రమదంబు మదిని ని ట్లనియెను భా
మిని దత్తంబులు గాకు, న్నను బుణ్యము పాతకమును నరులకు వచ్చున్.

వ. కృతత్రేతాద్వాపరయుగంబులందుఁ బుణ్యపాపభాగంబులను దేశగ్రామకులంబు లొందు కలియుగంబున సంసర్గంబు లేనియెడలఁ గర్తమాత్రంబ పుణ్యపాపఫలంబులం జెందు. సంసర్గాగతంబు లగుపుణ్యపాపంబులవిధంబు వినుము. మైథునంబువలనను నేకపాత్రభోజనంబువలనను బుణ్యపాపఫలార్ధంబును నధ్యాపనయాజనైకపంక్త్యశనంబులవలనఁ బుణ్యపాపతుర్యాంశంబును నేకాసనైకయాననిశ్వాసాంగస్పర్శంబులవలనఁ బుణ్యపాప

షష్ఠాంశంబును భాషణ స్తవంబులవలనఁ బుణ్యపాపదశమాంశంబును దర్శనశ్రవణధ్యానంబులవలనఁ బుణ్యపాపశతాంశంబునుం బ్రాప్తించు. పరనిందాధికార్యపై శున్యంబులవలనఁ బరకృతపాతకంబు దనకుఁ బ్రాప్తించుటయేకాక స్వపుణ్యంబు పరున కర్పితం బగు. పుణ్యకర్మకారికిఁ బత్నీభృతకశిష్యులు గాక పరుం డెవఁ డేని యప్రతిఫలంబుగా సేవ గావించినఁ దత్సేవానురూపంబుగాఁ దత్పుణ్యంబు నాతం డొందు. ఏకపంక్తియందుఁ బలువురు భుజించుచుండఁ బరివేషణలంఘనంబు గావించినవానిపుణ్యషష్ఠాంశంబు లంఘితునకుఁ బ్రాప్తించు. 470

సీ. స్నానసంధ్యాదు లొనరించుసమయమందుఁ, బరుని స్పృశియించునెడలను బరునితోడ
భాషణము చేయునెడలను బడయు వాని, నాత్మకృతపుణ్యషష్ఠాంశ మంబుజాక్షి.

గీ. ధర్మ మార్జించుకొనియెడితలపుత్రోడఁ, బరుల యాచించి ధనమును బడసి దానఁ
జేయునెడఁ బుణ్యకార్యంబుఁ జెందు ద్రవ్య, దాత తత్పుణ్యకర్మవిధానఫలము. 472

గీ. అపహరించి పరద్రవ్య మాచరించె, నేని పుణ్యక్రియలు దాన నించు కేని
కర్మఫలమును బొందఁడు కర్త గాన, నపహృతద్రవ్యునకె కల్గు నాఫలంబు 473

గీ. పరునిఋణమును దీర్పక మరణ మొందె, నేని ఋణమును గైకొన్నమానవుండు
పడయు నాత్మధనానురూపంబు గాఁగ, వానిపుణ్యఫలంబు ద్రవ్యప్రదాత. 474

వ. బుద్ధిదుండును ననుమంతయును నుపకరణప్రదుండును బలకరుండును బుణ్యపాపంబులందు షష్ఠాంశంబు వొందఁగలరు. 475

గీ. ప్రజలవలనను బ్రభువును భార్యవలనఁ, బతియుఁ బుత్రునివలనను బితయు శిష్య
జనమువలనను దేశికుండును గ్రహించుఁ, బాపపుణ్యక్రియా షష్ఠభాగములను.

క. పతి చిత్తానుగుణంబుగ, సతతము వర్తించుచును బ్రశాంతిమెయి నను
వ్రతియయి యుండుకళత్రము, పతిపుణ్యమునందు నర్ధభాగము నొందున్. 477

గీ. ఎవఁడు చేయించుచుండునో యితరహస్త,మునను బుణ్యంబులను వాఁడుపొందుసుకృత
ఫలములోపల నాఱవభాగ మొందుఁ, గర్త శిష్యుఁడు భృతకుఁడు గానియెడల. 478

గీ. వృత్తిభోక్త యొనర్చుసుకృతమునందు, వృత్తిదుఁడు షష్ఠభాగంబు నొనయుఁ దాను
వానిచేతను బరునకు నేని తనకు, నేని చేయింపకుండినయెడల సేవ. 479

వ. ఈయర్థంబున నొక్కయితిహాసముం జెప్పెద వినుము. 480

సీ. మును ధరిత్రీతలంబున నుండె నొక్కబ్రా, హ్మణుఁ డవంతీపురమం దతండు
బ్రాహ్మణధర్మవిభ్రష్టుఁ డై ధనము సం, పాదించి నీచకర్మములవలనఁ
గ్రయవిక్రయమ్ములు గావించుచును నొక్క, నాఁడు మాహిష్మతీనగరి కరిగి
నర్మదాతీరంబునను గార్తికవ్రత, మాచరించుచు నుండునట్టిజనులఁ

గీ. గాంచి యచ్చోట వారికిఁ గావలసిన, వస్తువుల నెల్ల నమ్ముచు వారివలనఁ
బొందుచును లబ్ధి తత్కార్యములను గనుచుఁ,గడపి యొకకొంతకాలంబు కార్తికమున.

గీ. పూర్ణిమాదినమందు గోభూసురార్చ, నమును నుద్యాపనమును ధర్మములు దాన
ములును సూర్యాస్తమయకాలమున నొనర్చి, నట్టిదీపోత్సవముఁ గనులారఁ గాంచె.
గీ. త్రిపురదహనంబు హరుఁ డొనరించినట్టి, తిథి యగుట నది యంచుఁ దత్తిథికొఱకు
నొనరుతురు భక్తు లెల్ల దీపోత్సవంబు, వానికిని నాకు భేదంబు లేనికతన. 483
క. హరునకు నాకును భేదముఁ, బరికల్పనముం బొనర్చుపాపులచే నా
చరితము లగుపుణ్యములకు, నరయంగ ఫలంబు లేమి నవి వ్యర్థంబుల్. 484
క. ఆవిధమున నచ్చోటను, గావించెడిపనుల నెల్లఁ గాంచుచు నాభూ
దేవుఁడు తిరుగుచు నుండం, గా విషధర మొకటి వానిఁ గఱచి యేఁగా చనెన్.
గీ. అంతటను నేలపైఁ బడి యతఁడు విడిచెఁ, బ్రాణముల నప్పుడేతెంచి యమునిభటులు
కట్టి పాశంబులను వానిఁ గదలకుండ, నీడ్చి కొనిపోయి కాలునియెదుట నిలుప. 486
ఆ. శమనుఁ డెఱిఁగివాఁడు సల్పినపాపము, లెల్లఁ జిత్రగుప్తుఁ డెఱుఁగఁజేయ
నానతిచ్చె భటుల కతనిదారుణనర, కాగ్నిలోనఁ గూల్ప నంత వారు. 487
క. ఆకలుషాత్మునిఁ గొని చని, యాకాశం బంట మంట లవరెడికుంభీ
పాకమునఁ ద్రోయ నయ్యది, జేకొట్ట సుపర్వు లెల్ల శీతలమయ్యెన్. 488
చ. అది కని ప్రేతనేత హృదయంబున భీతియు విస్మయంబు నె
గదురఁగ నేగుడెంచి క్షణకాలములో సమవర్తి యొద్దకున్
విదితము సేయ సర్వమును విస్మయ మొందె కృతాంతుఁ డేదియున్
మదికి స్ఫురింపకుంటయు నొనర్పఁగ ఖేదము నొందు చుండఁగన్. 489
సీ. ఆకాశముననుండి యరుదేర నారదుం, డర్చించి యమ్మౌని నంతకుండు
తనకుఁ గల్గినఖేదమును నివేదింపంగ, నవ్వి యి ట్లనియెను నారదుండు
సమవర్తి యేల విషాదంబు నొందెదు, కార్తికవ్రతపుణ్యగరిమ వినవె
కార్తికవ్రతమును గావించువారిద, ర్శనభాషణముల నా బ్రాహ్మణుండు
గీ. గతసకలకల్మషుఁడును నకామలబ్ధ, పుణ్యుఁడును నైన నకారణంబునను జేసి
గాసిపెట్టంగ నతని దక్షములు గావు, నరకములు వాస్తవముఁ జెప్పినాఁడ నీకు.
గీ. ఆర్ద్రశుష్కాఘముల నిరయమ్ములందు, యాతనలు పొందుకై వడి నార్ద్రశుష్క
పుణ్యములచేత సురలోకమున సుఖంబు, లనుభవించు నరుం డెవఁడైనఁ గాని. 491
వ. కామకృతపుణ్యపాపంబు లార్ద్రంబు లనియును నకామలబ్ధపుణ్యపాపంబులు శుష్కంబు లనియుం జెప్పంబడియె. అకామలబ్ధపుణ్యు లగువారలకు నిరయదర్శనమాత్రంబు పాపభోగం బగు. 492
క. అని చెప్పి తదనుమతి గొని, చనుటయు దివమునకు నంత శమనుం డావి
ప్రునియొద్ద కరిగి తనతప్పును సైఁపఁగ వేఁడి త్రిదివమున కరుగు మనన్. 493
ఆ. అతఁ డిట్టు లనియె నంతక నరకథా, మములఁ జూడ నాకు మది జనించెఁ
జూపు మవలఁ బోదు సురలోకమున కన, యముఁడు వాని కాస్థలములఁ జూపి. 494

—: చతురశీతినరకకథనము :—

వ. ఇది తప్తవాలుకనరకము. దీనిభేదంబు లాఱు. గురుదేవతాగోబ్రాహ్మణాగ్నులను బాదములచేఁ దన్నువారలపాదము లిందు దహియింపంబడు. మఱియు నతిథుల కన్ను మొసంగనివారును నిందు నిర్దగ్ధు లగుదురు. ఇది యంధతామిస్రనరకము. దీనిభేదంబు లాఱు. ఇందుఁ గామమోహితు లగువారు బాధింపంబడుదురు. ఇది క్రకచనరకము. దీనిభేదంబు లాఱు. ఇందుఁ బత్నీపుత్త్రాదులకు వియోగము గలిగించువారు ఛేదింపంబడుదురు. ఇది యర్గళనరకము. దీనిభేదంబు లాఱు. ఇందు మహాపాపులు ముద్గరగదాద్యాయుధనిహతు లగుదురు. ఇది కూటశాల్మలినరకము. దీనిభేదంబు లాఱు. ఇందుఁ బరధనదారాపహారులును బరవంచకులును మథియింపంబడుదురు. ఇది రక్తపూయనరకము. దీనిభేదంబు లాఱు. ఇందు నభక్ష్యభక్షకులును బరనిందకులును బిశునులును బాధింపంబడుదురు. ఇది కుంభీపాకనరకము. దీనిభేదంబు లాఱు. ఇందుఁ బాపాత్ము లెల్లరును దప్తతైలాదులచే నుడికింపంబడుదురు. ఈనలువదిరెండునరకంబులును నకామకృతం బగుశుష్కపాపంబుచేతను గామకృతం బగునార్ద్రపాపంబుచేతను ద్విగుణంబులై చతురశీతిసంఖ్యాకంబు లయ్యె. ద్వివిధ మగుపాపంబు ప్రకీర్ణం బనియు నపాంక్తేయం బనియు మలినీకరణం బనియు జాతిభ్రంశకరం బనియు నుపపాతకం బనియు నతిపాతకం బనియు మహాపాతకం బనియు సప్తవిధం బయ్యె. 495

గీ. కార్తికవ్రతిసంసర్గకారణమున, విగతపాపుఁడ వైతివి విప్ర నీకుఁ
గాంక్షితం బగునూర్ధ్వలోకమున కింక, నేఁగు మన దివ్యయానంబు నెక్కి యతఁడు.

క. చని యతులలోకమునకుం, గని యక్షత్వమును విబుధగణ్యుం డగుచున్
ధనయక్షుం డనునామం, బును బొందె కుబేరభృత్యముఖ్యుం డయ్యెన్. 497

వ. గాధిజుం డాతనిపేర నయోధ్యయందు మహాతీర్థంబు నెలకొల్పె. హరిజాగరంబును బ్రాతస్స్నానంబును దులసీసేవనంబును నుద్యాపనంబును దీపదానంబును ననుపంచాంగంబులచేఁ గార్తికవ్రతంబు పూర్తింజెందు. 498

సీ. అని పల్కుటయు సప్రహర్షంబుగను సత్య, భామ యి ట్లనియెను బ్రాణనాథ
కార్తికవ్రతి యేమి కావింపవలయునో, సంకటంబున నున్నసమయమందు
వచియింపు మది విన వాంఛ గల్గెను నాకు, ననవుడుఁ గృష్ణుఁ డి ట్లనియెఁ దన్వి
కార్తికవ్రతమును గావింపవలయును, బ్రతివత్సరము మహాఫలద మగుట

గీ. సక్రమంబుగఁ జేయంగ శక్తి లేని, పక్షమున వీలు గాకుండుపక్షమునను
మదభిధానంబుచే నపమార్జనమును, జేసికొని విప్రసంతృప్తి చేయవలయు. 499

గీ. బ్రాహ్మణులు మత్స్వరూపులు బ్రాహ్మణులకుఁ, దుష్టి గలిగిన నాకు సంతుష్టి గలుగు
నేను సంతుష్టి నొందితి నేని వ్రతము, సఫల మగు నంగహైన్యసంశయము లేక.

వ. పరదీపప్రబోధనపరిరక్షణంబులవలనను దీపదానఫలంబు చేకూరు. 501

గీ. ఎండులను వీలు లేకున్న యెడల విప్ర, గోవటాశ్వత్థవృక్షసంసేవనంబు
చేయవలయును దానను జెందు వ్రతము, సాంగతను లేనిచో వ్రతభంగ మొదవు.
గీ. అనుటయును సత్యభామ యి ట్లనియె నాథ, బోధివటవృక్షములను గోభూసురులకు
సమము సేసితి వంతటశక్తి వాని, లోన నుంటకుఁ జెపుము నిదాన మేమొ. 503

—: పార్వతి దేవతలను వృక్షములుగా శపించుట :—

సీ. అనవుడుఁ గృష్ణుఁ డి ట్లనియె నంగన మున్ను, క్రీడించుచుండ గౌరియును హరుఁడు
సహియింపఁ జాలక సమయవిలంబంబు, నమరు లెల్లరుఁ గూడి యగ్ని ననుప
నతఁ డేగుదెంచి క్రీడాంతరాయము సేయ, నద్దాని కీశ్వరుం డనుమతింప
నాగ్రహం బొంది కాత్యాయని శపియించె, నమరుల నెల్ల వృక్షములు గాఁగ
గీ. నంత బ్రహ్మాదు లేతెంచి యామెకడకుఁ, బ్రార్థన మొనర్ప వా రెల్ల స్వాంశములను
దరువు లగునట్లు కరుణించె గిరిజ యదియె, మొదలుగను భూరుహము లై రి త్రిదశు లెల్ల.
గీ. ఏను బోధిద్రుమంబుగ నీశ్వరుండు, వటముగఁ బలాశముగఁ జతుర్వదనుఁ డితర
విబుధు లెల్లరు బహువిధవృక్షములుగ, భూమినీఁదను వెలసితి మేమి చెప్ప. 505
క. కావునను వృక్షములకును, సేవింపం దగినమహిమ చేకూరెను మ
ద్భావమునఁ జలదళంబును, సేవించిన సకలకార్యసిద్ధులు గలుగున్. 506
క. శనివాసరమున మాత్రమె, చను నశ్వత్థమును ముట్ట సతి యీవిషయం
బును విస్మరింపకుము నాఁ, గను సత్రాజిత్తనూజ కౌతుక మొదవన్. 507
గీ. దేన యేకారణమున బోధిద్రుమంబు, ముట్టఁ గూడదో ప్రతిదినంబును వచింపు
మాలకింపంగ నభిలాష మయ్యె నచ్యుత, నెలయఁ జిఱునవ్వ మాధవుం డిట్టు లనియె.

—: అశ్వత్థస్పర్శయోగ్యవారకథనము :—

సీ. మానిని క్షీరాబ్ధి మథియించు చుండంగ, దేవాసురులు గూడి దీక్షతోడ
జనియించె మొదట జ్యేష్ఠాదేవి వికృతరూ, పముతోడ నావలఁ గమల పుట్టెఁ
గై కొనంగను నేను గమలను యత్నింప, వీక్షించి న న్నామె యిట్టు లనియె
నొనరించి పరిణయంబును ముందు నాయక్క, కవల నన్ను గ్రహింపు మంబుజాక్ష
గీ. యనుడు నుద్దాలకుం డనునవనిసురున, కిచ్చి జ్యేష్ఠను నేను గ్రహించినాఁడ
నవల లక్ష్మిని నంతట నాద్విజుండు, జ్యేష్ఠతోఁ గూడి స్వాశ్రమక్షితికిఁ బోయె. 509
సీ. అప్పు డచ్చట శిష్యులందఱు వేదాధ్య, యనము చేయుచు నుండ నాస్వనంబు
కర్ణకఠోరంబుగా నుండుటను జ్యేష్ఠ, యచ్చట క్షణ మేని యుండఁగలేక
వల్లభ నే నిందు వసియింప నిది నాకు, సమ్మతం బైనస్థలమ్ము గాదు
నావుడు నాబ్రాహ్మణప్రవరుఁ డామె, నీక్షించి యింతి నీ వెచట నుందు
గీ. వని యడుగ జ్యేష్ఠ యతని కి ట్లనియె నాథ, వేదఘోషంబు యజ్ఞదానాదివిధులు
దేవతాతిథిగురుపితృసేవనమును, జరుగుచోటులు నాకు నసమ్మతములు. 510

సీ. పరదారపరధనపరు లుండుభూములుఁ, గలహంబు జరిగెడినిలయములును
బ్రహ్మహత్యాదిపాపములు చేసెడిచోట్లు, మద్యశాలలు ద్యూతమందిరములు
విప్రుల సుజనుల వృద్ధుల నవమాన, పఱచుతావులు పాడుపడ్డయిండ్లు
నీతివిహీనులు నివసించునెలవులుఁ, బారిశుద్ధ్యము లేనిభవనములును
గీ. గోవధము చేయుచోటులు కుజను లుండు, నాలయములును దుర్భాష లాడునట్లు
ధర్మ మనుమాట నైనను దలఁప కుండు, జనులు గలధామములు నాకు సమ్మతములు.
క. అనవుడు నుద్దాలకుఁ డా, త్మను మిగులవిషాద మొంది తనకున్ నా మీఁ
దను నెనసినగౌరవమున, ననఁజాలక నోరు విప్పి యాయమ నేదియున్. 512
ఆ. ఆక్షణంబునందె యామెను దోడ్కొని, చనివనప్రదేశమునకు నొక్క
బోధివృక్షమూలమున నుండ నియమించి, మరల వత్తు ననుచు నరిగె నెటకో. 513
ఉ. అంతటఁ గొంతకాల మట నామె వసించి ఘవుండు రామిచే
నెంతటిదాఁకనున్ జడిసి యేడిచె గొల్లున మిన్నుముట్ట న
త్యంతకఠోరకంఠమున నయ్యది భార్గవి యాలకించి నా
చెంతకు వచ్చి చెప్పఁగినె చెచ్చెర నేను రమాయుతుండ నై. 514
సీ. అరుదెంచి యీయమదరికి జ్యేష్ఠాదేవి, శోకింపవల దీవు సుంత యేని
యశ్వత్థతరువు మదంశసంభూతంబు, గౌరవార్హం బెల్లవారలకును
దీనిక్రిందను నీవు స్థిరముగా నుండుము, శనివారమున భవత్సవిధమునకు
నియతంబుగను వచ్చు నీచెల్లె లగులక్ష్మి, స్పర్శార్హ మగు నాఁడు చలదళంబు
గీ. దాన నీకును నధికసమ్మాన మొదవు, నని ప్రసాదించి యేఁగితి నాక్షణంబ
కాన శనివారమునను తాకంగఁ జెల్లుఁ, జలదళము లక్ష్మి నాసించుజనుల కెల్ల.
క. ఈకథ నొరులకుఁ జెప్పిన, నాకర్ణించినను నిహామునందు విషాద
వ్యాకులులు గాక కడకున్, వైకుంఠము నొందఁగలుగువారల వారల్. 516
వ. అనుటయును సత్యభామ యమందానందముం జెంది కృష్ణానుమతినిఁ గార్తికవ్రతదీక్షం
గైకొనియె. 517
సీ. మునివర యింకను విను మూర్జమాహాత్మ్య, మునుగూర్చియడుగంగమును గుహుండు
హరుఁడు షణ్ముఖున కిట్లనియెఁ గుమార యూ, ర్జవ్రతంబున కిల సాటి లేదు
సర్వతీర్థంబులు సర్వదానములు స, ర్వమఖంబులును నొక్కప్రక్క నుంచి
యొక్కవైపున నుంచి యూర్జమాసంబును, దులఁ దూఁచితిని నేను బలముఁ దెలియ
గీ. నపుడు కార్తికమాస మున్నట్టికడకు, వంగె ములు దాన నేను దద్వ్రతసమంబు
లేవియును గా వనుచు నిశ్చయించుకొంటి, స్కంద తెలిపితి నీరహస్యంబు నీకు.
వ. కృతయుగంబు బ్రాహ్మయుగంబు త్రేతాయుగంబు క్షత్రియయుగంబు ద్వాపరయుగంబు
వైశ్యయుగంబు కలియుగంబు శూద్రయుగంబు. 519

ఆ. కానఁ గలియుగమున స్నానంబు గావింప, జంకుచుందు రఖిలజనులు దాని
గుర్తెఱింగినట్టికోవిదుఁ డొక్కఁడె, స్నాన మాచరించు జడియకుండ. 520

వ. కార్తికమాసంబునఁ బ్రాతస్స్నాన మవశ్యకార్యంబు. దాన నుత్తమలోకప్రాప్తి చేకూరు. స్నానంబు వాయవ్యం బనియు వారుణం బనియు బ్రాహ్మం బనియు దివ్యం బనియుఁ జతుర్విధంబుగాఁ జెప్పంబడియె. గోరజస్స్నానంబు వాయవ్యంబు. సాగరాదిస్నానంబు వారుణంబు. మంత్రస్నానంబు బ్రాహ్మంబు. మేఘాంబుభాస్కర స్నానంబు దివ్యంబు. 521

గీ. స్నానములలోన నుత్తమస్నాన మొక్క, వారుణము చూవె ద్విజులైనవారు మంత్ర
విహితముగ స్త్రీజఘన్యజవృద్ధబాల, షండులు విమంత్రముగఁ జేయ స్నాన మొప్పు.

గీ. ప్రథితియుఁ దపంబు విద్యయుఁ బాణిపాద, వాఙ్మనససంయమము గలవారె తీర్థ
ఫలము నొందుదు రన్యులు పడయలేరు, సలిపినను బుణ్యకర్మసంచయము నెల్ల.

ఆ. పడయలేరు తీర్థఫలము నీయేఁగురు, హేతునిష్ఠితుఁడును బాతకియును
సంశయాత్మకుఁడును శ్రద్ధావిహీనుఁడు, నాస్తికుఁడును బుత్ర వాస్తవముగ. 524

గీ. ఊర్జమాసంబు సర్వమాసోత్తమంబు, వైష్ణవము గాన సకలదేవతలు గూడ
నందు నివసింతు రత్తఱి నాచరించు, దానము లనంతసత్ఫలదాయకములు. 425

సీ. రోమకాలంబున సోముం డనుభవించుఁ, బొందును గుచకాలమందు వహ్ని
ఋతుకాలమున గ్రహియింతురు గంధర్వు, లద్దాన ఋతుమతి యైనకన్య
నిచ్చిన నది కీడుదెచ్చు గ్రహీతకు, దాతకుఁ దత్పితృవ్రాతమునకు
నష్టవర్షీయ కన్యను శ్రోత్రియున కిచ్చి, నందునఁ గలఫలం బెందు లేదు

గీ. కాన శాస్త్రంబు గమనించి కార్తికమునఁ, గన్యకాదాన మొనరింపఁగలిగి రేని
యుభయవంశంబులను వార లుద్ధరించి, పడయుదురు తాము శాశ్వత బ్రహ్మపదము.

గీ. ధేనువు సరస్వతియును ధాత్రియును మూఁడు, సమఫలంబు గలట్టిదానములు గానఁ
గార్తికంబున వాని సక్రమము గాఁగ, నిచ్చువారలపుణ్యంబు నెన్నఁ జాల. 527

వ. శతవృషభదానంబు గోసహస్రదానసమంబు. ఏకయానదానంబు దశవృషభదానసమంబు. ఏకహయదానంబు దశయానదానసమంబు. ఏకగజదానంబు సహస్రహయదానసమంబు. ఏకస్వర్ణదానంబు సహస్రగజదానసమంబు. ఏకవిద్యాదానంబు స్వర్ణసహస్రదానసమంబు. ఏకభూదానంబు కోటివిద్యాదానసమంబు. ఏకాన్నదానంబు సహస్రభూదానాధికంబు. 528

క. అన్నమె యాధారం బై, యున్నది విశ్వముల కెల్ల నూర్జదినములం
దన్నప్రదానమున నగు, పున్నెమునకు సాటి గావు పుణ్యము లెవియున్. 529

వ. కార్తికమాసంబునఁ దిలధేనురజతవస్త్రరత్నకంబళతూలికాపాదరక్షౌఘత్రిప్రచ్ఛాదనపటఫలాదిదానంబులును సద్గతిదాయకంబు లగు. కార్తికంబునఁ బరాన్నంబు వర్జించెనేని ప్రతిదినకృచ్ఛ్రఫలంబును జాంద్రాయణఫలంబునుం బ్రాప్తించు. కార్తికంబునఁ

దైలమధుసేవనకాంస్యభోజనమైథునమాంసభక్షణసురాపానంబులు గావించె నేని రాక్షసయోనిం బొంది షష్టిసహస్రవర్షంబులు విష్ఠానరకంబు ననుభవించి పిదప గ్రామసూకరంబుగా జన్మించు. 530

గీ. ఇందుసూర్యగ్రహణవేళలందు బ్రాహ్మ, ణులకు భూదాన మిచ్చినఫలము నొందు
నూర్జమాసంబునను స్థండిలోర్వియందు, నియమసహితంబుగను శయనించునరుఁడు.

గీ. వేదసమమైనశాస్త్రంబు లేదు లేఁడు, ధర్మసన్నిభుఁ డైనబాంధవుఁడు లేదు
దైత్యరిపుతుల్య మగు దైవతంబు కార్తి, కమున కదైనమాసంబు గానరాదు. 532

గీ. మాఘవస్త్రమ మగు నూర్జమాస మెల్ల, వ్రతవివర్జితముగను నెవ్వఁడు గడపుఁ
గర్మభ్రష్టుఁ డై వాఁడు గిట్టకడకు, నుద్భవము నొందు గర్హితయోనులందు. 533

సీ. అబ్ధిని జేరుపుణ్యనది దుర్లభ దుర్ల, భుండు ధార్మికుఁ డైనపుత్రకుండు
తల్లి దుర్లభురాలు తండ్రి దుర్లభుఁడు సా, ధుజనసాంగత్యంబు దుర్లభంబు
కులము సౌశీల్యంబుఁ గలకన్య దుర్లభ, దురితవైముఖ్యంబు దుర్లభంబు
గోమతీనది నొనగూడుస్నానము దుర్ల, భంబు దుర్లభము పాపక్షయంబు

గీ. దుర్లభము దంపతిత్వంబు దుర్లభంబు, పరమపురుషార్థసాధననిరతబుద్ధి
ద్వారకావాసకృష్ణసందర్శనములు, దుర్లభము లూర్జసంసేవ దుర్లభంబు. 534

గీ. రాజసూయాశ్వమేధాధ్వరము లొనర్చి, నట్టిఫల మబ్బుఁ గార్తికమందు విష్ణు
భక్తసేవను నన్యదీపప్రబోధ, మునను పద్మపురాణంబు వినుటవలన. 535

వ. పితృపక్షంబున నన్నదానంబువలనను జ్యేష్ఠాషాఢంబులందు జలదానంబువలనను గలుగు పుణ్యంబు కార్తికంబునఁ బరదీపప్రబోధంబునం జేకూరు. కార్తికంబున నరుణోదయకాలంబునం జేయుజాగరంబును దిలదానంబును నదీస్నానంబును సాధుసంసేవనంబును దులసీరోపణపాలనపూజనంబులును బ్రాహ్మపఙ్క్తిభోజనంబును మానంబును క్షమయును క్షితిశయనంబును యుగార్జితపాపక్షయకరంబులు. మాఘమాసంబునఁ బ్రయాగస్మరణంబును వైశాఖమాసంబున నవంతీస్మరణంబును గార్తికమాసంబునఁ బుష్కరస్మరణంబును మోక్షదాయకంబులు.

గీ. కమలములచేత నెవ్వఁడు కార్తికమున, హరిని బూజింప కుండునో యతనియింటఁ
గమల యుండదు కోటిజన్మముల కైన, వాఁడు కలివంచితుం డైనవాఁడ చూవె.

క. కమలామనోహరుని నొక, కమలంబున నైనఁ బూజ గావించినవో
శమియించుఁ గోటిజన్మా, ఘములును నొకక్షణములోనఁ గార్తికమందున్. 538

క. తరియింపఁజేయఁ బితరులఁ, గిరుణను దలపెట్టి కార్తికంబున దామో
దరుని భజించినవాఁ డు, ద్ధరించి పితరులను దాను ధన్యత నొందున్. 539

క. పితృకారణమునఁ బంచా, మృతాభిషేకంబుఁ జేయునెడ నూర్జమునన్
దితిజారికి శతకల్పము, లతఁ డుండును దివిని బితృసమన్వితుఁ డగుచున్. 540

క. తులసీలతికదళంబులఁ, జలిపినయెడఁ గార్తికమున శౌరికిఁ బూజన్
దళదళమునందు నొసఁగును, జలజాక్షుఁడు ముక్తిఫలము సంతోషమునన్ 541

క. తనువున శ్రుతులను శీర్షం, బున హరినిర్మాల్యతులసి భువి నెవఁడు ధరిం
చునొ కార్తికమాసంబునఁ, గనుఁగొని కలిపురుషుఁ డతని గడగడవడఁకున్ 542

క. తులసీగంధము శార్ఙ్గికి, నలఁదినయెడఁ గార్తికమున హరి శతకల్పం
బులవఱకుఁ బొందుఁ దృప్తిని, నలవియె వచియింప దాన నబ్బుఫలంబున్. 543

క. తనుపరిమార్జన మొనరిం, చిన హరినిర్మాల్యతులసిచే నూర్జమునన్
గను సంక్షయమును దక్షిణ, మున నిశ్శేషముగఁ బాపములు జాడ్యములున్. 544

గీ. విష్ణునిర్మాల్యతులసియు విష్ణుశంఖ, జలము హరిచందనంబును శార్ఙ్గిపాద
సలిలమును హరిధూపశేషమును జేయు, భస్మముగ బ్రహ్మహత్యాదిపాపములను.

—: మాసోపవాసవ్రతవిధానకథనము :—

గీ. చలుపునెడలను నూర్జమాసంబునందుఁ, దనయ మాసోపవాసవ్రతంబు సర్వ
దానతీర్థక్రతువ్రతధర్మములను, జలిపినఫలంబు ప్రాప్తించు సులభముగను. 546

వ. అతికృచ్ఛ్రపరాకచాంద్రాయణంబులం గావించి గుర్వాజ్ఞం బడసి గృహంబు విడిచి విష్ణుదేవాలయంబునకుం జని యాశ్వీనశుక్లపక్షైకాదశినాఁ డుపవసించి యదిమొదలు కొని త్రింశద్దినపరిమితమాసోపవాసవ్రతదీక్షం గైకొని ప్రతిదినంబును నుపవాసంబు గావించుచు మిథ్యాలాపంబులం బరిత్యజించి యహర్నిశంబును విష్ణునామసంకీర్తనంబును విష్ణుకథాస్తవంబును విష్ణుగుణవర్ణనంబునుం గావించుచు శౌరికిఁ ద్రికాలార్చనంబు సేయుచు శాంతిని వహించి సర్వభూతంబులందును దయ గలిగి కూర్చున్నను నిలిచి యున్నను మేలుకొన్నను నిద్రించినను వాసుదేవుని స్మరించుచు గాత్రాభ్యంగశిరోభ్యంగతాంబూలవిలేపనాదుల వర్జించి వ్రతనియమంబులం బాటించుచు వ్రతసంపూర్తి చేసి యంతంబునఁ ద్రయోదశసంఖ్యాకు లగుబ్రాహ్మణులను బూజించి భోజనతాంబూలదక్షిణావస్త్రయుగ్మయోగపట్టసూత్రబ్రహ్మసూత్రంబుల నొసంగి నమస్కరించి పిదప సోపధానాచ్ఛాదనంబును సాలంకారంబును నగునూతనశయ్యయందు స్వర్ణరచితం బగు నాత్మప్రతికృతిని స్థాపించి యర్చించి తత్సన్నిధిం బాదుకాసనఛత్రవస్త్రయుగ్మంబు లర్పించి. 547

క. ధరణిసురులార యీయుఁడు, హరిపదమున కేను జేర ననుమతి యుష్మ
త్కరుణాకటాక్షములచే, నరిగెద నని వేఁడి వార లనుమోదింపన్. 548

వ. ప్రతికృతియుక్తంబును సోపస్కరంబును నగుశయ్యను వారల కర్పించె నేని స్వాభీష్టఫలసిద్ధి యగు. 549

క. ఒనరించి రేని స్వస్తిక, మును సాలగ్రామమునకు ముంగల నూర్జం
బునఁ గల్పకోటిదనుకను, ననిమిషలోకమున నుందు రాపుణ్యాత్ముల్. 550

క. వనమాలవలనఁ బ్రీతిం, గనినట్టులు కౌస్తుభమునఁ గనినట్లు ముదం
బును వాసుదేవుఁ డూర్జం, బునఁ దులసీదళముచేఁ బ్రమోదము నొందున్. 557

గీ. చలుపునెడఁ బూజ నూర్జమాసమున హరికి, మాలతీమాలికలచేత మాధవుండు
పూజకులలాటమున స్వయంభువు లిఖించి, నట్టిదుర్వర్ణమాలల నిట్టె తుడుపు. 552

గీ. మాలతీమాలికల నూర్జమాసమందుఁ, బుండరీకాక్షునకుఁ బుష్పమండపంబు
నేర్పఱించెడివా రుందు రెల్లసురలు, సలుపుచుండంగఁ బరిచర్య స్వర్గమందు. 553

క. మునిపుష్పంబును మాలతి, యును బంకేజమును దులసియును గేతకియున్
వనజాక్షునకు సమర్పిం, చినయెడ నూర్జమున నఖిలసిద్ధులు గలుగున్. 554

క. ఒనరించిన మునిపుష్పము, లను నర్చన నితరసుమములను విడిచి జనా
ర్దనునకుఁ గార్తికమాస, మున శతహయమేధఫలముఁ బూజకుఁ డొందున్. 555

క. మునిపుష్పమాల నూర్జం, బున హరికంఠమున వైచుపుణ్యాత్మునకున్
బొనరించు స్వార్ధసింహా, సనము మహేంద్రుం డొసంగి సమ్మానంబున్. 556

గీ. ఒక్కమునిపుష్పమునఁ గల్గు నూర్జమందు, నయుతగోదానమునఁ గల్గునట్టిఫలము
దానిమహిమంబుఁ దెలుప నాతరము గాదు, మురనిషూదనునకు నది ముఖ్య మగుట.

గీ. ఊర్జమున దీపదానంబు నొసఁగి హరికిఁ, దృప్తి గలిగించుచుఁ దొక్కఁ డేని తుదకు
వలయు జన్మింప నస్మద్వయములందు, ననుచుఁ బితరులు వాంఛింతు రనుదినంబు.

గీ. మాఘపునిము దుఁ గార్తికమాసమందుఁ, దైలమున నేనియును గోఘృతమున నేని
దీపమును వెలిఁగించినఁ గాపి యేని, చెందు హయమేధశత మొనర్చినఫలంబు. 559

సీ. ప్రజ్వలింపఁగఁ జని పరదత్తదీపంబు, మోటింబుఁ బ్రాపించె మూషికంబు
పరదత్తమైనదీపమును విలోకించి, పసిసెను స్వర్గంబుఁ బణ్యకాంత
హరిముందుఁ గాపించినట్టిపూజను జూచి, గోపుఁడు చేరె వైకుంఠమునకుఁ
బరులప్రేరణమున హరిపూజ యొనరించి, పరమపదంబు లుబ్ధకుఁడు పొందెఁ

గీ. గానఁ గార్తికమం దు నేతన నైన, నెవ్వ రేనియు విష్ణుసంతృప్తిహేతు
వైనకార్యంబు లొనరించి రేని గళిత, పాపులై చేరుదురు విష్ణుభవనమునకు. 560

ఆ. కార్తికేయ కార్తికమునఁ బ్రబోధిని, యెంతవఱకు రాదొ యంతవఱకె
గర్వ మొందు గంగ గర్జించుఁ దీర్థముల్, విఱ్ఱవీఁగు క్షేత్రతతు లెల్ల. 561

గీ. వాజిమేధసహస్రంబు రాజసూయ, శతము గావించినఫలంబు సంఘటిల్లు
నవని నూర్జప్రభోధినియందుఁ జేయు, నొక్కయుపవాసమునఁ జేసి యక్కజముగ.

గీ. జ్ఞానమును సంతతియును రాజ్యమును సకల, సౌఖ్యములును ఘటిల్లు నూర్జమున హేల
నలన నైనఁ బ్రబోధినీవాసరమునఁ, జేయునెడ నుపవాస మేజివి యేని. 563

క. ఒనరించినయెడలఁ బ్రబో, ధినియం దుపవాస మొకటి త్రిజగంబులలో
నొనగూడని దే దేనియు, నొనగూడుఁ దలంచికొన్న నూర్జవ్రతికిన్.

గీ. మేరుమందరసమ మైనఘోరపాత, కముల నేనియు క్షణములోఁ గాల్చివైచు
నేధములు వహ్నిఁబోలెఁ బ్రబోధినీది, నోపవాసం బొకండె బహుళాత్ము లేల. 565

—: జాగరలక్షణ కథనము :—

గీ. పూర్వజన్మసహస్రసంభూతపాప, సముదయంబును నగ్ని తూలమునుబోలెఁ
బూది యొనరించు నూర్జప్రబోధినీది, నంబున నొనర్పఁబడు జాగరంబు వత్స. 566

వ. గీతవాద్యనృత్యపురాణపఠనపుష్పగంధానులేపనఫలార్ఘ్యధూపదీపనైవేద్యశ్రద్ధాదానేంద్రియసంయమసత్యప్రమోదక్రియాశ్చర్యోత్సాహప్రదక్షిణనమస్కారయుక్తమయి మనీరాజనసహితంబును వినిద్రంబును నాలస్యాదివర్జితంబును నగునది జాగరంబుగాఁ జెప్పంబడియె. 567

గీ. అట్టిజాగర మూర్జమునం దెవండు, సలుపునో ప్రబోధినీదివసమున వాఁడు
మరల జన్మంబు నెత్తక ధరణిలోన, నైక్యమును జెందు విష్ణుదేహంబునందు. 568

గీ. కార్తికంబునఁ బురుషసూక్తమున నెవఁడు, హరికి నిత్యంబుఁ జేయునో యర్చనంబు
నబ్దకోటిసహస్రంబు లచ్యుతునకు, నర్చనము చేసినఫలంబు నాతఁ డొందు. 569

వ. కార్తికమాసంబున "నమోనారాయణాయ" యనుమంత్రంబుచే విష్ణుపూజయు విష్ణుసహస్రనామపారాయణంబునుం గావించువాఁడు పునరావృత్తిరహితం బగుపదంబు నొందు. 570

గీ. ద్వాదశీదినమందు నెవ్వండు జాగరంబు సలుపునో యూర్జమాసంబునందు
నుండు మన్వంతరశతంబు యుగసహస్ర, కోటియును స్వర్గమున వాఁడు కొలువ సురలు.

క. చలిపినసంస్తవగానం, బులు పశ్చిమరాత్రియామమున నూర్జమునన్
గలుగఁగ హరికిఁ బ్రమోదము, కలకాలము వార లుండఁగలరు దివమునన్. 572

ఆ. బాహ్లేయ భీష్మపంచకవ్రత మొప్పు, నూర్జమాసమందు నొనరుపంగఁ
దన్మహత్త్వ మెన్న దైత్యారి యొక్కండు, దప్ప నన్యు లెవరుఁ దగరు చూవె. 573

వ. కృతయుగాదులందు వసిష్ఠభృగుగర్గాదిమహర్షులచేతను త్రేతాయుగాదులందు నంబరీషభోగాదిక్షత్రియులచేతను సత్యశౌచపరాయణు లగువైశ్యులచేతను భీష్మపంచకవ్రతం బాచరింపంబడియె. భీష్మాగితం బగుటంజేసి యీవ్రతంబు భీష్మపంచకవ్రతనామముం బడసె. 574

గీ. కార్తికంబున నీపంచకవ్రతంబు, చేయునెడలను సర్వంబు చేసినట్లు
కాన నొనరింపవలయు నెల్లైన దీని, నఖిలపాపక్షయాకాంక్షు లైనవారు. 575

వ. ప్రథమదినంబున గోమయంబును ద్వితీయదినంబున గోమూత్రంబును తృతీయదినంబున గోక్షీరంబును జతుర్థదినంబున గోదధియును గాయశుద్ధికొఱకుఁ బ్రాశనంబు గావించి పంచమదినంబున బ్రాహ్మణసంతర్పణం బొనర్చి నక్తంబునఁ బంచగవ్యంబు గ్రహియించి భుజియింపవలయు. 576

గీ. వహ్నిభవ భీష్మపంచకవ్రతము పుత్ర, కాంక్షులకుఁ బుత్రులను ఘనకాంక్షులకును
ధనము మోక్షార్థులకు మోక్షమును నొసంగు, నఖిలకామప్రదానసమర్థ మగుట. 577
గీ. జాగరము చేయునప్పు డూర్జమునఁ నొందు, వాజిమేధఫలంబును వాద్యకర్త
సర్వతీర్థావగాహసంజనిత మైన, పుణ్యమును నర్తకుండును బొందుఁ జూవె.
ఆ. కార్తికవ్రతంబు గావించువారికి, ద్రవ్య మిచ్చువాఁడు తద్వ్రతంబు
వలనఁ గలుగునట్టిఫల మంతయును బొందుఁ, బడయు ద్రష్ట షష్ఠభాగిఫలము. 579
క. చలుపునెడ శ్రాద్ధతర్పణ, ములు పితరుల కూర్జమాసమున నెవఁ డైనన్
దులసీచ్ఛాయను వానికిఁ, గలుగు దివము పితరు లొందుకతమునఁ దృప్తిన్.
గీ. ఆమలకవృక్షమూలమునందు హరికిఁ, గొలిపి సంతృప్తి చిత్రాన్నములను నూర్జ
మునను భుఁ యిఁ పఁజేసి విప్రులను దాను, బంధుయుక్తుంబుగను భుజింపంగవలయు. 581
క. ఒనరించిన ధాత్రీచ్ఛా, యను బితరుల కూర్జమాసమందున్ శ్రాద్ధం
బును దర్పణమును బొందును, రనవధికం బైనతృప్తి నాతనిపితరుల్. 582
క. ఆమలకపత్ర ఫలముల, దామోదరపూజ సేయఁదగు నూర్జమునన్
క్షేమముల నొంద నిహపర, ధామములందును మనోరథము గలవారల్. 583
క. ఒనరించినయెడ శ్రాద్ధం, బనను బుర్షాప్రవక్త భోజన మూర్జం
బున శ్రాద్ధపింగ్యగింబున, కొనగూడును దృప్తి నాల్గుయుగములవఱకున్. 584
క. ఒనరించిన ధాత్రీపూ, జను గార్తికమాసమందు సంప్రాప్తింగన్
మనుజులకు సర్వభోగము, లను గావించినమహాఫలము సులభముగన్. 585
గీ. చలుపునెడలను బార్వణశ్రాద్ధ మూర్జ, మాసమున దర్శమందు సంవత్సరంబు
వఱకుఁ బితరులు తర్పితస్వాంతు లగుచు, వరము లిడుచుండెదరు నిజవంశజులకు. 586
గీ. కార్తికేయ ప్రబుద్ధుఁడు గాకమున్నె, యచ్యుతుఁడు మేలుకొల్పి క్షీరాబ్ధిసుతను
గార్తికంబునఁ బూజించుఘనునియింట, నుండు నావత్సరముఁ బాయకుండ లక్ష్మి.
క. గోవర్ధనార్చనంబును, గావించినయెడలఁ గార్తికంబున నిచ్చున్
గోవిందుఁడు రాజ్యంబును, గోవులఁ బుత్రులను బంధుకోటుల నెల్లన్. 588
సీ. కార్తికశుక్లపక్షంబునఁ బ్రతిపద్ది, నంబున రాత్రికాలంబునందు
జూదమాడవలయు జూదంబున జయంబు, గలవారి కాయేఁడు గలుగు జయము
సలుపుచుండఁగ నేను శర్వాణియును ద్యూత, కార్యంబు నొకకార్తికంబునందుఁ
గొలిచి గోరూపంబుఁ గొన్నలక్ష్మని నాకుఁ, దెలియకుండఁగ నాఁడు గెలిచె గౌరి
గీ. యదిమొదలుకొని నాకు జయంబు గలుగ, దాయె నెందును గూడ నాయబ్ద మెల్ల
నప్పుడె కపాలమును దాల్చి యవని నెల్లఁ, దిరుగనే నేఁగి సుఖముండె గిరిజ యింట.
క. బలిపూజాదీపోత్సవ, ములు నీరాజనవిధానమును నూర్జమునన్
జలిపెడివారలయిండ్లను, నెలకొని యొకయేఁడు పద్మనిలయ వసించున్. 590

గీ. కార్తికంబునయందు నక్తవ్రతంబు, నాచరించెడిపుణ్యాత్ముఁ డధివసించుఁ
గల్పకోటిసహస్రంబు గడచువఱకు, సంతసంబున వైకుంఠసదనమందు. 591

క. బలిచక్రవర్తికొఱకై, సలిపెడిదానములు హరికి సంతోషంబుం
గొలుపునవి గాన నక్షయ, ఫలమును గర్తల కొసంగుఁ బరలోకమునన్. 592

క. హరి బలివలనను గైకొని, ధర యెల్లను మరల నతనిదానగరిమ క
చ్చెరు వొంది యిచ్చె సంవ, త్సరమున కొకదివస మేల ధర నాతనికిన్. 593

క. ఆదివసము కౌముది యని, మేదినిలో ఖ్యాతి నొందె మిగులం గుతలా
హ్లాదకర మగుట సకలజ, నాదరపాత్రతను బొందె నానామమునన్. 594

క. జను లెల్లరు నాదినమున, నొనరింపఁగవలయు బలిమహోత్సవమును న
ట్లొనరింపకున్న భ్రంశం, బును బొందుఁ దదీయకర్మములు సకలములున్. 595

గీ. కౌముదీదినమందు దుఃఖమున నున్న, వర్షమంతయు దుఃఖంబు వాఁడు చెందుఁ
గౌముదీదినమునఁ దుష్టి గలిగి యున్న, వర్షమంతయు సంతుష్టి వాఁడు పొందు. 596

వ. కౌముదీతిథి విష్ణుప్రీతికరం బగుటచే వైష్ణవి యనియును దానవపరిపాలితం బగుటచే
దానవి యనియును బ్రసిద్ధిం బడసె.

గీ. కాశకుశమయముగఁ జేసి కార్తికమున, మార్గపాలిని గట్టి స్తంభమునఁగాని
తరువునంగాని పూజించి దాఁటునెడలఁ, బ్రజలకును బశువులకును రావు రుజలు. 598

గీ. వృత్రుని వధించుటను జనియించినట్టి, బ్రహ్మహత్యను వజ్రి వజ్రమున నఱికె
నాలుఖండంబులుగను మహాగ్రహమునఁ, బూర్వ మాఖండషట్క మమృతము గాఁగ.

వ. శ్రావణభాద్రపదాశ్వయుజకార్తికశుక్లద్వితీయా దినంబులందు నదీవృక్షనారీభూవహ్ని
భ్రూణహలంబులం బంచె. దానంజేసి నదులకుఁ బ్రావృణ్మలంబును వృక్షంబులకు
నిర్యాసమలంబును స్త్రీలకు రజోమలంబును భూమికి నష్టాగుహపర్యంతాపవిత్రతా
మలంబును వహ్నికి మషీమలంబును భ్రూణహలకు సంగమలంబును నేర్పడియె.
శ్రావణశుక్లద్వితీయకుఁ గలుష యనియును భాద్రపదశుక్లద్వితీయకు నిర్మల యని
యును నాశ్వయుజశుక్లద్వితీయకుఁ బ్రేతసంచార యనియును గార్తికశుక్లద్వితీయకు
యామ్య యనియును నామంబులు గలిగె. కార్తికద్వితీయ యమప్రియ యగుటచే
యామ్య యయ్యె. దానంజేసి దీనికి యమద్వితీయ యనువిఖ్యాతియుం గలిగె. యమ
ద్వితీయయందుఁ బూర్వాహ్ణంబున నర్మదాస్నానంబు గావించి యమునిఁ బూజించు
వారలు యమలోకంబును దర్శింపకుందురు. యమప్రసాదంబున నరకగతం బగుస్వపితృ
గణంబునకు విముక్తియుం జేకూరు. 600

గీ. యమునచే నాత్మగృహమున యామ్యనాఁడు, యముఁడు భోజితుఁడై మహాహ్లాద మొదవ
నాయమునకు వస్త్రఫలభూషణాదు లొసఁగి, సకలసుఖముల నొందె వత్సరమువఱకు.

గీ. ఆకతన నిజసోదరీహస్తదత్త, మైనయన్నంబు భుజియించి యామ్యనాఁడు
సత్కరించిన నామెను సకలజనులు, పొందుదురు సౌఖ్యముల నబ్దపూర్తివఱకు. 602

క. కలుగవు గృహకలహంబులు, గలుగదు రిపుభయము సకలకళ్యాణములున్
గలుగును యామ్యాదినంబునఁ, జలిపిన భగినీప్రశస్తశయభోజనమున్. 603

ఆ. కార్తికేయ కార్తికము వత్సరవ్రత, ములు సమాప్తి నొందుముఖ్యపదము
గాన క్షేమకాంక్షగలవార లెవరును, గడనజనదు కార్తికవ్రతంబు. 604

క. ఇది మోక్షద మగుశాస్త్రము, విదితం బొనరించినాఁడ విశదంబుగ నీ
మది నుంచుకొనుము నాస్తిక, వదనములకు నెక్కనీయవల దెపు డేనిన్. 605

క. విని కార్తికమాహాత్మ్యం, బును విప్రునివలన నూర్జమున వాచకునిన్
దనిపినయెడ సత్కారం, బున నఖిలామరులుఁ దృప్తి పొందుదు రెదలన్. 606

ఆ. వాచకార్చనంబె వాసుదేవార్చన, మతఁడు తృప్తి నొంద నచ్యుతుండు
తృప్తి నొందు వాసుదేవునకును వాచ, కునకు భేదలవము గూడ లేదు. 607

వ. కృష్ణవస్త్రపరివేష్టితంబును ఖడ్గహస్తంబును రక్తపుష్పకృతాపీడంబును స్వర్ణకుండలమండితంబును లోహదంష్ట్రింబును భీషణంబును నగుసువర్ణపాత్రప్రతిమను దిలప్రస్థంబునం దుంచి ధర్మరాజనామంబులచేఁ బూజించి గృహీతకుసుమాంజలి యై ధర్మప్రీతికరంబుగా బ్రాహ్మణున కొసంగి వ్రతపూర్తి గావింపవలయు. 608

క. అని నుడువుటయును షణ్ముఖుఁ, డనవధికానంద మొదవ నాంతరమందున్
బొనరించి నమస్కారం, బును హరునకుఁ జనియె సురసమూహముతోడన్. 609

ఆ. ఒక్క నాఁడు గౌరి ముక్కంటి దరిఁ జేరి, ప్రాణనాథ శ్రేష్ఠభక్తి యేదొ
చెపుము నాకు నాఁగ శివుఁ డాత్మలోపల, నెనయ సంప్రహర్ష మిట్టు లనియె. 610

—: నానాభక్తిస్వరూపకథనము :—

సీ. కలికి చెప్పెద విను ఫలమూలజలహవి, రశనుఁ డై కాలత్రయంబునందుఁ
గావించుటయు వాసుదేవునిపూజను, హరికిఁ జేయుటయు నాత్మార్పణంబు
తల్లీనచిత్తుఁ డై యుల్లసిల్లుటయును, బరగును సాత్త్వికభక్తి నాఁగ
సేవింప నిష్ఠారసిద్ధి కై హరి నది, పరగును రాజసభక్తి యనఁగ
గీ. పరులహింసింపఁ గాని దంభమునఁ గాని, జలరుహాక్షునిపూజను జలిపె నేని
పరగు నయ్యది తామసభక్తి నాఁగ, భక్తిసాధ్యంబు గాని దేపనియు లేదు. 611

వ. సాత్త్వికభక్తి యుత్తమంబు. రాజసభక్తి మధ్యమంబు. తామసభక్తి కనిష్ఠంబు. 612

ఆ. భక్తి లేనివాఁడు పఠితాఖిలామ్నాయుఁ, డయ్యుఁ గర్మనిష్ఠుఁ డయ్యు వేద
బాహ్యుఁడుగను గర్మబాహ్యుండుగను జెప్పఁ, బడియె సూక్ష్మధర్మపరులచేత. 613

క. అమరులు క్షేమము నిత్తురు, శమధను లొసఁగుదురు శుభము శాంతిని బితరుల్
సమకూర్తురు సంతతమును, గమలాక్షునియందు భక్తిగలవారలకున్. 614

క. నళినాక్షపాదభక్తుల, నిలయంబులయందు లక్ష్మి నిలుచు స్థిరముగన్
నిలుచును గ్రహంబులును శుభ, ఫలప్రదాయకము లగుచుఁ బ్రతిపదమందున్. 615

క. కురుజాంగలకాశీపు, ష్కరనైమిషములు ప్రయాగగయలును గంగా
సరిదాదిపుణ్యవనములును, హరిపదసేవకులమేనులందు వసించున్. 616

గీ. అవనిసురుఁ డైన క్షత్రియుం డైన వైశ్యుఁ, డైనను జఘన్యజుం డైన నంత్యుఁ డైన
నతివ యైనను నైన రైన నచ్యుతాంఘ్రి, జలజములు నమ్మి కొలిచినఁ గలుగు ముక్తి.

సీ. పతినిఁబోలెను బతివ్రత తనూజాపేక్షి, తనయునిబలె లోభి ధనముఁబోలె
ఘనమునుబలెఁ జాతకము శరణముబోలె, భీరువు తృషితుఁడు నీరిఁబోలె
దూరదేశస్థుఁ డగారంబునుంబోలె, బ్రహ్మవిద్యనుబోలె బ్రహ్మవేత్త
చండరశ్మినిబోలెఁ జక్రవాకంబులు, హంసలు మానసహ్రదముఁబోలె

గీ. భ్రమరములు పుష్పమునుబోలెఁ దిమిరగతుఁడు
దీపమునుబోలె సింహంబు ద్వీపముఁబోలె
శ్రమవినిష్పీడితుండు విశ్రాంతిఁబోలె
సంతతంబును హరిని భావింతు నేను. 618

గీ. కలుగు హరిభక్తి సాధుసంగమునఁ జంద్ర, కాంతహిమరశ్మికిరణయోగమున జలము
భానుకరసూర్యకాంతసంపర్కమునను, జ్వలనమును నుద్భవించెడిచందమునను. 619

క. హిమకరమయూఖసంప, ర్కమునను నీలోత్పలము ప్రకాశించెడిచం
దమున హరిభక్తిచేతను, సమధికదీప్తిని వహించు శ్వపచుం డేనిన్. 620

ఆ. ఎట్టిభావమునను నేని స్మరించిన, హరిని బరమపదము నందఁగలుగు
జారబుద్ధిచేత శార్ఙ్గిని స్మరియించి, కొనిరి విష్ణుపదము గోపసతులు. 621

ఆ. ధనముచేత నైన దానంబుచే నైన, బుద్ధిచేత నైన వృద్ధిచేత
నైనఁ బడయలేరు హరిసన్నిధానంబు, నొక్కభక్తిచేత నొందినట్లు. 622

ఆ. కలిసియున్నక్షీరజలములలో హంస, మాని జలము క్షీర మానినట్లు
సర్వధర్మములను సంపూర్ణముగ వీడి, భక్తిసుధను గ్రోలు ముక్తికాంక్షి. 623

క. అమృతము గ్రోలియు దుఃఖము, నమరులు పొందుచునెయుండి రమ్యతపదభ
క్త్యమృతమును గ్రోలియుండిన, సమకూరునె దుఃఖలవము శక్రాదులకున్. 624

గీ. విష్ణుభక్తిని విడనాడి వేఱుమార్గ, మునను ముక్తిని సాధింపఁ బూనువారు
వదలి పాత్రంబు తోయంబు వస్త్రమునను, నిలుపఁగ శ్రమంబు నొందెడినిపుణమతుల.

క. జలనిధి నీదఁగ హస్తం, బులతో యత్నంబు సేయుమూర్ఖుల భవమున్
జలజాక్షుభక్తిభిన్నం, బు లగుపథంబులను గడవఁ బూనెడివారల్. 626

క. అనలము స్వల్పం బైనను, వన మంతయుఁ గాల్చివైచువడువున దగ్ధం
బొనరించు నించు కైనను, వనజాక్షునిభక్తి పాపవర్గము నెల్లన్. 627

ఆ. కలిగె నాకు వాంఛ గాఢంబుగను విష్ణు, పాదభక్తిపైని బంకజాక్షి
మేరుభూధరంబుమీఁద నిర్ధనునకు, నిచ్ఛ గలిగినట్లు లేమిచెప్ప. 628

ఆ. శతసహస్రకోటిసంఖ్యాకు లగువారు, విష్ణుభక్తిఁ గూర్చి వినిన నందు
భక్తుఁ డొకఁడె తేలుఁ బద్మాక్షి శతజన్మ, పక్వభక్తిపూర్ణభావుఁ డగుట. 629

క. పరులకు బుద్ధిం జెప్పెడి, నరులుందు రనేకు లట్టినరకోటులలోఁ
బరులకుఁ జెప్పినయట్లా, చరించువాఁ డొకఁడ యుండు భూమిచక్రమునన్.

గీ. నడుచుచున్నను గనుచున్న నుడువుచున్న, సలిలమును గొనిపోయెడిజనునిమనము
ఘటముననె నిల్పుగతి నుండుఁ గదలకుండ, శ్రీధరునియంద భక్తునిచిత్తవృత్తి. 631

గీ. ఇంచుకించుక హరిభక్తి నెక్కఁజేయు, చున్న బోధకుఁ డాశించుచుండు శ్రోత
బెల్లమును గొంచెముగఁ దల్లి పెట్టుచున్న, మరగి కాంక్షించు బాలుఁడు మరల మరల.

గీ. కర్మబద్ధుఁడు గాఁడు భాస్కరుఁడుబోలె, సర్వగతుఁ డయ్యు హరినామసాధనుండు
నుడివి నారాయణపదంబు కొడుకుపేరఁ, బడయుఁడె యజామిళుఁడు ముక్తిఁ బాపి యైన.

గీ. తోయమున నివసించు దర్దురము కాన, నమునఁ దిరిగెడిచంచరీకమును ఘ్రాణ
శక్తిచే గంధము గ్రహించుచందమునను, భక్తుఁడు గ్రహించు శార్ఙ్గిని భక్తిచేత.

గీ. మోయుచున్నను నిజపృష్ఠముననె యుష్ట్ర, మగురుకర్పూరభారంబు నందులోని
గంధమును మూరుకొనలేనికరణి నాత్మ, గతుని శౌరి నభక్తుఁడు గానలేఁడు. 635

గీ. తెలియక యభక్తు లాత్మసంస్థితుని హరిని, గొలుచుచుందురు తాలుఅప్పలును వితగ
నెఱుఁగక స్వనాభిగత మైనమృగమదంబుఁ, దరువులను మూరుకొనుమృగతతులుబోలె.

గీ. చలుపునెఱ మూర్ఖజనులకు సదుపదేశ, మెట్లు వైయర్థ్య మొందునో యట్లె వ్యర్థ
మగుఁ బ్రబోధంబు చేసిన నన్యభక్త, జనములకు విష్ణుభక్తిప్రశస్తమహిమ. 637

గీ. పాలు వోసినయెడలను వ్యాళములకుఁ, బరిణమించునో యేరీతి గరళముగను
నట్లె నాస్తికులకుఁ జేయునట్టివిష్ణు, భక్తిబోధంబు విమతిగాఁ బరిణమించు. 638

గీ. కానలేరు బహిర్ముఖు లైనవార, లాత్మదేహస్థితుం డైనహరిని నేత్ర
హీను లగువారు దీపము నేవిధమున, నేరరో కనుంగొనంగ నుండినను నెదుట. 639

గీ. మలముచే దర్పణంబు ధూమంబుచేత, నగ్ని యుల్బంబుచే గర్భ మావృతంబు
లైనవడువున నుండె దేహంబునంద, మాయచే నావృతుం డయి మాధవుండు. 640

క. ఆమాయ నుడిపి హరిఁ గను, సామర్థ్యము విష్ణుపాదసరసిజభక్త
గ్రామణికిఁ దప్ప నన్యున, కేమాత్రము గూడఁ గలుగ దెట్టిం డైనన్. 641

గీ. జంగమస్థావరాత్మకజగములందు, నంతటను నిండి యుండె నారాయణుండు
పాలలో నుండునాజ్యంబుపగిదిఁ దిలల, యందు నుండెడితైలంబుచందమునను. 642

క. వనజజముఖసురగణ మె, ల్లను బ్రోతం బగుచు నుండు లక్ష్మీపతిమే
నను సతతంబును సూత్రము, నను గ్రుచ్చంబడినమణిగణంబులుబోలెన్. 643

క. వనజదళేక్షణ కాష్ఠం, బున నుండినవహ్ని మథనమునఁ గనఁబడుచా
యను ధ్యానరతులకుఁ గనఁబడుఁ, దనుమధ్యగుఁ డైనశౌరి తనుధారులకున్. 644

గీ. ఒక్కవిష్ణువె యాదిలో నుండి వాని, వలనఁ బ్రాదుర్భవించె విశ్వంబు లెల్ల
నొక్కదీపంబె యాదిలో నుండి దాని, వలన దీపసహస్రముల్ గలిగినట్లు. 645

క. నానారూపంబులచేఁ, గానంబడు హరియె ముజ్జగంబులయందున్
భానుఁ డనేకాకృతులను, గానంబడునట్లు సలిలఘటములలోనన్. 646

క. జలసంయోగవశంబునఁ, గలిగించెడునట్లు వృక్షగణమును ధాత్రీ
తలము జనింపంజేయున్, జలజాక్షుఁడు ప్రకృతిగుణవశమున జగములన్. 647

ఆ. మశకగర్భమందు మాతంగగర్భము, నందు మనుజగర్భమందు దేవ
గర్భమందు నుండుఁ గమలాక్షుఁ డాధిక్య, మల్పతయును లేనియాత్మ యగుట. 648

ఆ. అతఁడె యాత్మ యనిన నాతఁడె పరమాత్మ, యనిన బ్రహ్మ మనిన నతఁడె జీవుఁ
డనిన నతఁడె సచ్చిదానందములు నాఁగ, నతఁడె నేను గూడ నతఁడె చూవె. 649

క. హరి తప్ప నితర మేమియుఁ, జరాచరములందు లేదు చర్చింపఁగ నా
పరమాత్మయె చిత్రంబుగ, హరియించు సృజించుఁ బెంచు నఖిలజగములన్. 650

గీ. నామరూపవిభేదసందర్శనమున, బహువిధంబుల నజ్ఞులు పలుకుచుంద
రంతె కాని విమర్శించి యరసికొనిన, దృశ్యమానప్రపంచంబు లెల్ల హరియె. 651

ఆ. బుట్టబొమ్మలోనఁ బురుషుండు లేకున్న, నెట్లు పడునొ యట్లె యీశరీర
మాత్మ లేనియెడల నప్పుడె పడిపోవు, దాన నడుపువాఁడు తాన చూవె. 652

గీ. ఘటములందు నభం బుండుకరణి నుండు, సకలదేహంబులందును శార్ఙ్గి భగ్న
మైనను ఘటంబులు నభంబు పోనిపగిదిఁ, బోయినను విగ్రహంబులు పోఁడు శార్ఙ్గి.

క. కనకవికారం బెల్లను, ననలంబునఁ బూర్వరూప మందినచందం
బున భక్తిచేత జీవుఁడు, తనప్రాక్తనరూప మొంది తాను వెలుంగున్. 654

క. హరిభిన్నుని గను జీవుని, నరసెడిమూఢులు వలాహకావృత మగుభా
స్కరబింబంబును దేజో, విరహితముగ నెంచుదుర్వివేకుల చూవే. 655

ఆ. ఆత్మ నిర్వికల్పుఁ డాకారవర్జితుఁ, డతనివలనఁ బుట్టె నాకసంబు
దానఁ గల్గె మారుతము దాన వీతిహో, త్రంబు పుట్టెఁ గలిగె దాన జలము. 656

ఆ. ఆజలంబునందు నావిర్భవించె హి, రణ్యగర్భుఁ డగువిరాట్టొకండు
పొడమె వానినాభిపుష్కరంబునను బ్ర, హ్మాండకోటు లద్భుతావహముగ. 657

క. కావున సర్వంబునకున్, గోవిందుఁడె మూల మని కనుంగొనుటె యగున్.
గోవిందభక్తి దానన్, జీవునకు స్వరూపసిద్ధిఁ జెందంగలుగున్. 658

ఆ. అట్టిభక్తి గలుగ నగు సాధనంబు సా, కారుఁ డైనదానవారిసేవ
పట్టు లేకయున్నఁ బైకేఁగ సాధ్యంబు, గాదు చూవె యెట్టిఘనున కేని. 659

గీ. కర్మబీజానుగుణముగఁ గలిగె నిట్టి, బ్రహ్మసర్గంబు దానవె బయలువెడలె
సర్వలోకంబులును గర్మశక్తి నడుప, సాధనము భక్తియె సమస్తజంతువులకు. 660

గీ. కర్మపాశంబుచేతను గట్టువడిన, జంతువు లవిద్యచేతను స్వస్వరూప
మెఱుఁగఁజాలక పడియుందు రెపుడు గూడ, జన్మమృత్యుపరంపరాసంకటమున. 661

క. వర్ణోచితకర్మములు భ, వార్ణవతారకము లగుట నవియు నవిద్యో
త్తీర్ణతకు సాధనములుగ, నిర్ణీతము లయ్యె సర్వనిగమములందున్. 662

ఆ. మనసె కారణంబు మంచికిఁ జెడ్డకు, మోక్షమునకు బంధమునకుఁ గూడ
దాన దేహి యైనవాని కెల్ల మనంబె, శత్రు వైన మఱియు మిత్రుఁ డైన. 663

క. మనముననె చెడిరి కొందఱు, మనముననే బాగుపడిరి మఱికొందఱు గా
వున మనము నెట్టిమార్గం, బున నడిపిన నట్టిమార్గమున నది నడచున్. 664

ఆ. మనము భక్తినిష్ఠ మొనరించి యాకల్ప, మొనరిచినను గర్మమును నరుండు
కర్మలేపభాగి గాఁ డంబులిప్తంబు, గాక యుండునట్లు కమలదళము. 665

గీ. అగ్నియం దుంపఁబడినట్టి యగ్నివోలె, జలమునం దుంపఁబడినట్టిజలమువోలె
నాత్మవిజ్ఞానమున జీవుఁ డాత్మలోన, నైక్యమును జెందు నెడ శూన్య మగు జగంబు.

క. కనఁగలుగునొ జన్మాంతర, మునయం దష్టాంగయోగములచే నెవనిం
గనఁజాలు నొక్కజన్మము, నను భక్తుఁడు భక్తినైపుణంబున నతనిన్. 667

క. తనకేల నున్నకంకణ, మును జూచికొనంగ ముకురమును వెదకెడి మూ
ర్ఖునిచాయ జడుఁడు దిరుగున్, దనలోఁ గలహరిని గాంచ ధాత్రిని నెల్లన్. 668

క. ఆకృతిశూన్యుం డెవ్వఁడొ, సాకారుండతఁడె తాన సాకారుని నా
లోకించినపక్షమున ని, రాకారుఁడు గోచరించు నపుడె స్వయముగన్. 669

గీ. హరిని స్మరియించు చుండెడితరుణమందుఁ, గనుల హర్షాంబుకణమును దనువునందుఁ
బులకలును గ్రమ్మభక్తుఁడు పొందు ముక్తి, విష్ణుకరుణాదితాత్మవివేకుఁ డగుచు.

గీ. హరిని స్మరియించుటను మానసాఘములును, హరిని గీర్తించుటను వాచికాఘములును
హరిని బూజించుటను గాయికాఘములును, క్షీణ మగుటను భక్తుఁడు చెందు ముక్తి.

క. వర్ణములును నాశ్రమములు, వర్ణాశ్రమధర్మములును వనజభవునిచే
నిర్ణీతము లగుటను నా, నిర్ణయమును దగదు భక్తినిష్ఠుఁడు దాఁటన్. 672

క. నిజధర్మము విడనాడక, భజియింపక యన్యధర్మపథమును భక్తుల్
భజియింప నొప్పు శార్ఙ్గిని, నిజధర్మమునందె మేలు నిధనం బైనన్. 673

వ. స్వధర్మాగతం బగుద్రవ్యంబు శుక్లద్రవ్యం బని చెప్పంబడియె. శుక్లద్రవ్యంబుచేఁ జేయంబడుదానంబు స్వల్పం బైనను మహాపుణ్యంబు నొసంగు. అధర్మాగతం బగుద్రవ్యంబు మలినద్రవ్యంబు. దానం జేయంబడుదానంబు నరకప్రదంబు. 674

క. ఒనరించిన నిహలోకం, బునఁ గర్మము నన్యలోకమునఁ గర్మఫలం
బును ననుభవింపవలయును, దనుధారులు దానిఁ గడవఁదప్పనికతనన్. 675

గీ. పుణ్యకర్మముచేతను బొందుసుఖము, దురితకర్మంబుచేతను దుఃఖ మొదవు
లేదు పాపాత్ములకు సుఖలేశ మేని, దుఃఖలవ మేని పుణ్యవంతులకు లేదు. 676

సీ. బంధించి త్రాళ్లచేఁ బ్లవగంబులను ద్రిప్పు, చుండెడిసూత్రధారుండువోలెఁ
గర్మపాశంబులఁ గట్టి ప్రాణుల నెల్ల, సర్వేశ్వరుఁడు ద్రిప్పు సంతతమును
బ్రహ్మాదులును గర్మబద్ధులై తా మొన, రించుచుండిరి స్వస్వకృత్యములను
వీ రని వా రని వివరింపఁగా నేల, కర్మబద్ధములు లోకంబు లెల్లఁ

గీ. గడకు నీ కొక్కమాట నే నుడువువాఁడ, నిది రహస్యంబు చెప్పకు మెవ్వరికిని
నట్టికర్మంబు మాఫు చేయంగఁగలది, విష్ణునామంబుకంటెను వేఱు లేదు. 677

సీ. కొందఱు దేవతాబృందంబుఁ గొందఱు, మణులను గొందఱు మంత్రములను
గొందఱు గ్రహములఁ గొంద ఱోషధులఁ గొం, దఱు సాహసమును గొందఱు బలంబుఁ
గొంద ఱుద్యమమును గొందఱు ధృతిని గొం, దఱు పరాక్రమముఁ గొందఱు నయంబుఁ
గొందఱు బుద్ధిని గొందఱు సిద్ధిని, నుతిచేయు చుందు రద్భుతము గాఁగ

గీ. నేనుమాత్రము కర్మమునే నుతింతు, నన్నిటికిఁ గూడ మూల మై యున్నకతన
మశక మగుఁ గర్మముననె సామజము గూడఁ, గరి యగును మశకంబును గర్మముననె.

గీ. బాహ్యమందు సమస్తంబుఁ బరిహరించి, మనసులోపల వాంఛలు మానకున్న
వాఁడు పాపంబు చేసినవాఁడె కాన, వ్యర్థములు వాఁడు చేయుకార్యంబు లెల్ల. 679

గీ. చలుపుచును బాహ్యమందుఁ గర్జముల నెల్ల, మనసులోపల వాంఛలు మానె నేని
యతనిత్యాగంబు మధ్యమత్యాగ మగుటఁ, బడయఁజాలఁడు తత్పుణ్యఫలము వాఁడు.

గీ. బాహ్యమునఁ గర్మములును నాభ్యంతరమున, వాంఛలును ద్యజియించినవానిత్యాగ
ముత్తమము దుర్లభం బది యోగులకును, వాఁడె భక్తుఁడు ముక్తుఁడు వాఁడె చూవె.

గీ. కష్టములచేతఁగాని యాగ్రహముచేతఁ, గాని కావింపఁబడినత్యాగంబు మధ్య
మంబు దానను ద్యాగఫలంబు లేదు, రాగి యగుఁగాని యాతఁడు త్యాగి గాఁడు.

గీ. అభ్యసించుచు యోగంబు నంతరాయ, నిహతుఁ డగునేని మరల జన్మించి యోగి
కులమునం గాని సిరిగలనిలయమందుఁ, గాని యాతఁడు తత్సిద్ధిఁ గాంచఁగలుగు. 683

గీ. కర్మమయ మగుయజ్ఞంబు కర్మనాశ, కరము గానేర దెపుడును గడుగఁగలదె
కర్దమము కర్దమమును రక్తమును రక్త, మెంత తలక్రిందు లైనను నెన్నఁ డేని.

గీ. సార్వభౌమసుఖంబుతో స్వర్గసుఖము, సాటి చేయంగవచ్చు నశాశ్వతంబు
గాన నాసౌఖ్యమును గోర నేను నిత్య, మైనమాధవభక్తిసౌఖ్యమును దప్ప. 685

గీ. గర్భ మనియెడినరకలోకమున నుండ, గడగడవడంకు చుందు నెప్పుడును నేను
మద్భయంబును దీర్ప సమర్థ మైన, దొక్కహరిభక్తి దప్ప వే ఱొండు లేదు. 686

గీ. భూరికామయుతం బైనబుద్ధి విష్ణు, భక్తిని జయింపలే దెంతశక్తి యున్న
రాలు లోహంబుచేతను బ్రద్ద లగును, గాని రత్నంబు భిన్నంబు గాదు చూవె. 687

ఆ. విష్ణుసేవకులను విడనాడి శమనుండు, సకలజంతువులను సంహరించు
బకము దర్దురాదిపాథశ్చరంబుల, విడిచి మ్రింగునట్లు వివిధకృముల. 688

గీ. వ్యాధునకు ముక్తి నొసఁగినవాఁడు కుబ్జ, నుద్ధరించినవాఁడు నన్నుద్ధరించు
బద్ధకంకణుఁ డగుచును భక్తజనుల, నోముటకు దీక్షతోడఁ దా నున్నకతన. 689

క. అని పలుకుచు రోమాంచము, లెనయంగను మేన లోన నేకాగ్రత్వం
బొనరఁగ నిశ్చేష్టత్వం, బున నుంటయుఁ జూచి గౌరి ముద మొదవంగన్. 690

వ. మహేశ్వరుండు బహిర్ముఖుం డగునంతవఱకును నిరీక్షించి యుండి యనంతరం బాతని
కిట్లనియె. 691

గీ. అచ్యుతుండు జంబూద్వీపమందు నెన్ని, తీర్థములుగ వసించె నేతీర్థ మందు
నుత్తమము తెల్పుము వినంగ నుద్భవించె, నిచ్ఛ యన నీశ్వరుం డామె కిట్టు లనియె.

క. జలజాక్షి సప్తలోకం, బులు గూడ హరిస్వరూపముల యైనను నేఁ
దెలిపెదను గొన్ని తీర్థం, బుల నడుగుట నీవు లోకమును గరుణింపన్. 693

—: విష్ణుతీర్థనామకథనము :—

వ. పుష్కరతీర్థంబును వారాణసీక్షేత్రంబును నైమిశక్షేత్రంబును బ్రయాగతీర్థంబును మానసతీర్థంబును విశ్వకాయతీర్థంబును సోమేశ్వరతీర్థంబును మదోత్కటతీర్థంబును రథచైత్రకతీర్థంబును గాన్యకుబ్జతీర్థంబును గపాలమోచనతీర్థంబును మలయజతీర్థంబును గుబ్జామ్రకతీర్థంబును గేదారతీర్థంబును హిమవత్పృష్ఠంబున బాహ్యతీర్థంబును గోకర్ణంబున గోపకతీర్థంబును హిమాద్రియందు స్థానేశ్వరతీర్థంబును బిల్వకంబున బిల్వపత్రకతీర్థంబును శ్రీశైలంబున మాధవతీర్థంబును భద్రేశ్వరంబున భద్రతీర్థంబును వారాహంబున విజయతీర్థంబును వైష్ణవగిరియందు వైష్ణవతీర్థంబును రుద్రకోటిగిరియందు రౌద్రతీర్థంబును గాలంజరగిరియందుఁ జైత్ర్యతీర్థంబును గంపిలంబునఁ గాంపిలతీర్థంబును ముకుటంబునఁ గోటకతీర్థంబును గల్లికయందు సాలగ్రామతీర్థంబును నర్మదయందు శివతీర్థంబును మాయయందు విశ్వరూపతీర్థంబును నుత్పలాక్షంబున సహస్రాక్షతీర్థంబును రైవతకగిరియందు జాతతీర్థంబును గయయందుఁ బితృతీర్థవిష్ణుపాదతీర్థంబులును విపాశయందు విపాపతీర్థంబును బుండ్రవర్ధనమందుఁ బాటలతీర్థంబును సుపార్శ్వంబునందు నారాయణతీర్థంబును ద్రికూటంబునందు విష్ణుమందిరతీర్థంబును విపులంబున విపులతీర్థంబును మలయాచలంబునఁ గళ్యాణతీర్థంబును గోటితీర్థంబునఁ గౌరవతీర్థంబును గుబ్జాంకకంబునఁ ద్రిసంధ్యతీర్థంబును గంగాద్వారంబున హరిప్రియతీర్థంబును వింధ్యప్రదేశంబున శైలతీర్థంబును బదరియందు సారస్వతతీర్థంబును గాళిందియందుఁ గాలరూపతీర్థంబును సహ్యాద్రియందు సాహ్యకతీర్థంబును జంద్రక్షేత్రంబునఁ జాంద్రతీర్థంబును యమునయందు మృగతీర్థంబును గరవీరంబునందుఁ గురుతీర్థంబును వినాయకపర్వతంబున నుమాతీర్థంబును భాస్కరక్షేత్రంబున నారోగ్యతీర్థంబును మహాకాలంబున మహేశ్వరతీర్థంబును వింధ్యకంద

రంబున నమృతతీర్థంబును మండపంబున విశ్వరూపతీర్థంబును నీశ్వరపురంబున స్వాహా
తీర్థంబును బ్రచండయందు వైగలేయతీర్థంబును నమరకంటకంబునఁ జాండతీర్థంబును
ప్రభాసతీర్థంబునఁ బుష్కరతీర్థంబును సరస్వతియందు దేవమాతృతీర్థంబును మహాపద్మం
బున మహాలయతీర్థంబును బయోష్ణియందుఁ బింగళేశ్వరతీర్థంబును సింహికయందు
సింహికాతీర్థంబును సౌరవంబున రవితీర్థంబును గృత్తికాక్షేత్రంబునఁ గార్తికతీర్థంబును
శంకరగిరియందు శాంకరతీర్థంబును సుభద్రాసింధుసంగమంబున నుత్పలతీర్థంబును విష్ణు
పర్వతంబునఁ గాణపత్యతీర్థంబును జాలంధరంబున విశ్వముఖతీర్థంబును దారంబునఁ దారక
తీర్థంబును దేవదారువనంబునఁ బౌండ్రతీర్థంబును గాశ్మీరమండలంబునఁ బౌష్కరతీర్థంబును
హిమాద్రియందు భౌమహిమతుష్టికపౌష్టికతీర్థంబులును శంఖోద్ధారంబున శంఖధారక
తీర్థంబును బిండంబునందుఁ బిండనతీర్థంబును సిద్ధంబునందు వైఖానసతీర్థంబును నచ్ఛో
దంబునందు విష్ణుకామతీర్థంబును నుత్తరకూలంబున నౌషధ్యతీర్థంబును గుశద్వీపంబునఁ
గుశోదకతీర్థంబును హేమకూటంబున మన్మథతీర్థంబును గుముదంబున సత్యవాద్య
తీర్థంబును వందతియందు నాశ్వికతీర్థంబును వింధ్యంబునందు వైమాతృకతీర్థంబును
మాయాపురంబున జాతతీర్థంబును మందరంబున గౌతమతీర్థంబును గంధమాదనంబున
సుగంధకార్ముకతీర్థంబులును గిరికర్ణంబున విశ్వేశ్వరతీర్థంబును జిత్తంబున బ్రహ్మమయ
తీర్థంబును జంబూద్వీపంబునందు సుప్రశస్తతీర్థంబులుగాఁ జెప్పంబడియె. 694

క. ఈతీర్థంబులలోపల, స్నాతుండై నరుఁడు విష్ణుసందర్శనముఁ
బ్రీతిమెయిం జేసినఁ దత్, పాతకవర్గంబు లెల్ల దగ్ధంబు లగున్. 695

క. అనుదినమును నేతత్తీ, ర్థనామములఁ దలఁచు చున్నఁ బ్రాతస్సాయం
తనవేళలందు నరునకుఁ, గనఁగలుగును విష్ణుపదము కాయాంతమునన్. 696

గీ. కాని యీతీర్థములు సాటిగావు విష్ణు, నామసంకీర్తనమునకు నళినగంధి
మాపు హరినామ ముత్పత్తిమరణములను, బాపముల నెల్లఁ దీర్థముల్ పాఱద్రోలు.

—: వేత్రవతీమాహాత్మ్య కథనము :—

సీ. వినుము వచించెద వేత్రవతీనదీ, మాహాత్మ్యమును నీకు మంజువాణి
వృత్రునిచేతఁ గావింపఁగాఁబడినకూ, పమునుండి యానది బయలుదేఱెఁ
దద్దర్శనమునఁ బాతకము లెల్ల నశించు, దానఁ జేసినస్నానపానములను
సర్వరోగములును శమియించు నందొన, ర్చినదానమునఁ జేసి త్రిదివ మొదవు

గీ. ధరణిలో నుండుసర్వతీర్థములు దివము, నందు నివసించునట్టిసర్వామరులును
హరియు బ్రహ్మయు నేను మాయనుచరులును, వేత్రవతియందు నుందుము విడువకుండ.

గీ. అందులో మున్గునపుడు రాజ్యమును గోర, రాజ్యము లభించుఁ గోర స్వర్గమును గలుగు
స్వర్గమును ముక్తి గోర మోక్షమును దొరకు, వేత్రవతివంటినది లేదు ధాత్రియందు.

సీ. మహి నుండె మున్ను చంపకపురంబునను వి, దారుణుం డనెడిభూధవుఁ డొకండు
వాఁడు కుష్ఠవ్యాధివలనఁ బీడింపంగఁ, బడుచు దుస్సాంగత్యబలముచేతఁ
గావించుచును దుష్టకార్యంబు లెల్ల భం, గము సేయుచును ధర్మకార్యములకుఁ
బెద్దలతోడను బుద్ధి లేకుండంగ, వాదించుచు వితండవాదములను
గీ. వేఁట యాడంగ నొకనాఁడు విపినమునకు, నరిగి యొకలేడిపై నేనె నాశుగమును
దానిఁ దప్పించుకొని యది దైవికముగఁ, బఱచుచుండంగ నమ్మహీపాలకుండు.
వ. దానివెంటంబడి బహుదూరంబు పరువెత్తుచుం జని చని తృషార్తుం డగుట వేత్రవతీ నదీజలపానంబు గావించి యామృగంబు కానంబడమి నిరాశుం డై తిరిగి స్వగృహంబున కరుదెంచె. 701
సీ. అంతట నాత్మకుష్ఠామయంబు నశింప, నతఁడు పొందుచు విస్మయంబు మదినిఁ
దన్నదీజలమును ద్రావుటయే తన, వ్యాధి పోవఁగ హేతు వని గ్రహించి
యదిమొదలుగ భక్తి యామతిల్లఁగ నందె, యాచరించుచు స్నాన మనుదినంబుఁ
దత్స్నానమునఁజేసి తనదుష్టభావ మం, తయు నంతరించి సద్భావ మొదవ
గీ. ధర్మమార్గంబునం జొచ్చి దానములను, జలుపుచును విష్ణునామసంస్మరణమునను
గడపి జీవిత మెల్లను గట్టకడకు, ముదముతోడను వైకుంఠమునకుఁ జేరె. 702
గీ. సంగ మెచ్చోటఁ గలుగునో సాభ్రమతికి, వేత్రవతికిని నచ్చోట వెలయ భక్తి
స్నానదానాదివిధులను జలిపె నేని, జన్మరాహిత్యమును బొందు జనుఁడు దాన. 703
క. అని నుడువుటయును పార్వతి, విని సంతస మొదవ నాథ వేడుక గలిగెన్
విన సాభ్రమతీమహిమం, బును దెల్పుము నాఁగఁ బురరిపుం డి ట్లనియెన్. 704

—: సాభ్రమతీమాహాత్మ్యకథనము :—

సీ. మును కశ్యపుఁడు తపోధనులను దర్శింప, నైమిషాటవి కొకనాఁడు చనఁగ
నట నున్నఋషు లెల్ల నతనికిఁ దగినస, త్కారంబు గావించి తాపసేంద్ర
నీవు దక్షుండవు రావింపు మిలకు గం, గను నది నీనామమున వెలుంగు
నని పల్కుటయును గశ్యపుఁ డర్బుదాద్రియం, దయుతాబ్దములు తపం బాచరించె
గీ. నపుడు ప్రత్యక్ష మై యమ్మహర్షి కేను, వరము నిచ్చెద ననఁగ నప్పరమహాని
గంగ నిమ్మని కోర నేఁ గనికరించి, విడిచితిని నొక్కజటనుండి విబుధనదిని. 705
క. అంతట దానిం గై కొని, సంతసమునఁ గశ్యపుఁడును జనుదేరఁగ నా
శాంతిధను లెల్ల నమ్ముని, కాంతునిమహిమంబుఁ బొగడి కడుకొని యంతన్.
వ. ఆగంగకుఁ గాశ్యపి యని నామకరణంబు గావించిరి. 707
ఆ. మును భగీరథుండు ననుఁ గోర గంగను, నతని కిచ్చినాఁడ నాదియందుఁ
గశ్యపుఁడును బిదపఁ గాంక్షింప నతనికి, నిచ్చినాఁడ వాని కిచ్చినట్లు. 708
వ. కాశ్యపి కృతయుగంబునఁ గృతవతి యనియును త్రేతాయుగంబున గిరికర్ణిక యనియును

ద్వాపరయుగంబునఁ జందన యనియును గలియుగంబున సాభ్రమతి యనియును
నామంబులం బడసి జగద్విశ్రుతిం గాంచె. 709

సీ. సాభ్రమతియందు స్నానంబు సలిపె నేని, సకలపాపంబులును వినాశంబు నొందు
దానఁ గలుగు హరిప్రసాదంబు దాన, విష్ణుధామంబు ప్రాప్తించు వేని కేని. 710

వ. మాఘమాసంబునఁ బ్రయాగతీర్థంబునఁ బ్రాతఃకాలంబునం జేయుస్నానంబువలనను
గృత్తికాయోగంబుగలకార్తికపూర్ణిమాదినంబునం గావించుగంగాస్నానంబువలనను
జేకూరుఫలంబు సాభ్రమత్యవగాహంబునం బ్రాప్తించు. 711

ఆ. సకలరోగములను సకలాశుభములను, సాభ్రమతిజలంబు సమయఁజేయు
జగతిలోన నుండుసకలతీర్థములును, దానిలోన మిశ్రితంబు లగుట. 712

వ. సాభ్రమతికిఁ బూర్వతటంబునందు యవక్రీతుండును రైభ్యుండును గక్షీవంతుండును నుశిజుండును భృగువును నంగిరుండును గణ్వుండును మేధావియును బునర్వసువును వందియును నుత్తరతటంబునందు సుమధువును దత్తాత్రేయుండును దీర్ఘతముండును గౌతముండును గశ్యపుఁడును శ్వేతకేతువును గహోడుండును బులహుండును దేవలుండును విశ్వామిత్త్రుండును భరద్వాజుండును జమదగ్నియును గర్గుండును నుద్దాలకుండును దేవశర్మయును ధౌమ్యుండును నాస్తికుండును లోమశుండును నాభికేతువును లోమహర్షణుండును నుగ్రశ్రవుండును భార్గవుండును జ్యవనుండును వాలఖిల్యాదులును దపోనిష్ఠాగరిష్ఠులై నిత్యనివాసంబు గావింతురు. నీలకంఠతీర్థంబును నందహ్రదతీర్థంబును రుద్రహ్రదతీర్థంబును రుద్రమహాలయతీర్థంబును మందాకినియును నవోద్ఛ్యదయును సాభ్రమతియందు గూఢంబుగాఁ బ్రవహించుచుండు. 713

ఆ. అచటఁ దర్పణంబు నాచరించిన విధి, యుతము గాఁగ శ్రాద్ధ మొనరిచినను
నుద్ధరింపఁబడుదు రొకకల్పముననుండి, గతులు లేకయుండు పితరు లెల్ల. 714

—: బ్రహ్మచారితీర్థమాహాత్మ్యము :—

వ. సాభ్రమతియందు బ్రహ్మచర్యంబున బ్రహ్మచారులు ముక్తి నొందుటం జేసి తన్నామంబున బ్రహ్మచారితీర్థం బేర్పడియె. అది నాకుఁ బ్రియం బగుట నే నందు బ్రహ్మచారీశనామంబుతోడ లోకహితార్థం బుండి నన్ను సేవించువారలకు రాత్రివేళ యోగిరూపంబున దర్శనం బిచ్చి సర్వాభీష్టంబుల నెఱవేర్చుచుంటి. మద్దర్శనమాత్రంబున సకలవ్యాధులును సర్వపాతకంబులును నశియించు. బ్రహ్మచారితీర్థస్నానంబు నాకత్యంతప్రీతిదాయకంబు. తీర్థరూపంబునం దప్ప నే నచ్చట లింగరూపంబున నుండెడివాఁడం గాను. 715

సీ. మును సూర్యవంశసంభూతుండు బ్రహ్మదత్తుం డనుమేదినీశ్వరుం డొకండు
తత్తటంబున ఘోరతపము గావింపంగ, నతనికిఁ బ్రత్యక్ష మైతి నేను

నేనుఁ గోరె నప్పు డానరనాథుఁ డాగంగ, తనపేరఁ దీర్థ మై తనరునట్లు
వర మిచ్చితిని నేను వాఁడు కోరినయట్ల, యది దాన బ్రహ్మదత్తాఖ్య వడసె
గీ. నంత నాతఁడు సంతోష మావహిల్ల, నటఁ బ్రతిష్ఠించి గంగాధరాఖ్య నన్నుఁ
జనియెఁ దనరాష్ట్రమునకు నాస్థాన మయ్యె, నదియును దదాదిగను నుంట నందు నేను.
వ. బ్రహ్మచారీశగంగాధరులను ధ్యానించువాఁడు శివలోకముం బడయు. మఱియును.
సీ. పూర్వము రవికులోద్భూతుండు రాజఖ, డ్గుండను నా నొకనృపాలుండు గలఁడు
వాఁడు దురాత్ముఁ డై వర్తించుచుండిన, కారణంబునఁ గొంతకాలమునకు
జనియించెఁ దద్దేహమునఁ గుష్ఠరోగంబు, దానిచే నతఁడు సంతప్తుఁ డగుచు
నొకదినంబున దేహ ముజ్జగింపఁగ నెంచి, చనుదెంచి శీఘ్రమ సాభ్రమతికి
గీ. నందులో మున్గ యుత్థితుం డై కనంగఁ, గానఁబడదాయెఁ గుష్ఠంబు మేనిమీఁద
నంత నాతఁడు విస్మయం బంది యచటఁ, దపము గావించి మోక్షపదంబు నొందె.
వ. అది మొదలుగ దానికి రాజఖడ్గతీర్థం బన ప్రఖ్యాతియుం గలిగె. 719
సీ. మును భగీరథవంశమున సుదాసుం డను, భూధవుం డొకఁ డుండె భూరిబలుఁడు
జనియించె నతనికి సౌదాసుఁ డనియెడి, తనయుఁ డొక్కఁడు వాఁడు దైవికముగ
నొకనాఁడు శాపంబు నొంది వసిష్ఠమ, హర్షిచే దైత్యదేహంబు వడసి
స్నానంబు గావించి సాభ్రమతీతోయ, మున దాన శాపవిముక్తి నొందె
గీ. సాభ్రమతివంటితీర్థంబు జగమునందుఁ, గనఁబడదు దక్షిణోదధిగామినిగను
నది వికీర్ణవనంబునయందుఁ జొచ్చి, దాని కొనరించి పుణ్యతీర్థముగ నంత. 720

—: వికీర్ణతీర్థమాహాత్మ్యము :—

వ. అచ్చట శ్వేత వకుళ హిరణ్మయి హస్తిమయి వేత్రవతి సుభద్ర సాభ్రమతి యను
సప్తనదులు గా నయ్యె. 721
ఆ. ఆవికీర్ణతీరమందు శ్రాద్ధంబును, జలిపె నేని కల్పశతమువఱకుఁ
గలుగుఁ బితరులకు నఖండంబుగాఁ దృప్తి, గాణాపత్యపదము కర్త కొదవు. 722
ఆ. సర్వరోగములును శమియించు నొదవును, సర్వసంపదలును సంఘటిల్లు
సర్వసౌఖ్యములును జలిపినయెడ స్నాన, మును వికీర్ణతీర్థమున నరుండు. 723

—: శ్వేతతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును శ్వేతానదివలన శ్వేతతీర్థం బేర్పడియె.
క. ఒనరించి శ్వేతతీర్థం, బున స్నానం బచటనుండి మూఁడుదినంబుల్
కనిన మహాకాళేశ్వరు, ననఘుం డయి రుద్రలోక మాతం డొందున్. 725
క. శ్వేతాసంగమమందున్, స్నాతుం డయి పూజ చేసినను బిల్వముచే
భూతేశ్వరునకు నిర్గత, పాతకుఁ డై వాఁడు పొందుఁ బరమపదంబున్. 726

—: గణతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును వకుళానదివలనఁ జందసాలటంబున గణతీర్థం బేర్పడియె. అయ్యది గణాధిపతిస్థానంబు. 727

క. వకుళాసంగమమున ను, త్సుకతను స్నానంబు చేసి చూచినయెడలన్
వకుళేశ్వరు నతని కొసం, గళ తప్పదు నేను మామకస్థానంబున్ 728

ఆ. విశ్వదత్తుఁ డనెడివిభుఁ డిందువంశజుం, డొక్కఁ డచటఁ జేసి యుగ్రతపము
గాణపత్య మొందె గణపతికృపచేత, దానిమహిమ మెన్నఁ దరము గాదు. 729

వ. గణతీర్థంబునందు వసిష్ఠుండును వామదేవుండును గహోడుండును గౌశికుండును భరద్వాజుండును నంగిరుండును విశ్వామిత్రుండును వామనుండును గణపతిని సేవించి తపస్సిద్ధిం బడసిరి. 730

గీ. చలిపి వకుళాజలంబున స్నాన మచట, గణపతిని బూజ చేసినఁ గలుగు నాయు
వర్ధమును సంతతియు నువిద్యయును దేహ,సౌఖ్యమును విశ్రుతియును మోక్షమును దుదకు.

—: అగ్నితీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమత్యుత్తరకూలంబున నగ్నితీర్థంబును దత్సమీపంబునఁ బాలేశ్వరతీర్థంబును నేర్పడియె. అందు మాతృగణపరివేష్టితం బగుచండీపీఠంబును జండికేశ్వరుండును బాలేశ్వరుండును నుండె. 732

గీ. అగ్నితీర్థంబునను స్నాన మాచరించి, కాంచునెడలను జాముండికను బిశాచ
రూపములు తత్ప్రియుక్తసంతాపములును, దొలఁగి పరమపదంబు నొందుదురు తుదకు.

క. అక్కడఁ దిలచూర్ణంబునఁ, జక్కఁగఁ బిండములఁ జేసి శ్రాద్ధము వెట్టన్
మిక్కుటముగఁ దృప్తిం గని, చొక్కుచు సోలుచును దివముఁ జొత్తురు పితరుల్.

సీ. మును కుకర్దముఁ డనుజననాథుఁ డొక్కఁడు, పిండారపురమున నుండి జనుల
బాధ వెట్టుచు నిజపరిపాలనంబున, గావించుచును బాతకముల నెల్ల
నొకనాఁడు మరణంబు నొంది స్వకృతదుష్కృ, తంబునఁ బ్రేతరూపంబు వడసి
క్షుత్పిపాసలచేత క్షోభంబు నొందుచుఁ, దిరుగుచు నిల నెల్ల దిక్కు లేక

గీ. యొక్కదినమునఁ బ్రాక్పుణ్యయోగమునను, నగ్నితీర్థంబునకు వచ్చి యటఁ గహోడ
మౌని నీక్షించి మ్రొక్కి యాత్మప్రవృత్తి, యంతయును దెల్పి యేడ్వంగ నమ్మహర్షి.

గీ. ఏడ్వకుము రాజ నీపాప మెల్లఁ దొలఁగె, నభయముగ నిల్వు మని పల్కి యగ్నితీర్థ
జలము గైకొని వానిపైఁ జల్లె నంత, నాతనికి వచ్చె నిజరూప మద్భుతముగ. 736

గీ. అప్పుడు కహోడుఁ డతనిచే నగ్నితీర్థ, మందు శ్రాద్ధంబు చేయింప నతఁడు చేసి
శ్రాద్ధమును ధన్యతను జెంది చనియె దివ్య, యానమందు నధిష్ఠించి యమరపురికి.

క. అని పల్కుటయును మునిముఖ్యు, ట్లనియె గుకర్దముఁడు నేఁడు నంటివి పుణ్యం
బును దానిస్వరూపంబును, వినిపింపుము నాకు నాథ విశదము గాఁగన్. 788

39026

చ. [illegible] [illegible] తీ ట్లుబి యెను [illegible] [illegible]ర్దమునందు బ్రా
గ్జనన[illegible] భూసురుండు గా మదయింది స్వధర్మనిష్ఠుఁడై
నను భ[illegible]మునన్ బ్రతిదినంబును బ్రాహ్మణులన్ సపర్యలన్
దనుపుచు భోగవాంఛ విధమంబును బొందుటఁ బుట్టె భూపుఁడై. 739

గీ. అట్లు భూపాలుఁడుగఁ బుట్టి యతఁడు పూర్వ, పుణ్యఫలముగను విశేషభోగములను
ననుభవించుచు దుష్టుఁడై యప్పు డాచ, రించుటను బాపముల నెల్లఁ బ్రేత యయ్యె.

—: హిరణ్యాసంగమతీర్థమాహాత్మ్యము :—

క. పిదప హిరణ్యాసంగమ, మొదవెను సాభ్రమతి కందు నొనరించినచో
నుదయమున స్నానమును సం, పద లిహమున బ్రహ్మపదము పరమున నొదవున్.

—: అప్సరస్తీర్థమాహాత్మ్యము :—

వ. హిరణ్యాసంగమతీర్థంబున ము న్నూర్వశి జనియించుటంజేసి యప్సరస్తీర్థం బేర్పడియె. నరనారాయణు లచ్చటఁ దపంబు గావించుటంజేసి యయ్యది పరమపవిత్రస్థలం బయ్యె.

గీ. అచటఁ దపము గావించునట్టివారి, కేర్పడు హిరణ్మయాకార మేమిచెప్ప
నందు మున్ను హిరణ్యాక్షుఁ డాచరించి, తపమును హిరణ్మయం బైన తనువుఁ బడసె.

గీ. అచట జనమేజయుఁడు స్నాన మాచరించి, బ్రహ్మహత్యావిముక్తిని బడసె మున్ను
సలిపి గాధేయుఁ డచ్చోట స్నాన మొకఁ, డినమునను మున్ను కైలాసమునకుఁ జేరె.

—. ధర్మతీర్థమధురాతీర్థమాహాత్మ్యము :—

గీ. పిదప ధర్మావతీసంగ మొదవె సాభ్ర, మతికి నచ్చోట ధర్ముఁ డద్భుతము గాఁగఁ
దపము సేయుట ధర్మతీర్థంబు గలిగె, దానిమహిమంబు వర్ణింపఁ దరముగాదు. 745

వ. మఱియును గృష్ణుండు కంసాసురవధంబు గావింపఁ గుశస్థలిక నేఁగి నుద్యమించి ధర్మావతీసంగమంబున సప్తరాత్రంబులు నివసించి మధురార్కుని నచటఁ బ్రతిష్ఠాపించి యం దష్టాదశసహస్రసంఖ్యాకు లగుయజ్వలను నిలిపి యేఁగుటంజేసి యచ్చోట మధురాతీర్థం బనఁ బుణ్యతీర్థం బేర్పడియె. అచ్చట మాఘశుక్లసప్తమీదినంబున స్నానంబు గావించి మధురార్కునిఁ బూజించి కపిలాదానంబు గావించె నేని యాదిత్యలోకంబు నొందంగలుగు. 746

క. మును మాండవ్యుం డనియెడి, మునివరుఁ డొక్కండు తీవ్రముగను దపంబున్
బొనరుచుచు హరిద్వారం, బున నుండె దినంబు నక్తమును బహునిష్ఠన్. 747

సీ. ఆదేశమున కెల్ల నధిపుఁడై యపు డుండె, విశ్వమోహనుఁ డనువిభుఁ డొకండు
సోమచంద్రుం డనుసూనుఁ డొక్కం డుండె, వానికి బహుజనమానితుండు
వాఁ డొక్కనాఁ డొకవనములోపల వేఁట, లాడుచు నారేయి యుండె యుండె
నపు డొక్కతస్కరుం డపహరించెను వాని, ఘోటక ముబ్బురపాటు దోఁప

గీ. నంతఁ గానరామిని హయమప్పు డచటఁ, దహతహను బొంది భూపాలతనయుఁ డశ్వ
హరుని వెదకుట కనుపంగ నాత్మభటుల, దేశ మెల్లను వారలు తిరిగి తిరిగి. 748

గీ. కానరామిని గుఱ్ఱ మెక్కడను గూడఁ, గొనకు విసివి హరిద్వారమునకు వచ్చి
యచట నొకవృక్షమూలమునందుఁ దపము, సేయు చున్నమాండవ్యునిచెంత కరిగి.

క. ముని యేమియు మాటాడమిఁ, గనుమినిఁ గనులెత్తి వీఁడె గంధర్వహరుం
డని యెంచి వానిఁ గైకొని, చనుదెంచి నిజక్షితీంద్రసవిధంబునకున్. 750

క. జననాథ వీఁడె హయమున్, గొనిపోయినదొంగ పట్టుకొని వచ్చితి మీ
తని నావుడు నృపుఁ డీచో, రుని శీఘ్రమ శూలమందుఁ ద్రోయుం డనియెన్. 751

క. ఆతనియాజ్ఞను శూల, ప్రోతునిఁ గావించి మునివరుని వా రంతన్
బ్రీతిం గైకొని ధాత్రీ, నేతృబహూకృతులఁ జనిరి నిజగృహములకున్. 752

గీ. అంతట సమాధినిష్ఠుఁ డై నట్టికతన, నొడ లెఱుంగక మాండవ్యుఁ డుండె యందె
కొంతకాలంబు పిదపఁ జేకూర సంజ్ఞ, సర్వము నెఱింగి నిజయోగశక్తివలన. 753

సీ. శమనునిసన్నిధానమునకుఁ జని వేగ, కాల యేటికి నాకు శూలశిక్ష
కావించితివొ వినఁ గాంక్ష గల్గె వచింపు, మనవుడుఁ గాలుఁ డి ట్లనియె విప్ర
మును నీవు బాల్యంబునను గ్రుచ్చుటను శల, భమును శూలమున నీపగిది నేఁడు
చెందినాఁడవు శూలశిక్ష చేసినకర్మ, మనుభవింపక తప్ప దజున కైన

గీ. ననుడు మాండవ్యుఁ డాగ్రహం బావహిల్లఁ, గాల శిశుకృత్యమున కిట్టికఠినశిక్ష
యొనరిచినహేతువున శూద్రయోనియందు, జనన మొందుము క్షితిమీఁద ననిశపించె.

సీ. అంతట భయముచే నంతకుం డాతని, పదపంకజములను బట్టి వేఁడ
నమ్ముని కరుణ లో నంకురింపఁగ నిట్టు, లనియె నై వస్వత యవనియందు
వృషలుఁడ వై జనియించి యచ్యుతభక్తి, తనరార విదురాభిధాన మొంది
కొంతకాలం బుండి క్షోణిపైఁ దీర్థయా, త్రావ్యాజమున నొక్కతఱిని నేఁగి

గీ. సాభ్రమతికి ధర్మావతీసంగమందు, స్నాన మొనరింపఁ గల్గుపుణ్యమునఁ దొలఁగు
నవరవర్ణత్వ మద్దాన నామతిల్లుఁ, దత్క్షణంబున నీదివ్యతనువు నీకు. 755

క. అని పలికి యథేచ్ఛంబుగఁ, జనుటయు విదురుఁడుగఁ బుట్టి సమవర్తి ధరి
త్రిని ధర్మావతిసంగం, బున స్నానము చేసి శాపముక్తిం బడసెన్. 756

క. కావునఁ దత్తీర్థంబునఁ, గావించిన స్నాన మెట్టికలుషం బైనన్
బోవుటను దత్క్షణంబునఁ, బావనతం గాంచి ముక్తిఁ బడయుదురు జనుల్. 757

—: కంబుతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతివలనఁ గంబుతీర్థం బేర్పడియె. అందుఁ జేయుస్నానదానాదు లనంత
ఫలంబులు. 758

గీ. అచట మున్ను విశ్వామిత్రుఁ డాచరించి, తపమును బ్రజార్థి యై కాంచెఁ దత్క్షణంబ
కార్యసిద్ధిని సంతానకాంక్ష యున్న, వారలకుఁ గంబుతీర్థంబు వాంఛ దీర్చు. 759

—: కపితీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతివలనఁ గపితీర్థం బేర్పడియె. అందు స్నానంబు గావించి కపీశ్వరాదిత్య
దర్శనంబు సేసె నేని బ్రహ్మహత్యామహాపాపంబు భస్మీభూతం బగు. దానం జేయు
పుణ్యకర్మంబు లాయుర్ధనరూపభోగబలపుత్రధర్మప్రదంబు లగు. 760

గీ. చైత్రశుక్లాష్టమిని నందు స్నానదాన, తర్పణాదులు సేసినఁ దత్ఫలంబు
తరము గాదు వచింప విధాత కేని, కట్టె నచ్చోట సేతువుఁ గపిగణంబు. 761

—: ఏకధారతీర్థమాహాత్మ్యము :—

వ. పిమ్మట సాభ్రమతివలన నేకధారం బనుతీర్థం బేర్పడియె. 762

గీ. ఏకధారంబున మునింగి యేకరాత్ర, ముపవసించి యెవం డేని యుర్విలోన
స్వామిదేవేశపూజను జలిపె నేని, కులశతము నుద్ధరించినఫలము నొందు. 763

—: సప్తధారతీర్థమాహాత్మ్యము :—

వ. పిమ్మట సాభ్రమతివలన సప్తధారతీర్థం బేర్పడియె. అందుఁ గావించుస్నానదాన
శ్రాద్ధాదు లపరిమితఫలప్రదంబులు. 764

గీ. సప్తలోకంబులందును సప్తరూప, ములను బ్రవహించుగంగానదులును సప్త
ధారమున నుండుటను శ్రేష్ఠతను వహించె, సప్తధారంబు తీర్థసంచయములోన. 765

—: మంకితీర్థమాహాత్మ్యము :—

సీ. కౌషీతకుండు నాఁగను గలం డిలలోనఁ, దాపసుం డొకఁడు త్రేతాయుగమున
వానికి మంకి నా సూనుఁ డొక్కరుం డుండె, ధర్మసంరక్షణాతత్పరుండు
మంకి కిద్దఱు సతీమణు లేరుపడిరి సు, రూప నాఁగను విశ్వరూప నాఁగ
నాయిద్దఱకును లేదయ్యె సంతానంబు, దానిచే మంకి సంతప్తుఁ డగుచు

గీ. గురునికడ కేఁగి మ్రొక్కి తచ్చరణములకు, స్వామి పుత్రులు లేనట్టివారి కూర్ధ్వ
గతులు లే వందు రార్యు లాకతనఁ జింత, యంకురించె నపుత్రుఁడ నైననాకు. 766

క. నాదుఃఖంబు దొలంగఁగ, నేదైన నుపాయ మున్న నెఱిఁగింపుము నీ
పాదములఁ బట్టినాఁడను, గా దనకు మటంచు నేడ్చెఁ గన్నీ రొలుకన్.

గీ. అతనిదుఃఖంబునకు మది నామతిల్లఁ, గనికరము దేశికుం డిట్టు లనియె మౌని
కలుగుదురు నీకు సుతులు శీఘ్రముగ సప్త, ధారమున కేఁగి సలుపుము తపము నచట.

చ. అనవుడు మంకి యాత్మహృదయంబున హర్షము పొంగి పొర్లఁగాఁ
గొనకొని సప్తధారమునకుం జని వర్షచతుష్టయం బటన్
బొనరిచి ఘోర మైనతపముం గని పుత్రులఁ బౌత్రులం గనుం
గొని యవసానమందుఁ దనకోరిక దీరఁగఁ జేరె నాతఁడున్. 769

వ. మంకిమహర్షి తపస్సిద్ధిం జెందుటం జేసి యచ్చట మంకితీర్థం బేర్పడియె. అందు
స్నానంబు గావించిన వంధ్యలకును బుత్రప్రాప్తి యగు. పిదప సాభ్రమతి బ్రహ్మవల్లి
నదితోడం గూడుటవలన బ్రహ్మవల్లితీర్థంబేర్పడియె. 770

— : బ్రహ్మవల్లితీర్థమాహాత్మ్యము : —

ఆ. అది ప్రయాగతుల్య మచట శ్రాద్ధంబును, దర్పణమును జేయ ద్వాదశాబ్ద
తృప్తి పితరు లొంది దీవింతు రన్వయ, వృక్ష మనుదినంబు వృద్ధి నొంద. 771

ఆ. బ్రహ్మవల్లిలోనఁ బర్వకాలములందు, స్నానదానవిధులఁ జలిపె నేని
సకలతీర్థసేవ సలిపినఫల మొంది, యేఁగు విష్ణుపురికి నవ్వాఁ డేని. 772

— : వృషతీర్థమాహాత్మ్యము : —

వ. పిదప సాభ్రమతివలన వృషతీర్థం బేర్పడియె.

సీ. పూర్వము గోలోకమునను క్రీడించుచు, వృషము గోవులతోడ వేడ్కఁ దిరుగ
మూత్రంబు విసువ నమ్మూత్రంబు నామీఁదఁ, బడుటయు నేను గోపంబు నొంది
శాపం బొసంగితి సంజ్ఞాచ్యుతంబులై, క్షోణి నొందఁగ వృషగోవులకును
నంతట నవి యెల్ల నరుదెంచి నాసమ, క్షమునకు శాపమోచనము వేఁడ

గీ. సాభ్రమతిలోన మునిఁగిన శాపముక్తి, గలుగు నని నేను జెప్పంగఁ జలిపి యట్లె
చనియె నవి యెల్ల గోలోకమునకు శాప, తీర్ణ మయి దాన నట వృషతీర్థ మొదవె.

గీ. స్నాన మొనరించి వృషతీర జలమునందుఁ, జలుప గోదానమును వృషోత్సర్జనమును
గలుగును జతుర్దశేంద్రులు గడచువఱకు, వారలకు స్వర్గలోకనివాససుఖము. 775

గీ. వృషభగోపూజలను జేసి రేని యచటఁ, గలుగు గోలోకవాసభాగ్యంబు బోధి
వృక్షరోపణ మచటఁ గావించి రేని, కలుగుఁ బితృలోకవాసభాగ్యంబు వింటె. 776

క. ఆమలకపంచకము నా, ధామంబున నాటునట్టి ధన్యాత్ములకుఁ
దామోదరుం డొసంగు ని, హాముత్రసుఖంబు లెల్ల ననవరతంబుఁ. 777

— : సంగమేశ్వరతీర్థమాహాత్మ్యము : —

వ. పిదప సాభ్రమతీతటంబున సంగమేశ్వరతీర్థం బేర్పడియె. 778

సీ. హస్తిమతీతటమందుఁ గౌండిన్యుఁడు, నారాయణునిఁగూర్చి ఘోరతపము
గావించు చుండంగఁ గడచెను బహుకాల, ముచితంబుగను నంత నొక్కనాఁడు
ప్రవహింపఁ దొడఁగె వర్షాకాల మగుటను, హస్తిమతీనది యతఁడు మునుఁగ
నప్పుడు కౌండిన్యుఁ డంతరాయము గల్గఁ, దనతపంబునకుఁ గ్రోధమును బొంది

గీ. కలియుగంబున నపగతసలిల గాఁగ, హస్తిమతిని శపించి యనంతరంబ
తాను జనియెను వైకుంఠధామమునకు, హస్తిమతి నిర్జలాకార మునల నొందె. 779

గీ. సాభ్రమతి హస్తిమతితోడ సక్తమగుట, సంగమేశ్వరతీర్థ మై శ్లాఘ కెక్కె
నాస్థలంబందుఁ జేయుస్నానాదివిధులు, బ్రహ్మహత్యాదిసకలపాపముల నడఁచు. 780

—: రుద్రమహాలయతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతీతటంబున రుద్రమహాలయతీర్థం బేర్పడియె.

గీ. ముక్తి చేకూరుఁ గేదారమున జలంబుఁ, ద్రావ రుద్రమహాలయస్థానమందు
స్నానమాత్రంబుననె ముక్తి సంఘటిల్లు, దానికిని దీనికినిఁ దారతమ్య మిదియె. 782

వ. కార్తికపూర్ణిమయందుఁగాని వైశాఖపూర్ణిమయందుఁగాని రుద్రమహాలయతీర్థంబున
వృషోత్సర్గంబు గావించె నేని కైలాసవాస భాగ్యంబు చేకూరు. 783

గీ. ఒక్కపరి నేను కైలాస ముజ్జగించి, యచ్చటికిఁ బోయి మునుఁగుచు ననుదినంబుఁ
గ్రోలుచు జలంబు నటఁ గొంతకాల ముంట, నయ్యె నయ్యది రుద్రమహాలయంబు.

క. అచ్చటఁ బెట్టెడిశ్రాద్ధము, గ్రచ్చఱ నరకాబ్ధినుండి గట్టెక్కఁజేర్
వచ్చి మదావసథమునకు, నుచ్చైస్స్థానంబులందు నుందురు పితరుల్. 785

—: ఖడ్గతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతివలన ఖడ్గతీర్థం బేర్పడియె.

గీ. ఇచటఁ గార్తికపూర్ణిమయందు మునిఁగి, ఖడ్గతీర్థేశ్వరునిఁ గాంచఁగలిగె నేని
ధనముధాన్యంబుబలముసంతతియుసుఖముఁ, జెందియిహమునఁద్రిదివంబునొందుఁదుదకు.

క. వైశాఖంబునఁ దత్తీ, ర్థేశుని రాజ్యాశతోడ నీక్షించినచో
నీశప్రసాదమున ధా, త్రీశుం డై వాఁడు సుఖము లెల్లం బడయున్. 788

—: చిత్రాంగవదనతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతివలన మాలార్కక్షేత్రంబునఁ జిత్రాంగివదనతీర్థం బేర్పడియె.

గీ. అచట స్నానంబు చేసి మాలార్కదేవ, పూజ గావించునెడలను బోవు నఖిల
కుష్ఠరోగంబు లొనగూడుఁ గోరుకొనిన, యర్థసంతతు లెల్ల మాలార్కకృపను. 790

గీ. విధివిధానంబునను నర్కవిగ్రహమున, కచట నభిషేక మొనరించినట్టు లైన
నాయురారోగ్యవిద్యాధనాఢ్యు లైన, వరకుమారులఁ గను నెట్టివంధ్య యేని. 791

వ. మాలార్కక్షేత్రంబున స్నానసంధ్యాజపహోమస్వాధ్యాయదేవతార్చనంబులు భాను
వారంబునం గావించినఁ దత్పుణ్యం బక్షయంబు.

క. భానువ్రతముం జేసిన, మానవుఁ డెచ్చోట భువనమాన్యుం డగుచున్
నానాసుఖములు గని ధర, లోనన్ మది నేఁగు భానులోకంబునకున్. 793

క. మృతవత్సం దగునొక భూ, పతి మును గావించి యటఁ దపంబును నియతిన్
శతవర్షాయుర్భాగ్యా, న్వితు లగుపుత్రులను బడసె విస్మయ మొదవన్. 794

— చందనతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతివలన నామోదీక్షేత్రంబునఁ జందనతీర్థం బేర్పడియె.

సీ. మును ద్వాపరమున భీముఁడు దుస్ససేనుని, గాత్రంబు చీల్చి రక్తంబు ద్రావి
తద్రక్తసిక్తహస్తయుగ్మంబుచేతను, ద్రౌపదీకేశబంధన మొనర్చి
తనప్రతిజ్ఞను బూర్తి యొనరించుకొని తీర్థ, యాత్ర గావింపంగ నాత్మ నెంచి
స్వర్గలోకమునుండి చందనద్రుమమును, గొనివచ్చి జను లెల్ల వినుతి సేయ

గీ. భ్రాతృయుతముగ మొదట సాభ్రమతి కేఁగి, తత్తటంబునఁ జందనతరువు నాఁటె
దానఁ జందనతీర్థాఖ్య దాని కొదవెఁ, దన్మహత్త్వంబు నెన్న నాతరము గాదు. 796

వ. తత్పుణ్యతీర్థప్రభావంబునఁ జందనపాదపంబు లింగరూపముం బొంది చందనేశ్వరుం డను
విశ్రుతిఁ బడసె. 797

క. కైవర్తకుఁ డనునొకథా, త్రీవరుఁ డొనరుచుచుఁ దన్నదీస్నానంబుల్
గావించి చందనేశ్వర, సేవను గైలాసమునకుఁ జేరంగలిగెన్. 798

గీ. స్నాన మొనరించి తత్తీర్థజలమునందుఁ, జేసి పితృతర్పణంబును జేసె నేని
చందనేశ్వరపూజను సకలపాప, ముక్తుఁడై నాకడకు వచ్చి ముక్తి గాంచు. 799

—: జంబుతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతివలన జంబుతీర్థం బేర్పడియె. 800

సీ. మును వధియింప రాముఁడు రావణుని జాంబ, వంతుఁ డాహ్లాదవైవశ్యమునను
జగమునం దెల్లను జాటించుచును రావ, ణునినాశనమును రామునిజయంబు
నొకహ్రదంబున స్నాన మొనరించి లింగంబు, స్థాపించి తత్తటస్థలిని జనియె
సాభ్రమతీనదీసంగంబుచే నాహ్ర, దం బొందె జంబుతీర్థప్రశస్తి

గీ. తత్తటస్థితలింగంబు ధరణియందుఁ, గొనియె జాంబవదీశ్వరుం డనెడిపేరు
జంబుతీర్థంబులో మున్ను సంస్మరించె, నేని రాముని వాఁడు నాహితుఁడు గావె.

గీ. నేనె రాముఁడ రాముఁడె నేను నాకు, రామునకు లేదు భేదంబు రామనామ
మెవరు స్మరియించు చుందురో యెపుడు గూఢ,ఘోరభవవారిధిని దాఁటువారు వారె.

గీ. జంబుతీర్థంబునం జేయుస్నానదాన, తర్పణాదులు నాకు సంతసము గొలుపు
దానఁ దత్పుణ్యకార్యవిధాత లెల్ల, నాపదంబున నుందు రానంద మొదవ. 803

—: ఇంద్రగ్రామతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమత్యుత్తరతటంబున నింద్రగ్రామతీర్థం బేర్పడియె. 804

గీ. మును సురాధీశుఁడైనయింద్రునకు రాక్ష, సాధిపతి యైననముచికి నాజి యయ్యె
నందు వారు పరస్పర మస్త్రములను, బట్టుకుండఁగ నని సేయఁ బ్రబలిన వట్టి. 805

క. సంగరమును గావింపఁ దొ, డంగిరి ఘోరముగ నుత్కటం బగుశక్తిన్
సింగములుబోలె నార్చుచు, నింగియు భూమియును నిండ నినదంబులచేన్. 806

సీ. అప్పుడు నభోవాణియాదేశమునఁ జంపె, నముచి నింద్రుండు ఫేనంబుచేత
దానిచే బ్రహ్మహత్యాపాతకము చుట్టు, కొనఁగ నింద్రుని దుఃఖమునను వజ్రి
ధిషణునికడ కేఁగి దేశికోత్తమ బ్రహ్మ, హత్యాఘశమన మెట్లగునొ చెప్పుమ
యని వేఁడుటయును బృహస్పతి దేవేంద్ర, సాభ్రమతీనదీజలమునందు
గీ. స్నాన మొనరింపు మీ వేగి సత్వరంబ, సర్వపాపంబులును గూడ సమసిపోవు
నని వచించుటయు మహేంద్రుఁ డట్లు చేసి, బ్రహ్మహత్యాఘముననుండి పడసి ముక్తి.
గీ. ధవళతను వయి తన్నదీతటమునందు, స్థాపనము సేసి లింగంబుఁ జనియె నంతఁ
గామగవి వచ్చి యింద్రలింగమున కచట, స్తన్యమున నభిషేకంబు సలిపి చనియె. 808
వ. దాన నాలింగంబు ధవళాకారముం బడసి ధవళేశ్వరుం డనువిశ్రుతి కెక్కె. ఆస్థలం
బింద్రగ్రామం బనుపుణ్యతీర్థం బయ్యె. ఆపుణ్యతీర్థంబునందుఁ బూర్ణిమాదర్శసంక్రాంతి
గ్రహణాదిపర్వకాలంబులందు శ్రాద్ధంబు గావించి రేని తత్పితృవర్గంబు ద్వాదశవార్షిక
సంతృప్తిం జెందు. 809
గీ. అచట నన్నంబు నొక్కబ్రాహ్మణున కిడిన, శ్రోత్రియున కిచ్చిన సవత్సశుక్లగోవు
సలిపినను రుద్రజపమును స్వల్పముగను, గోటిగుణితఫలంబు చేకూరుఁ జూవె. 810
వ. అర్కపుష్పశ్వేతార్కపుష్పకహ్లారదూర్వాబిల్వపత్త్రంబులచే భానువారంబున నేనియు
సోమవారంబున నేనియు ధవళేశ్వరార్చనంబు గావించిన సర్వరోగనివారణంబును సకల
దోషక్షయంబును గైలాసవాసంబునుం గలుగు. 811
క. ఒనరించిన నుపవాసం, బును నింద్రగ్రామతీర్థమున నెవ్వం డై
నను నాచంద్రార్కంబును, ననిమిషలోకంబునందు నతఁడు వసించున్. 812
ఆ. నేను గృతయుగమున నీలకంఠుఁడను ద్రే, తాయుగమున హరుఁడ ద్వాపరంబు
లోన శర్వుఁడఁ గలిలోపల ధవళేశ్వ, రుండ వింటె నాస్వరూప మబల. 813
సీ. పూర్వ మింద్రగ్రామమున నంది యనువైశ్యుఁ, డొకఁ డుండె మద్భక్తుఁ డుత్తముండు
ప్రతిదివసమును బ్రభాతకాలమున వాఁ, డొనరించి ధవళేశ్వరునకుఁ బూజ
నరుదెంచుచుండు గృహంబున కటు లుండ, నొకదివసమున దైవికము గాఁగ
నరిగి మహాకాలుఁ డనుకిరాతుఁడు చూచి, యచటిలింగమును మధ్యాహ్నవేళఁ
గీ. గలుగ నెడలోన నాకస్మికముగ భక్తి, లింగమున నున్నపూలు తొలంగ వైచి
సాభ్రమతి కేఁగి కొని నోట జలము నొక్క, చేత బిల్వముఁ బల మొకచేత వచ్చి.
సీ. గండూషజలముచేఁ గడిగి యాలింగంబు, దానిపై బిల్వపత్త్రంబు నెట్టి
యర్పించి మాంసంబు నాహారముగ మ్రొక్కి, స్వామి నీపూజ నేఁ జలుపు చుందు
నన్వహంబును నిది యాదిగా నని చేసి, శపథంబు నింటికిఁ జనియెఁ దాను
మఱునాఁడు నంది సమాగతుం డయి ప్రభా, తమ్మున నటకుఁ బూర్వమ్మువోలెఁ
గీ. జూచి యుచ్ఛిష్ట మైనయచ్చోటు దుష్టుఁ, డెవఁడొ కావించె నిది యని యెంచి మదినిఁ
దత్స్థలం బంతయును క్షాళితం బొనర్చి, పూజ యొనరించి శివలింగమునకుఁ జనియె.

గీ. అంత నాతఁడును మరల మధ్యాహ్నవేళ, యరుగుదెంచి లుబ్ధకుం డటు మున్ను పూర్వ
మట్ల యొనరించి శివపూజ యరిగె నంత, యంత మునినాథుఁడును మునుఁబోలె నరుగుదెంచి.

సీ. పూర్వదినంబునఁ బోలె నుచ్ఛిష్టమై, కనుపించునది చూచి గాంచి వగచి
బ్రాహ్మణోత్తములను రావించి జరిగిన, విషయంబు నెల్లను విశదపఱచ
వార లెల్లరును దత్కారణంబు నెఱుంగ, నెంచి యచ్చోటున పొంచి యుండ
నరుగుదెంచి కిరాతుఁ డతిభీకరాకార, మున నాస్థలమునకు మున్నువోలెఁ

గీ. గడిగి లింగంబు వక్త్రోదకమున బిల్వ, పత్రముల నుంచి లింగంబుపైని బెట్టి
మాంసనైవేద్యమును బ్రణామంబు సేసి, చనియె నది చూచి వా రెల్ల స్పష్టముగను.

సీ. క్రూరాత్ముఁ డగులుబ్ధకునితోడ వైరంబు, తగ దని యెంచి చిత్తంబులందు
నంది యీలింగంబు నిం దుండనీయక, కొనిపొమ్ము నీగృహంబునకు నిపుడె
యనవుడు నావైశ్యుఁ డాలింగమును బీకి, కొనిపోయి తనయింటఁ గుదురుపఱచి
పూజింపఁ దొడఁగెను బూర్వమట్టులె యంతఁ, బరదినంబున బోయ యరుగుదెంచి

గీ. లింగము శివాలయంబున లేమిఁ జూచి, పరితపించుచు మదిలోనఁ బ్రమథనాథ
యెచటి కేఁగితి వింతలో నిల్లు విడిచి, తెలుపు మీ విచ్చటికి వచ్చి తెలుప వేని. 818

క. నాతనువును విడనాడెద, నేతత్క్షణమంద యోల యీమేను భవ
ప్రీతికర మైనసేవను, జేతస్స్థైర్యంబుతోడఁ జేయక యున్నన్. 819

చ. అని వచియించి తత్క్షణమునందె కరాచరిచే స్వదేహ, మె
ల్లను దెగఁగోసి తద్గతపలం బఖిలంబును లింగగర్తమం
దనువుపడంగ నుంచి శివ యాత్మసమర్పణముం బొనర్చితిన్
గొను మని పల్కి కంఠమును గోసికొనన్ గమకించుచుండఁగన్. 820

సీ. ప్రత్యక్షమై నేను బరివారయుతముగ, నతనికి లుబ్ధక యాఁగు మింకఁ
గోరినవర మిత్తుఁ గోరుకొ మ్మనవుడుఁ, బ్రణమిల్లి వాఁడు మత్పాదములకుఁ
దండ్రి నీదాస్యంబు దప్ప నా కన్యంబు, వల దేదియును నని పలుకుటయును
దోడనె నేను సంతోషించి వానికిఁ, బార్షదాగ్రేసరపదము నొసఁగి

గీ. డమరునాదంబు గావించుటయును నంది, దాని విని వచ్చి వేగ యాస్థానమునకు
నాకడ వెలుంగులుబ్ధకనాథుఁ జూచి, కలుగి విస్మయ మాతనికడకుఁ జేరి. 821

సీ. లుబ్ధక నీమదిలోఁ గలభక్తిని, గనుఁగొనఁజాలనికారణమున
నీ వొనర్చెడిపూజ నేను హేయంబుగాఁ, దలఁపెట్టి లబ్ధపాతకుఁడనైతి
క్షమియించి నాయపచారంబుఁ దావక, భక్తునిగా నన్నుఁ బరిగణించి
శివకృపాపాత్రునిఁ జేయుము నాఁగ విని, త్వద్విధంబుఁ జెప్పె లుబ్ధకుఁడు వాని

గీ. అంత నేను మనఃప్రీతి నుంచి నంది, భక్తపాలుఁడను వానిఁ బార్షదునిఁగ
నేలి యాని వారితోఁ గైలాసమునకు, వచ్చినాఁడను నిర్జరవరులు పొగడ. 822

వ. అంతట నావుడాశకాలమందు శివపురమున మధ్యాహ్నకాలమున నై మధ్యాహ్నకాలంబున
నాదర్శనంబు గావించువార లైరి.

క. కావున ధవళేశ్వరునకుఁ, గావించెద మెదుట భక్తిగలిగినవారై
దేవార తేని సేవను, నావారలె వారు వింటె నళినదళాక్షీ. 824

క. ధవళేశ్వరసన్నిధిలో, నవ రేనియుఁ గాంచి రేని మృతి నవ్వారల్
రవిచంద్రు లుండువఱకును, నివసింతురు మామకీననిలయమునందున్.

—: బాలాపతీర్థమాహాత్మ్యము :—

వ. పిదప సాభ్రమతీతీరంబున బాలాప మనుతీర్థరాజం బేర్పడియె. 826

సీ. కణ్వమహామునికన్య బాలావతి, సాభ్రమతీతటసలిలని మున్ను
గావించు చుండ నుత్కటమైనతపమును, భానుని భర్తగాఁ బడయఁగోరి
యామెమునస్సైర్య మరయంగ నొకనాఁడు, సవిత బ్రహ్మర్షి వేషంబుఁ దాల్చి
తత్సమతీమునకు దయచేయుటయు నామె, పూజించె విధ్యుక్తముగను వాని

గీ. నంతటను భాస్కరుం డిట్టు లనియెఁ దన్వి, బ్రహ్మచర్యంబునం దున్న బ్రాహ్మణుండ
నగుటచే నాకుఁ గన్యక వై ననిన్ను, నై కొనఁగ ధర్మపత్నిగాఁ గాంక్ష యొదవె. 827

క. అనవుడు బాలావతి యి, ట్లనియెను భూసురవరేణ్య యర్కున కర్పిం
చినమేను దప్ప నే దై, నను గోరు మొసంగుదాన నాకడ నున్నన్. 828

సీ. అనవుడు భాస్కరుం డామెమాటలు విని, పావనశీల యీబదరములను
వండి పెట్టుము నేను వచ్చెద స్నానంబు, నొనరించి భక్షింప నని వచించి
బదరపంచకము నాపంకజాక్షి కొసంగి, చనియె నింద్రగ్రామమునకు నంత
నామె యగ్ని రవిల్చి యాపండ్లు వండుచు, నుండంగ నయ్యావి యుడుక వయ్యె

గీ. నంతటను నున్నకాష్ఠచయంబు నెల్ల, నామె వినియోగ మొనరించి యప్పటికిని
బదరములు పక్వములు గామిఁ బాదములను, బ్రొయ్యిలోఁ బెట్టి జ్వాలలు వుట్ట నూఁదె.

గీ. అంటుకొని పాదముల కంత నగ్ని మండు, చుండుటయు నామె హర్షంబు నొందుచుండె
నప్పు డది చూచి మార్తండుఁ డామెయెదుట, స్వస్వరూపంబుతో నిల్చి సత్వరముగ.

సీ. బాల నీభక్తికిఁ బరమహర్షం బయ్యె, నీ దేరుఁ గాక నీయాశ్రితంబు
దీపించుఁ గాక యీతీర్థంబు నీనామ, మున విశ్రుతికి నెక్కి ముజ్జగముల
స్నాతుఁడై యెవఁ డేని నీతీర్థమునయందు, మూన్నాళ్లు సనియమంబుగ వసించి
యనుదివసమును రక్తాదిత్యముఖమును, గనిన మల్లోకంబు గాంచఁగలుగు

గీ. భానువారంబునందును బర్వదినము, లందు బాలాపతీర్థమునందు మునిఁగి
దేవఋషిపితృవర్గసంతృప్తి గలుగఁ, దర్పణము సేయువాఁడు ముద్ధాము మొందు. 831

గీ. అబల బాలాపతీర్థమునందు రక్త, ధేనుదానంబు చేసినమానవుండు
నొందు యజ్ఞఫలంబును నితఁ డొందు, వాని కబ్జాక్ష స్వర్గనివాస మొదవు. 832

క. అని పల్కి నిజనికేతన, మునకుం గొనిపోయి కణ్వమునినాథకుమా
రిని దనకుఁ గళత్రంబుగ, నొనరిచికొని సౌఖ్యజలధి నోలాడించెన్. 833

సీ. మఱియును దత్తీర్థమహిమ మిం కొక్కటి, వినిపించెదను నీకు వినుము గౌరి
మును వృద్ధమహిషంబు చనుదెంచి యట కొంచు, దప్పి దీర జలమ్ముఁ ద్రావ నెంచి
దిగి దానిలో లేవఁ దగుశక్తి లేమిని, మునిఁగి నీటను బ్రాణములను విడిచి
తత్తీర్థమహిమచేతను గాన్యకుబ్జేశ, తనయుఁ డై లేచి తద్వనమునుండి
గీ. యాత్మపూర్వజనుస్స్మృతి నంది విస్మ, యంబు గలుగంగఁ దీర్థమాహాత్మ్యమునకు
నచట నొనరించి దానంబు లమితముగను, జలిపి లింగప్రతిష్ఠను జనియె నంత. 834

వ. ఆలింగంబు మహిషేశ్వరుం డనువిశ్రుతిం బడసె.

గీ. స్నాన మొనరించి తత్తీర్థజలమునందు, నొనరిచినయెడ మహిషేశ్వరునకుఁ బూజ
భస్మ మై పోవు సర్వపాపములు దానఁ, జేకుఱు నభీప్సితార్థసంసిద్ధు లెల్ల. 836

గీ. పూర్వముననుండి పశ్చిమంబునకుఁ బోవు, సాభ్రమత్యుదకంబు ప్రశస్తతమము
కానరా దెట్టితీర్థోదకంబు గూడ, దానితో సాటి చేయంగఁదగిన దిలను. 837

—: కావ్యతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబునఁ గావ్యతీర్థం బేర్పడియె. 838

సీ. సాభ్రమతీనదీజలమందు శుక్రుఁడు, స్నాతుఁడై పూర్వము శ్రద్ధతోడఁ
దత్తీర్థగతుని దుర్ధర్షేశ్వరుని గొల్చి, తదనుగ్రహంబుచేతను గ్రహించె
సంభావ్య మగుమృతసంజీవినీవిద్య, నాకారణంబున నాస్థలంబు
కావ్యతీర్థం బనుఖ్యాతిఁ గైకొనె నందుఁ, జేసెడిస్నానంబు సిద్ధిదంబు
గీ. తత్క్షణంబున నభిమతార్థంబు లెల్లఁ, బ్రాప్త మగును దుర్ధర్షేశ్వరార్చనమున
వినుము దీనికి నొకనిదర్శనము నీకు, వినుతు నిప్పుడె శర్వాణి విశదముగను. 839

సీ. మును సురాసురయుద్ధమున వృత్రజితుఁ డయి, యరిగి మహేంద్రుఁడు గురునికడకు
నాచార్య విజితుఁడ నైతి వృత్రునిచేత, దిక్కు నా కిఁక నేదియును లేదు
తల్లియుఁ దండ్రియు దైవతంబును నీవె, శరణుచొచ్చితిని ద్వచ్చరణములనె
సంగ్రామమున నాకు జయము సంప్రాప్తించు, విధముఁ దెల్పుము కృపాన్వితుఁడ వగుచు
గీ. నని నయంబున వేడంగ నమరగురుఁడు, కరుణ వెలయంగ నాతనిఁ గాంచి యింద్ర
సాభ్రమతిలోన స్నానంబు సలిపి చేయు, మాశువుగను దుర్ధర్షేశ్వరార్చనంబు. 840

క. అని నుడువుటయు మహేంద్రుం, డొనరించి గురూక్తరీతి నొగి దుర్ధర్షే
శునిచేఁ బాశుపతాస్త్రము, గొని దాన వధించె వృత్రకోణపనేతన్. 841

—: ఖడ్గధారతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబున ఖడ్గధారం బనుగుప్తతీర్థం బేర్పడియె. 842

గీ. కలదు శ్రీవృక్ష మచ్చటఁ గలఁడు తన్మ, హీరుహముక్రింద ఖడ్గధారేశ్వరుండు
వాని కెవ్విధి నైన నెవ్వార లేని, సలుపునెడఁ బూజ వారికిఁ గలుగు ముక్తి. 843

సీ. చండుం డనెడిలుబ్ధకుం డొక్కరుఁడు మున్ను, సలుపుచు ననిశంబు జంతుహింస
శివరాత్రినాఁడు జంతువొకండు గూడను, దొరకమిఁ దనకు క్షుద్భరముతోడఁ
దిరుగుచు సాభ్రమతీతీరమున దైవి, కంబుగ నొక్కకోలంబుఁ జూచి
దానిని వధియించుతలఁపుతో శ్రీవృక్ష, మెక్కి వింటను బాణ మెక్కువెట్టి

గీ. యంతలోఁ బోత్రి కనరామి నందె యుండి, కాంచుచును వృక్షపర్ణముల్ కాలఁద్రోయ
తన్మూలస్థమైనలింగంబుమీఁదఁ, బడియె నవి దాన వాఁడు నిష్పాపుఁ డయ్యె.

గీ. అంత వేఁకువ యగుటయు నతఁడు డిగ్గి, భూజమునునుండి సాభ్రమతీజలమున
స్నాన మొనరించి యుపవాసజాగరేశ్వ, రార్చనాపుణ్యమును బొందినట్టికతన. 845

వ. శుద్ధాంతఃకరణుం డై నిండ్యవర్తనంబునం బెరిగిననిజకళేబరంబు విడువ నెంచి ఖడ్గధారచేఁ దనకంఠంబు ఖండించుకొన నుద్యమించు చుండ. 846

గీ. నేను నాపార్షదులఁ బంప వానికడకు, వారు చని తత్ప్రయత్ననివారణంబు
చేయుటయు వారి నెల్ల వీక్షించి వాఁడు, పుట్ట విస్మయ మెదలోన నిట్టు లనియె.

సీ. ఎవ్వరు మీ రిట్టు లేతేరఁ గత మేమి, మిముఁ జూడఁ గల్గె విభ్రమము నాకు
నాబోటిపాపాత్మునకుఁ గానవచ్చునె, వెలుఁగొందుమీదివ్యవిగ్రహములు
నావుడు వార లాపావనాత్మునిఁ జూచి, చండ యీశ్వరుని పార్షదుల మేము
తనసన్నిధికి శూలి నినుఁ దోడుకొని రాఁగఁ, జేయంగ నాజ్ఞ వచ్చితిమి నేఁడు

గీ. రమ్ము మాతోడ నీవిమానమ్ము నెక్కి, శీఘ్రముగ నిన్నుఁ జూడంగ శితిగళుండు
వేడ్కపడుచున్నవాఁడు నా విని యతండు, వారలకుఁ జేసి సాష్టాంగవందనంబు. 848

క. కలుషాత్ముఁడ నగునాపైఁ, గలిగెనొ యేకతనఁ గరుణ గౌరీశునకుఁ
దెలుపుఁడు నా కని ప్రార్థన, సలుపుటయును వారు సుప్రసన్నహృదయు లై. 849

సీ. పుల్కస యుపవాసమును జాగరంబును, దైవికంబుగను బ్రాప్తంబు లగుటఁ
బాదంబుచేఁ ద్రోయఁబడినట్టిశ్రీవృక్ష, పత్త్రముల్ లింగంబుపైనిఁ బడుట
నీకు సంకల్పంబు లేకుండినను శివ, రాత్రివ్రతఫలంబు ప్రాప్తమయ్యె
దానిచే గళితపాతకుఁడ వై శివకృపా, దృష్టిపాత్రతను జెందితివి నీవు

గీ. నావుఁడు నతండు సమధికానంద మొదవ, నెక్కి దివ్యవిమానంబు నేఁగుదెంచి
శాశ్వతంబుగ నుండె మత్సవిధమందు, నింక జ్ఞానకృతవ్రతం బేమిచెప్ప. 850

అ. అది మొదలుగ నాతీర్థంబు ఖడ్గధారతీర్థం బనియును నాలింగంబు ఖడ్గధారేశ్వరుం డనియును బ్రఖ్యాతిం బడసె.

ఆ. అచట మాఘమాసమందును వైశాఖ, మాసమందు నూర్జమాసమందు
స్నానమును బొనర్చె నేని ముక్తుం డగు, నెట్టి హీనజాతి యేని గాని. 852

గీ. నేమమునను భరద్వాజ వామదేవ, గౌతమ వసిష్ఠముఖ్యులాదిగాఁ బెల్ల
నచటఁ గరుదెంచుచుందురు రనుదినంబు, స్నానమొనరించి నాదుదర్శన మొనర్ప. 853

సీ. అచ్చటి కొకసమయమున విశ్వామిత్రుఁ, డరుదెంచి తత్తీర్థమందు మునిఁగి
పౌనరించుచుండ మత్పూజ నిత్యంబును, నొకనాఁడు మాని చేయున్నతఱిని
నరుదెంచి యొకభిల్లుఁ డటకు నామూర్ధము, నందు మాంసము రుద్ధి యరిగె నంతఁ
గౌశికుం డరుదెంచి కాంచి యామాంసంబు, నెవఁడొ దుష్టుఁడు చేయు నిట్టిచేఁత

గీ. వాని దండింప కుంటివి గాన శర్వ, కలియుగంబున గుప్తంబు గాఁగ నుండు
మని శపించి చనంగఁ దదాది లింగ, తనువు విడనాడి నేను గుప్తముగ నుంటి. 854

గీ. మృత్స్నచేఁ జేసి మన్మూర్తి నెవరు పూజ, సలుపుచుందురో నిత్యంబుఁ గలియుగమున
వారలును ఖడ్గధారనివాసులైన, వారలును నాకుఁ బ్రియులైనవారు చూవె.

వ. కృతయుగంబున మందిరేశ్వరుం డనియుఁ ద్రేతాయుగంబున గౌరవేశ్వరుం డనియు ద్వాపరయుగంబున విశ్వవిఖ్యాతేశ్వరుం డనియును గలియుగంబున ఖడ్గధారేశ్వరుం డనియును విఖ్యాతిం జెంది తత్తీర్థంబునం దే నున్నవాఁడ. మన్మూర్తిపూజ గావించువారల కఖిలవాంఛితార్థసిద్ధు లొందంగలుగు. 856

—: దుగ్ధేశ్వరతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబున ఖడ్గధారంబునకు దక్షిణభాగంబున దుగ్ధేశ్వరతీర్థంబు గలదు. 857

గీ. సాభ్రమతితోడ నచ్చటఁ జంద్రభాగ, సంగతం బయి యుంట నాస్థలమునందుఁ
జలుపుస్నానంబు దానంబు జపము దపము, సకలమును గూడ నక్షయసుకృత మొసఁగు.

వ. పూర్వము దధీచిమహర్షి యచ్చట ఘోరతపంబు గావించె. 859

సీ. మును సురాసురయుద్ధమునఁ బరాజయ మొంది, యమరు లెల్లరు దధీచ్యాశ్రమమునఁ
దమయాయుధములను ద్యజియించి దెసలకుఁ, బాఱిపోవ దధీచిపారికాంక్షి
యాప్లావితము సేసి యాయస్త్రముల మంత్ర, జలముచేఁ ద్రావె దత్క్షణమునంద
యంతటఁ గొన్నియేం డ్లరుగంగ మరల ని, ర్జరు లేఁగుదెంచి తత్సవిధమునకు

గీ. నస్మదాయుధముల నీయు మని దధీచి, మునివరేణ్యుని సవినయంబుగను వేఁడ
నమ్మహర్షి కనుంగొని యనిమిషులను, నెనయఁ గారుణ్య మెదలోన నిట్టు లనియె.

ఆ. త్రిదశులార మంత్రతీర్థోదకాప్లావి, తం బొనర్చి యాయుధముల నెల్లఁ
గ్రవ్యభుజులపాలు గాకుండఁ ద్రావితి, నాఁడె యిట్టు లిచ్చువాఁడ నేఁడు. 861

చ. అనవుడు ఖేద మొంది సుర లందఱు మానివరేణ్య మాపయిన్
గనికర మున్న నీతనువునం గలయస్థుల నిమ్ము వానిఁ గై
కొని సుదృఢాయుధంబులుగఁ గూల్తుము దైత్యుల నెల్ల నాఁగ న
మ్ముని విడిచెన్ స్వదేహముఁ బ్రమోదముతోడను యోగశక్తిచేన్ 862

గీ. అంత దేవత లెల్లరు నతనిమేను, చీల్చి యస్థులఁ గైకొనఁ జేతు లాడ
కునికి సురభిని నాహ్వాన మొనరుపంగఁ, గామధేనువు వచ్చి శీఘ్రముగ నటకు. 863

క. మునిదేహంబు నాకుచుఁ ద, త్తనువును నిర్మాంసముగను దా నొనరింపఁగఁ
గొని వానియస్థు లెల్లనుఁ, ననిమిషు లరిగిరి జయింప నసురబలంబుఁగఁ. 864

గీ. అంతట దధీచిమునిపత్ని యగుసువర్చ, దేవతాకృత్యము నెఱింగి దివ్యదృష్టి
నపరిమితకోప మెదలోన నావహిల్లఁ, దిట్టె యనపత్యు లగునట్లు దేవతలను. 865

సీ. సాభ్రమతీతటస్థం బైనపిప్పల, క్షోణీరుహముక్రిందఁ గూరుచుండి
ఛేదించుకొనుచుఁ గుక్షిని గర్భముననుండి, దివ్యతేజముతోడఁ దేజరిలుచుఁ
బృథ్విపైఁ బడుటయుఁ బిప్పలాదుం డను, దారకుండు శివావతారమూర్తి
యపుడు సువర్చ యయ్యనఘుని వీక్షించి, తనయ యీపిప్పలతరువుక్రింద

గీ. నీవు వసియించి శుభముల నెల్లరకును, నిచ్చుచుండు మటంచు వాక్రుచ్చి యోగ
శక్తిచే మేను విడనాడి స్వపతి యున్న, సత్యలోకంబునకు నేఁగె సాధ్వి యగుట. 866

ఆ. అంతఁ గామధేను వచ్చటి కేతెంచి, హర్షమునను లోన నాఁగకుండ
వచ్చుదుగ్ధధార వర్షింప నాదుగ్ధ, మయ్యె లింగరూప మందువలన. 867

వ. ఆలింగంబు దుగ్ధేశ్వరుం డనియును నాస్థానంబు దుగ్ధేశ్వరతీర్థం బనియును లోక
విఖ్యాతిం బడసె. 868

—: చంద్రతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును దుగ్ధేశ్వరతీర్థంబునకుఁ బూర్వభాగంబునందుఁ జంద్రతీర్థం బేర్పడియె.

గీ. సాభ్రమతితోడ నచ్చటఁ జంద్రభాగ, సంగతం బయి యుండె నాస్థలమునందుఁ
జేసి తపమును జంద్రుఁడు శీఘ్రసిద్ధి, నందుటను జంద్రతీర్థ మై యది యెసంగె. 870

వ. తత్తీర్థంబునం జంద్రునిచే స్థాపింపంబడినలింగంబు చంద్రేశ్వరుం డనువిశ్రుతిం బడసె.

గీ. చంద్రభాగాసమీపదేశమున శుక్రుఁ, డాచరించుటఁ దప మది యధికమహిమ
కలది యై పొల్చె నచ్చటఁ జలుపుపుణ్య, కర్మము లనంతఫలములు కంబుకంఠి. 872

గీ. కావ్యుఁ డక్కడ హేమలింగము ప్రతిష్ఠ, సలిపె నది గుప్తముగ నుండుఁ గలియుగమున
నచటఁ జేసినస్నానదానాదివిధుల, వలనఁ గలుగుఫలం బెన్న వశము గాదు. 873

క. తిలపిండంబున శ్రాద్ధము, సలిపినయెడ నచట విష్ణుసాన్నిధ్యముఁగన్
గలకాలము వసియింపం, గలుగుం గర్తలకుఁ బితృనికాయముతోడన్.

ఆ. అచట రుద్రజపము నాచరించినయెడ, భస్మ మగుట సర్వపాపములును
మామకీనరూపమాహాత్మ్యసహితు లై, యుందు రేరు బాయ కుండుచోట. 875

—: పిప్పలాదతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబున దుగ్ధేశ్వరసమీపమందుఁ బిప్పలాదతీర్థం బేర్పడియె.

సీ. అచ్చట మున్ను మహారాష్ట్రచే ధరిత్రి, కావృణ్యా మొదవిందునాసలోఁ
గావింపు మంతలంగ ఘనతపంబును జేప్ప, లాదుండు తద్విఘ్ను మహాచరింపఁ

గోలాసురుఁడు వచ్చి కోలాహలము సేయఁ, గృత్యను బుట్టించి ఋషివరుండు
దానిచేఁ జంపించె దైత్యుని నద్దాన, నచ్చోటు పిప్పలాదాఖ్యచేత
గీ. వెలసెఁ దీర్థంబుగా నందుఁ జలిపి రేని, స్నానమును బ్రహ్మహత్యాదిసకలపాప
ముక్తులై కర్మబంధవిముక్తి నొందఁ, గలుగు నది గుప్తతీర్థంబు కలియుగమున. 877
ఆ. అచటఁ జేయుపిప్పలారోపణంబునఁ, దొలఁగిపోయి సకలకలుషములును
గలుగు జన్మమృత్యువులు లేనిధామంబు, నందు నుండుభాగ్య మంబుజాక్షి. 878

—: నింబార్కతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబున నింబార్కతీర్థం బేర్పడియె. 879
గీ. అచట స్నానం బొనర్చిన నామయంబు, లన్నియును నాశమును నొందు నాక్షణంబ
యచటఁ గలనింబవృక్షంబు నర్కబుద్ధి, చేతఁ బూజింప సర్వార్థసిద్ధి గలుగు. 880
క. మును కోలాహలసంగర, మున జితులై యమరు లసురులచేఁ బ్రాణా
శను జొచ్చి వృక్షములలోఁ, దనువుల రక్షించుకొనిరి తన్మయు లగుచున్.
గీ. పాదపంబులు దేవతాభావ మొంది, నట్టికతమున ఛేదనార్హములు గావు
పాదపచ్ఛేది దేవతాచ్ఛేదకుండు, వాని కిహపరసౌఖ్యంబు కానరాదు. 832
వ. కోలాహలుండు కాలధర్మంబు నొందువఱకును మాధవున కశ్వత్థంబును నాకు బిల్వం
బును మహేంద్రునకు శిరీషంబును సూర్యునకు నింబంబును నితరదేవతలకుఁ దత్తదర్హ
ద్రుమంబులును నాశ్రయంబు లయ్యె. నింబార్కతీర్థంబున నింబార్కపూజ గావించి
యాదిత్యభాస్కరభాను రవివిశ్వప్రకాశకతీక్ష్ణాంశుమార్తండ సూర్యప్రభాకరవిభావసు
సహస్రాక్షపూషద్వాదశనామంబులు పఠించిన ధనధాన్యపుత్రపౌత్రాదిసకలభాగ్యములం
బడయంగలుగు. 883
క. ద్వాదశనామంబులచే, నాదిత్యునిపూజ సేయు నఖిలక్షేమా
పాదకుఁ డగు నాదిత్యుఁడు, భూదేవాద్యఖిలవర్ణములవారలకున్. 884

—: సిద్ధతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబున సిద్ధతీర్థం బేర్పడియె. 885
గీ. అచటఁ గృష్ణుఁడు మును కోటరాక్షి యనెడు, శక్తి నొకదాని నిల్పె వైష్ణవిని నొక్క
యబ్ద మాతీర్థమున స్నానమాడి యామె, యాస్య మీక్షింప వరియించు నాదిలక్ష్మి.
సీ. మును చిత్రలేఖ చేసినయుపాయంబున, ననిరుద్ధుఁ డుషకు సంప్రాప్త మగుడు
నతని బాణాసురుం డాత్మమందిరమునఁ, గట్టివైవంగ నక్కాలమందు
ననిరుద్ధుఁ డేమియు నొనరింపఁ జాలక, కోటరాక్షిని బాదుకొల్పి మదిని
స్మరియించుటయుఁ దత్ప్రసాదంబునను గృష్ణు, డరుదెంచి యుద్ధధరాంగణమున
గీ. బాణుని జయించి ద్వారకాపత్తనమున, కరిగె నుషానిరుద్ధసమన్వితముగ
నంత ననిరుద్ధుఁ డక్కోటరాక్షి నంత, రంగమున నిల్పి విశ్వాస మావహిల్ల. 887

వ. కోటరాక్షి విశ్వరూప మహామాయ బలాధిక త్రిపుర త్రిపురఘ్ని శివ శివరూపిణి
కన్య సారస్వతి దుర్గ దుర్గతిహారిణి భైరవి భైరవాక్షి లక్ష్మీదేవి జనప్రియ యను
షోడశనామంబులం బఠించుచు నీప్సితార్థసిద్ధిం బొందె. 888

గీ. ఎవరు తన్నామములఁ బఠియించువారొ, ప్రతిదినంబును వారి కాపదలు దొలఁగు
సిద్ధతీర్థంబు నెవరు వీక్షించువారొ, చేకుఱును వారలకు నెట్టిచింత యేని. 889

—: తీర్థరాజమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబునఁ దీర్థరాజం బేర్పడియె. 890

గీ. అచటఁ బ్రవహించు చుండు నహర్నిశంబు, చందనోదకయుతములై సప్తనదులు
దానిలో నొనరించెడిస్నానమునకుఁ, గలుగు ఫలము వచింప నా కలవి గాదు. 891

క. వామనుఁ డచ్చట నుండెఁ, గామితముల నెల్లఁ దీర్పఁగలదేవుం డా
స్వామిని గొలిచిన వైష్ణవ, ధామంబున నుండఁగలుగుఁ దనుధారులకున్. 892

వ. అచ్చట మాఘశుక్లద్వాదశీదినంబునఁ దిలధేనుదానంబు గావించె నేని సర్వపాప
విముక్తి నొంది కులశతోద్ధారకుం డగు. 893

ఆ. చలిపె నేని యచటఁ దిలతర్పణము పిత, లెనయఁ దృప్తి వేయియేండ్లవఱకుఁ
శ్రాద్ధ మొనరుపంగ సమకూరుఫల మబ్బు, నిది రహస్య మెఱుఁగ రెవరుఁ గూడ.

క. గుడపాయసములచే నే, ర్పడఁగను సంతృప్తి యొక్కబ్రాహ్మణునకు న
య్యెడ భోజనంబు వెట్టినఁ, బడయును ద్విజకోటిఁ దృప్తిపఱిచినఫలమున్. 895

—: సోమతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబున సోమతీర్థం బేర్పడియె. 896

సీ. కాషీతకుం డనుఖ్యాతి కెక్కినతపో, ధనుఁ డొక్కఁ డాస్థానమునను మున్ను
కావించు చుండ నుత్కటతపం బొకనాఁడు, ప్రత్యక్షమై యాతపస్వి కేను
వరము గోరు మనంగి వాంఛించె నతఁడు సో, మేశ్వరలింగ మం దేర్పడంగ
నట్టులె యగుఁగాక యనుడు నే నట లింగ, మావిర్భవించె నత్యద్భుతముగ

గీ. నచట స్నానాదిపుణ్యకార్యములు సేసి, కనినయెడలను సోమేశ్వరుని సమస్త
వాంఛితార్థంబు లీడేరి వచ్చు సోమ, పానజన్యమహాపుణ్యఫలము వింటె. 897

క. ఉదయించె నాస్థలంబున, కది మొదలుగ సోమతీర్థ మనునామము త
త్పదమున స్నానము చేసెడి, యదనునఁ గలకోర్కు లెల్ల నపుడె ఫలించున్. 898

ఆ. సోమతీర్థమందు సోమవారంబున, స్నానముం బొనర్చి శ్రద్ధతోడ
నెవ్వఁ డేని చేసె నేని సోమేశ్వర, దర్శనంబు వాఁడె తత్త్వదర్శి. 899

—: కాపోతతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబునం గాపోతతీర్థం బేర్పడియె. 900

సీ. అట విస్తృతం బైనవటవృక్ష మొకండు గలదు, బరిగికోలాహలాన్వితము గాఁగ
దానిపై నొకకపోతము గట్టుకొని గూడు, నివసించుచుండఁగ నెలఁతతోడ
నొకద్వాదశీతిథి నొకనాఁగ నేతెంచి, యాకపోతం బుండునట్టికడకుఁ
బారావతంబ క్షుద్బాధచే వచ్చితి, నతిథి నై తావకాభ్యాశమునకు

గీ. త్వత్కళేబరమాంస మిత్తరుణమందు, నా కొసంగితి వేని ప్రాణములు నిలుచు
నావుడుఁ గపోత మపుడె శ్యేనమున కిచ్చి, యాత్మతనువును వైకుంఠమందుఁ జేరె.

వ. అది మొదలుగా నాస్థానంబు కాపోతతీర్థం బనెడి ప్రశస్తిం జెందె. 902

గీ. పర్వవేళల నచటఁ దర్పణము సేసి, సుమఫలంబులతోడఁ బిండము నొసంగు
వారు కాకాదిబలి నిచ్చువారు దాఁటఁ, గలరు యమలోక మార్గంబు సులభముగను.

గీ. అచట వైశాఖపూర్ణిమయందు గౌర, సర్షపములను స్నానంబు సలిపి పిదపఁ
గనినయెడలఁ బ్రాచీనేశ్వరునిఁ దరించుఁ, దాను దరియించఁజేసి పితరుల నెల్ల. 904

—: గోతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబునందు గోతీర్థం బేర్పడియె. 905

గీ. పూర్వకృతఘోరపాతకంబునను గృష్ణ, కాయములఁ గొన్నగోవు లక్కడను మునిఁగి
యఘములు నశింప శుక్లదేహముల నొందె, దాన గోతీర్థ మయ్యె నాతావు గౌరి.

గీ. చలిపి స్నానంబు నచట గోవులకు గ్రాస, మొసఁగినను నిచ్చినను శ్రోత్రియునకు గోవు
బ్రహ్మహత్యాదిసకలపాపములు గూడ, భస్మమై పొందఁగలుగును బ్రహ్మపదము.

—: కాశ్యపతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబునఁ గాశ్యపతీర్థం బేర్పడియె. 908

గీ. అచటఁ గావించి తపముఁ గశ్యపుఁడు మున్ను, మజ్జటాజూటగంగను మహికిఁ దెచ్చె
దానఁ గాశ్యపతీర్థ మాస్థాన మయ్యెఁ, జలుపునెడ స్నాన మచ్చోటఁ గలుగు ముక్తి.

వ. అందుఁ గశ్యపనిర్మితం బైనకాశ్యపకుండంబున స్నాతుం డై తద్ధామాధీశ్వరుం డగు
కుశేశ్వరుని దర్శించె నేని నిరయంబు దర్శింపకుండు. 910

గీ. అచటఁ గశ్యపనిర్మితం బైననగరి, కాశ్యప యటన్న పేరను గ్రాలుచుండె
నది ప్రభావంబుచేఁ గాశియట్లు సకల, జనులఁ బావనులను జేయు సంతతమును. 911

—: భూతాలయతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబున భూతాలయతీర్థం బేర్పడియె. 912

క. భూతాలయతీర్థంబున, భూతాలయ మనువటంబుఁ బొడగను నెడలన్
భూతేశ్వరకృపచేతను, భూతంబులవలన భయముఁ బొందరు మనుజుల్. 913

వ. అచ్చటఁ బ్రాచి యగుచందనానది సాభ్రమతీసంగత యై సకలపాతకనివారణదక్షతం

—: ఘటేశ్వరతీర్థమాహాత్మ్యము :—

బడసి యుండె. మఱియును సాభ్రమతీతీరంబున ఘటేశ్వరతీర్థం బేర్పడియె. 914

క. అటనుండుటచే లింగము, ఘటముగను ఘటేశ్వరాఖ్య కలదై యది యు
త్కటముగ నిజపూజాలం, పటులకు నొడఁగూర్చుచుండు భద్రము లెల్లన్. 915

గీ. స్నాన మొనరించి యట ఘటేశ్వరునిపూజ, సలుపునెడ లక్షబిల్వసంచయముచేత
నభిమతార్థంబు లెల్లను నంది భువిని, బరమపదమును బ్రాపించుఁ బరమునందు. 916

—: వైద్యనాథేశ్వరతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబున వైద్యనాథేశ్వరతీర్థం బేర్పడియె. 917

గీ. అచ్చటను స్నానపితృతర్పణాదివిధులఁ, జేయునెడ సర్వయజ్ఞముల్ చేసినట్టి
సుకృతమును నొందఁగలుగును బూచె నేని, వైద్యనాథేశ్వరునిఁ దీరు వాంఛ లెల్ల.

—: దేవతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబున దేవతీర్థం బేర్పడియె. 919

సీ. మునుధర్మనందనుం డొనరించి దిగ్జయం, బును విభీషణునిచేఁ గొని కరంబు
రాజసూయము సేసి భ్రాతృయుక్తంబుగా, సాభ్రమతీతటస్థలమునందుఁ
బాండురార్యాంబను బాదుకొల్పుట నది, దేవతీర్థంబునాఁ దేజరిల్లె
నచట స్నానము సేసి యా పాండురార్యను, దిలకింప నష్టసిద్ధులును గలుగు

గీ. నందు ము న్నంజనాపుత్రుఁ డాచరించి, తపమును సముద్రలంఘనాదక్షుఁ డయ్యె
మరణమును బొందునెడ నందు మత్పదంబు, నొంది చండేశ్వరగణత్వ మొందు వాఁడు.

—: చండేశతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతీరంబునఁ జండేశతీర్థం బేర్పడియె. 921

గీ. అచటఁ జండేశ్వరుండు నిత్యము వసించి, తన్ను దర్శించువారిపాతకము లడఁచు
నందుఁ జెండేశ మనుపురి నమరు లెల్లఁ, గలిసి నిర్మించి రది ముక్తి గలుగఁజేయు. 922

—: గాణపత్యతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతీతటంబున గాణపత్యతీర్థం బేర్పడియె. 923

గీ. చలిపి స్నానంబు నట గణేశ్వరునిపూజ, సేయునెడ మోక్షసామ్రాజ్యసిద్ధి గలుగు
నచట శ్రాద్ధంబు సలిపిన నాచరించి, నను వృషభదానమును వాఁడు నన్నుఁ జేరు. 924

—: వార్త్రఘ్నసంగమతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతితోడ వార్త్రఘ్నినది గలియుటంజేసి వార్త్రఘ్నిసంగమతీర్థం
బేర్పడియె. 925

సీ. మును వృత్రునకు మహేంద్రునకును బవోకొండు, వేలవర్షము లయ్యె నాల మంత
నమరేంద్రుఁడు పరాజయము నొంది దిక్కు లే, [illegible] సంగమతీర్థమునకుఁ జేరి

స్నాన మచ్చటఁ జేసి నను సన్నుతింప నా, తనమీఁద నాకు వాత్సల్య మొదవె
నంత నేఁ బ్రత్యక్ష మగుడు నింద్రున కటఁ, బలిత మై మద్దేహభసితలవము
గీ. లింగరూపంబు నొంది వెలింగె భస్మ, గాత్ర మనుపేరఁ బరగుచు గోత్రభేది
దానిఁ బూజించి మత్ప్రసాదంబు వడసి, క్షణములోపల వృత్రుని సంహరించె. 926
సీ. అంతట వృత్రదేహమునుండి లోకభ, యంకరం బగుబ్రహ్మహత్య వెడలి
యనిమిషేంద్రునికంఠమును బట్టుకొనుటయు, నాతఁ డాబాధకు నాఁగలేక
బిసమధ్యమునఁ జొచ్చి పెక్కేండ్లు సూక్ష్మరూ, పముతోడ నుండ నప్పటికిఁ గూడ
నది విడనాడమి నతఁడు మేషాకార, మున విరించిసమీపమునకుఁ బోయి
గీ. చేష్ట లేకుండఁ బడుటయు స్రష్ట యెఱిఁగి, యెవరొ వచ్చినవారు నా కెఱుఁగఁజేయుఁ
డనుటయును బ్రహ్మహత్య యి ట్లనియె దేవ, వచ్చితిని బ్రహ్మహత్యను వాస్తవముగ.
క. అనవుడుఁ బితామహుం డి, ట్లనియె జగత్క్షేమమునకు నై విడువుము శ
క్రుని నాఁగ నాకుఁ జూపుము, వనజాసన యుండ వసతి వదలెద వీనిన్. 928
సీ. అని పల్కుటయు బ్రహ్మహత్య లోకేశుండు, నిని దానివాక్యము వీను లొగ్గి
యగ్నినిఁ బిలిచి హుతాశన బ్రహ్మహ, త్యాచతుర్థాంశంబుఁ దాల్పు మీవు
నావుడు ననలుండు దేవ తన్ముక్తి నా, కెపు డగుఁ జెపు మది యేను దాల్తు
ననవుడు బ్రహ్మ యి ట్లనియెఁ బావక నీవు, జ్వలియించుచుండెడిసమయమందు
గీ. హవ్య మొంపఁడో యెవఁడు నీయందు వానిఁ, బట్టుకొను బ్రహ్మహత్య నిన్ బాసి యనుడుఁ
గమలజునివాక్యమున నుండుగౌరవమున, బ్రహ్మహత్యాంశమును దాల్చెఁ బావకుండు.
సీ. అంతటఁ బరమేష్ఠి యవనిమహౌషధి, తృణముల కగ్నికిఁ దెలిపినట్లె
తెలుపఁగ నవియు నర్థించెఁ గృశానువు, వలె నంతట విరించి వానిఁ జూచి
యుచితకారణము లేకుండఁగ మిమ్ముల, ఛేదించునప్పు డాఛేదకులను
బట్టి వేధించును బ్రహ్మహత్య త్యజించి, మిమ్ము నా నజునివాక్యమ్ము నమ్మి
ఆ. యవి గ్రహించె బ్రహ్మహత్యాంశమును నంత, నచ్చరలకుఁ జెప్ప నజుఁడు వార
లడుగఁ దద్విముక్తి యగుసాధనము వారి, కిట్టు లనియె ధాత హితవిధాత. 930
క. ఒనరించునో యెవ్వఁడు మై, థునమును దోయ్యలులు ఋతుమతు లయినసమయం
బున బ్రహ్మహత్య వానిం, గొని మిము విడనాడు వలదు కొంకఁగ మీకున్. 931
సీ. అనవుడు నప్సరోంగనలు గ్రహింపంగ, బ్రహ్మహత్యాంశంబుఁ బద్మభవుఁడు
పిలిచి తోయంబులఁ దెలుపంగ మునువోలె, నర్థించెఁ బ్రాక్తనులట్లె యవియు
నంతట బ్రహ్మ తోయములార మీయందు, మలమూత్రములను శ్లేష్మమును నెవఁడు
విడుతురో వారిని విడుచుకాలమునన్నె, పట్టి మిమ్ముఁ ద్యజించు బ్రహ్మహత్య
గీ. యనుటయును బహ్మహత్యాంశమును గ్రహించెఁ
దోయములు దాన నింద్రునిఁ దొఱఁగి పోయె

బ్రహ్మహత్య పదంపడి పాకవైరి
తపము నత్తీర్థమునఁ జేసి ధన్యుఁ డయ్యె. 932

—: భద్రాసంగమతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతికి భద్రానదితోడ సంగమం బేర్పడినస్థలంబు భద్రాసంగమతీర్థం బయ్యె. 933

క. స్నానముఁ బితృతర్పణమును, దానంబును నచటఁ జేయుతనుధారులకున్
మానులకుఁ గూడ దుర్లభ, మైనపదం బబ్బు నేల యధికోక్తు లికన్ 934

—: వారాహతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును దత్సమీపంబున వారాహతీర్థం బేర్పడియె. 935

సీ. మును వరాహశరీరమును దాల్చి విష్ణువు, తత్సంగిమాఖ్యతీర్థంబునుండి
రత్నాకరముఁ జొచ్చి రాత్రించరుల నెల్లఁ, బరిమార్చి సంతోషపఱిచి సురల
నెచ్చోటనుండి పైకేతెంచె నచ్చోటు, వారాహతీర్థ మన్ పేరఁ బరఁగె
నచ్చట స్నానంబు నాచరించినను శ్రా, ద్ధముపెట్టినను బితృతర్పణమునకు

గీ. నుభయవంశంబులనుగూడ నుద్ధరించి, తాను నివసించు వైకుంఠధామమందు
నది మహావిష్ణునిర్మితం బైనకతన, దానికిఁ డైనతీర్థంబు కానరాదు. 936

—: సాగరసంగమతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సాభ్రమతి సాగరంబుతోడఁ గలిసినధామంబు సాగర సంగమతీర్థం బయ్యె.

గీ. అచట స్నానంబు గావించినంతమాత్ర, మునను పంచమహాపాపములును దొలఁగు
దానజపహోమతర్పణధ్యానములను, నేరుపడియెడిఫల మింక నేమిచెప్ప. 938

—: ఆదిత్యతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును సంగమతీర్థసమీపంబున నాదిత్యతీర్థం బేర్పడియె. 939

గీ. దాని దర్శించినను నందు స్నాన మాచ, రించినను దర్పణం బొనర్చినను నర్క-
సుమములను గరవీరపుష్పములఁ బూజ, సలిపినను సర్వపాతకంబులును మాయు. 940

—: నీలకంఠతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును దత్సమీపంబున నీలకంఠతీర్థం బేర్పడియె. 941

ఆ. దానిలోనఁ జేసి స్నానంబు నీలకం, ఠార్చనంబు చేయునట్టివారు
సకలవాంఛితార్థసంసిద్ధులను బొందు, నట్టివార సంశయంబు లేదు. 942

—: దుర్గాసంగమతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును నచ్చట దుర్గాసంగమతీర్థం బేర్పడియె. 943

గీ. సాభ్రమతి దుర్గతోడను సంగమించి, నట్టిచోటు మహాతీర్థ మయ్యె నందుఁ
జేయుస్నానంబు గోమహిషీప్రదాన, మవనిసురపూజనమును ఫలాధికములు. 944

—: నృసింహతీర్థమాహాత్మ్యము :—

వ. మఱియును దత్సమీపంబున నృసింహతీర్థం బేర్పడియె. 945

గీ. అచ్చట నృసింహుఁ డుండంగ హతహిరణ్య, కశిపుఁ డై శాంతముగ నట్టికాలమందు
నధికభక్తిని బ్రహ్లాదుఁ డతనిచెంత, నిలువఁబడి యి ట్లనియె మేనఁ బులక లొలయ.

గీ. తండ్రి నీవు మహాగుణోత్తరుఁడ వేను, మందబుద్ధిని నాకు నీయందు భక్తి
గలుగఁగను నీకు నాయందుఁ గరుణ గలుగ, హేతు వేమియొ వినఁగ నా కిచ్ఛ పొడమె.

వ. అని ప్రార్థించుటయు నృసింహుం డాతని కి ట్లనియె. 948

సీ. ప్రహ్లాద యిది మున్ను పరగె మాళిస్థాన, మనెడిక్షేత్రంబుగా నవనియందు
హారీతుఁ డనెడిబ్రాహ్మణుఁడు లీలావతి, యనుపత్నితోడ నిం దధివసించి
సలుపంగ నేకవింశతియుగంబులు తపం, బేను ప్రత్యక్షమై వాని కపుడు
వర మీయనుండంగి వాంఛించె నాతండు, తనయుండు గాఁగను దనకు నేను

గీ. దాని కామోదమును జెంది నేను విప్ర, ప్రాప్తనుండను గాన గర్భమునఁ జేరఁ
గాని యీక్షేత్రమందు నీసూనుఁడుగనె, నిత్యమును నుండి కలిగింతు నీకుఁ దుష్టి.

క. అనవుడు నావాక్యము నా, యనఘుం డంగీకరింప నది మొదలుగఁ ద
త్తనయుం డనియెడిఖ్యాతిఁ, గని నే నీక్షేత్రమందె కదలక యుంటిన్. 950

సీ. మును నీవు ద్విజున కొక్కనికిఁ బుత్రుండవై, జనియించి వసుదేవుఁ డనెడిపేరఁ
జదువు సంధ్యయు లేక సద్గుణంబును లేక, దుర్మార్గవర్తులు తోడు గాఁగ
వేశ్యారతుండవై విహరించుచును దైవి, కంబుగా నొక్కదినంబునందుఁ
జనుదెంచి యీక్షేత్రమునకు మద్వ్రతమును, దిలకించి భక్తులు సలుపుచుండఁ

గీ. గౌతుకం బామతిల్ల నాగణికతోడఁ, జలిపితివి మద్వ్రతంబు నిచ్చటనె దాన
నాథనాంగన నాలోన నైక్య మొందెఁ, జేరెదవు నన్ను నీవును శీఘ్రముగనె. 951

క. అనవుడుఁ బ్రహ్లాదుఁడు దన, మనమున సంతసము నొంది మాధవ నాకున్
వినిపింపుము త్వద్వ్రతమును, నని వేఁడ నృసింహుఁ డిట్టు లనియె నతనికిన్. 952

వ. స్వాతీనక్షత్రముతోడంగాని సిద్ధియోగంబుతోడంగాని వణిజకరణంబుతోడంగాని శనివారంబుతోడంగాని యన్నిటితోడంగాని కొన్నిటితోడంగాని కూడినవైశాఖశుక్లచతుర్దశి నే నావిర్భవించినదినం బగుట నాదినంబున గృహంబునంగాని దేవఖాతతటాకంబులం దెం దేని మృత్తికాగోమయధాత్రీఫలరసతైలంబులతోడ స్నానంబు గావించి శుద్ధుం డై ధౌతవస్త్రంబులం దాల్చి నిత్యకర్మంబు ననుష్ఠించి గృహంబునంగాని మత్క్షేత్రంబునంగాని మండపంబు నేర్పఱిచి యం దష్టదళపద్మంబు లిఖించి దానిపైని రత్నసమన్వితతామ్రకలశంబును స్థాపించి దానిమీఁదఁ దండులపూరితం బగుపాత్రంబు నుంచి దానిపై స్వర్ణమయం బగులక్ష్మీనృసింహమూర్తి నుంచి ధ్యానించి యథావిధిగఁ బంచామృతస్నానంబును సర్వస్నానంబును గావించి ధూపదీపనైవేద్యాదు లొసంగి యు

దినం బెల్ల నుపవాసం బొనర్చి రాత్రి జాగరణంబు చేసి మఱునాఁడు ప్రభాతకాలం
బున స్నానంబు గావించి పూర్వోక్తవిధానంబున నన్నర్చించి నాయెదుట మత్ప్రీతికరం
బుగా వైష్ణవశ్రాద్ధంబు గావించి యథాశక్తి దానంబులు బ్రాహ్మణులకొసంగి భోజన
దక్షిణాతాంబూలంబులచే సంతృప్తి గలిగించి. 953

ఆ. కావు ముద్ధరించి దేవ మద్వంశజు, లైనవారలను భవాబ్ధినుండి
పాపవార్ధిలోనఁ బడియున్న నాకుఁగ, రావలంబ మెమ్ము నీవె దిక్కు. 954

క. అని వేఁడి మనుద్వాసన, మొనరించి మదీయమూర్తి నొసఁగిన నాచా
ర్యున కర్థసిద్ధు లెల్లను, ననువుగఁ బ్రాప్తించు నెవరికైనను ధరణిన్. 955

క. ధనహీనుఁడైన నియతము, గను నుపవాసంబు చేయఁగలిగినయెడ మ
జ్జననదినంబునఁ బాలున్, గనఁగను మద్వ్రతమువలనఁ గలుగుఫలంబున్. 956

ఆ. ధాత సృష్టి చేయ దక్షత్వమును బొందె, శివుఁడు త్రిపురవధము చేయఁగలిగె
మునులు సురలు ప్రభువులును సిద్ధి నొందిరి, మద్వ్రతోపలబ్ధమహిమ వలన. 957

వ. అని చెప్పి యంతర్ధానంబు నొందుటయుఁ బ్రహ్లాదుం డపరిమితానందముం జెందె. 958

గీ. కలియుగమ్మున బహుకామఫలము లొసఁగఁ, బ్రాభవము గలగంగ సాభ్రమతి యొకఁడె
దానిమహిమంబు వర్ణింపఁదరము గాదు, నిక్కముగ శతజిహ్వ లుండినను నాకు. 959

ఆ. ఎచటఁ దీర్థనామ మెఱుఁగకుండురో లోకు, లచట నూామకాహ్వయమునఁ దీర్థ
మేరుపడుపవలయు నిది సూక్ష్మధర్మంబు, తెలుపఁదగిన దగుటఁ దెలిపినాఁడ. 960

వ. అని పలుకుటయుఁ గాత్యాయని యపరిమితానందముం బొందె. 961

క. మునివర్య వినుము భార్గవి, మును విన గీతామహత్త్వమును వాంఛింపం
గను నొకతఱి శౌరిని ముద, మొనయఁగ మాధవుఁడు లక్ష్మి కిట్లు వచించెన్. 962

—: గీతామాహాత్మ్యకథనము :—

సీ. అతివ నాయాత్మ పరాపరభేదంబు, లను ద్వివిధంబుగాఁ దనరుచుండు
నందుఁ బరాత్మ నిరాకారముగ నిర్గు, ణముగ సాక్షిగ నిష్కళముగ వెలసె
నపరాత్మ త్రిపురాంతకాకార మదియె మ, దాస్యవినిర్గత మైనగీత
యధ్యాయపంచకం బాస్యపంచకముగ, దశబాహులుగ దశాధ్యాయములును

గీ. నావలఁ బిచండమగును నధ్యాయ మొకటి, యంఘ్రియుగ్మకముగను నధ్యాయయుగము
తనరియుండెను దాన మత్తత్వ మెల్లఁ, దెలుపఁబడియుండె నది నీకుఁ దెలియనిదియె.

ఆ. అందులోన నొక్క యధ్యాయ మేనియుఁ, గాకయున్న నొక్కశ్లోక మేని
యర్థ మేని తుదకు నర్ధార్ధ మేనియు, ననుదినమును జదువ నెనయు ముక్తి. 964

వ. అష్టాదశాధ్యాయాత్మకంబును గీతానామకంబును వాఙ్మయంబును నీశ్వరాకారంబును
నగుమదీయాపరాత్మమూర్తిని సేవించె నేని ద్వైతాద్వైతవివర్జితంబును భావాభావ
వినిర్ముక్తంబును నాద్యంతరహితంబును శుద్ధసంవిత్ప్రభానందమయంబును నిర్గుణంబును

నిష్కళంబును నిరాకారంబును నగుమత్పరాత్మస్వరూపంబు విదితం బగు. దాన నాత్మైక్యభాగ్యంబు చేకూరు. 965

—: గీ తా ప్ర థ మా ధ్యా య మా హా త్మ్య ము :—

సీ. మును ధరిత్రీతలంబున నుండెను సుశర్మ, యనునామమున నొక్కయవనిసురుఁడు
స్నానసంధ్యాదివిహీనుఁ డై కృషిచేత, జీవించుచును జిట్టచివర కతఁడు
మృగపక్షులను వధియింపంగ నొకనాఁడు, దుస్సహావాసులతోడఁ గూడి
యటవీస్థలికిఁ బోయి యాసన్న మగుటచేఁ, దనకుఁ గాలము సర్పదష్టుఁ డయ్యె
గీ. నంతటను యమకింకరు లరుగుదెంచి, వానిఁ గొనిపోయి యమసన్నిధానమునకు
నిలుపఁ దత్కృతపాతకంబులకు శమనుఁ, డర్హశిక్షను జలుప వాఁడనుభవించి. 966
గీ. అవనిఁ గడ కేద్దుగను బుట్టె నావృషంబు, హలము లాగుచు మోయుచు నలవిగాని
భారమును బహుకాల మప్పగిదిఁ గడపి, కొనకు నొకపంగువును మోయుపనికిఁ జిక్కి.
గీ. నడువఁజాలక రోజుచు నడుమనడుమ, నిలుచుచుండంగఁ బంగువు నిలువనీక
దండమునఁ గొట్టుటయు నది తాళలేక, పడియె ముసలిది యగుటచేఁ బుడమిమీఁద.
క. దారిం బోవుచునుండెడి, వారాంగన యొకతె దానివ్యథ గని లోనం
గారుణ్య మొదవ దానికిఁ, దారకముగ ధారవోసెఁ దనసుకృతంబున్. 969
గీ. అంత నాయెద్దు లేవలే కసువు లుడిగె, నచ్చటనె యమకింకరు లపుడు వచ్చి
దానిఁ గొనిపోవ యమునియొద్దకుఁ ద్యజించె, యముఁడు వేశ్యాప్రదత్తపుణ్యమున దాని.
సీ. అంతట నావృష మరుదెంచి భూలోక, మునకు భూసురకులంబున జనించె
జాతిస్మరణశక్తి సంభవించుటను నా, క్షితిసురుం డావేశ్య చెంత కరిగి
తన కామెవలనఁ గలిగినయుపకారంబుఁ, దెలిపి నీపుణ్యంబుఁ దెలుపు మనియె
నపు డామె యతని కిట్లనియె విప్రోత్తమ, యొకశుకంబు పఠించుచున్నగతి
గీ. యాలకించుటఁ బూతాంతరాత్మ నగుచు, నిన్నుఁ దరియింపజేయుపున్నెమును జెందఁ
గలిగితి నటంచుఁ జెప్ప నాచిలుకకడకు, నామెతోఁగూడ నేఁగి యాభూమిసురుఁడు.
సీ. చిలుక నీగాథను దెలుపుము దయతోడ, నాలకింపంగ నా కాశ పొడమె
నావుడుఁ బూర్వజన్మస్మృతి గలది యై, యాశుకం బీక్షించి యతనిమోము
భూసురోత్తమ నేను బూర్వము బ్రాహ్మణ, కులమునఁ బుట్టి విద్యలను జదివి
వైదుష్యగర్వంబువలన దుర్వాదముల్, సలుపుచుఁ దిరుగుచు స్వైరముగను
గీ. నొక్కతతిఁ గాలధర్మంబు నొంది నరక, యాతనలఁ జెంది తుద కెట్లొ యవనిలోనఁ
జిలుక నై పుట్టి యొకమునిచేతఁ జిక్కి, పట్టువడితిని బంజరబంధమందు. 972
సీ. అంతట నమ్మునియాశ్రమంబున ముని, చ్ఛాత్రు లెల్లరుఁగూడి సంతతమును
బఠియించుచుండఁగఁ బావనం బైనగీ, తాదిమాధ్యాయంబు నాలకించి

పఠియించుచుంటిని ప్రతిదినంబును నేను, శ్రవణపేయము గాఁగ జనుల కెల్ల
నటు లుండ నొకచోరుఁ డరుదెంచి యొకనాఁడు, ననుఁ గొనివచ్చి యీవనిత కమ్మె
గీ. నేను గీతాదిమాధ్యాయ మెపుడుఁ గూడఁ, జదువుచుండుట నీవేశ్య శ్రద్ధతోడ
వినుటచేఁ బుణ్యవతి యయ్యె నని వచింప, నంతలో నిర్జరవిమాన మరుగుదెంచె. 973

వ. ఆముగ్వురును దివ్యరూపంబులతోడ నావిమానంబుపై నధిష్ఠించి వైకుంఠంబునకుం
జనిరి. 974

గీ. కాన గీతాదిమాధ్యాయ మేనరుండు, వీనులారంగ వినునో యేమానవుండు
శ్రద్ధతోడను జదువునో శాశ్వతముగ, వార లుందురు వైకుంఠవాసమందు. 975

—: గీతాద్వితీయాధ్యాయమాహాత్మ్యము :—

సీ. ధాత్రిలో నొకఁ డుండె దక్షిణదిగ్భాగ, మందుఁ బురందరం బనఁ బురంబు
దానిలో నొకఁ డుండె ధరణిదేవుఁడు దేవ, శర్మ నాఁగను బుధశ్లాఘ్యగుణుఁడు
నిజధర్మముల నెల్ల నెఱవేర్చుకొనుచుండి, యును మనశ్శాంతి లేకునికి నతఁడు
పరితపించుచునుండ భావంబులోపల, దైవికంబుగ నొక్కతాపసుండు
గీ. వచ్చుటయు నొక్కతఁడే దదావసథమునకు, నమ్మహీసురుఁ డతనికి నతిథిపూజ
సలిపి తనకు మనశ్శాంతి గలుగువిధము, నభిలషింపంగ వాని కి ట్లనియె నతఁడు.

ఆ. ఆర్య మిత్రవంతుఁ డనుపేర నొకయజా, పాలుఁ డుండెఁ బుణ్యపట్టనమున
నతఁడు నీకుఁ దెల్పు నాత్మశాంతిఘటిల్లు, నట్టిమార్గ మరుగు మతనికడకు. 977

గీ. అనుటయును దేవశర్మ తదాజ్ఞ వడసి, పుణ్యనగరాంతికారణ్యమున నదీత
టమున శిలమీఁదఁ గూర్చుండి ప్రమద మొదవఁ, గనుఁగొనెడిమిత్రవంతునికడకుఁ జేరి.

గీ. ఆర్య నీయంతికమున కే నాత్మశాంతి, గలుగుమార్గంబు నెఱుఁగంగఁ దలఁచి యరుగు
దెంచినాఁడను నావాంఛ తీర్పు మనుడు, నతనిఁ గని మిత్రవంతుఁ డత్యాదరమున.

సీ. భూసురోత్తమ విను పూర్వగాథ యొకండు, వినిచెద నీకు సవిస్తరముగ
ధరను గోదావరీతటినిఁ బ్రతిష్ఠాన, మనుపురం బొకఁ డుండె నచట నుండె
విక్రముఁ డనెడిపృథ్వీపతి యొక్కఁడు, తత్సమక్షంబున దానములను
గొనుచు దుర్దముఁ డనుక్షోణీసురుం డొక్కఁ, డొనరించు చుండె జీవనము నెటులో
గీ. యట్టు లుండంగ నొక్కనాఁ డాద్విజుండు, కాలధర్మంబు నొందుడుఁ గాలభటులు
వానిఁ దోడ్కొని పోయి యమానరక, యాతనలఁ బెట్టి విడువంగ నంతమునకు.

సీ. ఆదుర్దముఁడు పుట్టె నవనిలోన దరిద్రుఁ, డై యుండునొక్కబ్రాహ్మణునియింటఁ
దత్పూర్వపాపవర్తనవాసనను జేసి, యొక్కకామిని వాని కుపద యయ్యె
నాయింతి జారిణి యై చరించుచు నొక్క, చండాలకులజనిసంగమమున
గర్భంబుఁ దాలిచి కని కన్యకను జచ్చి, డాకినీరూపంబు చేకుఱంగ

గీ. శ్వపచునిం బట్టి చంపె నాశ్వపచుఁ డంత, నరకయాతన లొంది యంతమునఁ బుట్టె
వ్యాఘ్రమై డాకినియు స్వదేహాంతమందు, ననుభవించి యమాలయయాతనలను.

క. జనియించెను నాగేహం, బున నజయై దాని నేను బోషించుచుఁ గా
ననమందుఁ ద్రిప్పుచుండం, గను నాశార్దూల మటకు గ్రక్కున వచ్చెన్. 982

క. దానిం గనుఁగొని శాంతుఁడ, నై నే నుండంగ వ్యాఘ్రమజను గ్రసింపం
గా నొగ్గుచుండ నజయును, దానికడకు నరిగి నిలిచె ధైర్యముతోడన్. 983

సీ. అంతట నావ్యాఘ్ర మపగతక్రోధమై, నిలువంగఁ బనుపటయు నిశ్చలముగ
నజ దాని వీక్షించి వ్యాఘ్రమ సిద్ధాన్న, మును నుపేక్షింపంగఁ జనునె నీకు
ననవుడు వ్యాఘ్రమి ట్లనియె నామదిలోనఁ, గలక్రోధ మెల్లను దొలఁగిపోయె
శాంతించె క్షుత్పిపాసలును నిచ్చోటను, గలమహత్త్వం బేమొ తెలియరాదు

గీ. నావుడు మృగాదనంబ నీ వగినన నాకు, భీతి జనియింపకుంటకు హేతు వేమొ
తెలిసిన వచింపు మని మేక పలుకుటయును, దెలియదాయెను నా కని ద్వీపి పలికె.

వ. అంతట నయ్యజావ్యాఘ్రంబులు నాకడ కరుదెంచి తమసంశయంబు లడుగ నేనును
నవియునుం గలసి యొకవృక్షంబునం దుండువానరంబు నడిగితిమి. 985

సీ. ఆవానరం బిట్టు లనియె నజాపాల, విను మొక్కవిషయంబు వినుతు నీకుఁ
గను మీవనంబునఁ గనఁబడుచుండె దే, వాలయం బొక్కటి యందులోన
నుండెఁ ద్ర్యంబకలింగ మొక్కటి మున్నది, సంస్థాపితం బయ్యె బ్రహ్మచేత
ననుదినంబు సుకర్ముఁ డనుద్విజుఁ డొకండు చే, యంగ వాడంగె దల్లింగపూజ

గీ. యావిధంబున బహుకాల మరుగ నొక్క, తఱిని నొకతాపసుండు తత్సవిధమునకు
నరుగుదెంచి సుకర్మునిహారసపర్యఁ, గాంచి యాతని యొకలోనఁ గరుణ యొదవ. 986

గీ. అవనిసుర యేమి కోరి శివార్చనంబు, చేయుచుండినవాఁడవో చెప్పు మనుడు
నాతఁ డి ట్లనియె మహాత్మ యన్నకాంక్ష, చేత లింగార్చనంబు నేఁ జేయుచుంటి.987

సీ. అనవుడు నాబ్రాహ్మణునిసత్యవాక్యంబు, నకు నాతపస్వి యానంద మొంది
తత్సముద్ధరణేచ్ఛ తనచిత్తమునఁ గలు, గంగ నిచ్చట నొక్కగ్రావమందుఁ
దగ లిఖియించి గీతాద్వితీయాధ్యాయ,మును బఠింపుము దీని నని వచించి
కనఁబడకుండంగఁ జనియె సుకర్ముండు, చూచుచుండంగనె చోద్యముగను

గీ. నంతట సుకర్ముఁ డాశిలయందు వ్రాసి, నట్టి వ్రాఁతను గట్టిగా నభ్యసించి
చదువుచును నిత్యమును మనశ్శాంతితోడ, నీయరణ్యంబునను జరియింపఁ దొడఁగె.

క. దానిమహత్త్వముచే నీ, కానను నాఁకలియు దప్పికయును భయంబున్
గ్లానియు విద్వేషంబును, వేనికినిం గలుగ వనుడు విని నే నంతన్. 989

వ. అజావ్యాఘ్రంబులతోడం గూడి తచ్ఛిలాప్రదేశంబున కరిగి శిలపైని వ్రాయంబడి
యున్నగీతాద్వితీయాధ్యాయమును బఠించి మననంబు గావించుకొనుచుఁ దత్ప్రభా

వంబున నపగతసంసారక్లేశుండ నై బ్రహ్మానందంబున నోలలాడుచుంటి.తచ్ఛ్రవణ
ప్రభావంబుచే నజావ్యాఘ్రంబులు వీతకలుషంబు లై విముక్తిం బొందె. 990

క. అని పలుకఁగ నామాటలు, విని భక్తిని దేవశర్మ విశ్రాంతి మనం
బున బొదవఁ దదుపదేశము, గొని యాతనివలనఁ జేరుకొని విజపురికిన్. 991

క. అనుదినముఁ దద్ధ్యాయం, బును బఠియించుచును దానఁ బొడమినజ్ఞానం
బునఁ దొలఁగి వాంఛ లెల్లను, జననమరణశూన్య మైనసద్గతి నొందెన్. 992

— గీతాతృతీయాధ్యాయమాహాత్మ్యము —

సీ. మును జనస్థానంబునను జడుం డను పేర, నుండె గౌశికగోత్రుఁ డొకద్విజుండు
విడనాడి నిజకులవృత్తి నాతఁడు వణి, గ్వృత్తిలో నుండి కూడంచి ధనము
ధనమదాంధ్యంబున వనితలు గాన ప్రవ, ర్తించుచు లోకనిందితము గాఁగ
నొకనాఁడు వచ్చుచు నొంపురంబునను డి, దొంగహతుం డయి దారిలోన

గీ. నొకతరువుక్రింద బడి మృతి నొంద స్వకృతి, పాత మునఁ బిశాచరూపంబుఁ బడసె
నంత నాతఁడు మరణించె ననెడివార్త, తెలిసికొని పుత్రుఁడు చింతిల్లు మదిని.

సీ. కావింపఁ బరలోకకృత్యంబుఁ దండ్రికి, నేచి తెచ్చి ము న్నయోధుం డు నేని
యచట గీతాతృతీయాధ్యాయముఁ బఠించె, ప్రతిదినంబుఁ బఠించుచుఁ దాను
దానిని విన్నమాత్రాన పిశాచంబు బొందు, పడియె వ్యోమముననుండి పుష్పవృష్టిఁ దన
నవల దివ్యవిమానమందు దివ్యాకార, మునఁ గానఁబడియె దద్జనకుఁ డంత

గీ. జడునకు సుతుండు మ్రొక్కి నీచరిత మెల్లఁ, దెల్పుమన నాతఁడా యెయుఁ దెలిపి వత్స
త్వత్పఠితగీత వినుటచేతను బిశాచ, రూపము దొలంగి దేవతారూపి నైతి. 994

గీ. నీకు భద్రంబు గలిగెడుఁగాక తండ్రి, నాసహోదరుఁ డొకఁడు నేఁ జేసినట్టి
యఘము లొనరించి నరకస్థుఁ డయ్యె మఱియు, నస్మదన్వయజులు గొంద ఱట్లె యైరి.

క. నరకములనుండి వారిని, దరియింపఁగఁ జేయు మీవు తజ్జనము ననుబోలెన్
దరియింపఁజేసినట్టులె, యరిగెద నే నింక నిలువ నని చెవి కిరిగెన్. 996

సీ. అంతట జడపుత్రుఁ డానంద మొదవంగఁ, జనుదెంచి నిజజనస్థానమునకు
నిరయసంస్థితు లైననిజపూర్వికుల నెల్లఁ, దరియింపఁజేసెడితలఁపుతోడఁ
దగునియమమున గీతాతృతీయాధ్యాయ, మును బఠింపంగఁ దత్పుణ్యమునను
యమసన్నిధికిఁ బోయి హరిభృత్యులు ప్రశాంత, వదలిపెట్టుము జడవంశజులను

గీ. నని వచింపంగ నంతకుం డచటనున్న, జడకులస్థుల నెల్లను విడిచిపెట్టె
నంత మాధవకింకరు లరుగుచుండ, వేడ్కతో వారిఁ దోడ్కొని విష్ణుపురికి. 997

ఆ. వారితోడఁ గూడి నై వస్వతుండు ను, బోయి విష్ణుధామమునను హరికిఁ
బ్రీతి నేఁడె నిలువఁబడి దేవ పాపుల, నెల్ల విడువు మనఁగ హేతు వేమి. 998

వ. అని సవినయంబుగా నడుగుటయు నారాయణుండు వికసితవదనుం డై గీతాతృతీ
యాధ్యాయప్రభావ మెల్ల దండధరున కెఱింగించి తత్పఠనఫలంబు ప్రాప్తించుటంజేసి
యాపాపాత్ముల కెల్ల నరకవిముక్తి చేకూరి నాపదంబుం బడయంగలిగె నని నుడు
వుటయుఁ గాలుండు తదధ్యాయమహిమంబున కాశ్చర్య మొంది తదనుజ్ఞం బడసి
స్వధామంబున కరుదెంచె. 999

—: గీతాచతుర్థాధ్యాయమాహాత్మ్యము :—

సీ. గంగాతటంబునఁ గలదు వారాణసి, యనుపురం బొక్కటి యవనియందు
నాపురంబున నుండె నఖిలసిద్ధిప్రదా, యక మైనవిశ్వేశ్వరాలయంబు
దానిలో భరతుండు నా నొప్పు నొకవిప్రుఁ, డనుదినంబును శ్రద్ధ యామతిల్లఁ
దప్పకుండఁగను గీతాచతుర్థాధ్యాయ, మును జపించుచు నుండె మోదమునను
గీ. జరుగఁగను నట్లు కొన్నివత్సరము లొక్క, తఱిని భరతుఁడు తత్పురోద్యానభూమి
కరిగి బదరీద్రుమయుగ్మంబు నచటఁ జూచి, కాల నొకటియుఁ గేల నొక్కటియుఁ దాఁకి.
గీ. కొంతసే పుండి యక్కడఁ గుతుకమునను, నవలఁ జనుదెంచె విశ్వేశ్వరాలయమున
కంతటను నమ్మహీజద్వయంబు శుష్క, మయ్యె నిలువునఁ జూపఱ కచ్చెరువుగ.
ఆ. అట్టు లెండిపోయి యాద్రుమంబులు రెండు, పుట్టి కన్యకలుగఁ బురమునందె
యొక్కద్విజునియింట నొందుచుండఁగ వృద్ధి, భరతుఁ డొక్కతఱిని నరిగె నటకు.
సీ. అతనిఁ గన్గొని కన్య లానంద మొదవంగఁ, దత్పాదములకు వందన మొనర్చి
దేవ నీకృపను బొందితిమి మానుష్యంబు, ననుడు నాతఁడు విస్మయంబు నొంది
కన్యకలార మీగాథ యేమిటియు నాకుఁ, దెలుపుఁ డాలింపంగఁ గలిగె వేడ్క
యనవుడు వార లి ట్లనిరి మహాభాగ, వినుము చెప్పెదము మావిషయ మెల్లఁ
గీ. గలదు గోదావరీతటసలిలి ఛిన్న, పాప మనుతీర్థ మొకటి తత్పరిసరమున
సత్యతపుఁ డనియెడిధరాదిత్యుఁ డొకఁడు, తపము నొనరించు చుండె నత్యద్భుతముగ.
సీ. అప్పు డచ్చరలలో నందకత్తెల మగు, మముఁ బిల్చి తనయొద్ద కమరవిభుడు
తత్తపోభంగంబు నెత్తెఱంగున నైన, నొనరింపఁగను మాకు నొసఁగె నాజ్ఞ
యంతట మేము తదాజ్ఞ నౌదలఁ దాల్చి, చనుదెంచి యమ్మునిసవిధమునకుఁ
జేసితి మెన్నెన్నొ శృంగారచేష్టల, వానిచిత్తము కామవశము గాఁగ
గీ. నపుడు సత్యతపుం డాగ్రహమున మమ్ముఁ, దిట్టె గంగాతటంబునఁ బుట్టఁ రేఁగుఁ
జెట్లుగను నంతటను మేము చేరి వాని, దరికి వేఁడ్చుచు నుండ నత్తరుణమందు. 1004
గీ. భరతసంస్పర్శమునను శాపంబు దొలఁగి, పూర్వజన్మస్మృతి ఘటిల్లఁ బుట్టఁగలరు
మర్త్యకన్యలుగను మీరు మహి నటంచు, నతఁడు కరుణింప నిలకు మే మరుగుదెంచి.
గీ. జాహ్నవీతటవనములో జనన మొందఁ, గలిగితిమి బదరీద్రుమంబులుగ నాఁడు
తాఁకుటను నీవు మమ్ముఁ దద్వనమునందుఁ, గాంచితిమి జన్మ మిట మర్త్యకన్యలముగ.

క. కావున నుద్ధారంబును, గావింపఁగ మాకు నీవె గతి యింక మహీ
దేవోత్తమ యని వేఁడఁగ, నావిప్రుఁడు లోనఁ గరుణ యాఁమతిలంగన్ 1007

క. గీతాతుర్యాధ్యాయము, చేతోమోదంబు గలుగఁ జెప్పఁగ వారల్
ప్రీతిమెయి నది జపించుచుఁ, బాతకములు తొలఁగిపోవఁ బడసిరి ముక్తిన్. 1008

—: గీతా పంచమాధ్యాయ మాహాత్మ్యము :—

సీ. కలఁడు పింగళుఁ డనుత్మాసురుం డొక్కఁడు, పురుకుత్సపురమున భువిని మున్ను
బ్రాహ్మణధర్మంబు పరిహరించి యతండు, తౌర్యత్రికప్రసక్తతను జెంది
పరదారలోలుఁడై తిరుగుచుండఁగ వాని, ధౌర్త్యంబుఁ జూచి తద్భార్య యరుణ
తా నొక్కజారునిఁ దవిలి వర్తించుచు, భర్తృనిర్బంధంబుఁ బాపికొనఁగ

గీ. నొంది పల్లవసాహాయ్య మొక్కరేయిఁ, గత్తిచేఁ బింగళునితల గత్తరించె
నంతటను బింగళుఁడు యమయాతనలను, గుడిచి గృధ్రంబుగాఁ బుట్టెఁ గడకు నిలను.

క. అరుణయుఁ బతిహింసాగత, దురితమున భగందరంబు దొరకొన దానన్
మరణించి కుడిచి దారుణ, నిరయంబులు తుదకు నిల జనించెను శుకయై. 1010

సీ. చేర నాగృధ్ర మాచిలుకయుఁ బూర్వవా, సనచేత నొక్కకాననమునందె
కడచుటయును గొంతకాల మచ్చట వాని, కొకనాఁడు దివి నేఁగుచుండఁ జిలుక
ప్రాక్తనవైరానుబంధంబుచే గృధ్ర, మాశుకివెంబడి నరిగి కొట్టె
నంతట నాశుకి యవనిస్థనృకపాల, జలములోఁ బడి ప్రాణములను విడిచె

గీ. దానిఁ గొన వచ్చుచుండ గృధ్రంబు దాని, పైని నొక్కకిరాతుఁడు బాణ మేసె
నంత నాఁడేగ శుక పడినట్టికడనె, పతితమై వీడె శుకివోలెఁ బ్రాణములను. 1011

సీ. అంతట యమదూత లరుదెంచి వానిని, గాలపాశములచేఁ గట్టివైచి
కొనిపోయి వైవస్వతునికడ నిలుపంగఁ, దత్పుణ్యపాపముల్ దండధరుఁడు
ధ్యానయోగంబుచే దర్శించి పొందు మీ, యిష్టలోకములకు నిపుడె యనియె
నంతట విస్మయం బంది శుకీగృధ్ర, ములు సమవర్తికిఁ జలిపి ప్రణతి

గీ. స్వామి పాపాత్ములకు మాకు సంఘటిల్ల, నిష్టలోకంబులు నిదాన మేమొ చెపుమ
నావుడుఁ గృతాంతుఁ డధికసన్మానబుద్ధి, యేర్పడఁగ వానియెడలఁ దా నిట్టు లనియె.

సీ. మున్ను గంగాతటంబున నుండె వటు వను, బ్రాహ్మణుం డొక్కఁడు బ్రహ్మవేత్త
యతఁడు గీతాపంచమాధ్యాయపఠనంబు, గావించుచును సర్వకాలమందు
నొకనాఁడు కాయంబు నుడిగి కాలవశంబు, నను సనాతనధామమునకుఁ జేరె
నంతట నొకచోట నతని కపాలంబు, పడియుండఁ దద్గతాంభస్సునందుఁ

గీ. బడి యసుత్యాగ మొనరించుభాగ్య మొదవి, నందునను మీకుఁ దత్పుణ్య మొందఁగలిగె
ననుచు నాయండజంబులు చనిరె దివ్య, యానముల నెక్కి హరిసన్నిధానమునకు.

ఆ. కాన గీతలోనఁ గలపంచమాధ్యాయ, మునఁ గలట్టిమహిమమును వచింప
నలవి గాదు బ్రహ్మ కైనను నీ కింక, నింతకంటె నధిక మేమిచెప్ప. 1014

—: గీతాషష్ఠాధ్యాయమాహాత్మ్యము :—

సీ. గౌతమీతటమునఁ గలదు ప్రతిష్ఠాన, మనుపురం బొక్కటి యవనియందుఁ
బిప్పలేశుం డనుపేర నీశ్వరలింగ, మొక్కటి యచ్చోట నుద్భవించె
నచట జానశ్రుతి యనుఱేఁ డొకం డుండె, ధర్మానుపాలనతత్పరుండు
తత్కీర్తి వ్యాపింప దశదిక్కులను నొక్క, దినమున హంసలు దివినిఁ జనుచుఁ
గీ. బ్రజ్వరిల్లుజానశ్రుతిప్రాభవంబు, చూచి కొన్ని నుతింపంగఁ జోద్యముగను
నంతపంటెను హెచ్చుగా నభినుతింపఁ, దొడఁగె మఱికొన్ని రైక్వునిదొడ్డతనము.
సీ. అపుడు జానశ్రుతి యామాటలను సౌధ, మున నుండి విని శీఘ్రముగను డిగ్గి
రైక్వునిఁ దోడ్కొని రమ్మని సారథి, కాన తీయఁగ నాతఁ డాజ్ఞ వడసి
కాశీగయాప్రయాగములు కేదారంబు, కొల్హాపురంబును గోమతియును
ద్వారావతియును నోంకార మవంతియు, గోదావరీనర్మదాదినదులఁ
గీ. గ్రమముగను దాటి దివ్యరత్నములచేతఁ, గ్రాలుచుండుమాణిక్యేశ్వరాలయంబు
శేఖరంబుగ నున్నకాశ్మీరపురికిఁ, జేరి తత్పురిశోభ కచ్చెరువుఁ నొంది. 1016
సీ. అవల మాణిక్యేశ్వరాలయద్వారంబు, నందుఁ గూర్చుండి నిజాంగములను
గోఁకికొనుచును విదిక్కులను జూచుచు మహా, నందంబు నొందుచు డెందమందుఁ
గానంగఁబడునొక్కకౌపీనధారిని, వీక్షించి యెఱిఁగి తల్లక్షణముల
నతఁడె రైక్వుం డని యాత్మలో నిర్ణయం, బొనరించికొని వానియొద్ద కరిగి
గీ. ప్రణతిఁ గావించి తత్పాదపద్మములకు, స్వామి నీనామ మేమి నీ వేమి చేయఁ
దలఁచి యిచ్చోట నుంటివో తెలుపు మనుడు, నవ్వి రైక్వుఁడు వానియాననముఁ జూచి.
సీ. నను రైక్వుఁ డందురు జనులు నేఁ బరిపూర్ణ, కాముఁడ నెట్టికాంక్షయును లేదు
తెలిసి నాచిత్తవృత్తిని నాకుఁ బరిచర్య, సలిపినవాఁడు తత్ఫలము నొందు
నని యూరకుంటయు నాతనిభావంబు,సారథి గ్రహియించి సత్వరముగఁ
దనఱేనియొద్దకుఁ జనుదెంచి రైక్వుని, వృత్తాంత మంతయు విన్నవించె
గీ. నంత జానశ్రుతివసుంధరాధినేత, హర్షమున గోవులను రత్నహారములను
గనకవసనంబులను నుపాయనములుగను, గైకొని రయంబ రైక్వునికడకు నేఁగి.
గీ. అమ్మహాత్మున కెరఁగి సాష్టాంగముగను, దాను దెచ్చినవస్తుసంతతుల నెల్ల
నతనికడ నుంప నవి రైక్వుఁ డంటకుండ, నిట్లనియె శూద్ర నాచిత్త మెఱుఁగ వైతి.
క. కొని యివి యన్నియు శీఘ్రము, చను మని కోపమునఁ బలుక జానశ్రుతి రై
క్వునిపదములపైఁ బడి ప్రా, ర్థన చేసె క్షమింప స్వాపరాధము నంతన్. 1020
వ. రైక్వుండు సుప్రసన్నవదనుం డగుటయు జానశ్రుతి తదాననంబు నుపలక్షించి సవిన
యంబుగా ని ట్లనియె, 1021

గీ. స్వామి నీ కీయలోభభావంబు దేనఁ, గలిగినదియొ వచింపుము కరుణతోడ
నని యడుగ రైక్వుఁ డతని కిట్లనియె రాజ, యడిగితివి గాన వినుము నే నుడువువాఁడ.
క. గీతాషష్ఠాధ్యాయము, ప్రీతిమెయిన్ సతతమును జపించుచు నుంటన్
జేతస్తృప్తి ఘటిల్లి ని, రాతంకుఁడ నైతి ననుడు నతఁ డిట్లనియెన్. 1023
క. అనఘ తదధ్యాయము గృప, యెనయంగను నాకుఁ జెప్పు మిపు డని వేఁడం
గను రైక్వం డుపదేశిం, చెను దానిని శిష్యబుద్ధిచే నాతనికిన్. 1024
క. అంతట జానశ్రుతిభూ, కాంతుఁడు తత్పఠనగళితకామక్రోధా
ద్యంతశ్శాత్రవుఁ డై కడు, సంతసమున నొందె మోక్షసామ్రాజ్యంబున్. 1025
సీ. అంత రైక్వుఁడు తదధ్యాయంబు జపియించు, చుండంగ మునుపోలె నొక్క నాఁడు
చనుదెంచి హంసవేషములతో నమరులు, వరదానకాంక్షచే వానికడకు
నిష్కాముఁ డైనవానిని జూచి విస్మితా, తరు లయి చనిరి స్వధామమునకుఁ
గొంతకాలంబు రైక్వుం డీవిధంబునఁ, గడపి విజ్ఞానయోగంబుచేత
గీ. నొడలు విడనాడి స్వేచ్ఛచే నొక్కనాఁడు, లీనమయ్యె మహేశునిమేనిలోనఁ
గాన నేను దదధ్యాయఘనత యిట్టి, దని వచింపంగఁ జాల యథార్థముగను. 1026

—: గీతాసప్తమాధ్యాయమాహాత్మ్యము :—

సీ. మున్ను పాటలిపుత్రమున నుండె శంకుక, ర్ణుండు నా నొకభూసురుండు ధరను
నాతఁడు విడిచి బ్రాహ్మణధర్మమును వణి, గ్వృత్తిచే మిగుల నార్జించి ధనము
కావించుకొనఁగ నాల్గవపెండ్లి యొకనాఁడు, బంధుసంతతితోడ బయలుదేఱి
యరుగుచు మార్గమధ్యంబున నొకయూర, శయనించి రేయి జామయినకతనఁ
గీ. గాలవశమున నొకసాము కాటు నైన, నచటఁ బడి చచ్చి యాత్మకృతాఘమునను
వ్యాళ మై తాను నిధి నుంచినట్టికడను, బుట్ట నిర్మించుకొని చేరి పుట్టలోన. 1027
సీ. ఒకనాఁటిరాతిరి స్వకుమారులకు స్వప్న, మందుఁ గానంబడి వ్యాళముగనె
తనకుఁ గలినయవస్థయును దా నుండిన, తావును దెలిపి నాతనయులార
నన్నుద్ధరింపుఁడు నాకు మీకంటెను, దిక్కు లే దని యేఁగఁ దెల్లవాఱ
నంత వారలు లేచి యన్యోన్యమును స్వప్న, కథ చెప్పికొనుచుండు కాలమందు
గీ. జ్యేష్ఠుఁడు తరింపఁజేయుద మితని ననియె, మధ్యముఁడు చంపి ఫణిని హేమంబుఁ గొంద
మనియెను గనిష్ఠుఁ డహి నైతె యయ్య యనుచుఁ, గాలువలు గట్టె కన్నీరు గాఱ నేత్రెం.
సీ. అంతట నాదినం బరుగంగ నారేయి, మధ్యయామంబున మధ్యముండు
తెలియకుండఁగ సోదరుల కుత్సితుం డయి, పడఁతితోడను బుట్టకడకుఁ బోయి
త్రవ్వుచుండఁగఁ బుట్ట ద్రవ్యాశచేఁ దన, పూఁబోఁడి మన్నెత్తిపోయఁ దొడఁగ
నప్పుడు లోనుండియాశీవిషంబు కో, పంబుచే బుసతోడఁ బైకి వచ్చి
గీ. యుద్ధత యెవండ వీవు నే నుండుపుట్ట, త్రవ్వఁ బనియేమి చెపు మనఁ దండ్రి నేను
నీసుతుండను శివుఁడను నిధినిఁ గొనఁగఁ, ద్రవ్వుచున్నాఁడఁ బుట్టను దప్పికొనుము.

గీ. అనుటయును విని సర్ప మి ట్లనియె వత్స, నిక్కముగ నాత్మజుండ వైన నీవు నాకు
నున్నుఁ గడతేర్చి నీచజన్మంబునుండి, కొనుము నేఁ గష్టపడి గడించినధనంబు. 1030

చ. అనుడు శివుండు చిత్తమునయం దొదవన్ గృప దండశూకమున్
గనుఁగొని తండ్రి నీకుఁ దరణంబు ఘటిల్లెడికార్య మేది యై
నను గల దేని తప్పక యొనర్చెదఁ ద్వచ్చరణంబులాన పే
ర్కొను మని వేఁడ ని ట్లనియె గూఢపదంబు ప్రహర్ష మొందుచున్. 1031

ఆ. తనయ గీతలోనఁ దనరారుసప్తమా, ధ్యాయమును జపించునట్టిద్విజుని
శ్రాద్ధభోక్తఁ జేసి శ్రాద్ధంబు పెట్టుఁడు, కలుగు ముక్తి దానివలన నాకు. 1032

క. అని నుడువుటయును నాతని, తనయులు తత్ప్రోక్తరీతిఁ దచ్ఛ్రాద్ధంబున్
బొనరింప శంకుకర్ణుం, డనిమిషతను నొందె నుడిగి యహిరూపంబున్. 1033

గీ. అంత నాతనిసుతులు పిత్రాజ్ఞితార్థ, మంతయును గూడ ధర్మకార్యములకొఱకు
వ్యయము గావించి తుదిఁ దదధ్యాయజపము, వలనఁ జెందిరి పరమకైవల్యపదము.

—: గీతాష్టమాధ్యాయమాహాత్మ్యము :—

సీ. ఆమర్దకం బనునట్టిపురం బుండె, దక్షిణాపథమున ధాత్రి నొకటి
యం దుండె భావశర్మాభిధానుం డైన, బ్రాహ్మణుం డొకఁడు ధర్మచ్యుతుండు
తాళాసవంబు నాతఁడు ద్రావి యొకనాఁడు, కంఠపర్యంతము కాయ ముడిగి
స్వకృతకర్మంబున జన్మించి తాళ మై, యొందుచుండఁగ వృద్ధి నొక్కచోట

గీ. నచ్చటికి వచ్చిరి కుశీబలాఖ్యుఁ డైన, బ్రాహ్మణుండును గుమతి నాఁబరఁగుతదీయ
భార్యయును విశ్రమింపంగ బ్రహ్మరాక్ష, సాకృతులతోడఁ దిరుగుచు నవని నెల్ల.

సీ. అట్లు వచ్చి వసించి రాచెట్టుక్రింద వా, రాఁకలి దప్పియు నార్తిగొలుప
నప్పుడు కుమతి యి ట్లనియె మద్దానముల్, పట్టి సంపాదించినట్టిధనము
పాత్రదత్తము గామి బ్రహ్మరాక్షసజన్మ, ముభయులకును గూడ నొదవె మనకు
నీవినిందితజన్మ మేనాఁట కైనను, దొలఁగెడిమార్గంబు గలదె నాథ

గీ. యనుటయుఁ గుశీబలుం డిట్టు లనియెఁ దన్వి, యీశరీరంబు ఘోరదుష్కృతమువలన
బ్రాప్త మగుటను బ్రహ్మకర్మములఁగూర్చి, చేసెడివిచారమునఁ దప్పఁ బాసిపోదు.

వ. అని పలుకుటయు "కిం తద్బ్రహ్మ కి మధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ" యను
గీతాష్టమాధ్యాయార్ధశ్లోకంబు కుమతినోట దైవికంబుగా నిస్సృతం బయ్యె. 1037

గీ. తచ్ఛ్రవణమాత్రమునఁ బడి తాళవృక్ష, మవనిపైఁ బూర్వదేహంబు నధిగమించె
నవల నాదంపతులు రాక్షసాకృతులను, బాసి నిలిచిరి దివ్యరూపములతోడ. 1038

గీ. అప్పు డాకాశముననుండి యరుగుదెంచి, తత్క్షణమ దివ్యయాన మాదంపతులను
దోడుకొని పోయి నిలుప నింద్రునకు నెదుట, వారలను నిల్చె దివమున వాసవుండు.

వ. అది యట్లుండ భావశర్మ తదర్ధశ్లోకంబు వ్రాసికొని వారాణసికి నేఁగి భాగీరథీతీరం
బున నుపవిష్టుం డై దానిని జపియింపందొడఁగె. 1040

గీ. ఆజపంబున కే నంతరంగమందుఁ, బరమసంతోషమును బొంది భావశర్మ
కపునరావృత్తికర మయినట్టిపదము, నిచ్చినాఁడను నింక నీ కేమిచెప్ప. 1041

—: గీతానవమాధ్యాయమాహాత్మ్యము :—

ఆ. రమణి నర్మదాతటమున మాహిష్మతి, యనెడినగరి యుండె నందుఁ గలఁడు
మాధవుండు నాఁగ మహీదేవుఁ డొక్కఁడు, క్రతువిధానబద్ధకంకణుండు. 1042

సీ. ఆవిప్రు డొకతటి నధ్వరం బొనరింప, సంకల్ప మొనరించి సమితిలోన
యూపంబునకుఁ గట్టి యొక్కఛాగమును ద, ద్విశసనంబునకు యత్నించుచుండ
నట్టహాస మొనర్చి యాఛాగ మి ట్లనె, మునిజవాక్కునను విస్మయము గలుగ
బ్రాహ్మణోత్తమ పశ్వరఫలంబునకును నీ, వాసించి హింస చేయంగ నగునె
గీ. జన్మమృత్యుజరాదుఃఖసంక్షయంబు, గలుగఁజేయంగఁజాలని క్రతువు లేల
తెలివితక్కువచే నేను సలిపి యిట్లు, మును సవంబుల హీనజన్ముండ నైతి. 1043

క. అనవుడుఁ దద్వాక్యములను, విని యజ్వ మనంబు నందు విస్మయ మొదవం
గను దానిఁ జూచి ఛాగమ, వివరింపుము నీచరిత్ర విశదము గాఁగన్. 1044

సీ. అనవుడు ఛాగ మి ట్లనియెఁ బూర్వము నేను, బుట్టి బ్రాహ్మణుఁడంగాఁ బుడమియందుఁ
జదివి వేదములను శ్రద్ధాయుతుండనై, సలుపుచు వేదోక్తసత్క్రియలను
నక్షీణఫల మేవో ప్రక్షీణఫల మేవో, యనువిమర్శంబు లేనట్టికతన
నొకతటి యజ్ఞంబు నొనరించుచును నందు, ఛాగవిశసనము సలుపుచుండఁ
గీ. గాంచి యది దానిజనయిత్రి కన్నునీరు, గార్చుచును బ్రాహ్మణాధమ తొల్తలమున
నీచయోనులలోన జన్మింపు మనుచుఁ, దిట్టె నను నేను జేయుచున్నట్టిపనికి. 1045

సీ. అంతటఁ గపియోనియందు నే జన్మించి, యొకనాఁడు మత్పాపయోగమునను
నాహితుండొకనిచే నాకస్మికంబుగా, బంధింపఁబడి వీడి బాంధవులను
జని వానివెంట నాతనిశిక్షచేత నా, ట్యము సేయువిధమును నభ్యసించి
తిరుగుచుంటిని వాఁడు త్రిప్పుచోటుల కెల్లఁ, జేయుచు నాట్యంబు చిత్రముగను
గీ. నట్టు లుండంగ నొకదినమందు నేను, దరువులం దుండి చూచునాతరుణిసుతులఁ
గాంచుచును నాట్యమును దప్పుగా నొనర్పఁ, గఱ్ఱచేఁ గొట్టె వాఁడు నాపుఱ్ఱె పగుల.

ఆ. చేష్ట లుడిగి యపుడు క్షితిమీఁదఁ బడి ప్రాణ, ములను విడిచి నేను బుట్టి శునక
గర్భమందు నన్నుకణ మేని దొరకమి, క్షుద్భరంబు నాఁపికొనఁగలేక. 1047

ఆ. తిరిగి తిరిగి దిమ్మదిరుగంగఁ గొంపకొం, పకును గొట్లు గొట్ట బాధపడుచు
నంతమునకు నాగృహంబులోనికిఁ బోయి, దూఱి వంటయింట దొంగవోలె. 1048

క. పాత్రస్థ మైనయన్నము, నాత్రముతోఁ దినుచునుండ నాధ్వని విని నా
పుత్రులు నాభార్యయు మ, ద్గాత్రము విఱుగంగఁ గొట్ట దండంబులచేన్. 1049

గీ. అచటఁ బడి నేను మృతి నొంది యవల నొక్క, శౌండికుని యింట హాయముగా సంభవించి
చేయఁగలయంతకాలము చేసి పనులు, వార్ధకము నొంద నిది యింక వ్యర్థ మనుచు.

క. నను శౌండికుండు విక్రయ, మొనరింపఁగ రథ్యలోన నునుప మదీయాం
గన యల్పద్రవ్యమునకుఁ, గొని యింటికి నన్నుఁ దోలుకొనిపోయి వెసన్. 1051

గీ. ఆత్మజులతోడ ద్వారకాయాత్ర కేఁగఁ, దలఁచి నామీఁదఁ గూర్చుండి తాను సుతులఁ
దోలఁగను నన్ను బడలికతోడ నేను, వారలను మోచికొని కొంతవఱకుఁ బోయి.

గీ. దాహ మగుటను మార్గమధ్యమున జలముఁ, ద్రావఁగా నెంచి యొక్కహ్రదంబుఁ జొచ్చి
త్రావి సలిలంబు దానికర్దమములోనఁ, గాళ్లు దిగఁబడ నిలుచుంటిఁ గదలలేక. 1053

ఆ. అపుడు నన్నుఁ గొట్టి రదయంబుగను సతీ, సుతులు దాన నేను సొలసి యందె
పడి పరిత్యజించి ప్రాణంబులను ఛాగ, యోనియందు జన్మ మొందినాఁడ. 1054

సీ. మఱియొక కథను నీ కెఱిఁగించెదను విను, మాశ్చర్యకర మగునట్టిదాని
మున్ను కురుక్షేత్రమున నుండె సూర్యవం, శ్యుఁడు చంద్రవర్మ నా నొకనృపుండు
ప్రాప్తింప నొకదినమందు సూర్యోపరా, గంబు తత్పుణ్యకాలంబునందుఁ
గావింపఁగా నెంచి కాలపురుషదాన, మాతఁడు పిలిపించి యవనిసురుల

గీ. దానమును బుచ్చుకొనియెడిధైర్యశాలు, లెవ్వ రైనను గలరేని యిందుఁ దెలుపుఁ
డనుడు నొకబ్రాహ్మణుండు ధరాధినాథ, యట్టిదానంబు నైన నా కీయు మనియె.

గీ. అంతటను ఱేఁడు బంధుసమన్వితముగ, స్నాన మొనరింపఁగాఁ బుణ్యనదికిఁ జనియె
నప్పు డాకాలపురుషుఁ డిట్లనియె నట్లు, హోమ మొనరించి ద్విజు లెల్ల నాలకింప.

ఆ. వెఱ్ఱిబ్రాహ్మణుండ విప్రుఁ డెవ్వం డైనఁ, బూనుకొనునె యిట్టిదానమునకు
ద్రవ్యలోభమునను దనువును జేసేత, యమున కొప్పగించునట్టె యున్నె. 1057

క. అనవుడుఁ దద్వాక్యంబులు, విని బ్రాహ్మణుఁ డిట్టు లనియె విప్రుఁ డశేషా
ఘనివారణదక్షుఁడు వా, నిని జెనకం దరమె ఫాలనేత్రున కైనన్. 1058

వ. అని ధైర్యంబునం బలుకుటయుఁ గాలపురుషుం డూరకుండె. 1059

సీ. అంతట స్నాతుఁ డై యవనీశ్వరుఁడు వచ్చి, బ్రహ్మసుపర్వులకు నమస్కరించి
దానంబు గైకొనుధరణీసురుని నుప, విష్టునిఁ గావించి విష్టరమునఁ
గల్పోక్తరీతిని గాలపురుషదాన, మొనరింప దానిఁ గైకొనియె ద్విజుఁడు
కైకొన్న వెంటనె కడువిస్మయంబుగాఁ, గాలపురుషమూర్తి గర్భ మగలి

గీ. దానిలోనుండి యొక్కమాతంగుఁ డొక్క, శ్వపచతరుణియుఁ బ్రభవించి సంహరింప
దానమును గొన్నవిప్రుని దరియ నతఁడు, గజగజవడంకుస్వప్రతీకములఁ జూచి. 1060

క. గీతానవమాధ్యాయముఁ, జేతమున జపింపఁ దొడఁగె శీఘ్రమ యంతన్
మాతంగీమాతంగులు, భీతిన్ బరువిడిరి పరితపించుచు నెదలన్. 1061

గీ. అప్పు డది యెల్లఁ జూచి ప్రత్యక్షముగను, నచ్చెరువు నొంది ప్రభువు బ్రాహ్మణునిఁ గాంచి
స్వామి యెటు దాఁటితివి విపత్సాగరంబుఁ, బరువులిడువీర లెవరొ యేర్పడఁగఁ జెపుము.

సీ. అని వేడుటయును నిట్లనియె నావిప్రుండు, జననాథ నీయొనర్చినయఘంబు
చండాలుఁడగుచు నీచలిపినపరనింద, చండాలి యగుచు నర్క సంహరింప
నరుదేర దరికి నే నపుడు గీతానవ, మాధ్యాయజపము చేయంగఁదొడఁగ
వార లిచ్చట నిలువంగఁజాలక పరు, విడిరి తాపము వుట్ట నొడళులందు
గీ. నని నుడువ భూవరుఁడు తదధ్యాయమహిమ, మునకు నాశ్చర్యమునుజెందిమనమునందుఁ
దదుపదేశంబు నొంది యాతనిసమక్ష, మందు జపియించుచును దాని నొందె ముక్తి.
గీ. విప్రతనువున నేను గావించినట్టి, శ్రేయమున జాతిసంస్మృతి చేకుఱుటను
దెలుపఁగలిగితి నిట్టు లాత్మీయచరిత, మనుచు మాధవుఁడు వివేక మామతిల్ల.
వ. అధ్వరంబు నుజ్జగించి గీతానవమాధ్యాయపఠనంబు గావించుచు మోక్షసామ్రాజ్యముం బడసె. భాగంబును దదధ్యాయశ్రవణంబున జన్మరాహిత్యముం బొందె. 1065

—: గీతాదశమాధ్యాయమాహాత్మ్యము :—

సీ. మున్ను కాశీపురంబున విప్రుఁ డొకఁ డుండెఁ, దత్త్వానుచింతనతత్పరుండు
నాసాగ్రవిన్యస్తనయనుఁ డర్ధోన్మీలి, తాక్షుఁడు సంతతాహ్లాదయుతుఁడు
త్రిపురాంతకద్వారదేహళీసంస్థుఁ డా, తనిక నిత్యమును సదాశివుండు
హస్తావలంబంబు నతిగౌరవంబునఁ, గరుణించు చుండ భృంగిరిటి చూచి
గీ. దేవ యీతం డెవండు నీదివ్యకృపకు, నుత్కటంబుగఁ బాత్రుఁ డై యున్నవాఁడు
వీనిమహిమంబు విన నాకు వేడ్క యయ్యెఁ, జెప్పు మని వేఁడ హరుఁ డిట్లు చెప్పఁదొడఁగె.
సీ. గణనాథ వినుము నేఁ గైలాసపార్శ్వంబు, నను నుండుపున్నాగవనమునందు
మాణిక్యవేదికామధ్యంబునం దుప, విష్టుండ నై యున్నవేళయందు
వీవంగ నొకచండవిషమవాయువు దాని, వెంబడి నొక్కఘోషంబు గలిగె
దానివెంటనె తమోధరణీధరముఁబోలె, ఛిన్నపక్షం బైన శిఖరివోలె
గీ. నాకసమునుండి పడి యొకయండజంబు, పొరలుచును భూమిమీఁద నాదరికి వచ్చి
ప్రణతి యొనరించి యమ్లానపద్మ మొకటి, నాపదంబులపై నుంచి నను నుతించె.
ఆ. అపుడు నేను జూచి యాఖగంబును బత్త్రి, యెవరు నీవు కార్య మేమి యిటకు
రాఁగ నీకు ననుడుఁ బ్రశ్రయానతగ నె, మగుచు నిట్టు లనియె నాఖగంబు. 1068
సీ. చంద్రశేఖర నేను జతురాననునిహంస, నధికపాండుచ్ఛాయ నలరుదాన
నరుదెంచి మానసహ్రదమున నొక్కది, నమున నందలిబిసనాళములను
భక్షించి తృప్తిగా బ్రహ్మయొద్దకుఁ బోవ, నెగిరి వ్యోమమున కదేమొ కాని
వెంటనె పడి పృథివీస్థలంబునఁ జేష్ట, దప్పి శీతలమారుతంబువలనఁ
గీ. బడసి సంజ్ఞను నెట్లొ తత్పతనమునకు, హేతు వేమియొ యని మది నెంచు చుండఁ
గాళిమం బేరుపడియెను గాయమందు, దీనిఁ గనుఁగొని మిగుల జింతించు చుండ.
గీ. అప్పుడు ప్రాకంబులోనుండి హంస చింత, పడఁగ నేటికిఁ దావకపతననైల్య
ములకు నుండెడిహేతువు దెల్పుదాన, ననెడుమాట వినంబడె నద్భుతముగ. 1070

గీ. అంతఁ గనఁబడి రాకసమందుఁ గనక, వసనులు చతుర్భుజులు వారివాహనీల
కాయులు గదాబ్జశంఖచక్రాయుధులును, నైనషష్టిసహస్రసంఖ్యాకసురలు. 1071

గీ. అప్పుడు ప్రణామమును వారి కాచరించి, నేను మత్పాతనైల్యనిదాన మరయఁ
జింతిలుచు నుండఁ దత్సరస్థితిని జెంది, నట్టిపద్మిని నను గూర్చి యిట్టు లనియె. 1072

సీ. కలహంస మద్విలంఘనము సేసి నభంబు, నకు నీవు చనినపాతకమువలనఁ
బాతనైల్యములు సంప్రాప్తించె నీకుఁ దృ, త్పతనంబు గాంచినతత్క్షణంబ
మూర్కొని నాగంధమును విష్ణుపదమున, కరిగెను భ్రమరంబు లమరు లగుచు
నీకు వ్యోమమునఁ గాన్పించినపురుషు లా, తేఁటులె యని నీవు తెలిసికొనుము

గీ. వార లుదయించి మానికుమారులుగను, జనినసప్తమజన్మంబునను దపంబు
సలిపి యీహ్రదతీరదేశమున నొక్క, యప్సరోంగనగానంబు నాలకించి. 1073

క. దానను మనములు చెదరుట, నీనెలఁతను గొందు నేనె యేనె యటంచున్
మానుగ నన్యోన్యము గను, గానక కొట్టుకొని చచ్చి కని దుర్గతులన్. 1074

ఆ. ఫుట్టి కడకు శరభములుగ శ్వాపదములఁ జంపుచును నిరంకుశముగ దావ
దహనమునను జచ్చి దంతులై జనియించి, పాంథజనుల నెల్ల బాధపెట్టి. 1075

గీ. విపినమునఁ ద్రావి చివరకు విషజలంబు, మరణమును బొంది క్రమముగా ఖరమహోంగ
వృకబిడాలంబులై జనియించి తుదకు, షట్పదము లయి చేరి రీస్థానమునకు. 1076

వ. యింక నావృత్తాంతముం జెప్పెద వినుము. 1077

సీ. ఈజన్మమునకు ము న్నేను దృతీయజ, న్మమునఁ గన్యక నయి భూసురునకు
నుదయ మొంది సరోజవదనాహ్వయముతోడఁ, బరగి పాతివ్రత్యనిరత నగుచు
నొకతటి నొక్క సారికకు మాటలు నేర్పు, చుండంగి నావల్లభుండు చూచి
సారిక వగు మని శపియింప సారిక, నై మదాచరితపుణ్యంబువలనఁ

గీ. బుట్టి యొకమునియింటఁ దత్పుత్రి పెంపఁ, బెంచుచును వృద్ధ గీతలోఁ జెప్పఁబడిన
పదనయధ్యాయ మమ్మునిప్రతిదినంబుఁ, జదువుచుండంగి వినుచదృష్టమును గంటి.

వ. తచ్ఛ్రవణమహిమంబుచేఁ గొలఁదికాలంబులోన సారికాశరీరంబు విడిచి పద్మావతి యనునచ్చర నై పద్మాసఖిత్వంబు నొంది వైకుంఠంబు నధివసించి యనవధికసుఖంబు లనుభవించి యొకనాఁడు విమానంబు నెక్కి నభోమార్గంబున నేఁగుచు మనోజ్ఞం బగునీసరోవరముం జూచి దిగి యిందు జలక్రీడ గావించు చుండ దైవికంబుగా దుర్వాసుం డరుదెంచి వివస్త్ర నగునన్ను వీక్షింప నేను భయగ్రస్త నై పాదద్వయంబు పద్మద్వయంబు గాహస్తద్వయంబు పద్మద్వయంబు గా ముఖం బేకపద్మంబు గాఁ బంచపద్మ యగుపద్మిని నై యొదిగి యుంటి. 1079

గీ. అపుడు దుర్వాసుఁ డాగ్రహం బొమతిల్లఁ, బద్మినీరూపమున శతాబ్దములవఱకు
నిందె యుండంగ నను శపియించి చనియె, నదియె మొదలుగ నుంటి నీహ్రదమునందు.

వ. గీతావిభూత్యధ్యాయశ్రవణప్రభావంబునంజేసి పూర్వజన్మస్మృతియును మహత్త్వం
బును నన్నుఁ డబాయ దయ్యె. మద్విలంఘనంబున నీకుఁ బతనంబును శరీరవైకల్యంబును
నేర్పడియె. తదధ్యాయమాహాత్మ్యంబు నేఁడు నీకు వినిపించుటచే నాకు శాపవిముక్తి
కాలంబు ప్రాప్తించె. నీ వీతామరసంబు నీశ్వరున కుపాయనంబుగా సమర్పించి తద
ధ్యాయమాహాత్మ్యశ్రవణఫలంబు గా మోక్షార్హ జన్మంబు నొంది యీశ్వరానుగ్రహ
పాత్రం బగుదువుగాక యని వాక్రుచ్చి నా పద్మంబు నొసంగి. 1081

క. అచ్చర వై తాఁ జనియె వి, యచ్చరమార్గమున దివికి నాపద్మము నీ
కిచ్చితి ననుచు స్వదేహము, నచ్చెరువుగ విడిచె నాసమక్షమునందున్. 1082

గీ. అనుటయును భృంగిరిటి విస్మయమున దేవ, బ్రహ్మహంసం బెవండొ ప్రాగ్భవమునందుఁ
దచ్చరిత్రంబు విన నాకు నిచ్చ వొడమెఁ, నానతిమ్మన నతని కట్లనియె హరుఁడు.

సీ. వినిచెద గణనాథ విను మామరాళంబు, ప్రాక్తనభవమున బ్రాహ్మణునకు
సుతపుం డనెడిపేర సుతుఁ డయి జన్మించి, చరియించుచును బ్రహ్మచర్యమునను
శయనించి యుండంగ శయ్యమీఁద గురుండు, తాను నిద్రాదశాధీనుఁ డగుటఁ
దచ్ఛయ్యను స్పృశించెఁ దనపాదమున దానఁ, బ్రాప్త మయ్యెను మహాపాతకంబు

గీ. దానఁ దిర్యక్త్వమును నొంది తాను వినుట, నబ్జినీముఖమునఁ దదధ్యాయమహిమ
విడిచి నాకడ దేహంబు పుడమిలోన, సంభవము నొందె విప్రవంశంబునందు. 1084

సీ. అతఁడె యీతఁడు పూర్వమందు గీతాదశ, మాధ్యాయమును వినినందువలనఁ
దద్వాసనను జేసి తనువును మఱచి తి, చ్చింతనాసక్తుఁ డై సంతతమును
భువనపరాఙ్ముఖభూతుఁ డై చూచుచు, హరిని సంతర్యామి యైనవాని
నానందమున నోలలాడు చుండంగ నా, వీఁటికి వీని రావించుకొంటి

గీ. నెవరిపైఁ బ్రసరించునో యితనిదృష్టి, వారు మోక్షంబు నొందెడివార దాన
వీనిమహిమంబు నెఱుఁగుట నేను వీని, కెపుడును గిరావలంబన మిచ్చుచుందు. 1085

వ. అని చెప్పుటయును భృంగిరిటి విస్మయంబు నొంది యది మొదలుగ విభూత్య
ధ్యాయంబు పఠింపం దొడంగె. 1086

క. కాన విభూత్యధ్యాయము, నానాపాతకవినాశనము చేసి యశే
షానందమూల మగుబ్ర, హ్మానందము గలుగఁజేయు నధ్యేతలకున్. 1087

—: గీతైకాదశాధ్యాయమాహాత్మ్యము :—

సీ. మును ప్రణీతాతటంబునను మేఘంకరం, బనియెడినగర మొం డవని నుండె
నచట సునందాఖ్యుఁ డగువిప్రుఁ డొకఁ డుండె, నతఁడు నిష్కాముఁ డై యనుదినంబు
సలిపి స్నానంబు మేఖల యనుతీర్థంబు, నను నారసింహదర్శనము చేసి
పఠియించు చుండుటఁ బారాయణము గ గీ, తైకాదశాధ్యాయ మేకభక్తి

గీ. సకలదుఃఖవిముక్తుఁ డై యొకదినంబు, నందు గోదావరీతీర్థయాత్ర సేయఁ
బ్రస్థితుం డయి విరజతీర్థమును జేరి, చేసి స్నానంబు నచటఁ బూజించి రమను. 1088

వ. అంతట కపిలాసంగమంబుం జేరి తారాతీర్థంబున స్నానం బొనరించి పిదప సప్తతీర్థంబునఁ
పితృతర్పణంబు సేసి కపిలాద్వారమున కరిగి యచ్చట స్నాతుం డై మధుసూదనుని
దర్శించి యారేయి నం దుండి ప్రాతఃకాలంబున నరసింహావనతీర్థంబున రామదీర్ఘిక
యందు మునింగి ప్రహ్లాదపూజితుం డగు నృసింహుని దర్శించి యచ్చటనుండి యంబికా
పురి కరిగి వాంఛితార్థప్రదాయిని యగు నంబిక నర్చించి యవలఁ గరస్థానపురంబునకుం
జేరి యచ్చట నద్వయరూపిణియు ననాహతమహానాదమయియును యోగిరాజ
హృదంభోజరాజహంసియును నగు మహాలక్ష్మిని బూజించి పిదప వివాహమండప
పురముం జేరి యందు శయనించుటకు నేగృహంబునందును స్థానంబు లభింపక తిరుగు
చుండ గ్రామపాలునిచే నొక్క విశాలమందిరంబు చూపింపంబడియె. 1089

గీ. అంత నా బ్రాహ్మణుం డాగృహంబునందుఁ, బండుకొని రాత్రి యెల్ల నిర్భయము గాఁగ
నుదయమున లేచి పోవుచు నున్నతని, గ్రామపాలుఁడు చూచి యాభూమిసురుని.

చ. అనఘ నినుం గనుంగొనఁగ నప్రతిమానుఁడ వందుఁ దోఁచె నా
మనమున కిట్టి భవాదృశులు మాకు లభించుట యన్న మాపురా
తనసుకృతప్రభావమె హితంబును మా కొనరింపు మీపురం
బున నివసించి కొన్ని దినముల్ దయతోడ నటంచు వేడఁగన్. 1091

క. ఆవేడికోలునకు భూ, దేవుం డంగీకరింప దినదినమును ద
త్సేవను గ్రామాధీశుఁడు, గావించుచు నొక్క నాఁ డు కనుఁగొని యతనిన్. 1092

గీ. స్వామి యాలింపు మొక్క విజ్ఞాపనంబు, నీపురంబున నొక దైత్యుఁ డేగుదెంచి
మున్న భక్షించుచుండ నిం దున్న జనుల, నపుడు పూర్వీకు లాతని నాశ్రయించి.

వ. ప్రతిదినంబును రాత్రికాలంబునఁ బురమందిరంబునం దతనికి నరగ్రాసంబు నొసంగు
నట్లును నాతండు నగరప్రజల భక్షింపకుండునట్లును సమయంబు గావించిరి. 1094

సీ. అది మొదలుగఁ బాంథు లగువారలను గ్రామ, పాలకుం డగువాఁడు ప్రతిదినంబు
శయనించుటకు రాత్రిసమయంబునందును, బంపుచుండఁగఁ బురభవనమునకు
నారాక్షసుఁడు వారి నారగించుచు నుండె, నరిగె నట్టులె కొన్ని హాయనములు
దైవికంబుగను మత్తనయమిత్రుఁ డొకండు, చనుదేర నిట నొక్క దినమునందు

గీ. వాని నారాత్రి పనిచితి నేను నగర, భవనమున కయ్యది మదాత్మభవుఁ డెఱింగి
వానిఁ గొని రాఁగఁ జని పురావసథమునకు, భక్షితుం డయ్యె నా క్రవ్యభక్షిచేత.

ఆ. అంత నే నెఱింగి యావార్త దైత్యుని, దరికిఁ బోయి యేడ్చి దానవేంద్ర
న్యాయ మగునె నీకు నాకుమారుని మ్రింగ, మఱచిపోతి వేమొ మదుపకృతిని. 1096

వ. అని పలుకుటయు నారాత్రించరుం డి ట్లనియె. 1097

సీ. అకట నే నెఱుఁగక యారగించితి భవ, త్తనయునిఁ బాంథసంతతులతోడ
నుపకారి కుపకార మొనరింపకున్నను, నపకార మొనరించు నతఁడు పాతుఁడు

నేను కృతఘ్నుఁడఁగా నొక్క విషయంబు, వినుము చెప్పెద నీకు విశదముగను
బఠియించుచుండునొ బ్రాహ్మణుం డెవఁడు గీ, తైకాదశాధ్యాయ మెపుడుఁ గూడ

గీ. నతఁడు మహాసీయుఁ డతని నే నంటఁజాల, నమ్మహాత్ముఁడు మంత్రించినట్టిజలముఁ
జల్ల నామీఁద నాకగు శాపముక్తి, యబ్బు మద్భక్తజనులకు హరిపదంబు. 1098

గీ. అనుడు నే నిట్టు లంటి నిశాట నీకు, శాపమేకారణంబున సంభవించె
నట్టిమాహాత్మ్యమును దదధ్యాయమునకు, నెట్లు చేకూరె ననఁగ వాఁ డిట్టు లనియె.

ఆ. వినుము గ్రామపాల వినిచెద నీపీట, నుండె నొక్క బ్రాహ్మణుండు మున్ను
వాఁడు స్వకులవృత్తివలన జీవింపఁగఁ, జాలకునికిఁ గృషిని జలుపఁదొడఁగె. 1100

సీ. ఆవిధిఁ గృషివృత్తి నాశ్రయించి యతండు, శాలిసంరక్షణాసక్తుఁ డగుచు
నొకనాఁడు పొలములో నుండఁ దన్మార్గంబు, ననె యొక్క పాంథుఁడు చనుచునుండ
నాతని నొకగృధ్ర మారగింపఁగ నెంచి, చంపుచుండంగ దత్సమయమందుఁ
గాంచుచుండియు నన్యకార్యలౌల్యంబున, నాలస్య మొనరింప నవనిసురుఁడు

గీ. చూచి యూహించ నొకతాపసుండు దూర, ధరణి నుండుటఁ బరువెత్తి యరుగుదెంచు
నంతలో గృధ్ర మాతని నాహరించి, చనియె నప్పుడు మౌని యచ్చటికి వచ్చి. 1101

సీ. కనుఁగొని శాలిరక్షకుఁడై నవిప్రుని, నోరి దుర్బ్రాహ్మణ యోరి పాపి
చోరసర్పాగ్నిశస్త్రశానుగృధ్రపిశాంబు, యాతుధానార్దితులై నజనులఁ
గావ శక్తుం డయ్యుఁ గావకుండినవాఁడు, తద్వ్యథపాపంబుఁ దాను జెందు
దాన దుర్గతులను దా నొంది చివరకు, వృకముగా జనియించుఁ బృథివియందు

గీ. శక్తి లేకున్న నార్తరక్షణమునందు, విడువు మని గట్టిగా నోట నుడివె నేని
యతఁడు వైకుంఠమును బొందు నార్తరక్ష, కేసుకృతకార్యములు గూడ నీడు గావు.

గీ. ఆర్తసంరక్షణమునకై ప్రాణమిత్తురేనియు, లెందఱొందఱో విడిచి యోగీంద్రులకును
బొందఁగారానిపదమును బొందిరేల, యబ్బు నీబోటిపాపుల కట్టిపదము. 1103

క. వారణశక్తుఁడ వయ్యును, వారింపక యూరకున్నవాఁడవు నీవా
క్రూరపతత్త్రినిఁ గిరుణా, దూరుఁడ నీ కాఫలంబు తోడనె కలుగున్. 1104

క. అని పలికె రాక్షసుఁడవై, జనియించెదుగాక యనుచు శాపం బీయం
గనె యాద్విజుఁడు వెద నొదవఁగ, ననుతాపము వ్రాలి తాపసాగ్రణులమీఁదన్. 1105

క. తెలియనికతమున దోషము, సలిపితి మన్నించి మదపచారము నాకున్
దొలఁగింపుము శాపము నని, పలవింపఁగఁ దాపసుఁడు కృపాయుక్తుండై. 1106

వ. గీతైకాదశాధ్యాయంబు నిత్యంబును బఠియించు బ్రాహ్మణుం డభిమంత్రించి జలంబు
నీపయినిం జల్లిన నీకు శాపవిముక్తియును ద్వద్భక్షితప్రాణివర్గంబునకు వైకుంఠ
మందిరావాసంబునుం జేకూరు నని ప్రసాదించి యంతర్ధానంబు నొందె. 1107

గీ. అంత నాబ్రాహ్మణుండు నిశాటుఁ డయ్యె, నానిశాటుండె నేను నీ వార్తతోడ
నుండుటను నున్నసందర్భ మున్నయట్లు, చెప్పినాఁడను నీ కేమిచెప్ప నింక. 1108

ఆ. విను మొకింత మఱియు విశ్వరూపాధ్యాయ, మునఁ గలట్టిమహిమమును వచింతు
మున్ను గృధ్ర మొకటి ముక్కునఁ గొని యస్థిఖండ మొకటి పోవుచుండ మింట.

గీ. పడియె నాయస్థిఖండంబు పుడమిమీఁద, నొక్కపల్వలమున ముక్కునుండి జాఱి
దానిఁ గన్గొని యొక్కవిజ్ఞాని వచ్చి, యటకు నది తీర్థ మని యెంచి యందు మునిఁగి.

గీ. చేయఁదగుతీర్థవిధులను జేయు చుండ, నచ్చటికి యాత్రికులు కొంద ఱరుగుదెంచి
యార్య యీగుంట తీర్థ మెట్లయ్యెఁ దెల్పు, మనుడు నాబ్రాహ్మణుం డిట్టు లానతిచ్చె.

సీ. వినుఁడు యాత్రికులార విశదంబుగను మీకు, వినిచెద నీతీర్థవిషయ మెల్ల
విత్తవంతుం డనువిప్రశ్రుతి గైకొన్న, భూసురుం డొకఁ డుండెఁ బూర్వ మిలను
నతఁడు గీతైకాదశాధ్యాయమును బ్రసం, గ్యమును బఠించెడునట్టివాఁడు
దైవికంబుగ నొక్కతఱి నాతఁ డేఁగుచు, నటవీస్థలమున దేహంబు విడిచె

గీ. నప్పు డొకగృధ్ర మాతనియస్థిఖండ, మొకటి కొని యేఁగుచుండంగ నుప్పరమునఁ
బడియె నాముక్కు జాఱి యీపల్వలమున, దాన నిది పుణ్యతీర్థ మై తనరెఁ భువిని.

గీ. ఇందు స్నానం బొనర్చిన నెవ్వ రేని, పడయుదురు ముక్తి ననుడు నాభక్తు లెల్ల
దానిలో స్నాన మొనరించి తత్క్షణంబ, దివ్యరూపంబులను దాల్చి దివిఁ జనిరి. 1113

ఆ. పంప నీవు నగరభవనంబునకు నేను, ముట్టఁజాలకునికి ముక్తుఁ డైన
విప్రుఁ డొక్కఁ డుండె విశ్వరూపాధ్యాయ, పాఠి యతఁడు మనకు భద్రదాత.

క. అని చెప్ప నాకు దానను, నిను శరణొందితిని మేదినీసుర నాపైఁ
గనికరము నుంచి నాకో, ర్కి నీ దీర్పుము నాఁగ నతఁడు కృప దనరారన్. 1115

సీ. త్వరితంబుగను నిశాచరునియంతికమున, కరుదెంచి నగరనాయకునితోడఁ
బిలిచె దైతేయునిఁ బిలుపువెంటనె వాఁడు, పలికి విప్రునిచెంగ్గ నిలిచె నంత
బ్రాహ్మణుం డాతనిపైని గీతైకాద, శాధ్యాయమంత్రతోయమును జల్లె
నంతట వాఁడు దైత్యాకారమును వీడి, ద్విజరూపమున నిల్చె ద్విజునియెదుట

గీ. నపుడు రాక్షసభక్షితు లైనవార, లందఱును శంఖచక్రగదాబ్జములను
దాల్చి నాల్గుభుజంబులఁ దత్క్షణంబ, కానఁబడిరి విమానవర్గంబునందు. 1116

ఆ. అపుడు గ్రామపాలుఁ డానందమును జెంది, యిందు నాకుమారుఁ డెవఁడొ తెల్పు
మనుడు శాపముక్తుఁ డైనవిప్రుం డిట్టు, లనియెఁ జూపుచును దదాత్మభవుని. 1117

ఆ. ఇతఁడె నీకుమారుఁ డిందీవరాక్షుఁడు, కనకచేలుఁ డబ్జకరుఁడు రత్న
కుండలుండు ముకుటమండనుండు చతుర్భు, జుండు శంఖచక్రశోభితుండు. 1118

క. దేవత్వ మొంది యీతఁడు, దేవవిమానంబు నెక్కి త్రిదివంబునకున్
బోవంగ నున్నవాఁ డన, నావహిల విషాద మాపురాధిపుఁ డంతన్. 1119

సీ. తండ్రి నన్నెడబాసి తగునె పోవఁగ నీకు, బ్రతుకఁజాలను నిన్నుఁ బాసి నేను
రమ్మ నాకడకు శీఘ్రమ్ముగా ననవుడు, నతనిఁ గనుంగొని సుతుఁడు నవ్వి
యెన్నిమారులు జనియించినాఁడవో నీవు, నా కుద్భవిలితివో నీకు నేను
దండ్రి యెవ్వండు పుత్రకుఁ డెవ్వఁడు వివేక, దృష్టితోఁ జూచిన నింత యేల
గీ. యీసునందునికృపచేత నేను దివికి, నేఁగుచున్నాఁడ నీవును నితనివలనఁ
జెంది యుపదేశమును రమ్మ శీఘ్రముగను, దత్ప్రభావంబునను స్వర్గధామమునకు.
క. అని నుడివి వారితోడను, జనియె దివికి వానివెంటఁ జనియె విమానం
బున నెక్కి శాపముక్తిం, గనినధరామరుఁడు దివ్యకాయముతోడన్. 1121
వ. అంతట గ్రామపాలుండు సునందునివలన గీతైకాదశాధ్యాయోపదేశముం బడసి తత్ప
ఠనజపంబులచే విగళితపాతకుం డై సునందునితోడం గూడి యమరాలయంబునకుం
జనియె. 1122

—: గీతాద్వాదశాధ్యాయమాహాత్మ్యము :—

గీ. పృథివిలోపల దక్షిణాపథమునందు, నుండెఁ గోల్హాపురం బనునొక్కపురము
కలదు పరశక్తిపీఠ మక్కడ సమస్త, దేవతాబృందనిత్యనిషేవితంబు. 1123
ఆ. కలవు కోటితీర్థములు కోటిశంభులిం, గములు రుద్రగయయుఁ గనకకేతు
భాసురంబు లైనప్రాసాదతతులును, ననుపమాన మైనయాపురమున. 1124
సీ. అవ్వోటి కొక్కధరాధిపనందనుం, డరుదెంచి యొకనాఁడు పురము నెల్లఁ
దిలకించి మణికుండతీర్థంబున మునింగి, కావించి కర్తవ్యకర్మములను
బరశక్తిపీఠికేశ్వరి యైనశ్రీమహా, లక్ష్మిని దర్శించి హ్లాద మొదవ
నిలఁబడి యామెముంగల నేత్రములు మూఁత, వడఁగఁ జిత్తము భక్తిపరవశముగ
గీ. సన్నుతింప మహాలక్ష్మి సత్వరముగ, నతనియెదుటను నిల్చి ప్రత్యక్షముగను
వత్స కోరుము శీఘ్రంబ వరము నిత్తు, ననుడుఁ గన్నులు తెఱచి యి ట్లనియె నతఁడు.
సీ. అమ్మ నాతండ్రి బృహద్రథుం డనుతేఁడు, హయమేధయాగంబు నాచరింప
సంకల్ప మొనరించి సవనసైంధవమును, విడిచి దైవికముగా విడిచెఁ దనువు
తద్దేహమును బక్వతైలంబునం దుంచి, సలుపమండఁగ నేను సవనపూర్తి
యంతలో నెవ్వరో హరియించిరి హయంబు, నధ్వరం బద్దాన నాఁగిపోయె
గీ. తండ్రిసంకల్ప మీడేర్చుతలఁపుతోడ, ఋత్విజులయాజ్ఞ గైకొని యేను నిన్ను
శరణుచొచ్చితి నాపైనిఁ గరుణ నీకుఁ, గలుగునేడ నిమ్మ క్రతుతురంగంబు ననియె.
గీ. అంత నాతనివాక్యమ్ము లాలకించి, యిట్టు లనియె మహాలక్ష్మి నృపకుమార
మద్భటుం డగుసిద్ధసమాధికడకుఁ, బొమ్ము నెఱవేర్చు భవదభీష్టమ్ము నతఁడు. 1127
క. అనవుడు నానృపసూనుఁడు, చనిసిద్ధసమాధికడకుఁ జయ్యనఁ బ్రణతిన్
బొనరించి నిలువ నాతఁడు, కనుఁగొని తద్విషయ మెల్ల క్షణకాలములోన్. 1128

క. తలపఁగ నింద్రుని మదిలో, పల వణఁకుచు వచ్చి వజ్రపాణి మునీంద్రాం
ఘ్రులకు నమస్కారంబుగ, సలిపి మఖాశ్వము నొసంగి చనియెన్ దివికిన్. 1129
గీ. అంత నది యెల్లఁ గాంచి నృపాత్మజుండు, విస్మయము నొంది మౌనీంద్ర విదిత మయ్యె
నీప్రభావంబు దానను నీకు నలవి, గాని పని యుండ దని నాకుఁ గానఁబడియె. 1130
క. కనికరము నుంచి నామీఁ, దను గ్రతుఫలమునకుఁ బాత్రతను జెందఁగ నా
జనకుని బ్రదికింపుము నీ, యనుగ్రహామువలన నేఁ గృతార్థుఁడ నగుదున్. 1131
సీ. అని వేఁడుకొనుటయు నాత్మలోఁ గారుణ్య, ముదయింప వానిపై నుత్కటముగ
నరిగి సిద్ధసమాధి యతనితోఁ దత్పిత్ర, శవ మున్న చోటికి సత్వరముగఁ
గరమున సలిలంబు గైకొని మంత్రించి, చల్లెఁ దత్ప్రేతమ స్తకమునందు
నపుడు చిత్రంబుగా నుపగతప్రాణుఁడై, యట్టిట్టు కదలి బృహద్రథుండు
గీ. తెఱచి లోచనములను నల్దెసలఁ జూచి, యాత్మజనివేదితాత్మవృత్తాంతుఁ డగుచు
నెనయ నాశ్చర్య మాత్మలో నెదుట నున్న, మౌనివర్యునిపదములపైని వ్రాలి. 1132
సీ. పాదచారముగ నీపదములయొద్దకు, రావించినాఁడవు దేవవిభుని
నపహృతవాజిమేధాధ్వరతురగంబు, నిప్పించినాఁడ వొక్కింతలోనఁ
గాంచువారలకు నక్కజము చేకూరంగ, బ్రతికించినాఁడవు మృతుని నన్ను
గోల్హాపురిని నెలకొన్నమహాలక్ష్మి, నలరించినాఁడవు సులభముగను
గీ. స్వామి నీ కిట్టిమహిమంబు సంఘటిల్ల, నేది కారణ మగునొ నా కెఱుఁగఁ జెపుమ
యనుడు సిద్ధసమాధి యి ట్లనియె రాజ, తెలుపువాఁడను వినుము నా కల తెఱంగు.
క. ఏయెడ జపించు చుందును, బాయక నే గీతలోనిపంద్రెండవయ
ధ్యాయమును దాన నొదవె న, మేయమహత్త్వంబు నాకు మితి యేమిటికిన్. 1134
క. అని తెలుపఁ దదధ్యాయం, బును సిద్ధసమాధివలన భూపతియును ద
త్తనయుఁడును గొని జపించుచు, ననిమిషలోకమున కేఁగి రంతమునందున్. 1135

—: గీతాత్రయోదశాధ్యాయమాహాత్మ్యము :—

సీ. భువిని దక్షిణభాగమునఁ దుంగభద్రామ, హానదీతీరమునందుఁ గలదు
హరిహరం బనునొక్కపుర మం దొకం డుండె, హరిదీక్షితుం డనునవనిసురుఁడు
కల డాతనికి నొక్కకాంత దురాచార, యనుపేర నామధేయార్హశీల
యాచాన యొక్కనాఁ డరుగుచుండఁగ రేయి, నధికసంగముకాంక్ష నడవిలోన
గీ. దైవికంబుగ మార్గమధ్యమున వచ్చి, వ్యాఘ్ర మొక్కటి తన్మాంస మారగింప
నామెచుట్టును దిరుగుచు నార్చుచుండ, నాదురాచార కని దాని నడలుపుట్ట. 1136
ఆ. దిక్కు లేనిదాన దీనురాలను నాఁడు, దాన నన్నుఁ జంప ధర్మ మగునె
లేదె నీకు మృగము లే వేనియును దృష్టి, క్షుత్ప్రశాంతి చేసికొనఁగ నిచట. 1137
వ. అని పలుకుటయు నామెకు శార్దూలం బి ట్లనియె. 1138

గీ. ఓసి పాపాత్మురాల నీచేసినట్టి, పాపములు పండి నేఁడు నాపాలఁబడితి
వంతయును నే నెఱుంగుదు ననుడు నామె, యెదను నాశ్చర్యమును నొంది యిట్టు లనియె.

క. నినుఁ జూడఁగ శార్దూలమ, వని తోఁపదు నాకు భవదుదంతము నెల్లన్
వినిపించి కరుణతోడను, ననుఁ జంపుము పిదప నీకు నతు లొనరింతున్. 1140

వ. అని వేఁడుకొనుటయు వ్యాఘ్రం బాదురాచార కి ట్లనియె. 1141

సీ. వినుము దక్షిణదేశమున మలాపహా యను, తటిని యుండెఁ దదీయతటమునందు
మునిపర్ణ యనుపేరఁ గొనినపురం బుండె, నచట విప్రుం డుండె నధనుఁ డొకఁడు
పుత్రుఁడనై నేను బుట్టివానికి ద్రవి, ణాశచేత నయాజ్యయాజనములు
దుష్ప్రతిగ్రహములు దురితాన్నభోజనం, బులు మంత్రవిక్రయంబులును జలిపి

గీ. వార్ధకమునందు నొకయమావాస్యనాఁడు, తర్పణంబులు చేయించుతలఁపుతోడ
దర్భలను గొనిపోవుచు దారిలోనఁ, గాలు వైచితిఁ గుక్కపైఁ గానరామి. 1142

క. అది యంతటఁ జెడఁగఱవఁగఁ, బద మేనియుఁ గదలలేక పడి యవ్వోటన్
వదలి శరీరంబును శ్వా, పదమై పుట్టితిని స్వకృతపాపమువలనన్. 1143

సీ. ఎపుడో నేఁ జేసినతపముచే నీజన్మ, మునఁ బూర్వసంస్మృతి యొనరె నాకు
దానిచేతఁ బతివ్రతలను సజ్జనులను, యతులను ధర్మనిష్ఠితుల విడిచి
భక్షించుచుంటి క్షుద్బాధానివృత్తికై, పాపంబు చేసినప్రాణితతుల
బ్రాప్తించితివి నేఁడు గ్రాసంబుగను నాకు, నసతివి గానఁ బాపాత్మురాల

గీ. యని పలికి ఘీంకరించి నఖాగ్రములను, జీల్చి తద్దేహమును రెండుచీలికలుగఁ
ద్రావి తద్రక్తమును మెక్కి తత్పలంబు, నరిగె నంతఁ గృతాంతకింకరులు వచ్చి. 1144

గీ. ఆయమను దోడుకొని చని యమునికడకు, నతనియెదుటను నిలుపంగ నంతకుండు
దారుణము లగునరకయాతనలలోన, దానిఁ బడవైచి యేర్చి యంతమున విడిచె.

ఆ. అంత నాపె నరకయాతనలను నెల్ల, ననుభవించి కడకు నంత్యయోని
యందుఁ బుట్టి హేయ మగుకార్యములను జే, యుచును దైవికముగ నొక్కనాఁడు.

సీ. వాసుదేవుం డనుభూసురుం డొకఁ డొక్క, దినమున జృంభకాదేవికడను
జేతఃప్రియంబుగా గీతాత్రయోదశా, ధ్యాయంబు నందఱు నాలకింపఁ
జదువుచు నర్థంబు సవిమర్శముగఁ జెప్పు, చుండంగఁ ద్రోవలో నొదిగి నిలిచి
యాలించి శ్రద్ధతో నంతయుఁ దనయింటి, కరుగంగఁ దలఁచుచున్నంతలోన

గీ. నద్భుతంబుగ దివ్యదేహంబు రాఁగ, ననిమిషానీత మగుదివ్యయానమందు
నధివసించి సవిస్మయ లగుచు నెల్ల, వారలును జూడఁ దా నేగె స్వర్గమునకు. 1147

—: గీతాచతుర్దశాధ్యాయమాహాత్మ్యము :—

సీ. కలదు మేదినియందుఁ గాశ్మీర మనియెడి, నగర మొక్కటి మహానందదంబు
తనరాజధానిగా నొనరించుకొని దాని, భారతి నిత్యంబు బ్రహ్మకడకు

హంసయానము నెక్కి యటనుండి చనుచును, నరుగుదెంచుచు నుండు నద్భుతముగఁ
గరతలామలకంబుగా నుండు నం దుండు, వారి కెల్లరకు గీర్వాణవాణి
గీ. స్వామి యగుచును దానికి శౌర్యవర్మ, యనునృపుం డేలుచుండెను జనుల నెల్లఁ
దనపరాక్రమమున నోడి ధరణినేత, లెల్లవారును గానుక లిచ్చుచుండ. 1148
వ. అట్లుండ నావిశ్వంభరాధీశ్వరునకు సింహళద్వీపప్రభుండును నిర్వక్రపరాక్రమశాలి
యును నగువిక్రమబేతాళునితోడ సౌహార్దం బేర్పడియె. 1149
గీ. అంత నొకనాఁడు శౌర్యవర్మాధిపుఁడును, బంపె విక్రమబేతాళపార్థివునకు
హార్దసూచకముగ మృగయాప్రవీణ, మైనశుని నొకదాని నత్యాదరమున. 1150
ఆ. అంతటను గ్రహించి యాసారమేయుని, హర్ష మొదవ సింహళాధినేత
శౌర్యవర్మ కనిపె సంతోషసూచకం, బుగను గజతురంగభూషణముల. 1151
సీ. అంతట నొకదినమందు రాజకుమార, సహితుఁడై సింహళక్ష్మాధవుండు
వేటకుక్కను దనవెంటఁ బెట్టుకొని స, కౌతుకంబుగ నొక్కకాన కరిగి
బహుధనంబును బెట్టి పందెంబుగను నొక్క, క్షితిపసూనునిఁ బిల్వ నతఁడు వచ్చె
నపుడు సింహళవసుధాధీశుఁడును రాజ, సుతుఁడును శశముపై శునుల విడువ
గీ. శశము పరువిడుచుండంగ శశమువెంట, శునులు తివ్వన నరిగె నాశుగములట్లు
పఱచి పఱచి శశంబు పైఁ బఱవలేక, పడియె నొకయాశ్రమంబునఁ బంకమందు. 1152
గీ. అప్పుడు నృపాలశుని వచ్చి యతిజవమున, శశముపైఁ బడి కఱవ నాశశము చచ్చెఁ
దచ్ఛ్రమంబున శునియును దనువు దొఱఁగె, నంత దివ్యవిమానంబు లరుగుదెంచె.
సీ. దివ్యదేహములతోఁ దేజరిల్లుచు నప్పు, డాశునీశశము లత్యద్భుతముగ
నావిమానములయం దధివసింపఁగ నంత, లోన సింహళనృపాలుండు వచ్చి
యది చూచి యాశ్చర్య మెదను జెందుచు నుండ, హసియించె మునిశిష్యుఁ డచట నొకడు
కని వాని సింహళక్ష్మాపాలుఁడు మహాత్మ, హేతు వేమి హసింప నెఱుఁగ జెపుమ
గీ. యనుటయును మునిశిష్యుఁ డి ట్లనియె రాజ, వత్సుఁ డనియెడి యొకవిప్రవర్యుఁ డిచట
నున్నవాఁడు తదీయశిష్యుండ నేను, బిలుతురు స్వకంధరుం డనుపేర నన్ను. 1154
గీ. అతఁడు గీతాచతుర్దశాధ్యాయపఠన, నిరతుఁడై యుంట నాకును నేర్పె దాని
గురువునకుఁబోలె నా కొడఁగూడె దానిఁ, జదువు చుండుటచే దివ్యశక్తు లెల్ల. 1155
గీ. శశము శునియును మత్పదక్షాళనాంబు, పంకసంస్పర్శమునఁ జేసి పడసి దివ్య
దేహముల నేఁగనున్నవి త్రిదివమునకు, నీశునీశశములగాథ యింక వినుము. 1156
సీ. ప్రత్యుదకంబు నాఁబడుపురం బొకఁ డుండె, క్షితిపై మహారాష్ట్రసీమయందు
నుండె నచ్చటఁ గేశవుం డనుపేరను, బాపాత్ముఁ డగునొక్కబ్రాహ్మణుండు
వానికిఁ గల దొక్కస్వైరసంచారిణి, యైనచాన విలోభనాభిధాన
కేశవుం డొకనాఁడు కినిసి తద్వృత్తికి, ఖండించె ముక్కముక్కలుగ దాని

గీ. నంత నాకాంత స్వకృతపాపానుగుణము, లై నయమయాతనల నొంది యంతమునకుఁ
బుట్టె శుని యయి శశ మయి పుట్టె వాఁడు, స్త్రీవధాఘంబుననుజేసి క్షితితలమున.
గీ. పూర్వజన్మానుగతవైరమునను జేసి, యిపుడు శశమును శుని వధియించె వీని
జన్మవిషయంబు నాదివ్యచక్షువునకు, విదిత మగుటను జేసి నవ్వితిని నేను. 1158
క. అని నుడువుటయును సత్యము, మునిశిష్యుఁడు పలికె ననుచు ముదమున శశముం
శునియును వచించి తత్క్షణ, మున నేఁగెను దివమునకు నభోమార్గమునన్. 1159
గీ. అంత విక్రమబేతాళుఁ డాత్మలోనఁ, జెంది విస్మయమును మునిశిష్యునొద్ద
నపుడె గీతాచతుర్దశాధ్యాయమంత్ర, మును గ్రహించి జపించుచు ముక్తి నొందె.

—: గీతాపంచదశాధ్యాయమాహాత్మ్యము :—

సీ. గౌడదేశంబునఁ గలఁడు కృపాణాన్మ, సింహుండు నా నొక్క క్షితివరుండు
తనకృపాణమున నతండు దిగ్జయమును, గావించి దశదిగంగణములందు
వ్యాపింపఁగను గీర్తి యచ్చట నచ్చట, స్థాపించి బహుజయస్తంభములను
క్షోణి నేలుచు నుండఁ గొంతకాలమునకు, నతనికి వార్ధకం బంకురించె
గీ. నపుడు తత్సైన్యనాయకుం డైనయట్టి, శరభభేరుండుఁ డాత్మీయసఖులతోడ
మంత్ర మొనరించి భూపుని ద్రుంచఁ జేసి, తాను రాజ్యంబు గైకొనుతలఁపుతోడ.
గీ. తత్ప్రయత్న మొనర్చుచు దైవికముగ, ద్రుంది యొకనాఁడు స్ఫోటకామయమువలన
నాత్మదుష్కృతబుద్ధిచే నశ్వముగను, జననమును బొందె సింధుదేశంబునందు. 1162
సీ. అంతట నొకవణిగాత్మజుఁ డాయశ్వ, మును గొని బహుమూల్యమునకు నచట
దానిపై లాభంబుఁ దాను సంపాదించు, నాశతోడను గౌడదేశమునకు
నరుగుదెంచి కృపాణనరసింహభూపతి, కిచ్చి దానిం గొని హెచ్చుధనము
సంతోషమున నిజసదనంబునకుఁ బోయె, నప్పుడు గౌడదేశాధినేత
గీ. వేట గావింపఁగను నొక్కవిపినమునకు, నాహయంబు నధిష్ఠించి యరిగి యచట
విపినసూకరవధము గావించి యలసి, దాహ మగుటను డిగ్గి సైంధవమునుండి. 1163
వ. ఆఘోటకంబు నొక్కపాదపశాఖకు బంధించి యచ్చటఁ దాను విశ్రమింప నెంచుచుండ నంతలోపలఁ దనకడ కొకపత్రంబు కొట్టుకొని రా దానిం గైకొని యానరేంద్రుం డందు లిఖింపంబడియున్న గీతాపంచదశాధ్యాయశ్లోకార్ధముం జదివె. 1164
సీ. అది విన్నవెంటనె యశ్వంబు పడిపోయె, క్షితిమీఁద నిర్గతచేష్ట మగుచు
దానిఁ జూచుచునుండ ధరణీంద్రుఁ డంతలో, నశ్వంబు దివ్యదేహమును దాల్చి
యధివసించి విమానమందు నభోమార్గ, మున నేఁగుచుండంగఁ గని నృపుండు
విస్మయం బొంది తద్విషయంబు నెఱుఁగంగ, నాత్మలో నభిలాష మామతిల్లఁ
గీ. దత్సమీపస్థ మగునొక్క తాపసాశ్ర, మమున కరిగి తపోధనోత్తమున కెఱఁగి
స్వామి మద్వాజివృత్తాంత మేమొ తెల్పు, మని యడుగ నాతనికి నిట్లు లనియె వాని.

ఆ. రాజ తెలిసికొంటి వాజివృత్తాంతంబు, దివ్యదృష్టివలనఁ దేటపడఁగఁ
దా నొకండు దలఁప దైవ మొండు దలంచు, వినుము నుడువువాఁడ విశదముగను.

సీ. భవదీయసైన్యాధిపతి యైనశరభభే, రుండుండు మున్ను నీ కుండుయశము
సైఁపఁజాలక నిన్నుఁ జంపి నీరాజ్యంబు, గొన దురాలోచనమును నొనర్చి
యంతలో స్ఫోటకవ్యాధిచే మరణించి, తనపాపబుద్ధిచే ధాత్రిలోన
సింధుదేశంబున సైంధవ మై పుట్టి, కొనకు నీయంతికంబునకుఁ జేరి

గీ. దైవవశముననేఁడు కాంతారమందు, నీకు దొరకినపత్రంబు నీవు చదువు
చుండఁగను విని స్వకృతపాపౌఘ మెల్ల, క్షయము గా ముక్తకాయు డై చనియె దివికి.

వ. అని పలుకుటయుఁ గృపాణనృసింహుం డావిష్ణుశర్మవలన గీతాపంచదశాధ్యాయోపదే
శముం బడసి నిజపురంబున కరుదెంచి తదధ్యాయనిత్యపరనప్రశాంతచేతస్కుండై నిజ
కుమారునకుఁ బట్టంబు గట్టి తాను బరమపదంబుం బొందె. 1168

—: గీతాషోడశాధ్యాయమాహాత్మ్యము —

సీ. మహి నుండె గుర్జరమండలంబునను సౌ, రాష్ట్రికం బనెడిపురం బొకండు
ఖడ్గబాహుం డనుక్ష్మాపాలుఁ డొకఁ డుండె, నాపత్తనమునఁ బ్రతాపమూర్తి
యరిమర్దనం బనుహస్తి యాతని కొక్కఁ, డుండె నాసామజ మొక్కనాఁడు
శృంఖలాబంధంబుఁ ద్రెంచి వీథులఁ బడి, పరువెత్తఁదొడఁగెను బ్రజలు వెగడ

గీ. హస్తిపకు లేమియును జేయ నలవి గామి, దాఁగి యుండంగ నందందు ధైర్య ముడిగి
సౌధమున నిల్చి పరివారసహితముగను, దగ్గఱగ లేమిఁ జూచుచుండంగ తేఁడు.

గీ. ఒకరు గూడను ద్రోవలో నుండకునికి, మాటుమణఁగినయ ట్లుండె మార్గ మెల్ల
నప్పు డొకబ్రాహ్మణుఁడు స్నాన మాచరించి, పోవుచుండంగ నింటి కాత్రోవనుండి.

ఉ. చచ్చెను బ్రాహ్మణుం డనుచు సర్వజనంబులు గోలవెట్టఁగా
హెచ్చుగ ధైర్య మేర్పడ మహీసురుఁ డాఁగక యేఁగుచుండఁగన్
వచ్చి తదంతికంబునకు వారణ మల్లన మేన భీతిచే
ముచ్చెమటల్ స్రవింపఁగను మ్రొక్కి నిలంబడియెన్ వణంకుచున్.

సీ. అప్పు డత్యాశ్చర్య మావమతిల్లఁగ తేఁడు, చనుదెంచి సౌధదేశంబునుండి
యాబ్రాహ్మణునకు సాష్టాంగంబుగను మ్రొక్కి, బ్రాహ్మణోత్తమ యేప్రభావమునను
మదసామజంబును గదల కుండఁగఁ జేయఁ, గలిగినాఁడవో నాకుఁ దెలుపు మనియె
నంత నాద్విజుఁ డిట్టు లనియె గీతాషోడ, శాధ్యాయపరనమాహాత్మ్యమునను

గీ. జేకుఱె సమస్తసిద్ధులు నాకు భూప, దీని కాశ్చర్యపడ నేల దేవుఁ డైన
ర మ్మనిన వచ్చి నిల్చు నాసమ్ముఖమున, ననుడు నాశ్చర్యమును బొంది యాప్రభుండు.

వ. అమ్మహాత్మునివలన గీతాషోడశాధ్యాయోపదేశముం బడసి యది మొదలుకొని
యనుదినంబును నియతంబుగా దానిం బఠించుచు నొకనాఁడు తన్మంత్రప్రభావముం
బరీక్షింప నెంచి యామత్తగజంబును విశృంఖలంబుగా విడిచిపుచ్చె. 1173

గీ. అపుడు చెలరేఁగి వారణం బదర టిసలు, ఘీంకరించుచు వెడలి నిరంకుశముగఁ
బఱవఁదొడఁగెను వీథులఁబడి భయంబు, వలన జను లెల్ల నిండ్లలోపలను దూఱి.

ఆ. అపుడు తేఁడు మంత్రమం దుండువిశ్వాస, మునను నిర్భయముగఁ బోయి దాని
దరికి నిలువఁబడఁగ దంతి కంపించుచు, మంత్రరుద్ధభోగిమాడ్కి నిలిచె. 1175

గీ. అంతటను బట్టికొని దాని హస్తమునను, ఖడ్గబాహుండు గజశాలకడకు వచ్చి
విడిచి యచ్చోట సంతసంపడుచు మంత్రి, మహిమమున కెంత యేనియు మానసమున.

క. తనసుతుని నాత్మరాజ్యం, బున కథిపునిఁ జేసి నిత్యమును నేకాంతం
బున నుండి తదధ్యాయం, బును జపియించుచును దుదకు మోక్షము నొందెన్.

—: గీతాసప్తదశాధ్యాయమాహాత్మ్యము :—

సీ. మును ఖడ్గబాహుపుత్రునకు దుశ్శాసనుఁ, డనుభృత్యుఁ డొకఁ డుండె నధికబలుఁడు
బలగర్వమున వాఁడు పలుకుచు దంభవా, క్యముల నెల్లరు విస్మయంబు నొంద
నరిమర్దనముమీఁద నధివసించి పదంబు, చేతఁ గొట్టంగ నాసింధురంబు
క్రోధంబునను వానిఁ గూల్చి ధరిత్రిపైఁ, ద్రొక్కి పాదంబులతోడఁ జంపె

గీ. నంత దుశ్శాసనుఁడు స్వకృతాఘమునను, బుట్టె యచటనె గజముగాఁ బూర్వజన్మ
సంస్మృతిని జెంది నిజబంధుజనులఁ జూచి, కార్చుచుండెను గన్నీరు కాల్వలుగను.

ఆ. అట్లు కొంతకాల మరుగంగ నొకనాఁడు, ఖడ్గబాహుసుతుఁడు కవులఁ బిలిచి
యీయఁగను సమస్య లింపుగా నొకకవి, పూర్తి చేయ నతఁడు పొంది ముదము.

క. కానుకగా నాకవి కా, యేనుంగు నొసంగ నంత నెంతయుఁ బ్రీతిన్
దానిం గొని చని మాలవ, భూనాథున కమ్మె నతఁడు ప్రోవఁగ లేమిన్. 1180

సీ. అంత నాకుంజరం బనుదినంబును దన, నెలఁదిని సుతులను దలఁచికొనుచు
నాదుఃఖమునను నిద్రాహారములు మాని, కన్నీరు జాలుగాఁ గార్చుచుండ
నది వ్యాధి యని యెంచి యాధోరణులు చేసి, వివిధచికిత్సలు విసివి తుదకు
మనవి గావింపంగ మాలవనేతకు, నాప్రభు వచ్చోటి కరుగుదెంచి

గీ. కాంచు చుండంగ గజము నాగజము మనుజ, వాక్కుతో నిట్టు లనియె భూవర యొనర్ప
వలదు వైద్యంబు లేవియు ఫలము లేదు, నీకు నామీఁదఁ గరుణ జనించె నేని.

వ. గీతాసప్తదశాధ్యాయజపపరాయణుం డగువిప్రునిం బిలిపించి తన్మూలంబున నారో
గంబు శమింపంజేయుము. 1182

గీ. అనవుడు నృపాలుఁడు గజోక్తి ననుసరించి, యనుదినంబుఁ దదధ్యాయమును జపించు
నట్టివిప్రుని రావింప నతఁడు వచ్చి, జలము మంత్రించి గజముపైఁ జల్లె నంత.

సీ. ఆసామజము స్వదేహంబును విడనాడి, వెంటనె తాల్చి ప్రాగ్విగ్రహమును
దివ్యరూపంబుతోఁ దేజరిల్లుచు నుండ, దివ్యయానంబుపై దివమునందు

మాలవాధిపుఁడు విస్మయముతో నాతని, వీక్షించి మహనీయ యెవఁడ వీవు
దంతిజన్మంబు నొందఁగఁ గారణం బేమి, యిపుడు తన్ముక్తి నీ కెట్లు గలిగె
గీ. నంతయు వచింపు మనుటయు నాత్మగాథ, యెల్ల దుశ్శాసనుఁడు తేటతెల్లముగను
దెలిపి క్షణకాలమును నందు నిలువకుండ, నరిగెఁ ద్రిదివంబునకు మహాహ్లాదమునను.

వ. అంతట మాలవాధీశ్వరుం డా బ్రాహ్మణునికడ గీతాసప్తదశాధ్యాయోపదేశముం బడసి తజ్జపంబు గావించుచు ననేకసిద్ధులం బొంది దేహావసానంబున ముక్తుం డయ్యె.

—: గీతాష్టాదశాధ్యాయమాహాత్మ్యము :—

సీ. కనకమహీధ్రశృంగమునందుఁ గల దమ, రావతి యనెడిపురం బొకండు
ప్రమథాధిపతివినోదమున కై మును విశ్వ, కర్మచే నది యయ్యె నిర్మితంబు
దాని కీడై నపత్తన మేదియును లేదు, విశ్వంబులం దెందు వెదకి చూడ
దాని కింద్రుండు శతక్రతు వగుటచేఁ, బ్రభువుగా నుండె నిర్జరులు గొలువ
గీ. నట్టు లుండంగ నొకనాఁడు హరినియోజ్య, లోకపురుషునిఁ గొనిపోవుచుండ విష్ణు
సన్నిధికి వాని తేజఃప్రసారమునను, నడలి సింహాసనమునుండి పడియె వజ్రి. 1186

సీ. సింహాసనచ్యుతిఁ జెందినయింద్రుఁడు, తగఁడు స్వర్గాధిపత్యమున కనుచు
భావించి వైకుంఠభవనంబునకుఁ దాము, గొనిపోవుపురుషుని ననిమిషులకు
నధినాథుఁడుగను బట్టాభిషిక్తునిఁ జేయ, నతఁ డధిష్ఠింప సింహాసనమును
గుసుమవర్షంబును గురిసిరి నిర్జరుల్, నభమున దేవదుందుభులు మ్రోఁగెఁ
గీ. బాడ గంధర్వు లాడ నప్సరస లొసఁగ, నమరకాంతలు నీరాజనములు ఋషులు
దీవన లొనర్పఁ బౌలోమి సేవ సేయ, భాసిలె సుధర్మ నభినవవాసవుండు. 1187

సీ. ఆవిధంబున వెల్గునభినవేంద్రునిఁ జూచి, యింద్రుండు విస్మయం బేర్పడంగఁ
జలుపఁ డాయెను గ్రతుశతమును నెలకొల్పఁ, డాయె విశ్రాంతికై యవనిజములఁ
ద్రవ్వింపఁ డాయెను ధర్మకూపాదులఁ, బెట్టఁ డాయెను భిక్ష భిక్షుకులకు
స్థాపింపఁ డాయె సత్రముఁ బాంథజనులకుఁ, జేయఁ డాయెను దీర్థసేవనంబు
గీ. కవులఁ బూజింపఁ డాయెను గంగలోన, స్నాన మొనరింపఁ డాయెను జలుపఁ డాయెఁ
బాత్రదానంబు వీని కేపగిది నిట్టి, దివ్యభోగంబు కలిగెనొ తెలియరాదు. 1188

క. అని వ్యాకులమానసుఁడై, చని సత్వరముగను క్షీరసాగరమునకున్
వనజాక్షునిదర్శనముం, బొనరించి నుతించి వినయమున నిట్లనియెన్. 1189

ఆ. స్వామి క్రతుశతంబు సలుపక చేయక, యెట్టిపుణ్యకర్మ మేని నేఁడు
చిత్రముగను స్వర్గసింహాసనారూఢుఁ, డయ్యె నెవఁడొ తెలుపు మతనిగాథ. 1190

వ. అని ప్రార్థించుటయు గోవిందుం డాతని కిట్లనియె. 1191

సీ. పాకశాసన యల్పఫలదాయకము లైన, క్రతుశతంబును బుణ్యకర్మములును
సంతృప్తి గలిగింపఁజాలవు నాకు గీ, తాష్టాదశాధ్యాయ మట్లు గాన

నాపురుషుండు తదధ్యాయమున శ్లోక, పంచకంబుఁ బఠించుఁ బ్రతిదినంబు
దాన నాతనిసుకృతమునకుఁ బోలవు, క్రతుశతంబును బుణ్యకర్మములును
గీ. దన్మహత్త్వంబునను స్వర్గధామమునకు, నాధిపత్యంబు వహియించె నాద్విజుండు
చేరఁగలఁ డింక ముందు నాచెంత కతఁడు, మన్మనఃప్రీతికరుఁ డైనమహితుఁ డగుట.
క. అని చెప్పి యదృశ్యత్వం, బును బొందుటయును సురర్షభుఁడు స్వారాజ్యం
బున రోఁత వుట్ట స్వర్గం, బున కేఁగక విప్రవేషమును దాల్చి వెసన్. 1193
సీ. ధరణికి వచ్చి గోదావరీతటమునఁ, గ్రాలెడికాళికాగ్రామమునకు
నరిగి యచ్చటను గీతాష్టాదశాధ్యాయ, పరుఁ డైనయొక్కభూసురునిఁ గాంచి
ప్రణమిల్లి తత్పాదపద్మంబులకు నొక్క, వర్షంబు గావించి వానిసేవ
యాతనివలన గీతాష్టాదశాధ్యాయ, మును గొని యుపదేశపూర్వకముగ
గీ. దాని జపియించుచును సంతతమును నేక, దీక్షఁ గోడను జాహ్నవీతీరమందు
నపునరావృత్తికరమును నక్షయమును, మహితమును నైనమోక్షధామమును జెందె.
క. ఏతద్గీతామహిమము, శ్రోతలకును వాచకులకు సుఖము నొసంగున్.
భూతలమున స్వర్గమునను, జేతస్సంతుష్టి గలుగఁజేసెడికతనన్. 1195
ఆ. సర్వయజ్ఞఫలము సర్వతీర్థఫలంబు, సర్వపుణ్యకర్మజన్యఫలము
సంఘటిల్లు దీనిఁ జదివిన వినినను, దానివలన మత్పదంబు దొరకు. 1196
క. అని వచియించుటయును మన, మున గీతామహిమమునకుఁ బొంది ప్రమోదం
బును విస్మయమును గీతను, గొనియాడెను లోకమాత కుతుకం బొదవన్. 1197

—: భాగవతమాహాత్మ్యము :—

ఆ. మునివరేణ్య వినుము వినిచెద నిలలోనఁ, గలదు భాగవతము కలుషహరము
దాని వినిన సకలధర్మంబులను విన్న, ఫలము గలుగు నెట్టిపాపి కేని. 1198
క. భువనంబున భాగవత, శ్రవణము లభియించు టరుదు జన్మాంతరసం
భవపుణ్యహీను లగుమా, నవులకు వాస్తవముఁ దెల్పినాఁడను నీకున్. 1199
ఆ. చిత్తశుద్ధి గలుగఁజేసి శాశ్వత మగు, బ్రహ్మపదము నీయ భాగవతము
కంటె లేదు వేఱొకండు దేహికి ముక్తి, సాధనంబు లైనచదువులందు. 1200
సీ. భాగవతంబుఁ జెప్పఁగఁ బరీక్షితునకు, సభలోన శుకుఁ డున్నసమయమందు
నిజకార్యపరు లైననిర్జరు లమృతంబు, గొనివచ్చి శుకునకు వినతిచేసి
దేవ పరీక్షిన్మహీవరునకు మేము, తెచ్చినయమృతంబు నిచ్చి మాకు
నిమ్ము భాగవతామృతముఁ గ్రోలుదు మన, సుర లభక్తు లటంచు శుకుఁ డెఱింగి
గీ. నవ్వి కృష్ణకథామృతానంద మేడ, ననిమిషామృతముద మేడ నమరులార
మణికిఁ గాచంబునకును సమత్వ మున్నె, మీయమృతమును గొని పొండు మీరు దివికి.
క. అనవుడు నాశాచ్యుతులై, యనిమిషు లేఁగుటయు దివికి నతఁడు పరీక్షి
జ్జనపతికిఁ జెప్పెఁ దత్కథ, యనుక్షణమ తఁడు నొందె నమృతపదంబున్. 1202

సీ. అది చూచి విస్మయం బొదవంగ మదిలోన, లోకేశుఁడు స్వసత్యలోకమందు
వేదవేదాంగాదివిద్యల నొకప్రక్క, భాగవతము నొక్కప్రక్కనుంచి
తులఁదూఁపఁగను వంగె ములు భాగవత మున్న, కడకు నం దుండుట గౌరవంబు
దానఁ దాపసు లద్భుతము నొంది విష్ణురూ, పంబుగ భాగవతంబు నెంచి
గీ. తచ్ఛ్రవణమున నైనఁ దత్పఠనమునను, నైన మోక్షంబు ప్రాప్తించు నని వచించి
రాకతంబునఁ గృష్ణకథామృతంబు, గ్రోలువా రెల్లరును ముక్తిఁ గొనెడివార. 1203
గీ. భాగవతమును నొక్కయబ్దంబు వినిన, సౌఖ్య మొనగూడు నొక్కమాసంబు వినిన
నామతిల్లును భక్తి సప్తాహ మాల, కించు నెడఁ గల్గు మోక్షలక్ష్మిని భజింప. 1204
క. మును శుకుఁడు నాకు వినిపిం, చెనొ దేనిని శిష్యబుద్ధిచే గోప్యముగన్
వినిచెద నే నదె నీకును, వినుము తపోధనవరేణ్య విశదము గాఁగన్. 1205
సీ. ఒకనాఁడు నారదుం డుండ విశాలాప్రు, రంబున సాధుదర్శనము చేయ
నరుదెంచి యటకు నల్వురు కుమారులు ఖిన్న, వదనుఁడై యున్న నారదునిఁ జూచి
మునివరేణ్య వినష్టధనుని కైవడిఁ గానఁ, బడుచుంటివి విషణ్ణభావమునను
యుక్తంబు గా దిట్లు ముక్తసంగుల కుండ, హేతు వేమియొ దీని కెఱుఁగఁ జెపుమ
గీ. యనుడు దేవమునీంద్రుఁ డిట్లనియె నేను, ధాత్రి కేతెంచి సకలతీర్థములఁ జూచి
యెందును బ్రశాంతి గలుగమి హృదయమునకు, ఖిన్నభావంబు నొందుచు నున్నవాఁడ.
సీ. ధాత్రి నెల్ల నధర్మమైత్రిచేఁ బ్రబలిన, కలి యాక్రమించినకారణమున
సత్యంబు పోయె నష్టం బయ్యె శౌచంబు, దానంబు క్షీణించెఁ దపము చెడియె
దయ యంతరించెను దాక్షిణ్య ముడివోయెఁ, దరుణీస్వతంత్రత దాపరించె
స్వాలకుల్ బుద్ధిదాయకు లైరి యాచార, హీను లైరి సమస్తమానవులును
గీ. నాశ్రమంబులు చెడిపోయె నాపగలును, దేవతాయతనములును దీర్థములును
బాలికజనావృతము లయ్యె భ్రష్ట మయ్యె, జ్ఞానము నశించె యోగంబు సమసె సిద్ధి.
గీ. జనపదము లన్నవిక్రయాస్పదము లయ్యె, బ్రాహ్మణులు వేదవిక్రయకారు లైరి
కోమలులు యోనివిక్రయకుశల లైరి, ఘోరకలిసంవృతము గాఁగ గుతల మెల్ల.
వ. అట్లు నేను గలివిజృంభణముం గాంచుచుఁ బుడమి యెల్లం దిరిగి కడకు యమునాతటం
బునకుం జేరి యచ్చట విచేష్టులై పడియున్న యిరువురువృద్ధుల కుపచారముం జేయుచు
ఖిన్నమానస యై రక్షకునికొఱకు దెస లెల్ల విలోకించుచు శతస్త్రీపరివేష్టితయై యున్న
యొక్కతరుణి నాలోకించి యాయమకడ కేఁగితి. 1209
గీ. అంతటను లేచి మ్రొక్కి నా కాలతాంగి, స్వామి నాచింత మాన్పుము సాధుజనులు
దీనులను నుద్ధరింపంగఁ దిరుగు చుందు, రాత్మజనువె పరోపకారార్థ మగుట 1210
సీ. అని వేఁడుటయును నేనాయమ కిట్లంటి, నింతి నీచరితంబు నెఱుఁగఁ జెపుమ
యనవుడు నామె యిట్లనియెఁ దపోధన, భక్తి నామమున నేఁ బరగుదాన

ఏ రిర్వురును జ్ఞానవైరాగ్యనామధే, యాన్వితు లైననాయాత్మభవులు
గంగాదిదివ్యతరంగిణుల్ వీరలు, నన్ను సేవించుచు నున్నవారు

గీ. కాని నాయాత్మ కించుక యేని శాంతి, యేరుపడదాయె నే మున్న నేమి ఫలము
ద్రవిడమునఁ బుట్టి వృద్ధిఁ గర్ణాటకమునఁ, జెంది గుర్జరమున జీర్ణజీర్ణ నైతి. 1211

గీ. ఘోరపాషండజనులచే గుర్జరమున, ననుతముగ ఖండితాంగి నై చావు దప్పి
యెట్లొ బృందావనమునకు నేఁగుదెంచి, బ్రదికితిని బూర్వరూప మేర్పడఁగ మేన.

క. నాకొడుకు లిట్లు వృద్ధతఁ, గైకొనఁగను నేను దరుణిఁగా నుండంగా
నేకారణంబొ తెలుపుము, సాకల్యంబునను నాకు సంయమివర్యా. 1213

ఆ. తల్లి వృద్ధురాలు తరుణులు సుతు లన్న, మాట లోకమున సమంజసంబు
తరుణి యగుట జనని తనుసంభవులు వృద్ధు, లగుట కలదె యెచట నైనఁ జెపుమ.

క. అనవుడు నే నొకనిమిషం, బున నెఱిఁగి సమస్తవిషయమును ధ్యానముచే
తను భక్తి కిట్టు లంటిని, జనని వచించెదను వినుము సర్వము నీకున్. 1215

సీ. కలియుగం బిది మహాకలుషాత్మకం బిందు, నధము లుందురు ప్రహర్షాన్వితులుగ
నుత్తముల్ చింతిల్లుచుందు రధర్మంబు, నాల్గుపాదంబుల నడచుచుంట
నస్పృశ్యులను దాల్చి యవని యేడ్చుచు నుండె, సార మెల్లను నదృశ్యతను బొందె
నిను నీకుమారులఁ గనువాఁ డొకండును, గానంగరాఁ డెందు నేని యిచట

గీ. దైవికంబుగ నీవు బృందావనంబుఁ, జేరుటను నిందు నినుఁ జూచువార లుంటఁ
దరుణి వైతివి మరల వార్ధకమునందె, యుండిరి భవత్సుతులు వారి కండ లేమి.

వ. అని పలుకుటయు భక్తి యిట్లనియె. 1217

క. శిష్టార్హుఁ డైనకలిని బ, రీక్షిన్నృపుఁ డేల యుంచెఁ బృథ్వీస్థలిపై
దక్షుఁ డగుహరియు నేల యు, పేక్షించెనొ సార మెట్లు లేఁగెనొ చెపుమా. 1218

సీ. అనవుడు నే నిట్టు లంటిఁ దల్లి వచింతు, వినుము సత్యము నీకు విశదముగను
భువిని ముకుందుఁ డెప్పుడు వీడి యరిగెనొ, తనపదంబునకు నాదినమునందె
కలి ప్రవిష్టుం డయి యిలను దిగ్విజయంబు, సలుపుభూపాలుని శరణుచొచ్చె
నపుడు పరీక్షిద్ధరాధిపుఁ డాతని, స్థాపించెఁ గలిజనసౌఖ్యమునకె

గీ. కలివశంబునఁ గలిగెడికలుష మెల్ల, క్షీణ మగు నొక్క-విష్ణుసంకీర్తనమున
దానయజ్ఞతపోయోగదానములను, గలుగుఫలము సంప్రాప్తించు సులభముగను.

క. కలివలనఁ గలుగుక్లేశం, బులు హరినామమున నాశమును బొందుటచే
సులభముగ నుపేక్షించెను, జలజాక్షుఁడు కలిని గార్యసాధకుఁ డగుటన్. 1220

సీ. హరికథల్ నుడువుట నర్థాశ ననుచిత, స్థలములలోఁ గథాసార ముడిగె
దాంభికుల్ ఘోరపాతకులును దీర్ఘవా, సంబు సేయుటఁ దీర్థసార ముడిగె

నొనరించుటను దపంబును గామలోభాది, సక్తచిత్తులు తపస్సార ముడిగె
సలుపుట యోగంబు శాస్త్రాభ్యసనమునో, జయశూన్యముగ యోగసార ముడిగె

గీ. నిల్లి వస్తువు లన్నియు నెల్లయెడలఁ, దండులవివర్జితం బైనధాన్యమట్లు
సారరహితంబుగా నుండె క్ష్మాతలంబు, కలిమహామాయచేత నాక్రాంత మగుట.

గీ. మహిషములుఁబోలెఁ బండితమ్మన్యులాత్మ, యోషలనుగూడి రమియించుచుందు రెపుడు
నంతె కాని విముక్తిపై నాస గలుగు, వాఁ డొకండును గానంగరాఁడు కలిని. 1222

క. తనయుల నుత్పాదించెడి, పనిలో నుండెడిసమర్థభావము లే దొ
క్కనికిని వైకుంఠపదం, బును సంపాదించుకార్యమునఁ గలిలోనన్. 1223

గీ. సారవర్జితకలిలోన సారభూత, మైన దొకకృష్ణనామంబె యని యెఱింగి
యాశ్రయింపుము కృష్ణుని నఖిలదుఃఖ, ములు శమించును నీకు నీపుత్రులకును.

గీ. ద్రౌపదీప్రాణమానసంరక్షకుండు, గోపకాంతాంతరంగసంతాపహరుఁడు
త్వన్మనోవల్లభుండు గావండె నిన్ను, ద్వారకావాస యని యొక్కసారి పిలువ.

క. నీ వెచ్చట వసియింతువొ, గోవిందుం డచట నుండుఁ గుతుకం బొదవన్
దావకరూపమె దైవము, నీవు తదాకృతియె యేల నిక్కము దాఁపన్. 1226

గీ. జ్ఞానవైరాగ్యములు ముక్తిసాధనంబు, లనియు సత్యాదియుగములయందు మూఁటఁ
గలియుగంబున భక్తి యొక్కటియె ముక్తి,దం బనియుఁ బల్కుచుందురు తత్త్వవిదులు.

గీ. కలియుగము జ్ఞానవైరాగ్యములకుఁ దావు, గామి నీపుత్రకులు వార్ధకంబు నొంది
రీయుగంబున నైనను నించుకేని, చింత వహియింపవలదు నీచిత్తమందు. 1228

సీ. అన్యధర్మంబుల నడఁగఁద్రొక్కి భవత్ప్ర, భావంబు నింటింటఁ బాదుకొల్పి
హరిదాసుఁ డనెడివిఖ్యాతిని శాశ్వతం, బుగ నిల్పికొని నేను జగములందు
భక్తియోగంబునఁ బాపాత్ములను నేని, పొందింతు వైకుంఠమందిరంబు
భక్తియుక్తుఁడు గానఁబడినమాత్రముననె, వణఁకుచుండును భూతగణము లెల్ల

గీ. సాధ్యుఁ డైనట్లు భక్తిచేఁ జక్రపాణి, కాఁడు సాధ్యుఁడు తపమునఁ గాని జ్ఞాన
కర్మములచేతఁ గాని నిక్కముగ గోప, జలజముఖు లిందులకు నిదర్శనము గాదె.

గీ. ప్రాప్త మగుఁ బ్రీతి నరులకు భక్తిపైనిఁ, గడచునెడ వేయిజన్మముల్ కట్టకడకుఁ
గలియుగంబున భక్తి యొక్కండె శరణు, జలరుహాక్షుఁడు భక్తిచే నిలుచు నెదుట.

గీ. మూఁడులోకంబులందును ముప్పు నొందు, దేహి యెవఁ డేని భక్తిపై ద్రోహబుద్ధిఁ
జేసినట్టిన మున్ను దుర్వాసుఁ డిలను, దుఃఖమును బొందె భక్తివిద్రోహి యగుట.

గీ. ఏల యోగంబు తీర్థము లేల యేల, జ్ఞాన మేల విరాగంబు ధ్యాన మేల
క్రతువు లేల తపం బేల కలియుగమున, ముక్తిదాయక మై యుండ భక్తి యొకఁడె.

క. అనవుడు భక్తి ప్రమోదం, బును బొంది మహాత్మ నీప్రబోధముచేఁ గ
ల్గెను దేహపుష్టి యైనను, మనఁజాలను సుతులయిడుమ మాన్పక యున్నన్.

సీ. అని వచించుటయును విని నారదుఁడు తన, యాత్మలోఁ గారుణ్య మంకురింప
భక్తిపుత్రులకళేబరముల నిమురుచుఁ, గరములచే సౌఖ్యకరము గాఁగఁ
దత్కర్ణములయొద్దఁ దనముఖం బుంచి గీ, తయు వేదములును బెద్దగఁ బఠింప
నావులించుచు వార లట్టిట్టు చూచియుఁ, గదలంగజాలమిఁ గదల రైరి
గీ. నారదుం డంతఁ దోఁపమి వారియెడలఁ, జేయఁదగినచికిత్స స్వచిత్తమునకుఁ
బరితపించుచు నుండ నుప్పరమునుండి, వినఁబడియెఁ జేయుము సుకర్మ మనెడిమాట.
గీ. అంత నారదముని విస్మయంబు నొంది, యాసుకర్మంబు నెఱుఁగంగ నాత్మ నెంచి
తీర్థముల కేఁగి యచటి కేతెంచినట్టి, మునులకడ నాత్మసంశయమును వచించె. 1235
ఆ. అంత వార లెల్ల నాసుకర్మం బేదొ, యెఱుఁగకునికి నిర్ణయింప రైరి
వనజయోనిసుతునకును గోచరింపని, దన్యులకు నెఱుంగ నలవి యగునె. 1236
క. అంతటఁ జింతాక్రాంత, స్వాంతుం డై నారదుండు చయ్యన బదరీ
కాంతారముఁ జేరి తద, భ్యంతరమునఁ దపముఁ జేయ నరయుచు నుండన్. 1237
క. సనకాదిమునులు నలువురు, కనంబడిరి యెదుటఁ జండకిరకోటిద్యో
తినమూర్తులు కృష్ణకథా, మననానందప్రపూర్ణమానసు లంతన్. 1238
గీ. నారదుఁడు వారలకు మ్రొక్కి గౌరవమున, మానివరులార మీమహామహిమ నెన్న
నలవి యగునది గాదు బ్రహ్మాదులకును, నల్పుఁడను దాని నెఱుఁగ నే ననఁగ నెంత.
సీ. పూర్వికులకుఁ గూడఁ బూర్వు లైనను నిత్య, మును బంచహాయనంబులను బరగి
కృష్ణనామామృతం బెపుడును గ్రోలుట, జర వహింపక కళేబరములందు
నిగ్రహంబునను ననుగ్రహంబునను సా, మాన్యంబుగాని సామర్థ్య మొంది
దై వాఱుచుండు మీదర్శనం బప్రాప్య, మది నాకు నేఁడు పుణ్యమున నబ్బె
గీ. నర్థి నగునాయెడఁ గృపాకటాక్ష ముంచి, యానతిండు నభోవాణి యానతిచ్చి
నట్టిసత్కర్మ మేదొ నా కనుడు వారు, దివ్యదృష్టి నెఱింగి తద్విషయ మెల్ల. 1240
సీ. నారద మము నీవు కోరినవిషయంబు, సర్వంబు మాకు విజ్ఞాత మయ్యెఁ
జింతింపకుము నీకుఁ జెప్పెద మంతయుఁ, దగినకార్యము నీవు తలఁచికొంటి
ఋషు లనేకులు వచియించి రనేకమా, ర్గములను సద్గతిప్రదములుగను
నవి యెల్ల స్వర్గదాయకములు శ్రమసాధ్య, ములును నై యుంట నిష్ఫలము లయ్యెఁ
గీ. గలదు వైకుంఠధామంబు గలుగఁజేయు, నట్టిసత్కర్మ మొకటి రహస్యముగను
నదియె యాకాశవాణి నీ కానతిచ్చె, భక్తిబోధవిరాగముల్ బ్రతుకుటకును.

వ. ద్రవ్యయజ్ఞతపోయజ్ఞయోగయజ్ఞస్వాధ్యాయయజ్ఞజ్ఞానయజ్ఞంబు లను పంచయజ్ఞంబు
లలోన మొదటినాల్గుయజ్ఞంబులు కర్మసూచకంబులుగను జ్ఞానయజ్ఞంబు సత్కర్మ
సూచకంబుగను సిద్ధాంతీకరింపంబడియె. 1242

క. అదె భాగవతాలాపం, బదె సత్కర్మాభిధాన మక్షయధామ
ప్రద మదియె లేదు మోక్ష, ప్రద మగుమార్గంబు తదితరంబు ధరిత్రిన్. 1243

గీ. సింహరావంబు నాలకించిన వృకంబు, లెట్లు పరువెత్తిపోవునో యట్లె పఱచు
భాగవతశబ్దనాదంబు పతితమైన, శ్రవణములలోనఁ గలిదోషజాల మెల్ల. 1244

క. భక్తిజ్ఞానవిరక్తులు, శక్తములై యపుడు మోక్షసామ్రాజ్యంబున్
భక్తులకు నొసఁగు భాగవ, తోక్తులసాఁదుమునఁ బుట్టి యొదవఁగఁ దమకున్. 1245

క. అనవుడు బ్రహ్మసుతుం డి, ట్లనియెను మహనీయులార యామ్నాయాదుల్
వినిచినను శక్తి యొదవని, యనదలు భాగవతగాథ నగుదురె శక్తుల్. 1246

క. అని యడుగుటయును వేదో, పనిషత్సారమునఁ బుట్టె పార్థక్యంబున్
గొనుటను సత్యోత్తమతను, గనియెను భాగవతకథ జగత్త్రయమందున్. 1247

గీ. ఆమ్రఫలమున రస మున్న నధికముగను, నగునె యాస్వాద్యము పృథక్త్వ మంద కున్న
నిక్షువున నున్నశర్కర యెల్లయెడలఁ, జేయఁబడకున్న వేఱుగాఁ బేయ మగునె. 1248

గీ. అంతటను నుండినను క్షీరమందు నేయి, చెందకున్నఁ బృథక్త్వముఁ జేయఁగలదె
రోగాయురభివృద్ధియును నింద్రియముల కెల్ల, బలవివర్ధనమును నెట్టిపట్ల నేని. 1249

గీ. వ్యాసుఁ డొకతఱిఁ బుత్రమోహమున శోక, మొందుచుండఁ జతుశ్శ్లోకయుక్తమైన
భాగవతమును జెప్పి తద్భావమునకు, శాంతిఁ గొలుపవె మును నీవు సంయమీంద్ర.

గీ. ఇట్టినీవును సంశయం బంది యిట్లు, ప్రశ్న మొనరింపవచ్చునె భాగవతము
నాలకించినఁ గలుగుశ్రేయములపట్ల, సంశయింతురుగాక యజ్ఞాను లిలను. 1251

క. అని సనకాదులు పలుకుట, యును సంశయ ముడిగి పద్మజోద్భవుఁడు తపో
ధనులార జ్ఞానయజ్ఞము, నొనరింపఁగఁ దెల్పుఁ డొక్కయుచితస్థలమున్. 1252

వ. అని యడుగుటయు నత్తపోధనులు నారదున కిట్లనిరి. 1253

క. నారద గంగాద్వారము, ధారుణిలోపలఁ బవిత్రతను గిన్నయసా
ధారణతీర్థము నాఁగను, బేరుకొనంబడియె మునిబృందముచేతన్. 1254

గీ. సహజవిద్వేష మొదవినజంతువులును, మైత్రితో నుండు నచ్చటఁ జిత్రముగను
నమ్మహాక్షేత్రమునఁ జేయనగును నీకు, జ్ఞానయజ్ఞంబు నది శమస్థాన మగుట. 1255

సీ. జ్ఞానయజ్ఞంబు నచ్చట నీవు చేయ సం, కల్పం బొనర్పు మాక్షణములోన
భక్తియుఁ దత్తనూభవు లిద్దఱును వత్తు, రాస్థలంబునకు నాహ్లాద మొదవ
వచ్చినవెంటనె వారికిఁ దారుణ్య, మొనగూడు భాగవతోక్తి వినుట
నని పల్కి బ్రహ్మపుత్రునితోడఁ గూడి గం, గాద్వారమునకు శీఘ్రముగ రాఁగ

గీ. నది గ్రహించి తపోధను లనిమిషులును, వేదశాస్త్రపురాణాదివివిధకలలు
నదులుఁ దీర్థంబులును నరణ్యములు గిరులు, నందఱును వచ్చి రచ్చటి కద్భుతముగ.

సీ. అప్పుడు దీక్షితుండై నారదుఁడు శ్రోత, గను నుండ నగ్రభాగంబునందు
నొకప్రక్క ఋషులును నొకప్రక్క సురలును, నుపనిషద్వేదంబు లొక్కప్రక్కఁ
దీర్థంబు లొకప్రక్క స్త్రీజనం బొకప్రక్కఁ, గులగిరు లొకప్రక్కఁ గూరుచుండ
ముఖభాగమున బాలమునివరేణ్యులు నార, దానీతపీఠంబు నధివసించి

గీ. భాగవతపురాణంబును బలుకఁ దొడఁగఁ, గురిసె నప్పరమునినుండి కుసుమవృష్టి
శంఖనాదంబులును జయశబ్దములును, బయలుదేరెను దత్సభాభవనమందు. 1257

వ. అంత సనకాదికుమారమునులు సోత్సాహంబుగ నిట్లనిరి. 1258

సీ. నిత్యంబు సేవ్యంబు నిత్యంబు సేవ్యంబు, ప్రాణధారుల కెల్ల భాగవతము
ద్వాదశస్కంధ మష్టాదశసాహస్ర, పరిమిత మది దానిఁ బలికె మున్ను
శుకుఁడు పరీక్షిత్తునకు దానిశ్రవణంబు, గావించినంతనె కలుగు ముక్తి
శుకశాస్త్రకథ చెవిఁ జొరకుండుదాఁకనె, సంసారచక్రంబు సంచరించు

గీ. గర్జనము చేయుచుండ భాగవతగాథ, ముక్తిదానంబునను దీర్థములకు వేద
శాస్త్రపాఠంబులకును యజ్ఞంబులకును, బరువులెత్తుచు నుందురు భ్రాంతమతులు.

క. ఏగేహము నిత్యంబును, భాగవతకథానినాదపరమపవిత్రం
బై గౌరవంబు గాంచునొ, యాగేహమె పుణ్యతీర్థ మందురు ప్రాజ్ఞుల్. 1260

గీ. గంగయును గాశియును బ్రయాగమును గయయు, వాజిమేధసహస్రముల్ వాజపేయ
శతములును భాగవతశతాంశమున కేని, సాటి గానేర విఁకఁ బలుమాట లేల. 1261

గీ. అంతదాఁకనె దేహమునందుఁ బాప, సంతతులు మూఁగికొని యుండు సంతతమును
నెక్కనుండునొ చెవులకు నెంతదాఁక, భాగవతదివ్యగాథికాపఠనరవము. 1262

వ. ప్రణవంబునకును గాయత్రికిని బురుషసూక్తంబునకును ద్రయికిని భాగవతంబునకును ద్వాదశాక్షరమంత్రంబునకును ద్వాదశాత్మునకును సంవత్సరాత్మకకాలంబునకును బ్రాహ్మణునకును నగ్నిహోత్రంబునకును సురభికిని ద్వాదశికిని దులసికిని వసంతునకును బురుషోత్తమునకును బృథగ్భావంబు లేదు. 1263

గీ. అర్థయుతముగఁ బఠియించినట్టు లైన, భాగవతము జనుఃకోటిపాతకములు
పాఱిపోవు జనార్దనభటులఁ జూచి, శమనభృత్యులు పఱచెడిచందమునను. 1264

గీ. ప్రతిదినంబును జదివిన భాగవతము, నందు నొకశ్లోక మేని శ్లోకార్ధ మేని
శ్లోకపాదంబు నేనియు శోకరహిత, మైనపద మొందుఁ బొరకుఁ డైనవాఁడు. 1265

వ. విష్ణుచింతనంబును దులసీపోషణంబును గోసేవయును భాగవతపఠనంబును సమానంబులుగాఁ జెప్పంబడియె. 1266

క. ఆలించిన భాగవతక, థాలాపం బంతకాలమం దింతైనన్
జాలు నది విష్ణుకింకర, జాలములోఁ జేర్చి నిత్యసౌఖ్యము నీయన్. 1267

వ. భాద్రపదపూర్ణిమాతిథియందు హేమసింహాయుతభాగవతగ్రంథదానంబు గావించె నేని విష్ణుసాయుజ్యంబు చేకూరు. 1268

గీ. జన్మమున నెప్పు డేని యేస్వల్ప మేని, భాగవతకథ విననినిర్భాగ్యు డిలను
నాత్మజన్మంబు విత చేసినట్టిఁ డగుట, నతఁడు నిజముగ మాతృగర్భార్తికరుఁడు.

క. ఎవఁ డేనియు భాగవత, శ్రవణము నిలఁ జేయకున్న స్వల్పం బైనన్
దివిషదులు వాని జీవ, చ్ఛవముగఁ బశువుగను గణన సలుపుదురు దివిన్. 1270

గీ. జన్మశతకోటిపుణ్యసంచయము లేని, మానవులకు లభింప దేమాత్ర మేని
భాగవతమును వినియెడిభాగ్య మిలను, దానిమహిమంబు నెన్న మాతరము గాదు
క. దిననియమము లేకుండఁగ, ననిశంబును భాగవతకథాలాపంబుల్
బొనరింపనలయు దానను, ననవాప్యం బైనధామ మందంగలుగున్.
సీ. సత్యంబునను బ్రహ్మచర్యంబునను సర్వ, కాలంబులందును గలియుగమున
శ్రవణంబు గావింప శక్యంబు గామిని, దుర్లభం బగుటఁ జేతోజయంబు
జనుల కాయుష్యంబు సంక్షీణ మగుటను, సాగకుంటను సదాచారసరణి
యధికదీక్ష వహింప నలవి గాకుండుటఁ, గలి దోషబాహుళ్యకలిత మగుట
గీ. నిత్యమును శ్రద్ధతోడను నియమయుతము, గాఁగ శ్రవణంబు గావింపఁ గలుగు ఫలము
సంఘటిలునట్లు సప్తాహసంశ్రవణము, చేతఁ గలియం దనుగ్రహించెను శుకుండు.
గీ. ఇలను యోగతపస్సమాధులకుఁ గూడ, నందరానిఫలంబు సప్తాహమునను
భాగవతమును వినుటచేఁ బడయఁగలుగుఁ, దన్మహత్త్వంబుఁ దెలుప మాతరముగాదు.
క. జ్ఞానంబును యోగంబును, ధ్యానంబును యజ్ఞములును దపమును జపముల్
దానంబును దీర్థములను, గానిచి సప్తాహ మడలఁగను గర్జించుల్. 1275
సీ. విడిచి కృష్ణుఁడు మున్ను పుడమిని స్వపదంబు, నకుఁ బోవ నున్నసందర్భమందుఁ
గని యుద్ధవుం డిట్టు లనియె నచ్యుత కలి, యుగము వచ్చుచు నుండె నుద్ధతముగ
దుష్టు లం దుద్భవింతురు వారివలనఁ గ్లే, శములు సంప్రాప్తించు సాధువులకు
నపుడు భారంబు మోయఁగలేక విలపించు, ధర నోము నీకంటె దక్షుఁ డెవఁడు
గీ. కాన సాధుజనంబులపైనిఁ గరుణ, యుంచి పోవంగవలదు నీ వుర్వి విడిచి
యవతరించితికాదె భక్తార్థ మిలను, రూపరహితుండ వయ్యును రూపమునను. 1276
గీ. భక్తు లెల్లరు నిర్గుణోపాసనంబు, కష్ట మగుటను ద్వద్వియోగంబుతోడ
నుండఁజాలరు ధరలోన నున్నమాట, మనవి చేసితి నీ వెఱుంగనిది కలదె. 1277
క. అనవుడుఁ గృష్ణుం డాలో, చన చేసి మనంబులోన సవిశేషముగన్
దనతేజము భాగవతం, బున నుంచెను సాధుజనసముద్ధరణమతిన్. 1278
గీ. కానఁ బ్రత్యక్షముగను భాగవత మంబు, జాక్షమూర్తియె యని తెలియంగవలయుఁ
దచ్ఛ్రవణపాఠసేవనదర్శనముల, భస్మమై పోవు ఘోరపాపములు గూడ. 1279
గీ. కలవు బహుసాధనములు మోక్షమును జెంద, నిలను నవ్వానికంటెను గలియుగమున
నధిక మగుసాధనంబు సప్తాహ మంచుఁ, జెలుపఁబడుభాగవతకథాశ్రవణ మొకఁడె.
గీ. కలియుగంబున దారిద్ర్యకలుషదుఃఖ, కామలోభాదిశత్రువర్గముల నడఁపఁ
జాలుధర్మము సప్తాహసంశ్రవణము, కంటె నెందును వేఱొండు గానరాదు.
క. అని మడివి భాగవతకథ, ననువుగ వచియించుటకును నారంభింపం
గనె భక్తియుఁ దత్సుతులును, జనుదెంచిరి యావనోల్లసద్గాత్రములన్. 1282

క. తారుణ్యోద్దీపితు లగు, వారిం గని మువ్వుర భాగవతమహిమకు నే
పారఁగ విస్మయ మెదలో, నారదుఁ డానందరసమునను నోలాడెన్. 1283

గీ. అంతటను బారికాంక్షుల కందఱకును, భక్తి యొక్క తపోధనప్రవరులార
యెచట నే నుండవలయునో యెఱుకపఱుపుఁ, డనుచు బాలమునీంద్రు లాయమను జూచి.

ఆ. అమ్మ నీవు వైష్ణవాంతరంగగృహంబు, లందు ధైర్యమునను నధివసింపు
మాత్మజోపపన్న నగుచు సంతతమును, గలిభయంబు నీకుఁ గలుగ దందు. 1285

క. అని బోధింపఁగ వైష్ణవ, జనచిత్తగృహంబులందు సత్వరమ వసిం
చెను భక్తి సుతులతోడను, దనయులకును దనకు సమ్మదం బుప్పొంగన్. 1286

గీ. అంతఁ దద్భక్తివల్లభుఁ డగుట శార్ఙ్గి, స్వీయధామప్రయాణంబు విడిచి భక్తి
యున్నచోటనె నివసించె నుండి రెల్ల, విష్ణుభక్తులు సభలోన వినుచుఁ గథను. 1287

సీ. అపుడు నారదుఁ డిట్టు లనియెఁ దాపసులార, సప్తాహమహిమ మాశ్చర్యకరము
పశుపక్షులును గూడఁ బరమపావనము లై, కనుపట్టుచున్నవి కథను వినుటఁ
బరిశుద్ధి నొందెడినరు లెవ్వ రెవ్వరో, సప్తాహహరికథాశ్రవణమునను
దెలియఁబల్కుఁడు నాకుఁ దేటపడంగను, నని కోరుటయును ని ట్లనిరి వారు

గీ. వినుము సప్తాహయజ్ఞంబునను విశుద్ధిఁ, బడయుదురు బ్రహ్మహత్యాదిపాతకులును
ననృతవాదులు శఠులు దుర్వ్యసనపరులు, ఖలులు క్రూరులు కోపులు కాముకులును.

సీ. ఈవిషయంబున నెఱిఁగింతు మొకయితి, హాసంబు పూర్వమం దవనిలోనఁ
దుంగభద్రాసరిత్కూలంబునం దుండె, నుత్తమం బగునొకపత్తనంబు
దానిలో నుండె నుత్తమగుణుం డై నభూ, దేవుఁ డొక్కఁ డాత్మదేవుఁ డనఁగ
వానికిఁ గల దొక్కచాన ధుంధుళి నాఁగ, స్వమతానుకూలసంచారశీల

గీ. యట్టు లుండంగ వారు కామార్థసహితు, లయ్యు సంతానవర్జితు లగుటఁ జేసి
తన్నిమిత్తము ధర్మంబు లెన్నొ చేసి, తుదకు విసివిరి సంతతి యొదవ కునికి. 1289

సీ. అంతతో నుండక యాత్మదేవుఁడు పుత్ర, తృష్ణచే నొకనాఁడు గృహము విడిచి
చని యొక్కకాననంబున కట నేకాంత, ముగ వసించెడియొకమునిని జూచి
పోయి తదంతికంబునకు సాష్టాంగవం, దన మాచరించి తత్పాదములకు
నిలువంగఁబడియెఁ గన్నీరు కాఱుచు నుండ, దీనాననంబుతో వానియెదుట

గీ. నపుడు యతి చూచి యతనియాస్యంబు విప్ర, చింతిలఁగ నేమి హేతువో చెపుము నాఁగ
నాత్మదేవుఁడు వాని కి ట్లనియె స్వామి, యేను జేసినపాపంబు నేమి చెప్ప. 1290

సీ. నే నిచ్చుసలిలంబు నిజపరితాపని, శ్శ్వాసంబులను గవోష్ణంబు గాఁగఁ
ద్రావు చుండిరి నాపితరులు మదత్తంబుఁ, గొనరు ప్రీతిని విప్రు లనిమిషులును
బ్రజ లేనిభవనంబు ప్రజ లేనిద్రవ్యంబు, ప్రజ లేనిబ్రతుకు నిరర్థకములు
నేను బోషించెడిధేనువు గొడ్డోయె, నేను బెట్టినచెట్టు నిష్ఫలంబు

గీ. మద్గృహంబున కేతెంచుమంచిఫలము, శుష్క మైపోవు నెంటనె చోద్యముగను
నుండియును నేను బుత్రశూన్యుండ నగుట, లేనివాఁడనె యిహపరస్థానములను. 1291

క. అని పల్కి యేడ్చె బోరున, విని యతి తద్వాక్యములను విశదంబుగఁ గ
న్గొని యోగదృష్టిచే ని, ట్లనియెను భూసుర వచింతు నంతయు నీకున్. 1292

సీ. చూచితి నీకర్మసూత్రంబు లే దప, త్యము నీకు సప్తజన్మములవఱకుఁ
గర్మంబు తప్పింపఁ గా దెవ్వరికిఁ గూడ, సంతతి లే దనుభ్రాంతి వలదు
సంసారవాసనాక్షయమును గావించు, జ్ఞానంబు నార్జించి మాని వగుము
దాన శాశ్వత మైనయానంద మొదఁగూడు, సంసారమునను విషాద మొదవు

గీ. సగరుఁ డొందెను దుఃఖంబు సంతువలన, దానిపై నాసపడెద వజ్ఞానమునను
బ్రాహ్మణుఁడ వందులోపలఁ బండితుఁడవు, నీకుఁ దెలియని దున్నదె నేను జెప్ప.

గీ. అని ప్రబోధించుటయుఁ గర్మ మపరిహార్య, మగుటచే నాత్మదేవుఁ డి ట్లనియె స్వామి
యెంత బోధించినను నా క దేమొ కాని, సుతులు లేనట్టిజన్మంబు వితగఁ దోఁచు.

గీ. ఏవిధంబున నేని నా కేరుపడఁగ, నేకసుతుఁ డేనియు ననుగ్రహింపు మట్లు
కానియెడ నుజ్జగింతు నాకాయ మిండె, యనుడు నాభిక్షుకుం డిట్టు లనియె మరల.

గీ. చిత్రకేతువు దుఃఖంబుఁ జెందె మున్ను, బ్రహ్మలిఖితాక్షరప్రమార్జనమువలన
నట్లె దైవోపహతుఁ డగు నాగ్రహమునఁ, గార్యసాధకుఁ డై నను గిట్టకడకు. 1296

క. అని చెప్పి యొక్కఫల మా, తని కిచ్చి భుజించు నెడలఁ ద్వద్గేహిని దీ
నిని జనియించు సుపుత్రుం, డని పలికె యదృశ్యుఁ డయ్యె నాత్రుటిలోనన్. 1297

గీ. అంతటను నాత్మదేవుఁడు హర్ష మునను, గృహమునకు వచ్చి ఫలము గేహినికొసంగి
దీని భక్షింపు ముదయించు సూనుఁ డనియె, నంత ధుంధులి గైకొని యాఫలంబు.

గీ. ఎన్నియెన్నియొ చేసితి మింతవఱకు, ధర్మకార్యంబులను సుతార్థంబు దాన
ఫలము లేదాయెఁ దినిన నీపండు నేఁడు, ఫలము కల దని నమ్ముట తెలివి యగునె.

గీ. కాననంబున నేమాయకాఁడొ యొసఁగె, నీఫలంబును దినఁ గీ డేమి యగునొ
యింత తలఁపక యీయమాయికుఁడు తెచ్చి, యిచ్చినంతనె వెఱ్ఱినె యేను దినఁగ.

క. అని యాలోచించి మదిన్, దినియెద స్నానంబు చేసి దీనిని బొమ్మి
వని పలుక నాత్మదేవుఁడు, తనపనికిం బోయె నమ్మి తద్వాక్యంబున్. 1301

సీ. అంతట ధుంధులి యాఫలంబు భుజింప, కుండ గోప్యంబుగా నుంచి యింట
నపుడు దైవికముగా నామెచెల్లెలు రాఁగఁ, దనయింటి కామె కంతయును జెప్పె
నది యెల్ల విని యామె యక్క చింతిలకుము, ప్రసవించి నేను నాపట్టి నిత్తు
గర్భిణి వైనట్లు కనఁబడు మంతదాఁ, కను నెల్లరకును నీకౌశలమున

గీ. నాకుఁ బుట్టినబిడ్డ వినష్ట మయ్యె, ననుప్రవాదంబుఁ బుట్టింతు నపుడు నేను
ఫలపరీక్షను గావింపవలయుఁ గాన, దీనిఁ బెట్టుము నీయింటిధేనువునకు. 1302

క. అని బోధింపఁగ ధుంధుళి, తనచెల్లెలివాక్యములకుఁ దాను బ్రహర్షం
బును గని వెంటనె ఫలమును, దినిపించెను నిజగృహాస్థధేనువుచేతన్. 1303

ఆ. అంతఁ గొంతకాల మరుగంగఁ గని యొక, కొమరుఁ నామెభగిని గోప్యముగను
జేర్చి యక్కయింట స్వీయగర్భము నశి, యించినట్లు వెల్లడించె వార్త. 1304

క. అప్పుడు ధుంధుళి భర్తకుఁ, జెప్పెను నా కుద్భవించె శిశు వని మదిలో
నుప్పతిల నాత్మదేవుం, డప్పలుకునకుం బ్రమోద మానసమయమునన్. 1305

గీ. భూరిదానంబుల నొసంగి భూసురులకు, జాతకర్మంబు గావించి శాస్త్రవిధిని
ధుంధుళియభీష్టమునుబట్టి ధుంధుకారి, యనెడినామంబు వెట్టె నయ్యాత్మజునకు.

సీ. అంతట ధుంధుళి యాత్మదేవునిఁ జూచి, బాలునిఁ బెంపంగఁ బాలు లేవు
జనియించి సుతుఁడు నాస్వసకు విన్ననె మ్రందె, నని యింటఁ బిలిపింపు మామె నిటకుఁ
బోషింపఁగల దామె పుత్రునిఁ బాలిచ్చి, స్తన్యంబు విడుచునందాఁక నుండి
యని పల్కుటయును వెంటనె యాత్మదేవుఁడు, పిలిపించె నామెచెల్లెలిని నటకు

గీ. నంతటను ధుంధుళిస్వస యర్భకునకు, స్తన్య మిచ్చుచు నుండెఁ దత్సదనమంద
యట్టు లుండంగ నొకదినమందుఁ బుట్టె, సూనుఁ డొక్కఁడు తద్గృహాధేనువునకు.

క. ఆతనికనకప్రభయును, నాతనిసర్వాంగసుందరాకారంబున్
జేతమునకు విస్మయమున్, బ్రీతియుఁ గలిగింప మేదినీసురుఁ డంతన్. 1308

క. తనభాగ్యముచేఁ దనయిం, టను దేవుఁడె పుట్టె గోవునకుఁ బుత్రుఁడు గా
ననుకొని ద్విజసంస్కారము, లను వానికిఁ జేసి బహుకళావిదుఁ డగుటన్. 1309

వ. ఆకుమారునకు గోవునకుంబోలెఁ గర్ణంబు లుండుటంజేసి గోకర్ణుం డనునామకరణంబు
గావించె. 1310

గీ. ఆకుమారునిఁ జూచెడియాశతోడ, నెడతెఱపి లేక వచ్చుచు నేఁగుచుండ
నవనిలోఁ గలజనులు నిత్యమును నాత్మ, దేవునినికేతనము పుణ్యతీర్థ మయ్యె. 1311

గీ. అట్టు లుండంగ గోకర్ణుఁ డఖిలవిద్య, లందు నుత్తీర్ణుఁడై జ్ఞాని యయ్యె ధుంధు
కారి దుర్జనసాంగత్యకలుషితాత్మ, వర్తనుం డయి ఖలచక్రవర్తి యయ్యె. 1312

ఆ. అట్లు ధుంధుకారి యపమార్గమునఁ బడి, తగులబెట్టె యున్నధనము నెల్ల
నడ్డుచెప్పుచుండ నప్పు డప్పుడు తండ్రి, వాని నడిచి వీధిలోనఁ ద్రోసె. 1313

సీ. అంతట బలహీనుఁడై యాత్మదేవుఁడు, పదుగురిలో నగుబాటు గాఁగ
నెక్కడ నుందు నే నెచ్చోటి కేఁగుదు, నిక్కడ నున్న నా కెవరు దిక్కు
కనుటకంటెను గుపుత్రుని వంధ్యతయె మేలు, కాకున్న నటు మృతి గనుట మేలు
షష్టిహాయనములు జరిగినపిదప ని, ప్పటికె నా కీబాము ప్రాప్తమయ్యె

గీ. నని విలాపం బొనర్చుచుఁ బ్రాణములను, నుజ్జగింపంగ యత్నించు చుండ నప్పు
డతనిదొద్దకు గోకర్ణుఁ డరుగుదెంచి, యేర్పడఁగ భక్తివినయంబు లిట్టు లనియె. 1314

సీ. స్వామి సంసారం బసారంబు దుఃఖమో, హములకు నాస్పదం బై సకలను
సుతుఁ డంచుఁ బిత యంచు శోకించు చుందురు, స్నేహబంధంబున జీవు లెల్లఁ
జక్రవర్తులకును శక్రునకును గూడ, సౌఖ్యంబు లేదు సంసారమందు
నజ్ఞానమును విడనాడి వైరాగ్యంబు, నాశ్రయించి సుఖంపు మడవిలోనఁ
గీ. గలుగు నేకాంతజీవికి సులభముగను, జిత్తశాంతియు మోక్షంబుఁ జీకు దొలఁగు
మోహమునఁ జచ్చిపోయెడిమూఢజనులు, ఘోరనరకంబులోపలఁ గూలువార.
గీ. అని ప్రబోధించుటయు విని యాత్మదేవుఁ, డాత్మలోఁ గొంతవిజ్ఞాన మంకురింప
విడిచి నిజసాహసమును వివేకమూర్తి, యెనగోకర్ణునిపదంబులందు వ్రాలి. 1316
ఆ. తండ్రి స్నేహవహ్నిదగ్ధుండ నైన నా, కేది దిక్కు యడవి కేఁగి యేమి
చేయవలెనొ నేను జెప్పుము నీకు న, న్నుద్ధరించుబుద్ధి యొదవె నేని. 1317
వ. అని దీనుండై వేఁడుటయు వైరాగ్యపరినిష్ఠితమానసుం డగుగోకర్ణుండు వానికిట్లనియె.
సీ. అస్థిమాంసాస్రమయం బైనదేనిపై, నుండినయభిమాన ముజ్జగించి
జాయాసుతాదిస్వసంబంధిజనులందు, నొసినమమకారమును ద్యజించి
క్షణభంగురంబు గా జగమును జూచుచుఁ, బోనీకవ్యవహారములకు మనసు
వైరాగ్యమును బొంది వస్తుసంతతులందు, విష్ణువె గతి యని విశ్వసించి
గీ. భాగవతదశమస్కంధపఠనమునను, గాలమును బుచ్చు చుండుము కాయ ముడుగు
నంతదాఁకను దేహాంతమందు నీకుఁ, బ్రాప్తమయ్యెడి మోక్షసామ్రాజ్యలక్ష్మి.
ఆ. అని వచించుటయును నాత్మదేవుఁడు ధైర్య, మును వహించి చిత్తమునను నపుడె
పోయి యొక్కవిపినమునకు గోకర్ణుఁడు, చెప్పినట్లు చేసి చెందె ముక్తి. 1320
సీ. ఆత్మదేవుఁడు కాన కరిగినపిమ్మటఁ, దోషితస్వాంతుఁడై ధుంధుకారి
ధనము మాతండ్రి యుంచినతావు చెపు మని, యడిగి తల్లి నెఱుంగ నని నామె
చెప్పకుండిన నిన్నుఁ జీల్చివై చెద నని, బాదంగ బత్తెను బాదినట్లు
తద్బాధపడలేక తనలోన నేడ్చుచు, ధుంధుని బావిలో దూఁకె చచ్చె
గీ. నంతటను ధుంధుకారి నిరంకుశముగఁ, దిరుగుచును భోగినులను నేగురను నింటఁ
జేర్చికొని వారి కెంత యిచ్చినను ధనము, చాలమిని దొంగతనమును జలుపఁదొడఁగె.
వ. ఆతని దురాకృతంబు లెల్లం జూచుచు నింట నుండఁజాలక గోకర్ణుండు తీర్థయాత్ర
గావింపఁ బరదేశంబునకుం జనియె. 1322
గీ. అట్లు చౌర్యంబు చేసి ద్రవ్యమును భూషణములు వస్త్రంబులును దెచ్చియమితముగను
ధుంధుకారి యొసంగ నత్తొయ్యలులకు, వారు గైకొని తెచ్చినవాని నెల్ల.
సీ. ఒకరేయి యన్యోన్య ముత్సాహమున నొక్క, స్థానంబునను రహస్యముగఁ జేరి
కావించి వీఁడు దొంగతనంబు నీపాటఁ, దెచ్చినదంతయు నిచ్చె మనకు
నిది పురపాలకుం డెఱిఁగినచో మన, ప్రాణంబులకుఁ గూడ హాని గల్గుఁ
గావున నీరాత్రికాలంబుననె నిద్ర, లో నున్నవీని నె క్లైనఁ జంపి,

గీ. పూడ్చిపెట్టి నికేతనంబుననె మనము, గుప్తముగఁ బోద మిది యెల్లఁ గొని యటంచుఁ
జేసి యాలోచనము నట్లు చేసి రెంత, సాహసము నైన నతివలు సలుపువార. 1324

క. తరుణులవచనము లమృతము, క్షురధార మనంబు దానిఁ జూడక చెలులన్
నరు లెవరు విశ్వసింతురొ, పరిభవములు పొంది దుఃఖపడుదురు వారల్. 1325

గీ. అంత నాధుంధుకారి నిజాఘమునను, బ్రేత యై వాత్యరూపంబుచేత నచట
నచటఁ దిరుగుచు శీతాతపాదిబాధ, కాఁకలికి నోర్వలేక యల్లాడఁదొడఁగె. 1326

సీ. ఆవిధి బహుకాల మరుగంగ నొకనాఁడు, గయ కేఁగుదెంచి గోకర్ణుఁ డుండ
నరుదెంచి యొకపాంథుఁ డతనియొద్దకు ధుంధు, కారి నశించినకథను జెప్ప
నంతట గోకర్ణుఁ డాధుంధుకారికి, నచ్చట శ్రాద్ధంబు నాచరించి
స్వపురంబునకు వచ్చి స్వగృహంబునను రేయి, నిదురించుచుండ నానిద్రలోనఁ

గీ. గనఁబడియె నాతనికి ధుంధుకారి యొక్క, నారి మేషంబుగను నొక్కసారి మహిష
ముగను నొకసారి సామజంబుగను నొక్క, పరిఁ బిసాసిగ నొకపరిఁ బురుషుఁడుగను.

సీ. అంతట గోకర్ణుఁ డారూపముల నెల్లఁ, గని మేలుకొని చివాలునను లేచి
యెవ్వఁడ వీ వేల యీవేషములు నీకు, నీకథ యేమియొ నాకుఁ జెపుమ
యనవుడుఁ బ్రేత నోరాడమిఁ జెప్పంగ, సారెసారెకు నేడ్వసాగె నంత
గ్రహియించి దాని గోకర్ణుండు మంత్రోద, కము పైనిఁ జల్లి వాగ్బంధ ముడిపె

ఆ. నంత ధుంధుకారి యాత్మవృత్తాంత మం, తయును జెప్పి యేడ్చి తండ్రి నేను
బ్రేతరూపమును భరింపలే నిఁక నెట్టు, లేని యుద్ధరింపు మీవె దిక్కు. 1328

క. అనవుడు గోకర్ణుం డి, ట్లనియెను సోదర్య నే గయాశ్రాద్ధంబున్
బొనరించితి నీకొఱ కది, వినిహత మై పోవ నింక వే ఱే ముందున్. 1329

గీ. ప్రేతరూపంబు దొలఁగింప భూతలమునఁ, జాలునది చూడఁగను గయాశ్రాద్ధ మొకఁడె
యంతకంటె నుపాయ మన్యంబు నీకుఁ, దెలిసిన వచింపు మది నేను సలుపువాఁడ.

గీ. అనుటయును ధుంధుకారి యి ట్లనియెఁ దండ్రి, సలిపినను నీవు శతగయాశ్రాద్ధములను
గలుగనేరదు ముక్తి నాకలుషమునకుఁ, గాన గమనింపు మన్యమార్గమును నీవె.

క. అనవుడు గోకర్ణుఁడు తన, మనమున విస్మయము నొంది మార్గాంతరమున్
గనుఁగొనియెద నట్లైనను, జనుము భవత్స్థానమునకుఁ జయ్యన ననియెన్. 1332

గీ. అంత నాధుంధుకారి తదాజ్ఞ వడసి, చనియెఁ దా నుండునట్టిశ్మశానమునకు
నవల గోకర్ణుఁ డతని కెట్లైన ముక్తిఁ, గలుగఁజేయంగ దృఢముగాఁ దలఁచి లోన.

గీ. జ్ఞానులును యోగనిష్ఠులు ధ్యానపరులు, బ్రహ్మవాదులు విద్వదగ్రణులు గలుగు
స్థానమున కేఁగి జరిగినచరిత మెల్లఁ, దెలిపి తన్ముక్తిమార్గంబుఁ దెలుపుఁ డనఁగ.

వ. వార లెల్లరును శాస్త్రంబుల నన్వేషించి తన్ముక్తిసాధనంబుఁ గానక యేతద్విషయంబునఁ గర్మసాక్షివచనంబు ప్రమాణం బని యేకగ్రీవంబుగా నిర్ణయింప గోకర్ణుండు సౌరమంత్రంబుచే నాదిత్యుని నిలిపి నమస్కరించి తనసంశయంబు నడుగ భాస్కరుండు

ప్రసన్నుండై గయాశ్రాద్ధంబువలనను విముక్తి లేని ప్రేతకు సప్తాహభాగవతశ్రవణంబు
వలన విముక్తి చేకూరు నని నిర్గమించె. 1335

సీ. అంతట ద్విజు లెల్ల నాశ్చర్యమును బొంది, ధ్వనిరూప మగురవివాక్యములకు
సప్తాహ మిచటనె సలుపుము గోకర్ణ, యనుటయు నాతఁ డాహ్లాద మొదవ
సంకల్ప మొనరించె సప్తాహయజ్ఞంబు, నాచరింపఁగ బ్రాహ్మణానుమతిని
నపుడు వచ్చిరి జను లట కసంఖ్యంబు గా, భక్తితో నాలింప భాగవతము

గీ. నంతఁ గూర్చుండి గోకర్ణుఁ డాసనమున, జదువ భాగవతంబును మొదలుపెట్ట
నత్తఱినె ధుంధుకారియు నరుగుదెంచి, శ్రవణ మొనరింపఁగను బహుశ్రద్ధతోడ. 1336

వ. తత్సమీపంబునందు సప్తగ్రంథియుక్తం బగునొక్కవంశంబు నుపలక్షించి తాను ప్రేత
యగుట వాయురూపంబునఁ దన్మూలరంధ్రంబునం బ్రవేశించె. 1337

సీ. అంతట గోకర్ణుఁ డాదినాంతము పఠి, యించి నాఁటికి విరమించుటయును
నపుడు గల్గఁగ విస్మయము పెద్దరొదతోడ, వంశాదిమగ్రంథి ప్రక్క లయ్యెఁ
బ్రథమదినంబునంబలె మఱునాఁడును, జదివి యాఁపుటయు నాసమయమునను
నయ్యె వంశద్వితీయగ్రంథిభేద మా, తీరున నొగి నేడుదివసములును

గీ. బ్రద్దలయ్యెను గీచకగ్రంథు లేడుఁ, దత్క్షణమ ధుంధుకారి ప్రేతత్వ ముడిగి
దివ్యరూపంబుతోడను దేజరిలుచుఁ, జలిపి గోకర్ణునకు నమస్కారములను. 1338

గీ. తండ్రి ప్రేతత్వ ముడిగె నీదయను నాకు, నన్నుఁ దరియింపఁజేసినపున్నెమునను
ధన్యతను బొందితివి నీవు ధన్యతమము, భాగవతము సప్తాహంబు పావనంబు. 1339

గీ. వినినమాత్రనె సప్తాహ మనెడిమాట, కంపమును బొందుఁ బాపసంఘంబు లెల్ల
భరతవర్షంబులోపల భాగవతము, విననివారలజన్మంబు వితయ చూవె. 1340

ఆ. సర్వకర్మములును సంక్షయంబును జెందు, సంశయంబు లెల్ల సమసిపోవు
ఛిన్నభిన్నమై నశించు మనోగ్రంధి, వినిన భాగవతము వీనులార. 1341

క. అని పలుకుచుండ హరిభట, జనులు విమానంబు నెక్కి చనుదెంచి రయం
బున నందు ధుంధుకారిని, నునిచి కొని చనంగి దివికి నుద్యుక్తులు గాఁ. 1342

సీ. వారిని గని నమస్కారంబు గావించి, గోకర్ణుఁ డత్యంతకుతుక మొదవ
విష్ణుకింకరులార వీనితో సాటిగ, భాగవతము విన్నభక్తజనులు
కల రసంఖ్యాకు లిక్కడ వీరి నెల్లరఁ, గొనిపోవ రేల వైకుంఠమునకు
ననవుడు వార లి ట్లనిరి సప్తదినంబు, లుపవాస మొనరించి యుక్తముగను

గీ. శ్రవణ మొనరించి దిన మెల్ల రాత్రివేళఁ, జలిపె మననంబు నీతఁడు శ్రద్ధతోడఁ
గాన వీనికి వీరికిఁ గలిగె శ్రవణ, భేద మాహేతువున ఫలభేద మొదవె. 1343

సీ. హతము దార్ఢ్యవిహీన మైనజ్ఞానము ప్రమా, దప్రాప్త మైనశ్రుతంబు హతము
హతము సందిగ్ధ మైనట్టిమంత్రంబు వై, ష్ణవశూన్య మైనదేశంబు హతము

హతము పాత్రవిహీన మైనశ్రాద్ధము సదా, చారంబు లేనివంశము హతంబు
హతము పాత్రున కీయనట్టిదానము నిశ్చ, లముగఁ జేయనిశ్రవణము హతంబు

గీ. సత్వరంబుగఁ జేసెడిజపము హతము, మంత్రవిశ్వాసవిరహితమతి హతంబు
కాన యీ రెల్లశాస్త్రయుక్తముగ మరల, శ్రవణ మొనరింప వైకుంఠసదన మొదవు.

క. అని తెల్పి విష్ణులోకఁ, బున కేఁగిరి విష్ణునామములఁ గీర్తనముల్
బొనరించుచు నట నుండిన, జను లెల్లరుఁ జూచు చుండ సంతోషమునన్. 1345

సీ. అంతట గోకర్ణుఁ డచటనె మరల శ్రా, వణమాసమున భాగవతము భక్తిఁ
జదువంగ మొదలిడి సప్తాహమునయందు, ముగియించె జగ మెల్ల ముదము నొంద
నంతిమదినమున నచ్యుతుం డేతెంచి, సపరివారముగ దర్శన మొసంగి
యెక్కించి శ్రోతల నెల్ల దివ్యవిమాన, ములయందు వైకుంఠమునకుఁ బనిచి

గీ. తనవిమానంబునం దుంచికొని ప్రహర్ష, మెనయ గోకర్ణుని సుపర్వు లెల్లఁ బొగడ
నరిగె గోలోకమునకు నత్యద్భుతముగ, భాగవతసేవచేఁ గల్గుఫలమె ఫలము. 1346

వ. ఆషాఢశ్రావణభాద్రపదాశ్వయుజకార్తికమార్గశీర్షమాసంబులు భాగవతశ్రోతలకు మోక్షదాయకంబులు. శ్రవణారంభమునకు సూతిసూతకసంభవంబునంజేసి ద్వాదశి వర్జనీయంబు. భౌమశనివారంబులును ధ్రువమృదునక్షత్రంబులును త్యాజ్యంబులు. సప్తాహశ్రవణంబునకు భక్తాహ్వానం బవశ్యకర్తవ్యంబు. తీర్థవనగృహంబులు శ్రవణార్హస్థానంబులు. పాషండవాదులును నాస్తికులును శ్రవణానర్హులు. సప్తాహమధ్యంబున క్షౌరమైథునాదికార్యంబు లప్రశస్తంబులు. మండపంబున విష్ణుప్రతిష్ఠ గావించి విష్ణుపూజయును భాగవతగ్రంథపూజయును నిత్యంబును సంగ్రహంబుగాఁ గావించి భాగవతంబు పఠింపందగు. శ్రవణారంభంబున ద్వాదశాక్షరవిష్ణుమంత్రజపంబును వక్తృపూజయును నియమగ్రహణంబును శ్రోతలకు ముఖ్యంబులు. 1347

గీ. విష్ణుసంకీర్తనంబు గావించునట్టి, భాగవతులయనుజ్ఞను బడసి యున్న
తాసనంబునఁ గూర్చుండ నగును వక్త, యతని శుకదేవునిఁగ నెంచ నగును శ్రోత.

వ. సూర్యోదయంబు మొదలుకొని సార్ధత్రిప్రహరాంతంబువఱకును బఠనంబు కార్యంబు. మధ్యాహ్నంబున ఘటికాద్వయంబు విరామంబు గొనందగు. సప్తరాత్రంబును నుపవాసంబు గావించి శ్రవణంబు గావింపందగు. శక్తిలేనియెడల ఘృతపాయసంబునంగాని పయఃపానంబునంగాని ఫలాహారంబునంగాని యేకవారభుక్తింగాని శ్రవణంబు గావింపనగు. సప్తాహవ్రతస్థులు వ్రతనియమంబులం గైకొనందగు. 1349

క. వినవలయు భాగవతమును, ననపత్యులు మోక్షకాము లరవిహీనుల్
జనవశకాంక్షులు రుగ్ణులు, వనజాక్షునికేతనాధివాసాపేక్షుల్. 1350

క. శుకశాస్త్రశ్రవణంబున, సకలప్రతిబంధములును క్షయమున్ జెందున్
సకలాఘములును దొలఁగును, సుకరంబుగ నొందఁగలుగు శోకజయంబున్. 1351

వ. ఫలకాంక్షులు జన్మాష్టమీవ్రతంబునకుంబోలె సప్తాహశ్రవణంబున కుద్యాపనంబు గావింపవలయు. నిష్కాములగు భక్తుల కుద్యాపనావశ్యకత లేదు. సప్తాహయజ్ఞపరిసమాప్తియందు గ్రంథపూజయును వక్తృసమ్మానంబును గోభూహిరణ్యాదిదానంబులును గావింపందగు. గృహస్థుండైనచో దశమస్కంధంబునందలి ప్రతిశ్లోకంబునకును మధుపాయసఘృతతిలాన్నహవిర్ద్రవ్యంబులచేఁ గర్మశాంతికొఱకు హోమంబు గావింపంజను. హోమాశక్తుండైనఁ దత్ఫలప్రాప్తికై హోమద్రవ్యదానంబు గావించి సర్వలోపనివారణార్థంబు విష్ణునామసహస్రపారాయణంబు చేసి ద్వాదశబ్రాహ్మణులకు భోజనముం బెట్టవలయు. శక్తుండైనయెడల పలత్రయపరిమితం బగుసువర్ణసింహంబును లిఖితభాగవతగ్రంథంబును బూజించి యాచార్యున కర్పింపవలయు. విరక్తుండైనచో సప్తాహపరదినంబున గీతాపఠనంబు గావింపవలయు. కలియుగంబునఁ ద్రింశద్వర్షకాలంబు గడచినపిదప భాద్రపదశుద్ధనవమినాఁడు శుకుఁడు పరీక్షిత్తునకును ద్విశతవర్షకాలంబు గడచినపిమ్మట నాషాఢశ్రావణశుక్లనవమీదినంబులందు గోకర్ణుండు బ్రాహ్మణులకును షష్ఠ్యుత్తరత్రిశతవర్షకాలంబు గడచినతరువాత కార్తికశుక్లనవమినాఁడు సనకాదులు నారదునకును సప్తాహవిధానంబున భాగవతకథ వినిచి కృతార్థులం గావించిరి. 1352

క. శుకశాస్త్రముకంటెను వే, ఱొకమార్గము లేదు భవపయోధిని మగ్నుల్
సుకరముగఁ బార మొందఁగ, బ్రకటింపఁగ నేటి కింక బహుభాషణముల్. 1353

—: కాళిందీమాహాత్మ్యము :—

క. అని పలుకుటయును శౌనక, మునివర్యుఁడు పొందె హర్షమును సూత వినం
గను యమునామాహాత్మ్యము, జనియించెను వేడ్క చెపుము సవిశేషముగన్.

వ. అని కోరుటయు సూతుం డాతని కిట్లనియె. 1355

సీ. తాపసోత్తమ మున్ను ధర్మజుం డొకనాఁడు, సౌరభికడ కేఁగి సవినయముగ
నొనరించి వందనంబును స్వామి విన నాకు, యమునామహత్త్వము నాశ గలిగె
ననవుడు సౌరభిమునివరుండు ప్రమోద, మెనయంగ నాతని కిట్టు లనియె
ధర్మజ వినుమొకతఱిని బర్వతనార, దులు పోవుచును నభస్స్థలమునందుఁ

గీ. గాంచి ఖాండవవనము నక్కడను డిగ్గి, స్నాన మొనరించుచుండంగ జమునలోన
వేటకై శిబి వచ్చి యావిపినమునకు, నామునీంద్రులఁ గనుఁగొని యమునలోన. 1356

గీ. చలిపి స్నానంబు ధౌతవస్త్రములు వారు, కట్టుకొని వచ్చునందాఁక నట్టె నిలిచి
వారు తత్తీరమునకు నేతేర నంతఁ, దత్పదాంబుజములకు వందన మొనర్చి.

సీ. శమధనులార యీయమునాతటంబున, స్వర్ణయూపంబు లసంఖ్యముగను
గనఁబడుచుండె నిక్కడ యజ్ఞముల నెవ్వ, రొనరించి నిల్పి రీయూపములను

నిచట నున్నవిశేష మేమియొ దయతోడఁ, దెలుపుఁడు దీన నాకుఁ గలిగె వేడ్క-
యని వేఁడుటయు నిట్టు లనియె నారదుఁడు భూ, వర వచించెదను సర్వమును వినుము
ఆ. మును హిరణ్యకశిపుఁ డనుదైత్యనాథుఁడు, త్రిదశులను జయించి దివముఁ గొనఁగ
నపుడు హరి నృసింహుఁడై వాని వధియించి, యిచ్చె మరల దివము వృత్రహునకు.
సీ. అంతట వజ్రి బృహస్పతికడ కేఁగి, సాష్టాంగవందన మాచరించి
యాచార్య తలఁచితి నధ్వరంబులు సేయ, నావహిల్లఁగఁ దృప్తి యచ్యుతునకుఁ
దత్క్రియార్హం బగుధామంబు నెఱిఁగింపు, మని వేఁడుటయు నిట్టు లనియె గురువు
కలదు పావనమైనఖాండవవన మిల, నట నుండె యమున పుణ్యస్రవంతి
గీ. తలఁచునెడ దాని స్వర్గంబు గలుగు నచటఁ, దనువు విడిచిన బ్రహ్మపదంబు గలుగుఁ
దత్తటంబునఁ జేయు మధ్వరము లోదవు, హరికి సంతృప్తి సేయను నగు శుభంబు.
సీ. అని వచింపఁగ నింద్రుఁ డాహ్లాద మొదవంగ, నచటికి సురలతో నేఁగుదెంచి
ఋత్విజులుగ వరియించి బ్రహ్మర్షుల, నారంభ మొనరించె నధ్వరంబు
నపుడు విష్ణువు బ్రహ్మహరులతోడను గూడి, యరుదేర వారికి హరిహయుండు
కావింపఁదగినట్టిగౌరవం బొనరించి, దితితనూభవవైరిదిక్కు- చూచి
గీ. జలజలోచన మూఁడుమూర్తులును నీవె, విధియు హరుఁడును నీకంటె వేఱు గారు
స్ఫటికమునకు బహుత్వ మేర్పడినయట్లు, గలిగె నీకు నుపాధులవలన బహుత. 1360
గీ. కాష్ఠములలోన గూఢంబు గాఁగ నుండు, నగ్ని ఘర్షణమున వచ్చునట్లు పైకి
నఖిలభూతాంతరాత్ముఁడవై ననీవు, ప్రాప్తమగుదువు కేవలభక్తిచేత. 1361
క. వారు తరింపంగలిగిన, వారీజగమంతయును నవాస్తవ మని ని
ర్ధారణము సేసికొని యె, వ్వారలు భజియించెదరొ భవత్పాదములన్. 1362
వ. అని సన్నుతించుటయు నమందానందంబు నొంది పుండరీకాక్షుం డి ట్లనియె. 1363

—: ఇంద్రప్రస్థమాహాత్మ్యము :—

సీ. శక్ర కోరికతోడఁ జలుపుటచే మున్ను, క్రతుశతంబును స్వర్గరాజ్య మొదవెఁ
గడఁగితి నేఁడు నిష్కామంబుగను జేయఁ, గ్రతువుల సంతృప్తి గలుగ నాకు
నచ్చెరియము నొంద నక్కఱలే దిందు, గురువగుటను జేసి గురువు నీవు
సలుపుచు బహుయజ్ఞముల నిట్టి యందు ర, త్నప్రస్థముల నిమ్ము దక్షిణలుగ
ఆ. దాన నీస్థలంబు దాల్చు నింద్రప్రస్థ, మనెడిపేరు తావకాఖ్య వెలయ
సర్వయజ్ఞములను జలిపినపిమ్మటఁ, బ్రాప్తమగు మదీయపదము నీకు. 1364
సీ. స్రష్ట ప్రయాగతీర్థము నిల్పు మిచ్చోట, గంగాసరస్వతీసంగతము గ
కాశిశ శివకాంచిఁ గాశి నిచ్చట నుంచి, యమునతోడ నీవును నుండు మిందె
బ్రహ్మాత్మభవులార భవదీయమహిమచేఁ, జలుపుఁ డిచ్చటఁ దీర్థసప్తకంబు
నమరలోకసృజింపుము నిగమోద్బోధ, కం బనుపుణ్యతీర్థంబు నిచట

గీ. మునిఁగినంతనె త్వత్తీర్థమున లభించుఁ, జదువ కున్నను వేదముల్ శాస్త్రములును
బూర్వజన్మస్మృతియు నబ్బుఁ బూర్ణముగను, నేను ద్వారక నిచ్చోట నిలుపువాఁడ.

వ. నాద్వారకాపురంబున గోమతీసముద్రసంగమంబు గలుగు. మఱియును నే నిచ్చటఁ గోసలయును మధువనంబును బ్రతిష్ఠించి వానిలో రామకృష్ణనామంబులతోడ నవతరింతు. మఱియును నరనారాయణాస్పదం బగుబదర్యాశ్రమంబును హరిద్వారంబును బుష్కరంబును నైమిషారణ్యకాలంజరాద్రిసరస్వతీమహానదీతటంబులుం దుండుతీర్థంబు లన్నియును నిచ్చట నెలకొల్పువాఁడ. 1366

సీ. అని పల్కుటయును వెంటనె యుక్తకార్యంబు, లన్నియు జరిగె నత్యద్భుతముగ
శక్రుఁ డివ్వోట నసంఖ్యాకమఖములఁ, జేసి వైకుంఠుండు చెప్పినట్లు
స్వర్ణయూపంబుల స్థాపించె నిచోటు త, దాది యింద్రప్రస్థ మనఁగఁ బరగె
నధ్వరాంతమున బ్రాహ్మణులు వాసవదత్త, సత్కారములకు హర్షమును బొంది

గీ. యింద్రున కనుగ్రహించిరి యిలను బుట్టి, యవనిసురుఁడుగఁ దుదిఁ దురీయాశ్రమంబుఁ
బడసి నిజతీర్థమును జొచ్చి పడసి పూర్వ, జననసంస్మృతి మోక్షంబు నొనయునట్లు.

సీ. అంతట వాసవుం డరిగి స్వర్గమునకు, హరిచింతనాసక్తుఁ డగుచు నచటఁ
బాలించి యొకకొంతకాలంబు సురలను, దత్పుణ్య ముడుగంగఁ దత్క్షణంబ
ధరణిలో హస్తినపురమందు శివశర్మ, యనెడిబ్రాహ్మణునకు నాత్మజుఁడుగ
జనియించె సుముహూర్తమున నంత శివశర్మ, దైవజ్ఞుఁ డగుటఁ దద్భావ్య మెఱిఁగి

గీ. యాతనికి విష్ణుశర్మాహ్వయంబుఁ బెట్టి, యుక్తకాలంబున నొనర్చి యుపనయనము
ద్వాదశాబ్దంబువఱకు వేదములఁ జెప్పి, సాంగముగఁ బిమ్మటను వివాహంబు సేసె.

గీ. అంతటను విష్ణుశర్మ గృహస్థవిధుల, నాచరించుచుఁ దనసతియందు నొక్క
యాత్మజునిఁ గాంచి సంసారమందు విరతి, గల్గుటను దనజనకునికడకుఁ జేరి. 1369

సీ. తండ్రి స్వాధ్యాయసంతతులచేత ఋణద్వ, యంబు దీర్చెడిభాగ్య మబ్బె నాకు
సంసారసుఖములు జలబుద్బుదాభముల్, సక్తుఁడు గాఁ డండె సతము బుధుఁడు
హరితృప్తికై తీర్థయాత్ర గావించి స, న్న్యాసంబు గైకొని యంతమందుఁ
బ్రారబ్ధ ముండెడునంతదాఁకను నుండుఁ, దెలుచుచు హరి నొకతీర్థమందు

గీ. నాజ్ఞ యొసఁగుము పోయెద నని వచింప, విబుధుఁ డగుటను శివశర్మ విని తదుక్తు
లెనయఁగను సంతసం బుంచి గృహభరంబు, స్వద్వితీయాత్మజుఁ డగుసుశర్మ మీఁద

ఆ. విష్ణుశర్మతోడ వెడలిపోయి యొనర్చి, తీర్థయాత్ర జన్మసార్థకతకు
నేఁగుదెంచెఁ గడకు నీతీర్థమున కాత్మ, పుణ్యవశముచేత బుద్ధిపుట్ట. 1371

ఆ. అపుడు విష్ణుశర్మ యది చూచి పూర్వజ, న్మస్మరణము గలుగి విస్మయముగ
జనక నేను మున్ను శక్రుండ నై యిటఁ, జలిపినాఁడ భూరిసవనములను. 1372

సీ. యమునాతటంబునయందుఁ గానంబడు, స్వర్ణయూపములు మత్స్థాపితముల
స్రష్ట గంగాసరస్వతులతో నీస్థాన, మం దేర్పఱిచినప్రయాగ మదియె

భర్గుఁడు తత్పూర్వభాగంబునందు మో, క్షదము గా నుంచినకాశి యదియె
తత్పశ్చిమముగను ధనురేకవింశతి, క్షమ నుగ్రకృతశివకాంచి యదియె
గీ. దానికి ధనుర్ద్వయీమితధాత్రియందుఁ, ద్రిపురహరకృతగోకర్ణతీర్థ మదియె
దానికి శరాసనప్రతిమానధరను, గృష్ణుఁ డుంచినద్వారకాక్షేత్ర మదియె. 1373
గీ. ద్వారకాక్షేత్రచాపప్రతిమితోర్వి, యందు మ్రందఁ జతుర్భుజుం డగుఁ నరుఁడు
కాశిలోన ద్విపంచాశదాశుగాన, మహిని జచ్చిన మరల జన్మంబు లేదు. 1374
వ. ద్వారకకుఁ బూర్వదిగ్భాగంబునం దష్టాదశధనుర్మితప్రదేశంబునందుఁ గోసలయును గోసలాపశ్చిమభాగంబున దశచాపప్రమాణదేశంబున మధువనంబును దాని కుత్తర భాగంబున నేకాదశధనుఃప్రదేశంబున బదర్యాశ్రమంబును దానికి దక్షిణంబుగాఁ ద్రింశద్ధనుఃప్రదేశంబున హరిద్వారంబును దానికి ద్వాదశేష్వాసమాత్రభూభాగంబునఁ బుష్కరతీర్థంబును బ్రయాగంబునకుఁ బూర్వంబుగా నేకగవ్యూతిమాత్రప్రదేశంబున సప్తర్షుల సప్తతీర్థంబులును గలవు. కాశీతీర్థసప్తకంబులం దనేకపుణ్యతీర్థంబులు గలవు. ప్రయాగంబునకుఁ బశ్చిమంబుగా నేకగవ్యూతిమాత్రప్రదేశంబున బృహస్పతిస్థాపితం బగు నిగమోద్బోధకతీర్థంబు గలదు. కాళిందికిఁ బూర్వపశ్చిమభాగంబులం దేకయోజన విస్తృతియును దక్షిణభాగంబున యోజనచతుష్టయవిస్తృతియును నింద్రప్రస్థంబునకు మర్యాదగా మహర్షులచే నేర్పఱుపంబడియె. మత్కృతియజ్ఞంబులందు నేను బ్రాహ్మణోత్తములకు రత్నప్రస్థంబు లొసంగుటచే నీస్థానం బింద్రప్రస్థనామమునం బడసి పుణ్యతీర్థం బయ్యె. అమ్మాహాత్మ్యలు నా కివ్వోటఁ బూర్వజన్మస్మృతి చేకూరునట్లును దనుత్యాగం బగునట్లును హరిపదంబు చెందంగలుగునట్లును నను గ్రహించుటంజేసి నేను నాపూర్వవృత్తాంతంబు నెఱుంగంగలిగితి. నిగమోద్బోధకంబునందు స్నానంబు గావించితి నేని సర్వంబును విదితం బగు నని చెప్పుటయును శివశర్మ కౌతుకంబునఁ దత్తీర్థంబునందు మునుంగ నుద్యమించుచుండ భీతుండై పరువెత్తుకొనివచ్చునొక భిల్లుండును వానివెంటంబడి గర్జించుచు నరుదెంచునొక్కసింహంబును గానంబడియె.
సీ. అప్పుడు వడఁకుచు నాశివశర్మయు, నావిష్ణుశర్మయు నాశ లుడిగి
యెట్లొ తటుక్కున నెక్కి రత్తటి, సంస్థితం బగునొక శాఖిమీఁద
నంతట నాభిల్లుఁ డటకు వచ్చెడునంత, లోన సింహము దూఁకి వానిఁ బట్టె
నపుడు వాఁ డుడిగి ప్రాణాశ నెట్టులొ దానిఁ, బొడిచి కుంతమునఁ దాఁ బడియె భువిని
గీ. కుంతఘాతంబునకు వ్రీల గుండె సింహ, ముడిగె నసువుల వాఁడును మడిసె నంత
భిల్లునకు సింహమునకుఁ బ్రాప్తించె దివ్య, దేహములు పూర్వజన్మస్మృతియును గలిగె.
వ. ఆసమయంబున విష్ణుభటులు దివ్యవిమానంబులతోడఁ దదంతికంబునకు విచ్చేసి విమానంబుల నెక్కుం డని వేఁడుటయు నాభిల్లసింహంబులు వారలం జూచి. 1377
సీ. హరిభటులార పాపాత్ముల మగుమాకు, నీదివ్యదేహంబు లేల కలిగెఁ
బూర్వజన్మజ్ఞానమును నెట్లు చేకూరె, వినిపింపుఁ డని వేఁడ విష్ణుభటులు

కని వారె నీతీర్థమునఁ జచ్చుటనుజేసి, ప్రాప్తించె మీ కీమహత్త్వ మెల్ల
నిందు మ్రుందినవారి కెల్ల నీమహిమంబు, సమకూరఁ గరుణించె శౌరి మున్ను
గీ. శీఘ్రముగ రండు మాధవసేవచేయు, సమయ మయ్యెడి నన వారు ప్రమద మొదవ
నెక్కి దివ్యవిమానంబు లేఁగి విష్ణు, పురమునకుఁ జేరి రాశ్చర్యకరము గాఁగ. 1378
గీ. అది కనుంగొని విస్మయ మావహిల్లఁ, దండ్రియు సుతుండు దిగిరి పాదపమునుండి
యంత శివశర్మ తత్తీర్థమందు మునిఁగి, సలిపి సంధ్యాదివిధులను సక్రమముగ. 1379
వ. తత్తీర్థస్నానంబునఁ బూర్వజన్మస్మృతి కలుగుటంజేసి యచ్చెరువుపాటొందుచుఁ దత్తీ
రంబునం దుపవిష్టుండై విష్ణుశర్మం గాంచి యి ట్లనియె. 1380
గీ. తనయ నీమాట తథ్యంబ మునిఁగినంత, మాత్రమున నిందుఁ బూర్వజన్మప్రవృత్తి
యంతయును గోచరం బయ్యె నద్భుతముగ, వినుము సర్వంబు వినిచెద విశదముగను.
సీ. పూర్వము భూతలంబున నుండెఁ గాన్యకు, బ్జంబు నాఁగను నొక్కపట్టనంబు
దానిలో శరభాభిధానంబునను నొక్క, యారవ్యుఁ డుండె నత్యుత్తముండు
వార్ధకం బొదవ నావైశ్యుండు చింతింపఁ, దొడఁగెఁ బుత్రులు లేమి కెడఁదలోన
నటు లుండ నొక్కనాఁ డతనియింటికి వచ్చె, దేవలుం డనుయోగి దైవికముగ
గీ. నపుడు శరభుండు యోగి కత్యాదరమునఁ, బూజ గావించి తనచిత్తమునఁ గలట్టి
చింత యెఱిఁగింప నమ్మౌని కొంతతడవు, ధ్యాన మొనరించి సర్వంబుఁ దా గ్రహించి.
సీ. ఆర్య చెప్పెద విను మంతయు నొకనాఁడు, త్వత్పత్ని సుతవాంఛ దనర మదినిఁ
జని చండికాలయంబునకుఁ బార్వతి భవ, త్కరుణచేతను నాకు గర్భ మైన
నుత్సవంబును నీకు నొనరింతు నధికమై, భవముతోడను భవద్భవనమందు
నని మ్రొక్కి యింటికిఁ జనుదేర నామాస, మందె యామెకు గర్భమయ్యె నంత
గీ. నామె నీకడ కేతెంచి ప్రాణనాథ, గౌరికారుణ్యమున నాకు గర్భమయ్యెఁ
గాన నామెకు నుత్సవం బేను జరుప, వలయును దదాలయంబున నలర దేవి. 1383
సీ. అని తెల్పుటయును నత్యానందమును బొంది, నీ వాయమను గాంచి నీరజాక్షి
పరికరంబుల నెల్లఁ బనిచి నీసఖులచే, జరిగింపు మంబికోత్సవము నచట
ననవుడు నాయింతి తనసఖులను బంప, వా రేఁగి చండికాగారమునకు
జరిపి శర్వాణి కుత్సవమును జనుదెంచి, తెలిపి రావార్త నీచెలికి నీకు
గీ. వారు వచ్చినతరువాత వారిసేవ, కాత్మలో గౌరి సంతృప్తి నందకునికి
నెఱిఁగి తద్భృత్య విజయ తా నిట్టు లనియెఁ, దల్లి సంతృప్తిఁ గొలిపెనె తత్సపర్య.
వ. అని సవినయంబుగా నడుగుటయు శర్వాణి యామె కి ట్లనియె. 1385
సీ. విజయ చెప్పెద నీకు వినుము వైశ్యాంగన, నిజసఖీముఖమున నేఁడు నాకు
జరిగించినట్టియుత్సవ మెల్ల వ్యర్థంబ, దానఁ దద్గర్భపాతంబు గలుగుఁ
బరహస్తకృత మైనబలి గాదు మాదృగు, త్తమదేవతాతృప్తిదాయకంబు
నావుడు విజయ ఖిన్నస్వాంత యై దేవి, యటు లైన నామె కెట్లగు శుభంబు

గీ. కనికరముతోడ వచియింపు మనుడుఁ జేటి, ధ్యానమె యైనను దద్భర్త యైన లేక
తన్నియుక్తద్విజుం డైనఁ దగుసపర్య, చేయునెడ సేమమగు నని చెప్పె గారి.

గీ. ఆమెశాపంబు తెలియమి నయ్యె నింత, కాల మీరీతిఁ జింతింపఁ గారణంబు
కాన నిపు డేఁగి మీరలు గోరికడకు, సేవ గావింపుఁ డగు నిష్టసిద్ధి మీకు. 1387

గీ. మును వసిష్ఠప్రబోధంబునను దిలీపుఁ, డర్చన యొనర్చి నందిని కతివతోడఁ
బడసెఁ బుత్రుని నట్టులె పడయఁగలవు, సుతుని నర్చించి యుమను నీసుదతితోడ.

క. అని వినుచుటయును శరభుఁడు, మనమున సంతోష మొంది మౌనీంద్ర వినం
గను వేడుక గల్గె దిలీ, పుని చరితము చెపుము సాంతముగ నా కనియెన్. 1389

—: దిలీపచరిత్రకథనము :—

సీ. అనుడు దేవలుఁ డిట్టు లనియె వణిగ్వర, మహిని వైవస్వతమనుకులమున
జనియించెను దిలీపుఁ డనుతేఁడు స్వాయంభు, వ మనువంశంబున వజ్రిపోలె
వజ్రికి శచిపోలె వానికి మగధేశ, తనయ సుదక్షిణ దారయయ్యెఁ
గోసలాధీశుఁడై కువలయం బెల్లను, రక్షింపఁ దొడఁగె ధర్మమున నతఁడు

గీ. చనఁగ బహుకాల మావిధంబుననె యొక్క, తనయుఁ డేనియు జన్మింప కునికి మదిని
జింత యేర్పడ నొకనాఁడు కాంతతోడఁ, జని వసిష్ఠాశ్రమమున కాజనవిభుండు. 1390

సీ. ఒనరించి వందనంబును వసిష్ఠునకుఁ ద, త్సంభావితుం డయి సముచితముగ
గురువర యేలితి ధరణి నేకాతప, త్రముగఁ జేసితి సప్తతంతువులను
సంతృప్తిపఱచితి ధాత్రీసురులను నన్న, దానగోభూస్వర్ణదానములను
దీనులఁ బోషించితిని గోశమును బెంచి, తిని ధర్మసంభృతధనముచేతఁ

గీ. ప్రచురముగ సత్త్రములను నారామములను, జెఱువులను బావులను బ్రతిష్ఠించినాఁడ
సర్వలోకసుఖంబె మత్సౌఖ్యముగను, దలఁచి లోపంబు లేకుండ మెలఁగినాఁడ. 1391

ఆ. కాని నాకు సుతుఁడు లేనిలోపముమాత్ర, మఖిలసౌఖ్యములను నడఁగఁద్రొక్కె
దాన జీవితంబుపై నాశయును దగ్గె, నేమి చేయఁదగునొ యింకఁ జెపుమ. 1392

క. అనుడు వసిష్ఠుఁడు కనికర, మెనయఁగ మదిలోన దివ్యదృష్టిని సర్వం
బును గనుఁగొని యాతని కి, ట్లనియెను రాజేంద్ర విషయ మంతయుఁ దెలిసెన్.

సీ. మును నీవుపాకశాసనునియొద్దకుఁ బోయి, సల్లాప మొనరించుసమయమందు
జ్ఞప్తికి రా ఋతుస్నాత యైనత్వదీయ, పత్ని శీఘ్రంబుగా బయలుదేఱి
వచ్చుచుండఁగ నిజావసథంబునకు మార్గ, మునఁ గల్పపాదపమూలమందు
శయనించి యుండంగ స్వర్గధేనువు దాని, కాచరింపక ప్రణామాదివిధుల

గీ. నరుగుదెంచితి వద్దాన నది మదీయ, సంతతిని నీవు సేవింపనంతవఱకు
నుండెదవుగాక పుత్రహీనుండ వగుచు, నని శపించె జనింప లో నాగ్రహంబు. 1394

గీ. కాన నిప్పుడు తత్పుత్రికాతనూజ, యైననందినికి సపర్య యాచరించి
శాపముక్తుండ వై కీర్తిశాలి వైన, సుతునిఁ బడయుము వంశవిస్తృతి ఘటిల్ల.
క. అని పలుకుచుండఁగనె నం, దిని వచ్చె వనంబునుండి దిగ్గున శుభసూ
చనముగ వత్సస్నేహం, బునఁ బొదుగుననుండి పాలు పొటపొటఁ గురియన్. 1396
సీ. అపుడు వసిష్ఠుఁ డిట్లనియె రాజ స్మరించి, నంతనె నందిని యరుగుదెంచె
దీనిచేఁ గార్యసిద్ధిని శీఘ్రముగ నీవు, చెందెదు లే దిందుసందియంబు
సేవింపు మిద్దానిచెంతనె యుండి యె, ప్పుడును బ్రమాదంబుఁ బొందకుండ
ననుడు దిలీపుఁ డమ్మునియానతిని దదా, శ్రమమునందె వసించి చానతోడ
గీ. నవలినాఁట నుషఃకాలమందు లేచి, జాయయును దాను వత్సద్వితీయ యైన
నందినీధేనువునకు నానంద మొదవఁ, బూజఁ గావించిరి సువర్ణపుష్పములను. 1397
సీ. అంతట నందిని యడవికిఁ బోవంగ, బయలుదేఱెఁగఁ జాపబాణములను
గేల దిలీపుఁడు దాలిచి తత్పృష్ఠ, భాగంబునను ఛాయపగిది నుండి
యది చనఁ దా నేఁగు నది మేయుచుండ ఘా, సముఁ దినుఁ గందమూలములఁ దాను
శయనింప నది తరుచ్ఛాయఁ దాఁ గూర్చుండుఁ, ద్రావఁ దోయము నీరు త్రాగుఁ దాను
గీ. సమయము నెఱింగి పెట్టు ఘాసమును గోకుఁ,బోవఁ గండూతి దంశముల్ పోవఁద్రోలుఁ
దుడుచుఁ జెమ్మట వలువచేఁ గడుగు మేను, సేవకుఁడు వోలెఁ బరిచర్య చేసె నతఁడు.
ఆ. అట్లు ప్రొద్దు గ్రుంకు నందాఁక నట నుండి, ధేను వంత బయలుదేఱ నతఁడు
దానివెంట వచ్చెఁ దత్ఖురోత్థితరజః, కణపవిత్రితాత్మకాయుఁ డగుచు. 1399
గీ. అంత నా నందిని తదాశ్రమాంతికమున, కేఁగుదేర సుదక్షిణ యెదురు వచ్చి
ప్రణతి గావించి సలిపి యర్చనము దాని, కెదుట నిలువంగఁ గేలుదోయిని మొగిడ్చి.
గీ. అపుడు నందిని సంతోష మామతిల్ల, నాశ్రమంబుఁ బ్రవేశించె నంత దాని
వెంట నాదంపతులు వచ్చి వివిధగతులఁ, జలిపి రాగోవునకుఁ బరిచర్య రేయి. 1401
వ. ఆవిధంబున నేకవింశతిదినంబులు గడవ ద్వావింశదినంబున నందిని వనంబున యథాపూ
ర్వంబుగాఁ దిరుగుచు భూపతిభావంబు నెఱుంగం దలంచి హిమవద్గుహాంతికంబునకుం
జనియె. 1402
సీ. అంతటఁ దద్గుహాభ్యంతరముననుండి, యొకసింహ మేతెంచి యుద్భటముగ
నందినిపైఁ బడ నరనాథుఁ డది చూచి, సంభ్రమంబును బొంది స్వాంతమందు
దానిఁ గూల్పఁదలంచి తనదక్షిణకరంబు, నిషుధిలోపలఁ జొన్పి యిషువు లాగి
చాపంబునను దాని సంధించి జ్యాకర్ష, ణము చేయుచుండెడిసమయమందు
గీ. స్తంభితం బయ్యె హస్త మద్దాన తేఁడు, విడువ శరము నశక్తుఁడై విస్మయంబుఁ
జెందుచుండంగ నతని నీక్షించి క్రూర, దృష్టితోడను నాసింహ మిట్టు లనియె. 1403
సీ. వీర దిలీప నీవీర్యంబు నెఱుఁగుదు, రవివంశజుం డైన ప్రభుఁడ వీవు
కుంభోదరుం డనుశంభుదాసుఁడ నేను, దరి నున్న యీదేవదారుతరువు

పాలింపఁబడుచుండఁ బార్వతిచేతఁ బు, త్రప్రేమమున నొక్కతరుణమందు
నిట కొక్కసామజం బేతెంచి కటమున, రాయంగ దీని చర్మంబు వాసె
గీ. నది కనుంగొని పార్వతి యపుడు నన్ను, సింహముగఁ జేసి దీని రక్షించు చుండు
మిటకు వచ్చినజంతువు నెరగఁ గొనుచు, నని యొసంగఁగ నాజ్ఞ నే నట్ల యుంటి.
ఉ. కావున నన్నుఁ గూల్పఁగను గావు సమర్థుఁడ వీవు దైవ మీ
గోవును నేఁడు నాకు నొనఁగూర్చెను భక్ష్యము గాఁగఁ బొమ్ము నీ
త్రోవను నీవు ప్రాణములతోడను మృత్యుముఖచ్యుతుండ వై
నావుడు నానరేంద్రుఁడు వినమ్రతతోడను దాని కిట్లనున్. 1405
సీ. మృగరాజ సర్వజ్ఞభృత్యుండ వగునీకుఁ, దెలియనిధర్మ మెందులను లేదు
గోబ్రాహ్మణుల కొడఁగూడునప్పుడు ప్రాణ, హాని యుపేక్షింప నగునె దాని
వాత్సల్యమున దీని వదలి భుజింపుము, మద్దేహమున నున్నమాంస మెల్ల
నపకీర్తిమలిన మైనట్టియీమేనితోఁ, బ్రదుకంగఁజాల భూభారముగను
గీ. చేకుఱదు దీన ధర్మవిచ్ఛిత్తి నీకుఁ, బ్రాప్త మగు భోజనంబును దృప్తిదీర
నాకును లభించు నుత్తమలోకవసతి, పాయుటను గోనిమిత్తంబు ప్రాణములను.
క. అని వేఁడుటయును సింహము, విని యూరక యుండ ఱేఁడు వెంటనె హర్షం
బున దానియొద్దకుం జని, తనశీర్షము నుంచె సరగఁ దద్వక్త్రమునన్. 1407
ఆ. అపుడు పుష్పవర్ష మంతరిక్షమునుండి, కురిసె దుందుభులును మొరసె దివిని
వెనినిఁ బడియెఁ బుత్ర జీవింపు మనుమాట, యంత నృపుఁడు చూచి యట్టు లిట్లు.
క. కనఁబడక యుండుటను నెం, దును హర్యక్షంబు విస్మితుం డగుచుండం
గను మదిని మనుజభాషణ, మున నందిని యిట్టు లనియె ముద మొదవంగన్.
క. జనవర నీభావంబున్, గనుఁగొన నే నిట్లు మాయ కల్పించి భవ
న్మనమునఁ గలధర్మాగ్రహ, మునకుం బొందితిఁ బ్రమోదమును బూర్ణముగన్.
క. వర మిచ్చెదఁ గోరుము స, త్వరముగ ననుటయు దిలీపధాత్రీంద్రుఁడు త
చ్చరణముల కెరఁగి యన్వయ, కరుఁ డగుపుత్రుని వరంబుగా నిమ్మనియెన్. 1411
సీ. అంత నందిని యట్లె యగుఁగాక యని పల్కె, యూరకుండుటయును నుల్ల మలర
జనవల్లభుం డిట్టు లనియెఁ దల్లి త్వదీయ, వాక్యసుధారసాస్వాదమునను
సంతర్పితుఁడ నైతి సర్వంబు సమకూరె, నీదయాదృష్టిచే నేఁడు నాకు
ధన్యుండ నైతిని త్వత్సపర్యను విశ్వ, జనపూజ్యవిద్యచే జడుఁడువోలె
గీ. నమరధేనుప్రదత్తశాపమును నాకు, వరముగా నయ్యె లేకున్నఁ బరమపూజ్యు
రాల వగునిన్నుఁ గొల్చుభాగ్యమును బుత్ర, లాభమును బొందుయోగంబు లబ్ధ మగునె.
క. అనవుడుఁ దదుక్తులకు నా, నన ముత్ఫుల్లంబు గాఁగ నందిని శీఘ్రం
బున వచ్చె నాశ్రమమునకు, జననాథుఁడు దానివెంటఁ జనుదెంచంగన్. 1413

క. అపుడు సుదక్షిణ దానిక, నపచితిఁ గావించెఁ బూర్వమట్టులె యంతన్
నృపుఁడు గతవిషయమును వి, న్నప మొనరింపఁగ వసిష్ఠునకు నెంచి మదిన్. 1414

సీ. తనపత్నితోడను జని వసిష్ఠునిపాద, పద్మంబులకు మ్రొక్కి భక్తితోడ
నిలువంగఁబడుటయుఁ దిలకించి వారల, ముఖవికాసంబు నమ్మునివరుండు
గ్రహియించి సర్వంబు క్ష్మాతలాధిప కార్య, సిద్ధి యయ్యెనె నాఁగ క్షితివరుండు
జరిగినదంతయు సక్రమంబుగఁ దెల్పి, యిది యంతయును భవత్కృపయె యనియె

గీ. నంతట వసిష్ఠుఁ డతనిధన్యతను బొగడి, యానతిచ్చెఁ బురంబున కరుగ నపుడు
ప్రణతి యొనరించి గురుపాదపద్మములకుఁ, జనియెను దిలీపుఁ డంగనాసహితుఁ డగుచు.

వ. అంత నమ్మాసంబునంద సుదక్షిణాదేవి యంతర్వత్ని యై దశమమాసంబున నొక్క సుముహూర్తంబున వంశవర్ధనుం డగురఘువును గనియె నని చెప్పి చనియె.

సీ. అంతట శరభుఁ డత్యంతహర్షము నొంది, కైకొని పూజోపకరణములను
జని చండికాలయంబునకు నఁగినతోడ, నంబకు దయగల్గునంతవఱకు
సంకల్ప మొనరించి సలుపంగఁ దత్సేవ, నొనరింపఁ దొడఁగె దదుత్సవముల
నట్లు సప్తదినంబు లరుగంగ నారాత్రి, ప్రత్యక్ష మై దేవి ప్రమద మొదవ

గీ. వత్స భువిలోన ఖాండవవనమునందు, నలరెడిని నిగమోద్బోధకాఖ్యతీర్థ
మందు సుతవాంఛతో స్నాన మాచరింపు, మీవు సతితోడఁ గల్గు మీ కిష్టసిద్ధి.

క. మును నేను బుత్రవాంఛను, మునుఁగంగను సప్తదివసములు నియమముతో
డను నిగమోద్బోధకమున, జనియించెను శీఘ్రముగనె స్కందుఁడు నాకున్.

క. అని చెప్పి యదృశ్యత్వం, బును జెందఁగ శరభుఁ డిటకు మోదముతోడన్
జనుదెంచి సతీయుతముగ, మునిఁగి యిచట సప్తదివసములు నియమముతోన్.

గీ. చనియె నింటికి సుతలాభసమ్మదమున, నంతటను నెలలోపల నతనిసతికి
గర్భ మై నవమాసముల్ గడచుటయును, జనన మైతిని దశమమాసమున నేను.

వ. ఈవృత్తాంతం బంతయును దశాబ్దవయస్కుండ నగునాకు నాతండ్రి వచియించె.

ఆ. అవలఁ గొంతకాల మరుగంగ మాతండ్రి, నన్నుఁ బిలిచి యొక్కనాఁడు వత్స
విరతి గల్గె నాకు విషయంబులం దింక, నిలువఁజాల నింట నిమిష మేని. 1422

క. హరిచరణంబులఁ గొలిచెడి, పురుషుఁడు విడనాడి కామముల నెల్ల నిరం
తరమును సంతుష్టుం డై, తిరుగుచుఁ దీర్థములలోన దేహము విడుచున్. 1423

ఆ. పూర్వకృతము లై నపుణ్యపాపములచే, సంభవించుసుఖవిషాదములను
ననుభవించుచును నిరభిలాషముగ జ్ఞాని, కొలుచు హరిని మేను దొలఁగువఱకు.

గీ. చేకుఱదొ యెంతదాఁకను జిత్తసుఖంబు, వృద్ధి గను నంతదాఁక నె విషయవాంఛ
సమకుఱదొ యెంతదాఁకను నమృతలబ్ధి, యభిరుచి జనించుఁ దక్రమం దంతవఱకె.

వ. విహితకర్మంబులు ఫలకాంక్షచేఁ గావించుట ప్రవృత్తి యనియు విహితకర్మంబు లాచరించుచుఁ దత్ఫలంబు నీశ్వరున కర్పించుట నివృత్తి యనియు శాస్త్రంబులందుఁ

చెప్పంబడియె. ఈశ్వరార్పణంబుగాఁ గావింపంబడినకర్మంబులు నిర్దగ్ధబీజంబులువోలె
నంకురింపకుండు. కర్మలయంబె మోక్షంబు. కర్మోత్పత్తియె బంధంబు. 1426

గీ. కాన నే నీశ్వరప్రీతికరము గాఁగఁ, జలుపుచును గర్మములను నిష్కామముగను
జలిపి తీర్థాటనంబు సత్సంగ మౌష, ధము గొనఁదలంచితి భవామయము శమింప.

వ. అని నుడువుటయు నాజనకనకు నే నిట్లంటి. 1428

సీ. తండ్రి స్మరించినంతనె సర్వపాపముల్, శమియింపఁజేయఁగాఁ జాలినదియు
స్పర్శంబుననె త్రివిష్టపము షష్టిసహస్ర, సగరపుత్రులకు నొసంగినదియు
స్నానమాత్రముననె సర్వకర్మక్షయం, బొనరించి మోక్షంబు నొసఁగునదియు
ముక్తికాములచేత భుక్తికాములచేత, విడువక సేవింపఁబడునదియును

గీ. త్రిభువనములఁ బవిత్రీకరించునదియు, నస్మదావాసభూమిస్థ మైనదియును
నైనభాగీరథిని విడనాడి యితర, పుణ్యతీర్థంబులకు నీవు పోవ నేల. 1429

గీ. ఎవనియస్థులు గంగలో నెంతవఱకు, నుండఁగలుగునో దివమున నుండఁగలుగు
నంతవఱకును వాఁడు పాపాత్ముఁడైన, నరకలోకంబులను నెల్లఁ బరిహరించి. 1430

గీ. కాయము దొలంగునెడల గంగాజలంబు, నందు నేనియుఁ దత్తటమందు నేని
ప్రాప్త మగు బ్రహ్మపదము తిర్యక్కులకును, నట్టిగంగను విడనాడ నగునె నీకు. 1431

సీ. అనవుడు నాతండ్రి విని మదీయోక్తుల, నెల్లను గడకుఁ దా నిట్టు లనియె
వినుము వత్స వచింతు విశదంబుగను నీకు, ధరణిస్థసర్వతీర్థములకంటె
ఘన మైనతీర్థంబు కాళింది యని సూతుఁ, డెన్నిమాఱులు వచియింప వింటి
ననవుడుఁ దండ్రివాక్యము నౌదలను దాల్చి, గౌరవంబునను నే నూరకుంటి

గీ. నంత మాతండ్రి సర్వతీర్థాటనంబు, చేసి యరుదెంచి తుదకు నీక్షేత్రమునకుఁ
జలుపుచును ననుదినమును స్నాన మిందుఁ, దలఁచుచును మాధవునిఁ గొన్ని నెలలు గడపి.

వ. ఒకనాఁడు దైవికంబుగా దారుణజ్వరాభిభూతుండై తద్బాధచేఁ జేష్టలుడిగి కొంత
కాలంబునకుఁ దెలివి రా నిట్లు తనలోఁ జింతింపం దొడంగె. 1433

ఉ. అక్కట దిక్కు లేనిగతి యయ్యెను నా కిపు డేమి చేయుదున్
జిక్కు ఘటిల్లె నాసుతుఁడు చెప్పినమాటలు త్రోసిపుచ్చి నే
నిక్కడ కేఁగుదెంచితిని నీ యవివేకముచేత నింతకున్
నక్కలపాలు గా విధి యొనర్చెనొ యేమొ మదీయదేహమున్. 1434

క. ఈ సమయంబున మదగ, వ్యాసంగమపాపమునకుఁ బ్రాయశ్చిత్తం
బాసమెయిం జేయింపఁడె, నాసుతునిసమక్షమందు నాతను వున్నన్. 1435

క. అని బహువిధములఁ జిత్తం, బున వగచుచు లోచనములు మూఁతవడఁగ ను
డినతఱిని నొక్కపాంథుఁడు, చనుదెంచి తదుటజమునకు సత్వరరీతిన్. 1436

క. కనుఁగొని మాతండ్రిని వం, దనముం గావించి మునివతంసమ సాయం
తనవేళను నిద్రింపఁగఁ, జనునె భవాదృశుల కని ప్రసంగింపంగన్. 1437

సీ. అది విని మాతండ్రి యతియత్నమునఁ గనుల్, దెఱచి పాంథునిమోము తేఱి చూచి
తనగాథ యెల్ల నాతనికి నెఱింగించి, తండ్రి నీ కిత్తు నాద్రవిణ మెల్లఁ
గొనిపొమ్ము నాగృహంబున కని ప్రార్థించి, మునుముందుగాఁ గొంత ధనము నొసఁగెఁ
గొని పాంథుఁ డాధనంబును దానిలోఁ గొంత, హరియించి మిగిలినయర్థమునను
గీ. యాప్యయానంబు మోచెడియట్టివారిఁ, దోడుకొని వచ్చి నాతండ్రిఁ దోడుపట్టి
పండుకొనఁబెట్టి శిబికలోపలను దాల్చి, కరమునందు నదస్తీర్థకమలఘటము. 1438
క. దాహ మగునపుడు శిబికా, వాహకులకు మత్పితకును స్వకలశవారిన్
దాహము దీర్చుచుఁ దానున్, దాహము గాఁ దజ్జలంబుఁ ద్రావుచు నడుమన్. 1339
వ. ఈతీర్థంబునుండి కాన్యకుబ్జదేశంబునకుఁ బయనమై శిబికావాహకులు తనవెంట నడువఁ
దాను ముందు నడుచుచు నొకకాననమార్గంబున నేగు చుండ. 1440
క. వికటుం డనియెడిరాక్షసుఁ, డొకఁ డపు డేతెంచి మిగుల నుగ్రుండై శి
బికులను బాంధునిఁ గూల్చి, తెకతేఱఁగఁ ద్రావి తద్రుధిర మెల్లఁ దుదిన్. 1441
సీ. ఆమయగ్రస్తుఁ డై నట్టినాతండ్రిని, భక్షింప నెంచి తత్పార్శ్వమందుఁ
దిలకించి తీర్థాంబుకలశంబు నది కొని, దానిలోనిజలంబుఁ ద్రావి కొంత
తత్క్షణంబునయందె తనకు నచ్చెరియంబు, సంతోషమును గల్గ స్వాంతమందు
స్వప్రాగ్జనిస్మృతి సంఘటిల్లుటయును, ద్యజియించి యాత్మీయదౌష్ట్య మెల్లఁ
గీ. గాంచి నాతండ్రిని మహాత్మ కరుణతోడఁ, జెప్పు మెవఁడవో నీవు నాచేతఁ గూల్పఁ
బడినవీ రెల్ల నెవరో యీపాత్రమందు, నేరుపడియున్నపానీయ మెక్కడిదియొ. 1442
సీ. అనుడు నాతండ్రి యి ట్లనియె రాత్రించర, ప్రవర వైశ్యాన్వయభవుఁడ నేను
శరభుం డనెడివాఁడ జ్వరబాధచేత నేఁ, గుచు నుంటి నాకాన్యకుబ్జమునకు
నితఁడు పాంథుఁడు నాకు హితుఁడు వీరు మదీయ, శిబికాధరులు విధిచేత నీకు
నర్పింపఁబడిరి భోజ్యంబుగా నీనాఁడు, తెలిపెద విను మింక సలిలవార్త
గీ. యీజలము ఖాండవంబునఁ దేజరిల్లు, యమునదరిని హరిప్రస్థ మనెడిపుణ్య
తీర్థమున నుండుగిప్పతీర్థజలము, ప్రాగ్జనిస్మృతి జనియించుఁ ద్రావ దీని. 1443
క. త్రావితివి నీవు దీనిం, గావున నేకారణమునఁ గ్రవ్యాదుఁడ వై
యావిర్భవించినాఁడవో, కావింపుము శ్రుతము నాకుఁ గల దిచ్ఛ వినన్. 1444
వ. అని యడుగుటయు నారాక్షసుండు సవినయంబుగా మాజనకున కి ట్లనియె. 1445
సీ. పుణ్యాత్మ వినుము నాపూర్వవృత్తాంతంబు, తెలియఁజేసెద నీకుఁ దేటపడఁగ
భూతలంబున మున్ను పుణ్యాలభ్యం బైన, భూసురాన్వయమునఁ బుట్టి నేను
క్షితిసురధర్మవర్జితుఁడ నై తిరుగుచు, స్వాచ్ఛందముగను దుర్జనులతోడఁ
బితృపితామహాసమార్జిత మైనధన మెల్ల, వ్యయము సేయుచు నుండ వ్యర్థముగను
గీ. నపుడు నాతండ్రి మద్విషయంబు నెల్ల, క్ష్మాపతికిఁ జెల్పి నన్ను గ్రామంబునుండి
వెడలఁగొట్టింప నాయూరు విడిచిపెట్టి, యెట్లొ గ్రామాంతరమునకు నేగి నేను. 1446

గీ. అచట నివసించి నిస్స్వుఁడ నై నకతన, బిచ్చ మెత్తుచు నుండంగఁ బిలిచి నన్ను
దేవకుం డనుద్విజుఁ డొకదినమునందు, మత్పితృపితామహాదినామముల నడిగె. 1447
ఉ. అంతట నేను వారలసమాహ్వయముల్ వచియింప నాతఁ డ
త్యంతము గౌరవించి నను దత్ప్రథితిన్ విని యుండినట్టిధీ
మంతుఁడు గాన నిల్పె నిజమందిరమందె తదాదిగాఁగ నే
సంతస మొప్పగా నతనిసద్మమునన్ నివసించి మెక్కుచున్. 1448
సీ. అతఁ డొకనాఁడు గ్రామాంతరంబున కేఁగ, నానాఁటిరేయిఁ గామాంధ్యమునను
దద్భామినిని బలాత్కారంబునను బొంద, నామె సాధ్వీమణి యగుటఁ జేసి
గరళంబు ద్రావి తత్కాలంబుననె చచ్చె, నది గాంచి నేను భయంబువలన
నెటకేని పోవంగ నెంచి త్రోవం బడి, పరువెత్తుచుండ రాజభటులు చూచి
గీ. తఱిమికొని వచ్చి దొంగ యన్ దలఁపుతోడఁ, బట్టి నన్నుఁ గొట్టి చంపిరి పాప ఘనత
యంతటను దండధరభటు లరుగుదెంచి, నన్నుఁ గొనిపోయి యమయాతనలను గుడుప.
వ. తత్తీవ్రయాతనాక్లేశంబు షష్టిసహస్రవర్షంబులు నే ననుభవించి శేషించినపాపంబున
రాక్షసుండ నై జన్మించి శతవర్షంబులు నీచవృత్తిచేఁ గడపితి. 1450
గీ. ఇపుడు నా కిట్టిసువేళ మేర్పడంగఁ, గారణం బయ్యె నీతీర్థకలశజలమె
యిది తటస్థించుటకుఁ గూడ హేతు వొండు, కలదు విను మది నీకు నేఁ దెలుపువాఁడ.
సీ. మున్ను నే నొకజన్మమున హరివాసర, వ్రతము సత్సంగంబువలనఁ జేసి
ద్వాదశీదినమున నోదనంబు భుజింపఁ, బోయెడితఱి నొక్కభూసురుండు
చనుదెంచి భోజనంబును బెట్టు మని కోర, నాతనిఁ గాంచి నే నాగ్రహమునఁ
దిట్టితి నంతటఁ దిరిగి మాటాడక, యరుగుచుండంగ నాధరణీసురుఁడు
గీ. వానివెంటన పోయి నావనిత యతని, యంఘ్రులకు మ్రొక్కి ప్రార్థించి యాదరమున
గృహమునకుఁ దోడుకొని వచ్చి యిట్టు లనియె, నన్నుఁ గని నాథ విష్ణుసనాభి యతిథి.
సీ. అనవుడు నే నాగ్రహముఁ బాసి కడిగి త, చ్చరణముల్ వాని నాసనమునందు
నుపవిష్టునిం జేసి యొసఁగి యన్నము నమ్మ, హాత్ముఁడు భుజియించి యలరి చనియె
నాపుణ్యమునన సంప్రాప్తించె నాకు నేఁ, డుత్తమం బైన తీర్థోదకంబు
పానంబు చేసెడిభాగ్యం బని వచించు, చుండంగ నంతలో నుప్పరమున
గీ. దివ్యదేహంబులను దాల్చి తేజరిలుచుఁ, గానఁబడి పాంథుఁడును యాప్యయానధరులు
వైశ్యపుంగవ యీతీర్థవారి ద్రావి, నందుచే మాకు దేవత్వ మామతిల్లె. 1453
గీ. అందఱము గూడ మేము ధనాశచేత, నంతకాలంబునను జచ్చినట్టికతన
నరుగుచున్నాము గుహ్యకేశ్వరునిపురికి, నని వచించి నభోమార్గమునను జనిరి. 1454
సీ. అంతట మాతండ్రి యాశ్చర్యమును జెంది, దనుజునిసాహాయ్యమునను మరలఁ
జనుదెంచి యాతీర్థమున కిచ్చటనె యుండఁ, దలపెట్టి యసువులు తొలఁగువఱకు

స్నానంబు చేయుచుండంగ నీపుణ్యతీ, ర్థమునఁ దండ్రిని జూచుతలఁపుతోడ
నీతీర్థమునకు నే నేతెంచి వ్యాఘ్రబాధ, లో నున్నతండ్రికిఁ గానఁబడితి
గీ. నపుడు నాతండ్రి ననుఁ జూచి హర్షమునను, విడిచి కన్నీరు వత్స మే నుడుగుకాల
మేఁగుదెంచెను నీ విపు డేఁగుదెంచు, టెంతయును నాకు సంతోషహేతు వయ్యె.
ఆ. అరుగుదెంచు నొక్కయసురుఁడు నామిత్త్రుఁ, డిటకు నిపుడె వాని నీవు చూచి
యడలు చెందకుండ నభివాదనము సేయు, మతనివలన క్షేమ మబ్బు నీకు. 1456
సీ. అని పల్కుచుండంగ నంతలో వికటుండు, చనుదేర వానికి వినయ మొదవఁ
గావించితిని నమస్కారంబు నే నంత, నారాక్షసుండు న న్నాదరించి
వత్స ధన్యత నొందవలసినయోగ ముఁ, డుటచేత వచ్చితి విటకు నేఁడు
మునుఁగు మీతీర్థంబునను మొట్టమొదటను, బూర్వజన్మస్మృతి పొడము నీకు
గీ. ననుడు నీతీర్థమున నేను మునిఁగి పూర్వ, జన్మసంస్మృతి వడసి యాశ్చర్యముగను
వచ్చి నాతండ్రికడకుఁ దద్వదనమునను, విని యద స్తీర్థమహిమంబు విశదముగను.
సీ. కావించుచును బితృసేవ సంతతమును, నిక్కడ నుండి నే నొక్కనాఁడు
స్నానార్థి యైనమజ్జనకుని నీతీర్థ, సలిలంబునను మునుఁగుసమయమందుఁ
దత్ప్రాణములు పోయె దైవికంబుగ నంత, నరుదెంచి యాదినారాయణుండు
తనరూప మొసఁగి నాజనకున కేను సం, దర్శించు చుండ న త్తరుణమంద
గీ. తనగరుడవాహనమున నాతండ్రి నుంచు, కొని రయంబునఁ జనియె వైకుంఠమునకు
బ్రహ్మరుద్రేంద్రముఖ్యనిర్జరగణంబు, లెల్ల నుతియించుచును వెంట నేఁగుదేర. 1458
సీ. అపుడు నే నీతీర్థమం దుండుమహిమకు, నద్భుతానందము లామతిల్ల
నాతండ్రి కిచట నొనర్పగావలసిన, యంత్యక్రియల నెల్ల నాచరించి
గృహమునం దుండెడిప్రీతిని విడిచి నా, జనకుఁ డుండినపర్ణశాలయంద
యసురునితోఁ గూడ వసియించి యీతీర్థ, మందుఁ జేయుచు స్నాన మనుదినంబు
గీ. కాలమును బుచ్చు చుండ నాకస్మికముగ, నొక్కగో విచ్చటికి వచ్చి యొక్కనాఁడు
పడుడు నీతీర్థమున దానిఁ బట్టి లేవఁ, దీయఁగా నెంచి మదిని రాత్రించరుండు. 1459
సీ. ఈతీర్థమున దూఁకి యె ల్లని గోవును, లేవఁదీయంగ నాగోవు లేచె
నంతలో నొక్కగ్రాహము దైత్యునిపదంబుఁ, బట్టి లోనికి లాగ బలముకొలఁది
నారాక్షసుండు నిరాధారుఁ డగుటను, బోయి లోనికిఁ బ్రాణములను విడిచి
దేవతాకృతితోడ దివి కేఁగు చుండంగఁ, గని నేను వాని రాక్షసవరేణ్య
గీ. మోక్షదాయక మగుతీర్థమునను జచ్చి, త్రిదివమున కేల పోయెదు తెలుపు మనుడు
వైశ్యనందన వాంఛించి స్వర్గసుఖము, నరుగుచుంటి నటంచు వాఁ డరిగె దివికి.
సీ. అది యాదిగను నే నహర్నిశంబును హరి, ధ్యానంబు సేయుచు ననుదినంబు
సలుపుచు నీతీర్థజలమున స్నానంబు, నిర్విషయంబు గా నిల్పి మదిని

నొకనాఁడు హరిపూజ యొనరించు చుండ నే, తెంచి దుర్వాసుఁ డీక్షించి నన్నుఁ
దనకు సత్కారంబు నొనరింపలే దను, భావంబునను గిన్క పట్టలేక
గీ. శాపము నొసంగె నాకు నాజన్మమందు, ముక్తి లేకుండునట్లు తదుక్తి నేను
వినుట వెంటనె హరిపూజ విడిచి లేచి, వానిచరణాంబుజంబులపైని వ్రాలి. 1461
గీ. స్వామి నాయపరాధంబు సైఁచి శాప, ముక్తిని ననుఁగ్రహింపుము భక్తజనుల
భావ మెఱుఁగనివాఁడవు కావు నీవు, నాఁగ నమ్మునిశాంతమనస్కుఁ డగుచు. 1462
క. జనియించి భూసురాన్వయ, మున భూతలమందు ధర్మమున నిల్పి మనం
బును దుద కీర్థంబునఁ, గని మరణము మోక్ష మొందఁగల వని పలికెన్. 1463
వ. అంతట మునివాక్యంబు మిథ్య కానేర దని నిశ్చయించుకొని స్వగృహంబున కరుదెంచి
విష్ణుధ్యానపరాయణుండనై కాలముం బుచ్చుచు నొక్కతరుణంబున గంగాస్నా
నంబు గావించి తత్తీరంబున హరినామస్మరణంబు చేయుచుఁ బ్రాణంబు లుజ్జగించి
దుర్వాసుఁ డనుగ్రహించిన ట్లొక్కబ్రాహ్మణగృహంబున బ్రాహ్మణుఁడనై జన్మించి
నేఁటి కీర్థంబునకు రాఁగలిగితి. 1464
గీ. అనుభవించుచు దేహ మున్నంతవఱకు, సుఖమొ దుఃఖంబొ యుండి యిచ్చోట నేను
మరణమును బొంది మోక్షసామ్రాజ్యలక్ష్మి, నేలుకొనువాఁడ నని వచియించె నంత.
క. విని విష్ణుశర్మ జనకుఁడు, వినిచినవిషయంబు నెల్ల విశ్వాసము లో
నొనరఁగ నిగమోద్బోధక, మనుతీర్థంబున వసించె నాతనితోడన్. 1466
ఆ. అట్లు కొంతకాల మాయిర్వురును నండె, యుండె హరిపదంబు నొంది రొక్క
దినమునందె వారిదివ్యచరిత్రంబు, త్రిభువనంబులందుఁ దేజరిల్ల. 1467
క. ఈతీర్థమహాత్త్వంబును, జేతం బలరంగ నెవరు చెప్పెదురో మనః
ప్రీతిమెయి నెవరు విందురో, కాతర్యము లేనిపదము గాంతురు వారల్.
క. అని నుడువుటయును విని శిబి, మనమున సంతోష మొంది మానీంద్ర వినం
గను ద్వారకామహత్త్వము, జనియించెను వేడ్క చెపుము సవిశేషముగన్. 1469

—: ఇంద్రప్రస్థద్వారకామాహాత్మ్యము :—

సీ. అనుచు నారదుఁ డిట్టు లనియె భూమీంద్ర యిం, ద్రప్రస్థపుణ్యతీర్థంబునందు
ద్వారక యనెడియుత్తమతీర్థ మొకఁ డుండె, నం దుండు బ్రాహ్మణులం దొకండు
కాంపిల్యదేశంబుఁ గన నేఁగి యొకనాఁడు, సలుపుచు గానంబు శ్రావ్యముగను
సంచరింపఁ దొడంగెఁ బంచబాణుఁడు నాఁగఁ, బ్రతివీథియందును బ్రౌఢి మెఱయ
ఆ. నతనిభువనమోహనాకారగానముల్, పరవశంబు సేయ భావములను
భవనములను విడిచి పౌరభామిను లెల్ల, విస్మయముగ వానివెంటఁబడిరి. 1470
సీ. అప్పుడు తద్భర్త లతనిఁ దత్పురినుండి, వెడలఁగొట్టింపంగ నెడల నెంచి
తత్పురపాలునిదరి కేఁగి భూపాల, మనపురి కొక్కబ్రాహ్మణుఁడు వచ్చె

నాతనిభువనమోహనరూపగానంబు, లెడఁదలఁ గలఁప మాయెఁతు లెల్ల
నతనివెంబడిఁబడి యరుగఁ దొడంగిరి, వాఁ డింక నీయూరు వదల కున్న
గీ. భ్రష్ట లగుదురు మాధర్మపత్న్లు లెల్ల, మేము వసియింపఁజాల మీగ్రామమందు
ధర్మరక్షకుఁడవు గాన దాఁపకుండఁ, జెలిపితిమి నీకు నంతయుఁ దేటపడఁగ. 1471
క. అని చెప్పఁగఁ గాంపిల్యుఁడు, విని వారలనుడువు లెల్ల విశదంబుగ వి
ప్రుని రావించి నిజాంతిక, మునకుఁ దద్రూపధేయమోహితమతి యై. 1472
సీ. భూసుర నీవు మాపురమున నుండిన, భ్రష్ట లై పోదురు పడఁతు లెల్లఁ
జనుము శీఘ్రముగ నీజనపదంబున కీవు, చన కున్న యెడ శిక్ష సలుపువాఁడ
ననవుడు విప్రుఁ డి ట్లనియె మహారాజ, లేదు నాయెడ దోషలేశ మేని
యజితేంద్రియలు త్వత్పురాంగన లగుటయె, యీయనర్థమునకు హేతువయ్యె
గీ. నని వచించుచు నుండెడునంతలోనఁ, బురవధూమణు లెల్ల గుంపులుగఁ గూడి
యరుగుదెంచి మనోహర యగునె నీకు, విరహకాతరలను మమ్ము విడిచి పోవ. 1473
క. అని పరివేష్టింపఁగ ని, ట్లనియె మహీసురుఁడు సవినయంబుగ మీకుం
దనయుఁడను నేను నాకుం, జననులు మీ రతివలార సత్యము గాఁగన్. 1474
సీ. పతికంటె దైవంబు పడఁతికి లే దని, వివరించుశాస్త్రంబు విశ్వసించి
పరిచర్య సేయుచు భర్తల కిహపరం, బులలోన లోపంబు గలుగకుండ
వర్తింపఁ దద్దాన వాసుదేవప్రీతి, ఘటియిల్లు శుభములు గలుగు దాన
భర్తను విడనాడి పరపూరుషునిఁ బొందు, నతివ యుర్వరను గర్వ్యతను బొంది
గీ. కాయ ముడిగినపిదప దుర్గతులలోనఁ, ద్రొక్కి పడరానిబాధలు చెంది యవల
నిలను వృక్షంబులుగఁ బశువులుగఁ బుట్టి, వ్యంగ యై మర్త్యయోనియం దవల నొదవు.
ఆ. అంధుఁ డైన బధిరుఁ డైన రుగ్ణుం డైన, రూపహీనుఁ డైన పాపి యైన
నధనుఁ డైన నెట్టిఁ డైనను భర్తను, సుగతి గోరుసుదతి తగదు విడువ. 1476
క. కావున మీకుం గలిగిన, భావంబుల నుడిగి పొందు భర్తలకడకుం
బావనము లై నయుష్మ, జ్జీవితముల నేల పాడుచేసికొనంగన్. 1477
క. అనవుడు వారలు లజ్జా, వనతానన లై తదీయవాగ్జలపూరం
బున నిజకామాగ్నిశమం, బును జెందఁగఁ జనిరి స్వగృహముల కేకమతిన్. 1478
వ. అంతటఁ గాంపిల్యుండు ద్వారకానివాసి యగునాబ్రాహ్మణునియోగ్యతను బ్రశంసించి వస్త్రభూషణాదులచే సమ్మానించి గౌరవపూర్వకంబుగాఁ దత్పురంబున కాతనిం బనిచె.
ఆ. అవలఁ గొంతకాల మరుగంగఁ గారూష, జనవరేణ్యుఁ డొక్కసమయమందు
దాడివెడలి సేనతోడఁ గాంపిల్యుని, నగరి ముట్టడించెఁ బగతుఁ డగుట. 1480
క. అంతటఁ గాంపిల్యధరా, కాంతుఁడు కారూషభూమికాంతునితోడన్
వింతగను జేసి యుద్ధము, నంతంబును నొందె నాజి నాఁగఁగ లేమిన్. 1481

క. అరివలన మానభంగము, జరుగుననెడిభీతి మానసములఁ గలంపన్
గరళమును ద్రావి వెంటనె, మరణించిరి నగరిలోనిమానిను లెల్లన్. 1482

సీ. మరణించి వార లామాడ్కిని బరపురు, షాభిలాషప్రభూతాఘమునను
లంకలో దానవలలనలుగ జనించి, మారుతిచే మున్ను మరణ మొంది
పైశాచరూపంబుఁ బడసి పిమ్మట నుండఁ, దావు చిక్కమిని సంతాపపడుచుఁ
జని యొకమరుదేశమునకు క్షుత్తృష్ణల, కాఁగంగలేక యల్లాడుచుండఁ
గీ. జేకుఱె విముక్తి ద్వారకాక్షేత్రపుణ్య, సలిలసంస్పర్శమాత్రంబువలన వారి
కనుడు శిబి విస్మయము నొంది మునివరేణ్య, చెపుము తన్ముక్తిగాథ యశేషముగను.

సీ. అనుడు నారదుఁ డిట్టు లనియె మహారాజ, వినుము తెల్పెద నీకు విశదముగను
విమలుండు నా నొక్కవిప్రోత్తముఁడు మున్ను, తుహినశిలోచ్చయద్రోణియందు
వసియించు చుండంగ వానికి వార్ధకం, బున జనియించెను బుత్రుఁ డొకఁడు
విష్ణుభక్తుఁడు గాన విమలుఁ డాత్మజునకు, హారిదత్తుఁ డనెడియాహ్వయముఁ బెట్టి
గీ. వేదవేదాంగములు నేర్ప విద్య లెల్లఁ, జదివి యాతండు తద్గతసార మెఱిఁగి
బ్రహ్మచర్యంబునందె వైరాగ్యమునను, గొని తురీయాశ్రమము నేఁగెఁ గొంప విడిచి.

గీ. అంతఁ దన్మాత పుత్రమోహమున నేడ్చు, చుండ విమలుండు తద్దుఃఖ ముడుపలేక
కలికి మఱియొకపుత్రుఁడు గలుగునట్టు, లాచరింతుఁ దపం బని యనునయించి. 1485

గీ. అరిగి కాశీప్రయాగగయాద్యనేక, పుణ్యతీర్థంబులకు స్నానముల నొనర్చి
యందు నందుహరిప్రస్థ మనెడితీర్థ, మునకు నంతంబునను జేరి మునిఁగి యందు. 1486

క. యమునాతటమె నారేయి ని, యమమున శయనించి యుండ ననిమిషయుతుఁడై
కమలజుఁడు వచ్చి యాతని, సముఖమున నిలిచి యిట్లు సంభాషించెన్. 1487

సీ. బ్రాహ్మణోత్తమ భవద్భావంబునం దుండు, వాంఛ దీర్పఁగ మాకు వశము గాదు
వినుము కారణము నే వినిచెద ము న్నొక్క, తరుణంబునను దేవతలును నేను
మేరుశృంగంబున నారాయణునిఁ గూర్చి, తపము గావింప మాధవుఁడు మెచ్చి
వరము లిచ్చెద మీకు వాంఛింపుఁ డన సురల్, స్వస్వేష్టములు గొని చనిరి దివికి
ఆ. నపుడు కోరితిని బ్రయాగ మింద్రప్రస్థ, మును మదీయతీర్థములుగ నుండ
నంబుజాక్షుఁ డట్లె యగుఁగాక యని నాకు, నిచ్చి వరము మఱియు నిట్టు లనియె.

క. కమలోద్భవ యింద్రప్రస్థమున మహాతీర్థముగను ద్వారక నాచే
సమకూర్పఁబడియె నచ్చట, సమస్తవాంఛలును దీరు స్నానము చేయన్. 1489

క. చలిపి తదుల్లంఘనమును, జలిపినయెడ స్నాన మెట్టెసమధికతీర్థం
బులలోన నైన స్నాతకుఁ, గలుగదు తత్స్నానఫలము కణికం బైనన్. 1490

క. అని చెప్పి తిరోధానము, గనియెను గావునను ద్వారకాతీర్థమునన్
బొనరించినయెడ స్నానము, తనయుఁడు జనియించు నీకుఁ దథ్యము గాఁగన్. 1491

వ. అని ప్రబోధించి యంతర్ధానముం జెందె. 1492

సీ. అంతట విమలుఁ డాహ్లాదంబునను జని, ద్వారకాపుణ్యతీర్థంబునందు
స్నానంబు గావించి స్మరియించు చుండంగ, నంబుజాక్షుని హృదయంబులోన
విప్ర యింటికిఁ బొమ్ము వేగ మే లగు నీకు, నని వినంబడెఁ జెవి కమరవాణి
కలశంబునను ద్వారకాతీర్థతోయంబు, గై కొని విమలుఁడు కదలి యపుడె
గీ. యరుగుదెంచుచు నుండంగ నాత్మసదన, మునకు సృతిమధ్యమరుదేశమునఁ బిశాచు
లడ్డపడి పైకి రాలేక యాఁగి యెదుట, స్వామి తెల్పుము నీగాథ యేమొ మాకు.
వ. అని సవినయంబుగా నడుగుటయు విమలుండు తద్భీకరాకారంబులం జూచి పిశాచు
లుగా నిశ్చయించుకొని వారి కిట్లనియె. 1494
గీ. భూసురుండను నేను మద్వాసభూమి, హిమగిరిద్రోణి పరగుదు విమలుఁ డనఁగఁ
జలిపి బహుపుణ్యతీర్థయాత్రలను దిరిగి, పోవు చున్నాఁడ నాగృహంబునకు నేఁడు.
క. అనవుడు నతనికి వందన, మొనరించి పిశాచు లెల్ల నుర్వీసుర నీ
వనఘుఁడవు తీర్థయాత్రల, నొనరించుట మాకు ముక్తి నొసఁగుము దయతోఁ. 1496
క. అని దైన్యంబున నడుగుట, యును విమలుఁడు నిజకమండలూదకమును జ
ల్లెను వారిపైఁ గనికర, మెనయంగను నంత వార లెల్ల క్షణములోఁ. 1497
గీ. అప్సరోరూపములఁ దాల్చి యద్భుతముగ, నధివసించి మరుద్వ్యాప్యయానములను
దెలచుచును ద్వారకాపుణ్యతీర్థమహిమ, చనిరి దివి కాద్విజన్ముఁడు కనుచు నుండ.
గీ. అపుడు విమలుఁడు విస్మయం బావహిల్ల, ద్వారకాతీర్థజలమహత్త్వమున కెదను
సత్వరంబుగ నేఁగి స్వస్థానమునకుఁ, దనసధర్మిణి కిచ్చి తత్కలశజలము. 1499
గీ. పొలఁతి యిది ద్వారకాతీర్థపుణ్యజలము, గ్రోలు మిద్దాని నీకుఁ బుత్రుఁడు జనించు
ననుచుఁ దత్కాంత వెంటనె యాజలంబు, ద్రావి గర్భంబుఁ దాల్చి యర్భకునిఁ గనియె.
వ. ఏతద్ద్వారకాతీర్థమాహాత్మ్యంబు పఠించినను వినినను వేదవిదు లగునూర్గురు బ్రాహ్మ
ణులకు భోజనము పెట్టినఫలంబును సూర్యేందుగ్రహణకాలంబున వింశతిపలసువర్ణ
దానంబు గావించినఫలంబునుం జేకూరు. 1501
క. అని తెలుపుటయును శివి యి, ట్లనియెను నారద వినంగ నభిలాషము గ
ల్గెను నాకుఁ గోసలామహి, మను జెప్పుము నాఁగ నిట్లు మౌని వచించెన్. 1502

—: ఇంద్రప్రస్థ కోసలాతీర్థమాహాత్మ్యము :—

సీ. కలదు కోసల యనంగను నొక్కనగరంబు, చంద్రభాగాతటస్థలమునందు
నది పుణ్యతీర్థమై యలరారె నచటఁ జం, డకుఁ డనియెడునొక్కనాపితుండు
బ్రదుకుచుఁ జౌర్యవర్తనముచే నొకనాఁడు, జను లెల్ల నిద్రించుసమయమందుఁ
బురవీథిలోపలఁ దిరుగుచును ముకుందుఁ, డనెడివైష్ణవునిసంస్థాయమునకుఁ
గీ. గన్నమును ద్రవ్వి చొచ్చి యగారమందు, నొక్కగదిలోన శయ్యపై నువిదతోఁడఁ
బవ్వళించుకొని యుండఁగను ముకుందుండు వారి, కడకుఁ జని నిద్రపోవుచుండగ నాతంగి.

క. ధ్వని కాకుండంగ ముకుం, దునిసతిహ_స్తముల నున్నతొడవులఁ గొనుచుం
డినతటిని ముకుందుఁడు మే, ల్కని దైవికముగను వానిఁ గని క్రేఁగంటన్. 1504

సీ. కదలక యుండి తత్కరభూషణములను, గొని వాఁడు మెల్లఁగాఁ జనుచు నుండ
శయ్యాతలమునుండి యొయ్యన లేచి త, త్పృష్ఠదేశంబున నేఁగి వానిఁ
గరయుగ్మమునఁ బట్ట గట్టిగా నాతఁడు, తనమొల నున్నశస్త్రమును లాగి
ఖండించి దానఁ దత్కరంబు బిరబిరఁ, జనియె వచ్చినత్రోవ స్వగృహమునకు

గీ. నంతట ముకుందునిసపంతి యడలి లేచి, క్షితిని బడియున్నపతిని వీక్షించి యేడ్చి
సాధ్వి యగుటను భర్తతో సహగమనము, చేయ దృఢముగ నిశ్చయించికొని యుండ.

సీ. అపుడు వేదాయనుం డనునొకసన్యాసి, తనశిష్యుఁ డగుముకుందునిఁ గనఁగ
నాకస్మికంబుగ నచటికి విచ్చేసి, కాంచి తచ్ఛవమును గన్నులారఁ
బరితాప ముదయింప భావంబునను గొంత, శమియింపఁజేసి జ్ఞానమున దాని
సహగమనము సేయ సంసిద్ధురా లైన, తద్వధూటినిఁ గాంచి తత్క్షణంబ

గీ. యతివ దేహము కర్మజన్యంబు జడము, జ్ఞానరూపుఁడు జీవుఁ డజ్ఞానమునను
దేహమం దాత్మబుద్ధి సంధిలుటఁజేసి, జీవునకు శోకమోహంబు లావహిల్లె. 1506

క. శమియించునెడల నజ్ఞా, నము జీవుఁడు బ్రహ్మ మగుట నశియింపఁడు దే
హము జడ మగుట నశించును, సమయజ్ఞులు దీని కేల సంతాపింపన్. 1507

క. జీవునకు లేదు చావును, నావిర్భావమును దత్త్వ మరసినయెడలన్
జీవుఁడె దేవుం డగుటను, దేవున కుదయమును సంస్థితియు లేకుంటన్. 1508

వ. అని బహుప్రకారంబులం బ్రబోధించి యంతర్వర్తిని యగునాయమను సహగమనంబు నుండి తొలంగించి ముకుందునకుఁ దదనుజునిచే దహనాదిసంస్కారంబులు గావింపం జేసి తచ్ఛల్యంబు లోకశరావంబునం దుంచి యది వస్త్రంబునం గట్టి ముకుందానుజునిచేతి కిచ్చి యతనితోడం గూడి తాను బయనం బై యింద్రప్రస్థంబున కేతెంచి యిం దుండుకోసలాతీరంబుం జేరి యారాత్రి యమునాతటంబున శయనించి యుభయులనడుమ నాయస్థిశరావగ్రంథి నుంచికొని నిద్రించుచుండ. 1509

సీ. సారమేయం బొండు చనుదెంచి యచటికి, గట్టిగా నోట నాగ్రంథిఁ బట్టి
కొనిపోయి యొకచోట నునిచి చీలిచి దాని, పైనిఁ గట్టినగుడ్డ పండ్లతోడఁ
దచ్ఛరావాంతస్స్థితము లైనయస్థిసం, తతులను నోటను నమలి నమలి
విడిచిపెట్టుటయును బడియె నయ్యది కోస, లాతీర్థపుణ్యజలంబునందు

గీ. దాననను ముకుందుఁ డమరవిమాన మెక్కి, దివ్యదేహంబుతోడను దేజరిలుచు
దేశికుఁడు సోదరుఁడును నిద్రించుచున్న, చోటి కేతెంచి వారలఁ జూచి లేపి. 1510

సీ. ప్రణమిల్లి గురుపాదపద్మంబులకు నను, జన్మున కాశీర్వచన మొనర్చి
మహనీయులార యుష్మదనుగ్రహమున నా, శల్యంబు లీనిశాసమయమందుఁ

బడియెను గోసహాపరమపావనతీర్థ, వారిలోపలను దత్తాకర్ణమున
నపమృత్యుగతుఁడ నై యతిఘోరనరకంబు, లనుభవించుచు నుండినట్టినాకు
గీ. దివ్యదేహంబు ప్రాప్తించి త్రిదివమునకు, నరుగుభాగ్యంబు లభియించె నానతిండు
చనియెద దివంబునకు మీరు సలిపినట్టి, యుపకృతిని విస్మరింప నే నుండువఱకు. 1511
క. అనవుడు వేదాయనుఁ డి, ట్లనియెను నీ కట్టినరకయాతన లొందవఁ
గను హేతు వేమొ నాకుఁ, వినిపింపుము దెలిసియున్న విశదము గాఁగ. 1512
వ. అని యడుగుటయు ముకుందుం డాతని కి ట్లనియె. 1513
సీ. దేశికోత్తమ యద తీర్థప్రభావంబు, వలనఁ బూర్వస్మృతి గలిగె నాకు
దాన సర్వముఁ దెల్పెదను నీకుఁ జండక, హతుఁడ నై చచ్చినయవల నేను
యాతనాదేహంబునందుఁ బ్రవేశించి, యమపురంబున కేఁగుసమయమందు
శమనభృత్యులు శిక్ష సలుపుచుండఁగను ద, ద్బాధకు సుంతయుఁ దాళలేక
గీ. కాలభటులార యేపాతకమును నేను, జేయఁ గల్గెనొ యీబాధ చెప్పుఁ డనుచు
వేఁడ వారు గురుద్రోహి వేటె నీకు, జ్ఞాత మొనరింపవలెనె త్వత్పాతకంబు. 1514
సీ. నీకుఁ బుత్రుండవు జన్మించినప్పుడు త్వత్తాత, లాచారమార్గంబు ననుసరించి
యాయవై తివి పురోహితునకు గోవును, సంప్రదాయాచారసరణి యొసఁగఁ
దద్గురుద్రోహపాతకము ని న్నంటుట, నీమహాబాధ నీ కేరుపడియె
నని నన్నుఁ దోడ్కొని చని కృతాంతునిమ్రోల, నిలుపంగ వణఁకుచు నిలువ నేను
గీ. గాలుఁడు మహాభయంకరాకారమునను, గానఁబడి నాకు గురులోపకరుఁడు తల్లి
దండ్రులను నోమకుండునాతఁడును భూరి, పాపు లని పల్కి నన్నుఁ జూచి పండ్లు కొఱికె.
సీ. ఈహతాత్ముఁడు గురుద్రోహపాతకమున, నపమృత్యువును బొందినట్టివాఁడు
వర్షాయుతము రౌరవంబునఁ బడవైచి, యవలఁ గుంభీపాకమందుఁ ద్రోసి
క్రమముగా సకలదుర్గతులలోఁ గూలిచి, ఖండింపుఁ డవల ముక్కలుగ వీని
నని యానతీయంగ యమకింకరులు నన్నుఁ, గొనిపోయి ఘోరయాతనలు వెట్టఁ
గీ. గడచెఁ ద్రింశద్దినమ్ములు క్షణము యుగము, గాఁగ నే మనువాఁడ నాకష్టదశను
బడియె నామతునాఁడె మద్భాగ్యమున మ, దీయశల్యంబు లీపుణ్యతీర్థమందు. 1516
గీ. అపుడు యమభృత్యు లెల్ల దివ్యాకృతులను, గ్రాలుచుఁ బ్రసన్నముగ నాకుఁ గానఁబడిరి
యంతటను దుర్గతివిముక్తి యగుటె కాక, యమరయానంబు నాకొఱ కరుగుదెంచె.
క. అనవుడు వేదాయనుఁ డి, ట్లనియె నద తీర్థమునఁ ద్వాదశులు పడ నీ
వొనరిచినపుణ్య మేమియొ, వినిపింపుము వినఁగ నాకు వేడ్క జనించెన్. 1518
సీ. అనుడు ముకుందుఁ డి ట్లనియె గురూత్తమ, నాగృహంబున కొక్కనాఁడు మున్ను
క్షితిసురుం డొకఁడు విచ్చేయ సాయంవేళ, నతని కారాత్రి నే నన్న మొసఁగి
శయనింప నిచ్చితి శయ్య డాని కతంబు, ప్రముదితాత్ముం డయి పవ్వళించె
నంతట నది యేమొ యాకస్మికంబుగా, వానికి దారుణజ్వరము తగిలె

గీ. బాధపడుచుండ దాన నాబ్రాహ్మణుండు, సలిపితిని నేను బహుళోపచారములను
గాని యాసన్న మగుటను గాల మతఁడు, విడిచె నసువులను బ్రభాతవేళలోన. 1519

గీ. అంతటను నేను వానికి నాచరించి, దహనకర్మంబు మంత్రయుక్తముగ నతని
యస్థు లుంచితి గంగలో నందువలనఁ, బడియె నాయస్థు లీతీర్థపాథమందు. 1520

క. అని చెప్పి తదనుమతిఁ గొని, చనియె దివంబునకు నమరసంఘం బెల్లన్
గొనియాడుచు నుండఁగఁ దా, మును సేసినయట్టిపుణ్యమును వేనోళ్లన్. 1521

సీ. ఇఁకఁ జండకునిగాథ యెఱిగించెదను విను, మస్తమింప ముకుందుఁ డప్పు డట్లు
జను లెల్లఁ జండకుం డొనరించె నీపని, యని తత్పురాధీశ్వరునకుఁ దెలుప
నతఁడు విచారించి యఖిలంబు భటులను, రావించి నిజసభారంగమునకు
భటులార విశసనపాత్రుఁ డీచండకుం, డయ్యెను స్వకృతకృత్యంబువలనఁ

గీ. జంద్రభాగకు నై దుక్రోశములలోన, మరణమును బొందువాఁ డొందు సురపురంబుఁ
గాన నీసీమలోపలఁ గాక వీని, నన్యదేశంబున వధింపు డని వచించె. 1522

సీ. అంతట భటులు నృపాజ్ఞ నొందలఁ దాల్చి, యాతనిఁ గొనిపోయి యాక్షణంబ
చంద్రభాగకు ద్వియోజనదూరమున నున్న, యొకయరణ్యంబులో నొక్కచోట
ఖండించి ముక్కముక్కలుగను జని రంత, శమనబాధలఁ జెంది చండకుండు
భుజగ మై యావనంబునఁ జరించుచు నుండఁ, దైర్థికు లట కొక్కతఱిని వచ్చి

గీ. పండుకొనియుండ నొకపాదపంబుకడను, నాఫణి నిశీథకాలమునందు వారి
దరి కరుగుదెంచి యొక్కభూసురునిచెంత, నుండునొకపెట్టెలోఁ దూఱి పండుకొనియె.

వ. అంతఁ గొంతసేపునకుఁ బ్రభాతం బగుటయుఁ దైర్థికు లెల్లరును నుత్థితులై బదరీ
నారాయణక్షేత్రంబునకు నడచుచుండ నాబ్రాహ్మణుండు నిజపిత్రస్థిపేటికకుఁ గంబ
లంబుం జుట్టి స్కంధంబుమీఁదం బెట్టికొని జాహ్నవికిఁ బయనం బై వారివెంట నరు
గుచు నారాత్రి కోసలాతీర్థంబునకుం జేరి శీతబాధ కోర్వంజాలక కప్పికొనుటకై
మంజూషకుం జుట్టినకంబలంబు నూడఁదీయ దానిలోనుండి భుజగంబు చివుక్కున
వెడలం బడియె. 1524

సీ. అంతట వా రెల్ల నాసర్పమును గొట్టి, చంపంగ నది మహాశ్చర్యముగను
దివ్యవిమాన మధిష్ఠించి దేవతా, దేహంబుతోడఁ దైర్థికులఁ జూచి
సాధువులార నేఁ జండకుం డనెడిత, స్కరుఁడ బ్రాహ్మణవధకారణమున
నపమృత్యువును బొంది యతిఘోరనరకంబు, లనుభవించి భుజంగ మై జనించి

గీ. విపినమున నిన్న మీరు దైవికము గాఁగఁ, బండుకొనియున్నతఱిని మద్భాగ్యమునను
నీద్విజునిపెట్టెలోఁ దూఱి యేఁగుదెంచి, మీరు వధియింప నేఁడు నామేను విడిచి. 1525

గీ. దివ్యదేహంబుఁ దాల్చి యీతీర్థమహిమ, మునను త్రిదశాలయమునకుఁ బోవుచుంటి
నని వచించి దివంబున కరిగె నపుడె, చోద్యముగ నెల్లవారును జూచుచుండ. 1526

వ. అంతటఁ గోసలాతీర్థమహిమంబునకు సంతుష్టుండై యాబ్రాహ్మణుండు గంగా

ప్రయాణంబు నుజ్జగించి తత్తీర్థతోయంబునందు స్వపితృశల్యంబుల నిక్షేపించె. 1527

గీ. అప్పు డాతనితలిదండ్రు లమరదేహ, ములను దాల్చి కుమారుఁడు సలిపినట్టి
పనికి సంతోష మొంది దీవన లొసంగి, స్వర్గమున కేఁగి రది గాంచి వార లెల్ల. 1528

వ. బదరీనారాయణక్షేత్రప్రయాణంబు మాని కోసలాతీర్థంబునందు కృతావాసు లై
గోవిందనామధ్యానంబు గావించు చుండ నం దొక్కబ్రాహ్మణుండు మౌర్ఖ్యంబునఁ
దత్తీర్థంబు ననాదరించి నారాయణక్షేత్రంబునకరుగుచుండ మార్గమధ్యంబున నారా
యణుండు వృద్ధబ్రాహ్మణరూపమున్ దాల్చి యాతని కెదురుగా వచ్చి యి ట్లనియె.

సీ. భూసుర ఇడనాడి కోసలాతీర్థంబు, నెట కేఁగుచుంటివో యెఱుఁగఁ జెపుమ
యనవుడు నాతఁ డి ట్లనియెను బదరికా, శ్రమతీర్థమున నుండఁ జనుచు నుంటి
ననుటయు వృద్ధుఁ డి ట్లనియెను ముక్తి నీ, కొదవ దీతీర్థంబు వదలి చనిన
నమృతవార్ధిని ఇడనాడి తృషార్తుండు, చను నె కర్దమమయసలిలమునకుఁ

గీ. పాణి నున్న చింతామణిఁ బరిహరించి, తిరిపమున కేఁగుచుంటివి హరిని ఇడిచి
క్షుద్ర మగునింద్రియసుఖంబుఁ గోరుచుంటి, నీమతిప్రాభవము నీక నేమిచెప్ప. 1530

క. అనవుడు నాబ్రాహ్మణుఁ డి, ట్లనియెను బాగడకుము స్వల్ప మగుతీర్థంబున్
విని యెఱుఁగ దీనినామం, బును నే నెన్నఁడును బుద్ధిపోయెనె నీకున్. 1531

క. అనుటయు నావృద్ధుం డి, ట్లనియెను జూచియును గన్నులార సురత్వం
బును జెందినచక్రిని ద్విజ, జననీజనకులను నిట్లు చనునె వచింపన్. 1532

సీ. అని స్వరూపమునఁ బ్రత్యక్షమై మోక్షసా, మ్రాజ్యశ్రీ నన్నయాబ్రాహ్మణునకు
క్షితిసుర తీర్థసంతతిలోన నుత్తమ, తీర్థ మింద్రప్రస్థతీర్థ మొకఁడె
బ్రహ్మజ్ఞులందు ధూర్జటివోలె మదవతా, రముల రామావతారంబువోలె
భూదేవవర్ణంబువోలె వర్ణములందు, నద్రులలోఁ దుషారాద్రివోలె

గీ. ననిమిషులలోనఁ బాకశాసనుఁడువోలె, నండజములందు వైనతేయుండువోలె
నదులలో గంగవోలె నారదుఁడువోలె, వైష్ణవులలోన క్షములలో వసుధవోలె. 1533

సీ. అట్టియింద్రప్రస్థమందు మాణిక్యంబు, బలెఁ గోసలాతీర్థ మలరు చుండు
దాని విసర్జించి తదితరతీర్థకో, టులను సేవించిన ఫలము లేదు
ఫలకాంక్ష గల్గియు ఫలకాంక్ష లేకయుఁ, దీర్థసేవ యొనర్చు తైర్థికులకు
సకలతీర్థములలో సముచితంబుగ ఫలం, బొసఁగుచుండెడివాఁడ నొకఁడ నేనె

గీ. యనుటయును విష్ణువాక్యంబు లాలకించి, మౌర్ఖ్యము తొలంగ హరికి నమస్కరించి
తిరిగి యరుదెంచి కోసలాతీర్థమునకు, సాధుబృందంబుతోడ నచ్చటనె యుండి. 1534

వ. దేహావసానంబునంతకును దత్తీర్థస్నానంబును విష్ణుధ్యానంబునుం గావించుచు నంతంబున
ననశనవ్రతంబుచే నాతైర్థికులువోలెఁ దానును బ్రాకృతదేహంబు విడిచె. 1535

సీ. అప్పుడు గోవిందుఁ డరుదెంచి స్వయముగా, వైకుంఠముననుండి వారికడకు
స్వచరణదాసభావమును స్వసారూప్య, మును వారి కందఱకును నొసంగి

గరుడాధిపార్షదులఁ గావించి నిజధామమునకుఁ దోడ్కొని పోయి యునిచె నచట
నది యాదిగను జెండె నచ్చోటు దక్షిణ, కోసలాథ్రాఖ్యఁ గుతలమందు
గీ. నవల నుత్తరకోసలాఖ్యను వహించె, దాశరథి యయి రాముఁ డుద్భవము నొంది
నట్టిచో కోసలద్వయమందు నెచటఁ, బాసినను మేను వైకుంఠవాస మొదవు. 1536
వ. దక్షిణకోసలలోనఁ దనువు దొఱంగినవారలను బుండరీకాక్షుండును నుత్తరకోసలలోనఁ
గాలధర్మంబు నొందినవారలను విష్ణుభటులును వైకుంఠంబునకుం గొనిపోవుదురు.
గీ. కాన నుత్తరకోసలకంటె దశగు, ణాధికంబుగ వచియింతు రార్యు లెల్ల
నిలను దక్షిణకోసల నిదె విశేష, ముభయకోసలలకు ఫల మొకటె యగుట. 1538
క. అని పలుకుటయును శిబి తన, మనమున సంతోష మొంది మానీంద్ర వినం
గను మధువనమహిమంబును, జనియించెను గోర్కి చెప్పుము సవిశేషముగన్. 1539
వ. అని యడుగుటయు నారదుం డాతని కిట్లనియె. 1540

—: ఇంద్రప్రస్థ మధువనమాహాత్మ్యము :—

సీ. మానవాధిప యిట మధువనం బనుపేరఁ, బరమపావన మైనపుర మొకండు
సాపింపఁబడియె మాధవునిచే మును మహేం, ద్రప్రీతికొఱకుఁ దత్సవిధమందు
విశ్రాంతి యనుపేర వెలసెఁ దీర్థం బొండు, దానిమహాత్త్వ మత్యద్భుతంబు
దొరక దచ్చోటను మరణంబు బహుజన్మ, ములు విష్ణుసంసేవ సలుపకున్నఁ
గీ. గలదు విశ్రాంతి యనుపేరు గలమఱొక్క, తీర్థరాజంబు కాళిందితీరమంద
శౌరి యచ్చోటఁ గంసుని సంహరించె, నాయుభయతీర్థములు మోక్షదాయకములు.
సీ. కలదు కిరాతనగర మనఁ బురము హి, మాచలోపత్యకయం దొకండు
కుద్దాలుఁ డనునొక్క క్షోణీసురుం డందుఁ, గలఁడు దరిద్రుఁడు కష్టజీవి
యతనికిఁ గల దొక్క యతివ సుందరి యామె, పతిని గణింపక భావమందు
జారులతోఁ గూడి సంచరించుచుఁ ద్రవ, శూన్యంబుగను నొక్కసుతునిఁ గాంచె
గీ. నంతఁ గుద్దాలుఁ డఖిలజనాపహాస, పాత్రుఁడై రోఁత గలుగుట బ్రదుకుపైని
మ్రందెఁ ద్రావి విషం బొకరాత్రివేళ, లోన సంతస మొందుచు దాని కాపె. 1542
వ. మఱునాఁడు భర్తకు దహనాదిసంస్కారంబులు గావింపంజేసి కొలఁదికాలంబులోన
జారార్పితధనంబుచే సుతున కుపనయనంబు నొనరించి యథేచ్ఛంబుగాఁ బల్లవులతోడ
విహరింపఁ దొడంగె. 1543
సీ. ఇపుడు తదాత్మజుం డామెదుశ్చర్యకుఁ, దల యెత్తుకొని యూర నిలువలేక
యొకనాఁడు వైరాగ్య మొదవఁ దీవ్రంబుగా, నామెతోఁ జెప్పక యడవి కరిగి
సాధుసాంగత్యంబు సమకూర నచ్చోట, దానిచే నుదయింప జ్ఞాన మెదను
హరిని స్మరించుచు నాత్మలో శుద్ధజ, న్మంబు ప్రాప్తింపఁ గాయంబు విడిచెఁ

గీ. దత్సుతవియోగదుఃఖ మింతయును లేక, సంచరించుచు నట్లు యాచంచలాత్మ
కొంతకాలంబునకు జరాక్రాంత యగుట, వార్ధకముఁ గుట్టనీత్వంబువలనఁ గడపి.
గీ. కుష్ఠరోగంబు ప్రబల మై కొఱికివైవ, ఘ్రాణమును బాదయుగమును గరయుగమును
దీన యై దిక్కు లేమిని దిండికొఱకు, నేడ్చుచుండంగఁ గని త్రోవ నేఁగుజనులు. 1545
సీ. చూచి యాఁయమ నొక్కక్షోణీసురుం డోసి, పాపిని చేసినపాతకంబు
దుఃఖంబు నీయక తొలఁగిపో దిహపరం, బులలోన నెట్టివారలకు నేని
నీకర్మమునఁజేసి నీకు సాయము సేయ, నుద్భవింపదు బుద్ధి యొక్కరికిని
నిదియె కాకుండ నీ కింతకంటెను ఘోర, నరకబాధలు గల్గుఁ బరమునందు
గీ. సులభముగఁ జేయుదురు పాపములను మూఢు, లనుభవించెడితఱిని దదఘఫలంబు
నేడ్తు రద్దాన ఫల మేమి యొగిఁబడినఁ, గలుగుఁగాయంబు మానునె పలవరింప. 1546
క. అని పలికి తదవలోకన, మును జేసినకతన నర్యమునిఁ జూచి మనం
బునఁ గృష్ణ కృష్ణ యనుకొని, చనియెను దనత్రోవఁ దాను జయ్యన నంతన్. 1547
ఆ. అట్టు లేడ్చియేడ్చి యాదుష్టురాలు ప్రా, ణములు శోషిలంగ నాఁటిరేయిఁ
దనువుఁ దొఱఁగె నంతఁ జనుదెంచి శ్వపచులు, దానిపాదములకుఁ ద్రాళ్లు గట్టి. 1548
క. శునకంబు నీడ్చికొని పో, యినగతి నీడ్చికొనిపోయి యెల్లరుఁ జూడం
గను నగరబహిర్దేశం, బునఁ బాఱఁగవైచి తిట్టి పోయిరి కడకున్. 1549
గీ. అగ్నిసంస్కార మొనరింపఁడయ్యె నొక్కఁ, డైన నాపాపురాలికి నంత శమన
భటులు చనుదెంచి బంధించి పాశములను, నాయమను గొనిపోయిరి యమునికడకు.
క. అంతటఁ గృతాంతుఁ డాకమ, న్వంతర మాయమను ఘోర మగునరకములో
నెంతయును వేఁచి విడువఁగ, నంతమునకు భువిని బుట్టె నాయమ యుడు మై. 1551
ఆ. అట్లు పుట్టి గోధ యై యామె యొక్కశ్మ, శానమందుఁ జేరి శవపలంబు
నారగింపఁ దొడఁగె ననుదినంబును నట్లు, తినుచు నుండ నొక్కదినమునందు. 1552
సీ. ఒకమహామునియింట నుదయంబు నొందిన, తత్పుత్రుఁ డచటికి దైవికముగఁ
జనుదెంచి యాగోధికను జూచి తద్గాథ, యెఱిఁగి సర్వము ధ్యానదృష్టిచేతఁ
దనతల్లి యగునాయమను నెట్టు లేనియు, నుద్ధరించెడిబుద్ధి యుద్భవిల్లఁ
దనతండ్రి యగుతపోధనునియొద్దకుఁ జని, తనతల్లివిషయ మంతయును దెలిపి
గీ. యామెయుద్ధారమునకు నుపాయ మేది, యైన నెఱిఁగింపు మని వేఁడ నమ్మహర్షి
సంతసము నొంది తద్బుద్ధి కెంత యేని, వత్స తెలిపెద విను మున్నువాస్తవంబు. 1553
వ. పుణ్యతీర్థంబునందుఁ బుత్రునివలనఁ బిండోదకంబులం గొనినపితృవర్గంబు నరకహీనజన్మోద్ధృతం బై స్వర్గంబును స్వర్గంబునుండి వైకుంఠంబునుం జెందంగలుగు. దానంజేసి స్వపితృవర్గంబును బుత్రుం డుద్ధరింపకున్న నరకముం జెందు. కావున నీవు శీఘ్రంబుగా లెమ్ము. సూర్యుం డిప్పుడు కన్యారాశిగతుం డై యున్నవాఁడు, పితృవర్గంబు నుద్ధరింప నియ్యది ముఖ్యకాలంబు, 1554

గీ. కలదు భువిలోన ఖాండవకాననంబు, కలదు కాళింది దానిలోఁ గలదు దాని
తీరమందు నింద్రప్రస్థతీర్థ మందుఁ, గలదు మధువనతీర్థంబు కలుషహరము. 1555

సీ. దానిలో నొనరించి స్నానసంధ్యలను శ్రా, ద్ధంబు గావింపుము తత్తటమున
దాన నీతల్లి గోధారూపమును వీడి, చను విష్ణుమందిరంబునకు వేగ
మధుకాననశ్రాద్ధ మధికంబు సుమి గయఁ, శ్రాద్ధంబుకంటెను శతగుణములఁ
జలుప కుండిన నట శ్రాద్ధ మామెకు లేదు, ముక్తి యర్బుదకల్పములకుఁ గూడ

గీ. నని వచించుటయును మునితనయుఁ డతని, కెఱఁగి తన్మధువనమున కేఁగి పూర్వ
జన్మపితృవర్గముక్తికై శ్రాద్ధ మచటఁ, జలిపి షట్పదవిధిని బ్రశాంతుఁ డగుచు. 1556

గీ. అరుగుదెంచుచునుండంగ స్వాశ్రమమున, కధ్వమధ్యంబునను దేవతాకృతులను
నమరుచును నెక్కి షడ్విమానముల నేఁగు, దెంచి దర్శన మిచ్చి తత్పితృగణంబు.

గీ. వత్స కోరుము వరమును ద్వత్ప్రసాద, మునను నరకవిముక్తిని బొంది మేము
పోవుచున్నాము వైకుంఠమునకు దివ్య, దేహములతోడ ముద మామతిల్ల నెదల.

సీ. అని పల్కుటయును నమ్మునిపుత్రుఁ డాశ్చర్య, మెలయంగ నాదేవతలను జూచి
మహనీయులార యుష్మచ్చరిత్రములను, దెలుపుఁడు నాపైని వెలయఁ గరుణ
యనుడు నం దొకఁ డిట్లనియె నాయన నేను, జనకుండఁ బ్రాగ్జన్మమునను నీకుఁ
ద్వన్మాత వ్యభిచారవర్తనంబున నిన్ను, గనుటను నా కది గామి హితము

గీ. త్రావి విషమును జచ్చి తత్పాతకమున, రాక్షసుఁడ నయి మన్వంతరమును బంచ
దశశతాబ్దంబులును హీనదశను న్లొ, కడపి యీషోడశశతాబ్దకాలమందు. 1559

ఆ. నీవు మధువనమునఁ గావించినట్టిశ్రా, ద్ధమునఁ దొలఁగి దైత్యతనువు దివ్య
దేహ మేరుపడియెఁ దెలిపితి నాగాథ, యనుడు మునికుమారుఁ డతని కెఱఁగి. 1560

గీ. దేవ హరిభక్తి మామకభావమందు, స్థిరముగను బాదుకొనియుండ వర మొసంగు
మని యడుగ నాతఁ డట్టులె యగునుగాక, యని వరం బిచ్చి వైకుంఠమునకుఁ జనియె.

గీ. అంతఁ దత్ప్రాగ్జననమాత యతనిఁ జూచి, తండ్రి నాయొనరించినతప్పువలనఁ
గడపి యొకకల్పమును నరకములలోనఁ, గొనకు నిలలోన గోధనై జనన మొందె. 1562

గీ. తినుచు శవమాంసమును ననుదినము నొక్క, కాంటిలో శతవరము లడపి నేఁడు
దివ్యతను వొందితి నికృష్టదేహ ముడిగి, సలుపుటను నీవు మధువనశ్రాద్ధవిధిని. 1563

క. అని పలుకుటయును నామెకు, నొనరించి ప్రణామ మూరకుండుటయును నా
మునిసుతుఁడు తదనుమతిఁ గొని, చనియెను నాకాంత విష్ణుసదనంబునకున్. 1564

వ. అంతటఁ దత్పూర్వజన్మపితామహుండు పత్నీసమేతంబుగా నాతనిం గని. 1565

సీ. నాయన మేము సనాతనాచారంబు, వదలి యధర్మవివాదములను
గావించుచును నంతకాలంబువఱకును, జీవించితిమి దానఁజేసి మాకు
దేహాంతమునఁ దటస్థించె రౌరవదుర్గ, తిని బడి దుఃఖ మొందెడియవస్థ
గడచె సహస్రయుగంబు లిప్పటి కింక, నెంతకాలం బిట్టు లేడ్వవలెనొ

గీ. యని వగచు చుండ మేము నిరంతరంబు, సలిపితివి నేఁడు మధువనశ్రాద్ధమునను
మాకు నుచ్చైఃపదస్థితి చేకుఱంగ, నీవు చేసినయుపకృతి యేమిచెప్ప. 1566

క. అనవుడు వారల కాలం, దొనరించి ప్రణామ మూరకుండుటయును దీ
వన లిచ్చి వార లతనికిఁ, జని రతిహర్షమున విష్ణుసదనంబునకున్. 1567

వ. అంతట నాతనిపూర్వజన్మప్రపితామహుం డి ట్లనియె. 1568

సీ. తండ్రి భవత్ప్రపితామహుండను నేను, బూర్వజన్మంబున భ్రూణహత్య
గావించి తత్పాతకంబున ఘోరదు, ర్గతులందుఁ గూలి దుఃఖములు చెంది
కడ కిలలోన సూకరగర్భమునఁ బుట్టి, మలభక్షణంబును జలిపి చలిపి
శునకగర్భంబున జనియించి తరువాతఁ, బడి పడి పడరానిబాధ లెల్ల

గీ. నవల వృక్షంబుగను బుట్టి యమితదుఃఖ, మనుభవించి వచింప నో రాడ కునికిఁ
గడపి మన్వంతరశతంబు కడకు నేఁడు, దురితముక్తుండ నైతి నీకరుణచేత. 1569

క. అనవుడు మునితనయుం డి, ట్లనియెను నీ వెట్లు భ్రూణహత్యను గావిం
చినవాఁడవో వచియింపుము, కనికరమున నాకు వినఁగఁ గాంక్ష జనించెన్. 1570

వ. అని యడుగుటయు నాతనికిఁ దత్ప్రపితామహుం డి ట్లనియె. 1571

సీ. మున్ను బ్రాహ్మణవంశమున నేను జనియించి, ధనలోభమునఁ మంత్రతంత్రవిధుల
నేర్చి యౌషధముల నెలఁతల కిచ్చుచు, నార్జించు చుంటి ద్రవ్యంబు దాన
నధనునిజ్ఞానంబు హరియించు లోభంబు, కల్యాంబువును రవి కొనినయట్లు
జ్ఞానంబు నశియింపఁ జలువు పాపము దాన, నరకంబు హీనజన్మమును బొందు

గీ. నట్లు లుండంగ నొకదిన మందు నొక్క, గర్భవతి యరుదెంచి నాకడకు స్వామి
కంటి నిప్పటి కార్గురు కన్యకలను, జెప్పు మీగర్భమున నెట్టిశిశువు కలదొ. 1572

క. అని ప్రశ్నించుటయును నేఁ, గనఁలను మూసికొని బకముకై వడి ధ్యానం
బును జేసినట్టు లభినయ, మొనరించి క్షణంబు పిదప నూఁపుచు శిరమున్. 1573

గీ. తెలిచి కన్నుల మెల్లఁగాఁ దెలిన నీకు, నిప్పుడును గన్యకయె పుట్టుఁ దప్ప దంటి
నంతటను నామె పడి మదీయాంఘ్రులందు, నేడులుగఁ బాఱఁ గన్నునీ రేక్షఁ దొడఁగె.

సీ. ఆసమయమున నే నాయమ నోదార్చి, యింతి నీ వేడ్వంగ హేతు వేమి
చెపుము నావుడు నామె క్షితిసురోత్తమ నాకుఁ, బ్రభవించె నేని సప్తమకుమారి
చావు సిద్ధం బని జాతకంబున నుండె, నేఁ జేయవలసిన దేమి యింక
ననవుడు నిదె సమయంబు ద్రవ్యము లాగ, నని యెంచి మది నిట్లు లంటి నేను

గీ. కలికి భయపడవలదు నీగర్భకన్య, పురుషుఁ డగునట్లు లౌషధంబును నొసంగు
వాఁడ నని చెప్పుటయును నవ్వనిత నిధిని, గన్నపేద తెఱంగునఁ గని ముదంబు. 1575

క. తనచెఱఁగులోనఁ గట్టిన, కనకపలం బొసఁగి నాకుఁ గరుణఁ జూపుము న
న్ననుటయును శీఘ్రకాలం, బున నిచ్చెద నౌషధంబుఁ బురుషుఁడె పుట్టన్. 1576

క. అని చెప్పి యాయమను నే, ననిపి గృహంబునకుఁ బిదప నాలోచనముం
బొనరించి మానసముననె, కని యొక్కయుపాయమును సకౌతుకమతి నై. 1577

ఆ. పనిచినాఁడ గర్భపాతంబు గావించు, నౌషధంబు నపుడె యామెదాసి
చేతి కిచ్చి దాని నాతన్వి భుజియించెఁ, గొడుకు పుట్టుననెడికుతుకమునను. 1578

ఆ. అంత నాఁటిరేయి నయ్యె గర్భస్రావ, మాపడంతి కామె యది తృతీయ
మాస మగుట శిశువు మగవాఁడొ యాఁడుదొ, యెఱుఁగదాయెఁ జిహ్న మేరుపడమి.

సీ. అంతట మఱునాఁడు చింతతో నాయింతి, యేతెంచి నాయింటి కేడ్చి యచట
నొకటి చేయఁగఁబోవ నొకటి యయ్యె మదీయ, పాపకర్మమున నిర్భాగ్య నగుట
నని పల్కి నాద్రవ్యమును నా కొసంగుము, చనియెద నవుడు నాచాన కపుడె
మును నేను జేసి యుంచిననిశాభస్మాన్వి, తేష్టికాచూర్ణంబు నిట్టె చూపి

గీ. తల్లి యీయౌషధంబును ద్రవ్యనిమిత్త, మొనరిచితి దీనిలోన నీ వొసఁగినట్టి
ధనముకంటెను నిబ్బడిధనము పడియె, నడుగరా దని యిపుడు నిన్నడుగ నైతి.

క. అనవుడు నాయమ యేమియు, ననకుండఁగఁ బోయె నింటి కానతముఖి యై
వినిచితిని నేను గావిం, చినపాపము దాఁపకుండఁ జివరకు నీకున్. 1581

క. మధువనతీర్థశ్రాద్ధం, బధికాధికఫలద మగుట నతిఘోరాఘౌ
దధినుండి గట్టుఁ జేరిచె, నఘోగతులలోనఁ జిక్కి యల్లాడుననున్. 1582

క. అని చెప్పుటయును వందన, మొనరిచి మునిపుత్రుఁ డూరకుంటయు నేఁగెన్
దనప్రపితామహుఁడు రయం, బున వైకుంఠంబునకుఁ బ్రమోదముతోడన్. 1583

వ. అంతటఁ దత్పూర్వజన్మప్రపితామహి యి ట్లనియె. 1584

గీ. తండ్రి నరకాగ్నిలోఁ గ్రాఁగి తల్లడిల్లు, చున్నన న్నిప్పు డమృతాబ్ధి నోలలార్చి
సౌఖ్యపఱిచితి మధువనశ్రాద్ధమునను, నీకతంబున ధన్యత నాకుఁ గలిగె. 1585

క. అని చెప్పి తత్ప్రణామం, బును గొని వైకుంఠమునకుఁ బోయె సుపర్వుల్
తనవెంట నరుగుదేరఁగ, వినుతించుచు విష్ణునగరవీథులలోనన్. 1586

సీ. అంతట మునిపుత్రుఁ డరుదెంచి మరలను, జనకాశ్రమమునకు సత్వరముగ
నెఱిఁగింప జరిగినవృత్తాంత మఖిలంబు, నమ్మహాముని ప్రమోదమ్ము నొంది
యాశ్రమభారంబు నాత్మజన్మునిపైని, నునిచి తా మధువనంబునకు నేఁగి
యచ్చట స్నానంబు నాచరించుచును వి, శ్రాంతితీర్థాంబుపూరంబునందుఁ

గీ. గొంతకాలంబు గడపి నిశ్చింతముగను, స్నాన మొనరించుచును నొక్కనాఁడు విష్ణు
దర్శనము గోర శార్ఙ్గి తత్క్షణమునంద, యతనిముంగల నిల్చి ప్రత్యక్షముగను. 1587

క. తనగరుడవాహనముపై, నునిచికొని తపోధనుని మహోత్సాహమునన్
జనియెను వైకుంఠమునకు, ననిమిషులును మునులు విస్మయంపడు చుండన్. 1588

సీ. అని చెప్పుటయు శిబి విని సర్వమును నొక్క, సంశయం బుదయింప స్వాంతమందు
నారద పితృగణోద్ధారకుం డగుమహా, త్ముం డేకతంబునఁ గుండుఁ డయ్యె
విశదంబుగను నాకు వినిపింపుము తదీయ, వృత్తాంతమును విన వేడ్క గల్గె
ననుడు నారదుఁ డిట్టు లనియె నాతనిఁ జూచి, విశ్వంభరాధీశ వినుము వినుతుఁ
గీ. జేరి ఋషు లెల్లరును హరిద్వారమందు, జ్యేష్ఠసితదశమీతిథి నేకతమున
నుండ నచ్చటి కపుడు బుధుండు రాఁగ, నందఱును లేచి కూర్చుండి రతఁడు మ్రొక్క.
సీ. అం దొక్క మునిపుత్రుఁ డది యెల్ల వీక్షించి, యాశ్చర్య మొదవంగ నాత్మలోనఁ
దనజనకునిఁ గనుంగొని యి ట్లనియెఁ దండ్రి, యీచిన్నవాఁ డెవ్వఁ డితఁడు రాఁగ
మునులెల్ల గౌరవంబున లేచి రనవుడు, వాని కి ట్లనియెను వానితండ్రి
తనయ యీతఁడు గురుతనయుండు బుధుఁ డను, వాఁడు చంద్రాన్వయవర్ధనుండు
గీ. నావుడుఁ దదుక్తు లెల్లఁ దన్నందనుండు, విని మరల నిట్టు లనియెను జనక నీవు
చెప్పినది సంగతము గాదు జీవసుతుఁడు, హిమకరాన్వయవర్ధనుం డెట్టు లయ్యె. 1590
సీ. అనవుడు వానికి నమ్ముని బుధజన్మ, వృత్తాంత మంతయు నెఱుఁగఁజేయ
మునికుమారుండు పక్కున నవ్వి యీతఁడు, కుండుఁడా యని యూరకుండె నంత
సర్వభూతాంతరజ్ఞాత యైనబుధుండు, గ్రహియించి తద్దాసకారణంబు
మునిసభలోన నమ్మునిపుత్రునకు శాప, మిచ్చెఁ గుండుండుగా నిలను బుట్ట
గీ. నంతఁ దజ్జనకుండు బుధాంఘ్రులందు, నిజతనూజునిఁ బడవైచి నిర్మలాత్మ
తగదు బాలుని శపియింపఁ ద్వాదృశులకు, నగునె పిచ్చుకపై నిబ్రహ్మాస్త్ర మేయ.
సీ. రాదు సాధువుల కాగ్రహ మెప్పుడును గూడ, నేకతంబున నైన నెన్నఁ డేని
వచ్చినఁ గ్రోధంబు వహ్నితప్తం బైన, యుదకంబు శైత్యంబు నొందినట్లు
క్షమచేత శమియించుఁ గాన క్షమాసారు, లని చెప్పుదురు సాధుజనుల బుధులు
జ్ఞానవివర్జితుం డైనబాలకుని న, నుగ్రహింపుము వీడి యాగ్రహంబు
గీ. నని వచించుటయును బుధుం డాగ్రహంబు, నుడిగి తాపస నీపుత్రుఁ డుర్విలోనఁ
బుట్టినను గుండుఁ డై జ్ఞానమునను మేను, విడిచి జన్మాంతరంబునఁ బడయు ముక్తి.
ఆ. అని యనుగ్రహించి చనియె నాతాపస, సుతుఁడె కుండుఁడుగను క్షితిని బుట్టి
ప్రమంది మరలఁ బుట్టి మానిసూతిగఁ బిత్రు, గణము నుద్ధరించి కాంచె ముక్తి. 1593
క. ఈమధువనమాహాత్మ్యము, నేమానవుఁ డేని వినిన నిహలోకమునన్
క్షేమమును బొంది పరమున, దామోదరసన్నిధానదాస్యముఁ బడయున్. 1594
క. అని చెప్పుటయును శిబి యి, ట్లనియెను మహనీయ బదరికాశ్రమమహిమం
బును వినఁగ నాకు వేడుక, జనియించెను మదిని జెపుము సవిశేషముగన్. 1595
వ. అని యడుగుటయు నారదుం డాతని కి ట్లనియె. 1596

—: ఇంద్రప్రస్థబదరికాశ్రమమాహాత్మ్యము :—

సీ. జననాథ మధువనంబునకు నేకాదశ, కార్ముకపరిమితక్ష్మాతలమునఁ
బరమపావన మైనబదరికాశ్రమ ముండె, దానిమాహాత్మ్య మత్యద్భుతంబు
వినుము దృష్టాంతంబుగను నీకు నే నొక్క, వృత్తాంతమును వచియించువాఁడ
మున్ను మగధదేశమున నొక్కధాత్రీసు, రుం డుండె దేవదాసుండు నాఁగ
గీ. నాతనికి నుండె నుత్తమ యనెడిపత్ని, నామధేయార్థ శీల యానళినముఖికిఁ
బుట్టె రంగదుఁ డనియెడిపుత్రుఁ డొకఁడు, వలయ యనుకన్య యొకతెయు వర్ణ్యగుణులు.
క. వారికి విద్యాబుద్ధులు, నేరిపి సుగుణముల కెల్ల నిధు లని లోకుల్
పేరుకొనుయోగ్యతను జే, కూరిచి తలిదండ్రు లాదవఁ గుతుకం బెదలన్. 1598
గీ. యుక్తకాలములందు శాస్త్రోక్తవిధిని, బరిణయంబులు సేసిరి ప్రజలు పొగడ
నవల భర్తృగృహంబున కరిగె వలయ, యంగదుఁడు గృహకార్యధుర్యత వహించె.
గీ. అంతటను దేవదాసుఁ డాహ్లాద మొదవఁ, దనవధూటిని బిలిచి యి ట్లనియెఁ దన్వి
చేయవలసినకార్యముల్ చేయఁబడియెఁ, గొడుకు గృహకార్యనిర్వాహకుశలుఁ డయ్యె.
సీ. శమియింప నున్నది జవ్వనం బౌసన్న, మైనది జర యది యంతె నేని
శాంతింపఁజేయు సచంద్రనక్షత్రకాంతి, తిని బ్రభాతమువోలె నేత్రశక్తి
గమనసామర్థ్యంబును గలుగంగఁ జేయును, బంధశృంఖలువోలెఁ బాదములకుఁ
గంపింపఁజేయు నంగములను మేదినీ, రుహదళంబులను మారుతమువోలెఁ
గీ. గాన జర రాకమునుపె శీఘ్రముగ నేఁగి, పుణ్యతీర్థంబులకు స్నానములను గాయ
శుద్ధి గావించుకొని చిత్తశుద్ధి దానఁ, దనరఁ దరియించుగతి చూచుకొనఁగవలయు.
గీ. చచ్చువఱకును మోహపాశమునఁ జిక్కి
విడువఁ జాలక సుతదారవిత్తములను
నేడ్చు చుండును మూఢుఁడు గృహమునందె
బుధుఁడు వైరాగ్యమున సర్వమును ద్యజించు.
ఆ. ఆత్మ నాత్మ తప్ప నన్యులు తరియింపఁ, జేయఁజాల రనుట చివరమాట
దాని నెఱిఁగి ప్రాజ్ఞు లైనవారలు భవ, రక్తి విడుతు రాత్మముక్తికొఱకు. 1603
క. కావుననె తీర్థయాత్రను, గావింపఁగ నేఁడు వాంఛ గలిగెను నాకున్
నావుడు నుత్తమ యుత్తమ, భావ యగుట నిట్టు లనియె బహుభక్తి మెయిన్. 1604
ఆ. పతిని విడిచి యుండ భావ్యంబె సాధ్వికి, నరునివెంట నీడ యరుగ కున్నె
యనుడు దేవదాసుఁ డామెభావమునకు, సంతసంబు నొంది స్వాంతమందు. 1605
గీ. ఆమెతోడను బయనమై యాత్మజుండు, కొంతదూరంబు తమవెంటఁ గూడిరాఁగ
నతని సామోక్తులను నింటి కనిపి పైని, నరుగు చుండంగ మార్గమధ్యంబునందు.
క. కనఁబడుటయు నొకసిద్ధుం, డొనరించి ప్రణామ మాగుణోత్తరునకు ని
ట్లనియె మహాత్మ వచింపుము, వినఁగ భవద్గాథ నాకు వేడుక గలిగెన్. 1607

వ. అని వేఁడుటయు నాసిద్ధుండు దేవశర్మున కిట్లనియె. 1608

సీ. క్షితిసుర నే నొకసిద్ధుండ సాంఖ్య మిం, ద్రప్రస్థపుణ్యతీర్థంబునందు
విష్ణుతుల్యుండు గా వెలసినకపిలుని, యొద్దఁ జరించుచు నుండుతఱిని
నొకనాఁడు మాగురుం డొనరింప స్నానంబు, యమునలో శిష్యసమన్వితముగఁ
జని బదరీక్షేత్రమునకుఁ దత్పుణ్యాత, రంగిణిలోన మునుంగ నుండ

గీ. నప్పు డొకకాసరము వచ్చి యందు మునిఁగి, లేచి యట నున్నకపిలునిఁ జూచి మర్త్య
వాక్కుతో నిట్టు లనియెను స్వామి యిపుడె, సంస్మృతం బయ్యె నాపూర్వజన్మగాథ.

గీ. ఈమహాపుణ్యతీర్థ మేనామమునను, వెలసి యున్నదొ చెప్పుము వినఁగ నాకు
ననుడు మాదేశికుం డిట్టు లనియె నవ్వి, యేమొ నీపూర్వవృత్తాంత మెఱుఁగఁ జెపుమ.

సీ. అనుడు నామహిష మి ట్లనియె స్వామి వచింతు, వినుము నాకథ యెల్ల విశదముగను
మున్ను నేను గళింగమునకుఁ బ్రభుండనై, ధనమదాంధ్యంబు నేత్రములఁ గప్పఁ
గామంబు తలకెక్కఁ గనఁబడ్డసతి నెల్ల, గ్రహియించుచును బలాత్కారమునను
వనసామజముపోలె వర్తించుచుండంగ, నన్యులవలన భయంబు లేక

గీ. ప్రజలు నాదౌష్ట్యమును సహింపంగలేమిఁ, జనఁగఁ బరదేశమునకు రాష్ట్రమును విడిచి
యుద్యమించుచు నుండంగ నొక్కదినము, నందు దుర్వాసుఁ డచ్చటి కరుగుదెంచె.

క. అరుదేరఁగ దుర్వాసుం, డరిగి యతనికడకుఁ బౌరు లందఱు నాదు
శ్చరితమును జెప్పి యమ్మునిఁ, జరణంబుల మీఁద వ్రాలి సంక్షోభింపన్. 1612

సీ. అంతట దుర్వాసుఁ డాగ్రహావిష్టుఁడై, సఖులతో నే నున్నసమయమందుఁ
జనుదెంచుచుండ మత్సదనంబులోనికి, నతని నెట్టంగ నే ననుప భటుల
వారల నతఁడు హుంకారమాత్రంబుచే, క్షణకాలముననె భస్మం బొనర్చి
ననుఁ జూచి మహిషమై వనములోఁ జరియింపు, మని తిట్టి స్వాశ్రమంబునకుఁ బోయె

గీ. నంతటను నాకు రాజదేహంబు పోయి, కాసరశరీరము జనింపఁ గానలందుఁ
దిరిగి బహుకాల మిచటి కేతెంచినాఁడ, నాయొనర్చినపూర్వపుణ్యమున నేఁడు. 1613

సీ. అని వచించుటయు ని ట్లనియెను గపిలుఁడు, వసుధాధినాథ పూర్వంబు నీవు
పొనరించితివొ యేమి పుణ్యంబు నుడువుము, నాఁగ ని ట్లనియె నానరవరుండు
నెలకొల్పితిని గూపములఁ దటాకముల వృ, క్షములను లోకోపకారకముగ
దాన నీపుణ్యతీర్థమున మునుఁగుటయుఁ బ్రా, గ్జన్మసంస్మృతియును సంఘటిల్లె

గీ. నింక నీకాసరశరీర మెట్లు నాకుఁ, దొలఁగి వెంటనె త్రిదివంబు కలుగఁగలదొ
చెపుము దయతోడ మఱవ నీచేయునట్టి, యుపకృతిని నెన్నటికిఁ గూడ నుల్లమందు.

వ. అని వేఁడుటయుఁ గపిలుం డాతని కిట్లనియె. 1615

సీ. ఇది బదరీతీర్థ మిందు స్నానము చేయు, నప్పుడె సంకల్ప ముప్పతిలునొ
తత్సిద్ధి గలుగు నేతత్తీర్థమునఁ దీర్థ, మాడినవెంటనె యద్భుతముగఁ

గావున నీక్షుద్రకాయంబు దొలఁగంగ, స్వర్గంబు గలుగంగ స్వాంతమందుఁ
దలఁచి యీనీటను జలుపుము స్నానంబు, శీఘ్రంబ నీకుఁ దత్సిద్ధి గలుగు
గీ. ననుచు నమ్మునివచియించినట్ల లోనఁ, దలఁచికొని యానృపాలుఁడు సలిపె నందు
స్నానమును వెంటనె తొలంగి సైరిభాంగ, మమరతను వాతనికిఁ గల్గె నద్భుతముగ.
గీ. అంతటను శక్రుఁ డచ్చటి కరుగుదెంచి, యతని నెక్కించుకొని దివ్యయానమందు
నరిగెఁ ద్రిదివంబునకు మును లనిమిషులును, జేయు చుండంగ నుతులను వేయినోళ్ళ.
క. కావున మీ రాత్రిభువన, పావనతీర్థమున కరిగి పడయుఁడు ముక్తిన్
గావించి యందు స్నానము, భావంబున మోక్షవాంఛ పరుగుచు నుండన్. 1618
చ. అని వచియింపఁగన్ బదరికాశ్రమభూమికి నేఁగి దానిలో
నొనరెడిపుణ్యతీర్థమున నుత్తము లైనతపోధనాగ్రణుల్
మునుఁగుచు నుండఁ జూచి కడుమోదము సంఘటిలంగ స్నానముం
బొనరిచి మోక్షకామమున ముక్తిని బొందిరి విప్రదంపతుల్. 1619
గీ. భక్తితో విన్నయెడ హరిప్రస్థసంస్థ, బదరికాశ్రమతీర్థప్రభావ మెవ్వఁ
డేని తత్తీర్థమున మున్గుమానవునకుఁ, గలుగుపుణ్యంబు నార్జించు సులభముగను.

—: ఇంద్రప్రస్థహరిద్వారమాహాత్మ్యము :—

సీ. మఱియు నీ కొకగాథ యెఱిఁగించెదను విను, కాళింగుఁ డనెడితస్కరుఁ డొకండు
చండాలకులభవుం డుండె హరిద్వార, మందు వాఁ డెపుడును నర్థవాంఛఁ
గావింపరానిదుష్కార్యముల్ చేయుచు, నొకనాఁడు రవిపర్వ మొదవుటయును
నచటికి స్నానార్థ మరుగుదెంచినయొక, యర్యునిద్రవ్యంబు నపహరించె
గీ. నంతటను వైశ్యసేవకు లతనిఁ బట్టు, కొనఁగఁ బరువెత్త నందిర్వురను వధించి
వాఁడు మరణించె మూఁడనవానిచేత, నపుడు మూఁడువిమానంబు లటకు వచ్చె.
ఆ. అరుగుదెంచినట్టియావిమానములపై, దివ్యదేహములను దేజరిలుచు
నధివసించి చచ్చినట్టియామువ్వురు, గగనవీథియందుఁ గానఁబడుచు. 1622
సీ. కని యూరుజుని నిట్టు లనిరి పుణ్యాత్మ మా, తుచ్ఛశరీరముల్ తొలఁగిపోయి
దివ్యదేహములు ప్రాప్తించె నీపుణ్యతీ, ర్థమునందు విడుచుటఁ బ్రాణములను
నమరలోకమునకు నరుగుచుంటి మటంచుఁ, దెలిపి యాక్షణమందె దివికిఁ జనిరి
యంతట నావైశ్యుఁ డాత్మసేవకులకుఁ, జలిపి విధ్యుక్తసంస్కారములను
గీ. వారిశల్యంబులను హరిద్వారతీర్థ, గంగలోఁ బడవైవ నాక్షణమునంద
త్రిదివమునుండి వార లేతెంచి యిట్టు, లనిరి వైశ్యునిఁ జూచి యాహ్లాద మొదవ.
గీ. స్వామి మృతు లైనవారలశల్యములను, నిమ్మహాపుణ్యతీర్థతోయమ్ములోనఁ
గలుప మృతులకు బ్రహ్మలోకంబు గలుగు, స్థలమునవె యున్న నస్థులు గలుగు దివము.
ఆ. కాన నీవు మాకుఁ గావించినమహోప, కారమునను దివము గడచి మేము
చనుచు బ్రహ్మలోకమునకు నీవిషయంబు, తెలుపఁ నీకు వచ్చితిమి మహాత్మ. 1625

క. అని చెప్పి కన్నులారఁగఁ, గనుచుండఁగ నూరుజుండు గగనవిమానం
బున బ్రహ్మలోకమునకుఁ, జనిరి హరిద్వారమహిమ శక్యమె పొగడన్. 1626

గీ. అంతటను నూరుజుండు ప్రత్యక్షముగను, గాంచుటను దన్మహత్త్వ మక్కడనె యుండి
మునుఁగుచును గంగలోపల ననుదినంబుఁ, బొందె దేహావసానమునందు ముక్తి. 1627

గీ. అనుడు శిబి యిట్టు లనియె మహానుభావ, వింటి శ్రావ్యంబుగ ననేకవిషయములను
నింకఁ బుష్కరతీర్థమహిమ వచింపు, మని యడుగ నారదుం డిట్టు లతని కనియె.

—: ఇంద్రప్రస్థపుష్కరతీర్థమాహాత్మ్యము :—

సీ. కలఁడు విదర్భనగరమున మాలవుం, డనియెడియొక్క బ్రాహ్మణుఁడు మున్ను
తత్త్వజ్ఞుఁ డగుట నాతఁడు సంసృతిని రోసి, సన్న్యసింపఁ దలంచి స్వాంతమందుఁ
జని గౌతమికి బృహస్పతి సింహగతుఁ డైన, తఱి స్నాన మొనరించి దానిలోన
నాత్మస్వసృతనూజుఁ డగుపుండరీకుండు, సకలపావనగుణశాలి యగుట

గీ. నాతని కొసంగి స్వసమార్జితార్థమందు, సగము సగ మిచ్చి తదితరబ్రహ్మసురులకు
సన్న్యసింపంగ నంతఁ దత్స్వస్రసుతుండు, స్వధనమున నాలుగవపాలు బుధుల కిచ్చి.

క. కొని మిగిలినధనభాగముఁ, గొని మాతులునాజ్ఞ విడిచి గోదావరి న
ల్లన నీపుష్కరతీర్థం, బునకుం జనుదెంచి స్నానమును గావింపన్. 1630

ఆ. పుష్కరమున నొక్కభూప్రదేశమునందు, నోడలినుండి రక్త మురలుచుండ
నగలికముగఁ బతితుఁ డై యున్నభరతునిఁ, గాంచి కళవళంబు గదుర మదిని. 1631

క. అక్కట యనుజున కీగతి, యిక్కడఁ గలుగంగ నేమిహేతువొ యనుచున్
బొక్కుచు నుండఁగ మదిలోఁ, గ్రక్క రుధిర మతఁడు నోటఁ బ్రాణము విడిచెన్.

సీ. అంత దివ్యవిమాన మటకు రా భరతుండు, దివ్యదేహంబుతోఁ దేజరిలుచు
నం దధిష్ఠించి యి ట్లనియెను బుండరీ, కునిఁ జూచి యగ్రజ వనరవలదు
భవదనుజుఁడ నేను భరతాభిధానుండ, వినుము నాచరితంబు వినుతు నీకు
ద్యూత మాడుటయుఁ జేయుటయుఁ జౌర్యము ప్రభావతి యనువేశ్యతో వర్తిలుటయు

ఆ. మదర ద్రావుటయును మద్భాగధన మెల్ల, నార్చుటయును దెలిసినదియ నీకుఁ
గాని తెలియనట్టికార్యంబు గల దొండు, తెలుపువాఁడ దానిఁ దేటపడఁగ. 1633

వ. మాతులుండు దానపాత్రుండ వగునీకుఁ దనధనం బెల్ల నొసంగి తాను సన్న్యాసంబుఁ గైకొనఁదలంచి నిన్నుఁ దోడ్కొని గోదావరి కేఁగె ననువార్త యొకపక్షంబు గడచిన పిదప నాచెవింబడ నేను గామాంధుండ నగుటచే యుక్తాయుక్తంబు లెఱుంగక నీవు ధనముం దీసికొని పుష్కరతీర్థంబునకు వత్తు వనియు నచ్చట నిన్ను వధించి యాధనముం గొనివచ్చి ప్రభావతికి సంతోషముం గలిగింపవలయు ననియు నాలోచించి వచ్చి పుష్కరతీరంబున నీకొఱకు వేచికొనియుంటి. 1634

సీ. అంతలోపలఁ గొంద ఱర్యులు వాణిజ్య, మున గడించి ధనంబు పూర్ణముగను
బోవుచు నిజగృహంబులకు నివ్వోటికి, విచ్చేయఁగను రాత్రివేళ యగుట

నిచటనె శయనించి నేను గూడను బండు, కొంటె వారలుపండుకొన్న చోట
నర్ధరాత్రంబు గా నపహరింపంగఁ ద, ద్ధనమును నే లోనఁ దలఁచు చుండ
గీ. నెవఁడో తస్కరుఁ డపు డిట కేఁగుదెంచి, తద్ధనము గొనిపోయెడి తఱిని దాని
నపహరింపంగ నే నెంచి యాత్మలోన, వాయువేగంబునను బోతి వానివెంట. 1635
ఆ. అపుడు తిరిగి వెనుక కాతఁడు ననుఁ జూచి, యాకెతోడఁ బొడిచె నెడఁద యగల
నంత నేను ఖడ్గహస్తుండ నయ్యును, బోర శక్తి లేమి భువిని బడితి. 1636
సీ. అంతట వాఁ డేఁగె నతిరయంబున గుండె, చెదరుటచే నేను స్మృతి తొలంగఁ
బ్రాణావశిష్టుండ నై యిట నుండంగ, నీ వేఁగుదెంచితి వింతలోన
నిను గనుంగొనినవెంటనె ప్రాణములు పోయెఁ, బోవుటఁ బ్రాణముల్ పుష్కరమునఁ
బాపి నై నను నాకుఁ బ్రాప్తించె స్వర్గంబు, పూతుండ నై నేను బోవుచుంటి
ఆ. ననుడుఁ బుండరీకుఁ డాశ్చర్యమును జెంది, యనుజ నీకు నిచట నసుఖముక్తి
గలుగ నేమి పుణ్యకర్మంబు చేసితో, తెలిసె నని నాకుఁ దెలుపు మయ్య. 1637
వ అని యడుగుటయుఁ బుండరీకునకు భరతుం డి ట్లనియె. 1638
సీ. ద్యూతంబులో జయ మొంది నే నొకనాఁడుఁ గొని ధనం బింటికేఁ జనుచునుండ
మార్గమధ్యంబున మాణవకుఁ డొకండు, మృతుఁ డయి పడియుండ నేను వాని
నిడికొని తలపైని నేఁగి గంగకు దాని, తటమున శవమును దగులఁబెట్టి
కలిపి తదస్థులు గంగలోఁ దత్కార్య, మునకు ద్యూతార్జితధనము నెల్ల
గీ. వ్యయ మొనర్చితిఁ దత్పుణ్యవశముచేత, నేఁడు పుష్కరమున నాకు నిధన మబ్బె
నిచట మద్దేహమును దహియించి నీవు, చెందుము కృతార్థతను నేను జెందినట్లు.
క. అని చెప్పి త్రిదివమునకుఁ, జనుటయుఁ దత్కాయమునకు సంస్కారంబుఁ
బొనరించి పుండరీకుఁడు, మనమునఁ దలఁచుచును దీర్థమాహాత్మ్యంబుఁ. 1640
గీ. మాఘమాసంబునం దెల్ల మాధవుండు, నానికేతనమందు నుండంగవలయు
ననెడిసంకల్పమున స్నాన మచటఁ జేసి, స్వగృహమున కేఁగి భరతునివార్తఁ దెలిపె.
గీ. అపుడు తనబాంధవులలోన నజ్ఞులైన, వారు శోకంబు నొందిరి వానిమృతికిఁ
బ్రాజ్ఞు లగువారు సంతోషపడిరి వాఁడు, పడసినత్రివిష్టపావాసభాగ్యమునకు. 1642
ఆ. అంతఁ గొంతకాల మరుగంగ మాఘమా, సంబు వచ్చుటయును జక్రపాణి
ప్రీతితోడఁ బుండరీకునిగృహమున, కరుగుదెంచె గరుడి నధివసించి. 1643
ఆ. అపుడు పుండరీకుఁ డానంద మొదవంగ, ననుదినంబు శౌరి కర్చనంబు
సలుపుచును నొనర్చి జాహ్నవీస్నానంబు, గడపె మాఘమాసకాల మెల్ల. 1644
సీ. అంత నాతనిభక్తి కానందమును బొంది, హరి యిట్టు లనియె భక్తాగ్రగణ్య
యొకదినంబునను మ న్నొనరించుటను నీవు, పుష్కరస్నాన మాపుణ్య మున నె
క్రీతుండ నై యుంటి నీతపోమాస మం, తయును దావకనిశాంతమున నేను
పుష్కరైకస్నానమునఁ జేసి జాహ్నవీ, పూర్ణమాసస్నానపుణ్య మొదవు

గీ. నని ప్రబోధించి తార్క్ష్యవాహనముపైని, నతని నెక్కించుకొని యట కరుగుదెంచి
ముక్తికై పుష్కరంబున మునుఁగఁజేసి, చనియె వైకుంఠమునకుఁ దత్సహితముగను.
క. అని చెప్పుటయును శిబి యి, ట్లనియెఁ దపోధన యిఁకఁ బ్రయాగమహాత్త్వం
బును జెపుము వినఁగ నాకున్, జనియించెను గోర్కి నాఁగ నారదుఁ డంతన్. 1646

—: ఇంద్రప్రస్థప్రయాగమాహాత్మ్యము :—

సీ. శిబిచక్రవర్తి నీక్షించి యి ట్లనియెఁ బృ, థ్వీపాల నర్మదాతీరమందు
మాహిష్మతి యనునామమున విశ్రుతి గన్న, నగర మొం డుండె నానగరమందుఁ
గలదు మోహిని యనువెలయింతి యొక్కతె, యాపె రూపమునను యౌవనమున
నృత్యగీతములను నిశ్చేష్టుల నొనర్చి, పురుషుల బహుధనంబును గడించి
గీ. క్రమముగను జవ్వనమును రూపమును బోయి, వార్ధకము రాఁగ వైరాగ్యవశముచేత
దానధర్మంబులకుఁ దనధనము నెల్ల, వ్యయము గావించి గృహమును వదలిపెట్టి.
క. చనుచుండఁగ వనమార్గం, బునఁ దస్కరు లడ్డగించి మోదఁగ నాయం
గన చేష్ట దక్కి పడ నా, వనభూమిని జనిరి విడిచి వా రావనితన్. 1648
సీ. ఆసమయమునఁ బ్రయాగతీర్థమునుండి, చనుదెంచుచును నొక్కభూసురుండు
కొనప్రాణమునఁ గొట్టుకొనుచుండు నామెను, గాంచి తాఁ దెచ్చినగాంగజలము
కొంచె మాయమనోట నుంచి చూచుచు నుండ, నది త్రావుకాలమునందు నామె
మహిషిగా నుండంగ మది నెంచుచును వీడు, టను మేను కేరళేశునకుఁ బుట్టి
గీ. సార్థకంబుగ హేమాంగి యనెడిపేరు, వడసి ద్రావిడవసుమతీపాలకునకు
మహిషి యై తనభాగ్యంబు మహిళ లెల్ల, సన్నుతించుచు నుండంగ సంతసిలుచు.
సీ. ఒకనాఁడు మంత్రిపుత్రిక యను నిజవయ, స్యయు నైనకలయింటి కరిగి తాను
గావింప నామె సత్కారంబు గైకొని, సలుపుచుఁ దాంబూలచర్వణంబు
చెలి నీగృహంబునఁ జిత్రవస్తువు చూపు, మే దేని కల దేని యిపుడు నాకు
ననవుడుఁ గల తెచ్చి తనహేమమంజూష, నుంచి యాహేమాంగియొద్దఁ దెఱచె
గీ. నప్పు డారాజమహిషి తదంతరస్థ, మైనపుస్తకమును గొని హస్తమునను
నదులను ద్వీపములను సముద్రములను, ఖండములను స్రవంతులఁ గాంచి యందు.
సీ. కొనకు యమస్వస్రుకూలస్థ మైనయిం, ద్రప్రస్థమును గాంచి దానిలోనఁ
దీర్థరాజాఖ్యచేఁ దేజరిల్లెడిప్రయా, గముఁ జూచి తదవలోకనమువలనఁ
బూర్వజన్మస్మృతి పొడమంగ లజ్జచేఁ, వినమితవదన యై వేగ లేచి
చని నిజమందిరంబునకు భర్తమ జూచి, తనపూర్వజన్మగాథను వచించి
గీ. నాథ మన మేఁగవలయు నీనాఁడె తీర్థ, రాజమున స్నాన మొనరింప రమ్ము నాఁగఁ
గలుగమిని నమ్మకం బామెపలుకులందు, సంశయించుచు నుండంగ సౌమ్యవరుండు.
గీ. మానవాధిప హేమాంగిమాట లెల్ల, సత్యములు సంశయింపక చనుము సర్వ
కామదాయక మగుప్రయాగమున కనెడి, పలుకులు వినంబడియె వ్యోమపథమునుండి.

గీ. విస్మయము నొంది దానికి వీరవర్మ, సంశయము లెల్ల విడిచి తత్క్షణమునంద
రాజ్యమున నిల్పి మంత్రిని రథము నెక్కి, యాత్మసతితోడ వచ్చి ప్రయాగమునకు.
గీ. కలుగఁగను విష్ణుసంప్రీతి తలఁచికొనుచుఁ, దనవధూమణితోడ నుత్సాహమునను
స్నాన మొనరించెఁ దీర్థరాజమున నంత, నచటి కేతెంచి మాధవుఁ డజునితోడ. 1654
గీ. వారి నెక్కించుకొని నిజవైనతేయ, వాహనమునందుఁ బరమేష్ఠివాంఛవలన
సత్యలోకంబునకుఁ బోయి క్షణము నిలిచి, వచ్చి వైకుంఠమున కందు వారి నునిచె.
వ. ఇంకఁ గాశీగోకర్ణశివకాంచీతీర్థంబులమాహాత్మ్యముం జెప్పెద వినుము. 1656

—: ఇంద్రప్రస్థకాశీమాహాత్మ్యము :—

సీ. పార్థివోత్తమ హరిప్రస్థతీరమునఁ బ్రజ, కాశించు చుండెడికాశిలోనఁ
బూర్వము కృతయుగంబున శింశుపాహ్వయ, ధరణిజం బొకఁ డుండె దానిమీఁద
వాయసం బొకటి కులాయంబు నిర్మించు, కొని యుండె నద్దానికోటరమున
వ్యాళ మొక్కటి యుండె వాత్యచే నొకనాఁడు, పడిపోవ శింశుపాపాదపంబు
గీ. తత్ప్రమాదంబునను విషధరము చచ్చెఁ, గాకియును బ్రమందె నంతలోఁ గలిగె వ్యాళ
శింశుపాకాకములకు విచిత్రముగను, దివ్యదేహంబు లమితప్రదీప్తితోడ. 1657
ఆ. అప్పు డేఁగుదెంచె నమరవిమానము, లాకసంబునుండి యద్భుతముగ
నందుఁ గూరుచుండి యాదివ్యమూర్తులు, చనిరి వేగ విష్ణుసదనమునకు. 1658
క. అనవుడు శిబి యి ట్లనియెను, మునివర వా రెవరొ పూర్వమున నేపుణ్యం
బున విష్ణుపురికిఁ బోయిరొ, వినిపింపుము నాకు వినఁగ వేడుక గలిగెన్. 1659
వ. అని వేఁడుటయు నారదుండు శిబి కి ట్లనియె. 1660
సీ. ముని కురుజాంగలంబున శ్రవణుండు నా, నొకబ్రాహ్మణుం డుండె నుర్విలోన
నతని కుండిరి కుంఠ యనుభార్య యొక్కతె, యును గురంటకుఁ డనునను జుఁ డొకఁడు
శ్రవణుండు విప్రధర్మము మానుటను గొప్ప, ముగఁ జేయుటను మిష్టభోజనంబు
పొందె వాయసజన్మమును గురంటకుఁడు దూ, షించుచు దేవతాక్షితిసురులను
గీ. సలుపుచును వేదశాస్త్రదూషణము నిర్వి, శంకముగ సంచరించుట సర్ప మయ్యెఁ
గుంఠ తదుభయపాపానుకూలవృత్తి, నుండుటను వృక్ష మై వారి కండ యయ్యె.
సీ. ఇంకఁ దత్పుణ్యంబు నెఱిఁగింతు వినుము వా, రలు మువ్వురును నొక్క గ్రామమునకు
నరిగి యొక్కదినంబునందు వచ్చుచునుండ, రాత్రికాలమున స్వగ్రామమునకుఁ
బథమధ్యమున నొక్కపాంథుఁడు నిల్చి యీ, కూపంబునందు నాగోవు పడియెఁ
జావకపూర్వమె లేవఁదీయుం డని, యడుగ వారినిఁ గుంఠ యనుమతించె
గీ. శ్రవణుఁడు గురంటకుండును సాహసమున, బావిలో దూఁకి గోవును లేవఁదీసి
దరికిఁ జేర్చిరి యాసుకృతమున వారు, మువ్వురును గాశిలోఁ జచ్చి ముక్తు లైరి. 1662
గీ. అవనినాథ హరిప్రస్థమందు నున్న, కాశియును శివనగరియె కాని యిందు
బ్రమందువారికి వైకుంఠమందిరంబు, నందు వసతియు విష్ణుసఖ్యమును దొరకు. 1663

—: ఇంద్రప్రస్థగోకర్ణతీర్థమాహాత్మ్యము :—

సీ. గోకర్ణతీర్థమం దాకాశమున నేని, స్థలజలంబులను నెచ్చటను నేని
చచ్చినజంతువు శంకరుం డై ప్రకా, శించుచుఁ గైలాసశిఖరమందు
శివునితోఁ గూడను జెందు ముక్తిని నంతె, కాని పునర్జని కాంచఁ డిలను
మును నాకు బ్రహ్మ చెప్పినగాథ యొక్కటి, దృష్టాంతముగ నీకుఁ దెలుపువాఁడ
గీ. నొక్కగవ్యూతిదూరమం దున్నయది ప్ర, యాగమునకు మర్యాదాద్రి యందుఁ గర్క
టాఖ్యుఁ డగునొక్కవనచరుం డధివసించు, నా తనికి జర యనునొకనాతి యుండె. 1664
గీ. అప్పటికె నాపె భర్తల నైదుగురిని, విసముచేఁ జంపె నని తనస్వస వచింపఁ
దన్నుఁ గూడను నది చంపు నన్నబుద్ధి, దానిఁ జంపంగ ఖడ్గముఁ దాల్చి వాఁడు.
క. అరుదెంచుచుండఁగను దన, దరి కాపె గ్రహించి యడవిదారిం బడి వే
పరువెత్తఁ దొడఁగె నాతఁడు, పరువెత్తుచు నుండ వెంటఁబడి పట్టుకొనన్. 1666
ఆ. అట్లు పఱచి పఱచి యాజర గోకర్ణ, తీర్థభూమి కేఁగుదెంచి యవలఁ
బఱవలేక పట్టుపడి వానిచేతను, ఖడ్గనిహత యగుచుఁ గాయ ముడిగె. 1667
ఆ. అంత భిల్లుఁ డపగతామర్షుఁ డగుచును, దననివాసమునకుఁ జనియె నామె
పుణ్యతీర్థమందుఁ బొలియుటచే దివ్య, కాయ మొంది గౌరికడకు జనియె. 1668

—: ఇంద్రప్రస్థశివకాంచీమాహాత్మ్యము :—

సీ. అధిప యింద్రప్రస్థమం దుండు శివకాంచి, మహిమంబుఁ దెలుపంగ మాదృశులకు
శక్యంబు గా దందు శర్వుఁ డారాధించి, హరిని దత్త్వజ్ఞాన మతనివలనఁ
బడయుట మే మెల్లఁ బరమేశ్వరునిఁ గొల్చు, చుందుము శివకాంచియందు సతము
హాయనశతము బాణాసురుం డచ్చటఁ, గావించి తపము శంకరునికృపను
గీ. శివగణంబులలోపలఁ జేరి శివుని, స్వీయపురరక్షకునిగఁ గావించుకొనియె
నచ్చటను మున్ను శివునకు మెచ్చి శౌరి, వెలసె శివకాంచి యనుపేర విష్ణుకాంచి.
సీ. మఱియొకగాథ నీ కెఱిఁగింతు వినుము హే, రంబాహ్వయుం డొక్కబ్రాహ్మణుండు
శివభక్తుఁడై మున్ను శివతీర్థముల నెల్ల, సేవించి శివకాంచిఁ జేరి తుదకు
నటనె వసించుచు నంతకాలమునకుఁ, దత్తీర్థమున మున్గి తనువు విడిచె
నప్పుడు శివభటు లరుదెంచి కైలాస, మునకు నాతనిఁ గొనిపోవుచుండఁ
గీ. ద్రోవలో నడ్డుపడి విష్ణుదూత లతనిఁ, గొని చనంగను వైకుంఠమునకు రుద్ర
భటులతో డీకొనఁగ రుద్రభటులు గూడ, వారితోఁ బోరఁదొడఁగిరి ఘోరముగను.
ఉ. అంతట విష్ణురుద్రభటు లాహవముం బొనరించు చుండ ది
గ్దంతులు బెగ్గడిల్లఁగను గంపము నొంద వసుంధరాతలం
బంతయు దేవతల్ బెగడి యార్చుచు నుండఁగ వచ్చి శంభుదై
త్యాంతకు లిర్వురున్ నగుచు నాఁపిరి వారలఘోరయుద్ధమున్. 1671

గీ. అట్టు లాఁగంగ సంగ్రామ మచ్యుతుండు, గరుడిపైని హేరంబుని గౌరవంబు
వెలయ నెక్కించికొని తనవెంట రాఁగ, హరముఖాఖిలసురులు రౌప్యాద్రి కేఁగి.
ఆ. అచట దించి వాని హరుఁడు సత్కారంబు, సేయఁ దనకు దాని స్వీకరించి
స్వభటయుక్తముగను స్వపదంబునకుఁ బోయె, విస్మయంబు నొంద విబుధు లెల్ల.

—: ఇంద్రప్రస్థ సప్తర్షితీర్థ మాహాత్మ్యము :—

గీ. కలదు సప్తర్షితీర్థాఖ్య గలిగినట్టి, తీర్థ మొక్కటి యీపుణ్యతీర్థమందు
సప్తఋషులకు సిద్ధి నొసంగినట్టి, దగుట సప్తర్షితీర్థాఖ్య నది వహించె. 1674
గీ. అది చతుర్వర్గము నొసంగు ధ్యానమునను, స్మరణమున దర్శనంబున స్పర్శమునను
నందుఁ గల రెండటో మహాత్మ్య లనశనముగ, నద్భుతతపంబు గావించునట్టివారు.
వ. సృష్టి గావింపం దలంచి తత్తీరంబున ఘోరతపం బొనర్చి తీర్థప్రసాదంబున మరీచి
కశ్యపుం డనుపుత్రుని నత్రి సోముఁడు దుర్వాసుఁడు దత్తాత్రేయుఁ డనుపుత్ర
త్రయంబును నంగిరుం డాంగిరసు లనుపుత్రులను బులహుండు దంభోళి యను
పుత్రుని బులస్త్యుండు కుబేరుం డనుపుత్రుని గ్రతువు వాలఖిల్యు లనుపుత్రులను వసి
ష్ఠుండు రజఃప్రభృతు లగుపుత్రులనుం గాంచిరి. దానిచేతన యయ్యది యన్వర్థనామం
బయ్యె. 1676
గీ. రాజ యింకను నీహరిప్రస్థమందుఁ, గలవు బహుతీర్థములు వాని గణనసేయ
శేషుఁడైనను జాలఁ డశేషముగను, నింక నస్మాదృశులమాట యేమిచెప్ప. 1677
ఆ. అని వచించుటయును నౌశీనరుం డగు, శిబిమహీధవుండు చెంది ముదము
తనకుఁ గలిగినట్టిధన్యత కెంతేని, స్నాన మాచరించి దానిలోన. 1678
క. మునివరులయాజ్ఞఁ గైకొని, చనియెను నిజనగరమునకు సంయమివరులున్
జనిరి నిజాశ్రమములకున్, గనుచు హరిప్రస్థతీర్థగతతీర్థములన్. 1679
గీ. ఈహరిప్రస్థమహిమంబు నెవ్వఁ డేని, వినినఁ జెప్పినఁ బఠియించినను సమస్త
పాతకంబులు నశియించి పడయఁగలుగు, నపునరావృత్తిదాయక మైనపదము. 1680
సీ. అని వచించుటయును విని యుధిష్ఠిరుఁడు మ, హానందమును బొంది యాత్మలోనఁ
బోయి యింద్రప్రస్థమునకు సమస్తబాం, ధవసమేతముగ నాస్థానమందు
రాజసూయమహాధ్వరము చేసి కృతకృత్యుఁ, డయ్యె నాతీర్థంబునందు శౌరి
శిశుపాలుని వధించెఁ జేకూర్చ మోక్ష మా, తని కంతరంగంబునను దలంచి
గీ. భీముఁ డచ్చట గదచేతఁ బ్రిసులఁగొట్టె, నట్టిదేశంబు భీమకుండాఖ్యఁ బడసె
నందు మునిఁగిన సర్వతీర్థావగాహ, మాచరించినసుకృతంబు నందు నరుఁడు. 1681
సీ. అనుదినంబును జేయనగుఁ బ్రదక్షిణమును, క్షేత్రంబునకు నెల్ల క్షేత్రవాసి
చెందఁజాలడు క్షేత్రసిద్ధి నొనర్పక, యున్నఁ బ్రదక్షిణం బెన్నఁ డేని
చేయునప్పుడు ప్రదక్షిణమును గోవింద, నామకీర్తనము నొనర్చె నేని
పదపదంబునను సంప్రాప్తించుఁ గపిలాప్ర, దానపుణ్యము ముక్తి దానఁ గలుగుఁ

గీ. బరమపావన మగుహరిప్రస్థమునకుఁ, జైత్రకృష్ణచతుర్దశిం జలపె నేని
యొక్కసారి ప్రదక్షిణ మొందఁగలుగు, నపహతాఖిలపాపుఁడై హరిపదంబు. 1682
వ. ఇంక మాఘమాసమాహాత్మ్యంబు వినుము. 1683

—: మాఘమాసమాహాత్మ్యము :—

క. మునివర్య ధర్మమార్గం, బుననుండి తొలంగకుండ మున్ను దిలీపుం
డనుతేఁ డయోధ్య నేలుచు, నొనరఁగ మృగయేచ్ఛ తనకు నొకనాఁడు మదిన్. 1684
సీ. కవచంబు ధరియించి కాయంబునను మూర్ధ, మునను నీలోష్ణీషమును వహించి
బంధించి గోధను బాణ్యంగుళులకు ను, పానహంబులఁ దొడ్గి పాదములకుఁ
గైకొని కోదండకాండంబులను గేల, మృగయాతురంగముమీఁద నెక్కి
యాఖేటకవ్యూహ మరుదేరఁగను నిరు, ప్రక్కలందును బృష్ఠభాగమునను
గీ. నరిగి యొకకాననంబున కందులోన, నుండుకంఠీరవద్వీపిగండకాది
మృగముల వధించి తుద కొకమృగము పరువు, వెట్టుచుండంగ నద్దానిఁ గొట్ట నెంచి.
ఆ. దానివెంటఁబడి ప్రతాపంబు మెఱయంగ, విశిఖ మెక్కువెట్టి విడువఁబోవు
నంతలోనఁ గనుల కది కానఁబడకుండ, నెక్కడింప మరల నేఁగుచుండె. 1686
గీ. అప్పు డద్దానిఁ గొట్టంగ నభినివేశ, మొనయఁగను ఱేఁడు శ్రమ మని యెంచకుండ
దానివెంటనె పఱచుచుఁ గాన యెల్లఁ, దిరిగె నది త్రిప్పఁగను ముప్పుతిప్పలుగను. 1687
క. తిరిగి తిరిగి విసు వేర్పడ, నరపతి యాఁగుటకు మనమునను నెంచఁగఁ ద
త్కరగత మైనతెఱంగున, హరిణము కనఁబడుచు మరల నాసం గొలుపున్. 1688
గీ. దాన నాతండు తత్ప్రయత్నంబు విడువ, మానసం బొప్ప కనికి నద్దానివెంటఁ
బడి పఱచుచుండ నది కనంబడుచు నొక్క, తఱిని గనఁబడకయు నొక్కతఱినిఁ జనుచు.
క. ఒకవిషమారణ్యములో, నికిఁ బోయి యదృశ్య మగుడు నివ్వెఱ యొదవన్
గకవిక యై భూనాథుం, డొకదారియు నొక్కడొంకయును నట లేమిన్. 1690
క. తపనుఁడు వ్యోమాంతరమునఁ, దపియించుచు నుండ మిగుల దాహము గాన
వ్విపినమున నెందుఁ జూచినఁ, గృపీట మించుకయు లేమి ఖేదం బొదవన్. 1691
క. దైవమె శరణం బనుచున్, సేవకయుక్తముగ గహనసీమంబడి తాఁ
బోవుచు నుండంగను నొక, తావునఁ గనఁబడియె నొకహ్రదం బాతనికిన్. 1692
సీ. సాధుచిత్తమువోలె స్వచ్ఛంబు కృపణుగే, హమువోలె శైవాలకావృతంబు
తృష్ణార్తిహరణసంభృతదీక్ష మఖలస్వ, దానంబుచేతను దాతవోలె
శశివోలెఁ దాపప్రశమన మంత్రగ్రాహి, భరితంబు దుర్జనాంతరమువోలె
మరకతంబులువోని సురుచిరపద్మినీ, చ్ఛదములచేత నాచ్ఛాదితంబు
గీ. మధురసాస్వాదమత్తబంభరమనోజ్ఞ, నినదమేదురితము హంసనిచయరమ్య
గమనశోభితము ప్రఫుల్లకమలభాసు, రమును నగునాహ్రదంబు నారాజు గాంచి. 1693

క. ధారాధరముం గాంచిన, సారంగమువోలె లబ్ధసంతోషుం డై
చేరి తదంతర్గతజల, పూరంబునఁ జేసి స్నానమును గ్లమ మాఱన్. 1694

సీ. కావించి మాధ్యాహ్నికక్రియలను మృగ, యాప్రాప్తభోజ్యంబు నారగించి
మృగయులతోడ నా రేయి నం డె వసించి, హింస్రమృగంబుల నెల్లఁ జంపి
యుత్థితుం డై యరుణోదయంబునకుఁ బూ, ర్వమె పరివారవర్గంబుతోడ
స్వపురంబునకుఁ బోవ సమకట్టి పోవుచు, నెదురుగా ముని యొకం డేఁగుదేర
గీ. వదలి మార్గంబు నతనికి వందనంబు, నాచరించి తదీయవృత్తాంత మడుగ
నాతఁడు గ్రహించి రాజేంద్ర యతిని నేను, వృద్ధహారీతుఁ డనుపేర నెసఁగువాఁడ.

సీ. అమితఫలప్రదాయక మైనమాఘమా, సస్నానమును వీడి చనుట దగదు
రమ్ము నాతోడ శీఘ్రమ్ముగా సూర్యోద, యము కాకమును పె యీహ్రదములోనఁ
జలుపఁగావలయును స్నానంబు నావుడు, నవనిపాలుఁడు హర్ష మామతిల్ల
ననఘ మాఘస్నానమునఁ గల్గుఫల మేమొ, కృప యుద్భవిల్లంగఁ జెపుము నాకు
గీ. ననుడు భూమీంద్ర యిది సమయంబు గాదు, తావకప్రశ్నమునకు నుత్తరము సెప్ప
మీకులాచార్యుఁ డఖిలజ్ఞుఁ డేకతమున, నడుగు నెడ నీవు సర్వంబు నతఁడు నుడువు.

క. అని చెప్పి యమ్మునీంద్రుఁడు, చనుచుండఁగ నతని వెంటఁ జని స్నానంబున్
బొనరించి హ్రదములోపల, జనవరుఁ డరుదెంచి వేగ స్వపురంబునకున్. 1697

సీ. చని వసిష్ఠాశ్రమంబున కేకతంబుగా, నెఱఁగి వసిష్ఠునిచరణములకు
నాచార్య వర్ణాశ్రమాచారవిధులును, దండనీతియు రాజధర్మములును
గ్రతువిధానములును వ్రతవిధానములును, భగవదారాధనాపద్ధతులును
జెప్పినాఁడవు నాకు శ్రేయంబు గా నస్మ, దన్వయాచార్యుఁడ వగుటఁ జేసి
ఆ. యిపుడు కరుణతోడఁ జెపుము మాఘస్నాన, విధియుఁ దత్ఫలమును విశదముగను
ననుచు నిట్టు లనియె నాతనివాంఛకుఁ, జెంది హర్షమును వసిష్ఠమౌని. 1698

సీ. విడిచి యిష్టాపూర్తవిధులను వహ్న్యుపా, స్తిని నూర్ధ్వలోక మర్థించువారు
స్వర్ణగోభూధాన్యవస్త్రాన్నదానముల్, చేయక దివము వాంఛించువారు
కాయంబు శోషిల్లఁ జేయక తపముచే, విష్ణుసాన్నిధ్యంబు వేఁడువారు
కృచ్ఛ్రాతికృచ్ఛ్రాదికృత్యంబులను గాసిఁ, జెందక సుగతి నాశించువారు
గీ. మకరమును బొంది రవి యుండ మాఘమాస, మునను నిత్యము విధ్యుక్తముగను స్నాన
మాచరించిన బాహ్యజలాశయమునఁ, గలుగు స్వాభీష్టసంసిద్ధి సులభముగను. 1699

వ. వైశాఖమాసంబున సలిలాన్నంబును గార్తికమాసంబున దపఃపూజలును మాఘమాసం
బున జపహోమదానంబులును విశేషవిధులుగాఁ జెప్పంబడియె. 1700

గీ. చలిపి ద్వాదశమాఘమాసంబు లదితి, స్నాన మనశనముగ మానసహ్రదమునఁ
బడసె నమితప్రభావసంపన్ను లైన, ద్వాదశాదిత్యులను నిజతనయులుగను. 1701

క. ఒనరించుటచే మాఘం, బున స్నానము శచి త్రిలోకమోహనరూపం
బును రోహిణి సౌభాగ్యముఁ, గనికరము నరుంధతియును గాంచంగలిగెన్. 1702

ఆ. దానశీలులకును మానులకును బిత్రు, దేవతాతిథులను దృప్తిపఱచు
నట్టివారలకును బ్రాప్తించులోకముల్, మునిఁగె నేని మాఘమున లభించు. 1703

ఆ. అన్యపుణ్యములను నమరాలయమునకుఁ, జేరువారు భువికిఁ జేరువార
మరల రారు భువికి మాఘమాసస్నాన, పుణ్యమునను దివికిఁ బోవువారు. 1704

క. మాఘస్నాన మొకండె య, మోఘం బగునాయుధంబు ముసురుకొనినపా
పౌఘక్రూరమృగంబుల, నాఘాతింపంగ నేల యధికోక్తు లికన్. 1705

క. దురితక్షయమునుం గోరెడి, నరులకు మాఘావగాహనముకంటెను లే
వరయంగ నిజమనోరథ, పరిపూర్తి యొనర్పఁగలయుపాయాంతరముల్. 1706

గీ. మాఘమున స్నాన మొనరించుమానవుండు, నరకయాతనలను జిక్కి పరితపించు
నుభయకులసప్తపురుషుల నుద్ధరించి, దివ్యదేహంబుతోఁ దాను దివికి నేఁగు. 1707

గీ. పుష్కరమున బ్రహ్మవర్తమునఁ బ్రయాగ, మునఁ గురుక్షేత్రమున నవిముక్తమునను
స్నాన మొనరింపఁ గల్గుపుణ్యంబు మాఘ, మున దినత్రితయస్నానమున లభించు.

వ. ఈవిషయంబున మున్ను భృగుమహర్షికిని విద్యాధరునకును జరిగినసంవాదంబు నీకుం
జెప్పెద వినుము. 1709

సీ. మున్ను ద్వాదశవర్షములు వృష్టి లేమిని, హిమశైలసహ్యశైలములనడుమ
నున్నదేశము లెల్ల నోపప్లవంబులై, స్వాహాస్వధాదివివర్జితము గ
క్షీణించు చుండంగ శిష్యులతోఁ గూడి, హిమశైలమును జేరి భృగుమహర్షి
యచ్చట మణికూట మను శైలమును గాంచి, దానివైభవసమృద్ధతకు మెచ్చి

గీ. యచట వసియించి వాసార్హ మగుటఁ జేసి, తపముఁ గావింపఁ దొడఁగె నంతటను నొక్క
నాఁడు తద్గిరిశృంగకందరమునుండి, యొక్కవిద్యాధరుఁడు డిగ్గి యువిదతోడ. 1710

ఆ. భృగుమహర్షియొద్ద కేతెంచి తత్పాద, వనజములకుఁ జేసి వందనంబు
నిలువఁబడుడు ఖేద మొలయంగ మొగమునఁ, గనులు దెఱచి వారిఁ గాంచి మౌని.

క. ఒనరించి యుచితగౌరవ, మును వారికి దేవయోనిపుంగవ మీయా
ననములయందు విషాదము, గనఁబడియెడి నాకుఁ జెపుము కలకారణమున్. 1712

—: విద్యాధరవృత్తాంతకథనము :—

వ. అని యడుగుటయు విద్యాధరుం డమ్మహర్షి కిట్లనియె. 1713

సీ. వినుము మునీంద్ర మావిషయంబు వినిపెదఁ, బ్రాక్కృతపుణ్యకర్మంబువలన
విద్యాధరుండనై వెలసి దివ్యసుఖంబు, లనుభవించుచుఁ గూడ ననుదినంబుఁ
గలుగుట వ్యాఘ్రముఖం బేమహాపాప, కృత్యంబునను దుఃఖ మేరుపడియె
నీదుఃఖ మిట్లుండ నీజగన్మోహిని, వ్యాఘ్రముఖుండనై నట్టినాకు

ఆ. వెలఁది యయ్యె ననెడివేఁతో శోకదుఃఖంబు, సంభవించె నావిపాద...
యీయయమకును జింత యేర్పడె మాచింత, యెట్లు తీఱఁగలదొ యెఱుఁగఁ జెపుమ.

సీ. అని వేఁడుటయు భృగుమునివల్లభుఁడు దివ్య, దృష్టిచే నెఱిఁగి తద్విషయ మెల్ల
విద్యాధర వచింతు వినుము సీప్రాగ్జన్మ, వృత్తాంత మంతయు విశదముగను
నొనరించి యుపవాసమును నీవు మును మాఘ, మునను నేకాదశీదినమునందు
స్వల్పంబు గా నుండ ద్వాదశి మఱునాఁడు, పారణ సలిపి యాపర్వవేళ

గీ. నాఁడె పిదపఁ ద్రయోదశీనాఁడులందుఁ, జలిపికొంటి వభ్యంగము శాస్త్రతత్త్వ
మును గ్రహింపక స్వకుతర్కమునను నిర్ణ, యంబు గావించుకొని ధర్మ మాత్మలోన.

గీ. ఆకతంబున నీకు సంప్రాప్తమయ్యె, వ్యాఘ్రవక్త్రంబు ద్వాదశియందె యట్టి
కార్య మొనరించి యున్న వ్యాఘ్ర ముయి యుందు, వపుడె తద్ఘోరపాతకం బట్టి దగుట.

—: పురూరవో వృత్తాంతకథనము :—

సీ. మున్ను తైలాభ్యంగమును జేసికొని పురూ, రవుఁ డొకద్వాదశీదివసమందుఁ
బ్రాప్తింపఁగను గురూపంబు మేనికి దాన, బహుకాల మాత్మలోఁ బరితపించి
కొనకు హిమాహార్యమున కేఁగి యం దుండు, దేవికాహ్రదతీరదేశమందుఁ
జిరకాలము తపంబు సేయంగఁ దద్దైప, స్సంతోషితాత్ముఁడై చక్రపాణి

గీ. యాతనికి దర్శనం బిచ్చి యాత్మశంఖ, జలముచేతను స్నాతునిఁ జలిపె నతని
మకరరాశిగతుం డయి మాఘశుక్ల, మునను రవి యుండ ద్వాదశీదినమునందు. 1717

గీ. అంతటఁ ద్రిలోకమోహనం బైన రూపు, ప్రాప్తమయ్యెఁ బురూరవఃపార్థివునకు
దానిఁ జూచియె కామించె వాని స్వర్గ, యోషిదవతంస మైనట్టియూర్వశియును.

గీ. కాన నెంతటివారికి నైనఁ గర్మ, గతిని దాఁటంగ శక్యంబు గాదు నీకుఁ
గలిగె నేని కురూపంబు దొలఁగ వాంఛ, సాధన మొకండు వినుము విద్యాధరుండ.

వ. పౌషమాసశుక్లపక్షైకాదశీదినంబు మొదలుకొని మాఘమాసశుక్లపక్షైకాదశీపర్యంతం బొకమాసంబు వ్రతనియమంబుల ననుసరించి త్రికాలస్నానంబును ద్రికాలమాధవార్చనంబును స్థండిలశయనంబును గావించుచుఁ దక్తభోగుండ వై ప్రతిదినంబును బదరీఫలంబులును గదళీఫలంబులును నామలకఫలంబులును ఘృతప్రస్థంబును దిలప్రస్థంబును దండులాఢకంబును గూశ్మాండంబును గృసరంబును దాంబూలంబును ననునీనవపదార్థంబులును బక్వాన్నభక్ష్యంబులును శీతార్తినివారణార్థంబు శుష్కేంధనంబులును గంచుకంబులును మాంజిష్ఠంబును రక్తవస్త్రంబులును శయనంబులును జాతీఫలలవంగకర్పూరాదిసువాసనాద్రవ్యంబులును చిత్రకంబళంబులును నిర్వాతగృహంబులును బాదరక్షలును సుగంధ్యుద్వర్తనద్రవ్యంబులును బ్రాహ్మణుల కర్పింప వలయు. దానంజేసి నీకు వ్యాఘ్రముఖంబు తొలఁగి సువదనంబు ప్రాప్తించు. 1720

గీ. అని ప్రబోధించుటయును విద్యాధరుండు, చేసి స్నానంబు మణికూటశిఖరితీర
మందు సతితోడ మాఘమునందుఁ దొలఁగి, వ్యాఘ్రవదనంబు సురుచిరాస్యంబుఁ బడసె.

క. గర్జించు యాగములఁ గని, గర్జించును యోగములను గాంచి వ్రతముల్
దర్జించును దీర్థములను, దర్జించును మాఘ మాత్మధర్మాధికతన్. 1722

సీ. ఆయురారోగ్యంబు లర్థించువారికిఁ, గాంక్షించువారికిఁ గామసుఖము
దారపుత్రాదులఁ గోరెడివారికి, వాంఛించువారికి వాగ్విభూతి
యాశించువారి కష్టైశ్వర్యసిద్ధుల, నభిలషించెడివారి కమరపదము
వేఁడెడివారికి విద్యావివేకముల్, ప్రార్థించువారి కాపద్విముక్తి

ఆ. మంచిగుణములను సమంచితరూపంబు, నిచ్ఛగించువారి కిచ్ఛగించి
నట్లు కాంక్ష దీర్చునది మాఘ మొక్కఁడె, దాని కీడు వేఱ కానరాదు. 1723

గీ. ఇది యది యటంచు లెక్కింప నేల కామ, ధేనుచింతామణులువోలె మానవులకు
సకలవాంఛార్థసిద్ధు లొసంగ మాఘ, మేయెడల నందె వైచినచేయి చూవె. 1724

గీ. మొదటఁ జేసి నిత్యస్నానమును విచేయ, తారకం బగువేళను దగు నొనర్ప
నవల మరల మాఘస్నాన మనుదినంబుఁ, దరణి యర్ధోదితుం డైనతరుణమందు.

గీ. కృతయుగంబునఁ దపమును త్రేతయందు, జ్ఞానమును ద్వాపరమున యజ్ఞమును గిలిని
దానము ప్రశస్తములు ప్రశస్తములు మాఘ,మాసమున నన్నియును గూడ మానవేంద్ర.

ఆ. సర్వవర్ణములకు సర్వాశ్రమములకు, మాఘమాస మనెడిమేఘమాల
ధర్మ మనెడియమృతధారను వర్షించు, భాగ్యనంతు లెల్లఁ బట్టుకొనఁగ. 1727

గీ. కామమున నైన లేక యకామమునను, నైన మునిఁగిన మాఘమునందు నెచట
నేనియు బహిర్జలంబున నిహపరంబు, లందు నెం దేని దుఃఖము నొందఁ డతఁడు.

వ. అంతట భృగుమహర్షి యచ్చోటు విడిచి లోకోపకారార్థంబు శిష్యసమేతంబుగా వింధ్య పర్వతంబునకుం జేరి రేవానదీతటంబున నాశ్రమంబు నెలకొల్పికొని యందుండి తన్నదీ తోయంబున విధ్యుక్తప్రకారంబుగా మాఘస్నానంబు గావించుచుఁ దపంబు సేయం దొడంగె. 1729

—: మృగశృంగమహర్షివృత్తాంతకథనము :—

సీ. వినుము వే ఱొకగాథ వినిచెదఁ గృతయుగం, బున రథంతరకల్పమునను మున్ను
కలఁడు కుత్సుండు నాఁగను బేరువడినభూ, సురుఁ డొక్కరుఁడు భోజపురమునందుఁ
డై కొని కర్దమకన్యక నాతండు, ధర్మపత్నిగను నత్తరుణియందుఁ
దనయుని వత్సాభిధుని నొకరునిఃగని, యతనికి జాతకర్మాదివిధులఁ

గీ. జలిపి యుపనయనము సేసె సక్రమముగ, నంత వత్సుఁడు బ్రహ్మచర్యాశ్రమార్హ
ధర్మముల నాచరించుచు దైవికముగ, వచ్చి కావేరికడ కొకవాసరమున. 1730

సీ. ఉదధి కేఁగెడిమహానదులందుఁ బశ్చిమ, వాహినులును నుదగ్వాహినులును
గలధామములు ప్రయాగముకంటె నధికంబు, లనెడిశాస్త్రము మెఱిఁగినట్టికతనఁ
బశ్చిమముఖము గాఁ బ్రవహించునచ్చోట, నివసించి తన్నదీనీరమందు
నొనరించి శాస్త్రవిధ్యుక్తమార్గంబున, స్నానముల్ మాఘమాసత్రయంబు

గీ. తదవగాహనపుణ్యసంతానజనిత, తత్త్వవిజ్ఞానుఁ డై మమత్వమును విడిచి
సహ్యజోత్తరతటసమక్షస్థ మైన, యట్టినారాయణాద్రిపై నధివసించి. 1731

సీ. అచ్చోట నున్నకళ్యాణతీర్థంబునఁ, జేసి స్నానము మాఘమాస మెల్లఁ
దత్సరఃపశ్చిమతటమునఁ గూర్చుండి, తపము సేయఁ దొడంగె దారుణముగ
దాన నంతయు నిండి నేనె యుంటి న టన్న, జ్ఞానంబు జనియింప దానివలనఁ
గదలకుండఁగ మేను కాష్ఠంబువలె నుండ, నేతెంచి యచటికి మృగము లెల్ల

గీ. నాహ్రదంబునఁ ద్రావి తోయంబు వాని, కాయమును శృంగములచేత గాయుచుండ
నాతనికిఁ గల్గె మృగశృంగుఁ డనెడిపేరు, యుగశతం బట్లు గడవంగ నొక్కనాఁడు.

గీ. తత్తపఃప్రీతుఁ డై జనార్దనుఁడు వచ్చి, హస్తమునఁ దత్సహస్రార మంటె నంతఁ
దెలిచి కన్నుల నతఁడు ముందఱ వెలుంగు, చున్ననారాయణునిఁ జూచి కన్నులార.

క. అనవధిక మైనహర్షం, బున లేచి నమస్కరించి పులకలు మేనన్
జనియింప బాష్పములు లో, చనములఁ గ్రమ్మంగ భక్తి సమకూర నెదన్. 1734

సీ. ధర్మసంస్థాపనార్థము భూతలంబున, నవతరించుచు నుండునాదిపురుష
చేయుచు విశ్వసృష్టిస్థితిలయములఁ, దేజరిల్లుచు నుండుదివ్యమూర్తి
యొక్కటి వయ్యు ననేకరూపములతోఁ, జెలువారు చుండెడిచిత్స్వరూప
యణువుకంటెను నణు వగుచు మహత్తుకం, టెను మహత్తగుచు నుండెడియమేయ

గీ. నిర్వికారుండ వయ్యును నిర్గుణుండ, వయ్యును వికారగుణశాలి వగుచు నుందు
వెవ్వఁ డెఱుఁగు భవత్తత్త్వ మిట్టి దనుచు, నెన్నఁగను నిన్ను దేవ నే నెంతవాఁడ.

క. శరణాగతరక్షకుఁడవు, పరమపురుష నీవు నేను బరిపాల్యుఁడఁ ద్వ
చ్చరణముల శరణుఁ జొచ్చితిఁ, గరుణాదృష్టులను నన్నుఁ గాంచుము చాలున్. 1736

సీ. అని నుతింపఁగ శార్ఙ్గి యాననంబున హర్ష, హాసంబు చెలువార నతనిఁ గాంచి
మృగశృంగ నీ వొనర్చినమాఘమాసాన, గాహనంబునఁ దృప్తి గలిగె నాకు
దాననె నిట్టితపము చేసెడిశక్తి, యును నాదుదర్శనంబును లభించె
భావిజన్మంబునఁ బ్రభవించెదవు ఋభు, వనుపేర మానివై యపుడు నీకుఁ

గీ. ప్రాప్తమగు ముక్తి బ్రహ్మచర్యమున నేఁడు, ఋషుల సంతృప్తిపఱచినరీతి సురల
జన్నములచేతఁ బితరుల సంతుచేత, నగు నొనర్పఁ బ్రతుష్టుల నంతవఱకు. 1737

గీ. అని ప్రసాదించుటయు వత్సమునివరుండు, దేవ నీ వుండవలయు నీతీర్థరాజ
మందు నని వేఁడ నీకోరినట్లు యుందు, నిచట నని చెప్పి శౌరి యదృశ్యుఁ డయ్యె.

సీ. అంతట మృగశృంగుఁ డరుదెంచి యింటికిఁ, దలిదండ్రులపదాబ్జములకు మ్రొక్కి
తెలియంగఁ జేసి తాఁ జలిపినమాఘమ, జ్జనమున కామతిల్లినఫలంబు
వారిని సంతోషవార్ధిలో నోలార్చి, తత్సపర్యాపరత్వమున నుండ
నొకదినంబున నుచథ్యునికడఁ గుత్సుఁడు, తనకుమారునిచరిత్రమును జెప్ప

గీ. నతఁడు సంతోషమును జెంది యాత్మపుత్రి, యగుసువృత్త యొనర్చిన దగుట మాఘ
మజ్జనంబును మూఁడు సంవత్సరంబు, లామె నీయంగ వత్సున కాత్మ నెంచి. 1739
క. తనపుత్రికసుగుణంబులు, వినిచెన్ గుత్సున కతండు విని సర్వంబున్ .
దనతనయున కాయమ ని, మ్మని కోర నుచథ్యుఁ డిత్తు నని వాక్రుచ్చెన్. 1740
వ. అంతటఁ గుత్సుండు మహానందభరితుం డై స్వగృహంబునకుం జని తద్వార్త వత్సున
కెఱింగించె. 1741
సీ. ఒకనాఁడు నిజసఖీయుక్తంబుగను మాఘ, మునను గావేరికిఁ జని సువృత్త
యరుణోదయంబున నందు స్నాన మొనర్చి, వచ్చు చుండఁగ నొక్కవారణంబు
పరువెత్తుచును రాఁగఁ బై కి భయంబునఁ, బడి యందఱును నొక్కపాదునూత
విడిచిరి యసువు లావృత్తాంతమును విని, యరుదెంచి యటకుఁ దదాప్తు లెల్ల
గీ. నేడ్చు చుండంగ వచ్చి యయ్యెడకు దైవి, కముగ వత్సుఁడు చూచి యాకన్యకలను
బ్రతుకఁజేయుదు వీరి నెప్పగిది నైన, మీరు గాపాడుఁ డేతచ్ఛరీరములను. 1742
చ. అని వచియించి వారికి రయంబున సహ్యజ కేఁగుదెంచి దా
నను గళదఘ్నజీవనమునన్ నిలువంబడి యూర్ధ్వబాహుఁ డై
కనుచుఁ దదేకదృష్టిని వికర్తనబింబము మృత్యుసంస్తవం
బొనరుచు చుండ నాకరి మహోత్సుకతన్ జని వానియొద్దకున్. 1743
క. కనఁబఱచుచు సంతోషం, బును దొండము చాఁచి పట్టె మూర్ధమునం దా
తని నిడుకొనుటయు వత్సుఁడు, కనుఁగొని తద్భావ మెడఁద కరుణార్ద్రిము గాన్.
క. కొని హస్తంబునఁ దోయం, బును నిజమాఘాష్టదివసపుణ్యంబును వెం
టనె ధారవోసె ధన్యత, యొనగూడఁగ దాని కెంచి యుల్లమునందున్. 1745
ఉ. అంతట నాగజంబు ద్విరదాకృతి వోవఁగ దివ్యరూప మ
త్యంతముదావహంబుగను బ్రాప్తము గాఁగ నభంబునన్ విమా
నాంతరమందు నిల్చి వినయంబున మ్రొక్కి మునీంద్రసూతికిన్
వింతగఁ బ్రాగ్జనిస్మృతి జనింపఁగఁ జిత్తమునందు ని ట్లనున్. 1746

—: ధర్మగుప్తవృత్తాంతకథనము :—

సీ. స్వామి నీకృపచేతఁ జరితార్థతను జెందఁ, గలిగితి నేఁడు నాగాథ వినుము
మున్ను నైషధపురంబున ధాత్రి నొక్కవై, శ్యుం డుండె విశ్వగుప్తుండు నాఁగ
నతనికిఁ బుత్రుండ నై పుట్టి ధర్మగు, ప్తాఖ్యను జెంది నామార్హముగను
దాఁటక న్యాయపథంబు వాణిజ్యంబు, గావించి కోటినిష్కముల నేను
గీ. గడన యొనరించి నా కొకకొడుకు గలుగ, వానికి నొసంగి యర్ధంబు దానిలోన
ధర్మకార్యంబులకు మదర్థంబు కొంత, వ్యయము సేసితి శ్లాఘింప నఖిలజనులు. 1747
సీ. మరుభూములందును మార్గంబులందును, స్థాపించితిని బ్రపాకూపములను
నెలకొల్పితిని వృక్షములు పెక్కుచోట్లను, విశ్రమింపఁగఁ బ్రాణివితతి యొల్లఁ

గట్టించితిని శివాగారంబులును విష్ణు, సదనంబులును శక్తిసదనములును
బేదసాదుల కెల్లఁ బెట్టించితిని నన్న, సత్త్రంబులను బహుస్థలములందు
గీ. సలిపినాఁడను గోదానములును భూమి, దానములు స్వర్ణకన్యాప్రదానములును
నేమి యొనరించినను ఫల మేమి యెవియు, దక్షములు గావు తుడుప ఫాలాక్షరముల.
గీ. ద్విరదభుక్తకపిత్థంబుకరణిఁ బోవఁ, దగిన దెల్లను బోవు రాఁదగిన దెల్ల
నారికేళాంబువు తెఱంగునను ఘటిల్లు, నిదియె సిద్ధాంతము బహూక్తు లేల యింక.
సీ. అప్పుడు రసవాది యైనకాపాలికుం, డొకఁడు నాగృహమున కొక్కనాఁడు
చనుదెంచి మాయచేతను నాకుఁ దనయెడఁ, బ్రభవింపఁగాఁ జేసి ప్రత్యయంబు
నాయొద్ద నున్నధనం బెల్ల హరియించి, నను దరిద్రునిఁ జేసి చనియె నంత
దారిద్ర్యమునకు వార్ధకము తో డై నన్ను, వేధింపఁ దొడఁగె నవ్వేళయందు
గీ. నమ్మితిని మున్ను నేఁ జేసినట్టిధర్మ, చయము నెల్లఁ గుటుంబరక్షణముకొఱకు
నవల మాఘంబునందు సంప్రాప్తమయ్యె, దశదినస్నానములు నాకు దైవికముగ.
ఆ. అంతఁ గొలఁదిదినములందె నా కొనగూడె, మరణ మపుడు నేను మాఘమాస
మం దొనర్చినట్టియవగాహనమునకు, ఫలముగాఁ ద్రివిష్టపంబుఁ జెంది. 1751
గీ. అచట స్వర్గసుఖంబుల ననుభవించి, యపరిమితముగ నొక్కమన్వంతరంబు
పిదపఁ దత్పుణ్యము నశింప నుదయ మైతి, గజముగను నిల ధర్మవిక్రయముకతన.
ఆ. ఇపుడు నీవు నాకు నిచ్చినమాఘావ, గాహపుణ్యమునను గాంచఁ బోవు
చున్నవాఁడ సుఖము నూర్ధ్వలోకంబున, నని వచించి చనియె నమరపురికి. 1753
వ. అంతట మృగశృంగుండు యథాపూర్వంబుగఁ గంఠదఘ్నం బగుకావేరీజలంబున నిలువంబడి. 1754

సీ. సంజ్ఞాతనూభవ సదసత్క్రియాసాక్షి, ధర్మస్వరూప యధర్మశాస్త
శరశక్తిముసలపాశత్రిశూలాసిగ, దాంకుశవిస్ఫురదష్టహస్త
వైవస్వత కరాళవదన ప్రలంబోష్ఠ, దక్షిణాశానాథ దండధారి
మహిషవాహన దీప్తదహనసన్నిభనేత్ర, సాధులోకైకప్రసన్నరూప
గీ. యంజనాద్రిసమచ్ఛాయ యప్రమేయ, సత్యధర్మదమాచారశాంతిసహిత
నిత్యసంతోష సంయమనీపురీశ, శమన యమునాసహోదర శరణు శరణు. 1755
క. అని నుతియించుచు నుండఁగఁ, జనుదెంచి కృతాంతుఁ డధికసంతోషముతో
డను నిలిచి యతనిముంగలఁ, గనులను లేనగవు దొలుకఁగా ని ట్లనియెన్. 1756
ఆ. వత్స తావకస్తవంబున కెం తేని, సంతసంబు గలిగె స్వాంతమందు
వరము గోరు మనుడు వత్సుఁ డత్యానంద, మొలయ యమునిపాదములకు మ్రొక్కి.
సీ. అంతక స్మృతిసువృత్తాదికన్యాచతు, ష్టయమును బ్రతికించి దయ యెలర్ప
నన్ను సఫలప్రతిజ్ఞునిఁ జేయు మని కోర, యముఁ డట్లె యగుఁగాక యని వచించి

యంతర్హితుం డయ్యె నంతట వత్సుండు, కన్యాశవము లున్నకడకు వచ్చె
నపుడు కన్యలు సుప్తలై మేలుకాంచిన, కరణిని జూచిరి కన్ను లెత్తి

గీ. కనుఁగొనఁగ నట్లు కన్యలు గాంచి వారి, విస్మయంబునఁ దద్బంధువితతు లెల్ల
నమ్మ బ్రదికితె బ్రదికితె యమ్మ యనుచు, నేడిచిరి హర్షబాష్పము లేర్లువాఱ. 1758

ఆ. అవనిశయ్యనుండి యప్పు డా కన్యలు, లేచి కూరుచుండి చూచి వారి
నెల్ల విశదముగను నిట్లు వచించిరి, హర్షవిస్మయంబు లామతిల్ల. 1759

ఆ. అమ్మలార మేము యమలోకమున కేఁగి, కాంచి యచట నున్నకఠినకఠిన
నరకములను వచ్చినారము శమనాజ్ఞ, యగుటఁజేసి పృథివి కద్భుతముగ. 1760

చ. అనుటయు వార లి ట్లనిరి యమ్మకచెల్ల కృతాంతలోకముం
గని ధరణీతలంబునకుఁ గ్రమ్మఱ వచ్చుట యెన్నఁడుం గనుం
గొనినది లేదు విస్మయముగొల్పెడు మీపలుకుల్ వచింపుఁ డా
య్యన నచటం గనుంగొనినయట్టివిశేషము లెల్ల మాకడన్. 1761

వ. అని యడుగుటయు వారల కాకన్యక లి ట్లనిరి. 1762

—: యమలోకవృత్తాంతకథనము :—

సీ. పోక తప్పదు యమలోకంబునకుఁ జతు, ర్విధజంతువులు గూడ వివశు లగుచు
నీలోకమం దొక్కఁ డేనియుఁ గనరాదు, యమలోకమున కేఁగినట్టిప్రాణి
పోదురు సుఖమార్గమున నచ్చటికి మాఘ, మందు నుషఃకాలమందు మునిఁగి
బదరీఫలంబులు గదళీఫలంబు లా, మలకంబులును గోధుమలును దిలలుఁ

గీ. బాదుకాదర్శకాబికాతపత్రములును, నిలయశయ్యాసనాన్నపానీయములును
స్వర్ణధనధాన్యగోభూమివస్త్రములును, ఘృతము గూశ్మాండమును దాన మిచ్చువారు.

వ. మఱియును మాఘమాసంబునందుఁ బ్రయాగస్నాతులును హరిహరపూజాపరాయణులును గజతురగవృషభశకటతండులాఢకాద్యర్హవస్తుప్రదాతలును దేవాగ్నిగురువిప్రమాతాపితృసేవకులును నారామకూపవాపీతటాకదేవాలయయతిమఠదీనానాథవిశ్రాంతినిలయస్థాపకులును విప్రపాదశౌచపాదాభ్యంగశిరోఽభ్యంగకర్తలును దదితరవివిధప్రశస్తదానకర్తలును నానావ్రతకర్తలును దదితరానేకపుణ్యకర్తలును యమలోకంబునకు సుఖంబుగా నేఁగుదురు. 1764

క. ఆనానావిధపుణ్యాగ, ణానీకముతోఁ దదీయయానంబులతో
భానుజపురంబు నిండి మ, హానందముగొల్చు చుండు ననుదినసంబున్. 1765

సీ. అనుదినంబును బుణ్యు లరుదెంచి రనువార్త, విని దండధరుఁడు సోద్వేగముగను
నుత్థితుం డై భటయుతముగాఁ జని దివ్య, వాహనస్థితు లైనవారికడకు
సవినయంబుగ మ్రొక్కి సలిపి యర్హాసపర్య, శ్లోకించి తత్కృతసుకృతములను
వారలలో నసాధారణపుణ్యముల్, సలిపినవారిని స్వర్గమునకు

గీ. శంభుభక్తులఁ గైలాసశైలమునకు, హరిశరణ్యుల వైకుంఠపురమునకును
ప్రాప్తమాఘప్రయాగతీర్థావగాహ, సుకృతులను బ్రహ్మలోకంబునకును బనుచు.
క. ఎఱుఁగము వా రెవ్వారలొ, మఱికొందఱు పావనులు విమానంబులలోఁ
దఱచుగఁ దిరుగుచు నుందురు, గఱువతనంబున సతంబుఁ గాలునిపీటన్. 1767
గీ. మాతపోమాసమజ్జనమహిమమునను, యమపురంబున రంభావనాంతరమున
నుండి సుఖముగఁ జూచి పుణ్యోత్తరులను, బడసితిమి జన్మనేత్రసాఫల్యములను.
సీ. ఇంకఁ బాపులగాథ యెఱిఁగింతుము వినుండు, ధైర్యంబు నూని చిత్తంబులందు
స్నానదానాదివిహీనులు ఘోరమా, ర్గమునుండి తీవ్రదుఃఖములు పడుచు
దక్షిణదిగ్గతాంతకపురంబును బ్రవే, శింతురు ప్రాణావశేషముగను
నది షడశీతిసహస్రయోజనముల, కంటె నిచ్చటి కధికముగ నుండు
గీ. యమపురము పుణ్యవంతుల కతిసమీప
మందు నున్నట్లు పాపుల కధికదూర
మందు నున్నట్లు తోఁచు సౌమ్యముగఁ బుణ్య
మార్గము కఠోరముగఁ బాపమార్గ ముంట. 1769
సీ. ఒకచోట సర్పంబు లొక్కచోటను వృశ్చి, కములును నొకచోటఁ గంటకములు
గ్రావంబు లొకచోట గర్తంబు నొకచోట, నొకచోటఁ గరు లేఱు లొక్కచోట
నొకచోట వ్యాఘ్రంబు లొకచోట సింహంబు, లొక్కచోట వరాహయూథములును
నొకచోటఁ జీకటి యొకచోట దావాగ్ని, యొకచోట రుజ లార్పులొక్కచోట
గీ. రక్తపాషాణపాంసువర్షములు పిడుగు, లుఱుములు పిశాచములు చలి యుడుకు సకల
విధములను భీడనెట్టంగ వెతలుపడుచు, నేడుతురు పాతకులు త్రోవ నేఁగునపుడు.
సీ. అల్లాడుచుండ దాహంబున లభియింప, దొక్కచోటను నీటిచుక్క యేని
కాఱుచుండంగ రక్తము కాయములనుండి, కంటికైనను మందు కానరాదు
గుదెలచే యమభటుల్ క్రుళ్ళఁ గ్రుమ్మచు నుండ, హరి శివ యనఁ డొక్కప్రాణి యేని
యాఁకలిచేఁ బ్రాణ మసురుసు రగుచుండఁ, బ్రాప్తింప దొకపట్టెఁ డన్నమేని
గీ. తాముచేసిన పాపముల్ తలఁచికొనుచు, నేడ్చుచుండంగ నాలింపఁ డెవఁడు గూడ
నార్తులై భీతితోడఁ గృతాంతపురికిఁ, గలుషు లేఁగెడిఘోరమార్గంబునందు. 1771
వ. ఏకాకులును బరాధీనులును బంధుమిత్రాదిపరిత్యక్తులును నగ్నులును గృశాంగులును శుష్కకంఠోష్ఠతాలువులును క్షుదగ్నిదహ్యమానులును శృంఖలాబద్ధులును గాలపాశాకృష్యమాణులును బృష్ఠభాగవినిబద్ధభుజులును రజ్జుబంధాకృష్టనాసికాజిహ్వాకంఠశిశ్న వృషణకరపాదకటిప్రదేశులును ఛిన్నసర్వాంగసంధులును నానాశస్త్రప్రహతులును గృత్తకరపాదులును సరఘాదంశక్రిమిదష్టులును సవ్రణులును స్రవద్రక్తధారానిషిక్తగాత్రులును నిరాశ్రయులును బాథేయవర్జితులును నగుపాపులను భీషణాకారు లగుయమ

భటులు సంయమనీపురంబునకుఁ దోడ్కొనిపోయి మహాశ్మశ్రువును నిశాతనానావిధా
యుధభయంకరాష్టాదశకరుండును నగుకృతాంతునియెదుట నిలువంబెట్ట వారెల్లరును.

సీ. ప్రళయాగ్నిరీతిని బ్రజ్వరిల్లెడివాని, జీమూతమట్లు గర్జించువాని
వార్ధిని ద్రావుకై వడి జ్వలించెడివాని, దంష్ట్రాకరాళవక్త్రంబువాని
ననలంబు నుమియుచాయను దీపిలెడువాని, నంజనచ్ఛాయచే నమరువాని
జగములఁ గబళించుపగిదిఁ గ్రాలెడివాని, మేరుశైలోన్నతి మీఱువాని

గీ. నూర్ధ్వకేశుని మహిషవాహుని నమర్ష, తామ్రనేత్రుని నుగ్రుని దండధరుని
వానికడ నున్నమృత్యుదేవతను నతని, పరిజనంబును జూచి కంపంబు నొంది. 1773

క. విలపించుచుండ లోచన, ములనుండి విషాదబాష్పములు గురియంగన్
దిలకించి వారిమోముల, నెలయఁగఁ గృప చిత్రగుప్తుఁ డిట్లు వచించున్. 1774

క. కలుషాత్ములార మీరలు, సలిపినపాపంబు లెల్ల సమయఁగ నరకం
బుల ననుభవింపుఁ డావలఁ, గలుషంబులు దొలఁగు దానఁ గలుగు శుభంబుల్.

సీ. అల్పకాలం బుండునట్టిభోగములకై, కావించితిరి నీచకార్యములను
ధారవోసితిరి శరీర మంతయును నా, పత్కాలమున రానిబాంధవులకు
నార్జించితిరి పాతకాద్రుల వేదశా, స్త్రపురాణవాక్యముల్ సరకుగొనక
తలఁచికొంటిరి గృహధనదారసుతులనె, సుఖహేతువులుగ నశుద్ధమతిని

గీ. మీరు చేసినకర్మముల్ మీతలంపు, లన్నియును గూడి యుష్మదనర్థమునకుఁ
గారణము లయ్యెఁ దుద కంతె కాని మాకు, నించుకయు లేదు హేతుత్వ మిందులోన.

గీ. ఒకనిసుఖదుఃఖములకు వే ఱొకఁడు గాఁడు, కారణం బెన్నఁటికిని స్వకర్మముననె
కలుగు దుఃఖంబు గాని సుఖంబు గాని, పరులపైఁ బడి యేడ్తురు పాపమతులు.

గీ. పాపములు మీరు చేయుటఁ బాపఫలము, గుడువవలయును మీరలె కుడువ రొరులు
పతితుఁ డగునెడ నొకఁడు తత్పతనబాధ, యనుభవించుట యన్యుఁ డెం దైనఁ గలఁడె.

క. ఒనరించి చేతులారఁగ, నొనరింపగరానియఘము లుత్సాహముతో
డను దత్ఫలానుభవవే, ళను నేడ్తురె బుద్ధిశాలులరు మీ రెల్లన్. 1779

చ. అనవుడుఁ గాలుఁ డిట్లను మహాగ్రహ మేర్పడ భృత్యులార వీ
రిని గొనిపోయి కట్టి తలక్రిందుగఁ గంబములందుఁ గ్రింద వ
హ్నిని జ్వలియింపఁజేసి దహియింపుఁడు కొంతవిశుద్ధి యేర్పడం
గను మునుముందు ఘోరనరకంబులలోపలఁ గూల్పుఁ డావలన్. 1780

క. అని యాజ్ఞాపించుడుఁ జ, య్యన వారలఁ బట్టికొని కృతాంతభటులు ఘో
రనినాదంబులు సేయుచుఁ, జని చేయుదు రంతకుండు శాసించినటుల్. 1781

ఆ. ఇంక నరకవిషయ మెఱిఁగించువారము, వినుఁడు సృష్టిచేసె విధి యనేక
నరకములను మున్ను నానాఘశుద్ధికై, పడుదు రందు దానఁ బాపు లెల్ల.

—: అష్టావింశతికోటినరకకథనము :—

వ. సప్తమతలాంతంబున ఘోరతమస్సునం దష్టావింశతికోటినరకంబులు గలవు. అందుఁ బ్రథమకోటి ఘోర యనియు ద్వితీయకోటి సుఘోర యనియుఁ దృతీయకోటి యతిఘోర యనియుఁ జతుర్థకోటి మహాఘోర యనియుఁ బంచమకోటి ఘోరరూప యనియు షష్ఠకోటి తరళతార యనియు సప్తమకోటి భయానక యనియు నష్టమకోటి కాళరాత్రి యనియు నవమకోటి భయోత్కట యనియు దశమకోటి చండ యనియు నేకాదశకోటి మహాచండ యనియు ద్వాదశకోటి చండకోలాహల యనియుఁ ద్రయోదశకోటి ప్రచండ యనియుఁ జతుర్దశకోటి కరాళ యనియుఁ బంచదశకోటి వికరాళ యనియు షోడశకోటి వజ్ర యనియు సప్తదశకోటి క్రూర యనియు నష్టాదశకోటి మహాభయ యనియు నేకోనవింశకోటి యతిక్రూర యనియు వింశకోటి మహాక్రూర యనియు నేకవింశకోటి త్రికోణ యనియు ద్వావింశకోటి పంచకోణ యనియుఁ ద్రయోవింశకోటి సుదీర్ఘ యనియుఁ జతుర్వింశకోటి పరివర్తుల యనియుఁ బంచవింశకోటి సప్తభౌమ యనియు షడ్వింశకోటి యష్టభౌమ యనియు సప్తవింశకోటి దీప్త యనియు నష్టావింశకోటి మాయ యనియుం జెప్పంబడియె.

క. భూవలయంబున నఘములు, గావించినవారి కెల్లఁ గలుషవిముక్తిం
గావించుఁ గాల్చి యీయయ, ష్టావింశతికోటినరకసంస్థానంబుల్. 1784

వ. అష్టావింశతికోటినరకంబులలో నొక్కొక్కకోటికై యైదు నాయకనరకంబులు గలవు. అయ్యవి ప్రథమకోటికి రౌరవము మహారౌరవము తమస్సు శీతము నుష్ణము ననియును ద్వితీయకోటికి సుఘోరము సుతమస్సు తీక్ష్ణము పద్మము సంజీవనము ననియును దృతీయకోటికి శఠము మహామాయము నతిలోమము సుభీమము కటంకటముననియును జతుర్థకోటికిఁ దీవ్రవేగము కరాళము వికరాళము ప్రకంపనము మహాపద్మము ననియును బంచమకోటికి సుచక్రము కాలసూత్రము ప్రతర్జనము సూచీముఖము సునేమి యనియును షష్ఠకోటికి ఖాదకము సుప్రదీపకము కుంభీపాకము సుపాకము కూపము ననియును సప్తమకోటికి నంగారరాశి భవనము నసృక్పూయప్రహ్రదము విరామము తుండశకుని యనియును నష్టమకోటికి మహాసంవర్తకము క్రతువు తప్తజతువు పంకలేపము పూతిమాంసము ననియును నవమకోటికి ద్రవము త్రపుపు నుచ్ఛ్వాసము నిరుచ్ఛ్వాసము సుదీర్ఘము ననియును దశమకోటికిఁ గూటశాల్మలి దురిష్టము సుమహానాదము ప్రభావము సుప్రభావనము ననియును నేకాదశకోటికి ఋక్షము మేషము వృషము శల్యము సింహాననము ననియును ద్వాదశకోటికి వ్యాఘ్రాననము మృగాననము సూకరాననము శ్వానాననము మహిషాననము ననియును ద్రయోదశకోటికి వృకాననము మేషవరాననము గ్రాహము కుంభీరము నక్రము ననియును జతుర్దశకోటికి సర్పము కూర్మము వాయసము గృధ్రము నులూకము ననియును బంచదశకోటికి జలూకశార్దూలము కపి కర్కటము గండము ననియును షోడశకోటికిఁ బూతివక్త్రము రక్తా

క్షమము పూతిమృత్తికము కణధూమము తుషాగ్ని యనియును సప్తదశకోటికిఁ గ్రిమి
నిచయము నమేయము నప్రతిష్ఠము రుధిరాన్నము శ్వభోజనము ననియును నష్టా
దశకోటికి లాలాభక్షము నాత్మభక్షము సర్వభక్షము వికటము సువిలాపము నని
యును నేకోనవింశకోటికి సుకటము సంకటము కటము పురీషము కటాహము నని
యును వింశకోటికి వైతరణీనది సుతప్తలోహశంకువు నయశ్శంకువు ప్రపూరణము నసి
తాలవనము ననియును నేకవింశకోటికి ఘోరము నస్థిభంగము ప్రపీడకము నీలయం
త్రము నతసీయంత్రము ననియును ద్వావింశకోటికి నిక్షుయంత్రము కూటము నంశ
ప్రమర్దనము మహాచూర్ణి సుచూర్ణి యనియును త్రయోవింశకోటికిఁ దప్తలోహమయి
శిల పర్వతము క్షురధారాదము మలపర్వతము ననియును జతుర్వింశకోటికి మూత్ర
కూపము విష్ఠాకూపము నంధకూపము పూయకూపము శాతనము ననియును బంచ
వింశకోటికి ముసలోలూఖలము యంత్రశిలాశకటలాంగలము తాళపత్త్రాసిగహనము
మహామశకమండపము సమ్మోహనము ననియును షడ్వింశకోటికి నతిభంగము తప్త
శూలమయము గుడము బహుదుఃఖము మహాదుఃఖము ననియును సప్తవింశకోటికిఁ
గశ్మలము శమలము హాలాహలము విరూపము భీమరూపము ననియును నష్టావింశ
కోటికి భీమగము నేకపాదము ద్విపాదము తీవ్రము నవీచి యనియును జత్వారింశ
దధికశతనాయకనరకంబు లయ్యె. రౌరవాద్యవీచ్యంతంబు లగు నాయకనరకంబు
లన్నియును మహానరకమండలం బనుపేరం బరగు. 1785

సీ. వీతిహోత్రంబున ధాతువులను మల, క్షయ మగువఱకును గాల్చుపగిదిఁ
బాపులఁ గర్మానురూపంబుగను నమ్మ, హానరకాగ్నులయందుఁ గాల్చి
కర్మక్షయంబుదాఁకను గాల్చి విడుతురు, కర్మశేషం బుండుకాలమందుఁ
దత్కర్మశేష మాధారంబుగాఁ గొని, భువిలోన స్థావరంబులుగ మొదటఁ

గీ. బురుగులుగఁ బిమ్మట విహంగములుగఁ బిదప, నవల మృగములుగను దదనంతరంబ
పశువులుగ గోవులుగను నాపైనిఁ బుట్టి, యవశముగ వారు బహుదుఃఖ మనుభవించి.

క. తరువాతను జనియింతురు, మరల మనుష్యులుగ నింతమాత్రమె మాకుఁ
బరిచిత మయ్యెను విషయము, పరేతరాట్పురమునందుఁ బరికింపంగన్. 1787

గీ. కల వదృష్టంబు లశ్రుతంబులును నైన, నరకవిషయంబు లట నగణ్యంబులుగను
వాని నెల్లను జూచుట గాని లేక, తెలిసికొనుటయుఁ గాని మా కలవి గాదు.

సీ. అని చెప్పుటయును నాయతివ లెల్లరు మహా, భయమును బొంది విభ్రాంత లగుచు
గాత్రంబు లెల్లను గంప మొందుచు నుండ, క్షితిపైనిఁ బడిరి నిశ్చేష్టముగను
నంతట నాకన్య లతిధైర్యమునను నా, సీమంతినుల నెల్ల సేదఁ దేర్చి
చేడెలార భయంబుఁ జెంద నర్హమె మీకు, భరతవర్షంబునఁ బ్రభవ మొంది

గీ. భస్మ మైపోవె సకలపాపములు గూడ, మాఘమాసంబున నొనర్చుమజ్జనమున
దగ్ధపాతక లగుమిమ్ముఁ దాఁక వశమె, యమనియోజ్యుల కైనను యమున కైన.

ఆ. జన్మశతసహస్రసంపాదితం బైన, పుణ్యమునసె కర్మభూమియందు
జననమొందఁగల్గు మనుజులుగను నూర్ధ్వ, గతికి మార్గ మిచటఁ గలిగియుంట. 1790

క. అందును బ్రాహ్మణజన్మము, నొందెడిభాగ్యంబుకంటె నొండొకభాగ్యం
బెందును లేదు మహీసురుఁ, డిందె యనుభవింప నర్హుఁ డిహపరసుఖముల్. 1791

గీ. తపములు జపంబులును దానధర్మములును
యాగములు యోగములును సురార్చనలును
ధ్యానములును మహానదీస్నానములును
గల విచటఁ బెక్కుసాధనంబులు తరింప. 1792

క. మాఘస్నానం బొకఁడె య, మోఘం బగుఁ బిడుగు ముక్కముక్కలుగాఁ బా
పౌఘశిలోచ్చయపంక్తుల, నాఘాతింపంగ నేల యది యివి యెల్లన్. 1793

క. అమరత్వము నమరేంద్ర, త్వము బ్రహ్మత్వమును బెందెదరు నరు లిటఁ బు
ణ్యముఁ జేయునెడలఁ గర్మ, క్షమ యొక్కఁడె స్వర్గమోక్షసాధన ముర్విన్. 1794

ఆ. భోగభూము లన్యభూములు గావున, నూర్ధ్వగతుల నచట నొంద వీలు
పడమిఁ గర్మభూమిపైని జనింపంగ, నభిలషించు చుందు రనిమిషులును. 1795

ఉ. కావున సర్వదేశములకంటెను భారతవర్షముల్ గడున్
బావన మైనదేశముగఁ బ్రాజ్ఞులు సెప్పుదు రిట్టిభూమిపై
దైవవశంబునన్ మనుజతన్ వహియించి జనించియున్ స్వజ
న్మావితథత్వముల్ బడయనట్టివివేకవిహీను లాహతుల్. 1796

గీ. ఊర్ధ్వలోకసుఖస్థితి నొందఁజేయు, పరికరము లెల్లఁ గలిగినభరతవర్ష
మునసె నాత్మోద్ధృతిని జేసికొననివాఁడు, పరికరవిహీన మగుచోట బాగుపడునె.

ఆ. పరిగృహీతదానపాథేయులై సుఖం, బుగను ధర్మరాజనగరమునకు
నేఁగఁగలరు మీరు లిక లెండు పుణ్యంబు, లాలసింపకుండ నాచరింప. 1798

క. క్షణికము చిత్తము విత్తము, క్షణికము ప్రాణానిలములు క్షణికంబులు గా
రుణికుఁడు గాఁడు కృతాంతుఁడు, క్షణమును ధర్మమునఁ దగదు సలుప నుపేక్షన్.

క. అని చెప్పుటయును వారలు, విని కన్యావచనములను విగళితభయ లై
యొనరింపఁ దొడఁగి రాప్లవ, మును గావేరీకృపీటమున మాఘమునన్. 1800

క. అనవుడు దిలీపుఁ డబ్బుర, మును బెంది మదిన్ గృతాంతపురవృత్తాంతం
బున కాపైని వసిష్ఠునిఁ, గనుఁగొని యిట్లనియెఁ గౌతుకం బొదవంగన్. 1801

సీ. మునివర బహుదూరమున నున్నయమపురం, బునకు నాకన్యలు పోవ రాఁగ
నెంతకాలము పట్టె నెంతకాలము వారి, యొడళులు చెడిపోవకుండ నిలిచె
నానతి మ్మనుడు ని ట్లనియె వసిష్ఠుండు, నరనాథ యొక్కమండలమువఱకుఁ
గృతయుగం బందును ద్రేతాయుగంబులో, పలను బాదోనమండలముదాఁక

గీ. నర్ధమండల మయ్యెడునంతవఱకు, ద్వాపరంబునఁ గలియుగావసరమందుఁ

బాడమండల మగుదాఁక భద్రముగను, బ్రాణవిరహితమనుజదేహంబు లుండు. 1802

గీ. బుద్ధి యుండును గృతయుగంబునఁ జతుర్గు, ణంబు గాఁగను ద్రేతాయుగంబునందుఁ
త్రిగుణముగ ద్వాపరంబున ద్విగుణముగను, నేకగుణముగఁ గలిని నృలోకమునకు.

సీ. ద్వాదశాహమునకుఁ దరువాత యమపురం, బునకుఁ బోదురు మర్త్యు లనెడిమాట
యగు నన్వయింపఁ బాపాత్ములవిషయంబు, నందుఁ బుణ్యు లొనర్చినట్టివారు
కాయంబు నుడిగినక్షణమందె పోదురు, సౌమ్యమార్గంబున శమనపురికి
మాఘమాసస్నానమహిమంబుచేత నా, కన్యలు క్షణములో గాలివోలె

గీ. శమనపురి కేఁగి శమనప్రసాదమునను, నరకకోటులఁ దద్యాతనలను నెల్లఁ
గని మరల వచ్చి రొకమాసమునకు నంత, వఱకుఁ దద్దేహముల బంధువర్గ మోమె.

వ. ప్రేతశరీరంబులకు శవాలంకారంబు గావింపకమున్న స్పర్శదోషంబు లేదు. 1805

గీ. కృతయుగం బాట నది తచ్ఛరీరములకు, వికృతి యేమాత్రమును సంభవింపదాయె
నట్టి పుణ్యాత్ము లెందఱో యరిగి శమన, పురమునకు వచ్చు చుందురు మరల నిటకు.

క. అనుడు దిలీపుఁడు గురువర, మును పోయి కృతాంతలోకమునకున్ మరలన్
జనుదెంచినవా రెవ రై, నను నింకను గలరె యున్న నాకుం జెపుమా. 1807

వ. అని యడుగుటయు వసిష్ఠుం డాతని కిట్లనియె. 1808

—: పుష్కరబ్రాహ్మణవృత్తాంతకథనము :—

సీ. మున్ను నందిగ్రామమున నుండెఁ బుష్కరుం, డనియెడిపేర బ్రాహ్మణుఁ డొకండు
హరిభక్తినిరతుఁ డై యతఁడు మాఘస్నాన, ములు చేయుచును విధిపూర్వకముగఁ
గడపు చుండంగను గాలంబుః దన్నామ, మున నొప్పుమఱియొకభూసురుండు
చనిపోయె నొకదివసమున నాయూరన, యంతటఁ గని యముం డాత్మభటులఁ

గీ. బుష్కరునిఁ దోడుకొని రండు పోయి శీఘ్ర, ముగను మీరు నందిగ్రామమునకు నాఁగ
వార లట కేఁగి తోడ్కొని వచ్చి విష్ణు, భక్తుఁ డగుపుష్కరుని నిలుపంగ నెదుట.

సీ. యముఁ డాతనిం గాంచి యాసనంబుననుండి, డిగ్గి దిగ్గున గుండె దిగ్గు రనఁగ
వందనం బొనరించి వానికిఁ బుణ్యాత్మ, సైఁపుము నాయపచారములను
నొకటి చెప్పంగ నే నొకటి చేసిరి ప్రమా, దమున నాభృత్యులు తప్పు జరిగెఁ
జనుము శీఘ్రముగ నీసదనంబునకు విష్ణు, పురి కేఁగఁ దగినభూసురుఁడ వీవు

గీ. నావుడుఁ గృతాంత నరకమానవులఁ జూచి, యేఁగెదను జూడఁగ ననుగ్రహింపు మనుచుఁ
బల్కుటయుఁ బుష్కరుఁడు పితృపతి తదీయ, కాంక్ష దీర్పంగ మది నెంచి గౌరవమున.

వ. రౌరవమహారౌరవశ్వభోజనవిశసనతౌరకర్దమాసిపత్త్రవనతప్తకుంభక్రిమిశక్రిమిభక్షవైత
రణీకరంభవాలుకలాలాభక్షసూకరరోధనతప్తవాలుకావీచిప్రముఖనరకపీడ్యమానులగు
పాపులం జూపింపఁ బుష్కరుండు సర్వభూతదయాపరుం డగుటం జేసి తద్బాధలు
చూడంజాలక యంతరంగంబునఁ జింతిల్లుచు వారలం గాంచి. 1811

క. కలుషాత్ములార మీరలు, సలిపినపాపంబు లేవొ సంగ్రహరీతిన్
దెలుపుఁడు మిమ్ముల నెల్లన్, దిలకింపఁగ నాకు గుండె నీ రై పోయెన్. 1812
సీ. అని యడుగుటయు నాతనిదయావాక్యముల్, స్వవిషాదమును గొంత శాంతిపఱుప
నమ్మహాపాపు లి ట్లనిరి మహాత్మ మా, వంటినిర్భాగ్యు లెవ్వరును లేరు
సర్వభూతములకుఁ జలిపినారము హింస, హరియించినారము న్యాసములను
గూటసాక్ష్యములచేఁ గొంపలు గూల్చితి, మపకృతి సేసితి మాప్తులకును
గీ. బ్రొద్దు పొడవకపూర్వమె పెద్ద లెల్లఁ, జలుపు చుండంగ మాఘమాసంబునందు
స్నానములు వారలను జూచి యైనఁ జేయ, మైతి మొకనాఁడు గూడను నాప్లవంబు.
సీ. చలిపినారము ధనార్జననిమిత్తంబుగా, నధ్యయనమును నధ్యాపనమును
నన్నంబు లేక యల్లాడు చుండఁగ జనుల్, భుజియించినారము పొట్ట లగల
ధార్మికు లొనరించుదానంబులకును గా, వించినారము బహువిఘ్నములను
గోగ్రాస మొసఁగక గోక్షీరమును ద్రావి, పెరిఁగినారము చెట్లు పెరిఁగినట్లు
గీ. సలిపితిమి భోజనంబు స్నాతులము గాక, యపహరించితి మన్యదారార్థములను
జౌర్య మొనరించితిమి నిర్విశంకముగను, జేసితిమి బ్రహ్మహత్యలు చేతులార. 1814
సీ. దోషశూన్యులమీఁద దోషంబులను మోపి, నిందించినారము నిర్దయముగ
నిచ్చెద మని వచియించి బ్రాహ్మణులకు, నీయ మైతిమి లోభహేతువునను
బర్వంబులందును బడఁతులతోఁ గూడి, క్రీడించినారము వ్రీడ యుడిగి
సంచరించితిమి స్వచ్ఛందంబుగను నంకు, శము లేనిమదసామజములభంగి
గీ. శీలవతు లైనసతులఁ ద్యజించి పణ్య, తరుణులకు నర్థ మంతయు ధారవోసి
ధర్మ మనుమాట యెఱుఁగక దారి దప్పి, నడిచి భ్రష్టుల మైతిమి కడకు మేము.
ఆ. స్వామి నీశరీరవాయువు సోఁకుట, వలన మాకు నరకవహ్నితాప
మాఱెఁ గొంత కావ నాపన్నులను నొక్క, క్షణము నిల్వు మిచటఁ జాలు నదియె.
క. అని వేఁడుటయును యముఁ డి, ట్లనియెను బుష్కరునిఁ జూచి యనఘాత్మ యిటన్
జన దీవు నిలువఁ ద్రుటియును, జనుము నిజావసథమునకుఁ జయ్యన నింకన్. 1817
గీ. అనుటయును బుష్కరుం డిట్టు లనియె దేవ, యార్తులను విడనాడి నే నరుగఁజాల
నాఁగు మించుకసేపు నాయందు నీకు, నున్నచోఁ గృప యన యముఁ డూరకుండె.
సీ. అంతటఁ బుష్కరుం డంతరంగంబును, బద్మనాభునియందుఁ బాదుకొల్పి
సరసిజనాభుండు సర్వగతుం డయ్యె, ననుమాట వాస్తవం బయ్యె నేని
సర్వంబు హరియందు సంప్రతిష్ఠిత మయ్యె, ననుమాట నిక్కువ మయ్యె నేని
సర్వాత్మునిఁగ నెంచి శార్ఙ్గిని నేఁ జేయు, నారాధనము సాధు వయ్యె నేని
గీ. ద్వారకావాస గోవింద వాసుదేవ, కేశవ జనార్దన ముకుంద కృష్ణ శౌరి
చక్రపాణి జగన్నాథ స్వామి కావు, మీమహాపాతకుల నెల్ల నీక్షణంబ. 1819

సీ. అని వచించుటయును నావిష్ణునామముల్, కర్ణగతంబులు గాఁగ నంత
విష్ణురూపములతో విలసిల్లుచును విమా, నారూఢు లై యెల్ల నారకులును
నిలిచి వ్యోమమున నర్ణించి పుష్కరభక్తి, ఘనతను వైకుంఠమునకుఁ జనిరి
యపుడు కృతాంతుఁ డాయాశ్చర్యమును జూచి, పుష్కరమాహాత్మ్యమును నుతించి
గీ. యతనికిని దత్సుహృద్బాంధవాదులకును, దచ్చరిత్రంబును స్మరించుధన్యులకును
బాటిలకయుండ నపమృత్యుభయము వరముఁ, నిచ్చి చనె నంతఁ బుష్కరుం డిలకు వచ్చె.

—: శంబూకవధవృత్తాంతకథనము :—

సీ. మఱియొకగాథ నీ కెఱిఁగించెద నయోధ్య, యందు రాముఁడు పూర్వ మధివసించి
నాల్గుపాదములతో నడపుచు ధర్మంబు, భూమండలంబును బ్రోచు చుండ
వృద్ధభూసురుఁ డొకఁడు దెతెంచి తద్ద్వార, మునఁ బెట్టి నిజమృతపుత్రశవము
వత్స వచ్చెనె పంచవర్షంబులకె మృతి, యీవు చేసినపాప మేమి కలదు
గీ. నాయఘం బనుకొన్నను నాయెఱింగి, నంతలోన నసత్యంబు నాడనైతిఁ
జేయనైతిని హింస నేజీవి కేని, యెట్లు ప్రాప్తించె నీదుఃఖ మెఱుఁగనైతి. 1821
ఆ. ఎఱుఁగ కేమి రాజకృతదోషమున నిట్టి, యాపదలు తటస్థ మగును బ్రజకు
నేను గూడఁ జత్తు నిటనె చిరాయువై, బ్రదుకుఁగాక రామభద్రుఁ డిలను. 1822
క. అని పలికి పుత్రశోకం, బున నేడ్చుచు నుండ దుఃఖమూలం బెల్లన్
విని రాముఁ డాత్మదోషం, బును దెలిసికొనంగలేమిఁ బొగులుచు నెదలోన్. 1823
క. నాపూర్వికు లెల్లను క్షో, ణీపాలనమునఁ బ్రతిష్ఠ నెలకొల్పినటుల్
చూపట్టెడి నే నొకఁడనె, పాపాత్ముఁడఁ బుట్టి కీడుపఱిచితిఁ గులమున్. 1824
క. ఆహుతి యొనరింతునొ యీ, దేహము ననలంబులోన దిగ్గున శైలా
రోహణము సేసి పడుదునొ, దేహత్యాగంబు గాఁగఁ దెగువరి నగుచున్. 1825
వ. అని బహువిధంబుల నాత్మగర్హణంబు గావించికొని యించుక యాలోచించి మార్కం
డేయమౌద్గల్యవామదేవకశ్యపకాత్యాయనజాబాలిగౌతమనారదులమునులను రావించి
నమస్కరించి యుచితాసనంబులందుఁ గూర్చుండంబెట్టి యీయుగంబున బ్రాహ్మణ
పుత్రుం డకాలమరణంబు నొందఁ గారణం బే మని ప్రశ్నించుటయు నస్మదభ్యను
జ్ఞాతుండై నారదుం డి ట్లనియె. 1826
సీ. ఇనకులాంబుధిచంద్ర వినుము పూర్వము కృత, యుగమున బ్రాహ్మణుం డొకఁడె తపము
కావించు చుండె నాకతమున నప్పుడు, మృత్యువు లేదయ్యె నెవ్వరికిని
త్రేతాయుగంబు ప్రాప్తింపఁగఁ దొడఁగెను, క్షత్రియుండును దపఃకార్యమునకు
దాన నిప్పుడు యుక్తమైనమృత్యువు గల్గి, చరియించు చుండిరి సకలజనులు
గీ. ప్రాప్త మగునెడ నింక ద్వాపరయుగంబు, సలుపు వైశ్యుండును దపంబు సకలజనులు
దానివలన యుక్తాయుక్తమైనమృతిని, గాంచుచుఁ జరించు చుందు రాకాలమందు,

క. కలియుగమున శూద్రుండును, జలుపుఁ దపము దాన నపుడు జనముల కెల్లన్
గలుగు నకాలప్రళయం, బులు దుర్మరణములు గలహములు దుఃఖములున్. 1828
గీ. దశరథాత్మజ యుగవిరుద్ధముగ నిపుడు, త్వద్ధరాచక్రమున ఘోరతపము నొక్క-
యవరవర్ణుఁ డొనర్చు చున్నందువలనఁ, దండ్రి యుండఁగఁ బుత్త్రుఁ డత్యయము నొందె.
గీ. భూమిపతి యుండ నెవఁడు తత్పురమునందుఁ, గాని తద్దేశమునఁ గాని కానికార్య
మాచరించునొ దుర్గతి నందు వాఁడు, ప్రభువు తత్పాతకచతుర్థభాగ మొందు. 1830
క. కావున నధర్మనాశము, గావింపుము నీకుఁ బాతకము లేకుండన్
జీవించు విప్రతనయుఁడు, దేవతలకు నెల్ల దానఁ దృప్తి ఘటిల్లున్. 1831
సీ. అనవుడు రాముఁ డత్యాశ్చర్య మొంది తై, లద్రోణియందు బాలకునిశవము
పెట్టించి కావలినెట్టె లక్ష్మణునిఁ ద, త్సంరక్షణము సేయఁ దత్క్షణంబ
కార్ముకతూణమార్గణఖడ్గములు గొని, కామగం బగుపుష్పకంబు నెక్కి-
ప్రస్థాన మొనరించి పశ్చిమోత్తరపూర్వ, దిగ్దేశముల నెల్లఁ దిరిగి వెదకి
గీ. యందు లేకుంట నొకఁడును నవగుణుండు, పోయి దక్షిణదిగ్దేశమునకు వింధ్య
శైలదక్షిణపార్శ్వదేశమున నొక్క-, హ్రదము వీక్షించి యట నొక్క-యతిని గాంచి.
గీ. పుష్పకమునుండి డిగి వానిపొంత కరిగి, చూచి తల్లక్షణములకు శుద్ధుఁడుగను
గనఁబడమి ని ట్లనియెఁ బారికాంక్షి నేను, రాముఁడ న శేషవిశ్వంభరాధవుండ.
క. నీ వేవర్ణమువాఁడవొ, కావింపఁగ నిట్లు తపము కత మేమియొ నా
కావిర్భవించె వినఁగను, భావంబునఁ గోర్కి- తెలియఁబలుకుపుము బుధమున్. 1834
సీ. అనవుడు నాతఁ డి ట్లనియె మహారాజ, ప్రాప్తించుఁగాక భద్రంబు నీకుఁ
బిత వీవు మా కెల్ల క్షితిపతి వగుటఁ బు, త్రకులము నీ కేను ప్రజల మగుట
స్వర్గంబుఁ గోరి నేఁ జలుపు చుంటిఁ దపంబు, దీనిచే సిద్ధి నొందెదవు నీవు
వేసిరాజ్యమునఁ గావింతురొ తాపసుల్, తపమును సుకృతి యాధరణిభర్త
గీ. శూద్రజాతిని బొడమితిఁ జూవె నైనఁ, గర్మమున బ్రాహ్మణత్వంబు గలిగె నాకుఁ
బేరు శంబూకుఁ డనవుడుఁ బెఱికి కత్తి, రాముఁ డొరనుండి వానిశిరంబు నఱికె.
గీ. అంతటను మ్రోఁగె దుందుభు లాకసమునఁ, గురిసె రామునిమీఁదను గుసుమవృష్టి
యమరబృందంబుతో నింద్రుఁ డరుగుదెంచి, యచ్చటికి రామభద్రుని నభినుతించి.
క. ఇనకులవర్ధన యియ్యది, యనిమిషకార్యంబు నీకటాక్షముచే నేఁ
డొనరింపఁబడియె జగముల, కొనగూడె శుభంబు కోరు మొసఁగెద వరమున్. 1837
వ. అని నుడువుటయు రామభద్రుండు బద్ధాంజలి యై నిలువంబడి. 1838
క. అనిమిషవల్లభ నాపయి, ననుగ్రహము గల్గె నేని యమరుల కెల్లన్
నిను నేఁ గోరెద బ్రాహ్మణ, తనయుఁడు జీవింప వరముఁ దదితర మొల్లన్. 1839
క. అనవుడు రామునిఁ గని సుర, లనఘా శంబూకహనన మైనముహూర్తం
బునయందె బ్రదికె బ్రాహ్మణ, తనయుఁడు త్వత్కృతగరిష్ఠధర్మమువలనన్. 1840

క. అని చెప్పి యదువృష్ణ్యుత్తముఁ బును గాంచఁగ రాఘవుండు భూరిప్రమదం
బున మరల నయోధ్యాపుర, మునకుం జనుదెంచి కాంచి భూసురసుతునిన్. 1841

చ. మనమునఁ జెందు చుండఁగ నమందముదంబును విప్రసూనుఁ డా
తనికడ కేఁగుదెంచి నృపతల్లజ యంతకలోకభాగ్యమున్
గని చనుదేరఁగల్గితిని గ్రమ్మఱఁ దావకధర్మపాలనం
బున నని పల్కి నందఱము పొందితి మంతము లేనిహర్షమున్. 1842

—: సాందీపనివృత్తాంతకథనము :—

సీ. మఱియొకగాథ నీ కెఱిఁగించెదను విను, మీవిషయముననె భూవరేణ్య
యవని నుండె నవంతి యనుపురం బొకఁడు యో, జనమితాయామవిస్తారయుతము
దానిలోఁ గలరు వేదజ్ఞులు శాస్త్రజ్ఞు, లఖిలపురాణజ్ఞు లననిసురులు
వారిలోఁ గలఁ డొకవసుధామరుండు సాం, దీపని యనునామధేయమునను

గీ. నాతఁడు సమస్తవేదరహస్యవిదుఁడు, సత్యవాది దయాశాలి సాత్త్వికుండు
విష్ణుపూజారతుండు వివేకధనుఁడు, వాని కొక్కసుతుం డుండె వరగుణుండు. 1843

గీ. ఆకుమారుఁడు వేదవేదాంగవిద్య, లన్నియును నభ్యసించి బాల్యంబునంద
మతిమదగ్రణి యనెడికీర్తి గడించి, హర్షవారాశిఁ బితల నోలార్పఁ దొడఁగె. 1844

ఆ. అట్లు గొంతకాల మరుగంగ నొకమాఘ, మాసమందుఁ బూర్ణిమాదినంబు
నందు సఖులతోడ సాందీపనిసుతుండు, చని ప్రభాసతీర్థమునకు వేగ. 1845

క. వనజాక్ష కృష్ణ యచ్యుత, మునుఁగుచు నుంటిని బ్రభాసమున మాఘమునన్
గనికరముతోడ భవవా, ర్ధినిఁ బడిపోకుండ నుద్ధరింపుము నన్నున్. 1846

క. అని వేఁడి ప్రభాసంబున, మునిఁగి మరలఁ బైకె రామి ముని తనతోడన్
జనుదెంచినసఖు లెల్లరుఁ, జని తెలిపిరి దుఃఖవార్త సాందీపనికిన్. 1847

వ. అంతట సాందీపని తనపుత్రుండు ప్రభాసతీర్థస్నానకాలంబునం గావించినకృష్ణప్రార్థనంబు స్మరించుకొని కృష్ణానుగ్రహంబున స్వసూనునకు క్షేమంబు గలుగు నని నిశ్చయించికొని ధైర్యంబు వహించి పుత్రమరణవార్తాశ్రవణంబున విలపించు చున్నస్వపత్నికి ధైర్యంబు బోధించి దుఃఖవిముక్తం జేసి బ్రహ్మానుసంధాననిష్ఠాగరిష్ఠుం డై సుఖం బుండె. అప్పుడు గోకులంబుననుండి నందుండు రామకృష్ణులను జగత్ప్రసిద్ధుం డగు సాందీపనియొద్దకుఁ జదువం బనిచె. 1848

ఆ. అపుడు రామకృష్ణు లరిగి సాందీపని, సవిధమునకు వేదశాస్త్రములను
నభ్యసించి పూర్వ మభ్యసించిరో నాఁగ, నల్పకాలముననె యద్భుతముగ. 1849

గీ. తుష్టిపడ దేశికుఁడు చతుష్షష్టికళలఁ, దెలిసికొనిరి చతుష్షష్టిదివసములకుఁ
బ్రకటితము గాఁగ నిజదేవభావ మిలను, గలసమస్తమనుష్యసంఘాతమునకు. 1850

గీ. అట్లు గ్రహియించి సకలవిద్యలను రామ, కృష్ణు లాచార్య నీకు దక్షిణ యొసంగ
నెంచినారము కోరు మే దేని యనుడు, నతఁడు తచ్ఛక్తివిజ్ఞాత యగుటఁ జేసి. 1851
క. మరణించిననిజపుత్రుని, గురుదక్షిణ గాఁగ నొసఁగఁ గోరుటయును వా
రిరువురును నపాంపతికడ, కరిగి ధనువు లెక్కువెట్ట నాసమయమునన్. 1852
సీ. వరుణుఁడు దిగ్గున వచ్చి ప్రత్యక్ష మై, నిలఁబడి రామకృష్ణులకు నెదుట
మహనీయులార యుష్మద్గురుపుత్రుని, శంఖాసురుఁడు మ్రింగి జలధిలోనఁ
జరియించు చున్నాఁడు చంపి వానిఁ దదీయ, కుక్షి చీల్చిన వచ్చు గురుసుతుండు
నావుడుఁ గృష్ణుఁ డర్ణవములోఁ జొచ్చి త, త్క్షణమంద శంఖుని సంహరించి
గీ. చీల్చి తత్కుక్షి నందు దేశికసుతుండు, కనఁబడక యొక్కశంఖంబు గానఁబడుట
దానిఁ గొని వచ్చి శంఖనాదం బొనర్చి, యమునికడ కేఁగె భ్రాతృసహాయముగను.
గీ. అప్పుడు యముండు వారల కర్హముగను, బూజ గావించి తద్భావమును గ్రహించి
యాత్మకృతపుణ్యభోగంబు లనుభవించు, చున్నసాందీపనితనూజు నొప్పగించె. 1854
గీ. అంతటను రామకృష్ణు లత్యద్భుతముగ, గురుకుమారునిఁ గొనివచ్చి గురున కొసఁగి
శ్లాఘ్యతను గాంచిరి సమస్తజగములందు, నిట్టిప్రాక్తనగాథ లెన్నేని కలవు. 1855
చ. అనుడు దిలీపుఁ డెంతయును నచ్చెరియంబును జెంది మానసం
బున గురువర్య చెప్పితివి పూర్వచరిత్రము లద్భుతంబుగన్
విని ముదితుండ నైతిఁ గరుణించి యిఁకన్ మృగశృంగమౌనిగా
థను వచియింపు ముల్లమునఁ దచ్ఛ్రవణస్పృహ పల్లవించెడిన్. 1856
వ. అని యడుగుటయు దిలీపునకు వసిష్ఠుం డిట్లనియె. 1857

—: మృగశృంగ వివాహకథా కథనము :—

సీ. అంతటసంతోష మామతిల్లనుచథ్యుఁ, డాహ్వాన మొనరించి యఖిలమునులఁ
దత్సమక్షంబునఁ దనపుత్రి యగుసువృ, త్తను గుత్సమౌనినందనున కొసఁగ
సంసిద్ధుఁ డై యుండుసమయంబునందుఁ ద, త్తనయామణీసఖీత్రయము వచ్చి
భావించితిమి నిన్నె భర్తఁగ మృగశృంగ, మముఁ గొమ్ము నీకు క్షేమంబు గలుగు
గీ. నట్లు గాకున్న విడుతుము ప్రాణములను, ననుడుఁ గుత్సాత్మజుఁడు సంశయంబు నొందు
చుండఁ దద్భావ మెఱిఁగి వ్యాసుండు వత్స, కన్యకల నెల్లఁ గొను మేకకాలమంద.
సీ. దోషంబు లే దిందుఁ దొల్లి సౌభరిముని, గ్రహియించె నిజకళత్రములు గాఁగ
మాంధాతృభూపకుమారికామణులను, నేఁబదిమందిని నేకవేళ
గ్రహియించె నట్లె దక్షప్రజాపతితనూ, జలను బల్వురను నిశాకరుండు
నావుడు వత్సుఁ డానల్వురుకన్నెలఁ, బ్రీతితో నప్పుడె పెండ్లియాడె
గీ. ననవుడు దిలీపుఁడు తపోధనాగ్రగణ్య, యేల సౌభరి మాంధాతృబాలికలను
బరిణయంబయ్యెఁ జెప్పు మాచరిత మెల్ల, ననుడు ని ట్లనియె వసిష్ఠుఁ డతనిఁ గాంచి.

—: సౌభరివృత్తాంతకథనము :—

సీ. పూర్వము కాంపిల్యపురమున సౌభరి, యనువిప్రుఁ డొకఁ డుండె నఖిలవిదుఁడు
సలిపి యాతం డాదిఁ జాంద్రాయణముల నా, వలఁ జేసి మాసోపవాసములను
నవలఁ బర్ణాశనుఁ డై పిమ్మటను నిర, శనముగా మాఘమాసంబులందు
జలములోపల నుండి సలుపు చుండఁగ ఘోర, తపముఁ దత్సలిలమధ్యంబునందు
గీ. సామమద మనునొక్కమత్స్యము స్వకీయ, పుత్రపౌత్రప్రపౌత్రకళత్రమిత్ర
బంధుపరివేష్టితం బయి ప్రభువువోలె, సంచరింపఁగ సాగె స్వచ్ఛందముగను. 1860
సీ. అపుడు సౌభరి చూచి యమ్మత్స్యమును వాంఛ, పొడమంగ సంసారమునను దనకు
సలిలనిర్గతుఁ డయి సత్వరంబుగ నేఁగి, మాంధాతృనృపతిసమక్షమునకుఁ
దత్పూజితుం డయి ధరణీంద్ర సంసార, వాంఛచే నిటకు నే వచ్చినాఁడ
నీకన్యకలలోన నా కొక్కకన్యక, నిమ్ము చేకూరు భద్రమ్ము నీకు
గీ. ననుడు విభుఁడు జరాపరిశీర్ణాంగుఁ డైన, మునికిఁ దారుణ్యసౌందర్యములకు నిలయ
మైనతనపుత్రి నీయలే కతఁడు శాప, మిచ్చు నని జంకి మెలమెల్ల నిట్టు లనియె.
సీ. శమధన క్షత్త్రియసంప్రదాయము దాఁటఁ, జన దందు రార్యులు క్షత్రియునకుఁ
గావునఁ గన్యక కాంచి వరించిన, వరున కాయమ నీయవలయు మేము
కులధర్మములు మీరు నిలుపంగవలసిన, విజ్ఞాత లగుటచే వినిచినాఁడ
నని యూరకుంటయు నమ్మునీంద్రుఁడు రాజ, నీవు పల్కినపల్కు నిక్కవంబ
గీ. కానిపింపుము నన్ను నీకన్నియలకు, వారిలో నెవ్వరును గూడఁ గోరకున్న
వదలుకొని పిచ్చియాసను వాస్తవముగ, నరిగెద మదాశ్రమంబున కపుడె నేను.
సీ. అనవుడు తేఁ డట్లె యొనరింతు నని వర్ష, వరుని రావించి సత్వరము గాఁగఁ
గంచుకి నాపుత్రికలకడ కీపారి, కాంక్షిఁ దోడ్కొనిపోయి కన్యలార
యొవతె వరించునో యితని మీలో నామె, నితనికి మీతండ్రి యిచ్చు ననుము
నావుడుఁ గంచుకి దేవరయాన నౌఁ, దలఁ దాల్చి యాతపోధనునితోడఁ
గీ. బ్రభుకుమారిక లుండినభవనమునకు, నరిగి వారికిఁ దెలిపె నృపాజ్ఞ నంత
వారలకుఁ గానఁబడియె నప్పారికాంక్షి, కామశతకోటిసుందరాకారమునను. 1863
ఆ. అపుడు వార లెల్ల నాతపస్వినిఁ గాంచి, మోహవివశ లగుచు దేహములను
విస్మరించి వాని వేష్టించి రాతని, భర్తగను గ్రహించుభావమునను. 1864
సీ. అది విని మాంధాత యాశ్చర్యమును బొంది, యంతరంగమునఁ గన్యకల నెల్ల
నమ్మునీంద్రున కిచ్చె నంత నేఁబదిమంది, మాంధాతృకన్యల మౌనివరుఁడు
గ్రహియించి పత్నులు గా యథావిధి నిజా, శ్రమమున కేఁగి యాసతులతోడ
రావించి విశ్వకర్మను దపోబలమునఁ, గట్టించి నిరుపమాగారములను
గీ. మునిచి యొక్కొక్కయింట నొక్కొక్కసతిని, నఖిలభోగంబులను నోలలార్చు చుండ
ననుభవించుచు సకలసౌఖ్యముల నమర, రామ లన నొప్పు చుండి రారాజసుతలు.

సీ. అటు లుండ నొక్కనాఁ డాత్మలో నుదయింపఁ, దనకుమారికలను గనెడివేడ్క-
చనుదెంచి మాంధాత సౌభరియాశ్రమం, బునకుఁ దద్వైభవంబునకు నెదను
విస్మయం బొదవంగ వీక్షించి వీక్షించి, యపరిమితం బైనహర్ష మొంది
తనపెద్దకూఁతు రుండినసౌధమున కేఁగ, నామె తండ్రికి మ్రొక్కి- నాదరమున
గీ. నపుడు మాంధాత పుత్రి ని ట్లడిగెఁ దల్లి, నిన్ను నీభర్త ప్రేమించు చున్నవాఁడె
కలరె పరిచారికలు సేవ సలుప నీకుఁ, గలదె నీమానసమున కెక్కుడ సుఖంబు. 1866
వ. అని యడుగుటయు నామె మాంధాత కి ట్లనియె. 1867
సీ. జనక నా కిచట నెందును లేదు లోపంబు, నవరత్నగుంఫితభవనములును
దివ్యవస్త్రములును దివ్యభూషణములు, మేర మీఱనిపరిచారికలును
షడ్రసోపేతభోజనమును మృదులశ, య్యాతలంబులు మహోద్యానములును
నత్యద్భుతము లైనయానంబులును సర్వ, సౌఖ్యప్రదము లైనసంపదలును
గీ. గలిగియున్నవి గాని నాకాంతుఁ డెడసి, మామకీనసహోదరీమణుల నెల్ల
ననిశమును నాకడనె యుండు ననెడిచింత, మాత్ర మొక్కటి కలదు నామానసమున.
గీ. అనుడు డోలాయితము గాఁగ నంతరంగ, మపుడె మాంధాత తనద్వితీయాత్మజాత
గృహమునకుఁ బోయి జ్యేష్ఠపుత్రికినుబోలె, నామె నడిగిన జనకున కాపె మ్రొక్కి-.
గీ. తనకు నెందును లోటు లే దనియు నాత్మ, వల్లభుఁడు తనసహజల వదలి సతముఁ
దనకడనె యుండు నను విషాదం బొకండు, మాత్ర మెద నున్న దనియును మనవిచేసె.
సీ. అంతట మాంధాత యాశ్చర్యమును జెంది, యెదలోన నాపుత్రియిల్లు విడిచి
మిగిలినకూఁతులమేడల కన్నింటికి, కనిఁ బోయి యాత్మనందనలఁ జూచి
వెనుకఁ దా నడిగినవిధమున నడుగ వా, రలు చెప్పినట్లె వీరలును జెప్ప
నపరిమితం బైనయానంద ముదయింప, సౌభరి యున్నకుంజమున కరిగి
గీ. బహువిధంబుల నాతనిమహిమఁ బొగడి, తనకుఁ గల్గినధన్యతఁ దలఁచికొనుచుఁ
దనపురంబున కరిగె నంతటను గొంత, కాలమున కామహారాజకన్య లెల్ల. 1871
ఆ. కనిరి ముగురుముగురుతనయులఁ బ్రత్యేక, ముగఁ దనూనపాత్సముజ్జ్వలులను
సౌభరిప్రభావసహితుల వారికిఁ, గలిగి రాత్మజులును గన్యకలును. 1872
క. వారలకుం బ్రభవించి ర, పారముగను సుతులు సుతలుఁ బ్రభవించిరి వి
స్తారముగ సుతులు సుతలును, వారలకును నేమి చెప్ప వారలవృద్ధిన్. 1873
వ. అట్లు సౌభరి ద్వాదశవర్షమాఘస్నానసలిలమధ్యతపఃఫలంబుగాఁ బుత్రపౌత్రదౌహి
త్రాదిబహుసంతానపరివేష్టితుం డై చిరకాల మిహసుఖంబుల నెల్ల ననుభవించి
తుదకు సకలపత్నీసమేతంబుగా నక్షయం బైనపరమపదము వడసె. 1874
క. ఈసౌభర్యాఖ్యానము, నాసక్తిని వినిన జనుల కాకర్ణింపం
జేసినను వంశవృద్ధియు, వాసియు నుత్తమపదంబు వారల కొదవున్. 1875

వ. అట్లు మృగశృంగుండు భార్యాచతుష్టయంబుం బెండ్లాడి పతివ్రతామణు లగువారల తోడం గూడి ధర్మయుక్తంబుగ గార్హస్థ్యంబు నిర్వహించుచుం గొంతకాలంబునకు సువృత్తయందు సకలసుగుణగణసమేతుం డగునొక్కకుమారునిం గని తాను త్రికాలజ్ఞుం డగుటం జేసి భవిష్యత్కాలంబున మృగంబులు కండూతి వాయం దపోనిష్ఠాగరిష్ఠుం డగునాతనిదేహంబును దమదేహంబులతో రాచికొను ననెడియర్థంబు సూచితంబు గా నాపుత్రునకు మృకండుం డనునామకరణంబు గావించి క్రమంబుగా నుపనయనంబు చేసి సాంగంబుగాం జతుర్వేదంబులం జెప్పి గృహస్థాశ్రమంబున కభ్యనుజ్ఞ యొసంగ మృకండుండు ముద్గలకుమారిక యగుమరుద్వతినిం బెండ్లాడె. పిదపం గ్రమంబుగాం గమలయు విమలయు సురసయు నొక్కొక్కపుత్రునిం గాంచిరి. మృగశృంగుండు కమలాపుత్రునకు నుత్తముం డనియును విమలాతనూభవునకు సుమతి యనియును సురసాసూనునకు సువ్రతుం డనియును నన్వర్థనామంబులం బెట్టి సకలవిద్యలం జెప్పి గృహస్థాశ్రమంబున కభ్యనుజ్ఞ యొసంగ నుత్తముండు కణ్వపుత్రి యగుకుశను సుమతి సుమతితనూజ యగుసత్యను సువ్రతుండు పృథుపుత్రిక యగు ప్రియంవదను ధర్మపత్నులు గా గ్రహియించి వారలయందు వేదపారగు లగుబహుపుత్రులం గాంచిరి. 1876

సీ. అంతట మృగశృంగుం డాత్మసతీతనూ, జస్నుషాపౌత్రాదిసహితుం డగుచు
సతతంబు మాఘమాసములం దుషఃకాల, ముననె చేయుచు స్నానములను భక్తి
ననుభవించి సుఖంబు లన్నియు గార్హస్థ్య, మున విరక్తి జనింపం గొనను మదికిం
దనకుటుంబభరంబు నునిచి పుత్రులయందుం, బోయి తపోవనంబునకు నచట
గీ. సర్వభూతంబులను నాత్మసామ్యమునను, గాంచుచు మృగవ్రజంబుతోం గలిసి నిర్భ
యంబుగం జరించుచును శాంతి యావహిల్లం, గడపి యొకకొంతకాలంబు గౌతుకమున.
క. తనువుం దొఱంగెడికాలము, చనుదేరంగ నశ్రమముగ స్వశరీరము న
ల్లన విడిచి బ్రహ్మపదముం, గని ప్రళయమువఱకు సుఖముగా నుండి యటన్. 1878
గీ. ప్రళయకాలావసానంబు ప్రాప్త మగుడు, రసను జనియించి శ్వేతవరాహకల్ప
మందు నజపుత్రుండుగ ఋభు వనెడిపేర, నుద్ధరించి నిదాఘుని నొందె ముక్తి. 1879

—: మృకండువృత్తాంతకథనము :—

వ. అంతట మృకండుండు తన కనపత్యత సంభవించినందులకుం జింతిల్లుచు మాతృభార్యాసమేతుం డై తద్దేశభూపాలుం డగురాష్ట్రవివర్ధనుండు సైన్యంబుతోడం బ్రస్థితుండు గా నాతనిసాహాయ్యంబున విశ్వేశ్వరరాజధాని యగుకాశీపురంబునకుం జేరి గంగాస్నానాదికార్యంబులు యథావిధిని నిర్వర్తించి డుంఠివిఘ్నేశ్వరపురోదేశంబునం దనపేర లింగంబు ప్రతిష్ఠాపించె. పిదపం దల్లింగపురోభాగంబున సువృత్త సువృత్తేశ్వరలింగంబును దత్ప్రాగ్భాగంబునం గమల కమలేశ్వరలింగంబును విమల దేహళీవిఘ్నరాజసన్నిధియందు విమలేశ్వరలింగంబును సురస తదీశానదిగ్భాగంబున సురసేశ్వరలింగం

బును మరుద్వతి మణికర్ణికాపశ్చిమభాగంబున మరుద్వతీశ్వరలింగంబును బ్రతిష్ఠాపించిరి. మృకండేశ్వరసందర్శనంబున సర్వకార్యసిద్ధియును గాశీవాసంబును సువృత్తేశ్వరదర్శనంబున సద్వృత్తియును నిర్విఘ్నతయును గమలేశ్వరదర్శనంబున సర్వకామసిద్ధియును విమలేశ్వరదర్శనంబున విమలజ్ఞానప్రాప్తియును సురసేశ్వరదర్శనంబున సురసామ్రాజ్యలాభంబును గాశీమరణంబును మరుద్వతీశ్వరదర్శనంబునఁ బునర్జన్మరాహిత్యంబునుం గలుగు. 1880

గీ. అట్లు వారాణసీక్షేత్రమందు వార, లందఱును లింగములను నిజాహ్వయముల
నిలిపి యుండిరి కాశిలోపలనె యొక్క, హాయనము చేయుచుఁ దదీయయాత్ర లెల్ల.
సీ. అంతట నొకదినమందు మృకండుమా, తలు నల్వురును వృద్ధదశను నుంటఁ
గాంచి మణికర్ణికాతీర్థమందు మా, ధ్యాహ్నికస్నానంబు నల్లనల్ల
నరిగి శ్రీవిశ్వేశ్వరాలయంబునకు నొ, నర్చుచును బ్రదక్షిణముల నచట
శక్తి చాలమిని లోచనములు దిరుగంగఁ, బడి శిలపైని విభ్రమముతోడ
గీ. నంత విశ్వేశ్వరుండు స్వహస్తములను, బట్టికొని వారిమూర్ధముల్ ప్రణవమంత్ర
మును జపింపంగఁ దత్కర్ణములను వారు, తనువులను వీడి కైలాసమునకుఁ జనిరి.
సీ. ఆపుడు మృకండుమహర్షి మాతల కెల్ల, నౌర్ధ్వదైహికకర్మ మాచరించి
తనభార్య యగుమరుద్వతితోడ నివసించి, యాక్షేత్రమునయందె యనుదినంబు
గంగలో స్నానంబు గావించుచును విశ్వ, నాథుని సేవ యొనర్చుచుండ
నతనిభక్తికి మెచ్చి యాత్మలో నొకనాఁడు, విశ్వేశ్వరుం డామునీశ్వరునకు
గీ. దర్శనం బిచ్చి వాంఛితార్థంబు కోరు, మిచ్చెదను నాఁగ నతఁడు మహేశ్వరునకు
మ్రొక్కి సాష్టాంగముగ శర్వ యొక్కసుతుని, నా కొసంగు మపుత్రతాశోక ముడుగ.
వ. అని వేఁడుటయు మృకండునకు సర్వజ్ఞుం డిట్లనియె. 1884
సీ. గుణవంతుఁ డైనట్టికొడుకు గావలె నన్న, బ్రదుకు షోడశవత్సరములు వాఁడు
చిరకాలజీవి యఘాశిశువు గావలె నన్న, నగువాఁడు గుణహీనుఁ డైనవాఁడు
వీనిలో నెవ్వానిఁ గోరుకొందువొ నీవు, కోరుకొ మ్మతనిఁ జేకూర్తు నీకు
నావుడు నమ్మౌని భావంబులోఁ గొంత, కలఁక గల్గఁగ దానిఁ దొలఁగఁ ద్రోచి
గీ. స్వామి యల్పాయు వైనను సగుణుఁ డైన, యాత్మజుని నిమ్ము నిర్గుణుఁ డైనసుతుఁడు
కల్పకోటులు జీవించుఁగాక వాఁడు, కాఁడు పితృమాతృసంతోషకారకుండు. 1885
ఆ. అనుడు విశ్వనాథుఁ డామృకండునకుఁ గో, రినవరంబు నిడి యదృశ్యుఁ డయ్యె
నంత లబ్ధవాంఛితార్థుఁ డై సతితోడ, శమధనుండు స్వాశ్రమమును జేరె. 1886

—: మార్కండేయవృత్తాంతకథనము :—

ఆ. అంతఁ గొంతకాల మరుగ మరుద్వతి, గర్భమును ధరించి కాలవిదులు
స్తుతి యొనర్పఁ దగినసుముహూర్తమునఁ గాంచె, సుగుణభరితుఁ డైనసుతుని నొకని.

గీ. కుసుమవర్షంబు గురిసె నాకసమునుండి, నభమునను మ్రోఁగె దేవదుందుభులు దెసలు
నమలును బ్రసాదమును జెందె నుదయతరణి, కరణి నావిర్భవింప మృకండుసూతి.

సీ. అపుడు వ్యాసమహర్షి యరుదెంచి యచ్చటి, కాత్మీయశిష్యసమన్వితముగ
జయనినాదంబులు సలుపుచుండఁగ విమా, నారూఢులై దివి నమరులెల్ల
జాతకర్మంబును జలిపి మార్కండేయుఁ, డను పేరు వెట్టి యన్వర్థముగను
జనియె నిజాశ్రమంబునకు మృకండుకృ, తాదరంబున మహాహ్లాద మొదవ

గీ. నవలఁ గడవంగఁ గొంత బాల్యంబు పంచ, మాబ్దమందు మృకండుఁ డాయర్భకునకుఁ
జేసి యుపనయనంబును జెప్పె సాంగ, ముగఁ బదక్రమయుతవేదములను నెల్ల. 1889

క. అంతట మార్కండేయుఁడు, వింత జనింపంగ నఖిలవిప్రులకును జ
న్మాంతరసంచితవిద్యా, సంతతులం బోలె నేర్చె సకలాగమముల్. 1890

వ. అప్పటికి మార్కండేయునకుఁ బంచదశాబ్దంబులు గడచి షోడశాబ్దంబు ప్రాప్తించె.

సీ. అపు డాత్మజునిఁ జూచి యాత్మలో నిముడక, శోకప్రవాహంబు పైకిఁ బొంగ
నాఁపికొనంగ శక్యము గామిని మృకండు, తాపసోత్తముఁడును దత్సతియును
విలపింపఁ దొడఁగిరి వీక్షించి తద్విషా, దమును మార్కండేయశమధనుండు
తండ్రి మీరలు విషాదము నొందఁ గత మేమొ, వినిపింపు మని వేఁడ వినయమునను

గీ. జెప్పలేక మృకండుఁడు చెడ్డమాట, కొంతవడి కాత్మలోపలఁ జింత నొంది
కడకుఁ జెప్పక తప్పనికతనఁ జెప్పె, విజ్ఞుఁ డగుటను జరిగినవిషయ మెల్ల. 1892

క. అది విని మార్కండేయుం, డెదలోఁ గలుగమి నధైర్య మించుక యేనిన్
వదనంబున లేనగవ, భ్యుదితము గా నిట్టు లనియె నుత్సాహముగన్. 1893

చ. వలదు భయంబు దండ్రి శ్రితవత్సలుఁడై నలలాటనేత్రునిన్
గొలిచి జయించి మృత్యువును గొందు నమర్త్యత నాఁగ నాత్మలోఁ
గలుగఁ బ్రమోద మెంతయు మృకండుఁడు వానిని గ్రుచ్చి కౌఁగిటన్
జలుపుము వత్స యట్టులె యొసంగు మహేశుఁడు నీకు భద్రముల్. 1894

సీ. కాలపాశంబుచేఁ గట్టఁగాఁ బడియున్న, శ్వేతకేతువును రక్షించినాఁడు
ప్రళయాగ్నివలెఁ బ్రజ్వరిలుకాలకూటంబుఁ, గ్రోలి ముజ్జగములఁ బ్రోచినాఁడు
ఘట్టించి యరకాలఁ దన్ని మిత్తిని శిలా, దునితనూజాతుని మనిచినాఁడు
జాలకారకుఁడైన జాలంధరుని నుక్క, డంచి దేవతలఁ బాలించినాఁడు

గీ. త్రిపురదైత్యుల భస్మీకరించి విష్ణు, బాణమున సాధువులను గాపాడినాఁడు
దర్పితాంధకగర్వవిధ్వంసకుఁడు, శిక్షితమనోభవుం డిందుశేఖరుండు. 1895

క. కావున శరణాగతర, క్షావిధినిర్వహణదీక్షఁ గైకొనినమహా
దేవుఁడె శరణము నీ కిఁక, నావుడుఁ బితృమాతృచరణనళినంబులకున్. 1896

వ. మార్కండేయుండు సాష్టాంగవందనంబు గావించి తదనుజ్ఞం బడసి దక్షిణార్ణవకూలం

బునందుఁ దనపేర లింగంబుఁ బ్రతిష్ఠాపించి యచ్చట మాఘస్నానంబు గావించి యమ్మార్కండేయలింగంబునకుఁ ద్రికాలపూజ చేసి పూజావసానంబున నానందపుల కాంకితగాత్రుండై నాట్యంబొనర్చి శివస్తోత్రంబు గావించుచుండఁ దదాయుష్యావసానకాలంబు ప్రాప్తించుటయు. 1897

—: మార్కండేయయమసంవాదము :—

సీ. దంష్ట్రాకరాళవక్త్రంబుతోడను నంజ, నాచలతుల్యకాయంబుతోడఁ
గర్కశాయుధయుక్తకరములతోడను, సర్పవృశ్చికరోమచయముతోడఁ
బ్రజ్వలద్రక్తనేత్రంబులతోడను, దీక్ష్ణాంచలక్రూరదృష్టితోడఁ
బ్రళయకాలానలోపమదీప్తితోడను, దారుణంబైనక్రోధంబుతోడ
గీ. మృత్యుదేవతతోడను భృత్యగణము, తోడ నంతకుఁ డేతెంచి ధూర్తముగను
గాలపాశంబు దగిలించి కంఠమునకు, లాగఁ దొడఁగె మృకండుబాలకుని బలిమి.
సీ. అపుడు మార్కండేయుఁ డాలింగమును దృఢం, బుగఁ బట్టికొని బాహుయుగముతోడ
యముని వీక్షించి కృతాంత శివస్తోత్ర, మును బూర్తి గావించుదనుక నాకు
గమనభోజనశయనములు వర్జించెడి, వ్రత ముండుటను నంతవఱకు నీవు
తాళుము వచ్చెదఁ దరువాత నీవెంట, ధర్మంబు గాదు వ్రతంబు చెఱప
గీ. ననుడు దండధరుం డిట్టు లనియె మూఢ, చేయవలసినకృత్యంబు చేసికొనక
యేల యాలస్య మొనరించి తింతవఱకు, యముఁడు నీకృత్యములకొఱ కాఁగువాఁడె.
సీ. పూర్వవయస్సునం బొనరించుకొనక ధ, ర్మమును మూఢుండు వార్ధకమునందుఁ
దపియించుచుండు స్వార్థభ్రష్టుఁ డైనయ, ధ్వగునిచందంబున దారి దప్పి
చేసినఁ గర్మంబు మాసాష్టకముదాఁక, నొకవత్సరము సుఖంబుండఁగలుగుఁ
గావించునెడలను గార్యంబు దిన మెల్ల, నొకరేయి సుఖముగా నుండవచ్చు
గీ. వార్ధకంబున సుఖము గావలయు నేని, వలయుఁ జేయంగఁ బని పూర్వవయసునంద
కలుగునెడ వాంఛ చచ్చియుఁ గాంచ సుఖము, వలయు ధర్మము నొనరింపఁ బొలియువఱకు.
సీ. సలుపఁగా వలయును శ్వఃకార్య మీనాఁడె, యపరాహ్ణవిధినిఁ బూర్వాహ్ణమంద
కృత మిది కర్తవ్య మిది యని చింతనఁ, గావించువారలు కాలహతుల
విశిఖకోటిసహస్రవిద్ధుఁ డైనను జావఁ, డప్రాప్తకాలుఁ డైనట్టివాఁడు
ప్రాప్తకాలుఁడు కుశాగ్రస్పర్శ మొదవిన, యంతమాత్రముననె యంతరించుఁ
గీ. జక్రవర్తిసహస్రముల్ శక్రశతము, లప్రతిహతంబుగ సధీను లైరి నాకు
బాలుఁడవు నీ వనఁగ నెంత పట్టువడఁగ, వదలిపెట్టుము లింగంబుఁ బదర నేల.
వ. అని తర్జించుటయు మార్కండేయుండు వైవస్వతున కిట్లనియె. 1902
సీ. సమవర్తి శంకరస్తవమున కంతరా, య మొనర్చువారి కనర్థ మొదవుఁ
గలవాస్తవంబును దెలిపినాఁడను నీకు, మఱియు నిం కొకమాట యెఱుఁగవలయు

రాజభృత్యులకెల్ల రాజు శాస్త్రయె యట్లు, శివభక్తులకు నెల్ల శివుఁడె శాస్త
వారిపై లేదధికారంబు నీకేని, ధాత కేనియు వానితాత కేని

గీ. శైలములఁ బెల్లగింతురు సాగరములఁ, ద్రావుదురు రోదసులను వ్యత్యస్తముగను
జేయుదురు శివభక్తులు చేయలేని, కార్యములు లేవు కోరిక గలిగ నేని. 1903

గీ. ఆపదలు రావు శివభక్తులైనవారి, కనుచు వచియించుబుధులవాక్యంబు వినవె
యాగ్రహావిష్టులైన బ్రహ్మాదులకును, శంకరునికింకరులఁ దాఁక శక్తి లేదు. 1904

క. అనవుడు దండధరుం డి, ట్లనియెఁ ద్రిభువనముల మ్రింఁగునంతటిక్రోధం
బున మండిపడుచు దుర్మతి, తను వెఱుఁగక మాటలాడెదవె నామ్రోలన్. 1905

క. గంగాసికతాకణముల, భంగిని గణియింపరాని బ్రహ్మలు నాచే
భంగింపఁబడిరి పెక్కండ్ర, సంగము లేమిటికిఁ గనుము సామర్థ్యంబున్. 1906

క. అని పలికి తెఱచి వక్త్రము, గనులను మిఱుమిట్లుగొలుపఁగా మార్కండే
యుని మ్రింగఁ గడఁగు చుండం, గను రాహుగ్రహము శీతకరునింబోలెన్. 1907

గీ. అప్పు డాలింగముననుండి యష్టమూర్తి, తోయదధ్వనితోడఁ బ్రాదుర్భవించి
హుంకరించి యురంబున నొక్కతన్ను, దన్నె వామపదంబున దండధరుని. 1908

గీ. ఆప్రహారంబుతోడనె యంతకుండు, పడియె దూరంబుగను నేలపైని దండ
తాడితంబైనఫణిపోలెఁ దాళ లేక, యంతట మృకండుతనయుఁడు హరునిఁ జూచి.

—: మృత్యుంజయస్తోత్రము :—

మత్తకోకిలము. బాలచంద్రకళావిభూషణభాసమానకపర్దునిన్
వ్యాళరాజగుణోపపన్నసువర్ణశైలశరాసనున్
నాళికేక్షణబాణునిన్ గణనాథునిన్ ద్రిపురఘ్నునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1910

మత్తకోకిలము. శైలరాజసుతాపరిష్కృతచారువామకళేబరున్
హేళిలోచనహారి నీక్షణనిర్మితాఖిలలోకునిన్
బాలితావనపాత్రునిన్ మునిభావనీయచరిత్రునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1911

మత్తకోకిలము. వ్యాళభూషణభూషితాంగుని నార్తలోకశరణ్యునిన్
ఫాలలోచనదగ్ధకాముని భస్మదిగ్ధశరీరునిన్
శూలపాణి నశేషదుష్టనిషూదనవ్రతదీక్షితున్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1912

మత్తకోకిలము. నాళికాసనవిష్ణునిర్జరనాయకాద్యఖిలద్యుస
త్పాళిసేవితపాదపద్ముని దక్షయజ్ఞవిభంజనున్
క్షాళితప్రణతాఘపంకుని సర్వలోకమహేశునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1913

మత్తకోకిలము. నీలలోహితమూర్తి నుగ్రుని నిత్యునిన్ బ్రళయానలా
భీలరూపవినాశితాబ్జజపేశికోటిసహస్రు ను
ద్వేలశక్తి ననశ్వరోర్ధ్వగతిప్రదాత నమేయునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1914

మత్తకోకిలము. బాలిశావిదితప్రభావునిఁ బంచవక్త్రుని రౌప్యగో
త్రాలయస్థితిసౌఖ్యవేది ననాది నవ్యయునిన్ విప
జ్జాలతూలసమీరునిన్ గజచర్మధారి నలభ్యునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1915

మత్తకోకిలము. క్ష్వేళపాయిని మృత్యుజేతను సిద్ధిదాత నశేషరు
క్సాలదాహదవాగ్ని నాశ్రితకల్పశాఖి నజున్ దిశా
చేలునిన్ భగవంతునిన్ గుణసింధువున్ బరమాత్మునిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1916

మత్తకోకిలము. కాళికాహృదయాబ్జభానునిఁ గామితార్థదునిన్ మహా
కాలునిన్ భవరోగవైద్యునిఁ గర్మపాదపమూలని
ర్మూలనక్షమునిన్ గుణత్రయరూపునిన్ గరుణానిధిన్
గాలకాలునిఁ జొచ్చితిన్ ననుఁ గాలుఁ డేమి యొనర్చెడిన్. 1917

ఆ. కాళ్లు పట్టుకొంటిఁ గాలకంఠునిఁ గలా, మూర్తి నఖిలగురుని మోక్షకరునిఁ
త్రిభువనాధిపతిని దేవాదిదేవుని, మృత్యు వేమి చేయు నింక నన్ను. 1918

ఆ. కాళ్లు పట్టుకొంటిఁ గాలాగ్నిరుద్రుని, వృషభవాహనుని గిరీశు నజునిఁ
జండికాంతరంగసరసీరుహార్కుని, మృత్యు వేమి చేయు నింక నన్ను. 1919

ఆ. కాళ్లు పట్టుకొంటి గంగాధరుని మహా, నటుని శివుని దుష్టనాశకరుని
భక్తరక్షకునిఁ గపాలిని శూలిని, మృత్యు వేమి చేయు నింక నన్ను. 1920

ఆ. కాళ్లు పట్టుకొంటిఁ గైలాసనాథుని, సృష్టిరక్షణప్రణష్టికరుని
సర్వభూతపతిని సర్వేష్టదాతను, మృత్యు వేమి చేయు నింక నన్ను. 1921

ఆ. కాళ్లు పట్టుకొంటి ఖండేందుమౌళినిఁ, బంచబాణహరునిఁ బాపహరునిఁ
త్రిపురదైత్యహరుని దివ్యప్రభావుని, మృత్యు వేమి చేయు నింక నన్ను. 1922

సీ. అని నుతించుటయు మహాకాలుఁ డతనికి, నపరిమితంబుగా నాయు విచ్చె
నంత లేచి కృతాంతుఁ డష్టమూర్తిని స్వాప, చారవిముక్తికై సన్నుతించి
తదనుజ్ఞఁ గొని నిజధామంబునకు నేఁగె, నంత నీశ్వరుఁ డదృశ్యతను జెందె
నావల సంతోష మావహిల్ల మృకండు, పుత్రుండు స్వాశ్రమంబునకు వచ్చి

గీ. తల్లిదండ్రుల కెఱిఁగించెఁ దద్విశేష, మంతయును వార లది యెల్ల నాలకించి
యద్భుతానందభరితాత్ము లైరి యంతఁ, జెంది యమృతత్వము మృకండునందనుండు.

క. కనియె బహుప్రళయములను, గనియెను బహుసర్గములను గలిగెను మాఘం
బున మును మృగశృంగుఁ డాన, ర్చినస్నానంబునకు నిశ్శ్రేయము తుదకున్. 1924

క. చలుపుచు మాఘస్నానం, బుల మార్కండేయుఁడును ద్రిభువనంబులలో
పలుఁ దిరుగఁజొచ్చె నాయువు, కలకాలము ప్రాప్త మైనకతమునఁ దనకున్. 1925

ఆ. మృత్యుభయము లేదు మృత్యుంజయస్తోత్ర, మును బఠించుచున్న ననుదినంబుఁ
జదువలేనియెడలఁ జాలును విన్నను, బాఠకులకుఁ గలుగుఫలము నొంద. 1926

క. అని నుడువుటయు దిలీపుఁడు, మునిపుంగవ ముఖ్యతీర్థములు స్నానంబుల్
బొనరింప మాఘమాసం, బున నేవియొ చెపుము నాఁగ ముని యి ట్లనియెన్. 1927

—: మాఘస్నానార్హతీర్థకథనము :—

సీ. వినుము మహారాజ మును మహర్షులు బహి, ర్జలమును మాఘమాసంబునందు
గంగాసమానంబుగాఁ జెప్పి రెట నున్న, నది పవిత్రము స్నాన మాచరింప
నదె కాక మఱియు ముఖ్యము లై నతీర్థంబు, లొకకొన్ని కల వవియును వచింతు
నాదితీర్థంబు ప్రయాగంబు ధర్మార్థ, కామమోక్షంబులు గలుగు దాన

గీ. నాకతంబునఁ దీర్థరాజాహ్వయంబు, దాని కొడఁగూడెఁ బిమ్మట ద్వారకయును
సప్తగోదావరము నైమిషమును బదరి, కాశ్రమంబును భూరిపుణ్యావహముల.

వ. మఱియును గురుక్షేత్రంబును గంగాద్వారంబును నవంతికయును సరయువును యమునయును నమరావతియును సరస్వతీసింధుసంగమంబును గంగాసాగరసంగమంబును గాంచియును ద్ర్యంబకంబును గాలంజరంబును బ్రభాసంబును మహాలయంబును నోంకారక్షేత్రంబును బురుషోత్తమంబును గోకర్ణంబును భృగుకర్ణంబును భృగుతుంగంబును బుష్కరంబును దుంగభద్రయును గావేరియును గృష్ణయును వేణియును నర్మదయును సువర్ణముఖరియును వేగవతియును మాఘస్నానముఖ్యతీర్థంబులుగాఁ జెప్పంబడియె. గయాతీర్థంబు పితృతృప్తిదాయకంబు. పూర్వోక్తతీర్థంబు లన్నియును భౌమతీర్థంబులు. 1929

—: మానసతీర్థకథనము :—

క. తెలిపెద మానసతీర్థం, బుల నింకను వినుము మోక్షమును జేకూర్పం
గల వవి దానని ప్రాజ్ఞులు, సలుపుదు రవ్వానిలోన స్నానము నెపుడున్. 1930

వ. సత్యంబును క్షమయును నింద్రియనిగ్రహంబును భూతదయయును నార్జవంబును దానంబును దమమును సంతోషంబును బ్రహ్మచర్యంబును నియమంబును జపంబును నిజ్యయును శౌచంబును దపంబును వక్తృత్వంబును శ్రుతంబును జ్ఞానంబును ధృతియును నహింసయును ధ్యానంబును శివస్మరణంబును నాత్మశుద్ధియును మానసతీర్థంబులుగాఁ జెప్పంబడియె. 1931

గీ. తీర్థములలోన నుత్తమతీర్థ మాత్మ, శుద్ధితీర్థంబు దానిలోఁ జొచ్చి సంత
తమును స్నానంబు సేయునుత్తముల కొదవు, నపునరావృత్తికర మైనయమృతపదము.

సీ. మునిఁగినమాత్రంబుననె జలంబున శుద్ధి, గలుగదు స్నాతుఁడు గాఁడు వాఁడు
స్నాతుండు నా దమస్నాతుండె యఖిలతీ, ర్థస్నాతుఁడైనఁ బాతకి మలినుఁడె
తనుమలత్యాగమాత్రమునఁ గాఁ డమలుండు, కలుగ కుండఁగఁ జిత్తమలవిముక్తి
కలుగదు జలజంతువులకు మోక్షము జని, స్థిత్యంతములు నీటఁ జెందు చున్నఁ
గీ. చిత్తమల మనుపేరను జెప్పఁబడియె, విషయరాగంబు విషయనివృత్తి భావ
శుద్ధి యనుపేర నొప్పుఁ దచ్ఛుద్ధి యుండు, దేహి గలచోటులె సమస్తతీర్థములును.
గీ. జ్ఞానపావిత్ర్యమును ధ్యానజలము ద్వేష, రాగమలనాశకమును నై రహి వహించు
నట్టిమానసతీర్థమునందు మునుఁగు, భాగ్యవంతుఁడు ప్రాపించుఁ బరమపదము. 1934
గీ. దేహమున నెల్లఁ గొన్ని ప్రదేశములకుఁ, గలదొ పూతత్వ మట్టులె కలదు కొన్ని
ధామములకుఁ బవిత్రత భూమియందు, నవియె సుమి భౌమతీర్థంబు లవనినాథ. 1935
గీ. భౌమతీర్థంబులును జగత్పావనంబు, లయ్యె జలతేజమునను భూమ్యాగతప్ర
భావమునను దపోధనప్రవరసంప్ర, తిగ్రహమునను జగమునఁ ద్రివిధగతుల. 1936
ఆ. కాన నొప్పు భౌమమానసోభయతీర్థ, సేవ సేయు మోక్షసిద్ధికొఱకు
నెట్టిపుణ్యకర్మ మేనియు నిలలోనఁ, దీర్థసేవతోడ దీటు గాదు. 1937
ఆ. చేయ కున్నఁ దీర్థసేవ త్రిరాత్రంబు, లుపవసింప కున్న నొసఁగ కున్న
శక్తి యున్నకొలఁది స్వర్ణంబు గోవును, నవనిలో దరిద్రుఁడై జనించు. 1938
గీ. విద్యయుఁ దపంబుఁ గీర్తియు వెలయఁ దీర్థ, ఫలము నొందంగలరు హస్తపాదచిత్త
సంయమము సేయువారును సంప్రహర్ష, భరితమానసులును గర్వవిరహితులును.
సీ. కావించునెడఁ దీర్థసేవను శ్రద్ధతోఁ, దను గృతఘ్నుండైన జనుఁడు గూడఁ
బరిశుద్ధుఁ డగు నింకఁ బరిశుద్ధచరితుఁడు, చెందెడిభాగ్యంబుఁ జెప్పఁ దరమె
యరుగ నెంచిన నేఁగు నమరాలయమునకుఁ, దలఁచిన నరుగు గంధర్వపురికిఁ
గాంక్షించునెడలను గైలాసమున కేఁగు, మోక్షార్థి యగు నేని ముక్తి నొందు
గీ. నేది గోరిన నది గల్గు నిన్ని యేల, చెందఁడు విషాద మేలోకమందుఁ గూడ
వానికి సమాన మగువాఁడు వాఁడె కాని, తగఁ డెవండును బరుఁడు దత్సామ్యమునకు.
ఆ. శ్రద్ధ లేనివాఁడు సంశయగ్రస్తుఁడు, హేతునిష్ఠితుఁడును బాతకియును
నాస్తికుఁడును వీర లైదుగురును గూడఁ, బడయలేరు తీర్థఫలము నధిప. 1941

—: సువ్రతబ్రాహ్మణవృత్తాంతకథనము :—

సీ. కలఁ డగ్రహార మొక్కటి నర్మదాతీర, మందు మన్నకలంక మనెడిపేరఁ
గల రందు బహుపండితులు వారిలో సువ్ర, తుం డనునొకబ్రాహ్మణుండు గలఁడు
వేదవేదాంగాదివిద్య లెల్లను నేర్చి, యతఁడు లోభాక్రాంతుఁ డగుటఁ జేసి
గోవిక్రయము గన్యకావిక్రయము భృతి, కాధ్యాపనము మొద లైనపనులు

గీ. చేసి యార్జించి ధనమును జల్లిగవ్వ, యేని దక్షిణ గురువున కిక కూడఁ
బెట్టి యొకలక్ష నిష్కముల్ తుట్టతుదకు, వార్ధకం బేర్పడ గడింప వశము గామి.
గీ. చింత నొందుచు నుండంగ స్వాంతమందు, నెంత చెడినను బాండిత్యవంతుఁ డగుట
నొక్కదివసంబున వివేక ముదయ మొంద, మనములో నిట్లు తలపోసికొనఁ దొడంగె.

—: సువ్రతుని విచారము :—

సీ. ధన మెంత గడియించినను నిప్పటికిఁ గూడ, శాంతి యేర్పడదాయె స్వాంతమునకు
నతిదుస్సహం బయ్యె నాశాప్రవేగంబు, చాల కున్నది మేరుశైల మేని
స్వస్వశక్తులు పోయి సర్వేంద్రియంబులు, ప్రిదులు చున్నను దృష్ణ పెరుఁగు చుండెఁ
దను వెంతజీర్ణత్వమును వహించెనొ యాశ, యంతతారుణ్యంబు నధిగమించె
ఆ. నాశలోఁ బడి వినాశంబు నొందె నా, విద్య లెల్ల జడుఁడె విబుధుఁ డేని
బుద్ధిమంతుఁ డేని బుద్ధివిహీనుండ, యాశచేత బద్ధుఁ డయ్యె నేని. 1944
ఆ. ఆశ వహ్నితుల్య మైనది గావునఁ, జేర్పఁ దగదు దానిఁ జేరువకును
బ్రతుకఁ దలఁచువాఁడు శ్రుతమానబలయశో, జ్ఞానధీరతాభిజాత్యములను. 1945
ఆ. స్వల్పదాత యైనఁ జండాలుఁ డేనియు, నాశ గలుగువాని కధికుఁడుగను
గానుపించు నింతకంటె నాశాగ్రస్తుఁ, డైనవాని కపచయంబు గలదె. 1946
గీ. అవని నాశాభిహతులు మోహాసవప్ర, మత్తులై యుండుటను లవమాత్ర మేని
పరిగణింపక పరకృతపరిభవోక్తి, బాధను జరించు చుందురు ప్రజలలోన. 1947
గీ. ఇట్టి క్లేశంబు లెన్నెన్నొ యేను బొంది, యార్జనము చేసినధనంబు సార్థకముగ
ధర్మకార్యంబు లొనరింపఁ దరుణ మిదియె,యని తలఁచి సత్క్రియోన్ముఖుఁ డయ్యె నంత.
ఆ. ఆదినంబునంద యర్ధరాత్రంబునఁ, జొచ్చి తద్గృహంబు చోరు లతని
ధనము నెల్ల దోఁచికొని పోయి రొకగవ్వ, యేని మిగుల కుండ నింటిలోన. 1949
వ. అంతట సువ్రతుండు దుఃఖాక్రాంతచిత్తుం డై యిట్లు విలపింపం దొడంగె. 1950
సీ. చన దొక్కగోవు నైనను గ్రహింపఁగ నని, కొనక తప్పనియెడఁ గొనిన. గాని
రెండవదాని నెన్నండును గొనరాదు, కూడ దమ్మంగఁ గైకొనినదాని
నట్లు చేసినయెడ నాపాతకము సప్త, పురుషాంతరములను బూదిచేయు
ననుశాస్త్రము నెఱింగియును లోభమునఁ గొని, యెన్నొ గోవుల విక్రయించినాఁడ
గీ. ధనము నార్జించుపనిలోనఁ దవిలి యొక్క, వాసరం బేనియును సంధ్య వార్వ నైతి
విడిచినను బ్రాహ్మణోచితవిధుల నెల్లఁ, జివర కాచమనం బైనఁ జేయ నైతి. 1951
సీ. ఒకపుష్పమునొ లేక యొకపత్త్రమునొ మాత్ర, సహితంబుగనొ మంత్రరహితముగనొ
శివలింగమందు నుంచిన నుద్ధృతం బగుఁ, గులకోటి యదియును జలుప నైతి
స్మరణమాత్రముననె సకలపాపములను, దహియించుహరి నైనఁ దలఁప నైతిఁ
బ్రణతిమాత్రమున సర్వవ్యాధు లడఁచుసూ, ర్యున కైనఁ జే యెత్తి మ్రొక్క నైతి

గీ. ఘాసపూజకు మెచ్చి విఘ్నముల నెల్లఁ, జెండుగణపతి నైనఁ బూజింప నైతిఁ
జలుపునెడ సేవ యించుక సర్వకామ, సిద్ధి లిడుశక్తి నైన భజింప నైతి. 1952

గీ. చలుప నైతిని బంచయజ్ఞములు చేయ, నైతిఁ బంచాయతనదేవతార్చనంబు
బ్రహ్మచారికి హంతకారము నొసంగ, నైతి భిక్షుకునకు నీయ నైతి భిక్ష. 1953

వ. బ్రహ్మచారియును భిక్షుకుండును బక్వాన్నస్వామి లగుటం జేసి వారలకు భోజనంబు నొసంగక భుజించువారలు చాంద్రాయణంబునం గాని శుద్ధిం జెందంజాలరు. 1954

క. ఘృతసిక్తము లగుతిలలను, హుతాశనునియందు మంత్రయుక్తము గాఁగన్
హుత మొనరించినఁ జను నా, రితపాపము లెల్ల నదియుఁ జేయకపోతిన్. 1955

సీ. చలుపకపోతిని స్వర్గదాయకుఁ డైన, యతిథికి సంతృప్తి నన్న మొసఁగి
శ్రోత్రియుం డైన విప్రునకు నీయకపోతి, వస్త్రవృద్ధి గ నొక్కవసన మేని
పాదుకొల్పకపోతిఁ బాదపం బొకఁ డేని, యమలోకమార్గతాపము శమింప
స్థాపింప నైతిని గూప మొక్కం డేని, పరలోకమార్గపిపాస యుడుగ
గీ. నొక్కగోవును సైతము నుద్ధరింప, నైతిఁ గర్దమమగ్న మైనట్టిదాని
నరకమునుండి యుద్ధరణంబు గలుగఁ, దనుధనబలంబు లుండినతరుణమందు. 1956

వ. శయ్యాగజాశ్వమహిషీదాసీశ్వేతకృష్ణాజినతిలకరంభతోయకుంభాసనపాదుకాపాదాభ్యంగదీపప్రపావ్యజనచ్ఛత్రతాంబూలనిత్యశ్రాద్ధభూతబల్యతిథిభోజనంబు లనువింశతి దానంబులు యమలోకయాతనానివారకంబులుగాఁ జెప్పంబడినను వానిలో నొక్కటి యును నాచే నిర్వర్తింపఁబడ దయ్యె. 1957

ఆ. చలుప నైతిఁ గృచ్ఛ్రచాంద్రాయణాదులఁ, గాయమునకు శుద్ధి గలుగునట్లు
ధేనువునకు గ్రాస మేనాఁడు గూడను, నొసఁగ నైతిఁ బాప ముడిగిపోవ. 1958

క. సాలగ్రామశిలాంబువుఁ గ్రోలినఁ దలపైని జల్లుకొనినను వహ్ని
జ్వాలలు గాష్ఠములంబలెఁ, గాలుచు నంతర్బహిష్ఠకాలుష్యములన్. 1959

క. అని యెఱిఁగియు నాపనులును, నొనరింపకపోతిఁ దుదకు నొద్దకు రా గో
వును నైన గోఁక నైతిని, ననువుగ గోలోకవాస మామతిలంగన్. 1960

గీ. ఒక్కకాసేనియును నర్థి కొసఁగ నైతిఁ, గలిమి జన్మాంతరంబునఁ గలుగ క్షుధితుఁ
డైనవానికి నొకపట్టెఁ డన్న మేని, పెట్ట నైతిని గలుగంగఁ బుట్ట గతులు. 1961

ఆ. ఉపవసింప నైతి నొకశివరాత్రియు, నైక్య మొంద శివునియందు విష్ణు
తృప్తిదముగ నొక్కయేకాదశియు నుండ, నైతి ననశనముగ నక్కటకట. 1962

గీ. కష్టపడి నేను జీవితకాల మెల్లఁ, జేయరానియకృత్యముల్ చేసి గడన
సలిపినట్టిధనం బెల్ల క్షణములోనఁ, బోయె నిలువునఁ బ్రాణముల్ పోయినట్లు. 1963

సీ. ఆత్మానుసంధాన మాచరింపకపోతి, గర్భవాసక్లేశగతి తొలంగ
దానపాత్రులకును దాన మీయకపోతిఁ, గలుగ కుండఁగ నూర్ధ్వగతికి హాని
యనుభవింపకపోతి నాత్మకు సుఖము గా, భోగి యీతం డని పొగడ జనులు

సాధింప నైతి మోక్షము నేని లేక ధ, ర్మము నేని కడకుఁ గామంబు నేని
గీ. యేమి యొనరించిన ట్లాయె నిలను బుట్టి, పెరిఁగి బహువిద్యలను నేర్చి ప్రేతవోలెఁ
దిరిగి రేఁబవలును సైఁచి పరిభవముల, నార్జనము సేసినందుల కమితధనము. 1964
ఆ. నన్ను నేనె వంచనము చేసికొని జీవి, తంబు నెల్ల వితగఁ దగులఁబెట్టు
కొంటి నుద్ధరించుకొనఁగ నీదశలోన, నేర్పడినను బుద్ధి యేమి ఫలము. 1965
ఆ. కాటిలోన విడిచి కాయంబుఁ బరలోక, వర్త్మమునను బోవువాని వెంట
రాదు విద్య ధనము రాదు భూములు రావు, రారు దారసుతులు రారు హితులు.
ఆ. దారిబత్తె మొక్క-ధర్మంబె యది నాకుఁ, గాదు సులభ మిట్టికాలమందు
వశము గాకయుండె వార్ధకంబున మేను, దాన మాచరింప ధనము లేదు. 1967
గీ. ఏమి చేయుదు నే నిట్టిహీనదశను, నాఁడునాఁటికి వచ్చు చున్నది సమీప
మునకు వైవస్వతపురంబు కనికరింపఁ, డంతకుఁడు ఘోరపాతకి నైన నన్ను. 1968
ఆ. దండధరునిపేరు దలఁచికొన్నంతనె, చేష్ట తప్పి చుండెఁ జిత్తమునకు
మేనఁ బ్రాణ మున్న నేను మృతుండనె, యనుచు నేడ్చుచుండ నాత్మలోన. 1969
సీ. మును దాను గాశ్మీరమునకు భూరిధనార్జ, నమునకై పోయినసమయమందు
గంగాతటమున మాఘస్నాతు లెల్లరుఁ, గూర్చుండఁ బౌరాణికుం డొకండు
చదివినమాఘమాసస్నానఫలబోధ, కార్థపద్యము స్మృతి కపుడు రాఁగ
ధైర్యంబు వహియించి తత్క్షణంబున నర్మ, దామహానది కేఁగి దానిలోన
గీ. స్నాన మొనరించి దశదివసములు దశమ, దినమునను శైత్యబాధకు దేహ మెల్ల
గజగజ వడంకు చుండంగఁ గదల లేక, హరి హరి య టంచుఁ దత్తీరమంద మ్రందె.
సీ. అంతటఁ బాపాత్ముఁ డైనసువ్రతుఁడు మా, ఘస్నానమాహాత్మ్యకారణమున
దివ్యరూపంబు ప్రాప్తింపంగ దేవయా, నము నెక్కి స్వర్గలోకమున కరిగి
యచట భోగము లెల్ల ననుభవించుచు స్వేచ్ఛ, నొక్క-మన్వంతరం బుండి పిదప
భూసురుం డై పుట్టి భువిని మాఘస్నాన, మును బ్రయాగక్షేత్రమున నొనర్చి
గీ. బ్రహ్మలోకంబు నొంది తత్ఫలము గాఁగఁ, గడపి సుఖముగ నొకకల్పకాల మచట
నవల జన్మించి విప్రుఁ డై యవనిలోనఁ, గాశిలో మరణించి మోక్షమును బడసె.
సీ. అధ్వరంబులలోన నశ్వమేధమువోలె, నద్రులలోఁ దుషారాద్రివోలెఁ
బ్రణవంబువోలె మంత్రములలోపలను దా, నములలో నభయదానంబువోలెఁ
జానలలోపల సర్వమంగళవోలె, విద్యలలో నాత్మవిద్యవోలె
శంభుభక్తులలోన సరసిజాక్షుఁడువోలె, వ్రతములలో ఋతవ్రతమువోలెఁ
గీ. దపములందుఁ బ్రాణాయామతపముకరణి, ధర్మములలో నహింసచందమున నాహి
తాగ్నికై వడిఁ బాత్రులయందు సర్వ, మాసములలోన శ్రేష్ఠంబు మాఘ మధిప.
క. గరుడాగమనంబున విష, ధరములు నిర్విషము లగువిధంబునను దివా
కరుఁడు మకరమును జొచ్చిన, తరుణముననఁ గళావివర్జితము లగు నఘముల్. 1973

క. ధనవర్జితుండు పాతకి, యును వ్యసనియు నైననరున కుర్వీస్థలిలోఁ
గనరాదు గతి మఱొక్కటి, మనుపఁగ నరకంబునుండి మాఘముకంటెన్. 1974

క. అనయం బగు నైశ్వర్యం, బును బుష్పవిహీనభూజమును శశధరశూ
న్యనిశయు మాఘస్నానం, బును జేయనిప్రాణివర్గమును దుల్యంబుల్. 1975

గీ. ఘోర మెంతప్రమాదంబొ యారయ మెంత, గాఢమోహంబొ నరులకుఁ గాంచ కుండ
మాఘమాసాప్లవఫలంబు మోఘముగను, బరవిధులలోనఁ జెందు చుందురు శ్రమంబు.

ఆ. మాఘమజ్జనంబె మాంగల్య మర్థసం, పాదనంబు మాఘమజ్జనంబె
మాఘమజ్జనంబె మనుగడ సర్వంబు, మాఘమజ్జనంబె మానవులకు. 1977

ఆ. ధరను లేవు వేఱె ధర్మార్థకామమో, క్షములు మాఘమందుఁ జలుపునట్టి
మజ్జనంబుకంటె మానవకోటికిఁ, దెలిసినాఁడ నిజముఁ దేటపడఁగ. 1978

క. అదియె యభాగ్య ముపద్రవ, మదియె సమస్తాశుభంబు లదియె నరులకున్
ముదమునను మాఘమం దిం, పొదవఁగ నొకస్నాన మేని యొనరుపకున్నన్. 1979

ఆ. మంచిభార్య నిచ్చు మంచిబిడ్డల నిచ్చు, మంచిభర్త నిచ్చు మహిమ నిచ్చు
స్వర్గ మిచ్చు మోక్షసామ్రాజ్యపద మిచ్చు, మాఘమాసమకరమజ్జనంబు. 1980

గీ. సలుపఁడో యెవండు సామర్థ్యశాలి యయ్యు, మాఘమాసంబునందు నిమజ్జనంబు
వాఁడె దృష్టివిహీనుఁడు వాఁడె పాద, వర్జితుఁడు వాఁడె ప్రాణవివర్జితుండు. 1981

ఆ. సర్వదేశములును సర్వకాలములును, సుకృతదాయకముల సకలజనులు
దానమునకుఁ బాత్రు లైనవారల రవి, మకరమున వసించుమాసమందు. 1982

వ. మాఘమాసంబున నిర్ఝరిణీసలిలస్నానం బుత్తమంబు. వాపీకూపతటాకస్నానంబు
మధ్యమంబు. 1983

గీ. శ్రేయమును గోరువాఁ డొనరింపఁ దగదు, స్నానమును గేహమున నుష్ణసలిలమునను
గష్టపడినకొలందిని గలిగినట్లు, సంభవింపదు పుణ్యంబు సౌఖ్యమునను. 1984

క. శీతార్తుఁ డయ్యు మాఘ, స్నాతుఁడు సేవింపఁ దగదు జ్వలనము నెపుడున్
శీతవ్యథ యుడుగంగను, స్నాతుఁడు చెందండు దాన స్నానఫలంబున్. 1985

వ. రాత్రియందు వాయుతాడితంబుగా నుంపఁబడిననవకుంభజలంబు గంగాతోయతుల్యం బుగాఁ జెప్పంబడుటంజేసి వద్యాద్యభానంబునఁ దజ్జలస్నానంబు గావించుట ప్రశస్తంబు. దేవతలు ప్రతిమాఘమాసంబునను నీటఁ దేజంబు నుంచుచుండుటంజేసి బుధులు మాఘస్నానంబు నగ్నిప్రవేశంబుకంటె నధికంబుగా నుడివిరి. 1986

క. ఏనియమంబులచేతను, బోనియఘంబులును మాఘమున నశియించున్
స్నానమునఁజేసి మాఘ, స్నానం బాహేతువుననె శ్లాఘ్యం బయ్యెన్. 1987

క. అనుదినము వలయు నీయం, గను శర్కరతోడఁ దిలలు ఊష్మదేవునకున్
గన వృద్ధి నిజకులంబులు, మనములలోఁ గోర్కి యున్న మాఘస్నాతుల్. 1988

వ. మాఘావసానంబున వ్రతపరిపూర్తికై యథాశక్తి బ్రాహ్మణసమారాధనంబు గావిం
పందగు. అభ్యంగవర్జనంబుగా మాఘస్నానంబు గావించినవారు బ్రాహ్మణదంపతు
లకు మార్తండప్రీతికరంబుగా వస్త్రంబులును సప్తధాన్యంబులును శర్కరైకభాగ
తిలభాగత్రయైలానారికేళజీరకమరిచంబులం జేర్చి కావింపంబడినత్రింశన్మోదకంబులును
సమర్పించి రేని సూర్యబింబంబును భేదించుకొని తన్మధ్యంబునుండి చని విష్ణుపదంబుం
బ్రాపింపంగలరు. 1989

—: భీమసేనవృత్తాంతకథనము :—

సీ. తమపురోహితుఁ డైనధౌమ్యునికడ కేఁగి, మున్నొకనాఁడు భీముండు మ్రొక్కి-
స్వామి నే నొనరింపఁజాలక యుపవాస, మారగించుచు నుండ హరిదినముల
ననుఁ జూచి నింద యొనర్చు చుండెద రుప, వాసంబు లొనరించువార లెల్ల
నది నాకు నవిషహ్య మయ్యెడి నే నేమి, చేయంగవలయునో చెప్పు మింక
గీ. ననుడు ధౌమ్యుఁడు వాని కిట్లనియె భీమ, సలుపు మొకమాఘశుక్లపక్షమున వచ్చు
హరిదినంబున నుపవాస మది యొసంగు, సర్వహరివాసరోపవాసములఫలము. 1990
క. దానను జననిందయు నీ, మానసదుఃఖమును దొలఁగ మహితాత్ముఁడ వై
యానందించెద విహపర, నానాభోగములఁ బొగడ నరులును సురలున్. 1991
సీ. రాష్ట్రంబువోలెఁ గుప్రభువుచే ధనసంచ, యంబుచేతను ననర్థంబువోలె
దానంబువోలెఁ గీర్తనమున ద్రవిణంబు, వోలె నవర్ధనంబునను జేసి
శ్రాద్ధంబువోలె నాగ్రహమున శిషు లే, కుండుటచేత బాలుండువోలె
ననలసంయోగంబునను నంచువోలె న, బ్రంబుఁ బెంచుటను దపంబువోలె
గీ. ధేనువులువోలె దూరప్రదేశగతిని, విగళితామ్నాయతను జేసి విద్యవోలెఁ
బాపతతు లెల్ల హరివాసరోపవాస, మునను నాశంబు నొందు సమూలముగను.
గీ.గయయు వారాణసియుఁ బ్రయాగమును గంగ,యును సరస్వతియును రేవయును ద్రిపుష్క
రములు మున్నగుపుణ్యతీర్థములు సాటి, గావు హరిదినషోడశకళకు నేని. 1993
గీ. ధరణిదానంబు నొకప్రక్క హరిదినంబు, నొక్కప్రక్కను దులలోన నునిచి తూఁప
సమము గాదాయె హరిదివసంబుతోడ, ధరణిదానం బని వచించె ధాత మున్ను.
వ. దశమియం దేకభక్తంబు గావించి బ్రహ్మచర్యంబు వహించి యేకాదశియం దుషః
కాలంబున స్నానంబు సేసి యగ్నిహోత్రంబు నుపాసించి బ్రహ్మయజ్ఞంబు గావించి
యుపవాసంబునకు సంకల్పించి. 1995
గీ. పుండరీకాక్ష యనశనంబుగను నియమ, సహితముగ నుండి యీదివసమున రేపు
సలిపెదను భుక్తి విఘ్నంబు గలుగకుండ, మద్వ్రతమున కనుగ్రహింపంగవలయు.
వ. అని ప్రార్థించి గోమయోపలిప్తం బగుశుచిప్రదేశంబున ధాన్యపీఠంబునందు నానావిధ
రత్నపూరితంబును శ్వేతవస్త్రాలంకృతంబును నగుపూర్ణకుంభంబును స్థాపించి దాని
మీఁదఁ జతురస్రవస్త్రంబు నుంచి తద్వస్త్రపీఠంబున స్వర్ణమయం బగువరాహరూప

మహావిష్ణుప్రతికృతిని బ్రతిష్ఠాపించి యర్చించి వరాహునిపాదంబులును గ్రోడుని కటియును హిరణ్యగర్భునినాభియును శ్రీవత్సధారికుక్షియును సహస్రశిరస్కుని బాహువులును సర్వేశ్వరునిగ్రీవయును సర్వాత్మునిముఖంబును సుప్రభునిలలాటంబును జక్రధరునికేశంబులును బూజించి విష్ణుమాహాత్మ్యప్రతిపాదకం బగుపురాణంబు వినుచు నారాత్రి జాగరంబు గావించి మఱునాఁడు ప్రభాతకృత్యంబులు నిర్వర్తించికొని పునః పూజ గావించి మనోరథసిద్ధి యగునట్లు ప్రార్థించి కుంభంబును విష్ణుబింబంబును వస్త్రంబులును ధాన్యపాత్రంబులును బూజితద్రవ్య మంతయును దక్షిణాసహితంబుగా నాచార్యునకు సమర్పించి బంధుయుక్తుం డై ద్వాదశీపారణంబు గావింపవలయు.

గీ. చేయు మీవిధి నేకాదశీవ్రతంబు, మాఘమాసంబునను నీకు మరల గర్భ
వాసదుఃఖంబు గలుగదు వాస్తవముగ, నరుడు భీముఁడు సంతోష మావహిల్ల.

వ. మాఘశుక్లైకాదశీదినంబున సకలఫలసమృద్ధం బగుహస్తినపురోద్యానంబున కరిగి యచ్చట సహస్రనారికేళంబులును నయుతకదళీఫలంబులును శతపనసఫలంబులును ద్రిశతపుండ్రేక్షువులును నారగించి బహుప్రయత్నంబున నుపవాసంబు గావించి యథోక్తంబుగా వ్రతంబు నాచరించె. దానంజేసి యది మొదలు మాఘశుక్లైకాదశి భీమైకాదశి యనుపేరం బరగె. 1999

గీ. లోకములలోన నుత్తమలోక మనెడి, గౌరవము బ్రహ్మలోకంబు గాంచినట్లు
మాసములలోన నుత్తమమాస మనెడి, వాసి గైకొనియెను మాఘమాస మధిప.

గీ. కలదు శివరాత్రి యనఁగ మాఘంబునందుఁ, బుణ్యతిథి యొండు దానిని బోలఁ జాల
వెట్టితిథులును మున్నది యిచ్చె విస్మ, యముగఁ గైలాసపదమును వ్యాధునకును.

క. అనుడు దిలీపుఁడు విస్మయ, మును జెంది మనంబులోన మునివర నాకుఁ
వినిపింపుము విశదముగను, వినఁగను శివరాత్రిమహిమ వేడ్క జనించెన్. 2002

వ. అని వేఁడుటయు వసిష్ఠుం డామహీవల్లభున కిట్లనియె. 2003

—: శివరాత్రిమాహాత్మ్యము :—

సీ. వినుము మహారాజ విశదంబుగను నీకు, శివరాత్రిమహిమంబుఁ జెప్పువాఁడఁ
గైలాసశైలశృంగమున నాసీనుఁ డై, యున్నశంభునిఁ జూచి యొక్కనాఁడు
మున్ను పార్వతి నేఁడు నన్ను నీ వడిగిన, ట్లడుగంగ నామె కిట్లనియె శివుఁడు
వనజాక్షి శివరాత్రి యనఁబడు మాఘకృ, ష్ణచతుర్దశీరాత్రి శైవి యగుట

గీ. దానికోట్యంశమునకును దానయజ్ఞ, తీర్థహోమవ్రతాదులు దీటుగావు
దాన నుపవాస మొనరించుమానవులకు, శమనఘోరస్వరూపదర్శనము లేదు. 2004

వ. శివరాత్రిదినంబునందు బ్రభాతకాలంబునఁ బ్రబుద్ధుం డై కాల్యకృత్యంబులు నిర్వర్తించికొని శివరాత్రివ్రతాచరణంబునకు బ్రాహ్మణానుజ్ఞం బడసి సంకల్పం బొనర్చి యాదినం బెల్ల నుపవసించి రాత్రి శివలింగంబును బంచామృతంబులచే నభిషేకించి వస్త్రభూషణాదులచే నలంకరించి జాతీచంపకపున్నాగనీలోత్పలాదిపుష్పంబులచేఁ బూ

జిలిచి ధూపదీపనైవేద్యతాంబూలాదు లర్పించి తూర్యఘోషవీణావేణుగానవేదఘోష
స్తోత్రపాఠపురాణపఠననృత్యగీతాదులచే జాగరంబు గావించి మఱునాఁడు ప్రభాతం
బున యథాశక్తి మత్ప్రీతికరంబుగా సకలదానంబులునుం జేసి గురుపూజ గావించి
శివలింగంబున కెదుటఁ గృతాంజలిబంధుండై నిలువంబడి. 2005

క. శితికంధర శివరాత్రి, వ్రతమును జేసితిని నేను ద్వత్ప్రీతికై
హిత మేదియొ యదియె దయా, మతి నొసరింపుము విమూఢమతి నగునాకున్.

వ. అని ప్రార్థించి బ్రాహ్మణసంతర్పణంబును బీదలకన్నవస్త్రదానంబును గావింపందగు. ఏతద్వ్రతంబునందు స్త్రీపురుషవిభేదంబును వర్ణవిభేదంబును లేకుండ సర్వజనంబులకును నధికారంబు గలదు. ప్రాజాపత్యచాంద్రాయణమాసోపవాసాదిపుణ్యంబులకంటెఁ గోటి గుణాధికం బగుపుణ్యంబును జన్మకోటిసహస్రసంపాదితపుణ్యసంతానత్రిగుణఫలంబును శివరాత్రివ్రతంబునం జేకూరు. శివరాత్రిజాగరంబున దేవబ్రహ్మస్వహారులును బంచ మహాపాతకులును బరదారహరులును గృతఘ్నులును నతిథికన్నంబు పెట్టనివారును వృషలీరక్తులును శివరాత్రిప్రభావంబు నితరులకు బోధింపనివారును విననివారును శివలింగంబు నర్చింపనివారును వేదంబులను వైదికాచారంబును శివభక్తులను దూషించు వారును లలాటంబున భస్మంబు ధరింపనివారును శివక్షేత్రంబుల కేఁగనివారును బర్వ మైథునకర్తలును బ్రహ్మాదిదేవతలతోడ నన్నును దివ్యశక్తులతోడ నిన్నును బోల్చు వారును సర్వపాపవిముక్తిం జెందంగలరు. 2007

గీ. దేవి యేజన్మమందైనఁ ద్రికరణముల, చేతఁ గావింపఁబడినట్టిపాతకంబు
లన్నియు నశించు శివరాత్రియందుఁ జలుపు, నెపల జాగరము బహూక్తు లేల యింక.

వ. అబుద్ధిపూర్వంబుగా శివరాత్రివ్రతంబు గావింపంబడినను బూర్ణఫలంబు చేకూరు.

క. దీనికి నిదర్శనంబుగ, నే నొక్కపురాణగాథ నీ కెఱిఁగింతున్
మానిని వినువెడ నాకథ, నానాపాతకవితాననాశం బౌదవున్. 2010

సీ. కలఁడు నిషాదుఁ డొక్కఁడు మున్ను ధరలోనఁ, జేయుచు నాతండు జీవహింస
వనములలో నిత్యమును సంచరించుచు, స్వకుటుంబరక్షను జలిపికొనుచు
నొకదివసమున దైవికముగా నొకయర, ణ్యంబున కేఁగి జాలంబు నొడ్డి
యొకపొదలోఁ బొంచియుండి చూచుచు నుండఁ, బడదాయె నం దొక్కపక్షి యేని

గీ. యంతటను రవి గ్రుంకుడు నతఁడు పట్టు, విడువకుండఁగ నారాత్రివేళ నొక్క
హ్రదముదరిఁ జేరి జాలంబు నచట నొడ్డెఁ, దోయమున కేఁగుదెంచుజంతువులఁ బట్ట.

ఆ. అట్లు జాల మొడ్డి వ్యాధుఁడు తత్సమీ, పమున నున్నబిల్వపాదపమును
జేరి దానిచుట్టు సెలగి శాఖల వీలు, చేసికొని వసించి చెట్టుక్రింద. 2012

క. కనుఱెప్ప వైవకుండఁగఁ, గను చుండఁగ జాలమున మృగం బెయ్యది యై
నను బడునో యేమొ యని మది, నమకొనుచును జెల్లవాఱె నంతటిలోనన్. 2013

వ. అంతటఁ బుళిందుఁడు నిరాశుండై రిక్తహస్తంబులతోడ గృహంబున కేతేరఁ దజ్జనకుండు వానిం జూచి. 2014

క. నాయన నిన్నటినుండియు, నేయెడలను నీకు భుక్తి యించుకయును లే
దాయెనె నకనకలాడెడి, నీయుదరముఁ జూడఁ గలిగె నెవ్వగ నాకున్. 2015

క. అనవుఁడు నావ్యాధుం డి, ట్లనియెను బడదాయె జాలమం దొకమృగమై
నను బక్షియైన నిన్నటి, దిన మెల్లను లేదు కనుకఁ దిండియు నాకున్. 2016

ఆ. తెలియరానిబాధ కలుగుచున్నది యేమొ, బెడిదముగను నాకుఁ గడుపులోన
నిలువఁజాల నింక నే నని పలుకుచు, వ్రాలి భువిని విడిచెఁ బ్రాణములను. 2017

సీ. అంతట యమదూత లరుదెంచి శీఘ్రంబు, గను పాశములతోడఁ గట్టి వానిఁ
గొనిపోవుచుండఁగఁ జని మదాజ్ఞాకరు, లెదురుగా వారినిఁ జెదరఁ గొట్టి
యాకిరాతుని దివ్యయానంబుపై నుంచి, కొని నాదుసాన్నిధ్యమునకు వచ్చి
జరిగిన విషయంబు సర్వంబుఁ దెలుపంగ, నాకిరాతకుని నే నాదరించి

గీ. తన్మనోగత మైనసాధ్వసము నెల్ల
దీర్చి నాగణములలోనఁ జేర్చికొంటి
నది యటుండఁగ యమభృత్యు లరిగి యముని
కడకుఁ దెలిపిరి జరిగినగాథ యెల్ల. 2018

సీ. అపు డంతకుండు క్రోధారుణనేత్రుండై, చిత్రగుప్తునిఁ బిల్చి శీఘ్రముగను
నాపుళిందునిగాథ యడిగివాఁ డలికలు, షుం డని చిత్రగుప్తుండు చెప్పఁ
దత్క్షణంబున లేచి దండముద్రను గొని, చనుదెంచి కైలాసమునకు నాకుఁ
బ్రణమిల్లి మత్పదాబ్జములపై దండము, ద్రను సమర్పింప నే దానిఁ జూచి

గీ. దండధర కారణం బేమొ దండముద్ర, నివ్విధంబున విడనాడ నెఱుఁగఁజెపుమ
నావుడు యముండు సర్వజ్ఞ నీ వెఱుంగ, నట్టివిషయంబు గలదె న న్నడుగ నేల.

సీ. దురితాత్ముఁ డైన వ్యాధునిఁ దోడుకొని రాఁగ, మత్సేవకులను బంపంగ నేను
నీభృత్యు లరుదెంచి నాభృత్యులను గొట్టి, కొనివచ్చి నీయొద్ద నునుప వాని
నఖిలధర్మజ్ఞుఁడ వైన నీవును వాని, కేశిక్షయును విధియింపవైతి
తలవంపు గలదె యింతటికంటె నా కింక, నీదండముద్రను నీవె కొనుము

గీ. తపము గావించుకొందుఁ గాంతారమునకు, నేఁగి సుఖముగ నా కేల యీశ్రమంబు
నాఁగ నే నవ్వి యంతక నయవిదుండ, వైన నీ విట్లు పలుకంగ న్యాయ మగునె.

సీ. సృష్టించినాఁడను శివరాత్రి మును మహా, పాపుల నుద్ధరింపంగ నేను
దానిప్రభావ మెంతటివారి కేనియు, గ్రహియించుటకును శక్యంబు గాదు
నా కాదినంబు ప్రాణముకంటెఁ బ్రియ మైన, యది గాన శివరాత్రి యనఁగఁ బరగెఁ
జేసిన నాఁ డుపవాసజాగరముల, నేవిధంబున నైన నెవ్వఁ డేని

గీ. వాఁడు నాధామమున నుండువాఁడ కాని, కాఁడు యమలోకమున కేఁగువాఁడు వింటె
యనుచు శివరాత్రి యట్టిద యనియె యముఁడు, దాని పై నిట్టు లంటి నంతకున కేను.

వ. ఈపుళిందుండు శివరాత్రినాఁడు వనంబున కరిగి జంతువు లేవియును దొరకమిని నాది
నం బెల్ల నిరాహారుం డై యుండ నయ్యది యుపవాసంబుగను జంతువులకొఱకు
నక్తందివంబును మేల్కాంచియుండుటంజేసి యయ్యది జాగరంబుగను మాలూరవృక్ష
శాఖలను సెలగి పాఱవైవఁ దత్పత్రంబులు తత్రత్యప్రాచీనశివలింగంబునం బడుట
వలన నయ్యది శివపూజగను నగుటంజేసి శివరాత్రివ్రతఫలంబు వీనికిఁ బ్రాప్తించె.

గీ. ఆకతంబున నీభిల్లుఁ డయ్యె నాకు, భక్తుఁ డద్దానఁ గైలాసపదము నొందె
ననుచు యముఁడు మదుక్తుల నాలకించి, శాంతి యొదవంగ మది నేఁగె స్వపదమునకు.

క. శివరాత్రిమహాత్త్వంబును, జెవులకు నింపుగను వినినఁ జెప్పినను బున
ర్భవరహితు లగుచు వారలు, నివసింతురు మామకీననిలయమునందున్. 2024

క. అని చెప్పుటయును బార్వతి, విని శివరాత్రిమహిమంబు విస్మయ మొదవం
గను జెప్పఁ దొడఁగె స్వసఖు, జనమునకును విబుధు లెల్ల శ్లాఘింపంగన్. 2025

సీ. వినుము దిలీప యింకను మాఘమాహాత్మ్య, మును వచించెద ముఖ్యముగను నీకు
మును సహ్యభూధరంబునను దత్తాత్రేయుఁ, డాచరించుచుఁ దపం బధివసింపఁ
గార్తవీర్యుఁడు తత్సకాశంబునకు నేఁగి, ప్రణమిల్లి తత్పాదపద్మములకు
మాఘమాసస్నానమాహాత్మ్యమును దెల్పు, మని వేఁడుటయు నిట్టు లనియె నతఁడు

గీ. రాజపుంగవ తావకప్రశ్నమునకు, హర్ష మయ్యెను నీవు న న్నడిగినట్లు
యడుగఁగను మున్ను నారదుం డబ్జభవుని, నబ్జభవుఁ డిట్టు లనియె నయ్యమరమునికి.

క. మోఘం బగుఁ దజ్జన్మము, మాఘస్నానంబు నొక్కమాఱైనను న
ద్యోఘమునఁ జేయకున్న న, ఘౌఘపరీతాత్ము లైన యుర్వీజనముల్. 2027

క. ఇనవిరహితదినము తెఱఁగున, జంద్రుఁడు లేనిరేయికొమరున దీప్తిం
గన వెట్టిపుణ్యకర్మము, లును మాఘస్నానవిముఖలోకకృతంబుల్. 2028

క. పూతికలువోలె జంతు, వ్రాతంబున బుద్బుదములవలె జలమున సం
జాతు లగుచుందురు మాఘ, స్నాతులు గానట్టివారు చచ్చుటకె ధరన్. 2029

సీ. విష్ణుభక్తుఁడు గాని విప్రుండు హతుఁడు క్రో, ధమునఁ గావించెడితపము హతము
దంభకృతం బైనదానంబు హత మనా, చారంబువలన వంశంబు హతము
దారిద్ర్యమునను హతం బిహలోకంబు, దక్షిణ లేనిశ్రాద్ధంబు హతము
హతము లోభిధనంబు హత మసాక్షికభోజ, నంబు సందిగ్ధమంత్రంబు హతము

గీ. హత మదీప్తాగ్నినిహితహవ్యంబు హతము, వృషలభిక్షును గొని యొనర్చినమఖంబు
శ్రద్ధతోడను మకరమాసంబునందు, స్నాన మొనరింపకున్న జన్మము హతంబు. 2030

క. వచ్చె ననంగనె మాఘం, బెచ్చటనుండినను నఘము లెల్లను మనకున్
జిచ్చుఱపిడుగు తెఱంగున, వచ్చెను లయకాల మనుచు వడఁకుచు నుండున్. 2031

గీ. బ్రహ్మహత్యాదిఘోరపాపములు సేసి, నట్టివారల నేని మే మిట్టె పరమ
పావనులఁ జేయఁగల మని ప్రబలముగను, జలము ఘోషించు మాఘమాసంబునందు.
గీ. జలదములనుండి శశివోలె సర్వపాప, వర్గములనుండి ముక్తుఁ డై వహ్నివోలెఁ
బ్రజ్వరిల్లును రవి మకరస్థుఁ డైన, మాసమున స్నాన మొనరించుమానవుండు. 2033
వ. జ్ఞానకృతంబులును నజ్ఞానకృతంబులును బ్రమాదకృతంబులును వాఙ్మనసకాయకృతంబులును నైనయార్ద్రశుష్కలఘుస్థూలపాపంబు లన్నియును మాఘస్నానంబున ననలంబుచేఁ గాష్ఠంబులువోలె దగ్ధంబు లగు. 2034
క. నిలుపును మాఘస్నానము, కలుషంబుల నెల్ల నడఁచి కలకాలంబున్
విలయచ్యుతపదమున ని, శ్చలముగ హరిభక్తివోలె సకలజనములన్. 2035
క. మాఘస్నానమె యజ్ఞము, మాఘస్నానంబె తపము మంత్రము లెల్లన్
గీ. మాఘస్నానమె పుణ్యము, మాఘస్నానంబుకంటె మఱి లేదు సుమీ. 2036
ఒనరు జన్మాంతరాభ్యాసముననె మాఘ, మాసమున స్నాన మాచరింపంగ బుద్ధి
యాత్మతత్త్వవిచారమునందుఁ బోలెఁ, మహిని బ్రాదుర్భవించినమానవులకు. 2037
క. జనులకు సంసృతిపంకం, బును గడచిపోనంగ లోకమున నెందుఁ గనుం
గొనినను మాఘస్నానం, బునకంటెను నన్యమార్గములు లేవు సుమీ. 2038

—: ఋషీకావృత్తాంతకథనము :—

సీ. కలదు ఋషీక నాఁగను గన్య యొకర్తె, భృగువంశమున మున్ను పృథ్విలోనఁ
బ్రాప్తించుటనుజేసి బాల్యంబునంద వై, ధవ్యంబు తన కామె ధైర్యమునను
నిగ్రహీతచిత్త యై నియమంబులోడను, నాచరించుచును గృచ్ఛ్రాదివిధుల
నుంఛవృత్తిని భక్తి నొనరించుచును షష్ఠ, కాలంబునను బారికాంక్షివోలె
గీ. సలిపి స్నానంబు షష్టివర్షములదాఁక, మాఘమాసంబులందుఁ బ్రమాదరహిత
ముగను రేవాకపిలసంగమునను నొక్క, దినమునను నర్మదాతటంబునను బ్రమందె.
సీ. అంతట హరిభృత్యు లరుదెంచి యామెను, గొనిపోవ వైకుంఠమునకు నచట
నుండి నాలుగువేలయుగములవఱ కామె, యఖిలభోగంబుల ననుభవించి
సత్యలోకమునకుఁ జనుదెంచి పిమ్మట, నుండి నాలుగువేలయుగము లచట
నఖిలభోగంబుల ననుభవించుచు నుండ, స్వకృతమాఘస్నానసుకృతమునను
గీ. నపుడు సుందోపసుందాఖ్యు లైనదైత్యు, లమరులను బాధవెట్టంగ నమరు లెల్ల
నాకడకు వచ్చి వారిదుర్నయముఁ దెలుప, దైత్యనాశన మొనరింపఁ దలఁచి నేను.
వ. మాఘస్నానపుణ్యశేషంబునంజేసి సంకల్పమాత్రంబున నాసతీమణినిఁ ద్రిలోకమోహినిఁ గా నొనరించి యామెకుఁ దిలోత్తమ యనుపేరు వెట్టి సుందోపసుందనాశంబు గావింప నానతీయ నానారీమణి నాయాజ్ఞ నౌఁదలం దాల్చి వీణాపాణి యై నాలోకంబునుండి బయలుదేఱి సుందోపసుందు లుండుపురంబునకుం జేరి తత్సమీపంబునం

దుండునశోకవనంబున ప్రవేశించి యం దొక్కవిటపిక్రిందఁ జంద్రకాంతశిలావేదిపైఁ
గూర్చుండి జగన్మోహనంబుగా వీణాగానముం జేయు చుండ. 2041

సీ. ఆగానమునకును నారూపమునకును, వనపాలు రాశ్చర్యమును వహించి
కేళకూళిని జలక్రీడ గావించుసుం, దోపసుందులకడ కొయ్య నేఁగి
విన్నవింపంగ నావెలఁదిలావణ్యంబు, సుందోపసుందులు చోద్య మొంది
విడిచి జలక్రీడ విడిచి కేళాకూళి, యమరాంగనాసహస్రమును విడిచి

గీ. కాలదండంబు లన నొప్పుగదలఁ దాల్చి, వచ్చునను దమ్ముఁ జంపఁగా వచ్చినట్టి
మృత్యుదేవత నాఁ దేజరిల్లు చున్న, యానఘామణికడ కేఁగి యు క్షణంబ. 2042

క. కనుఁగొని తద్రూపంబును, గనుపేదుటు గదుర నీజగన్మోహిని నేఁ
గొనియెద నేఁ గొనియెద నేఁ, గొనియెద నని కలిసి కొట్టుకొని చచ్చి రటఁ. 2043

సీ. అంతట నాకాంత యమరకార్యంబును, నెఱవేర్చి యత్యంతనిపుణముగను
దిరుగ మామకసన్నిధికి నేఁగుదెంచి వం, దనము గావింప మత్పాదములకుఁ
జెంది నే ననుపమానంద మామెకు నిచ్చి, స్థానంబు సూర్యరథంబునందు
నాదిత్యుఁ డుండెడునంతదాఁకను నందె, వసియింపఁగను వర మొసఁగినాఁడ

గీ. నాబుషీక తిలోత్తమ యై సమస్త, సౌఖ్యము లనుభవించుచు సౌరలోక
మందు నిప్పటికిని నుండు నలవి గాదు, తెలియఁజేయ మాఘస్నానఫలము నసఘ.

క. అనవుడు నారదుఁ డెంతయు, మనమున విస్మయము గదుర మాఘస్నానం
బున నొదవుఫలమునకుఁ ద, ద్ఘనతను దొడఁగెను నుతింపఁగను జగములలోఁ. 2045

—: శ్రీకుండలవికుండలవృత్తాంతకథనము :—

వ. పూర్వము కృతయుగంబున నిషధపట్టనంబునందుఁ గులీనుండును దేవబ్రాహ్మణసేవా
పరుండును సత్కర్మపరాయణుండును నగు హేమకుండలుం డనునొక్క వైశ్యుండు
గలండు. 2046

గీ. శాకములు తైలములును గాష్ఠములు ధాన్య
ములును క్షీరాజ్యదధితక్రములును వస్త్ర
ములు ఫలంబులు మొదలుగాఁ గలపదార్థ
ములను గొని యమ్ము నావైశ్యపుంగవుండు. 2047

క. చలుపును బశుపోషణమును, జలుపుఁ గృషి వర్తకంబు సలుపును దేనం
గలుగునొ లాభము దానిఁ, జలుపును వైశ్యుండు లోకసమ్మతి గాఁగఁ. 2048

క. మెలఁగుచుఁ దలలో నాలుక, వలె లోకుల కాతఁ డట్లు వ్యాపారములఁ
జలుపుచును బలుతెఱంగుల, యలవుల నార్జించె నష్టహాటకకోటుల్. 2049

క. అంతట నాతఁడు బహుధన, వంతుం డని తలఁచి వలచివచ్చె నన జరా
కాంత యరుదెంచి తను వా, ద్యంతంబును నాక్రమించె నతిచిత్రముగఁ. 2050

గీ. ఇపుడు సంసారవైచిత్ర్య మాత్మలోన, నతఁడు తలపోసి తలపోసి యార్జితార్థ
మందు షష్ఠాంశమును బరమార్థకార్య, ములకు వినియోగపఱిచెడితలఁపు గలిగి.

సీ. హరిహరదేవాలయములు గట్టించి త, త్పూజకుఁ జాలినభూము లొసఁగె
నశ్వత్థజంబూవటామ్రకంకేళినిం, బాదిపుణ్యానోకహములు నిలిపెఁ
బుష్కరిణులును వాపులు దటాకంబులుఁ, ద్రవ్వించె సలిలంబు తఱుగకుండ
నన్నపానము లవిచ్ఛిన్నంబులుగ నీయ, స్థాపించె శాశ్వతసత్త్రములను

గీ. నాల్గుదెసలను బెట్టించె నగరమునకు, బహుళపానీయశాల లేర్పఱిచెఁ బుష్ప
వనములు పురాణములలోన వినినయట్టి, దానములు సేసె బ్రాహ్మణోత్తముల కధిప.

క. జననము మొదలుగఁ గావిం, చినపాపము లెల్ల డుల్లఁ జేసికొనియెఁ బె
త్తనమునఁ బ్రాయశ్చిత్తము, వినయముతోడను నతండు విప్రులయెదుటన్. 2053

గీ. అటులు చేయంగఁదగినకార్యముల నెల్లఁ, జేసి యాతండు పిదప శేషించినట్టి
ధనము సర్వంబు నర్పించెఁ దనతనూజు, లైనశ్రీకుండలవికుండలాహ్వయులకు. 2054

ఆ. అవల వారిపైని నాత్మీయభార మం, తయును మోపి విగతతాపుఁ డగుచుఁ
జొచ్చి వనము తనువు శోషిల్లఁ దపము గా, వించి చేరె నతఁడు విష్ణుపదము. 2055

వ. అంతటఁ గొలఁదికాలంబునకు నవయౌవనంబు ప్రాప్తించుటయు శ్రీకుండలవికుండలులు
ధనమదంబునఁ గన్నుగానక. 2056

సీ. విహరింపఁ దొడఁగిరి వీథులలోఁ బణ్యా, భామలతోఁ గూడి పాడుకొనుచు
నార్జింపఁ దొడఁగిరి యతిసులభంబుగాఁ, బరవధూసంసర్గపాతకంబుఁ
జేర్పంగఁ దొడఁగిరి తార్పుకత్తియలను, జాదుకారులఁ దమసన్నిధానమునకుఁ
జరియింపఁ దొడఁగిరి సర్వకాలములందు, ద్విపహయస్యందనాదికము నెక్కి

గీ. తల్లి చెప్పెడిబుద్ధులు బొల్లుచేసి, పెద్దలు వచించుమాటలు బెండువఱచి
యంకుశము లేనికలభములట్లు బలిసి, తిరుగఁ దొడఁగిరి భయము భక్తియును లేక.

క. ఒకక్షణమునఁ గలవేషం, బొకక్షణమునఁ బనికిరాని నొకటి విడిచి పై
నొకటి ధరించుచు నుందురు, వికలమతులుపోలె నెల్లవేళల వారల్. 2058

క. ఘనసారము చందనముం, బునుఁగును గస్తురియుఁ జాదు మొదలైనసువా
సనవస్తువుల ననారత, మును దాల్తురు వారు జనులు మోహము చెందన్. 2059

క. చలిపి యెఱుంగరు వారలు, జలజాక్షునిపూజ యెట్టిసమయమునందున్
బలికి యెఱుంగరు హరి యను, పలుకును గలనైన నెట్టిపాపులొ వారల్. 2060

గీ. కితవులను గూడి కైతవక్రీడనములు, సేయుచును జేయుచును మద్యసేవనములు
ద్రవిణమును నీతిబాహ్యకార్యముల కెల్ల, వ్యయముచేయఁ దొడంగి రావైశ్యసుతులు.

గీ. ఊషరక్షేత్రమున బీజ ముంచినట్లు, తండ్రికష్టార్జితము నపాత్రములయందు
ధారపోసెదరే కాని వారు కడకు, దర్శనం బైన నీరు విద్వాంసుఁ డనిన. 2062

గీ. ఆవిధంబునఁ గొన్నినాళ్లరుగ నచిర, కాలముననె గతించెను గలధనంబు
సర్వమును దోయనిధులును సమసిపోనె, యెడతెగక తోయ మేతములెత్తి తోడ.

క. ఎప్పుడు లక్ష్మి తొలంగెనొ, యప్పుడె పరివార మెల్ల నవలకుఁ దొలఁగెన్
గుప్పలుగ మూఁగునీఁగలు, తప్పికొనుంగాదె గుడము తఱిగినవెనుకన్. 2064

క. అంతట వారలు చింతా, క్రాంతహృదయు లగుచుఁ జేత గవ్వయు లేమిన్
జెంతకు నెవరును జేరమి, నంతంతకు హెచ్చుక్షుధకు నాఁగఁగ లేమిన్. 2065

క. ప్రారంభించిరి చౌర్యము, పౌరులగేహంబులందుఁ బ్రభు వాక్కృత్యం
బారసి దేశమునుండియె, వారిని వెడలంగఁగొట్టె వనభూములకున్. 2066

చ. వనమును జొచ్చి వా రచట వర్తిలు చుండుకిరాతకోటితో
నొనరిచి చెల్మి వేట కుపయుక్తము లైనవిధానముల్ గనుం
గొని మృగపక్షిసంతతులఁ గొట్టి తదామిషముల్ భుజించుచున్
దినములు గొన్ని యావిపినదేశమునన్ వెడలించి రావిధిన్. 2067

క. అంతటను నొక్కనాఁ డా, కాంతారమునందు నొకమృగంబును లేమిన్
జింతిలి యొకఁ డొక్కయెర, క్ష్యాంతరమున కొక్కఁ డొక్కయద్రికిఁ బోయెన్.

గీ. అరిగి యట మోకములను వేటాడుచుండ, విధివిధానంబుచే నొక్కవేళయందు
పెద్దపులినోటఁ బడి చచ్చెఁ బెద్దవాఁడు, పన్నగముకాటునను జచ్చెఁ జిన్నవాఁడు.

ఆ. శమనదూత లంతఁ జనుదెంచి వెంటనె, కాలపాశములను గట్టివారి
ననిలజవముతోడఁ గొనిపోయి యుంచిరి, దండధరునిసన్నిధానమందు. 2070

చ. కనుఁగొని వారి నంతకుఁడు గన్గొని తద్విషయంబు చిత్రగు
ప్తునివలనన్ సమస్తమును దూతల కాజ్ఞ నొసంగి వారిలో
ననుజుని నాకలోకమున కంపఁగ నన్నను రౌరవంబునం
దునుపఁగ నేఁగె నొక్కత్రుటియున్ నివసింపక యాస్థలంబునన్. 2071

క. శమనుం డాజ్ఞాపించిన, నిమిషముననె భటుఁ డొకండు నిలిపె ననలకుం
డమునం దన్నను నొకభటుఁ, డమరపురికి బయలుదేఱె ననుజునితోడన్. 2072

వ. అప్పుడు వికుండలుండు దివ్యవిమానంబు నధిష్ఠించి దేవదూతతోడ సుఖంబుగాఁ
త్రివిష్టపంబున కేఁగుచు మనంబునం దొక్కసందేహంబు గలుగ నాతనితో ని ట్లనియె.

క. దేవా దేవభటుండవు, నీ వెఱుఁగనిధర్మ ముండనేర దొకండున్
గావున నామదిలోపల, నావహిలినయొక్కసంశయము దీర్పఁగదే. 2074

చ. కలిగితి మన్నదమ్ములము గా నొకగర్భమునందె పాపముల్
సలిపితి మొక్కతీరుననె చావును దుల్యమె యిందులోన నేఁ
జలిపినపుణ్య మేమి సహజన్ముఁడు సల్పినపాప మేమి నా
కొలయఁగ నేల యూర్ధ్వగతి యొందఁగ నేల యతం డధోగతిన్. 2075

చ. అనవుడు దేవదూత యతఁ డాడినమాటకు నుత్తరంబు గాఁ
గను నిటు పల్కెఁ బ్రాణులు జగంబునఁ దండ్రి యటంచుఁ దల్లి యం
చును సుతుఁ డంచు జాయ యనుచున్ స్వస యంచును భ్రాత యంచు సం
జ్ఞను వహియించి పుట్టుచును జచ్చుచు నుందురు కర్మభుక్తికై. 2076

క. ఒకపాదపమున నానా, శకునంబులు చేరినట్లు జంతుతతులు స్వ
స్వకృతముల ననుభవించుట, కొకసంసారమునఁ జేరు చుండు ధరిత్రిన్. 2077

గీ. వెనుకటిభవంబులందుఁ గావించినట్టి, కర్మములు పుణ్యములొ పాతకములొ యేవొ
ప్రాణి తత్తత్ఫలంబుల ననుభవించు, చుండు ఋణమును నెడతెగకుండ ననఘ. 2078

క. ఒక్కఁడె చేయుం గర్మము, నొక్కఁడె తత్కర్మఫలము నొందును వత్సా
యొక్కఁడు చేసినకర్మం, బొక్కపు డేనియును నంట దొం డొక్కనికిన్. 2079

క. కావున నీసహజన్ముఁడు, గావించినయశుభ మశుభగతి నాతనికిన్
గావించెను గావించెను, నీ వొనరించినశుభంబు నీకు శుభంబున్. 2080

క. అనవుడు వికుండలుం డి, ట్లనియెను నే నాదినుండి యఘములు దక్కన్
బొనరించి యెఱుఁగ ధర్మము, లను నా కెట్లొదవె సుకృతలాభము చెపుమా. 2081

క. అనుటయు నమరభటుం డి, ట్లనియె వికుండలునితోడ నయ్యా నీచే
సినపుణ్య మీ వెఱుంగవు, వినుమేను వచింతు నీకు విశదము గాఁగన్. 2082

సీ. కాళిందిదక్షిణకూలంబునం దుండె, ననవద్య మగు నొకయాశ్రమంబు
హరిమిత్త్రుఁ డనెడిబ్రాహ్మణువిపుత్త్రుం డొక్కఁ, డాయాశ్రమంబున నధివసించె
నామ్నాయనిధి యైన యాభూసురునితోడఁ, గలిగె స్నేహము దైవికముగ నీకు
దానిచేతన రెండుస్నానముల్ నీకు సం, ప్రాప్తించె యమునలో మాఘమందు

గీ. మొదటిస్నానంబువలన నిర్మలముగను, సకలపాతకములు గూడ సమసిపోయె
హస్తగత మయ్యె ననితరప్రాప్య మైన, స్వర్గలోకంబు రెండవస్నానమునను. 2083

గీ. కాన సుఖియింపు మింక స్వర్గమున నీవు, శాశ్వతంబుగ దేవతల్ సన్నుతింప
ననుభవించునుగాక మీయన్న తీవ్ర, యాతనలు ఘోరనరకములందుఁ గూలి.

చ. అనుటయు భ్రాతృదుఃఖమును నాఁపికొనంగ వశంబు గామిచేఁ
గనుఁగవనుండి బాష్పములు గాల్వలు గట్టఁగ నాతఁ డేడ్చె నా
ననమున దీనభావమును నాలుకయందును శుష్కభావమున్
మనమున స్నేహభావమును మాటికి మాటికిఁ బ్రస్ఫురింపఁగన్. 2085

ఆ. అట్లు లేడ్చి యేడ్చి యాతండు పులకాంకు, రాంకితాఖిలాంగుఁ డగుచు నపుడు
పలికె నిట్లు దేవభటునితోఁ దనయన్న, నుద్ధరించుటకును బుద్ధి గలిగి. 2086

క. తెలిసినవాఁడవు సర్వముఁ, దెలిపితివి ప్రమోద మయ్యె దేవా నాకున్
దెలుపఁగవలసినవిషయము, కలదు మ ఱొక్కండు నీవు కరుణించినచోన్. 2087

క. చేకూరునో దుర్గతి యే, యేకర్మంబులను సుగతి యేరుపడునో యే
యేకర్మములను నా కా, యాకర్మంబులను జెప్పుమయ్యా మహాత్మా. 2088

చ. అనవుడు నావికుండలున కాతఁ డిటుల్ వచియించె నయ్యా నీ
వనఘుఁడ వైతి ధర్మముల నారయుబుద్ధి విశుద్ధమానసం
బునను జనించు లేనియెడఁ బుట్టదు గావున నీకు శ్రేయముల్
వినిచెద ముందు నాకు నెఱవేర్పఁగఁ గార్యము లెన్ని యుండినన్ 2089

—: సుగతిదుర్గతిహేతుకర్మకథనము :—

క. మనమున వాక్కునఁ గాయం, బున నెవనికి నెట్టికాలమున నైనను హిం
సను గావింపక యుండెడి, జనములు యమలోకమునకుఁ జనరు కుమారా. 2090

క. ఉత్తమధర్మ మహింసయె, యుత్తమదానంబు హింస యొనరింపమియే
యుత్తమతపం బహింసయె, యుత్తమగుణ మన నహింస యొకటియె వత్సా. 2091

క. క్రిములను మశకములను స, ర్పములను బక్షులను నరులఁ బ్రాణులసందో
హము నెల్లను నాత్మోప, మ్యమునం గనువారు గనరు యమలోకంబున్. 2092

క. పితృపతిపుటభేదనమున, నతఁ డొందఁడు మాదమును నయస్కీలను ప్రే
తతరంగిణి మొదలగుదు, ర్గతులను జేయండో యెవఁడు ప్రాణికి హింసన్. 2093

సీ. స్థలజలచరజంతువులను జీవికకునై, హననంబు గావించునట్టివారు
కాలసూత్రంబునఁ గూలి భక్షించుచు, శునకమాంసము పూయశోణితములు
పానంబు సేయుచుఁ బడి వసాపంకంబు, నను మునుంగుచుఁ గనుంగొనఁగలేక
యన్యోన్యతాడనాన్యోన్య ఖాదనములు, గావించుకొనుచుఁ జీకాకుపడుచుఁ
గీ. బొడుచు చుండ నధోముఖంబు లగుక్రిములు
మూర్ఛిలుచుఁ దెప్పిదేల్చుచు మొత్తుకొనుచుఁ
గల్పము లనేకములు పుచ్చి కట్టకడకుఁ
బుట్టుదురు స్థావరములుగాఁ బుడమిలోన. 2094

ఉ. అట్టులు స్థావరంబులుగ నై బహుకాలము ముచ్చు చేసియు
న్నట్టియధర్మకర్మమున కైనఫలంబు భుజించి యంతమం
దెట్టులొ తిర్యగాకృతి వహించి విగర్హ్యము లైనయోనులం
బుట్టి పురాకృతాఘఫలముల్ భుజియింతు రనేకవర్షముల్. 2095

గీ. అటులు కర్మఫలంబువా రనుభవించి, యుదయ మొందుదురు మనుష్యయోనులందుఁ
దుదకు జాత్యంధులుగ దరిద్రులుగ బుద్ధి, హీనులుగ హీనులుగ నంగహీనులుగను.

క. కావున లోకద్వయమును, గావలయు న టన్నకోర్కి గలిగినవారల్
జీవులకు హింస నెపుడున్, గావింపఁగరాదు త్రికరణములను వత్సా. 2097

గీ. తలఁప కుందురో యెవరు ప్రాణులకు హింస, కలుగదు భయంబు వారి కెక్కడను గూడఁ
దలఁచు చుందురో యెవరు ప్రాణులకు హింస, గలుగ దభయంబు వారి కెక్కడనుగూడ.

గీ. అఖిలనదులును సాగరమందుఁ జేరు, తీరున సమస్తధర్మముల్ చేరు నిఖిల
వృజినహారిణి యైనయహింసయందు, దానితో సాటి యైనతీర్థంబు లేదు. 2099

గీ. అభయమును భూతముల కిచ్చినట్టివాఁడె, యఖిలయజ్ఞంబులును జేసినట్టివాఁడు
ప్రాణులను ద్వేషమునఁ జూడనట్టివాఁడె, యఖిలతీర్థంబులను మున్గినట్టివాఁడు. 2100

గీ. చేయరా దిది యియ్యది చేయవలయు, ననుచు శాస్త్రంబు విధియించినట్టివిధుల
దాఁటకుండఁగఁ బాలించుధార్మికులకుఁ, గలుగనేరదు శమనలోకప్రసక్తి. 2101

క. కానంబడుదురు త్రిదివ, స్థానంబునయందు బ్రహ్మచారియు గృహియున్
వానప్రస్థుఁడు యతియును, మానక నిజధర్మములను మసలిర యేనిన్. 2102

సీ. అధ్యయనము నగ్న్యుపాసనయును జేసి, మరణంబు నొందినధరణిసురులు
శత్రువుల్ ముట్టిన సంగ్రామమున వెన్ను, చూపక చచ్చినశూరభటులు
శరణన్నవారిరక్షణమునకై తమ, తనువు లర్పించినధార్మికులును
స్వస్వవర్ణాశ్రమాచారధర్మము లను, ష్ఠించి గతించినచేతనులును

గీ. నాపదను బొందియున్నబ్రాహ్మణుని బురదఁ, గూరుకొనిపోయి లేవనిగోవు నుద్ధ
రించినట్టిమహాత్ములుఁ ద్రిదివమందు, ననుభవింతురు దివ్యసౌఖ్యముల నెల్ల. 2103

గీ. రోగుల ననాథులను దరిద్రులను గ్రుడ్డి, వారలను గుంటివారల వార్ధకమున
నున్నవారల నోమినయుత్తములకు, నాకముననుండి విచ్యుతి లేకయుండు. 2104

క. గోవుల నధిరోహింపక, గోవులకున్ గ్రాస మిడుచు గోశుశ్రూషన్
గావించుచు జీవించెడి, పావనులకు దివము కొంగుపసిడియె వత్సా. 2105

క. గోవులు జలపానంబుం, గావించుటకొఱకు నొక్కగర్తం బైనన్
గావించుపుణ్యపురుషుల, వైవస్వతభటులు చూడ వణఁకుదు రనఘా. 2106

క. సురలను గురులను ధరణీ, సురులను బూజించునట్టిశుద్ధాత్ములకున్
సురలోకవాసభాగ్యము, కరబదరసమాన మనుచుఁ గాంచుము వత్సా. 2107

క. జలమందును స్థలమందును, గలప్రాణులు జలముఁ ద్రావఁగాఁ దగుకూపం
బులు గాలువలు తటాకం, బులు నిలిపినఁ గలుగుఁ ద్రిదివమున నిలువంగన్. 2108

క. ప్రాతస్స్నానమునందుం, బాతకముల నెల్ల రూపుమాపెడిపరమ
జ్యోతి వెలయుటను బ్రాత, స్స్నాతుల కెన్నఁడును లేదు నరకము వత్సా. 2109

క. స్నానము సేయక తినియెడి, మానవుఁడు మలంబు దినెడిమానవుఁడె సుమీ
కానఁబడఁ డపరిశుద్ధుఁడు, కానఁబడఁడు పాపి వానికంటెఁ గుమారా. 2110

క. పితృదేవత లస్నాయికిఁ, బ్రతికూలురు వాఁడు నరకపతితుం డగుచున్
మితి లేనిదుఃఖములు గని, క్షితిలోనఁ బురీషమందుఁ గ్రిమి యై పుట్టున్. 2111

క. కానరు యమలోకమును గు, యోనులలోఁ బుట్టి యార్తి నొందరు స్రోత
స్స్నానము పర్వదినంబుల, లోనం గావించునట్టిలోకులు వత్సా. 2112

క. తిలలు తిలప్రస్థంబును, దిలపాత్రంబును యథావిధిగ దానంబున్
జలిపినపుణ్యాత్ములకున్, గలుగదు యమలోకదర్శనంబు కుమారా. 2113

క. కానరు యమలోకము గో, దానంబును స్వర్ణరజతదానంబును భూ
దానము మొదలగు బహువిధ, దానంబులు చేసినట్టిధార్మికు లనఘా. 2114

క. వెలలేనిపుణ్యదినములు, సలుపక వంధ్యముగ నందు స్నానము దానం
బులును దమశక్తికొలఁదిని, జలిపినవారలకు సుగతి సంప్రాప్తించున్. 2115

క. దాత లగువారు రౌరవ, యాతనలకుఁ బోక దివికి నరిగి మరలఁ దా
మేతెంచి రేని పుట్టరు, క్ష్మాతలమున నిర్ధనావసథములలోనన్. 2116

సీ. పరుషవాక్యంబులు పలుకనివాఁడును, నాచారసంపన్నుఁ డైనవాఁడు
పరదోషములను గోపనము సేసెడివాఁడు, పరగుణంబులు బయల్పఱచువాఁడు
ననసూయకుఁడు మనంబం దైనఁ బరధనం, బపహరింపఁ దలఁపనట్టివాఁడు
నఖిలభూతములయం దనుకంప గలవాఁడు, దాక్షిణ్యగుణముచేఁ దనరువాఁడు
గీ. మాని యగువాఁడు దుర్బుద్ధి లేనివాఁడు, ఋతము పలికెడివాఁడును బ్రియము నుడువు
నట్టివాఁడును యమలోకయాతనలను, గడకు స్వప్నమునం దైనఁ గనరు వింటె.

క. దురితాత్ములలో నధికులు, పరాపవాదియును మఱియుఁ బాషండుండున్
నరకములె గతులు వారికి, వరుసగ నాభూతసంప్లవంబును వత్సా. 2118

క. పరుషముగ మాటలాడెడి, నరులకు యమలోకమందు నరకము మీఁదన్
నరకమె తప్ప మఱొక్కటి, దొరకదు చేయూఁత యెంతదుఃఖంపడినన్. 2119

క. పితృపతిదండప్రహరణ, గతి దప్పఁ గృతఘ్నునకు జగంబులలో ని
ష్కృతి లేదు తీర్థములచేఁ, గ్రతువులచే నఖిలపుణ్యకర్మంబులచేన్. 2120

క. నియతాహారుం డయి యిం,
ద్రియముల నియమించి పుణ్యతీర్థములందున్
మెయి ముంచినట్టిమానవుఁ,
డెయిదఁడు యమభటులచేతియీఁటెలపోటుల్. 2121

గీ. చేయఁగూడదు తీర్థోపజీవనంబు, తీర్థమునఁ బాతకమును బ్రతిగ్రహమును
ధర్మవిక్రయమును జేయఁ దగదు చేసె, నేని తప్పదు నరకంబు వేని కైన. 2122

క. సరిగావు జపతపంబులు, సరిగావు మఖంబు లెట్టిసత్కర్మముల్
సరిగావు జహ్నుతనయా, సరిదంబుకణాభిషేకసంసిక్తునితోన్. 2123

మ. హరిపాదాగత మైనధర్మరస మై యబ్జజ మై మాయకున్
బర మై నిర్గుణ మై వినిర్మలము నై బ్రహ్మాత్మకం బై నిరం

తరమున్ భాసిలుచుండు గాంగజల మాహాత్మ్యంబు గుర్తించుటన్
ధరియించెన్ బరమేశ్వరుండు తనమూర్ధంబందు భాగీరథిన్. 2124

క. తీర్థములలోన నుత్తమ, తీర్థం బగుగంగ నన్యతీర్థసమముగా
నర్థమెఱుంగక పలికెడి, వ్యర్థుం డిహపరములందు వ్యర్థుఁడు వత్సా. 2125

క. తనయునికి యోజనంబులు, గను నున్నను నోట గంగ గంగ యని వచిం
చినమాత్ర నఖిలపాపము, లును డింది నరుండు విష్ణులోకము నొందున్. 2126

గీ. శతసహస్రజన్మాంతరసంచితంబు, లైనపాతకరాసుల నగ్నికణము
తూలరాసులఁ బోలె నిర్మూలముగను, జేయు నది యొక్క గంగాంబుశీకరంబు. 2127

క. కావున గంగానదిలో, నేవిధమున నైన స్నాన మేనాఁ జేసిం
గావింపవలయు శ్రేయము, కావలయు నటన్న కోర్కి గలిగినవారల్. 2128

క. జీవనము జలము ప్రాణికిఁ, గావున జలదానమునను గలుగు నరులకున్
జీవనదానఫలం బది, దేవత్వము నొసఁగు దానిఁ దెలియరు మూఢుల్. 2129

క. కలిగియును బ్రతిగ్రహమును, వలుపఁగ సామర్థ్య మట్లు సలుపని విప్రుల్
విలసిల్లుదు రాకసమునఁ, గలకలలాడుచును దారకారూపములన్. 2130

గీ. ఊరిని జిక్కినపక్షుల నుద్ధరించి, నట్టివారును గోష్ఠమునందుఁ బ్రాణ
ములను విడిచినయట్టివారలును గూడఁ, దారలై యుండెదరు నభస్స్థలమునందు.

గీ. ప్రతిదినంబున బహునాళు ప్రాణసంయ, మములఁ గావించు చుండెడిమహిమ యొకండె
బ్రహ్మహత్యను జేసినపాపి నైనఁ, బావనునిఁ జేసి వైకుంఠపదముఁ జేర్చు. 2132

క. అనుదివసమును గుశాగ్రం, బున నబ్బిందువు శతాబ్దములవఱకును ద్రా
వినవారి కొదవుఫలమును, గనుఁ బ్రాణాయామపరుఁడు కడు సులభముగన్. 2133

క. ఒకమాట వినుము తీర్థ, ప్రకరములును వ్రతశతములు క్రతుసంగతులున్
సుకృతవిధానము లన్నియు, నొకయెత్తును బ్రా రోధ మొకయెత్తు సుమీ. 2134

క. మనమున నైనను బరకాం, తను వలవనివాఁడు త్రిభువనములును ధరియిం
చినవాఁడు వానివలననె, యునికి జగంబులకు నెల్ల నొదవెడు ననఘా. 2135

క. దొరలించు నేకవింశతి, నరకములందును బరాంగనాసంగము మా
తెరువునకుఁ జనదు పోవఁగ, నరకములకు భయముఁ జెందునరులు కుమారా. 2136

క. పరసతుల నభిలషింపని, పురుషులు నెలకొల్పి యశము భూస్థలి నాపై
సురలోకమందు వసియిం, తురు దివ్యకళాప్రదీప్తితోడ సుఖముగన్. 2137

గీ. సారెకును సారెకును గ్రోధకారణంబు, లెన్ని సమకూరెనను వాని నెన్నకుండఁ
గ్రోధము జయించినట్టియక్రోధనుండు, స్వర్గలోకంబును జయించు సత్త్వశాలి. 2138

క. తలిదండ్రుల దేవతలం, బలె నారాధించినట్టిపావనమూర్తుల్
తిలకింపరు వైవస్వత, నిలయంబును గృతశ్లాఘవిగ్రహు లగుటన్. 2139

క. తమదండ్రులకంటెను నధి, కముగా గురువులను బూజగావించునరో
త్తము లేఁగుదు రతిథులుగాఁ, గమలాసనునింటి కుచితగౌరవు లగుచున్. 2140

క. శీలపరిరక్షణంబున, స్త్రీలకు నిహమందె సకలసిద్ధులు గలుగున్
గాలునిపోటులు తప్పవు, శీలము చెడ నేని యెట్టిచెలువల కైనన్. 2141

క. ప్రతిషిద్ధకర్మకరణము, కతంబునను శాకయజ్ఞకరణమునను దు
ర్గతి గలుగు శూద్రునకు స, ద్గతి గలుగును విహితకర్మకరణముచేతన్. 2142

సీ. ఆమ్నాయ మంతయు నధ్యయనము చేసి, శాస్త్రంబులోఁ గలసార మెఱిఁగి
స్మృతిధర్మములను గు ర్తించి పురాణముల్, చదివి సంహితలను సంగ్రహించి
పోఁగొట్టుకొని పాపముల నెల్లఁ దత్తద, ధ్యాసమాహాత్మ్యసంప్రాప్తివలన
నొనరించుకొని జన్మమును సార్థకంబుగా, వేదాంతనిష్ఠావినోదమునను
గీ. బూజనీయులు లగుధర్మబీజములను
జనులసుఖమునకై వెదచల్లునట్టి
బ్రాహ్మణులు బ్రహ్మలోకంబు వడయువారు
వారె జగములు ధరియించువారు వింటె. 2143

క. నిగమాగమసింధూద్గత, మగుజ్ఞానామృతము నజ్ఞు లాస్వాదింపన్
దగునట్లొసంగువిప్రుని, నిగమాగిమములును దేవునిఁగఁ బూజించున్. 2144

క. అమితరహస్యం బగుఁవిష, యము నీకు వచింతు వినుము హరిపదభక్తుల్
యమభటుల నైన యమలోఁ, కము నైనను యముని నైనఁ గాంచరు వత్సా. 2145

వ. అది యెట్టు లంటి వేని. 2146

క. ఆచారహీను లైన న, నాచారహతాత్ము లైన హరిభక్తులు మ
ద్గోచరులు గారు గావున, నాచరితార్థులను మీర లంటకుఁ డెపుడున్. 2147

క. మనుజులలో నెవఁ డేనియు, వనరుహనాభునిఁ బ్రసంగవశమున నైనన్
మనమున నొకపరిఁ దలఁచిన, ననఘుం డయి విష్ణుపదము నాసాదించున్. 2148

క. హరిభక్తులసాంగత్యము, దురితంబుల నెల్లఁ బాఱఁదోలును గానన్
హరిభక్తులతో నుండెడి, పరమపవిత్రులకుఁ దొలఁగి పాఱుఁడు మీరల్. 2149

క. అని యముఁడు భటుల కనుఁగొన, మును నాజ్ఞాపించు చుండు మొదటను గానన్
జనులకు సులభోపాయం, బనఁ దగు హరిభక్తి యమభయంబును గడవన్. 2150

క. నరకాంబుధిలోపలఁ బడి, పరిదేవనముల నొసర్చుపాపిష్ఠులకున్
హరినామస్మరణం బను, తరణి యొకటె యుద్ధరింపఁ దగినది వత్సా. 2151

చ. కనుఁగొనరాదు నీచునిఁ గంసవిరోధిపదాంబుజంబులన్
దనమనమందు నిల్పికొని ధ్యానము సేయుచు నుండుమాలవా
నిని నయినన్ సరోజదళనేత్రునిభక్తులు వర్ణబాహ్యు లై
నను భువనత్రయంబును నొనర్తురు పూతముగన్ గుమారకా. 2152

క. హరినామకర్మగుణములు, హరియింపఁగఁజాలు నెట్టియఘముల నైనన్
శరణము తత్సంకీర్తన, పరాయణతకంటె లేదు పాపాత్ములకున్. 2153

గీ. పాతకాద్రుల నెల్లను బగులఁగొట్టి, సత్వరముగను ఘోరసంసారవార్ధి
గట్టు జేర్ప నుపాయంబు గానరాదు, విష్ణుసంస్మరణముకంటె వే ఱొకండు. 2154

గీ. నియమమునఁ గట్టివైచి యింద్రియము లెల్ల, ఘోర మైనతపంబు కాంతారమందుఁ
జేసినఫలంబు సమకూరుఁ జేసె నేని, వాసుదేవున కొకసారి వందనంబు. 2155

గీ. ఎన్నిపాతకములు సేసియున్న గాని, యన్నియును భస్మ మైపోవు నాక్షణంబ
యఖిలపాతకసంహారి యైనశౌరి, కొక్కపరిఁ జేతులను జాఁచి మ్రొక్కె నేని. 2156

గీ. ధరణిలోఁ గలపుణ్యతీర్థములలోన, నన్నిటను స్నాన మొనరించినట్టిఫలము
గలుగు నొకసారి తేనియ లొలుకు చుండ, నెలమిఁ గృష్ణా యనుచు నోటఁ బలికె నేని.

గీ. అమితపాతకి యయ్యును నంతకాల, మందుఁ బుత్రుని నారాయణా య టంచుఁ
బిలిచినంతనె సర్వాఘములును దొలఁగి, చనియె వైకుంఠమునకు నజామిళుండు. 2158

గీ. నరకమం దుండి యావేదనలను బొందు, తనకులద్వయపితృదేవతలకు దివముఁ
గలుగఁజేయును హరిపూజ సలుపునట్టి, యనఘశీలుఁడు నిస్సంశయముగ వత్స. 2159

క. గోవిందనామజపమును, గావించుచు మేను విడువఁగలిగినవానిన్
వైవస్వతుండు గాంచఁడు, వైవస్వతు నతఁడు గనఁడు వైశ్యతనూజా. 2160

చ. మునియును ధ్యాన మంగములు ముద్రలు ఛందము దైవతంబునుం
దనరఁగ ద్వాదశాక్షరయుతం బగుమంత్రము నష్టవర్ణముల్
తనరెడిమంత్రముల్ విధివిధానమునన్ జపియించువిష్ణుభ
క్తునిఁ బొడగాంచినన్ శుచి యగున్ ద్రుటిలోపల విప్రహంతయున్. 2161

క. శివనిందను జేసెడివై, ష్ణవునకు వైకుంఠపదము సమకూరమియున్
వివిధము లగునరకములం, దవులుకొని తపించుటయును దప్పవు వత్సా. 2162

గీ. వెలయఁగా శంఖచక్రముల్ విష్ణురూప, మునను భక్తులు వైకుంఠపురమునందు
భాసిలుచు నుండెదరు విష్ణుభక్తివలనఁ, గలుగుమాహాత్మ్యమున కంతు గానరాదు.

గీ. ప్రతిమయం దైన భానుబింబమున నైన, జలమునం దైన హృదయదేశమున నైన
హరిని నర్చించునట్టిపుణ్యాత్మకులకుఁ, గాను విష్ణుపదము మీఁదుగట్టఁబడియె. 2164

సీ. వజ్రకీటంబుచే వలనుగా నిర్మింపఁ, బడినచక్రాదిరూపములతోడ
వెలయుసాలగ్రామశిలయందు విష్ణువు, నర్చింతురు ముముక్షు లైనవారు
విశ్వగతుం డయ్యు వెలుఁగొందు నద్దాన, హరి కాష్ఠముఖమున నగ్నివోలెఁ
జక్రి కయ్యది యధిష్ఠానంబుగా నుండుఁ, గావున లోకైకపావనంబు

గీ. సకలపాపహరంబును సర్వసుకృత, దాయకంబును ముక్తిప్రదాయకమును
గానరాదు మఱొక్కటి దానికంటె, మర్త్యధర్మప రీతు లౌమానవులకు. 2165

గీ. చక్రధరుని సాలగ్రామచక్రమందుఁ, బూజగావించు చుండెడిపుణ్యపురుషు
లగ్నిహోత్రంబు లొనరించినట్టివారె, యఖిలభూదానమును జేసినట్టివారె. 2166

గీ. చక్రపాణి సాలగ్రామచక్రమందు, నుండినట్టులు ప్రీతితో నుండఁ డెపుడు
నాత్మవక్షస్స్థ యగులక్ష్మియందుఁ గాని, స్వాశ్రయం బగువైకుంఠమందుఁ గాని.

గీ. ఉపనిషత్తులు బ్రహ్మమై యుండినట్టి, యచ్యుతుని నన్వహముఁ గొనియాడు చుండు
నచ్యుతుండు సాలగ్రామమందు నుండుఁ, గానఁ దత్పూజకులు ముక్తిగనుట యరుదె.

క. పనివడి సాలగ్రామా, ర్చనమునుఁ బ్రతిదినముఁ జేయుసత్పురుషుఁడు పొం
దును వేయి రాజసూయము, లనుదినమును జేయుచుండునట్టిఫలంబుల్. 2169

క. అనవధికపాపయుతుఁడై, నను గర్మాచరణవిధమునను నధికారం
బొనరనివాఁడైనను గె, ల్చును సాలగ్రామపూజ నొప్పున యమునిన్. 2170

వ. ఒక్కదినంబునందు ద్వాదశసాలగ్రామంబులు యథావిధిగ నర్చించుపుణ్యపురుషుండు ద్వాదశకోటిలింగంబులు ద్వాదశకాలంబులందును సువర్ణపద్మంబులచే నర్చించిన ఫలంబు వడయు. సాలగ్రామశతంబు నర్చించినమహాత్ముఁ డనేకకల్పంబులు విష్ణులోకంబునం దుండి కడకు భూలోకంబునఁ జక్రవర్తిగా నవతరించు. 2171

క. కామక్రోధాదిరిపు, స్తోమార్దితుఁడైనయపరిశుద్ధుం డేనిన్
క్షేమమున నుండు సాల, గ్రామార్చనవలన హరిసకాశమునందున్. 2172

క. క్రిమిజన్మంబును దిర్య, క్త్వమును శమనలోకనరకవాసవ్యథయున్
సమకూరవు సాలగ్రా, మము నర్చనచేయు చుండుమహాత్ములకున్. 2173

క. ఒకపరి సాలగ్రామము, నకు నభిషేకంబు సేసినను సమకూరున్
సకలాఘనాశనంబును, సుకృతావాప్తియును జిత్తశుద్ధియు ననఘా. 2174

క. సాలగ్రామశిలాకృతిఁ, దాలిచి హరి యున్నచోటఁ దపసులు యతులున్
వేలుపులు సిద్ధులును బదు, నాలుగుజగములును నుండు నైయత్యమునన్. 2175

గీ. శ్రద్ధతోడ సాలగ్రామచక్రమందుఁ, బితరులను గూర్చి పిండంబు పెట్టనేని
పితరు లతితృప్తులై కల్పశతముదాఁక, దీవన లొసంగు చుందురు త్రిదివమందు.

క. రేవయు జాహ్నవియును గో, దావరియును మఱియు ముక్తిదము లైననదుల్
ప్రోవయి సాలగ్రామ, గ్రావాంబుకణంబులందుఁ గలవడి యుండున్. 2177

క. సాలగ్రామశిలాంబువుఁ, గ్రోలినతీర్థంబు లేదు పుడమిని దానిన్
గ్రోలు నెడఁ బంచగవ్యము, లేలా బహుతీర్థయాత్ర లేలా వత్సా. 2178

క. సాలగ్రామజలంబును, గ్రోలినమానవుఁడు మరలఁ గ్రోలఁడు తానే
వేళను మాతృస్తన్యము, వాలాయము విష్ణులోకవాసి యగుటచేన్. 2179

గీ. పురుగు లేని సాలగ్రామమునకుఁ గ్రోశ, మాత్రదూరంబులోపల మ్రండె నేని
దివ్యరూపంబుతోడ వర్తిల్లు విష్ణు, భక్తులను గూడి వైకుంఠభవనమందు. 2180

గీ. ఎచట నుండు సాలగ్రామ మచ్చోటు తీర్థ, మనఁబడును యోజనత్రితయంబువఱకు
నందుఁ జేసెడిదానంబు లందుఁ జేయు, హోమములు గోటిగుణము లై యొప్పు చుండు.

గీ. బ్రాహ్మణునకు సాలగ్రామచక్ర మొకటి, దాన మొసఁగినయుత్తమమానవుండు
శైలవనయుక్తముగను భూచక్ర మెల్ల, ధారవోసినఫలమును దాను జెందు. 2182

గీ. గంధపుష్పాదులను నుతిగానములను, జలిపె నేని సాలగ్రామచక్రపూజ
కల్పకోటిసహస్రంబు గడచువఱకు, మానవుం డుండు వైకుంఠమందిరమున. 2183

గీ. భూతలమున సాలగ్రామమును బరీక్ష, సేసినను వెల నిర్ణయించినను విక్ర
యించినను గొన్న వారల కెల్లరకును, గలుగు యమలోకవాస మాకల్పముగను.

క. ఏకాదశి గోవిందున, కాకాంక్షిత మైనదివస మాదివసమునన్
జేకూరినయుపవాసము, వైకుంఠంబునకు మెట్లు వరుసగఁ గట్టున్. 2185

క. లేదు త్రిలోకములను నే, కాదశితోఁ బోలునది యొకండును నఘసం
భేదనమునఁ బావనతా, పాదనమున నరకభయవిపాటనమందున్. 2186

క. ఒకయేకాదశి నైనను, నొకపక్షంబునకు నేని యెవఁ డుపవాసం
బొకతఱిఁ జేయఁడొ వానికిఁ, దకపికలాడెదరు దండధరునినియోజ్యుల్ 2187

క. ఎంతవఱకుఁ జేయరొ దై, త్యాంతకశుభవాసరంబున దుపవాసం
బంతవఱకు దేహమునం, దంతటనున్ నిండి యుండు నంహోరాసుల్. 2188

గీ. వాజిమేధసహస్రముల్ రాజసూయ, శతములును గూడ హరిదివసమునఁ జలుపు
నట్టియుపవాసమున షోడశాంశమునకు, నైన సామ్యంబు వడయ నర్హములు గావు.

క. ఏకాదశ్యుపవాసం, బేకాదశవిషయసమితి నేర్పడినయఘా
నీకమును జండభానుఁడు, చీకట్లను బోలెఁ జీల్చి చెండాడుఁ జుమీ. 2190

క. హరివాసరోపవాసము, కరుణించును సాధ్వి యైనకాంతను నాయుః
పరిపూర్ణు లైనసుతులను, నరోగము దివముఁ దుదకు నపవర్గంబున్. 2191

క. హరివాసరంబునకుఁ బు, ష్కరమును గంగయును గయయుఁ గాశియు మఱియున్
దురితాపహారకము లగు, సరిత్తులును క్షేత్రములును సరిగావు సుమీ. 2192

గీ. హరిదినంబున నుపవాస మాచరించి, రేయి జాగరణము నొనరించె నేని
యతఁడు పితృమాతృదారాన్వయములలోన, నొకటిలుపదితరములవారి నుద్ధరించు.

గీ. వార్ధకంబునఁ గాని యౌవనమునందుఁ, గాని శైశవమునయందుఁ గాని విష్ణు
వాసరంబునయం దుపవాస మున్న, వారు చూడరు యమపురద్వారములను.

గీ. హరిదినమున నుపవసించినట్టివారు, ద్వంద్వసంగంబు విడనాడి తార్క్ష్యకేత
నములు మాలలు పీతవస్త్రములుఁ దాల్చి, తరలిపోదురు వైకుంఠధామమునకు.

గీ. తీర్థమజ్జనమును గాని త్రిదివసంబు, లనశనము గాని కావించి హేమతిలలు
గోవులును దానమిచ్చినపావనులకు, శాశ్వతస్వర్గలోకవాసంబు గలుగు. 2196

క. స్నానము దపమును గాంచన, దానంబును దీర్థమున యథాశక్తిగ నే
మానవుఁడు సేయకుండునొ, వానికిఁ జెడు నిహము పరము వైశ్యతనూజా. 2197

క. కావించినదానంబును, గావించినతపముఁ దెలుపఁగారాదు సుమీ
యేవేళ నైన స్వర్గము, కావలయు న టన్న వాంఛ గలిగినవారల్. 2198

గీ. పాదుకలొ వస్త్రములొ యాతపత్త్రకములొ
పత్త్రమో మూలమో లేక ఫలమొ జలమొ
యిచ్చు చుండంగవలెఁ గాని యెన్నఁ డేని
వంధ్యము గఁ జేయఁగూడదు వాసరంబు. 2199

గీ. శక్తికొలఁదిని దానంబు సలుపవలయు, ననుదినము నెంత లేనివాఁ డైనఁ గాని
యిహపరంబులలోపల నెచట నేని, పెట్టినను బుట్టుఁ బుట్టదు పెట్ట కున్న. 2200

వ. ఒక్కయశ్వత్థవృక్షంబును నొక్కనింబవృక్షంబును నొక్క వటవృక్షంబును నొక్కకపిత్థ
వృక్షంబును నొక్కబిల్వవృక్షంబును నొక్కయామలకవృక్షంబును నైదు చూతవృక్షం
బులును బది తింత్రిణీవృక్షంబులును నొక్కకూపంబును నారామంబుగా స్థాపించినవారు
శాశ్వతస్వర్గలోకనివాసంబు వడయుదురు. 2201

క. ఫలములచేతను బత్త్రం, బులచేఁ బుష్పములచేత మూలంబులచేఁ
జలుపుదురు సురలకును బి త, రులకును నతిథులకు భూసురులకును దృప్తిన్. 2202

క. కావున నలువురు నడిచెడి, త్రోవలచెంతలను భూమిరుహారోపణముం
గావించెడిపుణ్యాత్ములు, గావించినవారె పుణ్యకర్మము లెల్లన్. 2203

గీ. ఆతపక్లాంతు లైనట్టిచేతనులకు, నాశ్రయము లేక తిరుగువిహంగములకు
నాశ్రయములును బుష్పఫలాఢ్యములును, నగుకుజంబుల నజుకుదు రల్పమతులు.

క. వారలకును నవ్వారినిఁ, బ్రేరేచెడువారలకును బిత్రుపతి సేయున్
రౌరవము ఘోరనరకా, గారంబునఁ గాలదండఘాతంబులచేన్. 2205

క. తులసీవృక్షం బుండిన, నిలయము కనఁబడిన నచట నిలువక భీతిన్
గలఁగుచును బాఱిపోదురు, పులిఁ గాంచినహరిణగణముపోలె యమభటుల్. 2206

క. తులసీవనరోపణమున్, జలిపినఁ దత్పత్త్రబీజసంతతిసంఖ్యం
బొలిచెడివర్షసహస్రం, బులు వసియించెదరు స్వర్గభువనమునందున్. 2207

క. తులసీగంధము ఘ్రాణం, బులకున్ సోఁకినను హర్షపూరితచిత్తం
బులతోడఁ దార్క్ష్యవాహన, ములపై వైకుంఠమునకుఁ బోదురు పితరుల్. 2208

క. పలుకుదురు సమంబులుగా, నిలలో మూఁటిని మహాత్ము లెల్లరు గంగా
సలిలస్నానము తులసీ, దళసంస్పర్శమును నర్మదాదర్శనమున్. 2209

గీ. త్రికరణములను బ్రాణు లార్జించికొన్న, పాపముల నెల్లఁ గావించు భస్మముగను
స్థాపనమునను సేకసంస్పర్శములను, బోషణమునను దర్శనంబునను దులసి. 2210

వ. ప్రతిపక్షంబునను ద్వాదశినాఁడు బ్రహ్మాదిదేవత లెల్లరును దులసీపూజ గావించు
చుందురు. కావున నానాఁడు తులసీదళచ్ఛేదంబు గావింపం జనదు. 2211

క. కలధౌతరత్నముక్తా, ఫలముఖదానములు పేరువడినను దులసీ
దళదానంబునషోడశ, కళకును సరిగావు చక్కఁగాఁ గనుఁగొన్నన్. 2212

గీ. పుష్కరాదిమహాతీర్థములును బ్రదపథ, గాదిపుణ్యనదీసమూహమును వాసు
దేవుఁ డాదిగఁ గలముఖ్యదేవతలును, నధివసింతురు తులసీదళాంతరమున. 2213

క. హరిహరులను దులసీమం, జరులను బూజించునట్టిజనులు నిజకళే
బరములు విడిచినపిమ్మట, మరలఁ జనరు మాతృగర్భమందిరములకున్. 2214

ఆ. ఆమ్రతరుసహస్ర మశ్వత్థశతమును, నిలిపినట్టిభూరిఫలము గలుగు
నిలిపె నేని యొక్కతులసీద్రుమంబును, దానిమహిమ మేమొ దైవ మెఱుఁగు.

క. శివపంచాక్షరిజపమును, శివలింగస్థాపనమును శివపూజయు ను
ద్యమముఁ దొలఁగించి ప్రాణుల, శివలోకమునందు నిల్పఁ జెడ కుండంగన్. 2216

గీ. సత్యమును ద్యాగమును రూపసంపదయును
శూరతయును సౌభాగ్యంబుఁ గీర్తియును
వక్తృతయు నను నేమను వసుధలోన
ఫలములుగ శివపూజ కేర్పఱుపఁబడియె. 2217

సీ. మాధవునకు దైత్యమర్దనంబును సృష్టి, కర్తృత్వము హిరణ్యగర్భునకును
బలికర్ణులకు దానపరవశత్వంబును, శౌర్యసంపద కార్తవీర్యునకును
ధనసమృద్ధియుఁ గుబేరునకు నర్జునునకు, జయమును ధ్రువున కుచ్చైఃపదంబు
మరుదాత్మజున కబ్ధితరణసామర్థ్యంబు, వాచస్పతికి మహావాగ్మితయును

గీ. ద్రౌపదికి సుపతిత్వంబు బ్రహ్మవర్చ, సము వసిష్ఠున కబ్ధిపానమును గుంభ
భవునకును రామునకు సేతుబంధనంబు, సంఘటిల్లుట శంభుపూజాఫలంబు. 2218

క. సకలాఘములును దొలఁగఁగ, సకలైశ్వర్యములు గలుగ శాంభవలింగా
ర్చకు సమ మగుపుణ్యము లే, దొకటియు ముల్లోకములను నూరుజతనయా. 2219

గీ. భక్తితోడను గాని దంభమునఁ గాని, కామమునఁ గాని మఱి యేప్రకారమునను
గాని శివపూజ గావించుమానవుండు, కనఁడు యమలోకమును గడకంట నైన.

గీ. మంత్రసహితంబుగను నేని మంత్రరహిత, ముగను నేనియు శివలింగమునను బుష్ప
మైనఁ బత్త్రంబు నైనఁ దోయంబు నైన, నుంచునాతండు కులకోటి నుద్ధరించు.

క. శివపూజలు సేయుచుఁ గే, శవునిపయిన్ ద్వేష మూనుజనుఁ డెవఁ డైనన్
దవులువడి రౌరవంబున, నివలకుఁ జేరఁడు చతుర్దశేంద్రులవఱకున్. 2222

క. శివుఁడును హరియును బ్రహ్మయు, నివసింపఁగ నాలయములు నెలకొల్పినమా
నవులు వసింతురు తత్త, ద్భువనంబులయందుఁ గల్పములుగల్పములన్. 2223

గీ. దంశపదమాత్ర మైనను దాఁకరాదు, శివధనము దానిచేతను జీవయాత్ర
గడపికొనుమానవులు కల్పకల్పములును, సొమ్మసిలు చుండెదరు కాలసూత్రమందు.

గీ. మార్గములయందు విశ్రాంతిమందిరములు, ధర్మశాలలు నెలకొల్పుధార్మికులకు
నెలవు గోబ్రాహ్మణులకును నెలవుకొలుపు, మాన్యులకు వాసగృహ మింద్రమందిరంబ.

గీ. జీర్ణదేవాలయంబులు జీర్ణవిప్ర, మందిరంబులు జీర్ణగోమందిరములు
జీర్ణధర్మగృహంబులు సేసె నేని, యుద్ధృతములుగ వాఁ డొందు నూర్ధ్వపదము.

క. యతిమఠములు నెలకొలిపిన, మతిమంతులు మరల గర్భమందిరమరవ
స్థితిపాలఁ బడరు వారలు, మృతు లైనను నున్నవారె మేదినిలోనన్. 2227

క. యతు లుండెడిమఠముల కధి, పతి యగువాఁ డఖిలకర్మబాహ్యుం డగు నా
పతితున కేనాఁటికినిన్, గృతికృత్యత లేదు స్వకృతకృత్యమువలనన్. 2228

క. ఫల మైనఁ బుష్ప మైనను, జల మైనను బత్ర మైన సంప్రాప్తింపన్
గలిగినను జాలు యతిధన, మలమట గుడుపంగ నరకయాతనలందున్. 2229

క. మతి గలిగెనేని రౌరవ, పతితునిఁగాఁ జేయఁ బుత్రపశుబాంధవసం
యుతముగ గోబ్రాహ్మణసుర, యతికార్యములందుఁ జేయ నగు నధిపతిగాన్. 2230

క. హరిహరవిరించిపూజా, పరికరముగఁ బుష్పవనము పాదుకొలుపు స
త్పురుషులు విహరింతురు ని, ర్జరలోకమునందుఁ బారిజాతచ్ఛాయన్. 2231

క. పితృదేవాతిథితృప్తిని, సతతముఁ గావించు చుండుసాధువులు ప్రజా
పతిలోకంబునకును నధి, పతు లగుదురు స్వకృతపుణ్యపరిపాకమునన్. 2232

క. వేనిగృహంబున భోజన, పానంబులచేతఁ దృప్తిపడుదురొ యతిథుల్
వానికి నమృతాన్నము స్వ, స్థానంబున దొరకుఁ ద్రిదశసముపంక్తులలోన్. 2233

క. అతిథి యగువాఁడు పూజ్యుఁడు, పతితుఁ డయిన మూర్ఖుఁ డైనఁ బండితుఁ డైనన్
యతి యైన నెవ్వఁ డైనను, నతిథిసమాదరణ మధిక మన్నిటికంటెన్. 2234

గీ. అతిథి తృప్తుఁ డగుచు నరిగినగృహమేధి, యరుగు బ్రహ్మయింటి కతిథి యగుచు
నతిథి విముఖుఁ డగుచు నరిగినగృహమేధి, యరుగు యమునియింటి కతిథి యగుచు.

ఆ. అతిథి వచ్చి యన్న మడిగినప్పుడు లేదు, పొమ్మ టన్న నతఁడు పోవునపుడు
కొనుచుఁ బోవు గేస్తు జననంబు మొదలుగాఁ, బొదుపుచేసికొన్నపుణ్య మెల్ల 2236

క. అతిథిసమం బగుధర్మం, బతిథిసమం బైనబంధు వతిథిసమం బౌ
హిత మతిథిసమం బగుస్వా, పతేయమును లేదు నిజము పరికింపంగన్. 2237

వ. ఆతిథ్యప్రభావంబునంజేసి ఋషులును రాజులును బ్రహ్మలోకంబునం దిప్పటికిని భం
గంబు లే కున్నవారు. 2238

గీ. దంభమున నేనియును బ్రమాదమున నేని, జన్మమధ్యంబునం దొక్కసారి యైన
నతిథి కన్నంబు వెట్టినయట్టివాఁడు, కాలభటులకుఁ గల నైనఁ గానరాఁడు. 2239

గీ. అన్నదానంబు గావించినట్టివాఁడు, స్వర్గముననుండి చ్యుతుఁ డైన వసుధలోనఁ
బుట్టి యుత్తరకురుదేశములను జక్ర, వర్తి యగు సర్వభారతవర్షమునకు. 2240
గీ. స్థలజలచరంబు లగునెల్లజంతువులకు, నన్నగతములు ప్రాణము లగుటఁజేసి
యన్నదానంబు గావించినట్టివాఁడె, ప్రాణదానంబు గావించినట్టివాఁడు. 2241
సీ. పుణ్యంబు క్షీణించిపోవ స్వర్గమునుండి, ధరణిపైఁ బడుచుండుతరుణమందుఁ
గేసరిధ్వజుఁ డనుక్షితివరేణ్యునిఁ జూచి, వాత్సల్యమునను వైవస్వతుండు
రాజేంద్ర మరల స్వర్గమునకు నేఁగంగఁ, గలదేని మదిలోనఁ గాంక్ష నీకు
నన్నదానము చేయు మన్నదానము చేయు, మన్నదానము చేయు మనుచుఁ బలికె
గీ. యమునిముఖముననుండి ప్రత్యక్షముగను, వీనులారంగ నామాట వింటి నేను
గాన లేదు జగంబులలోన నన్న, దానమునకు సమం బైనదాన మొండు. 2242
గీ. కాలపురి కేఁగుటకు భీతి గలిగె నేని, సలిలదానంబు వలయు గ్రీష్మమునఁ జేయఁ
దగును హేమంతమున సమిద్దాన మొసఁగ, సతతమును నన్నదానంబు సలుపవలయు.
వ. జ్ఞానంబువలనను నజ్ఞానంబువలనను జేయంబడు చుండు మహాపాతకంబులకును క్షుద్ర
పాతకంబులకును మాసషట్కంబున కొక్కపరి యథ్యుక్తం బగుప్రాయశ్చిత్తముం జేసి
కొనువాఁడు నిర్ధూతపాపుఁ డగుటంజేసి దేవగంధర్వాదిసేవితంబు లగుపుణ్యలోకంబు
లం బొందువాఁడు. ప్రాయశ్చిత్తహీనుఁడు యమలోకముఁ బొందువాఁడు. 2244
క. గాయత్రీజప మెపుడును, జేయుచు నుండెడిద్విజుండు చెందును గడకన్
ధ్యేయైక్య మితరమనువులు, గాయత్రీమంత్రమునకుఁ గావు సమంబుల్. 2245
క. వైదికమంత్రజపంబును, వేదాధ్యయనమును సకలాఘనరాశులన్
భేదించు భిదుర మద్రుల, భేదించినకరణిఁ గలుషభేదక మగుటన్. 2246
క. సాయంప్రాతర్హవనము, గాయికమానసికవాచికము లగువ్రతముల్
చేయుచు నుండెడివారికిఁ, జేయెత్తిన నందు దివము సిద్ధులు వారల్. 2247
క. తెలిపెదను వినుము తుదకుం, గలమాటను సర్వదేశకాలములందున్
గలుగును నరక మధర్మము, వలనను ధర్మంబువలన స్వర్గము గలుగున్. 2248
క. కావున బాల్యము మొదలుగఁ, గావింపఁగవలయు ధర్మకార్యము లెపుడున్
గావింపరా దుపేక్షను, నేవేళకు నేమి యగునొ యెవ్వఁ డెఱుంగున్. 2249
గీ. చెప్పినాఁడను నీకు సంక్షేపముగను, సుగతియును దుర్గతియుఁ గల్గుసుకృతదురిత
కర్మములు కొన్ని వినఁ గాంక్ష గలిగె నేని, యింకను వచింతు నన నాతఁ డిట్టు లనియె.
క. దేవా నీవు వచించిన, పావనధర్మములు చిత్తపరితాపంబున్
బోవెలుచు నఘహారంబులు, గావే సాధువులనుడులు గంగాంబువులున్. 2251
గీ. ఉచిత మగుమాట చెప్పుట యుపకృతులను, జలుపుటయు సాధువులకు నైసర్గికంబ
యమృతకరుఁ డైనవిధుఁడు చేయంగఁబడెనె, శీతలుండుగ నెవ్వనిచేతనైన. 2252

గీ. స్వామి నామీఁద నొలయువాత్సల్యమునను, దెలిపితివి మంచిమాటలు తేటపడఁగ
నరకముననుండి నాసహోదరున కింక, నెట్టు లుద్ధృతి గలుగునో యెఱుఁగఁ జెపుమ.

—: అతిథ్య మహిమము :—

చ. అనవుడు దేవదూత క్షణ మాత్మను ధ్యాన మొనర్చి సర్వముం
గనుఁగొని యిట్లు పల్కె ననఘా భవదష్టమజన్మపుణ్యముం
గనుకను ధారవోయునెడ నారకలోకమునుండి తత్క్షణం
బుననె భవత్సహోదరుఁడు ముక్తతఁ జెంది దివంబు నొందెడిన్. 2254

గీ. అనుటయును నావికుండలుం డతనిఁ జూచి, స్వామి నాదగునష్టమజన్మ మేదొ
యపుడు నే నొనరించినయట్టిపుణ్య, మెట్టిదియొ నాకు దయతోడ నెఱుఁగఁ జెపుమ.

వ. అని యడుగుటయు దేవదూత వికుండలున కిట్లనియె. 2256

క. మును మధువనంబునను శా, కుని యను బ్రహ్మర్షి గలఁ డొకం డతఁడు నిజాం
గన యగురేవతియందున్, గనియెను నవపుత్రకులను గ్రహములఁబోలెన్. 2257

క. వారలలో జ్యోతిష్మ, త్తారధ్రువశాలిబుధులు దారలఁగూడన్
జేరుకొని యుండి రగ్నుల, నారాధించుచును శ్రితగృహస్థాశ్రము లై. 2258

వ. నిర్మోహజితకామధ్యానకాష్ఠగుణాధికు లనువీఁగిలినయల్వురును వైరాగ్యంబు నవలంబించి సర్వసంగపరిత్యాగంబు గావించి తురీయాశ్రమంబు నాసాదించి బ్రహ్మజ్ఞానసంపన్ను లై క్రియారహితు లై యసంశయు లై నిరాశు లై నిష్పరిగ్రహు లై లోష్టాశ్మకాంచనంబుల సమానంబుగాఁ దిలకించుచు నప్రయత్నప్రాప్తం బగుదానం బరితుష్టిం జెందుచు జితనిద్రాహారు లై శీతవాతాతపములను సహించుచు ననవరతంబును నాత్మనిష్ఠాగరిష్ఠు లై చరాచరం బగుజగం బంతయును విష్ణుమయంబుగాఁ జూచుచు మౌనంబు వహియించి గ్రామైకరాత్రంబుగా భూతలం బంతయుం ద్రిమ్మరుచు మధ్యాహ్నకాలం బగుట క్షుత్పిపాసోపశాంతికొఱకుఁ బూర్వ మష్టమజన్మంబున విప్రుండ వై సతీసుతసమేతంబుగా మార్గమధ్యంబునం దొక్కగ్రామంబునం దుండునీగృహంబునకు వచ్చుటయు నీవు భక్తిభావంబున లేచి యెదురుగా నేఁగి. 2259

గీ. వారలకుఁ జేసి సాష్టాంగవందనంబు, మానసంబున హర్షసంభ్రమము లొదవ
నయనములనుండి యశ్రుసంతతులు దొరలఁ, గంఠకుహరంబులోన గాద్గద్య మొనయ.

సీ. చరితార్థ మయ్యె నాజపతపంబులు నేఁడు, మహిమంబు గాంచె నాగృహము నేఁడు
లోకోత్తరం బయ్యె నాకుటుంబము నేఁడు, పావనం బయ్యె నాభవము నేఁడు
గతు లేరుపడియె నాపితరులకును నేఁడు, కృతకృత్య మయ్యె నాశ్రుతము నేఁడు
శౌరి నాయెడలఁ బ్రసన్నుఁ డయ్యెను నేఁడు, స్తవనీయ మయ్యె నాధనము నేఁడు

గీ. ధన్య మయ్యెను నాచరిత్రంబు నేఁడు, భువనమునఁ గల్గె నాకు గౌరవము నేఁడు
పాపముల నన్నిటిని రూపుమాపునట్టె, యుష్మదీయావలోకభాగ్యోదయమున. 2261

గ. అనుచు నుతియించి వారిపాదాంబుజములు, కడిగి తత్తీర్థమును మస్తకమునఁ దాల్చి
పీఠములమీఁదఁ గూర్చుండఁబెట్టి పూజ, సలిపి వారికి సకలోపచారములను. 2262

గీ. షడ్రసోపేత మైనభోజనము వెట్టి, తృప్తి గావించుటనుజేసి తృప్తి నొంది
బ్రహ్మరసమగ్నులగుచు నారాత్రి నీదు, సదనమునయంద వారు విశ్రాంతు లైరి.

సీ. ప్రాణులు భూతంబులందు శ్రేష్ఠము లందు, శ్రేష్ఠముల్ మతి గలచేతనములు
వానిలో శ్రేష్ఠులు మానవుల్ మానవు, లగువారిలో శ్రేష్ఠు లవనిసురులు
వారలలోన విద్వాంసులు శ్రేష్ఠులు, కృతబుద్ధు లగువారు శ్రేష్ఠు లందు
శ్రేష్ఠులు కర్తలు కృతబుద్ధులందుఁ గ, ర్తలలోన శ్రేష్ఠులు బ్రహ్మవిదులు

గీ. వారలకు నీవు భక్తిభావమున నాఁడు, చేసినట్టియాతిథ్యంబుచేతఁ బ్రాప్త
మైనపుణ్యంబు గణియింప నలవి గాదు, వదనములు వేయి కలిగినవాని కేని. 2264

క. గృహమేధి యైనయాతని, గృహమం దొకరాత్రి యుండె నేని యతి గృహిన్
దహియించెడిపాపములను, దహియించును గాష్ఠములను దహనము వోలెన్. 2265

గీ. బ్రహ్మవిదుఁ డేగృహస్థునిభవనమందు, హర్షమున నుండు నొకత్రుటి యాగృహస్థుఁ
డపునరావృత్తిగను నుండు నెపుడుఁ గూడ, శాశ్వతం బైన వైకుంఠసదనమందు.

క. కావున భవదష్టమజ, న్మావాప్తం బైనపుణ్య మయ్యెనె తెలియన్
నావుడు వికుండలుఁడు ముద, మావహిలఁగ ధారవోసె నాసుకృతంబున్. 2267

క. అంతట శ్రీకుండలుఁ డ, త్యంతరయంబునను వచ్చె నంతకలోకా
భ్యంతరమునుండి విధుఁడు వి, ధుంతుదవక్త్రముననుండి తోతెంచినట్టుల్. 2268

ఆ. అప్పు డన్నదమ్ము లన్యోన్యమును నశ్రు, కణము లొలుకుచుండఁ గౌఁగిలించు
కొని క్షణంబు చేష్టలను దక్కి యుండిరి, ప్రేమబంధ మోత్రపినులనిదయొ. 2269

ఆ. అంతఁ బుష్పవర్ష మాకసముననుండి, కురియ వారు మిగులఁగుతుకమునను
దేవభటుఁడు దమకుఁ గావించినప్రియంబు, చాటుకొనుచుఁ జనిరి స్వర్గమునకు. 2270

క. ఈయితిహాసము మానవ, నాయక వినినను బఠించినను ధేనువులన్
వేయిటిని దాన మొసఁగిన, శ్రేయము సులభముగఁ బడయు క్షితి నెవఁ డేనిన్.

గీ. మాఘమాసవిశేషంబు మఱియుఁ గొంత, వినిచెదను నీకు వినుము పృథ్వీవరేణ్య
మాసములలోన శ్రేష్ఠంబు మాఘమాస, మఖిలకర్మంబులకుఁగూడ నర్హ మగుట.

సీ. సర్వదేశములందు సలిలంబు సంప్రోక్త, మగుటను నారాయణాత్మకముగ
మకరస్థుఁ డై రవి మాఘమం దుండ గో, ష్పద మంతమేఘపుష్పమున నేని
యొదవనియెడ శక్తి త్రిదినంబు లేనియు, స్నానంబు సేసిన స్వర్గ మొదవు
ఫలవిశేషంబుపైఁ గలిగినయెడఁ గోర్కి, సలుపంగ నగు బహుస్నానములను

గీ. సతిలఘృతహోమమును నన్నసలిలవసన, ధరణిగోస్వర్ణగృహధనధాన్యముఖ్య
దానము లఖండదీపసంస్థాపనమును, మాధవునకుఁ ద్రికాలసమర్చనమును. 2273

గీ. అగు నొనర్పంగ మాఘమాసాంతమందు, హరిదినంబునఁబోలె నుద్యాపనంబు
విప్రసంతర్పణంబును విష్ణుపురము, నందు శాశ్వతముగ నుండ నాస యున్న. 2274

వ. మాఘమాసంబునఁ గూపస్నానంబు ద్వాదశాబ్దఫలప్రదంబుగను దటాకస్నానంబు తద్ద్విగుణఫలప్రదంబుగను నదీస్నానంబు తచ్చతుర్గుణఫలప్రదంబుగను దేవఖాతస్నానంబు తద్దశగుణఫలప్రదంబుగను మహానదీస్నానంబు తచ్ఛతగుణఫలప్రదంబుగను మహానదీసంగమస్నానంబు ద్విశతగుణఫలప్రదంబుగను గంగాస్నానంబు సహస్రగుణఫలప్రదంబుగను గంగాయమునాసరస్వతీసంగమస్నానంబు లక్షగుణఫలప్రదంబుగను జెప్పంబడియె.

గీ. ప్రతిదినంబును వృషసహస్రము సహస్ర, హైమనిష్కములును గపిలాయుతమును
భూసురున కిచ్చినఫలంబుఁ బొందు మాఘ, మున సితాసితజలమున మునిఁగి నరుఁడు.

ఆ. ప్రజలఘోరపాపరాసుల దహియింప, సృష్టిచేసె బ్రహ్మ యిలఁ బ్రయాగ
మనెడితీర్థరాజమును దాని సేవించి, మాఘమందు ముక్తి మనుజుఁ డొందు. 2277

ఆ. పంకజాసనుండు బ్రహ్మలోకమునకు, మార్గముగ సృజించె మహిని మున్న
దివ్య మగుసరస్వతీగర్భితసితాసి, తాంబుధార సురల కిచ్చెరువుగ. 2278

గీ. గాంగసలిలంబునను బ్రయాగంబునందు, స్నాతు లగువారు మాఘమాసంబులోన
నాకముననుండి ధరణికి నాల్గువేల, యుగము లగునంతవఱకును దిగరు సూవె. 2279

సీ. అశ్వమేధంబు నే నాచరించినవాఁడ, నని గర్వ మొందకు మశ్వమేధి
బ్రహ్మహత్యామహాపాప మేర్పడె నని, భయపడఁ బోకుము బ్రహ్మహంత
మాఘమాసమునందు మకరస్థుఁ డై ప్రభా, కరుఁ డుండ గను బ్రయాగంబునందు
స్నానంబు సేసితి నేని సితాసితాం, భస్సులో నిఁక మదభయము లుడుగు

గీ. నని వచించె విధాత ప్రయాగతీర్థ, మహిమమును బ్రకటింపఁగా మదిఁ దలంచి
యచట మునిఁగినఁ బ్రాప్తించు నమరపురము, తనువు దొఱఁగిన నట నమృతత్వ మొదవు.

సీ. అనశనంబుగ శతహాయనంబులు తపం, బాచరించినవారి కగుఫలంబు
రాజసూయమహాధ్వరసహస్ర మొనరించి, నట్టివారికిఁ గల్గునట్టిఫలము
నభ్యసించిన యోగ మబ్దశతత్రయం, బవికలంబుగఁ బ్రాప్త మగుఫలంబు
కనకభారసహస్రమును రవిగ్రహణవే, ళను బాత్రునకు నొసంగినఫలంబు

గీ. సంఘటిల్లును మాఘమాసంబునందు, స్నానము త్రివేణిలోన దినత్రయంబు
సలుపు నెడలను మానవజాతి కెల్ల, మాసమహిమంబునను దీర్థమహిమమునను.

గీ. సర్వతీర్థంబులును బాపసంగమమున, మలినతను జెందుటను మాఘమాసమందు
ననుసమంబును వచ్చి ప్రయాగమునకు, గంగలో మున్గి పరిశుద్ధిఁ గాంచి యేఁగు.

గీ. సప్తపురములు దమకు సంప్రాప్త మైన, పాపిజనసంగిదోషంబుఁ బాపికొనఁగ
ననుసమంబును వచ్చి ప్రయాగమునకు, గంగలో మున్గుచుండు మాఘంబునందు.

గీ. అమరులకును నజయ్య మైనట్టివిష్ణు, మాయయు సితాసితాంబునిమజ్జనంబు
మాఘమాసంబునను జేయఘూవవాళి, నంటఁ జాలదు సుకృతుల యముఁడువోలె.

గీ. స్నానమును మాఘమాసంబునను బ్రయాగ, మందుఁ జేసిననరుఁడు దేహావసాన
మందుఁ దేజోమయజగంబులందు నొంది, సౌఖ్యముల నెల్లఁ దుదిఁ జేరు శార్ఙ్గిలోన.

ఆ. మకరగతుఁడు గాఁగ మార్తాండుఁడు ప్రయాగ, మున సితాసితాంబువులను స్పృశించి
రేని వారిపుణ్య మింతింత యని వ్రాసి, కొనఁగలేఁడు చిత్రగుప్తుఁ డేని. 2286

క. త్రికరణకృత మగుపాపము, సకలంబు నశించు నొక్కసారి ప్రయాగో
దకమున మునిఁగిన సూర్యుఁడు, మకరమునం దుండ మాఘమాసమునందున్. 2287

ఆ. మునిఁగె నేని త్రిదినములు ప్రయాగంబున, మాఘమాసమున నిజాఘ మెల్ల
వదలి వదలినట్లు వ్యాళంబు కుబుసము, నేఁగు ద్రిదివమునకు నెవ్వఁ డేని. 2288

గీ. జహ్నుతనయా యమస్వసృసంగమమున
శ్లాఘ్యతమ మైనమాఘమాసంబునందు
నఖిలఋషులును నరువదియాఱువేల
తీర్థములుఁ జేరుటయుఁ దటస్థించు భూప.

ఆ. జన్మజన్మమునను సర్గాదినుండియు, గడన సేసినట్టికలుష మెల్లఁ
బాసిపోవు మాఘమాసంబునఁ బ్రయాగ, మందుఁ జేయుత్రిదివసాప్లవమున. 2290

వ. గంగ యెచ్చట నున్నను పావనత్వంబునఁ గురుక్షేత్రతుల్యంబు. దానికంటెను వింధ్య
సంగత యగుగంగ దశగుణాధికంబు. దానికంటెను గాశిలో నుత్తరవాహిని యగు
గంగ శతగుణాధికంబు. దానికంటెను యమునాసంగత యగుగంగ శతగుణాధికంబు.
దానికంటెను బ్రయాగంబునందుఁ బశ్చిమవాహిని యై కాళిందీ సరస్వతులం గూడం
గూడిన గంగ సహస్రగుణాధికంబు. అయ్యది త్రివేణి యనుపేరం బరగు. 2291

సీ. ఆది మాఘమాసమం దమృత మై యుండుట, స్రష్టయు విష్ణువు శంకరుఁడును
రుద్రు లాదిత్యులు రుద్రగణంబులు, దిక్పాలురు సమస్తదేవతలును
బ్రహ్మాణియును నపర్ణయును లక్ష్మియు దేవ, తాంగనామణులును నచ్చరలును
యక్షగంధర్వవిద్యాధరాదిసమస్త, దేవయోనులు పితృదేవతలును

గీ. నందులోపల మునుఁగుదు రన్వహమును, కృతయుగంబునఁ బ్రకటశరీరులు గను
గలియుగంబునఁ బ్రచ్ఛన్నకాయులుగను, దానిమహిమంబు నెన్న నాతరము గాదు.

గీ. అశ్వమేధసహస్రంబు నాచరింప, నేర్పడినసుకృతంబును నీడు గాదు
త్రిదినములు మాఘమునయందుఁ దీర్థరాజ, మునను స్నానం బొనర్చినపుణ్యమునకు.

క. దీనికి దృష్టాంతంబుగ, నే నొకయితిహాస మిపుడు నీకు వచింతున్
భూనాథ దాని వినుటనె, నానాపాపౌఘములు వినాశము నొందున్. 2294

—: కాంచనమాలినీచరిత్రకథనము :—

సీ. ఒక్కదినంబున నొకయప్సరఃకాంత, యభ్రమార్గంబున నరుగుచుండ
రక్కసుం డొక్కఁ డారాజాస్య నొడిసిప, ట్టఁగ నెంచి హిమగిరి డాఁగియుండఁ

బడియె నాదైత్యునియొడలిపైనిఁ దదార్ద్ర, వస్త్రతోయకణంబు వాయుహతిని
నంతట రాక్షసుం డత్యద్భుతంబుగా, నాత్మమనశ్శాంతి యావహిల్ల
గీ. వినయమునఁ బిల్చి యావధూటిని లతాంగి, యెవ్వతెవు నీవు నీయాఖ్య యేమి యెటకు
నేఁగుచుండితి వెటనుండి హేతు వేమి, యార్ద్రముగ నుండ నీకబర్యంబరములు.
క. నీయొద్దనుండి వచ్చిన, తోయకణంబున మదాత్మదోషం బెల్లన్
మాయ మయి పోయె నీ క, త్తోయకణం బెట్టిదోట దొరకెనొ చెపుమా. 2296
క. తావకరూపము గనుఁగొనఁ, బావనశీలవుగఁ గానఁబడితివి నాకున్
దేవవధూమణి సకరుణ, భావంబునఁ జెపుము నీప్రభావము నెల్లన్. 2297
సీ. అని వేఁడుటయును నిట్లనియె నయ్యప్సరః, కాంతాలలామంబు కరుణతోడ
రాక్షస నే నప్సరసను బిల్తురు నన్నుఁ, గాంచనమాలిని యంచు సురలు
చనుచుంటిఁ గైలాసమునకుఁ బ్రయాగము, నందు మాఘస్నాన మాచరించి
తద్గాంగజలముచేతను మామకాంబర, ధమ్మిల్లములును నార్ద్రంబు లయ్యెఁ
గీ. దజ్జలకణంబు పడుట నీతనువునందు, సమసి రాక్షసగుణములు శాంతి యొదవె
నింక వినిచెద నాగాథ యెల్ల వినుము, తత్ప్రభావంబు దెలియు నద్దాన నీకు. 2298
సీ. పూర్వమందుఁ గళింగభూపతి కుంపుడు, కత్తెనై నేను భోగముల నెల్ల
ననుభవించుచు ధనయౌవనసౌందర్య, మదములచే నన్యమానినులను
బరిభవించుచు నన్యపురుషసాంగత్యంబు, సలుపుచుఁ బన్నుచు జాలములను
నార్జించి మితి లేనియర్థంబు తుదకు వా, ర్ధకము ప్రాప్తించినతరుణమందుఁ
గీ. జేసి పాపము లెల్ల నార్జించినట్టి, ధనమునకు సార్థకత రవంతయును గాన
రామిఁ జింతించి చింతించి రాజగురుని, కడకు నొకనాఁడు పోయి నాకథను వినిచి.
ఆ. కన్నునీరు గాఱఁ గాల్వలుగను నేడ్చి, పాపపంకమందుఁ బడిననన్ను
గట్టుఁజేర్ప నీవె గతి యని యిరుగేలఁ, బట్టికొంటి నతనిపాదములను. 2300
ఉ. అంతట నమ్మహాత్ముఁడు గృపాన్వితమానసుఁడై వరాకి నీ
కింతట నైన బుద్ధి జనియించెను బాపవిశుద్ధి నొందఁగా
సంతస మయ్యె నీదురితసంచయముం దొలఁగింప లేదు పు
ణ్యాంతర మేది యేనియుఁ బ్రయాగనిమజ్జన మొందు దక్కఁగన్. 2301
ఆ. ఆనిమజ్జనంబు ప్రాప్తించునెడ మాఘ, మాసమందు రూపుమాపి సకల
దురితములను నిలుపు నిరపాయముగ నమ, రాలయమున స్నాతులైనజనుల.

—: ఇంద్రశాపమోక్షవృత్తాంతకథనము :—

సీ. మున్ను శక్రుఁడు గౌతమునిభార్య యగునహ, ల్యను బొంది మోహాంధ్య మావరింప
గౌతమశప్తుఁడై కాయ మెల్ల సహస్ర, భగచిహ్నితము గాఁగఁ బరితపించి

తల యెత్తికొన లేక నలువురిలోపలఁ, జేసినకార్యంబు సిగ్గుపఱుప
మేరుమహీధ్రకాసారసితాంభోజ, కుట్మలంబునఁ జొచ్చి గోప్యముగను
గీ. దనకుఁ గల్గినయవివేకమును మనోజ, దార్ష్ట్యమును స్వకృతాపరాధమును సారె
సారె గర్హించుకొనుచును జావకయును, జచ్చినట్టులె కాలముఁ బుచ్చుచుండె. 2303

సీ. అంతట దేవత లందఱు శక్రుండు, కానరామిని భీతి గడలుకొనఁగ
నాంగిరసునికడ కరిగి సురాచార్య, శక్రుఁడు లేఁడాయె స్వర్గమందుఁ
గొమరుఁడు లేనివంశమువోలె శోభిల్ల, దాయె నింద్రుఁడు లేనియమరపురము
కావింపవలసినకార్య మేదియొ యింక, నతిశీఘ్రముగఁ దగు నాచరింప
గీ. నని నివేదించుటయు విని యాంగిరసుఁడు, తెలిసికొని సర్వమును దివ్యదృష్టిచేత
నాట మంతటిదురవస్థ యామతిల్లె, నింద్రునకుఁ గామమున నొడ లెఱుఁగ కునికి.

క. గౌతమునిభార్య యఁట పురు, హూతుండఁట యెంతమాట యొరులిది విన్నన్
ఖ్యాతికి నీతికి భూతికి, నైతిహ్యంబునకుఁ గూడ హానియె కాదే. 2305

ఆ. ఏమి చేయవచ్చు నింతకుఁ గర్మంబు, గడవరాని దగుట మడుకుపడియె
నింద్రుఁ డనఁగ బుద్ధిహీనుఁడె యవివేక, లాచరించుపనుల కగ్గపడఁగ. 2306

క. అని కొంతతడవు విధికృతి, మునకు విచారించి చిత్తమున గురు నగుటన్
జని యింద్రుఁ డున్నచోటికి, ననిమిషు లెల్లరును వెంట నరుదేరంగన్. 2307

ఆ. దేవరాజ బయలుదేఱుము శీఘ్రంబ, నీవు లేనిదివము నిష్ప్రభంబు
భాసిలునె దినంబు భానుఁడు లేకున్న, విధుఁడు లేక రాత్రి వెలుఁగఁగలదె. 2308

క. అని పెక్కు-తెఱఁగులను నుతి, యొనరింపఁగఁ బద్మకుట్మలోదరభాగం
బున నుండి విక్కృతరూపం, బున నింద్రుఁడు వచ్చి వెలికి ముకుళితముఖుఁ డై. 2309

క. అమరాచార్యునిపదయు, గ్మముపైఁ బడి స్వామి నేను గావించినపా
పమునకు నిష్కృతి యున్నదె, సమకూరునె యింకఁ జిత్తసౌఖ్యము నాకున్. 2310

క. అని విలపించుటయును నపు, డనిమిషగురుఁ డిట్టు లనియె నమరాధిప నీ
యొనరించినఘోరాఘం, బును బాపఁగ నొకయుపాయమును వచియింతున్. 2311

ఆ. నీయదృష్టమునను నేఁడె మాఘము వచ్చె, నరిగి శీఘ్రముగఁ బ్రయాగమునకు
నటఁ ద్రివేణిలోన నాచరింపుము స్నాన, మఘవిముక్తి యొదవు నాక్షణంబ. 2312

సీ. అని వచింపఁగ నింద్రుఁ డనిమిషాచార్యుని, తోడను గూడి సంతోషమునను
జనుదెంచి శీఘ్రంబుగను బ్రయాగమునక, చ్చటఁ ద్రివేణీపుణ్యసలిలమందు
మునిఁగి ఘోరాఘవిముక్తుఁ డై భాసిల్లె, ఘనముక్తుఁ డైనభాస్కరుఁడువోలె
నపుడు బృహస్పతి యధికదీప్తిని వెల్గు, నమరనాథునిఁ జూచి హర్షమునను
గీ. గాయమున నాతనికి నున్నవేయియోను, లీక్షణసహస్ర మగునట్టు లిచ్చె వరము
నంతటను వేయికనులతో నలరె వజ్రి, యబ్జములతోడ మానసహ్రదమువోలె. 2313

క. సురలును మునులును నప్పుడు, పరివేష్టింపంగ వజ్రపాణి గురుపుర
స్సరముగఁ ద్రివిష్టపమునకు, నరిగి స్వసింహాసనమున నధ్యాసించెన్. 2314

సీ. కావున నీవు శీఘ్రంబుగ మాఘమా, సమునఁ బ్రయాగతీర్థమున కరిగి
యచ్చట శ్రద్ధతో నాచరింపుము స్నాన, మును సితాసితతోయపూరమందు
దాన నీ కఖిలపాతకనాశనంబును, స్వర్గలాభంబును సంఘటిల్లు
నని వచించుటయు నే నమ్మహాత్మునివచ, నము నమ్ముకొని ప్రయాగమున కరిగి

గీ. భూసురుఁడు చెప్పినట్టులె మాస మెల్లఁ, జేసితిని స్నానమును దానసిద్ధి వినుము
త్రిదినములకు నఘక్షయం బొదవెఁ గల్గె, దేవతాత్వంబు మిగిలినదివసములకు. 2315

సీ. అటుమీఁద నే రజతాచలంబున కేఁగి, నివసించి శర్వాణినికటమందు
మత్ప్రాక్తనస్నానమహిమంబ నను బూర్వ, జన్మవృత్తాంతసంస్మరణ మొదవ
నరుదెంచుచును బ్రతిహాయనంబును బ్రయా, గమునకు మాఘమాఘంబునందు
స్నానంబు గావించి చనుచుందు మరల రా, జతశైలమునకు నాచరిత మిదియె

ఆ. యింక నీచరిత్ర మెఱిఁగింపు మనవుడు, దైత్యుఁ డిట్టు లనియెఁ దల్లి నీవు
నాచరిత్రమును వినంగఁ గోరుట నార్త, జనుల నోముదాన వనుచుఁ దోఁచె. 2316

గీ. కాని వోఁ బాపి నైననగాధపుణ్య, కాంత వగునీకు నెననేల కలుగుఁ గోర్కె
యింతకును నేను ధన్యుఁడ నీశ్వరునకుఁ, గరుణ నామీఁద నేఁటికిఁ గలిగె నేమొ.

గీ. అన్యవృత్తాంత మడుగుదు రాత్మగాథ, చెప్పుదురు చేయుదురు పరక్షేమములను
నెనయుదురు పుణ్యమును సాధుజనులు గానఁ, బడెడి నాలుకఱములు నీయెడల సాధ్వి.

క. తనదుఃఖముఁ దెలిపిన స, జ్జనులకు సుఖ మొందు దుఃఖసంప్రాప్తుఁడు గా
వున నాపాపచరిత్రము, వినుము వచించెదను నీకు విశదము గాఁగన్. 2319

— కాశీబ్రాహ్మణవృత్తాంతకథనము. —

సీ. మును బ్రాహ్మణకులంబునను వారణాసిలోఁ, బ్రభవించితిని నేను బహ్వృచుఁడను
జదివితి వేదశాస్త్రము లన్నియును గాని, మత్పూర్వపాపకర్మమునఁ జేసి
కలిగె ధనాశ తత్కారణంబున క్షేత్ర, మనుశంక యించుకైన లేక
దుర్దానములు పట్టఁ దొడఁగితిఁ దగ దని, పెద్ద లెల్లరును జెప్పినను వినక

ఆ. యట్లు గొంతకాల మార్జించి యార్జించి, ధనము భూమిలోన దాఁచిపెట్టి
తెలుపకుండఁగనె సతిసుతాదులకును, నుసురు విడిచినాఁడ నొక్కనాఁడు. 2320

ఆ. వారణాసిలోన వసియించువారలు, సలిపినను నశేషకలుషములను
నరకలోకమునకు నరుగరు గాని త, త్ఫలము గుడువకుండఁ దప్పి పోదు. 2321

గీ. సకలదేశంబులందును జలిపినట్టి, కలుషము నశించుఁ గాశిలోఁ గాశిలోన
నొనరిచినకొల వజ్రలేపోపమంబు, నాకు దానను క్షుద్రజన్మములు గలిగె. 2322

గీ. గ్రద్దగను రెండుమార్లు వ్యాఘ్రముగ మూఁడు, మార్లు సర్పంబుగను రెండుమాఱులొక్క
మాఱు లులూకంబుగను నొక్కమాఱు విడ్వ, రాహముగఁ బుట్టి కడ కైతి రాక్షసుఁడను.

క. ఈరాక్షసజన్మంబున, ఘోరక్షుద్బాధ నార్చుకొనఁ జాలక కాం
తారములం దల్లాడుచుఁ, జేరితిఁ గ్రమముగఁ దుషారశిఖరికిఁ దుదకున్. 2324

వ. ఈదురవస్థలతోడ నిప్పటికి నాకు డెబ్బదియేనువేలవత్సరంబులు గడచె. 2325

గీ. ఎంతగా నీఁదుచున్నను నింతవఱకుఁ, గానఁబడదాయె నించుకయేని గట్టు
మామకవిషాదవార్ధికి నేమి చెప్ప, నమ్ముమిది యథార్థముగఁ దెల్పినాఁడ నీకు. 2326

గీ. దైవయోగంబువలన నీదర్శనంబు, ప్రాప్తమగుటను నేఁడు నాపాప మెల్ల
దగ్ధమైపోవు ననియెడి ధైర్య మొదవె, నెల్లి కానున్నదియొ తుద కీశ్వరాజ్ఞ. 2327

క. అతిచిత్రంబుగఁ బూర్వ, స్మృతి యిప్పుడు కలుగఁ దెలియఁజేసితి నాదు
స్థితి యెల్ల దీనికిని నీ, హితదృష్టియె కారణముగ నే నూహింతున్. 2328

గీ. కాలమునఁ దీర్థము ఫలంబుఁ గలుగఁజేయు, సాధుసంగము ఫలము దత్క్షణమ యిచ్చుఁ
గావునను తీర్థసేవకంటెను సాధు, సంగమును జెప్పుదురు ప్రశస్తముగ బుధులు. 2329

గీ. సాధువులు గరుణింతురు సర్వజనుల
హెచ్చుతగ్గులు మది గణియింపకుండ
క్షీరవారిధి తనలోనిక్షీరధార
నిచ్చు హంసకు బకమున కీయకున్న. 2330

సీ. అని పల్కి వందన మొనరించి కన్నీరు, స్రవియించుచుండ నేత్రములనుండి
తల యెత్తి చూచుచు నిలిచియుండుటయుఁ గని, కాంచనమాలిని కరుణతోడ
దానవోత్తమ విషాదము నొందకుము నేఁడు, మంచికాలంబు ప్రాప్తించె నీకు
నని వచియించి నిజాంశుకంబున నున్న, సలిలంబు వామహస్తమునఁ బిండి

గీ. దక్షిణకరంబునం గొని దానవునకు, దానవశ్రేష్ఠుఁ డుత్సుకుఁడై ధారవోసె
నొకతపోమాసమందుఁ దా నొందినట్టి, స్నానఫలమునఁ ద్రిదివసస్నానఫలము. 2331

ఉ. అంత సురారి యాత్మవికృతాకృతి మాయఁగ దివ్యరూపమున్
వింతగఁ దాల్చి భానుఁ డన వెల్గుచు నాల్గుదెసల్ స్వదీప్తిచేఁ
గాంతి వహింపఁ గేల్మొగిచి కాంచనమాలినిఁ గన్ మదంబ నే
సంతతమున్ సుఖించుటకుఁ జక్కనిమార్గ మనుగ్రహింపుమా. 2332

వ. అని ప్రార్థించుటయుఁ గాంచనమాలిని సానుగ్రహంబుగా నాతని కిట్లనియె. 2333

సీ. ధర్మమార్గంబును దప్పివర్తిలకుము, ఏదువు మహాంబుధి నొడలిపైని
క్షణభంగురంబుగా జగమును జూడుము, వైరాగ్యసౌఖ్యవిహారి వగుము
పరకీయదోషముల్ ప్రకటింపకుము పర, స్తవము చేయకుము సత్యమును జెప్పుము
తలపెట్టకుము భూతములకు హింస కొనర్పఁ, జేయుము సాధుసంసేవనంబు

గీ. దారపుత్రాదిబంధుసంతతులయందుఁ, బరిహరింపుము మమతను హరిపదంబు
లాశ్రయింపుము మాఘములందు స్నాన, మాచరింపుము సకలసౌఖ్యములఁ గొనుము.

క. అని యుపదేశించుటయును, ననవధికం బైనహర్ష మామతిలంగన్
మనమున నాతం డాయమ, యనుమతిఁ గొని చనియె దివికి నమరులు గొలువన్.

గీ. అప్పు డరుదెంచి దేవకన్యకలు గూర్మి, మెఱయఁ గాంచనమాలినిమీఁదఁ బుష్ప
వృష్టి గురియించి యామె కావించినట్టి, కార్యమును సన్నుతించి రఖండముగను.

క. అంతటఁ గాంచనమాలిని, సంతసమున మాఘమాససమ్మజ్జనవృ
త్తాంతముఁ జెప్పుచు వారికి, స్వాంతము లలరంగ గౌరిసన్నిధి కరిగెన్. 2337

క. ఈకథ నాలించిన నిహ, లోకంబున నఖిలసుఖములును బొంది తుదిన్
నాకమున దేవతాత్వముఁ, గైకొని వసియింతు రొక్కకల్పమువఱకున్. 2338

క. అని చెప్పుటయును నంతయు, విని సవినయముగను గాత్రవీర్యుఁడు స్నానం
బొనరించుచు మాఘములం, దొనరించి తపంబు చెందె నుచ్చైఃపదమున్. 2339

ఆ. సర్వదానఫలము సర్వవ్రతఫలంబు, సర్వయజ్ఞఫలము సంఘటిల్లు
మాఘమాసమందు మకరార్కుఁ డుండంగ, స్నానమాచరించుమానవులకు. 2340

గీ. సత్యహీనులు పితృమాతృశాసకులును, బ్రహ్మహత్యాదిదుర్భరపాతకులును
బతితులును జెందుదురు పావనతను మాఘ, మాసమజ్జనసంప్రాప్తమహిమవలన.

సీ. అన్నదానము చేయునట్టివా రమృతపా, నంబు చేయుదురు స్వర్గంబునందు
స్వర్ణదానము చేయువారలు కూర్చుందు, రమరాధిపార్ధసింహాసనమున
వస్త్రదానము చేయువార లుందురు ప్రభా, మయు లయి మార్తండమండలమున
గృహదాత లగువారు విహరింతురు పురంద, రామూల్యమణిసౌధసీమలందు

గీ. భూమిదానంబు గోదానమును నొసర్చు, వార లుందురు గోలోకవాసులుగను
సర్వదానఫలంబు లొసంగఁ జాలు, మాఘమును గొల్పెడివాఁడు మానవుండె. 2342

క. దానంబులు యజ్ఞంబులు, ధ్యానంబులు వ్రతములును సమాధులు మాఘ
స్నానసహస్రాంశంబున, కైనను బోలంగఁ జాల వారసి చూడన్. 2343

క. మానవుఁ డెంతటిధీరుం, డైనను సకలాఘశుద్ధి నచ్చుగ మాఘ
స్నానమునఁ బొందినట్టులు, కానఁగ లేఁ డితరపుణ్యకర్మంబులచేన్. 2344

క. నానాఘాద్రులు మాఘ, స్నానమున సమూలముగ వినాశము నొందున్
నానాకాష్ఠంబులు దీ, ప్తానలమునఁ జొచ్చి భస్మ మయ్యెడిభంగిన్. 2345

గీ. మాఘమున స్నాతు లగువారు మరల భువికి
దిగరు దివినుండి యెపు డేని దిగినయెడల
వెలయు చుందురు సత్యసంధులు ప్రభూత
భాగ్యయుతులును నగుమహాప్రభువు లగుచు. 2346

క. త్రికరణకృతంబు లగుపా, తకంబు లన్నియును బాయుఁ దత్క్షణమున మా
ఘకృతస్నానంబున నా, రకయాతన లచ్యుతస్మరణమునఁ బోలెన్. 2347

క. జ్ఞానముచే నైనను స, జ్ఞానముచే నైన నరులు సలిపినయఘసం
తానము సర్వము మాఘు, స్నానముచే దగ్ధమగు నసందేహముగన్. 2348

—: గంధర్వకన్యావిప్రశాపకథాకథనము :—

ఆ. వినుము మానవేంద్ర విశదంబుగా ధర్మ, గర్భ యగుమఱొక్క గాథ వినుతు
నది యశేషపాపహరణం బొనర్చెడి, నగ్నిగర్భ యైనయరణివోలె. 2349

వ. సుఖసంగీతుండును సుశీలుండును స్వరవేదియును జంద్రకాంతుండును సుప్రభుండును
ననునేగురు గంధర్వులకు యథాక్రమంబుగాఁ బ్రమోహిని సుశీల సుస్వర సుతార
చంద్రిక యనునేగురు పుత్రికలు గలరు. 2350

క. ఆకన్యలు విలసిల్లుదు, రాకారమునందు వయసునందును బనులన్
వాకులను నెపుడు చూచిన, నేకోదరలట్లు భేద మేర్పడ కుండన్. 2351

గీ. చంద్రికలువోలె నాహ్లాదజనిక లగుచుఁ, దారకలువోలె నుజ్జ్వలాకార లగుచుఁ
బద్మినులువోలె సౌగంధ్యభరిత లగుచు, నొప్పు చుండిరి యాకన్య లుర్వరేంద్ర.

క. తనరారఁగ నుదయద్యౌ, వనములు నవపల్లవములవలె నాసుదతుల్
జనలోచనపారణముం, బొనరించిరి మిగుల లతలువోలె నృపాలా. 2353

క. హేమపరిధానములచే, హేమాభరణములచేత హేమాభలచే
హేమసుమమాలికలచే, నామానిను లొప్పు చుండి రాశ్చర్యము గన్. 2354

క. ఆనళినముఖులు వీణా, గానంబునయందు వేణుగానమునందున్
దానమునందును స్వరసం, ధానమునందును విశారదలు భూపాలా. 2355

క. చెలువలకంఠస్వరములు
గలిగించును గోకిలప్రకాండంబులకున్
దలవంపులు గిలిగింతలు
గలిగించును నమృతమందుఁ గలమధురిమకున్. 2356

క. నృత్యమునఁ జిత్రలేఖన, కృత్యంబునఁ దాళవాద్యఖేలనమున నై
యూత్యము గలిగి దివౌక, స్త్రుస్త్యలుగా నుండి రావధూమణు లధిపా. 2357

క. జనకులు లాలింపఁగ నా, వనితలు ధనదాలయమున వర్తించిరి క్రీ
డనలాలస లగుచు సురాం, గనలకు మేల్బంతు లనెడిఖ్యాతి చెలంగన్. 2358

సీ. అటు లుండ వైశాఖమం దొక్కనాఁ డావ, ధూమణుల్ గుతుకంబుతోడఁ గూడి
యచ్ఛోద మనియెడిహ్రదమునకుం బోయి, యాహ్రదంబున స్నాన మాచరించి
ధరియించికొని క్షౌమపరిధానముల నాస్య, ములఁ గమ్మకస్తురిబొట్లు దాల్చి
మృత్తికచేత గౌరీదేవి నొనరించి, యాభరణముల నాయమకుఁ బెట్టి

గీ. స్ఫటికవైడూర్యమాణిక్యఘటిత మైన, తత్తటంబున నిలిపి యథావిధిగను
బత్తి చిత్తంబులం దిగురొత్తు చుండఁ, బూజ సేసిరి బంగరుపూలతోడ. 2359

క. కలకండములును దాడిమ, ఫలములు ద్రాక్షయు రసాలఫలములుఁ గదళీ
ఫలములును నివేదించిరి, కలకంఠులు హర్షమొదవఁ గాత్యాయనికిన్. 2360

క. నృత్తంబులు సలిపిరి నిజ, చిత్తంబులు దేవతావశీకృతములు గా
న తరుణీతిలకంబులు, తత్తాతకతక్కతక్కతై తక యనుచున్. 2361

క. పాటలు పాడిరి వీణలు, మీటుచు గాంధర్వవిద్య మేనులతో న
చ్చోటికి వచ్చెనొ యనియెడి, సూటిగ నాచెలులు తేనెసోనలు గురియన్. 2362

క. అటు లాచెలు లగజకు ను, త్కటహర్షముతోడఁ జేసి కైంకర్యము ను
తట నచ్ఛోదసరోవర, తటమునఁ గూర్చుండి రట్టితరుణమునందున్. 2363

సీ. ఆజానులంబిబాహార్గళంబులవాఁడు, డంబైనవక్షస్స్థలంబువాఁడు
ముచ్చట్లు చుట్టినముంజి దాల్చినవాఁడు, హరిణాజినోత్తరీయంబువాఁడు
మీనుమీసమునుద్ది యైనజందెమువాఁడు, శిఖయుఁ దండంబును జెలఁగువాఁడు
తెలిదమ్మిరేకులఁ దెగడుకన్నులవాఁడు, సోమబింబము నోముమోమువాఁడు

గీ. కుసుమశరుఁ డనుభ్రాంతిని గొలుపువాఁడు, బ్రహ్మచర్యవ్రతంబునఁ బరగువాఁడు
తరుణతాభరుఁ డొకధరామరుఁడు వచ్చె, నటకు మాధ్యాహ్నికస్నాన మాచరింప.

క. అరుదెంచినయాబ్రాహ్మణ, వరునకు దృక్కువలయముల వారలు గావిం
చిరి యతిథిపూజ యదియే, తరుణం బని మరుఁడు శరముఁ దాలిచి వింటన్.

క. ప్రహరించె నాలతాంగులఁ, గిహాకహా నవ్వుమును వేటకాఁడు హరిణులన్
బ్రహరించినట్టు లెదలను, దహతహ వొడమంగ నానితంబిను లంతన్. 2366

క. నవమన్మథవిగ్రహుఁ డితఁ, డెవఁ డొకొ యెపు డేని చూచి యెఱుఁగము మన మీ
భువనములలోన వీనికి, సవతుగ నిలువంగఁ దగినసౌందర్యనిధిన్. 2367

సీ. భావింతమా పంచబాణునిఁగా వీని, రతిఁ బాసియుండఁగా నతని కేల
యనుకొందమా దస్రులం దొక్కనిఁగ వీని, యుగచారు లొకఁడుగా నుండ రెట్లు
కనుఁగొందుమా పారికాంక్షిసూతిగ వీనిఁ, దాపసు లేడ నీరూప మేడఁ
దలఁతుమా భూమీంద్రతనుజన్మునిఁగ వీని, రాజుల కీబ్రహ్మతేజ మేడఁ

గీ. గాఁడు యక్షుఁడు సిద్ధుఁడు గాఁడు కామ, రూపుఁడును గాఁడు విద్యాధరుండు గాఁడు
కాఁడు గంధర్వుఁడును నిట్టికాంతి వడయఁ, గలుగుదురె వారు శతజన్మములకు నైన.

క. చతురాననుండు మనకొఱ, కితనిన్ సృజియించి పంపెనేమో కాదేన్
క్షితిభృత్కన్యక యస్మ, త్కృతసేవకు మెచ్చి పతిగ నిచ్చెనొ వీనిన్. 2369

క. నేను వరించెద వీనిని, నేను వరించెదను వీని నేను వరింతున్
వీని ననుచు నాయెగురు, చానలు గావించు చుండ సంభాషణముల్. 2370

శా. ఆకన్యల్ త్రప వీడి వాకొనెడివ్యాహారంబు లాబ్రాహ్మణుం
డాకర్ణించి కృతాహ్నికుం డయి మనంబా దిట్లు తర్కించె ము

ల్లోకంబుల్ తరుణీకటాక్షములకున్ లోనయ్యె నా నబ్రమే
లోకేశుండు జనార్దనుండు హరుఁడున్ లోనై ప్రవర్తింపఁగన్. 2371

ఉ. ఏమి ప్రయోజనంబు గల దెంతటిసత్త్వము గల్గియుండినన్
గామినిభ్రూలతాధనువు గైకొని తద్దృగమోఘసాయక
స్తోమముచేత మన్మథుఁడు సొమ్మసిలన్ బ్రహరింప వేనిచే
తోమృగశాబకంబు హతితోడన కూలక నిల్చియుండెడిన్. 2372

ఉ. అంతటిదాఁకనే జనభయంబు నయంబును నంతదాఁకనే
యంతటిదాఁకనే ధృతియు నన్వయగౌరవ మంతదాఁకనే
యంతటిదాఁకనే జపము లాత్మవిచారము లంతదాఁకనే
యెంతటిదాఁకఁ గామినులయీక్షణసీధువు మత్తుకొల్పదో. 2373

ఉ. అన్యులజోలి లేక ప్రథమాశ్రమధర్మపరాయణుండనై
వన్యములన్ భుజించుచును వర్తిలుచుండెడినన్ను నిట్టు లీ
కన్యలవన్నెచిన్నెలు వికల్పములోఁ బడద్రోయుచుండ సా
మాన్యుల నెల్ల నింక గృహమార్జనదాసులఁ జేయకుండునే. 2374

క. మలమూత్రమాంసరక్తా, దులచేతను నిండి వివిధదుర్వాసనలున్
గలిగినపడఁతులమేనులు, వలపులు గల వనుచుఁ దలఁచి వలతురు మూఢుల్ 2375

క. క్రూరము లగుసర్పంబులు, నారీమణు లంచు బుధు లనంగను విందున్
వీరలు నాచెంగటికిన్, జేరక మునుపే గృహంబు చేరఁగ వలయున్. 2376

క. అని యెంచి యావధూజనంబులు, తనచెంతకు రాకమునుపె ధరణీసురనం
దనుఁడు మనోజవమునఁ బో, యెను గనఁబడకుండ నమ్మృగేక్షణ లంతన్. 2377

క. ఎక్కడ నాప్రాణేశ్వరుఁ, డెక్కడ నాహృదయచోరుఁ డెక్కడ నావాఁ
డెక్కడ నానిధి యని తా, మక్కడనక్కడను జూచి హతవాంఛితలై. 2378

క. కాననములు దారుణదా, వానలమున భగ్గుభగ్గు మనుచందమునన్
మానసములు ఘోరవియో, గానలసందీపితంబు లగుచుండంగన్. 2379

క. హరిణులచందంబునఁ గా, తరలోచన లగుచుఁ జూడ దశదిశలును నా
తరుణులకు శూన్యములుగాఁ, బరగుటయును దొడఁగి రిట్లు పరితాపింపన్. 2380

క. కనులకుఁ గనఁబడు చుండియుఁ, గనఁబడ వీ వెంతమాయకాఁడవొ నాథా
నిను వలచియున్నకన్యల, ననాథలను జేయ నీకు న్యాయం బగునే. 2381

గీ. ఏల మామీఁద నీయింద్రజాలబలము, చూపెదవు ముగ్ధలము మేము సుందరాంగ
కానఁబడు మొక్కసారి మాకనులయెదుటఁ, బ్రథమకబళము మక్షికాపాత మౌర.

గీ. ఏల రావింప మ మ్మిట కేల ప్రియునిఁ, గానఁబఱుపంగ నడుమ విఘ్నంబు సలుప
నేల ధాతకుఁ గ్రీడ మార్జాలమునకు, మూషికములకుఁ బ్రాణసంశోషణంబు. 2383

సీ. నీమానసమునకు నిలుకడయే లేదో, మామీఁద నీకు నమ్మకము లేదో
చిత్తంబులోనికిఁ జేర నేర్చితి వేము, చేరి యీవలకు రానేర వేము
యపరాధములు లేనియబలామణుల నేఁచ, నెఱిఁగియుఁ బరదుఃఖ మెఱుఁగ వేము
క్రూరాత్ముఁడవొ సుందరులమానధనమును, దస్కరించెడిమేటితస్కరుఁడవొ
గీ. మాయ లెఱిఁగినవాఁడవో మాంత్రికుఁడవొ
మమత లేనట్టివాఁడవో మముఁ బరీక్ష
సలుపఁ దలపెట్టితివొ కార్యసాధకుఁడవొ
పలుకు మొకమాట నాథ నీ పైఁడినోట. 2384

క. మాకడకు నీవు రామికి, నేకారణ మైన నుండె నేని మహాత్మా
నీకడకు మేమె వత్తుము, కైకొనిపొమ్మేల మమ్ముఁ గాఱియవెట్టన్. 2385

క. నీవు గనంబడ కుండిన, జీవింపము మేము నిన్నుఁ జేకొనునాసన్
జీవింతుము జీవించిన, నీవె కదా మాకు జీవితేశుఁడ వింకన్. 2386

క. విని మామొఱ కృపతో ద, ర్శన మీయుము మరల నొక్కసారి మహాత్మా
కనుఁగొనరు గాదె యుత్తము, లనఁ దగియెడువార లొకరియాఁకాటములన్. 2387

క. అని యీవిధమున నాయం, గనలు పరితపించి యతఁడు గనఁబడునేమో
యని కొంతకాల మచటనె, కను చుండిరి దెసలు కనులు కాయలు గాయన్. 2388

వ. అటు లెంతకాలంబు నిరీక్షించినను బ్రియుండు రామింజేసి మిగుల విషాదంబు నొంది పితృభయంబు బుత్తలపాటుగొలుప నెట్టకేలకు నించుక ధైర్యం బవలంబించి యా కన్యామణులు నిజగృహంబులకుం జనిరి. 2389

క. చనుదెంచినయాకన్యలఁ, గనుఁగొని తజ్జనను లేల కాలాత్యయ మా
యెనొ బిడ్డలార తెలుపుఁడు, చనుదేరఁగ మీరు నేఁడు సదనంబులకున్. 2390

క. మఱియును మేనులు వాడిన, తెఱఁగునఁ గనఁబడుట కేమి తెఱఁగో మాతో
నెఱిఁగింపుఁడు తల్లులకడ, మఱుఁ గేటికి బిడ్డలకుఁ గుమారికలారా. 2391

క. అనవుడు ముగ్ధలు గావునఁ, బెనఁగొనినత్రపాభరంబు పెంపున లోగు
ట్టును బయలు వెట్టఁ జాలక, జననుల కిట్లనిరి పూర్ణచంద్రనిభాస్యల్. 2392

ఆ. అతికుతూహలమున నచ్ఛోదసరసునఁ, గిన్నరులును మేముఁ గ్రీడలాడు
కొనుచు నుండఁ బ్రొద్దు కనఁబడ కుండఁగఁ, జనియె నేమి చెప్ప జననులార. 2393

ఆ. ఇటనె ప్రొద్దు గ్రుంకె నింక మన మొకత్రుటి, నిల్లు చేరఁగలుగు టెట్టు లనుచు
నలసి సొలసి రాఁగి నాయాస మొదవెను, దనువులకును గ్లాని దానఁ గలిగె. 2394

క. మ్లానతచేఁ గాఁబోలును, మేనులకుం దాప మొదవె మే మోరువ మి
ద్దాని కనుచుఁ దొడఁగిరి హిమ, భానుప్రస్తరధరిత్రిఁ బండుకొనంగన్. 2395

క. చిలుకలకుఁ జదువు చెప్పరు, పలికింపరు శారికలను బర్హిణముల కా
టలు నేర్పరు పావురములఁ, దిలకింపరు సారసముల దిద్దరు వారల్. 2396

క. ఆరామామణులకు సుం, దారసుమాసవము గరళతుల్యంబున నే
పారుటయె కాక కల్ప, క్ష్మారుహసూనములు వహ్నికల్పము లాయెన్. 2397

క. పిలిచినను నావయస్యలు, పలుకరు బంధువులతోడఁ బలికింపరు వీ
ణలను వినోదింపరు తమ, చెలగములోఁ జేరి యాటపాటలతోడన్. 2398

క. పొలిచిరి యోగిను లన నా, వెలఁదులు నాసాగ్రదేశవిస్ఫారితదృ
ష్టులును సలక్ష్యధ్యానప, రలుఁ బురుషోత్తమగతాంతరలును నగుటచేన్. 2399

వ. మఱియును నాలతాంగులు. 2400

సీ. క్షణకాల మాయెను చంద్రోపలంబులు, జాలువాఱెడిరత్నసదనమందు
క్షణకాల మింపుగ చల్లఁగా మలయాని, లంబు వీచెడిగవాక్షంబులందు
క్షణకాల మింపుగ సంతాపశాంతి నా, పాదించు జలయంత్రభవనమందు
క్షణకాల మింపుగ చంద్రికాసారంబు, ప్రసరించుసౌధోర్ధ్వభాగమందు

గీ. క్షణము శయనింతు రతివిశంకటపయోజ, పత్త్రసంఘాతికాపైన పార్శ్వమందు
శీతలాంభోజదళములచేతఁ జెలులు, ముసరుకొని తాప మాఱంగ విసరుచుండ.

క. ఈరీతిని యుగసమముగ, నారాత్రి యెల్లఁ గడపి యరుణుఁడు ప్రాక్శై
లారూఢుఁ డగుడు బ్రదికిన, వారల మని తలఁచికొనుచు వారలు వేడ్కన్. 2402

క. జననీజనకులయొద్దను, సుమతిగాని పూర్వమట్టు లవోఢదసర
స్సునకుం జని గాఢీప్రా, జనముం బొనరించు చుంపుసమయమునందున్. 2403

క. మునుపటివలె స్నానంబును, నొనరింపఁగ విప్రసూతియును నవోఢదం
బునకుఁ జనుదేర నాతనిఁ, గనుఁగొని యాకన్య లమితకౌతుక మొదవన్. 2404

క. ఇనదర్శనంబునను బ, ద్మినులు ప్రకాశించినట్లు దీపించిరి నె
మ్మనముల కింపొలయఁగఁ బో, యినయర్థము మరల దొరకె నే మని చెప్పన్.

గీ. అట్టు లాకన్యకామణు లలరి మరలఁ, బోవునో యేమొ యతఁ డనుబుద్ధి వొడమఁ
దత్క్షణమ యేఁగి తత్సన్నిధానమునకు, నతనిచుట్టును బరివేషమట్లు నిలిచి. 2406

ఆ. హావభావములు బయల్పఱుచుచు నాథ, నిను వరించినట్టివనజముఖుల
వదలిపోదు వనుచు మది నెంచ మైతిమి, యబల లన్నినంత యలుచె నీకు. 2407

ఆ. నిన్న నిచట నిన్నుఁ గన్నది మొదలుగా, విషమశరుఁడు మమ్ము వెతలఁ గుముపు
చున్నవాఁడు బ్రతికి యున్నవారము నేఁడు, నిన్ను మరలఁ గాంతు మన్నయాస.

గీ. ఇచ్చటికి నేఁడు రాకున్నయెడల నీవు, కన్యకాసంహననపాతకంబు చుట్టు
ముట్టుకొని ముప్పతిప్పలుపెట్టి యుండు, నిప్పటికె నిన్నుఁ బలుమాట లేటి కింక.

క. తీఁగెలవలెఁ గౌగిళ్లను,
నూఁగించెడిచిగురుఁబోఁడు లుండఁగఁ జెంతన్
ద్రేఁగంటనైనఁ జూడక,
యేఁగున్నో యెంతకఠినహృదయుం డైనన్. 2410

క. నిన్నుఁ జనినట్లు చనుటకు, నెన్నటికిం గాదు నీకు నిఁక గన్యల మై
యున్నారము నీవే పతి, వన్నారము మము గ్రహింపుమా దయతోడన్. 2411

చ. అనుటయు నాద్విజుండు మరియాఁదమెయిం దిలకించి వారలన్
వనజదళాక్షులార ప్రియవాక్యము లంటిరి మీరు కాని వి
ద్యను గ్రహియించుకొంచుఁ బ్రథమాశ్రమధర్మపరుండ నై వ్రతం
బునఁ జరియించుచునే నెటులు పూనుదుఁ జేయఁగ ధర్మభంగమున్. 2412

వ. ఏయాశ్రమంబున కేధర్మంబు విహితం బగు నయ్యది పండితుం డగువాఁడు రక్షింప
వలయుఁ గాన నీవివాహంబు నాకనుచితం బనుటయు నాతనిభాషణంబులు విని యా
వధూమణులు సోత్కంఠ లగుచు మధుమాసకలకంఠకలధ్వనితో ని ట్లనిరి. 2413

గీ. ధర్మమునఁజేసి యర్థ మర్థమునఁజేసి, కామమును గామమునఁజేసి కలుగు సౌఖ్య
మని వచింతురు పండితు లట్టికామ, మిప్పుడె నీభాగ్యమున నబ్బె నేమి చెప్ప. 2414

క. ఆకామ మనుభవింపుము, సాకల్యంబుగను మంచిసమయం బిది భూ
నాకం బనఁ దగునివ్వో, నేకాంతసుఖంబు గలుగునే యన్యులకున్. 2415

వ. అనుటయు నాకన్యామణులకు బ్రహ్మచారి యి ట్లనియె. 2416

గీ. అబలలార చతుర్వర్గమందు మొదటి, దైనధర్మంబు విడువ కన్నంతవలెనె
కామ మర్థంబు మోక్షంబు గలుగఁజేయు, స్వస్వఫలముల లేకున్న సమయఁజేయు.

గీ. అసమయంబున నుద్వాహమాడ నట్టు, లనుమతింపంగఁ దగు వ్రతి నైననాకుఁ
గార్యకాలం బెఱుంగనికర్త కార్య, ఫలము నొందుట యెప్పు డేని కలుగఁగలదె.

క. అని వచియించుటయును న, వ్వనజాక్షులు పలికి రిట్లు వానికి ద్విజనం
దనుఁడవు సకలజ్ఞుండవు, చనునే నీ కిట్టిమూర్ఖసంభాషణముల్. 2419

క. వనితారత్నంబును నిధి, యును సిద్ధౌషధము సిద్ధియును సిద్ధరసం
బును మంత్రమును రసాయన, మును నబ్బిన సేవనీయములు ప్రాజ్ఞులకున్. 2420

ఆ. దైవవశముచేతఁ దాను గావించిన, చేఁత సిద్ధివడసి శీఘ్రముగనె
ఫలము నీయనున్నపట్టున దానికి, విముఖభావ మొందువెఱ్ఱి గలఁడె. 2421

క. ఏల యుపేక్ష యొనర్చెద, వాలస్యమువలన నమృత మైనను విష మౌఁ
జాలును నిఁక నీనయపరి, శీలన మేగురువు చదువు చెప్పెనో నీకున్. 2422

క. కొనఁదగు స్వర్ణమును మలం, బున నైనను సుధను గరళమున నైనను నీ
చునివలన నైన సద్వి, ద్యను దుష్కులమునను నైన నబలామణులన్. 2423

క. అనురాగము రూపము యౌ, వనమును గులజన్మశుద్ధి వాక్సౌధుర్యం
బును గలిగి స్వయముగ వరిం, చినకన్యారత్నములఁ ద్యజింతురె ప్రాజ్ఞుల్. 2424

గీ. ఏడ సురసుందరులము మే మేడ నీవు, తాపసుండవు మనకు సంధాన మేడ
ఘూర్ఘటంబుల ఘటియించుద్రుహిణుఁ డోకఁడె,పండితుఁడు గాక యితరుఁడు పండితుండె

క. కావున నీ విప్పుడె మముఁ, గైవస మొనరించుకొనుము గాంధర్వవిధిన్
జీవింతు మిట్టులైనను, నావుడు నావిప్రుఁ డంగనల కిట్లనియెన్. 2426

క. ధర్మధను లైనపురుషులు, ధర్మంబుఁ బరిత్యజింపఁ దలఁపరు సుమ్మీ
ధర్మేతర మగునుపయమ, కర్మము నా కేల చాలుఁ గదలుం డింకన్. 2427

క. అని కోపంబునఁ బలుకట, యును సుస్వరయును సుశీలయును బావాలయుగం
బును బాదములు ప్రమోహిని, యను బట్టె రతంపు గదల కుండెడుభంగిన్. 2428

క. చుంబించెను జంద్రిక వ, క్త్రంబును గట్టిగ సుతార గౌఁగిటఁ జేర్చెన్
శంబరరిపుండు సుమబా, ణంబుల నెడతెగక యెదల నాఁటుచునుండన్. 2429

ఉ. అప్పుడు కాలరుద్రు క్రియ నావసుధామరసూతి కన్నులన్
నిప్పులు రాలఁ జూచుచును నిస్త్రపలార పిశాచులట్లు న
న్నిప్పగిదిం గలంచుటను నేర్పడఁగాక పిశాచరూపముల్
తప్పక మీకు నావుడు ప్రతాపన వారలు వీడి పోతరన్. 2430

క. అకటకట యెంతపాపము, నకు నొడిగట్టితివో విప్రనందన నిర్మా
యికి లైన దేవతాక, న్యకలపయిం బిడుగు వైచినాఁడవు తగునే. 2431

క. కైకొని నిను భర్తగఁ బ్రదివ, వాకపతిభోగములను నొందింపఁగ లో
నాకాంక్షించినమాకున్, జేకూర్చితి విట్టిచేటు శ్రేయమె నీకున్. 2432

క. ఇంతటిరసికుఁడ వని మా, స్వాంతములఁ దలంచియున్నఁ జనుటెంతుమె నీ
చెంతకు వలచినకాంతల, నెంతటిధర్మజ్ఞుఁ డైన నిటు చేయు నొకో. 2433

క. ధర్మకృతాంతుండవు నీ, ధర్మజ్ఞత దెలిసె నేమి తప్పని మా కీ
కర్మము మెడఁ గట్టితి నీ, కర్మము నినుఁ గట్టికుడుపక యె పోవు నొకో. 2434

క. అనురాగముతో నుండెడి, జనులయెడను భక్తు లైనజనులయెడ సుహృ
జ్జనులయెడన్ ద్రోహము చే, సిననరులకు నిహము పరముఁ జెడు నండ్రు బుధుల్.

ఆ. కాన నీవు గూడఁ గమ్ము పిశాచమ, వంచు శాప మిచ్చి రతని కంత
నాలుగురకుఁ గూడ నపుడె పైశాచరూ, పములు ప్రాప్తమయ్యెఁ బార్థివేంద్ర.

ఉ. అంతట వార లాఱువురు నాఁకలి కేడ్చుచుఁ దత్సరోవర
ప్రాంతములం జరించుచును రాతిరియుం బవలున్ మనంబులన్
జింతిలు చుండి రే మనుచుఁ జెప్పుదు దేవత లేని తప్పు గా
వింతు మనంగరా దనుభవింపక తప్పవు పూర్వకర్మముల్. 2437

క. ఏకాలమునకు నేసితి, చేకూరఁగ వలెనొ తాము చేసినపనికిన్
జేకూరితీఱు నాసితి, యాకాలంబునకు నెల్లయసుధారులకున్. 2438

క. తమచేసినపుణ్యాపు, ణ్యము లనివార్యములు గాఁగ నాత్మచ్ఛాయా
క్రమమునను నంటి నరులకు, సమకూర్తఁగఁజేయు మోదసంతాపములన్. 2439

వ. ఇది యిట్టు లుండ నాకన్యామణులు యథాపూర్వంబుగా సదనంబులకు రామింజేసి తజ్జననీజనకులు శోకానలదహ్యమానమానసులై. 2440

క. పురములు వనములు గిరులును, సరస్సులును వెదకికొనుచు సకలాశలునుం
దిరుగం జొచ్చిరి దైవము, దురతిక్రమ మెంతయూర్జితులకున్ భూపా. 2441

క. అటులు బహుకాలము గతిం, చుటయును నొకనాఁడు లోమశుఁడు స్నానము సే
యుట కాయచ్ఛోదసర, స్తటమున కేతేర నప్పిశాచనిచయముల్. 2442

ఆ. ఆపురావు రనుచు నాఁకలి పెల్లున, నతని నారగింప నరుగుదెంచి
యును దదీయతేజమునకు భయంపడి, దూరమంద యుండి గౌరవమున. 2443

క. మును చేసినసుకృతముచే, తను నాతనియెడల భక్తి దార్కొనఁ గాపిం
చెను సాష్టాంగములను నే, మనవచ్చును బూర్వకృతశుభాశుభఫలముల్. 2444

వ. ఆసమయంబున వేదనిధి యనునొక్కభూసురోత్తముండు పుత్రవియోగసంతప్తమానసుండై బహుదేశంబులు దిరిగి తిరిగి సుతవృత్తాంతం బేమియుం దెలియమికి విచారించుచుం దుదకు దైవికంబుగా నచ్ఛోదహ్రదంబున కరుదెంచి యచ్చోట లోమశమహామునిం గాంచి నమస్కరించి తదనుజ్ఞం బడసి యాత్మదుఃఖంబు నివేదింపఁ దత్సమీపంబున నుపవిష్టుం డయ్యె. 2445

ఆ. అపుడు ద్విజపిశాచ మానసంబున దైన్య, మూవహిల్లఁ గంప మడర నొడలఁ
గరము లొగ్గి మౌనిపురుహూతునకు నిట్టు, లనియె గద్గదికను నల్లనల్ల. 2446

క. ఏదియొ మాకు మహాభా, గ్యోదయము లభించె నంచు నూహింతు నిటుల్
కాదేని సంఘటిల్లునె, సాదు లయినమిమ్ముఁ బోంట్లసందర్శనముల్. 2447

గీ. సతము గంగాదితీర్థరాజములయందు, స్నానములు సేయు చుండెడిదానికంటె
క్షణము సమకూరినను సాధుసంగమంబు, శ్రేష్ఠ మంచును బెద్దలు చెప్ప వింటి.

గీ. స్వామి మహనీయు లగువారిసంగమంబు, కలుగఁజేయు దృష్టాదృష్టఫలము నట్లు
సకలజాడ్యాపహారియు స్వర్గదమును, నాంతరతమోపహారియు నగుటఁ జేసి. 2449

క. మునివర నే విప్రుఁడ వే, దనిధిసుతుఁడ నగ్నిపాభిధానుఁడ వీరల్
తనయులు గంధర్వులకున్, మును మే మన్యోన్యశాపముల నైతి మిటుల్. 2450

క. అది మొదలు నేఁటివఱకు కీ, హ్రదముదరిన్ దిక్కు లేక యల్లాడుచు లో
నొదవినయాఁకటి పెల్లున, నదవద లై యున్నవార మతినీచదశన్. 2451

గీ. ఇంతలో మీరు కన్నులయెదుట మాకుఁ, గానఁబడితిరి దైవయోగంబువలన
నేఁటితో మాయిపత్తు లన్నియును దీఱె, భానుఁ డుదయింపఁ జీకట్లు కానఁబడునె.

క. అనవుడుఁ గటకటఁబడి వే, దనిధి విషాదాశ్రుధార తననయనయుగం
బుననుండి కాఱు చుండఁగఁ, గనుఁగొని లోమశుని మెల్లఁగా నిట్లనియెన్. 2453

చ. మునివర వీఁడు నాసుతుఁడు మున్నిటకున్ జనుదెంచి స్నానముం
బొనరుతు నంచు నంతటనె పోయెఁ గనంబడకుండ దానిచే

వనరుచు నేను వీనికయి వాడలువాడలు దేశదేశముల్
వనములు శైలముల్ తిరిగి వచ్చి యిటుఁ దుదిఁ గంటి నీగతిన్. 2454

క. వీనికి నుద్ధృతి యేవిధి, నైనను గలిగించి పెట్టు మాత్మజభిక్షన్
భూనిర్జరుండ నందును, నానానిగమాగమోపనతవర్తనుఁడన్. 2455

క. అని వేఁడుటయును లోమశ, మునివరుఁడు కృపార్ద్రచిత్తమున నాద్విజునిన్
గని విప్రోత్తమ శాపం, బనలసమానం బసాధ్య మది శమియింపన్. 2456

క. ఐనను దానికి మాఘ, స్నానమె దివ్యౌషధము వినాశం బొదవన్
దానంబులు యాగంబులు, ధ్యానంబులు గావు శాపదహనస్ఫుటంబుల్. 2457

క. పాపఫల మైనశాపము, పాపంబు వోలంగ కున్నఁ బాయదు దానిన్
బాపఁగ మాఘస్నానమె, నైపుణి గల దితరసాధనంబులకంటెన్. 2458

గీ. పాపములఁ బుణ్యతీర్థముల్ వాపఁగలవు, గాని ప్రబలంబు లైనట్టికలుషములను
మాఘసాహాయ్యమునఁ దప్ప మాపఁ జాల, వని పయోరుహసంభవుం డనియె మున్న.

వ. మాఘమాసంబునందు మానసహ్రదంబు జ్ఞానంబును హిమవత్ప్రస్థతీర్థంబులు సర్వపాపప్రణాశంబును నవోద్భిదం బింద్రలోకప్రాప్తియు బదరీవనంబు సర్వపుణ్యసర్వకామఫలంబును నర్మదానది రుద్రలోకప్రాప్తియును యమునానది సూర్యలోకప్రాప్తియును సరస్వతీనది బ్రహ్మలోకప్రాప్తియును విశాలానది సర్వోత్తమఫలంబును నైమిశంబు విష్ణుసారూప్యంబును బుష్కరంబు బ్రహ్మసాన్నిధ్యంబును గురుక్షేత్రంబు మహేంద్రలోకంబును దేవహ్రదంబు యోగసిద్ధియును బ్రభాసంబు రుద్రగణత్వంబును దేవకీనది దేవతాదేహంబును గోమతి యపునర్భవంబును హేమకూటంబును మహాకాలంబును నోంకారంబును నమరేశ్వరంబును నీలకంఠహ్రదంబును రుద్రలోకావాప్తియును సరయువును గండకియును సింధువును జంద్రభాగయును గౌశికియును దాపియును గోదావరియును భీమయును బయోష్ణియును గృష్ణవేణియును గావేరియును దుంగభద్రయును దదితరసముద్రయాయినదులును నానాకల్మషనాశంబును స్వర్గవాసంబును సర్వనదీసంగమంబులు సర్వకామావాప్తియును బ్రయాగత్రివేణీతోయంబు సర్వపాపశాపవిమోచనంబును సర్వపుణ్యఫలంబునుం బ్రసాదించు. 2460

గీ. కావునఁ బ్రయాగమందు మాఘమున నెపుడు, మాకు నవగాహనంబు సంప్రాప్త మగునో
యని సురలు కోరుచుందు రస్వాహము దీని, నది సకలఫలదానసమర్థ మగుట.

గీ. బ్రహ్మహత్యాదిఘోరపాపములు గూడ, దగ్ధ మగును బ్రయాగతీర్థంబునందు
స్నాన మొనరించి రేని దినత్రయంబు, మాఘమాసంబునను వేయి మాట లేల. 2462

గీ. క్రతువులను దానములను దీర్థముల నొక్క, ప్రక్కను బ్రయాగమాఘము నొక్కప్రక్క
నుంచి తులఁ దూఁప మున్ను విరించి ముల్లు, వంగెను బ్రయాగమాఘము వైపునంద.

క. వాతాంబుపర్ణభుక్తుల, చేత నరణ్యమునఁ దపముచేసెడిమాని
వ్రాతము ప్రయాగమాఘ, స్నాతులకుం గలుగుసుగతి చాలదు చెందన్ 2464

గీ. రాజసూయాశ్వమేధాధ్వరములకంటె, నధిక మగుఫల మిచ్చుఁబ్రయాగమాఘ
మాసమజ్జనమును వీడు మానవుండు, స్వకరగతనిధి విడనాడువాఁడ చూవె. 2465

—: వీరసేనభద్రకవృత్తాంతకథనము :—

సీ. విను మొకయితిహాసమును వచించెద నీకుఁ, బూర్వము కృతయుగంబున నొకండు
వీరసేనుం డనువిభుఁ డుండె మాలవ, వసుధాధినాథుఁ డవంతిలోన
నాతఁడు షోడశహయమేధయాగముల్, రాజసూయమహాధ్వరమును జేసి
ధనరాసులను గోవులను సువర్ణంబును, బుష్కలంబుగ నిచ్చి భూసురులకు
ఆ. స్వర్ణయూపములను స్థాపించి నర్మదా, తీరమందు మిగులఁ బేరు వడసె
నాపురంబునందె యాసీచుఁ డొకఁ డుండె, నవనిసురుఁడు భద్రకాహ్వయుండు.
సీ. ఆబ్రాహ్మణుండు బ్రాహ్మణధర్మములు వీడి, సంచరించుచును స్వచ్ఛందముగను
జలుపరానియకార్యములు చేయు చుండంగ, జనులు తద్దుష్టచేష్టలకు రోసి
వీరసేనునకుఁ దద్విషయంబు నెఱింగింప, ధర్మజ్ఞుఁ డైనయా ధరణీభుఁడు
వెడలఁగొట్టించె నావిప్రునిఁ బురినుండి, యనుచితం బగుట బ్రాహ్మణవధంబు
గీ. భద్రకుం డంతటను బరిభ్రష్టుఁ డగుచుఁ, దిరిగి బహుదేశములను దైర్థికులతోడఁ
గలసి యెట్లొ ప్రయాగముఁ గడకుఁ జేరి, త్రిదినములు మాఘమున నందుఁ దీర్థమాడె.
గీ. స్నానమాత్రంబుచేతనె సకలపాత, కములు మాయ ట మరల స్వగ్రామమునకు
వచ్చి మఱునాఁడె మరణించె స్వగృహమందు, నాదినమె మ్రండె వీరసేనాధిపుఁడును.
సీ. ఒకనాఁడు నేను దైవికముగా స్వర్గంబు, నకుఁ బోయి యమరనాయకునితోడ
భాషించు చుండంగ భద్రకుండును వీర, సేనుండు దివ్యవిమానములను
నధివసించి నవామరాధీశ్వరులొ నాఁగ, దివ్యదేహములతోఁ దేజరిలుచు
నరుగుదెంచి సుధర్మయందుఁ గూర్చుండంగ, నాశ్చర్య మొంది నే నాత్మలోన
గీ. ధ్యానదృష్టిని జూడంగఁ గానఁబడియె, వీరసేనకృతాపారభూరిపుణ్య
కార్యములకుఁ బ్రయాగమాఘకృతభద్ర, కాప్లవంబునకును సమ మైనఫలము.
గీ. విప్ర త్రింశద్ధనుర్విస్తృతప్రతిష్ఠాగ, గాంగయామునసలిలసంగమున మాఘ
మాసమజ్జన మొనరించుమనుజుఁ డొకఁడె, పశుఁడు దివినుండి పరు లెల్లఁ బడెడివార.
గీ. ఎవరు మాఘంబునను స్పృశియింపఁగలరొ, యసితసితతోయమును ధన్యు లనఁగ వారె
బ్రహ్మహత్యాదిఘోరపాపఘ్ను లనఁగ, వారలను స్పృశియించెడివారె చూవె.
గీ. వినుఁడు మీ రెల్లవారును విశదముగను, వినిచెదఁ బిశాచమోక్షణ మనెడిపూర్వ
చరితమును దీని విన్నఁ బిశాచములకు, నచిరకాలంబుననె కల్గు నాత్మముక్తి. 2472

—: దేవద్యుతివృత్తాంతకథనము :—

గీ. వసుధలోన లక్షప్రస్రవణావనంబు, నందు సారస్వతతటంబునందు నొక్క
యాశ్రమమున దేవద్యుతి యనఁగ నొక్క, బ్రాహ్మణుం డుండె మును వేదపారగుండు.

క. అతఁడు సుమిత్రునకు రమా, పతి యిచ్చినవరమువలనఁ బ్రభవించినస
త్సుతుఁ డగుటఁ దపోనిష్ఠను, సతతంబును వెడలఁబుచ్చె సాగె దినంబుల్. 2474
గీ. అట్లు తప మాచరించుచు నతఁడు గడపి, హాయనసహస్రమును నొక్కహరిదినంబు
నందు వైశాఖమునఁ జేసి హరిసపర్య, సలుపఁ దొడఁగెను విష్ణుసంస్తవము నిట్లు.

—: యోగసారస్తవము :—

సీ. స్తుతియును స్తుత్యంబు స్తోతయు సకలంబు, నీవె కావున శౌరి నిన్ను నేను
బ్రస్తుతించుట యన్నఁ బరిహాసపాత్రంబ, యైనను హార్దంబగుట భక్తి
నుతియింపఁ దొడఁగితి శ్రుతు లన్నియును భవ, న్నిశ్వాస మగుటను నీకు దీన
సంతృప్తి గలుగునె సర్వేశ్వర శుకోక్తు, లనుకొని యాలింపు మట్టు లేల
గీ. వాఙ్మనసగోచరము గానివాని వేద, వాగతీతుని నిన్ను నావంటివాఁడు
సన్నుతించుట యుక్తమె శంక యున్న, పంకజాక్షభక్త్యున్మాదపరవశులకు. 2476
సీ. విశ్వంభరుఁడ వీవె విశ్వేశ్వరుఁడ వీవె, సర్వకారణ మీవె స్రష్ట వీవె
ధర్మంబు నీవె శుద్ధబ్రహ్మమును నీవె, సత్యంబు నీవె ప్రజ్ఞాన మీవె
ప్రకృతివర్గము నీవె వికృతివర్గము నీవె, సౌఖ్యసంచయమనీషయును నీవె
నీయాత్మలోపల నిద్రించెదవు నీవె, తనుభావమున మేలుకొనెద వీవె
గీ. పురుషుఁ డొక్కఁడె పుత్రాదిభూరినామ, ధేయములచేతఁ బొల్చెడిచాయ నీవె
హరిహరవిరించిశైలవృక్షాద్యనంత, నామముల వెల్గుచుందువు నళిననాభ.
గీ. సచ్చిదానందమయముగా జగములందు, భాసిలుచు నుండునట్టిరూపంబు నీవె
యత్పరిజ్ఞానమున సంశయములు గర్మ, ములును బాయునో యాదివ్యమూర్తి నీవె.
క. కానంగరాదు లేశం, బేనియు నీకంటె భిన్న మీశ్వర యెందుఁ
గానిచిన నీవె సర్వము, నానాత్వము మూఢకల్పనమె యండ్రు బుధుల్. 2479
గీ. ఖగము ఖసమము ఖంబు హృత్ఖగము ఖాది
ఖాధికము ఖక్రియమును నై ఖాది నెల్ల
ననుభవించి తదంతంబునను ఖమూర్తి
యగుచుఁ దేజరిలెడిపరమాత్మ వీవె. 2480
గీ. ఆదిమధ్యాంతవిరహిత మప్రమేయ, మణువుకంటెను నణు వధికాధికంబు
నిర్గుణము నిర్వికారము నిర్వికల్ప, మఖిలమయమును నైనబ్రహ్మంబు నీవె. 2481
సీ. సర్వభూతములందు సద్రూపముగ నుండు, నట్టివానిఁగ యోగులైనవారు
ధ్యానించుచుందురో వేని నెవ్వాని నహం, బ్రహ్మాస్మి యనుచును బ్రహ్మవిదులు
భావించుచుందురో పరతత్త్వముగ నెంచి, యెవనిస్వరూపంబు నెఱిఁగికొనిన
జనుల కహంకారమును మమత్వంబును, మాయయు మోహంబు మాయమగునొ
గీ. యత్ప్రబోధంబునను ధన్యు లఖిలవిషయ, వాంఛలను విడనాడి నిర్వాసనముగ
దృశ్య మంతయు నాత్మగా నెంచికొనుచు, సంచరింతురో వాని నే శరణుచొత్తు 2482

గీ. మోహవహ్నిజ్వాలజ్వలనవ్యూహమందు, నున్నను యదీయనామపయోధరంబు
నండఁగొనుమానవుండు దగ్ధుండు గాఁడొ, దేవదేవోత్తముఁడు వాఁడె దిక్కు నాకు.

సీ. ఎవనినామము స్మరియించిన నెపుడేని, పాపంబు లెల్లను భస్మ మగునొ
యెవనినామము స్మరియించిన నెపుడేని, దారిద్ర్య మది దరిద్రతను గొనునొ
యెవనినామము స్మరియించిన నెపుడేని, జాడ్యంబు లెల్ల ధ్వస్తంబు లగునొ
యెవనినామము స్మరియించిన నెపుడేని, దుఃఖంబు లన్నియుఁ దొలఁగిచనునొ

గీ. యెవనినామంబుఁ దలఁచిన నిహపరంబు, లందు విజయంబు గలుగునొ యా మహాత్ముఁ
డాయనాదినిధనుఁ డాయనంతశక్తి, యు సమస్తజగద్యోని యండ నాకు. 2484

ఆ. సకలవేదగదితసరణి జగద్వ్యాపి, హరియ యగున యోని యస్మదీయ
విష్ణుభక్తి సుంతఁ దృప్త మైనను లేక, క్రమముగను బ్రవృద్ధిఁ గాంచుఁగాక. 2485

గీ. అంబుజాక్షునికంటె శబ్దార్థసంవి, దర్థములు వేఱు గాని సత్యంబ యోని
యు గమోక్తినిజేసి న న్నింట నుంచుఁ, గాక యెప్పుడును సంసారకర్దమంబు. 2486

గీ. బీజమును యోనియును లేనిబీజమందు, జీవసంజ్ఞను భాసిల్లుదేవదేవుఁ
డాత్మభవబీజమును స్వవిద్యాసిచేత, శీఘ్రముగ ముక్కముక్కలు చేయుఁగాక.

క. త్రితనువులఁ దాల్చి సృష్టి, స్థితిలయములు త్రిగుణములను జేసెడిపరమా
త్ముఁ డనంతుఁడు ప్రసన్నుం డై, సతతంబును దర్శనం బొసఁగుత నాకున్. 2488

క. సురవర్గము ప్రార్థింపఁగఁ, బరిపాలింపంగ ధర్మపథమును విశ్వం
భరపై దశవిధముల నవ, తరించినమహాత్ముఁ డొకఁడె దైవము నాకున్. 2489

గీ. ఒక్కరుండనె నేను బహుత్వ మొందు, వాఁడ నని యెంచికొని లో నెవండు సకల
సృష్టి గావించి యందులోఁ జేరి క్రీడ, లాడు చుండెనొ వాని నే నాశ్రయింతు.

ఆ. జగము లెల్ల నెవనిసత్తచే నిలుచునొ, తేజరిలునొ యావనిదీప్తిచేత
సంతసిలునొ యెవనిసంతోషమున లేని, వస్తువు ప్రియముగను సవనిఁ గొలుతు.

సీ. కొలుచు చుందురు సాంఖ్యులు ప్రధానముగనిఁ, బరుఁడై ప్రకాశించుపురుషునిఁగను
శ్లాఘించు చుందురు సౌగతుల్ బుద్ధిఁగాఁ, దర్కులపతర్కవితర్కములను
ధ్యానించు చుందురు జైనశాస్త్రజ్ఞులు, దేహప్రమాణప్రదీపితునిఁగ
వచియించు చుందురు చార్వాకులు యోగవి, ద్యాప్రౌఢభూతచైతన్యముగను

గీ. సచ్చిదానందరూపుని జన్మమృత్యు, వర్జితుని భేదశూన్యుని వాస్తవికుని
నౌపనిషదవచోలక్ష్య మైనవాని, నద్వితీయునిఁ బరుని నవ్యయుని నిన్ను. 2492

క. కొందఱు శబ్దం బందురు, కొందఱు చిచ్ఛక్తి యంద్రు కొందఱు ప్రాణం
బందురు కొందఱు దేహం, బందురు గోవింద యవిదితాత్ములు నిన్నున్. 2493

గీ. ఖాదిభూతంబులును నింద్రియములు విద్య, యును నవిద్యయును శరీరమును స్రుగాది
కరణహోతృహవిఃపావకములు మఖము, ఫలము తత్ఫలదాతృభోక్తలును నీవె. 2494

క. యువతులయెడ యువచిత్తము, యువతీజనమానసములు యువయెడ నెట్టుల్
తవులువడు నట్లె నీపయిఁ, దవులువడుంగాక నాహృదయము ముకుందా. 2495

క. వనజాక్ష యెన్నిపాపము, లను జేసిన నీపదంబులను బట్టినవా
నిని గాలకింకరులు గనుఁ, గొనఁ జాలరు రవిని గుడ్లగూబలుఁబోలెన్. 2496

ఆ. అంతవఱకె బాధ లన్నియుఁ బీడించు, నంతవఱకె యఘము లడిచివైచు
నెంతవఱకు నాశ్రయింపఁడో మానవుఁ, డంబుజాక్ష నీపదాంబుజముల. 2497

క. తమ్మును దమకంటెను భి, న్నమ్ముగ సకలమును మునిజనమ్ములు యద్బో
ధమ్మునఁ గాంతురొ సన్మా, త్రమ్ముగ నాసర్వగతునిఁ దలఁచెద నిమ్ములన్. 2498

క. జాతిక్రియాగుణంబులు, చేతోవాగ్బుద్ధులును స్పృశింపవొ యెవనిన్
స్వాతంత్ర్యోపేతుని స, ర్వాతీతునిఁ దెలుతు నంతరాత్మను వానిన్. 2499

గీ. అనఘు లగువార లెవ్వని ధ్యానమునను, వశము గావించుకొని యపవర్గమును
గౌఁగిటను గ్రుచ్చి యాత్మసుఖంబు ననుభ, వించు చుందురొ వాని భావింతు నేను.

గీ. పరిభవంబును గనుకొ తాపత్రయంబు, కామలోభాదిశత్రుషట్కము షడూర్మి
వారమును నాఱుభావవికారములును, దరియఁజాలక యెవని నాతని భజింతు. 2501

గీ. కార్యవర్గంబు నెల్లఁ దత్కారణముల, లోన లయ మొనరించుప్రజ్ఞానఘనులు
కార్యకారణవర్జితాకారుఁ డైన, వేనిలోఁ జేరుదురొ నేను వాని నెంతు. 2502

సీ. ఎవనిధ్యానం బనియెడిగండగొడ్డలి, ఖండించునొ విషాదకాననంబు
నెవనిధ్యానం బనియెడిమహాగ్రీష్మాత, పం బాఱుచునొ సంశయాంబునిధిని
గాల్చునొ సకలలోకముల నెవ్వనిధ్యాన, మనియెడిప్రళయకాలానలంబు
హరియించునొ యవిద్య యనుతమిస్రంబు నె, వ్వనిధ్యాన మనెడిభాస్వత్ప్రదీప్తి

గీ. యాయనాథశరణ్యుని నాప్రసన్న, మూర్తి నాస్వామి నాప్రపన్నార్తిహరుని
నాదయాసాగరుని నాసమస్తవస్తు, భాసమానస్వరూపునిఁ బ్రస్తుతింతు. 2503

సీ. వేదంబు లెల్లను విష్ణునిశ్శ్వాసంబు, లనియెడిమాట యథార్థ మేని
యఖిలభూతంబులు హరియుదరంబులో, నివసించు ననుమాట నిక్క మేని
జంగమస్థావరజగము లన్నియుఁ గూడ, శార్ఙ్గియె యనుమాట సత్య మేని
కర్తయు భర్తయు హర్తయు నిందిరా, దయితుండె యనుమాట తథ్య మేని

గీ యచ్యుతునిపైని నా కుండినట్టిభక్తి, నిజగురునిమీఁద నుండుట నిజమ యేని
గురువె హరి యనుమాట నిక్కమ యేని, నాకు దర్శనము నొసంగుఁగాక శౌరి.

—: మహావిష్ణువు దేవద్యుతికిఁ బ్రత్యక్షమగుట :—

క. అని శపథంబులు పల్కుట, యును దన్నిర్వ్యాజభక్తియోగమునకు హృ
ష్టిని జెంది సపరివారము, గను దేవద్యుతికి శార్ఙ్గి కానంబడియెన్. 2505

సీ. మందహాసప్రభామధురాననమువానిఁ, గస్తూరికాతిలకంబువాని
అంభోరుహచ్ఛదాయతనేత్రములవానిఁ, గరుణాకటాక్షవీక్షణమువాని
వైజయంతీలసద్వక్షస్స్థలమువానిఁ, గటిధృతకనకాంశుకంబు వాని
సమధిష్ఠితోరగాశనవాహనమువాని, జలదసన్నిభతనుచ్ఛాయవాని
గీ. భుజచతుష్టయధృతగదాంభోజశంఖ, చక్రములవాని శ్రీసముజ్జ్వలుని నమర
బృందపరివేష్టితునిఁ జిదానందమూర్తి, నచ్యుతునిఁ గాంచి యంత నాయవనిసురుఁడు.
క. పులకాంకితగాత్రుం డై, జలజల నశ్రువులు రాల సంతసమునఁ గ
న్నులమండి నేలపైఁ బడి, సలిపెను సాష్టాంగవినతి జలజాక్షునకున్. 2507
గీ. అప్పు డాబ్రాహ్మణుఁడు నిజహర్ష మంతె, కంతకును బొంగి పొరలంగి నవధి వోలె
బ్రహ్మభావంబు నొందినపగిది నొడలు, చిత్తమును విస్మరించి విశ్లేష్టుఁ డయ్యె.
సీ. అంతట గోవిందుఁ డతనిమేను స్పృశించి, కరముచే సాజ్ఞను గలుగఁజేసి
భక్తాగ్రగణ్య మద్భావంబునను నీవు, సర్వకర్మంబుల సన్యసించి
శరణుచొచ్చితివి నాచరణంబులనె దానఁ, ద్వద్భక్తి నన్నుఁ ద్వద్వశునిఁ జేసెఁ
ద్వత్కృతస్తోత్రంబువలనఁ బ్రత్యక్షంబు, కాక తప్పమిని నేఁ గాన బడితి
గీ. మత్సగుణరూప మిది దీని మానసమున
ధ్యాన మొనరింప విజ్ఞాత మగు మదీయ
నిర్గుణాకార మద్దాన నిజము నెఱిఁగి
ధ్యాత యగువాఁడు నాలోన నైక్య మొందు. 2509
క. మద్దర్శనం బమోఘుం, బద్దాన వరంబు నిత్తు నభిలాషము నీ
కెద్దానఁ గలదొ కోరుము, విద్దెయొ యాయుకొ ధనంబొ వే తే దేనిన్. 2510
క. అనవుడు దేవద్యుతి యి, ట్లనియె విలోకించుచును దదాకారంబున్
గనులార దేవ నీద, ర్శనలాభమె సకలవిధవరంబులు నాకున్. 2511
సీ. అభిలషించుచు నుందు రనవరతంబును, భవదీయదర్శనభాగ్య మొంద
జలజాసనాదినిర్జరకోటులును గపి, లాదిసిద్ధులు సనకాదిమునులు
నీమంగళాకృతి నిమిషమాత్రము నేత్ర, పర్వంబుగాఁ గానఁబడియె నేని
దగ్ధంబు లగు నహంతామమతోపల, బ్ధంబు లైనశుభాశుభంబు లెల్లఁ
గీ. గలిగె నాజన్మకర్మబుద్ధులకు ఫలము, కాంచుటను నిన్ను నేఁ డింతకంటె నాకుఁ
బ్రార్థనోచిత మైనవరంబు లేదు, కాన భవదంఘ్రిభక్తిభాగ్యమునె యిమ్ము. 2512

— యోగసారస్తవమాహాత్మ్యకథనము :—

సీ. అని పల్కుటయును నారాయణుం డొంతే తేని, సంతోషమును జెంది స్వాంతమందు
బ్రాహ్మణోత్తమ నీవు ప్రార్థించినట్టులె, నీభక్తి స్థిరముగా నిలుచుఁగాక
మఱియుఁ ద్వత్కృత మైనమామకస్తోత్రంబుఁ, బఠియించువారు మద్భక్తిచేతఁ
బరమపావను లయి పడయుదు రైక్యంబుఁ, దుదకు నాలో జన్మదుఃఖ ముడుగ

గీ. నని వచించి యంతర్ధాన మయ్యె నంత, నాఁడునాఁటికి భక్తి లోనన నిమగ్నుఁ
డగుచు దేవద్యుతి వసించె నడవియందు, కలుగమిని వాంఛ లోకసంగంబునందు.

సీ. అధ్యాత్మయోగతత్త్వాలంకృతము మహా, దయకరం బఖిలపాతకహరంబు
స్వాత్మబోధప్రదాయకము మోక్షార్థిశ, రణ్య మీయోగసారస్తవంబు
వైనతేయుండు దేవద్యుతివలనఁ గై, కొని మున్న బఠియించుకొనుచు దీని
సకలకార్యములందు జయ మొందుచును నొక నాఁడు ప్రార్థింపంగ నాకుఁ జెప్పె

గీ. దీనిలోఁ గలమహిమంబు నేను గాంచి, పఠన మొనరించు చుంటిని ప్రతిదినంబు
నిది పఠించుచు నుండిన నెడఁదలోన, బాహ్యబుద్ధి జనింప దెప్పటికిఁ గూడ. 2514

సీ. ఇంద్రియంబులకు దుర్వృత్తి గల్గదు మాన, సంబు దురాశావశంబు గాదు
కలుగు దీర్ఘాయువు గలుగు నారోగ్యంబు, గలుగు నైశ్వర్యంబు గలుగు బలము
బహుపుత్రపౌత్రప్రపౌత్రాదిశాఖాళి, భూషితం బగువంశభూరుహంబు
సకలపాపములు భస్మం బగు ధర్మార్థ, కామమోక్షము లగుఁ గరగతములు

గీ. ప్రేతభూతపిశాచరాత్రించరాది, బాధలును నగ్నిచోరాద్యపాయములును
నఖిలపీడలును దొలంగి సుఖము లొదవు, యోగసారంబు చదివిన నొక్కమాఱు.

గీ. యోగసారంబుఁ జదివిన నొక్కమాఱు, మూఁడుమార్లు చతుర్వేదములను సాంగ
ముగను బారాయణ మొనర్చి పొందుఫలము, బడయఁగావచ్చు నెంతటిపాపి యేని.

క. ఒనగూడు విష్ణుదర్శన, మును జేసెడిభాగ్య మెట్టిమూఢాత్మున కై
నను యోగసారమును జది, విన వినినను నర్థ మెఱిఁగి విస్పష్టముగన్. 2517

గీ. శ్రద్ధతోడను గంగాదిసకలపుణ్య, తీర్థములలోనఁ బలుమార్లు తీర్థమాడి
నట్టిపుణ్యంబు చేకూరు సార్థముగను, యోగసారంబు వినినను నొక్కమాఱు. 2518

సీ. అట్లు దేవద్యుతి హరిభక్తివివశుఁ డై, యుండ నవ్వనములో నొక్కనాఁడు
వచ్చి యొకపిశాచ మచ్చటి కొకవిభీ, తకవృక్షమును జేరి దానిక్రిందఁ
గూర్చుండి యాఁకలిపేర్చిచ్చు దగ్ధంబు, గావించు చుండంగఁ గాయ మెల్ల
నేడ్చు గొల్లున వన మెల్ల మాఱ్మ్రోఁగ నా, యార్పు దేవద్యుతి యాలకించి

గీ. యఖిలభూతదయాశాలి యగుటఁ జేసి, యేడ్పు వినవచ్చు చుండెడియెడకు వచ్చి
సత్వరంబుగ నాపిశాచమును జూచి, యెవ్వఁడవొ నీవు విలపింప నేల చెపుమ. 2519

వ. అని ప్రశ్నించుటయు నాపిశాచంబు తత్తేజముం గాంచి యాతని మహానుభావునిం
గాఁ దలంచి దూరంబున నిలువంబడి సవినయంబుగాఁ జేతులు జోడించికొని యిట్లనియె.

—: చిత్రమహారాజవృత్తాంతకథనము :—

సీ. అమలాత్మ నాచరిత్రము నాలకింపుము, విన్నవించెద నీకు విశదముగను
ద్రవిడదేశస్థమాధవ్యుఁడను నేను సో, మాన్వయంబునఁ బుట్టినట్టివాఁడ

ననుఁ జిత్తుఁ డందురు జను లెల్ల ధనమదాం, ధ్యంబునఁ గన్ను గానంగరామి
సతతంబు స్త్రీజనాన్వితుండ నై విష్ణునా, మము కర్ణమునఁ బడ్డ మాడిపడుచు
గీ. విష్ణుమహిమంబుఁ దెలిపెడివేదములను, వేదములను బఠించుపృథ్వీసురులను
బరిభవించుచు నాయొద్దఁ బరుసిఘునని, చెప్పువారల నెల్ల శిక్షించు చుంటి. 2521
గీ. అప్పు డప్పుడు నామంత్రు లరుగుదెంచి, ధర్మములు చెప్పు చుండ నాదరిని వారి
నాలుకలు చీల్చి కత్తిచేఁ జీలికలుగఁ, జనుపసాగితి ననుఁ గొల్చి బ్రతుకుఁ డనుచు.
ఆ. అట్లు కొంతకాల మరుగంగి నొకనాఁడు, కాలవశము నొందఁగలుగువేళ
దాపరిలుట దాని దాటఁగాఁ గలశక్తి, లేమి నుడిగితిని గళేబరంబు. 2523
వ. అంతట వేదబాహ్యుండ నైననాకు వేదోక్తవిధానంబున నౌర్ధ్వదైహికకర్మంబు నిర్వ
ర్తింపంబడదయ్యె. 2524
సీ. అప్పుడు యమదూత లరుదెంచి కాలపా, శములచేఁ గట్టి గాఢముగ నన్నుఁ
బడవైచి కంటకపావకజ్వాలాశ్మ, ఫణివృశ్చికక్రూరపథములందు
నీడిచికొనిపోయి యేడ్చు చుండఁగ నేను, బ్రద్దలై మే నెల్ల రక్తముగల
నంతకునిసమక్షమందు నిల్పఁగ నాతఁ, డతిదారుణం బైనయాజ్ఞ నొసఁగె
గీ. నంతటఁ గృతాంతభటులు నన్నుచటనుండి, లాగికొనిపోయి దండకోలాహలాది
ఘోరనరకంబులం దెల్లఁ గూల్చి కాల్చి, చీల్చి వ్రేల్చి త్యజించిరి చివర కంత.
వ. కర్మశేషానుభవంబునకై హిమవత్పర్వతంబునఁ బిశాచజన్మముం బడసి క్షుత్పిపాసా
పీడితుండ నై తినఁ దిండియు నుండఁ జోటును లేక పరిభ్రమించుచుఁ దుద కీయరణ్యా
మునకుం జేరి యడవిచిచ్చు వెచ్చపెరఁగి కాల్చు చుండ నేడ్చు చుంటి. విష్ణు
ద్వేషదోషంబునంజేసి యనేకసప్తతియుగంబులు నానాఘోరనరకయాతన లనుభవించి
కడ కీపిశాచజన్మంబు సంపాదించుకొంటి. 2526
సీ. ఎవనినామము స్మరియించినంతనె సర్వ, పాతకంబులు గూడ భస్మ మగునొ
యెవఁడు లోకంబుల నెల్లఁ బాలించుచుఁ, జలుపునొ ధర్మసంస్థాపనంబు
నెవఁడు కర్మంబుల కెల్ల ఫలం బిచ్చు, దేవుఁడు గాఁగఁ గీర్తింపఁబడునొ
యెవని నిత్యము భజియించు చుందురొ బ్రహ్మ, భవమహేంద్రాదిసుపర్వు లెల్ల
గీ. నెవని దర్శింపఁ దాపసు లేండ్లకొలఁది, నవయు చుందురొ ఘోరకాననములందు
నఖిలలోకసమారాధ్యుఁ డైనవాని, పైని ద్వేషంబు గలిగె నాపాపమునను. 2527
గీ. ప్రాగ్భవసహస్రలబ్ధపుణ్యంబువలన, సంభవించినమర్త్యభుజన్మ మెల్లఁ
దగులఁబడిపోయె నక్కట దైవహతుండ, నై ననాకుఁ గలుగునె యుత్తమశాంతి.
గీ. అనవధికదుఃఖవీచిమాలాకులాఘ, ఘోరసాగరమునఁ బడి కొట్టుకొనెడి
నాకు నేపుణ్యమూర్తి యైనను గరావ, లంబనం బిచ్చువాఁడు గలండొ లేఁడొ.
క. నే నీయాపత్సింధువు, నేనాఁటికి నైన దాఁటి యీవలఁ బడినఁ

దానవవైరిపదాబ్జ, ధ్యానసపర్యల కొనర్తు నాత్మార్పణముల్. 2530

క. అని పలికె యేశ్వ గొల్లున, విని దేవద్యుతి విమూఢ విష్ణుద్వేషం
బనఁగను నాత్మద్వేషమె, యనుకొను మఖిలాంతరాత్ముఁ డాతఁడె యగుటన్. 2531

గీ. ఎవని కర్పింపఁబడినవె యెల్లకర్మ, ములును గాంచునో సాఫల్యమును సమస్త
కర్మఫలదాత యైనయ ఘనుని విడుచు, బుద్ధిహీనుఁడు దుర్గతిఁ బొంద కున్నె.

సీ. కుజనులు కొందఱు నిజబుద్ధిబలముచే, నిగమాగమాచారనియమములకు
విపరీతముగఁ జేసి వివిధకువాదముల్, వానిచే బాలిశు లైనజనుల
నమ్మించి విష్ణునిందయు వేదనిందయు, భూసురనిందయు బోధపఱుపఁ
బ్రాచీనమార్గముల్ పరిహరించి నవీన, పథములం జిక్కి విభ్రాంతు లగుచుఁ

గీ. దదసదుక్తుల వేదశాస్త్రములకంటె, నధికముగ నెంచికొని యట్లె యాచరించి
ధనమదాంధులు మూర్ఖులు దగ్ధమతులు, కడకుఁ జెడుదురు నీవలె గతులు లేక.

ఆ. నీకు సుగతి గల్గనేరదు కోటిజ, న్మముల కైనఁ గాని మనసులోనఁ
జలిపినట్టిపనికిఁ గలిగెఁ బశ్చాత్తాప, మందువలన శుద్ధి నొందఁగలవు. 2534

సీ. చని ప్రయాగక్షేత్రమునకుఁ దపోమాస, మున సితాసితతోయమున మునింగి
కర్మదోషవిముక్తిఁ గాంచు ముపాయాంత, రము లేదు నీకు శ్రేయము ఘటిల్లఁ
గావించె ధరణి నపావృతస్వర్గమో, క్షద్వారముగఁ బ్రయాగమును ధాత
పాతకశృంఖలాబంధంబు ఛేదింపఁ, గలకుఠారము ప్రయాగం బొకండ

గీ. జాహ్నవీయమునాజలజ్వాలన మేషఁ, దుచ్ఛపాతకఘనసందోహ మేషఁ
దత్పయస్స్పర్శమాత్రపతత్పిశాచ, కాయుఁ డైనవసు వమరలోకమున కరిగె. 2535

క. అని నుడువుటయుఁ బిశాచము, వినయంబునఁ జేతు లొగ్గి విప్రోత్తమ నా
మనమునఁ దద్వసువారి, త్రను వినఁగ జనించెఁ గోర్కె దయతోఁ జెపుమా. 2536

—: వసుబ్రాహ్మణవృత్తాంతకథనము :—

సీ. అని వేఁడుటయును నిట్లనియె దేవద్యుతి, వినుము కేరళదేశమునను మున్ను
వేదపారగుఁ డైనవిప్రుఁ డొక్కఁ డుండె, వసునామధేయుఁడు వసుఘనుండు
తద్ధనంబును జూచి దాయాదు లోర్వక, బహువిధంబుల వాని బాధపెట్టి
యపహరింపఁగ ద్రవ్య మంతయు నాతండు, నిర్ధనుం డై యూర నిల్వలేక

గీ. పరితపించుచు దేశముల్ తిరిగి తిరిగి, చిట్టచివరకు వింధ్యాద్రిఁ జేరి యచటఁ
దిరుగుచును గాలవశమున మరణ మొంది, యచ్చటనె ప్రేత యగుచు నల్లాడఁ దొడఁగె.

ఆ. అతఁ డదత్తదానుఁ డగుటను దత్కర్మ, ఫలము గాఁగఁ బ్రేతభావ మొదవె
దాన నగ్నతయు క్షుధాతృష్ణలును వాయు, కాయమును వికారగతియుఁ గలిగె.

సీ. ఆత్మవిద్యను జెప్పునట్టివారలు హరి, కాత్మార్పణము సేయునట్టివారు
చకితగోవిప్రరక్షణము సేయనివారు, పుణ్యతీర్థములకుఁ బోనివారు

వీతిహోత్రమున హవిస్సు నుంపనివారు, భిక్ష నీయనివారు భిక్షుకులకు
స్వర్ణగోభూఫలవస్త్రతాంబూలజ, లాన్నదానము సేయనట్టివారు
గీ. తెలుపఁబడుట నదత్తదానులుగ వేద, శాస్త్రములలోన వారలు చచ్చి రేని
ప్రేతరక్షఃపిశాచశరీరములను, నొంది పుట్టుదు రవలఁ గుయోనులందు. 2539

వ. మఱియును బ్రహ్మస్వహర్తలును స్త్రీధనహర్తలును బరద్రవ్యహర్తలును బరవంచకులును ధూర్తులును దాంభికులును గపటచిత్తులును బకవృత్తులును జోరులును సత్యవర్జితులును బాలవృద్ధాతురస్త్రీజనులయందు దయ లేనివారును నిష్ఠురులును గరదులును గూటసాక్షులును నగ్న్యాగాములును గ్రామయాజకులును బితృమాతృపుత్రపాపత్యకళత్రత్యాగులును లుబ్ధులును నాస్తికులును ధర్మదూషకులును యుద్ధమునందుఁ బ్రభువును విడిచి పఱచువారును శరణాగతత్యాగులును గోభూహర్తలును రత్నదూషకులును దీర్ఘక్షేత్రములందుఁ బ్రతిగ్రహము సేయువారును బరద్రోహచింతులును బ్రాణిహింసకులును బరాపవాదులును దేవతాగురునిందకులును దుర్దానప్రతిగ్రాహులును నదత్తదానతుల్యులుగాఁ బరిగణింపఁబడిరి. 2540

క. ఆపాపుల కెల్లరకును, నేపగిదినైనఁగాని యిహపరములలోఁ
జూపట్టదు సుఖలవమును, దాపత్రయవీతిహోత్రదాహము దక్కన్. 2541

ఆ. కానఁ గర్మగతిని గమనించి బుద్ధిమం, తులు నిషిద్ధకర్మములను విడిచి
స్వర్గమోక్షములకు సాధనం బగుధర్మ, మాచరింపవలయు నహరహమును. 2542

క. కొందఱు దానము యజ్ఞముఁ, గొందఱు గురుదేవతలను గొందఱు తపముం
గొందఱు మంత్రములఁ గొందఱు, కొందఱు దీర్థమును గొలిచి కొందురు సుఖముల్.

వ. ఆవిధంబున వసువు ప్రేత యై వింధ్యపర్వతంబునం దల్లాడుచు. 2544

సీ. ఒకదివసమున దైవికముగా మార్గము, నందుఁ బోయెడియొక్కయవనిసురునిఁ
గనుఁగొని తత్కరంబున నున్నకుంభంబుఁ, గాంచి పిపాసచే గాసిలుటను
జని వానిదరికిఁ బ్రాంజలి యయి ప్రార్థించె, జలముచేఁ బ్రాణంబు నిలుపు మనుచు
నంతటఁ బాంథుఁ డిట్లనియె భీకరముగాఁ, గానంగఁబడియెడివానిఁ జూచి
గీ. యెవ్వఁడవు నీవు నీకాయ మిట్లు మాంస
విరహితము గాఁగ నెట్లు జీవించుచుంటి
త్వత్పదంబులు ధరణినిఁ దాఁక వేల
యేల నగ్నుఁడ వైతి నా కెఱుఁగఁజెపుమ. 2545

వ. అని యడుగుటయు నాతనికిఁ బ్రేత యిట్లనియె. 2546

సీ. స్వామి చెప్పెదను మచ్చరితంబు సర్వంబు, నాలకింపుము దయాశాలి వగుచు
వసుధామరుఁడ నేను వసు వనియెడిపేరి, వాఁడఁ గేరళము మద్వాసభూమి
నాశరీరము పరాన్నమునఁ బుష్టంబయ్యె, భుజియింపనైతిని భుక్తి యింట
నీఁగ కేనియు నిలి యిడనైతి భిక్షుకుల్, పీడించినను భిక్ష పెట్టనైతిఁ

గీ. బెట్టనైతి బహిర్బలి పితరులకును, శ్రాద్ధమును దర్పణంబును జలుపనైతిఁ
దుట్టతుద కంతపానీయతోయ మొసఁగి, తృషితులకు దాహ మైనను దీర్పనైతి. 2547

సీ. భ్రమియించు మండియు ద్రవ్యాశచేతను, ధర యెల్ల నొక్కక్షీరమున నేని
మునుఁగనైతిని బిత్రుముక్తికాంక్షను నొక్క, దేవత నైనఁ బ్రార్థింపనైతి
నాతిథ్య మీయమి యట్లుండ సన్నిధిఁ, వసియింపఁ జోటైన నొసఁగనైతి
నంధవృద్ధాకించనానాథజనులను, గుడిగింట నైనను గాంచనైతి

గీ. వ్యాధిపీడితునకు నింత యౌషధంబు, నైన నిప్పింపనైతి వర్షాతపముల
బాధపడు వారలకు ఛత్రపాదుకలను, నైన నర్పింపనైతిఁ బాపైతిఁ దుదకు. 2548

సీ. పిడికెడు గ్రాసంబు పెట్టనైతిని గోవు, నకటఁ దిలహోమదానంబు లేని
సంధ్యనైతిని వ్యర్థములుగఁ జేసితిని సం, క్రాంతిచంద్రార్కోపరాగములును
మఘలు యుగాదులు మన్వాదు లష్టకా, వ్యతీపాతపర్వములును నఖిలతిథులు
సర్వపుణ్యంబులు సమకూర్చు మాఘమా, సంబున స్నానంబు సలుపనైతి

గీ. స్నాన మొనరించి యూర్జమాసమునఁ దైల, దీపమును నెయ్యి నైనను జ్వాలింపఁ
జేసి యగ్నిని స్నాతుల శీతబాధ, దీర్పనైతిని మాఘకార్తికములందు. 2549

ఆ. మాఘవాదిపుణ్యమాసంబులను శీత, తోదకంబు దివ్వెలను నొసఁగనైతి
దప్పిలోనఁ బడినప్రాణుల విడిపింప, నైతిఁ బ్రోవనైతి నార్తజనుల. 2550

సీ. రోపనైతి న్యగ్రోధపాదపమును, రాపినైతి నశ్వత్థతరువు
నొంపారిదన మని యుపవాస మొనరించి, శౌరికి సంప్రీతి సలుపనైతిఁ
గాచి మొక్కనైతిఁ గాయశుద్ధిని దత్త, కృచ్ఛ్రపారాకాదికృచ్ఛ్రములను
చెట్టుపుణ్యవ్రత మేనియు నొనరించి, పాపవిముక్తిని బడయనైతి

గీ. నీచయోనఁ బ్రాగ్భవం బెల్ల వంధ్య, మగుటను నదత్తదానుఁడ నైతి దాన
నరిగిన దుఃఖప్రదజన్మంబు వచ్చెఁ, బూర్వభవకర్మజనితపాదభోగమునను. 2551

క. ఫల పీఠైలంబున మధు, ఫలమూలములు మధురపానీయనదీ
జలములు నృత్యాదిహాత్ముగి, ఫలములుగఁ ద్రావఁ దిన నపారము గాఁగన్. 2552

ఆ. ఐన నేమి నాకు నగిపడ దేదియుఁ, బూర్వజన్మపాపమునను నేసి
దవ్వత్తుకు చుంటి నర్వకరము నోలె, గాలి పీల్చుకొనుచుఁ గడపు మండ. 2553

గీ. బలము ప్రజ్ఞయు నీతియుఁ బౌరుషమును, ద్రవిణమును విక్రమమును మంత్రమును నిఖిల
జనసహాయతయు నొసంగఁజాల వెన్నఁ, డేనియును నరున కలభ్య మైనదాని. 2554

గీ. భోగమున రోగమునను వియోగమునను
మరణమున జననంబునఁ బరిణయమున
లాభమున దుఃఖమునను నలాభమునను
సుఖమునను గారణము కర్మసూత్ర మొకఁడె. 2555

సీ. క్షుద్రజాతులును మూర్ఖులు కురూపులు శౌర్య, విక్రమహీనులు విగతమతులు
కాణులు షండులు ఖంజులు నీతిహీ, నులు దురాచారులు ఖలులు శఠులు
నీచస్వభావులు నిర్గుణులును రాజ్య, మనుభవించుచు నుందు రధము లయ్యు
దానికి నంతకుఁ దా మొనర్చినపూర్వ, జన్మదానంబులె సాధనములు
గీ. గ్రామమం దుండినను నగరమున నున్న, నడవిలో నున్నఁ బర్వతమందు నున్న
దాత లగువారలకుఁ బూర్వదత్తదాన, ఫలములుగ భోగములు ముందు నిలిచియుండు.
క. తిలలను గోభూస్వర్ణం, బులఁ గన్యల భక్ష్యభోజ్యముల నాసనశ
య్యల మందిరముల వసనం, బుల నింకను నిత్తు రధికముగఁ బుణ్యాత్ముల్. 2557
సీ. ఈపర్వతంబున నింకను బ్రేతరా, క్షసపిశాచము లసంఖ్యముగఁ గలవు
ప్రాణులఁ జంపు నయ్యవి యెల్ల నతినృశం, సము వానిలోనఁ బిశాచగణము
వాసుదేవపదాబ్జదాసుఁడ వగునిన్నుఁ, గనుఁగొన్న నవి యన్నియును వడంకు
హరిభక్తికవచుల నంటఁజాలవు క్రూర, పూతనాబేతాళభూతములును
గీ. గ్రహములును దేవతలును నక్షత్రములును, బుణ్యవంతులఁ బ్రోతురు పుణ్యమూర్తి
వీవు వేదంబు సర్వంబు హృదయమునను, విష్ణునామంబు జిహ్వపై నెలయు చుంట.
క. నీ వకుతోభయుఁడవు ని, న్నేవియుఁ జేయంగఁజాల వేమియు నెందున్
గావున భీతిం జెందం, బోవకు మించుకయు నిట్లు పొడగని నన్నున్. 2559

—: వింధ్యాధిపతితత్పురోహితవృత్తాంతకథనము :—

సీ. వినుము వే నొకమాట విన్నవించెద నేను, గర్మాగతప్రేతకాయమునను
దిరుగుచు వింధ్యభూధరకాననం బెల్ల, నొక్కదినంబున నొక్కచోటఁ
గనుఁగొని ఘూసర యనునది నొకదానిఁ, జేరితిఁ దన్నదీతీరమునకు
నప్పు డొకసారసం బరుదెంచి యచటికి, సవిలాసముగఁ దనచానతోడఁ
గీ. దజలంబును గడుపారఁ ద్రావి తనిసి, పులుఁగుగమి చేరియున్నతత్పులినమందు
వరటతోఁ గూడి యలసి స్వవామపక్ష, సిహితశీర్షం బయి బిరాన నిదురవోయె.
గీ. అపుడు తత్తీరగతభూరుహంబునుండి, యొక్కకపి డిగ్గి నిదురించు చున్నదాని
కాళ్లు చేతులతోఁ బట్టఁ గదలకుండ, నెగిరెఁ గలకలఁ గూయుచు ఖగము లెల్ల.
గీ. అంతటను సారసము భయ మావహిల్ల, మేలుకొని కాలమృత్యువువోలె నెదుటఁ
గానఁబడు చున్నక్రోతినిఁ గాంచి ధైర్య, మేర్పడఁగ నాత్మలోపల నిట్టు లనియె.
సీ. వానరంబ పరాపవాదశూన్యులను బ, రప్రాణివృత్తిపరాఙ్ముఖులను
ననపకారులను నసూచకులను మాదృ, శులను హింసించుట తెలివి యగునె
శిక్షింపు మపరాధశీలుర దుష్టుల, దండనార్హులను భూధవుఁడువోలెఁ
మామకపూర్వజన్మమున మాఘస్నాన, మొనగూడుటను నాకు నొక్కనాఁడు
గీ. భూతభవ్యవివేక ముద్భూత మగుట, జ్ఞాతమయ్యె భవత్పూర్వజన్మగాథ
యంతయును నాకు నీకు నే నాశ్రితుఁడను, విడువు మింక నన్ను నామాట విశ్వసించి.

క. అనవుడు నత్యాశ్చర్యం, బును వానర మొంది పతగపుంగవ నాప్రా
గ్జననచరిత్రం బేమియొ, యనుమానింపక వచింపు మటుపై విడుతున్. 2564

వ. అని పలుకుటయు సారసం బా వలీముఖంబున కిట్లనియె. 2565

సీ. శాఖామృగంబ ప్రాగ్జన్మంబునను నీవు, వింధ్యాధిపుఁ డనుపృథ్వీధవుఁడవు
బహుకాలమునసుండి భవదన్వయంబునం, దుండునట్టిపురోహితుండ నేను
దానిచే నెఱుఁగుదుఁ దావకచరిత మం, తయును జక్కఁగను దాని వినుము
మును నీవు భూతలంబును నేలుచున్నపు, డనఘ నార్జింపంగఁ దలఁచి మదిని

గీ. బహువిధంబుల నేఁచితి ప్రజల నెల్లఁ, దత్ప్రజాపీడనానలదాహమునను
మరణమును బొంది బహువిధనరకవహ్ని, కీలలను గాలి ముప్పదివేలయేండ్లు. 2566

వ. పదంపడి కర్మశేషంబు ననుభవింప భూమిపై వానరంబుగా జన్మించితివి. 2567

గీ. ఒక్కవిప్రునివనమునం దుండునరఁటి, పండ్లగెల గాంచి తదనుజ్ఞ వడయకుండ
బలమదంబునఁ గొంటివి ప్రాగ్భవమునఁ, గపిగ జనియించుటకు నది కారణంబు.

ఆ. పూర్వకృతము లైనపుణ్యపాపంబుల, యందు లవము గూడ నక్షయముగను
బోదు సురల కైన భోగింపకుండంగ, నింక నరులమాట యెత్తనేల. 2569

గీ. ప్రాప్త మైనను బక్షిదేహంబు నాకు, భూతభవ్యపరిజ్ఞానమును జేసి
దుఃఖపడకుండఁ బ్రాక్కృతదోషఫలము, ననుభవించుచు నుంటి నహార్య మగుట.

చ. అనవుడు వానరంబు విని యంతయు సారసపక్షిరాజ నీ
కొనరినజ్ఞాన మచ్చెరియ ముప్పతిలంగను జేసె నీచరి
త్రను వచియింపు మింక వివరంబుగ నావుడు సారసంబు సి
గ్గునఁ దలవాంచి యి ట్లనియెఁ గొంకుచుఁ జెప్పఁగ నాత్మదోషమున్. 2571

సీ. నరవర మును నీవు నర్మదానదిలోన, స్నానంబు గావించి శ్రద్ధతోడ
ధాన్యఖారిశతంబు ధారవోసితి రవి, గ్రహణవేళను బహుబ్రాహ్మణులకు
నాధాన్య మిప్పించునధికారము పురోహి, తుండ నైననాకుఁ జెందుటను జేసి
యించుకించుక వారి కిప్పించి మిగిలిన, దంతయు నేఁ గొంటి నాశచేత

గీ. నమ్మహాపాపమునఁ జెప్ప నలవిగాని, కాలసూత్రాదిఘోరదుర్గతులలోనఁ
ద్ర్యయుతవత్సరములు యమయాతనలను, ననుభవించితి నది వైరి కైన వలదు.

క. పౌరోహిత్యంబు మహా, ఘోరంబు స్వభావముననె క్షోణిసురుల కా
పౌరోహిత్యము గతి గాఁ, గూరిచె విధి దాన ద్విజులు కొందు రఘంబున్. 2573

క. అందును నృపప్రతిగ్రహ, మిందునకును నందునకును నెగ్గుగ ద్విజులన్
గుందువడఁజేయు దానను, గొందురు బ్రాహ్మణులు ఘోరఘోరాఘములన్. 2574

గీ. దారుణాఘౌఘవహ్నినిర్దగ్ధమూర్తు, లైనసామాన్యసర్వాంసహానిమిషుల
ద్రవ్యము హరించుటను బురోధసుఁడు తదఘ, ధారి యై కూలు నరకగర్తములలోన.

వ. మఱియును నృపపాతకంబు నెల్ల శరీరంబున ముందుగా ధరించువాఁ డగుటం జేసి పురోధ యయ్యె నని ప్రాజ్ఞులు వచియింతురు. 2576

గీ. కడకు నే నెట్లొ దైవయోగమున ఘోర, నరకవారాశిలోనుండి దరికిఁ జేరి
క్షితిని సారసముగను బుట్టితిని గాంస్య, పాత్రమును దొంగిలించుట భగినియింట.

వ. నాకొఱకుఁ బులినదేశంబున విలపించుచుండెడియీవరట పూర్వజన్మంబున నొకబ్రాహ్మణియై యుండి కాంస్యచౌర్యంబునం జేసి సారసియై పుట్టి నాకు సతి యయ్యె. రాఁబోవుజన్మంబున మన మిరువురమును హంసలముగను నీసారసి హంసిగను బుట్టి కామరూపం బనుదేశంబునఁ గొంతకాలంబు గడపి యనంతరంబు గోయోనిసంభూతుల మై పిమ్మట మనుష్యజన్మంబు నొందంగలము. 2578

ఆ. ఇట్లు మనమె కాక యింకను నెందఱొ, కలరు స్వకృతపాపఫలము ననుభ
వించు చుండువారు విశ్వంబునం దని, చెందవలయుఁ జూవె చిత్తశాంతి. 2579

క. రాఁగలదు మంచికాలము
పోఁగల వీతుచ్ఛదేహములు మన మింకన్
లోఁగక విషాదములకున్
వీఁగక ధృతినుండి వలయు విధిఁ గడవంగన్. 2580

చ. అనుటయు వానరంబు ప్రమదాతిశయంబున మ్రొక్కి సారసం
బునకు మహాత్మ నీవు మునుపోలెఁ బ్రబోధము సేసి యిప్పుడున్
మనమునకున్ ధృతిన్ గొలిపినాఁడవు నీకు శుభంబు గల్గుఁ బొ
మ్మని విడనాడి పోయెఁ దన యాత్మను జన్మవిముక్తి గోరుచున్. 2581

మ. విని యాసారసవానరోక్తులను నే విజ్ఞానినై సంతతం
బును జింతిల్లక ప్రేతభావమునకున్ మోదంబుతో వింధ్యకా
ననమం దుండి జరించుచున్ వ్యథల నెన్నండైన నేప్రాణికై
నను గల్గింపక జన్మముక్తి కయి ధ్యానం బాత్మలోఁ జేయుచున్. 2582

క. నమ్ముము నావచనములో, యమ్మఁ బ్రసాదించి దాహ మార్పుము వెసఁ బ్రా
ణమ్ములు రక్షించినపు, ణ్యమ్మును గొను మేల చేసె దాలస్యంబున్. 2583

సీ. అదియును గాక ప్రయాగంబునుండి నీ, వరుగుదెంచుచు నుంటి వనుచుఁ దోఁచెఁ
దత్కారణమునఁ ద్వత్పాత్రస్థ మైనతో, యంబు గంగాతీర్థ మని స్ఫురించె
నది నాకు ముక్తిదం బగు సంశయము లేదు, వచియింతుఁ దత్ప్రభావంబు వినుము
గ్రామయాజకుఁ డైన బ్రాహ్మణుం డొక్కఁ డ, యాజ్యయాజనసంభృతాఘమునను
గీ. బ్రహ్మరాక్షసుఁ డై వింధ్యపర్వతమున, నుండి వర్షాష్టకము తత్సుతుండు తెచ్చి
కలుపఁగఁ దదస్థి లోకనాఁడు గంగలోనఁ, దత్క్షణమ యేఁగె దివికి నత్యద్భుతముగ.

క. కనులారఁగ నది యంతయుఁ, గనుఁగొనుటను మున్ను నేను గంగాసలిలం
బునఁ గలమహిమముఁ గంటిని, గనికర మిప్పటికి నైనఁ గలిగెనె నీకున్. 2585

గీ. ఇప్పటికి మూఁడువేలయేండ్లేఁగె వింధ్య, శైలమున నాకు నీప్రేతజన్మమునను
జెప్పితి సమస్తమును నీకు సిగ్గు విడిచి, కరుణతోడను నిమ్ము గంగాజలంబు. 2586

సీ. అని పల్కుటయును నత్యాశ్చర్య మొదవంగఁ, బాంధుఁడు విని ప్రేతభాషణములఁ
దనమదిలో నిట్లు తలపోయఁ దొడఁగెఁ బు, ణ్యాపుణ్యఫలము ప్రత్యక్షముగను
గనఁబడు చుండె లోకమున దేవమనుష్య, దైత్యతిర్యక్కీటతతులవలన
వివిధజన్మంబులవివిధరోగములవి, ద్వన్మూర్ఖధనిదరిద్రతలవలన

గీ. నట్లు కాకున్న సంగత మగునె జగము, లందు నుండెడిరీతుల నన్వయింపఁ
గానఁ బ్రాజ్ఞులు బహువిధదానములను, జేయు చుందురు హైన్యంబు చేకుఱమికి.

గీ. కలుగునెడలను నుభయలోకంబులందు, సౌఖ్య మొందెడికోరికె నలుపవలయు
శక్తికొలఁదిని జను లెల్ల సకలదాన, ములను సౌఖ్యంబు లెల్లఁ దత్ఫలమ యగుట.

గీ. ప్రాప్త మగు చుండు దత్తమైనదియె దివిని, బ్రాప్తమగు చుండు దత్తమైనదియె భువిని
గాదు ప్రాప్యంబు దత్తము గాని దెంచు, కేనియును నిహాపరములం దెంచు నేని.

గీ. ఆయువును విద్యయు ననామయమును యశము
ధనమును బ్రభుత్వమును భోగమును సుఖంబు
దాతృతయు ధర్మబుద్ధియు దక్షతయును
ధైర్యమును మంచి యెల్లను దానఫలము. 2590

సీ. అని తలంచి మనంబునందుఁ బ్రేతను గాంచి, కృప యామతిల్లఁ దా నిట్టు లనియెఁ
గావించి నేను మాఘస్నానమును బ్రయా, గమునఁ దెచ్చుచు నుంటి గాంగజలము
భృగుకచ్ఛమున వసియించునాతల్లిదం, డ్రుల కభిషేకంబు సలుప నెంచి
యార్తుఁడ వైన నీ వాసించితివి మార్గ, మధ్యమం దిదియును మానఁ దగదు

గీ. ప్రాణరక్షణ మఖిలధర్మములకంటె, నుత్తమం బని శ్రుతులయం దుక్త మగుట
మొదట రక్షించి నీప్రాణములను మరల, సలిలమును దెచ్చి పితృపూజ సలుపువాఁడ.

క. అని పలికి గాంగతీర్థం, బును బ్రేతకుఁ బోసె హస్తపుటమునఁ దత్స్వ
ర్శనమాత్రముననె ప్రేతకు, ననిమిషదేహము లభించె నాశ్చర్యముగన్. 2592

సీ. అట్లు సంప్రాప్తదివ్యాకారుఁడై వసు, వాహ్లాద మొందుచు నాత్మలోనఁ
బాంధున కొనరించి ప్రణతి దివ్యవిమాన, మెక్కి శీఘ్రంబుగ నేఁగె దివికి
నంతటఁ బాంధుఁ డత్యాశ్చర్యభరితుఁ డై, యప్పుడె మరలఁ బ్రయాగమునకుఁ
జని యథాపూర్వంబుగనె త్రివేణీతీర్థ, మును గొని భృగుకచ్ఛమునకుఁ జనియె

గీ. నని వచించుటయును జైత్రుఁ డతనిపంపు, గైకొని ప్రయాగమునకు మాఘమున నేఁగి
యటఁ ద్రివేణీజలంబున నాచరించి, స్నానమును దివ్యదేహుఁ డై చనియె దివికి.

సీ. అని చెప్పి మాఘమునందు స్నానము సేయ, నరుగదు నేను బ్రయాగమునకు
స్నాత్రోద్ధ మిూర లుండఁటును రం డనుటయు, నాపిశాచములును నాద్విజుండు

సామోదముగను నాలోమశమునివెంటఁ, జని చేరిరి ప్రయాగమునకు నంత
లోమశమౌని యాలోకించి వారల, నెల్లరఁ బ్రీతితో నిట్టు లనియె

ఆ. నిదియె తీర్థరాజ మీక్షింపుఁ డిచ్చోట, నాచరించి యజ్ఞ మబ్జభవుఁడు
సృష్టికామమునను సృజియించె జగముల, విశ్వసృజనియజ్ఞవేది యిదియె. 2594

గీ. సంతతమును జ్వలించెడి సత్తతంతు, వహ్నికుండత్రయం బిదె వహ్ని యిచటఁ
జెందినట్టులు సంతృప్తిఁ జెందఁ డెచట, నేనియును నిందె ప్రభవించె నీశ్వరుఁడు.

సీ. ఆరసాతలజట మైనయక్షయవట, క్ష్మారుహం బియ్యది జగము లెల్లఁ
బ్రళయకాలములందు జలమయంబులు గాఁగ, బద్మనాభుఁడు దీనిపత్త్రమందు
దీనిశాఖాముఖస్థానంబున మృకండు, సుతుఁడును నుండు రక్షితము గాఁగ
నీమె శ్రీకంఠునియిల్లాలు లలిత స, మస్తామరస్తూయమానచరిత

ఆ. స్వర్గదాత్రి యైనజాహ్నవి యిది యిది, యరుణలోకదాత్రి యైనయమున
యేతదుభయసంగ మిది దీనిలో స్నాతు, లైనవారు ముక్తు లైనవార. 2596

సీ. నారాయణుం డిట దారకాంక్షను స్నాన, మొనరించి పత్నిఁగా నొందె రమను
దనుజసంహారవాంఛను నీశ్వరుం డిందు, మునిఁగి త్రైపురదైత్యులను వధించెఁ
బడసె యయాతినిఁ గొడుకుగా నహుషుండు, నందనార్థము సేసి స్నాన మిచటఁ
ద్రిదివేంద్రశాపపాతిత యైనయూర్వశి, మునిఁగి యిచ్చట స్వర్గమునకుఁ బోయె

గీ. ధననిమిత్తము శక్రుఁడు మునిఁగి యిచట, నపరిమిత మైనయైశ్వర్య మందఁగలిగె
స్నాన మొనరించి సనకాదిమౌను లిచట, యోగలిప్సను జెందిరి యోగసిద్ధి. 2597

సీ. నారాయణుండును నరుఁడును నిటఁ దప, మాచరించిరి హాయనాయుతంబు
కశ్యపుఁ డిచ్చటఁ గావించి తపమును, బ్రజాధిపత్యపాత్రుఁ డయ్యె
నణిమాదిసిద్ధుల నందె జైగీషవ్యుఁ, డిచట సత్కర్మంబు లెల్లఁ జేసి
తపము నిచ్చట భరద్వాజుండు గావించి, సప్తర్షులం దయ్యె సప్తమర్షి

గీ. యీస్థలంబు ఫలం బిచ్చు నెల్ల కర్మ, ములకుఁ గాని తపోమాసమున నొసర్చు
స్నానమున కిచ్చుఫలము నెన్నంగఁ జాల, స్నాతజనపూరితం బయ్యె స్వర్గ మెల్ల.

గీ. ముక్తి నాసించువారికి ముక్తి నొసఁగుఁ, గామకాముల కొడఁగూర్చుఁ గామములను
సిద్ధులను గోరువారికి సిద్ధు లిచ్చు, తీర్థరాజంబుఁ బోలినతీర్థ మున్నె. 2599

ఆ. మును ఋచీకశాపమున నొక్కగంధర్వుఁ, డొంది కాకరూప ముర్విపైనిఁ
బడి ప్రయాగమునను బడసె శాపవిముక్తి, మాఘమాసకృతనిమజ్జనమున. 2600

—: గంధర్వకన్యావిప్రశాపమోక్షకథనము :—

క. జ్ఞానాజ్ఞానసమార్జిత, నానాపాతకవినాశనం బగు మాఘ
స్నానమునఁ బ్రయాగంబున, నానతి యిచ్చితి మునుంగుఁ డందఱు దీనన్. 2601

గీ. అనుటయును నాపిశాచము లరుగఁ డుండు, నంతవఱకును మకరమునందు స్నాన
మాచరించి వేణిజలమందుఁ దొలఁగి, శాపములు తొలిచిరి స్వస్వరూపములను. 2602
ఆ. అపుడు వేదనిధి మహానందమును బొంది, లోమశుని నుతించి స్వామి వీరి
కందఱకును క్షేమ మయ్యెడిమార్గంబు, నానతిమ్ము నాఁగ నమ్మహాత్మ. 2603
గీ. బ్రాహ్మణోత్తమ నీతనూభవుఁ డనీత, వేదుఁడు సహూత్తనియముఁడు వీరు దేవ
కన్యకలు యోగ్యశీలలు కారు మర్త్య, లభ్యలైనను బ్రాహ్మణ్యలబ్ధలైరి. 2604
ఆ. కాన వీరి నెల్లఁ గైకొని విధివిధా, నమున భార్యలుగను నడిపికొనుచు
నాశ్రమోచితంబులైన ధర్మంబుల, నీకుమారుఁ డొందుఁగాక శుభము. 2605
క. అని వచియించుటయును వే, దనిధి తదుక్తలను నిగమధర్మంబుగఁ గై
కొని తనకుమారునకు న, న్వనితలకును ధర్మ్యముగ వివాహ మొనర్చెన్. 2606
ఆ. అప్పు డాకుమారుఁ డాకన్యలును వేద, నిధియు లోమశుఁడును నిరుపమాన
హర్షవార్ధి నోలలాడిరి యోగ్యసం, ఘటన మఖిలహర్షకరము గాదె. 2607
గీ. అంతటను లోమశుఁడు స్వపదాంబుజంబు, లందు బ్రాలినవారల కందఱకును
జలిపి యాశీస్సులను మరుశైలసంస్థ, మైనస్వాశ్రమమున కేఁగె నాక్షణంబ. 2608
ఆ. అంత వేదనిధియు నాత్మపుత్రస్నుషా, సహితముగను నేఁగి స్వపురమునకు
మేను విడుచువఱకు స్నానముల్ చేసి మా, ఘుంబులందుఁ జనియెఁ గడకు దివికి.

వ. మఱియుం గొన్నివిశేషవిధులఁ జెప్పెద వినుము. మాఘ మావాస్యనాఁడు ప్రాతఃకాలంబునం జేయుస్నానంబును పితృతర్పణంబును గోదానతిలదానంబులును మాఘశుద్ధత్రయోదశి మన్వంతరంబునందుఁ గావింపంబడుస్నానదానాదులును ననంతఫలప్రదంబులు. మాఘశుక్లసప్తమి సూర్యగ్రహణతుల్యంబు. నాఁడు యవలును నర్కపత్రంబులును బుష్పములును బదరీఫలంబులును దండులంబులును నిడి దూర్వయును యజ్ఞోపవీతంబును దామ్రపాత్రమునం దుంచి సూర్యనారాయణప్రీతిగా బ్రాహ్మణున కర్పించి యుపవాసము గావించిన సప్తజన్మార్జితపాపక్షయం బగు. దానం జేసి కోటి దివ్యవర్షంబులు సూర్యలోకంబున మహాభోగంబు లనుభవించి పిదప భూమిపై మహారాజుగా జన్మించి యారోగ్యవంతుండై పూర్వాభ్యాసవశంబున సౌరవ్రతంబు నాచరించి తుదకుఁ బరమపదముం జెందు. మాఘశుక్లపక్షభానువారసప్తమి మహాజయ యనియు మాఘకృష్ణపక్షభానువారసప్తమి విజయ యనియుం జెప్పంబడు. విజయ కోటిలక్షఫలప్రద. మహాజయ యనంతఫలప్రద. అందుఁ గావింపంబడు హయరత్నసువర్ణరక్తవస్త్రధాన్యదానసౌరవ్రతంబులు మహాఫలప్రదంబులు. హయదాత సప్తసముద్రముద్రితభూమండలాధిపతి యగు. రత్నప్రదాత మహేంద్రుం డగు. స్వర్ణప్రదాత కుబేరుండగు. రక్తవస్త్రధాన్యప్రదాత సకలామరసేవ్యుం డగు. సౌరవ్రతకర్త జన్మరాహిత్యంబు నొందు. ఉత్తరాయణశుక్లపక్షభానువారంబునఁ బునక్షత్రమం దర్కసప్తమీవ్రతముం జేయువాఁడు శాశ్వతభానులోకనివాసభాగ్యంబు

నొందు. పంచమినాఁ డేకభక్తమును షష్ఠినాఁడు నక్తమును గావించి సప్తమినాఁ
డుపవాస మొనరించి సూర్యుని నారాధించి యష్టమినాఁడు పారణయు బ్రాహ్మణ
సంతర్పణంబును గావింపవలయు. ప్రతిమాసంబును భానువారంబులందు సౌరవ్రతంబు
గావించువాఁడు సూర్యప్రసాదంబున నారోగ్యైశ్వర్యంబులం బొంది కడకు సూర్య
లోకంబునఁ గల్పకోటిపర్యంతంబు నివసించి పిదపఁ బరమపదము నొందంగలుగు. 2610

—: మాఘమాహాత్మ్యపఠనశ్రవణఫలకథనము :—

క. ఈమాఘమాసమహిమము, వేమరు పఠియించువారు వినియెడివారున్
క్షేమములఁ గాంతు రిహపర, ధామంబులలోనఁ గష్టదశ లేకుండన్. 2611

క. విని యేతద్ధర్మంబులు, వినిచినపౌరాణికునకు వేడ్క జనింపన్
గనకాభరణాంబరభూ, ధనగోధాన్యాదు లొసఁగుదాతలు ధన్యుల్. 2612

క. ఆరాధింతురొ యెవ్వరు, పౌరాణికుఁ డైనద్విజునిఁ బద్మాక్షుని వా
రారాధించినవారల, వారికి హరి యిచ్చు నఖిలవాంఛితసిద్ధుల్. 2613

క. పౌరాణికుండు సాక్షా, న్నారాయణుఁ డని యెఱింగి నరుఁ డతని నెవం
డారాధించునొ వానికి, నారాయణమూర్తి ముందు నడచుచు నుండున్. 2614

వ. అని వచించుటయు దిలీపుండు మహానందముం జెంది దివ్యభూషణాంబరంబులచే వసి
ష్ఠుని సత్కరించి తదనుమతిం గొని చనియె. 2615

సీ. అని వచించుటయు ని ట్లనియె శౌనకమహా, ముని సూత నీవు చెప్పినవి యెల్ల
నమృతవర్షంబ భవాగ్నిలోఁ బడి తాప, మునఁ దహతిహ నొందుజనుల కెల్లఁ
గాని యిం కొకమాట కలదు ని న్నడుగంగ, నఖిలధర్మజ్ఞుఁడ వగుటఁ జేసి
సకలమానవులకు సంసారదుఃఖంబు, తొలఁగించి మోక్షంబు గలుగఁజేయ

గీ. సులభ మగుమంత్ర మే దైనఁ గలిగియున్నఁ, దెలుపు ముపకారము సమస్తదేహులకును
జలిపినఫలంబు నొందెదు సత్యముగను, ననుడు ని ట్లను సూతుఁ డామునివరునకు.

చ. అడిగితి వీవు మంచివిషయంబు మునీంద్ర దిలీపుఁ డిట్లె ము
న్నడుగ వసిష్ఠమౌని నతఁ డాతని కి ట్లనియెన్ నృపాల నీ
వడిగినయట్లు మున్ను సనకాదులు బ్రహ్మను గోరఁగా నజుం
డడిగె మురారి నప్పుడు మురారి విరించికిఁ జెప్పె నీవిధిన్. 2617

—: లక్ష్మీనారాయణమంత్రకథనము :—

క. వనజభవ కలదు సర్వుల, కును మోక్షము గల్గఁజేయుగోప్యతమముతోఁ
దనరారుమంత్ర మొక్కటి, యనవధికము దానిమహిమ మభివర్ణింపన్. 2618

క. పెకలించు నఖిలపాతక, నికరము నామంత్ర మొకఁడె నిర్మూలముగన్
సకృదుచ్చారణమాత్రన, ప్రకంపనం బవనిజాతపంక్తులఁ బోలెన్. 2619

క. నామంత్రం బఠి దానిన్, క్షేమం బలరార సంస్మరించెడివారల్
నాముఖ్యబంధుమిత్రులు, క్షేమంబును వారి కేను జేయుచు నుందున్. 2620
క. ఈమనుజుఁ డర్హుఁ డనియును, నీమనుజుఁ డనర్హుఁ డనియు నేను వచింపన్
నామంత్రము జపియింపఁగ, నామీఁదను భక్తి యున్ననరు లధికారుల్. 2621
సీ. మంచివంశమున జన్మించినవాఁ డైన, వేదశాస్త్రాదిప్రవీణుఁ డైన
వివిధతీర్థములు సేవించినవాఁ డైన, నియతతపఃపరినిష్ఠుఁ డైన
సర్వసంగత్యాగనిర్వాహకుం డైన, నానావ్రతానుసంధానుఁ డైనఁ
గల నైన సత్యంబు తొలఁగనివాఁ డైనఁ, గ్రతుసహస్రములకుఁ గర్త యైనఁ
గీ. బుణ్యనిధి యైనఁ ద్రైలోక్యపూజ్యుఁ డైన, జ్ఞాని యైనను గుణగణాస్థాసి యైన
మానసంబున మద్భక్తి లేనియెడలఁ, గాఁడు మంత్రాధికారంబు గలుగువాఁడు. 2622
గీ. ఉచ్చరించినఁ జాలు నొక్కసారి, యార్తులకుఁ దీఱుచుఁ దదార్తి యాక్షణంబ
తృప్తు లగుభక్తులకుఁ బ్రసాదించు ముక్తి, నమ్మహామంత్రమహిమ మత్యద్భుతంబు.
వ. ఆమ్మంత్రంబునకు మంత్రరత్నం బనియును ద్వయ మనియును బ్రపత్తి యనియును శరణాగతి యనియును లక్ష్మీనారాయణమంత్రం బనియును నామాంతరంబులు గలవు. 2624
క. పరితుష్టిఁ గొలుపఁజాలవు, శరణాగతిమంత్రజపముచాయను నానా
ధ్వరములు దీర్థాటనములు, ధరణీగోతిలహిరణ్యధనదానముల్. 2625
వ. "శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే శ్రీమతే నారాయణాయ నమః" యనుమన్మంత్రరత్నంబునకు గాయత్రి ఛందస్సు. ఋషియును దేవతయును నేన. వర్ణంబు లిరువదియేను. పదంబు లాఱు. తత్పదషట్కంబుచేతన షడంగన్యాసంబు గావింపంజను.
క. కోరిక గలిగి జపించెడి, వారికి న్యాసాదికంబు వలయు నొనర్పన్
గోరిక లేక జపించెడి, వారికి న్యాసాదికంబు వల దొనరింపన్. 2627
క. కోరి ఫలంబును మంత్ర మ, వారిగ జపియించునట్టివారలకంటెన్
గోరక ఫలమును సకృదు, చ్చారణ మొనరించువాఁడు సమధికుఁడు సుమీ. 2628
చ. ప్రకటము సేయఁగూడదు పరాకున నేని మదీయమంత్ర మా
స్తికమతి లేనివానికి నదీక్షునకున్ గురుభక్తి లేనివా
నికి నభిమానవంతునకు నీతివిహీనున కాస్థ లేనివా
నికి గుఱి లేనివానికి వినిర్మలచిత్తము లేనివానికిన్. 2629

—: ప్రపన్నస్వరూపకథనము :—

వ. మఱియును మచ్చక్రాంకితత్వంబును మదీయారాధనంబును నాయంద సర్వకర్మఫలార్పణంబును నన్నుఁ దప్ప నన్యుని నాశ్రయింపమియును నాయందు మహావిశ్వాసంబును నన్యసాధనప్రయత్నాభావంబును నాత్మీయ మేమియును లే దనునిశ్చయంబును నవై

ష్ణవసంభాషణవందనాదివర్జనంబును మదన్యదేవతాపూజాస్మరణాదిత్యాగంబును సర్వ
కాలంబులందును నన్ను స్మరించుటయుఁ దమసర్వస్వంబును నన్నుంగూర్చి వినియో
గించుటయు ననునీమహాగుణంబులు గలవారలు ప్రపన్ను లనం బరగుదురు. వారు
మత్ప్రియు లగుటం జేసి వైష్ణవు లని చెప్పంబడుదురు. ప్రపన్నులు శంఖచక్రగదాపద్మ
హస్తంబును వామాంకస్థితరమావిరాజమానంబును విశ్వరూపంబును నగుమద్దివ్య
మంగళవిగ్రహంబును ధ్యానించి నన్నుఁ బూజించి మంత్రరత్నంబును జపించుచుందురు.

ఆ. తత్కృతంబు లైనధ్యానపూజామంత్ర, జపములకును నేను సంతసింతు
నేను హర్ష మొంద నిఖిలలోకములును, హర్ష మొందు మన్మయంబు లగుట. 2631

సీ. అని తెల్పుటయును నిట్లనియె నంబుజయోని, స్వామి నామీఁదివాత్సల్యమునను
మంత్రప్రభావనామంబులఁ జెప్పితి, ధన్యుండ నైతి నీదయనుజేసి
నీవె తండ్రివి తల్లి వీవె స్వామివి నీవె, గురుఁడవు నీవె సఖుండ వీవె
నేను నీదాసుఁడ నేను నీసుతుఁడ నీ, పాత్రుండ నేను నీసఖుఁడ నేను

గీ. శరణువొచ్చితి నే భవచ్ఛరణములను, దెలిసి నియమంబు లన్నియుఁ దేటపడఁగఁ
జేసి మంత్రోపదేశంబు శీఘ్రముగను, నుద్ధరింపంగ నను గతి యొకఁడ వీవ. 2632

వ. అని వేఁడుటయుఁ జతుర్భుజుండు చతురాస్యున కిట్లనియె. 2633

క. వనజాసన మన్మంత్రముఁ, గొన నోచిన మొదట దీక్షఁగొని యావలఁ గై
కొనవలయు మంత్ర మాచా, ర్యునివలనను నెవ్వఁ డేనియును దరియింపన్. 2634

సీ. బ్రహ్మవిద్యావిశారదుఁ డైనవాఁడును, శమదమాదిగుణంబు లమరువాఁడు
బ్రాహ్మణాన్వయమందుఁ బ్రభవ మొందినవాఁడు, పరమార్థచింత యేర్పడినవాఁడు
వేదశాస్త్రములమర్యాద మీఱనివాఁడు, కామాదులకు లోను గానివాఁడు
నన్యప్రయోజనం బభిలషింపనివాఁడు, విష్ణుభక్తుం డయి వెలయువాఁడు

గీ. సంప్రదాయజ్ఞుఁడును మంత్రసారవిదుఁడు, ధర్మపరుఁడును శుచియు సత్కర్మరతుఁడు
వందనీయుఁడు నగునట్టివైష్ణవుండె, యర్హుఁ డాచార్యపదమున కబ్జజన్మ. 2635

క. ఆచారవంతుఁ డయి తా, నాచారమునందుఁ బ్రజల నందఱ నిలుపం
జూచునతనిఁ గా కన్యుని, నాచార్యుం డనుట హాఁస యనుటయె బకముల్. 2636

గీ. స్రష్ట ద్వాదశి యేనియు శ్రవణ మేని, విష్ణుభక్తుండు చెప్పినవేళ యేని
తగినయాచార్యుఁ డొదవినతఱుణ మేని, సముచితము సూవె మంత్రదీక్షను గొనంగ.

—: వైష్ణవమంత్రదీక్షావిధానకథనము :—

వ. సువర్ణంబునం గాని రజతంబునం గాని తామ్రంబునం గాని కాంస్యంబునం గాని నిర్మిం
పంబడినసుదర్శనపాంచజన్యంబులకు నాచార్యుండు పంచామృతశుద్ధోదకంబుల నభిషే
కంబు గావించి మన్మూర్తియెదుట మన్మంత్రంబుచే విధివిధానంబున వాని నర్చించి
స్వగృహ్యోక్తవిధానంబున నగ్నిని బ్రతిష్ఠించి యయ్యగ్నిహోత్రంబున మంత్రరత్నం

బుచే నాజ్యహోమంబులును బురుషసూక్తాదిమంత్రంబులచే ఘృతపాయసహోమంబులును నష్టోత్తరసహస్రంబు గాని యష్టోత్తరశతంబు గాని కావించి పిదప మదీయషడక్షరమహామంత్రంబున నిరువదియాజ్యహోమంబులు గావించి యావహ్నియందు శంఖచక్రబులు తప్తంబు లొనర్చి వానిం గైకొని శరణాగతిమంత్రంబున శిష్యునకు దక్షిణభుజంబునందుఁ జక్రంబుచేతను వామభుజంబునందు శంఖంబుచేతను నంకనంబు గావించి హోమశేషంబు పరిసమాప్తి నొందించి పునఃపూజ నొనరించి మంత్రపూతం బగుకలశోదకంబును ద్వయమంత్రంబుచే శిష్యునిశిరంబున నభిషేకంబు గావించి తద్దక్షిణకర్ణంబున మంత్రరత్నోపదేశంబు చేసి మంత్రార్థంబును వృత్తియును నియమంబులును బోధింపవలయు. అంత శిష్యుండు వైష్ణవుం డై కృతార్థుండ నైతి నని భావించికొని యాచార్యుని శక్తికొలందియు గోభూహిరణ్యవస్త్రభూషణాదులచే బహూకరించి సంతుష్టాంతరంగునిం జేయవలయు. ఇది వైష్ణవమంత్రదీక్షావిధానంబు. దీనం దప్ప మఱియొంట వైష్ణవత్వంబు సిద్ధింప నేర దని మంత్రదీక్షావిధానంబు విశదీకరించి ప్రపన్నుం డైనచతుర్ముఖునకు యథావిధిని బ్రపత్తిమంత్రంబు నుపదేశించె. చతుర్ముఖుం డమ్మంత్రంబు నాకును నారదునకును నారదుండు నైమిషారణ్యవాసు లగుమహామునులకును నుపదేశించె. అమ్మహర్షులు మంత్రోపదేశంబు వడసి విష్ణుభక్తిచేఁ బరమపదంబు నొందిరి. నే నమ్మహామంత్రంబు శక్తిపుత్రుం డగుపరాశరున కుపదేశించితి. 2638

క. ఆమంత్రరాజమునకును, నేమంత్రం బేని యన్య మెన గాదు సుమీ
శ్రీమద్వైకుంఠపరం, ధామునకే దైవదైవతము లేదు సుమీ.

క. కావున నమ్మంత్రంబును, ధీమ్మవర గ్రహించి విష్ణుసారూప్యంబుం 2639
గైవసము చేసికొనుమీ, నీవును బహుభాష లేల నీకు వచింపన్. 2640

క. అనుటయు దిలీపవిభుఁ డి, ట్లనియె వసిష్ఠునకు స్వామి హరిమహిమంబున్
వినినకొలందిని మఱిమఱి, వినుటకు నుత్సాహ ముద్భవించెడి నాకున్. 2641

గీ. భవసమాహ్వయకాననాభ్యంతరంబు
నందుఁ దాపత్రయాగ్నికీలాభితప్తు
లైనవారికి హరిభక్తి యనెడియమృత
సాగరము దప్ప మఱి యొండు శరణు లేదు. 2642

క. జలజాక్షునిసేవ యెటుల్, సలుపఁగవలయునొ సమస్తసంతాపములున్
దొలఁగి సుఖింపఁగ నాకున్, దెలుపు మన వసిష్ఠుఁ డిట్లు దెలుపఁ దొడంగెన్. 2643

క. మనుజాధిప విను మిప్పుడు, నను నీ వడిగినవిధంబుననె కైలాసం
బున మున్ను శివుని గిరిసం, దన యడుగుడు నామె కపు డతం డిట్లనియెన్. 2644

సీ. విష్ణు వనంగను వేదాంతవేద్యుండు, నిత్యుండు సగుణుండు నిర్గుణుండు
సర్వలోకకరుండు సర్వలోకధరుండు, సర్వలోకహరుండు సర్వశక్తి

సర్వాత్మకుండును సర్వేశ్వరుండును, సర్వతోముఖుండును సర్వసాక్షి
సవితయుఁ బరమాత్మ శంఖచక్రధరుండు, క్రతుపతియును బ్రజాపతియు శివుఁడు
గీ. వానిమహిమం బశేషంబు వాకొనంగ, నేన కాదు బ్రహ్మాదు లేనియును దగరు
శైలనందన యొకమాట యాలకింపు, మడిగితివి గాన నుడివెద నంతొ యింతొ.
క. నాకును బ్రహ్మాదులకును, నీకును సర్వంబునకును నిశ్శంకముగన్
వైకుంఠుఁ డొకఁడె సేవ్యుఁడు, చేకూర్చు నతండె సకలసిద్ధులు మనకున్. 2646
గీ. దేవి చెప్పెద వినుము సందేహ ముడిగి, ప్రేతరక్షఃపిశాచాదిభూతములును
నఖిలవిషములు నానావిధామయములు, హరిని భజియించువారలదరికి రావు.
క. గరుడధ్వజసంకీర్తన, పరులకు రాకుండ నేయుపద్రవ మేనిన్
హరిచక్రగదాద్యాయుధ, పరికరములు గాచుచుండుఁ బ్రతినిమిషంబున్. 2648
ఆ. హరినిగూర్చి తీర్థయాత్ర యేనియు వ్రతం, బేని పూజ యేని దాన మేని
యెట్టిపుణ్యకార్య మేనియుఁ జేయని, పామరులకుఁ గలుగు బాధ లెల్ల. 2649
క. ఆపదలు సంభవించును, బాపంబులవలన నట్టిపాపము లెల్లన్
రూపఱు హరికీర్తనమున, నాపద లిఁక నెట్లు గలుగు హరిదాసులకున్. 2650
క. హరికృపకుఁ జెంది పాత్రత, తరియింపఁగ నాశ యున్నతనుధారులకున్
హరిసేవ తప్ప నన్యము, శరణము లే దున్నమాట చాటితి నీకున్. 2651

—: వైష్ణవధర్మకథనము :—

ఆ. కల వనేకమార్గములు దాని నొనరింప, నచ్యుతుండు చెప్పినవియె యందు
వైష్ణవంబు నాఁగ వఱలెడి నొకమార్గ, మది వచింతు ముఖ్య మైన దగుట. 2652
సీ. వినుము కాత్యాయని ద్వివిధంబు వైష్ణవం, బాభ్యంతరంబు బాహ్యంబు నాఁగ
శంఖచక్రాదిలక్షణము బాహ్యము ధన, సదనదారసుతాద్యసంగితయును
సర్వభూతదయయు శాంతియు క్షమయును, ధర్మబుద్ధియు స్వాత్మదర్శనమును
యోగరక్తియుఁ బురుషోత్తమభక్తియు, స్వాంతశుద్ధియును నాభ్యంతరంబు
గీ. బాహ్యవర్జిత మైనయాభ్యంతరమును
నపగతాభ్యంతర మగుబాహ్యమును వితయ
కాన వైష్ణవ ముభయాత్మకంబ లెస్స
దాన వైష్ణవుఁడు తరించుఁ దప్పకుండ. 2653

—: వైష్ణవభక్తిస్వరూపనిరూపణము :—

వ. శంఖచక్రాంకనంబును నూర్ధ్వపుండ్రధారణంబును మంత్రపరిగ్రహంబును నర్చనంబును జపంబును ధ్యానంబును నామస్మరణంబును గీర్తనంబును శ్రవణంబును వందనంబును బాదసేవయును బాదోదకపరిగ్రహంబును నివేదితాన్నభోజనంబును భక్తసేవయును ద్వాదశీవ్రతనిష్ఠయును దులస్యారోపణంబును నను షోడశవిధంబుల విష్ణుభక్తి యల రారుచుండు.

—: ద్వాదశశుద్ధిస్వరూపనిరూపణము :—

హరిగృహోపలేపనంబును హరియనుగమనంబును హరిప్రదక్షిణంబును పాదశుద్ధులు గను విష్ణుపూజార్థంబు పత్త్రపుష్పోచ్చయనం బొనరించుట కరశుద్ధిగను శౌరినామ కీర్తనంబును శౌరిగుణకీర్తనంబును వాక్శుద్ధులుగను కృష్ణకథాశ్రవణంబు శ్రోత్రశుద్ధి గను గోవిందోత్సవనిరీక్షణంబు నేత్రశుద్ధిగను మాధవపాదోదకనిర్మాల్యమాలాధార ణంబు శిరశ్శుద్ధిగను వాసుదేవనిర్మాల్యపుష్పాద్యాఘ్రాణంబు ఘ్రాణశుద్ధిగను పుండ రీకాక్షస్వరూపధ్యానంబు మనశ్శుద్ధిగను పత్త్రపుష్పాదులు వైకుంఠచరణార్పణంబు గావించుట సర్వశుద్ధిగను జెప్పంబడియె. ఈద్వాదశశుద్ధులును వైష్ణవధర్మంబులుగా నెఱుంగందగు.

—: పంచవిధవిష్ణుపూజాస్వరూపనిరూపణము :—

మఱియును విష్ణుపూజ యభిగమనం బనియు నుపాదానం బనియు యోగం బనియు స్వాధ్యాయం బనియు నిజ్య యనియుం బంచవిధంబులుగాం జెప్పంబడియె. దేవతా స్థానమార్జనం బభిగమనంబు. గంధపుష్పాదిచయనం బుపాదానంబు. దేవతాత్మైక్య భావంబు యోగంబు. అర్థానుసంధానపూర్వకమంత్రజపంబును హరిసంకీర్తనంబును సూక్తస్తోత్రాదిపాఠంబును తత్త్వాదిశాస్త్రాభ్యాసంబును స్వాధ్యాయంబు. దేవతా పూజ యిజ్య యని యెఱుంగవలయు.

—: విష్ణుపూజాఫలకథనము :—

పూజాపంచకంబునకుం గ్రమంబుగా సార్ష్టిసామీప్యసాలోక్యసాయుజ్యసారూప్య ముక్తులు ఫలంబులుగాం జెప్పంబడియె. 2654

క. అవగణనము వైష్ణవునకు, నెవఁడును గావింపఁగూడ దెన్నండును వై
ష్ణవుఁడు భువనత్రయంబును, బవిత్ర మొనరించు వర్ణబాహ్యుం డైనన్. 2655

క. ఏయాశ్రమమున నున్నను, బాయక వైష్ణవుఁడు చక్రపరిధారణముం
జేయంగవలయు నది యా, మ్నాయవిహిత మగుటఁజేసి మాననఁగ రామిన్. 2656

—: విష్ణుచక్రనామనిరూపణము :—

వ. విష్ణుచక్రంబునకుం బవిత్రం బనియును జరణం బనియును నేమి యనియును సుదర్శనం బనియును సహస్రారం బనియును బ్రాకృతఘ్నం బనియును లోకద్వారం బనియును సహస్రధారం బనియును నామంబులు గలవు. తన్నామంబులును దద్ధారణప్రాశస్త్యం బును శ్రుతిస్మృతిపురాణేతిహాసంబులందుం జెప్పంబడియె. 2657

—: వైష్ణవచక్రాంకనప్రాశస్త్యకథనము :—

క. హరిచిహ్నంబులు దాల్చి, హరినిం గొలిచి రేని భక్తు లవిశంకముగన్
హరిపదము నొందుదురు స, త్వరముగ హరిభక్తి యైనధర్మం బగుటన్ 2658

వ. వైష్ణవుండు తాపనీయవిధానంబునఁ జక్రంబు నేనియు శంఖచక్రంబుల నేనియు విష్ణుపంచాయుధంబుల నేనియుఁ దప్తంబు గావించి తచ్చిహ్నంబుల భుజమూలంబులం దాల్చి విహితకర్మంబు లాచరింపందగు. శంఖచక్రగదాఖడ్గశార్ఙ్గంబులు దప్ప నితరవస్తువులు సమాశ్రయణంబున కర్హంబులు గావు. సమాశ్రయణంబు వైష్ణవునకు శ్రుతిస్మృతిసమ్మతం బగుటంజేసి యవశ్యగ్రాహ్యంబు. తత్కళత్రాపత్యభృత్యపశ్వాదులకును శంఖచక్రాంకనంబు విహితంబు. చక్రాంకితుండు గానివైష్ణవుండు సర్వకర్మబహిష్కృతుండును నుపదేశానర్హుండునుం గాన సమాశ్రయణంబు నొసంగ నధికారి కానేరండు. స్త్రీశూద్రులకుఁ జందనంబుచేతఁ జక్రాంకనంబు గావింపవలయు. బ్రాహ్మణునకుఁ దప్తచక్రాంకనంబునం దప్ప వైష్ణవత్వంబు సిద్ధింపంజాలదు. బ్రాహ్మణుండు గానివైష్ణవుండు చక్రాంకనంబు గావింప ననర్హుండు. 2659

గీ. భవనిమగ్నుల నెల్ల వైష్ణవుఁడు తాప, నీయవిధిచేతఁ జక్రచిహ్నితులఁ జేసి
పంచకర్మాధికార మేర్పఱిచి యుద్ధ, రింపవలయు జనార్దనప్రీతికొఱకు. 2660

ఆ. చక్రచిహ్నితున కొసంగినదానంబు, లుభయవంశములను నుద్ధరించుఁ
జక్రహీనునకు నొసంగినదానంబు, లసురునకు నొసంగినవియ చూవె. 2661

గీ. ఎవనిభుజములు చక్రచిహ్నితము లగునొ, యతనిదేహంబునం దుండు నఖిలతీర్థ
ములును సర్వాధ్వరక్రియాపుణ్యములును, భువనపావనుఁ డైనవైష్ణవుఁడు వాఁడె.

గీ. చక్రచిహ్నితు లైనవైష్ణవులు విష్ణు, పురమున సుఖించు చుందు రధ్వరశతంబు
సేసినను విద్య లెల్ల నేర్చినను జక్ర, చిహ్నరహితు లధోగతిఁ జెందువార. 2663

గీ. శంఖచక్రాంకనముల భుజంబులందుఁ, దనువునను నూర్ధ్వపుండ్రముల్ దాల్పకుండు
వైష్ణవుని వెడలింపఁగావలయు గార్ద, భమున నెక్కించి పురినుండి పార్థివుండు.

గీ. తనుగతము లైనపాపసంతతుల నెల్ల, దగ్ధ మొనరించుకొనియును దప్తచక్ర
చిహ్నములచేత మరలను జేయరాని, యఘములను జేయువైష్ణవు లధమగతుల.

గీ. చక్రచిహ్నంబు లేనివైష్ణవునియింటఁ, దగదు భుజియింప వైష్ణవోత్తముఁడు శంఖ
చక్రవర్జితుఁ డైనవైష్ణవుని శ్రుతులు, చాటుచుండుటఁ జండాలసన్నిభునిగ. 2666

గీ. శ్రాద్ధమందు నిమంత్రింపఁజనదు చక్ర, వర్జితుని వైష్ణవుం డగువాఁడు శంఖ
చక్రహీనున కొసఁగినశ్రాద్ధభోజ, నంబు గావించుఁ బితరుల నరకగతుల. 2667

గీ. చక్రవర్జిత మైనవైష్ణవునిమేను, పితృవనసమాన మగుటచే నతనిఁ జనదు
ముట్టఁగను గాంచఁగను గూడఁ దుట్టతుదకుఁ, దనకు క్షేమంబు వాంఛించుకొనెడివాఁడు.

క. గళమునఁ దులసీమాలయు, లలాటమున నూర్ధ్వపుండ్రలాంఛనము భుజం
బుల శంఖచక్రచిహ్నం, బులు గలిగినవైష్ణవోత్తములు సంసేవ్యుల్. 2669

క. ఉపనిషదర్థం బగుహరి, నెపుడును ధ్యానించుకొనుచు హృదయమ్ములోనన్
వ్యపగతకిల్బిషు లగువా, రపవిత్రుల నుద్ధరింతు రంబుజవదనా. 2670

క. అని వచియింపఁగ హర్షం, బున నిట్లను గౌరి యూర్ధ్వపుండ్రమహిమముఁ
విన వేడ్క గలిగె దానిని, వినిపింపుము దేవ నాకు విశదము గాఁగన్. 2671

—: ఊర్ధ్వపుండ్రమాహాత్మ్యకథనము :—

సీ. అనవుడు శర్వుఁ డిట్లనియెఁ బార్వతి విను, మూర్ధ్వపుండ్రమహత్త్వ ముగ్గడింతుఁ
బురుషోత్తముం డూర్ధ్వపుండ్రమధ్యంబున, నధివసించు రమాసమన్వితముగ
నద్దానఁ బుండరీకాక్షమందిర మగు, నూర్ధ్వపుండ్రములతో నొప్పుమేను
దానిచే వైష్ణవోత్తమునకుఁ గావించి, నను నందనము నొనర్చినను బూజ
గీ. సర్వతీర్థఫలంబును సర్వదాన, ఫలము సర్వాధ్వరఫలంబుఁ బడయఁగలుగు
దాన సకలాఘములును దగ్ధములు గాఁగ, నక్షయం బైనసౌఖ్యంబు నందఁగలుగు.
ఆ. సర్వతీర్థమయుఁడు సర్వయజ్ఞమయుండు, సర్వదానమయుఁడు సర్వపుణ్య
కర్మమయుఁడు విష్ణుకరుణావలోకన, పూర్ణకాముఁ డూర్ధ్వపుండ్రధారి. 2673
గీ. యజ్ఞదానతపస్తర్పణాదివిధుల, నూర్ధ్వపుండ్రంబులను దాల్పకుండఁ జేయు
నట్టివైష్ణవుఁ డధమాధమాధముండు, వ్యర్థములు వాఁడు చేయుకార్యంబు లెల్ల.
క. ఒనరించె నేని శ్రాద్ధం, బును వైష్ణవుఁ డూర్ధ్వపుండ్రములఁ దాల్చి క్రమం
బునను గయాశ్రాద్ధఫలం, బును గోటిసహస్రకల్పములవఱ కొందున్. 2675
గీ. శ్రాద్ధమున నూర్ధ్వపుండ్రధారణము సేసి, నట్టివైష్ణవునకు భుక్తి వెట్టె నేని
వైష్ణవుఁడు కల్పశతకోటివఱకుఁ దృప్తి, చెందుదురు వానిపితరు లానంద మొదవ.
గీ. వైష్ణవుం డూర్ధ్వపుండ్రవివర్జితునకు, శ్రాద్ధభోజన మొసఁగిన శాశ్వతముగఁ
బితరులను ఘోరకారావస్థితులఁ జేసి, నట్టివాఁ డయి తా నగు నట్టివాఁడ. 2677
గీ. ఊర్ధ్వపుండ్రవిహీన మై యుండునట్టి, వైష్ణవకళేబరం బొకవల్లకాడ
కానఁ దగ దది పరిశుద్ధు లైనవారు, ముట్టఁగను జూడఁగను గూడఁ దుట్టతుదకు.
క. ధరియించినను ద్రిపుండ్రము, శరీరమున వైష్ణవుండు సరగున వానిన్
బరివర్జింపఁగవలయున్, గిరుణింపక బుధులు మద్యఘటముంబోలెన్. 2679
వ. బ్రాహ్మణుండు శుభ్రమృత్తికచే నూర్ధ్వపుండ్రంబును క్షత్రియుండు కస్తూరిచే దిలకం
బును వైశ్యుండు గంధంబుచేఁ బట్టాకారపుండ్రంబును దాల్పందగు ననువిశేషధర్మంబు
లున్నను సామాన్యధర్మం బగునూర్ధ్వపుండ్రధారణం బెవ్వరికిని నిషిద్ధంబు గాదు.
గీ. ప్రోక్త మైనట్టిచక్రాంకనోర్ధ్వపుండ్ర, ధారణములు తిర్యక్పుండ్రధారు లైన
విప్రులకుఁ గావు విహితముల్ విహిత మగుట, వలన శాస్త్రంబులోపల వైష్ణవులకు.

—: ఊర్ధ్వపుండ్రధారణవిధానకథనము :—

క. విను మింకఁ దిలకధారణ, మునుగూరిచి దానిశ్రవణమును గావింపఁ
గను హరిసారూప్యంబును, గనఁగలుగును జూవె పాపకర్ముల కేనిన్. 2682

వ. వైష్ణవుం డగువాఁడు త్రిసంధ్యంబును నూర్ధ్వపుండ్రంబులు ధరియించి యుండవలయు. విష్ణుపాదాకారంబు గలిగి సాంతరాళం బగు పుండ్రంబునందు నారాయణుండు లక్ష్మీసహితంబుగా నుండుంగాన నట్టిపుండ్రం బవశ్యధార్యంబు. అంతరాళశూన్యం బగు పుండ్రంబు నిషిద్ధంబు. కృష్ణతులసీమూలంబునుండికాని గంగాతీరంబునుండికాని ద్వారవతియం దుండువాసుదేవహ్రదమునుండికాని పర్వతాగ్రంబును బిల్వమూలంబును జలాశయంబును సింధుతీరంబును వల్మీకంబును వేంకటాచలంబును శ్రీకూర్మంబును బ్రయాగంబును నృసింహాద్రియు మున్నగు విష్ణుక్షేత్రంబులనుండికాని విష్ణ్వభిషేకజలంబు ప్రవహించెడిస్థలంబునుండికాని మహానుభావు లగు విష్ణుభక్తు లుండెడి ప్రదేశంబునుండికాని గ్రహింపంబడినశుభ్రమృత్తికను విష్ణుపాదోదకంబుచేఁ దడిపి యూర్ధ్వపుండ్రంబులు దీర్చికొనుట యుత్తమంబు. చందనంబున నేని పసపున నేని యగ్నిహోత్రభస్మంబున నేని కావించుకొనంబడు నూర్ధ్వపుండ్రంబు సర్వజనవశీకరంబు. శ్యామమృత్తిక శాంతికరంబు. రక్తమృత్తిక వశ్యకరంబు. పీతమృత్తిక సంపత్కరంబు. శ్వేతమృత్తిక మోక్షకరంబు. వర్తులంబును దిర్యగ్రూపంబును నచ్ఛిద్రంబును హ్రస్వంబును దీర్ఘంబును విస్తృతంబును సూక్ష్మంబును వక్రంబును విరూపంబును వక్రాగ్రంబును భిన్నమూలంబును బదచ్యుతంబును నశుభంబును రూక్షంబును నారక్తంబును నంగుళ్యకల్పితంబును విగంధంబును నసహ్యంబును నగుపుండ్రం బనర్థకరంబు. నాసికామూలంబు మొదలుకొని లలాటంబున ఋజువుగా నూర్ధ్వపుండ్రం బేర్పఱుపదగు. భ్రూమధ్యంబు మొదలుకొని యంతరాళంబు కల్పింపందగు. అంతరాళం బంగుళద్వయప్రమాణంబుగ నుండందగు. పార్శ్వంబు లంగుళమాత్రంబుగా నుండందగు. లలాటంబునఁ గేశవుని నుదరంబున నారాయణుని వక్షంబున మాధవునిఁ గంఠకూబరంబున గోవిందుని దక్షిణకుక్షిపార్శ్వంబున విష్ణుని దక్షిణబాహువున మధుసూదనునిఁ గంధరంబునఁ ద్రివిక్రముని వామకుక్షిపార్శ్వంబున వామనుని వామబాహువున శ్రీధరుని శ్రోత్రంబుల హృషీకేశునిఁ బృష్ఠంబునఁ బద్మనాభునిఁ ద్రికంబున దామోదరుని ధ్యానించుచు ద్వాదశోర్ధ్వపుండ్రంబులు ధరియింపంజను. కుక్షియందును దత్పార్శ్వంబులందును దశాంగుళాయతంబుగను లలాటంబునందును శ్రోత్రయుగ్మంబునందును బృష్ఠమందును ద్రికంబునందును గంఠకూబరంబునందును జతురంగుళప్రమాణంబుగను బాహువులందును వక్షస్స్థలంబునందును నష్టాంగుళపరిమాణంబుగను బుండ్రం బుండవలయు. పుండ్రంబులయంతరాళంబులయందు హరిద్రను లక్ష్మినిగా భావించుచు నుంపవలయు. ఆదర్శంబునంగాని సలిలంబునంగాని చూచుచు నూర్ధ్వపుండ్రంబులు ధరించుట యుక్తంబు. విప్రులకు దక్షిణకర్ణంబున జలంబును వేదంబులును జంద్రాదిత్యులును వాయువును గంగయును నాసికయందు హుతాశనుండును నుండుం గావునఁ దదుపస్పర్శంబువలనఁ బారిశుద్ధ్యకాంక్షి యగు బ్రాహ్మణుండు శుద్ధిం జెందు. ద్వాదశపుండ్రంబులు బ్రాహ్మణునకు విహితంబులు. క్షత్రియుండు వాసు

దేవుని ధ్యానించుచు లలాటంబున నొక్కపుండ్రంబును బ్రద్యుమ్నుని ధ్యానించుచు వక్షంబున నొక్కపుండ్రంబును ననిరుద్ధునిఁ బురుషోత్తముని ధ్యానించుచు బాహువులందు రెండుపుండ్రంబులును వైశ్యుండు గోవిందుని ధ్యానించుచు లలాటంబున నొక్కపుండ్రంబును గృష్ణుని ధ్యానించుచు వక్షంబున నొక్కపుండ్రంబును స్త్రీశూద్రాదులు నారాయణుని ధ్యానించుచు లలాటంబునం దొక్కపుండ్రంబు ధరింపవలయు. ఎల్లవారును లలాటంబుమొదలుకొనియే పుండ్రధారణంబు గావింపవలయు నందఱకును లలాటంబునం దూర్ధ్వపుండ్రంబు మొదటిదిగాఁ జెప్పంబడియె. అశ్వత్థపత్త్రాకారంబును వేణుపత్త్రాకారంబును బద్మకుట్మలాకారంబునుం గలపుండ్రత్రయంబు మోక్షదాయకంబు. విష్ణుపాదాకారంబుగాని దండాకారంబుగాని కలయూర్ధ్వపుండ్రంబు భాగవతులకు విహితంబు.

—: గోపీచందనమాహాత్మ్యధారణవిధికథనము :—

మఱియును గోపీపుష్కరజన్యమృత్తిక గోపీచందనంబు. తదుద్వర్తనంబున సకలవ్యాధులును బాధలును నశియించు. గోపీచందన మున్నగృహంబు తీర్థభూత మనియు నచ్చట నశుభంబులును శోకమోహంబులును నుండ వని విష్ణువు భాషించె. సర్వకామప్రదంబును మోక్షప్రదంబును నగుగోపీచందనంబు వైష్ణవు లగుభాగవతులకు సంతతధార్యంబు. తత్స్పర్శమాత్రంబుచే నరుండు పవిత్రుండగు. తులసీకాష్ఠగంధంబును దులసీమూలమృత్తికయును హరిచందనంబును గోపీచందనంబునుం గలిపి లేపనంబు గావించిన గోవిందుండు సంతుష్టుండగు. గోపీచందనధారి యగువైష్ణవుండు పితరులకు గయాశ్రాద్ధంబు గావించినఫలముం జెందు. లలాటంబున దండాకారంబును వక్షంబునఁ బద్మాకారంబును బాహుమూలంబున వేణుపత్త్రాకారంబును నన్యప్రదేశంబులందు దీపాకారంబునుంగా గోపీచందనం బుండందగు. దక్షిణబాహుమూలంబున మీఁదనాలుగుచక్రంబులును గ్రిందనామముద్రాద్వయంబును వానినడుమ శంఖంబును బార్శ్వంబులందు రెండురెండుపద్మంబులును వామభుజంబునఁ బూర్వమట్ల నాలుగు శంఖంబులును నామముద్రాద్వయంబును ధరింపందగు. పార్శ్వంబులందుఁ జక్రంబును రెండురెండుగదలును ధరియింపందగు. లలాటంబున గదయును హృదయంబున నామముద్రయును మూఁడుమూఁడుచక్రంబులును మధ్యమున రెండురెండుశంఖములును ధార్యంబులు. హృదయంబునను బార్శ్వమునను స్తనోర్ధ్వప్రదేశమునను బాహువులందుంబలె గదాపద్మంబులు ధార్యంబులు. కర్ణమూలద్వయంబున మూఁడుమూఁడు చక్రంబులును దదన్యతిలకంబులం దొక్కొక్కచక్రంబును ధార్యంబులు. తిలకధారణంబున బ్రాహ్మణాదిచండాలపర్యంతంబును సర్వవైష్ణవులకును బాపశుద్ధి యగు. శిష్టసంప్రదాయంబు ననుసరించి తిలకంబు ధరింపందగు. అన్నియును ధరింపలేనియెడల వీనిలో నిచ్ఛానుసారంబుగా నేయొకటి యైనను ధరింపందగు. నియమంబు లేదు. గోపీచందనం

బున శంఖచక్రగదాపద్మనామముద్రల ధరించుభాగవతుఁడు సాక్షాన్నారాయణుం డుగాఁ జెప్పంబడియె. మఱియును హరినిర్మాల్యచందనంబు విష్ణునామంబులచే లలాటమందు గదారూపంబుగను మూర్ధమందు శరచాపరూపంబుగను హృదయమధ్యంబున నందకరూపంబుగను భుజద్వయంబున శంఖచక్రరూపంబుగను ధరియించువాఁడు భాగవతోత్తముండుగాఁ జెప్పంబడియె. గోపీచందనతిలకంబు ధరించువారలకు దుర్గతి కలుగనేరదు. శంఖచక్రంబులు బాహువులందు ధరించువారలదర్శనంబు మోక్షసంధాయకంబు. గోపీచందనతిలకధారియై పంచత్వముం జెందువైష్ణవుండు దివ్యవిమానాధిరూఢుండై వైకుంఠంబునకుం జను. శంఖచక్రగదాపద్మనామముద్రాతులసీకాష్ఠమాలాధారులును ద్వాదశతిలకధారులును ముక్తులుగాఁ జెప్పంబడిరి. 2683

క. ఒనరఁగఁ దాల్చిన నీవిధ, మున వైష్ణవు లూర్ధ్వపుండ్రములు గోపీచం
దనమున నొనరిచి ధరఁ బా, వనముగఁ బొందుదురు కడకు వైష్ణవపదముల్. 2684

వ. తులసీమిశ్రితంబును శంఖస్థితంబును నగుసలిలంబుం ద్రావినను దేహంబునం బ్రోక్షించినను నమస్కరించినను గోటిజన్మపాతకంబులు నశియించు. తద్బిందువు భూపతితం బయ్యెనేని యష్టకోటిపాతకంబులు సంభవించు. జలశంఖంబు కరంబునం దాల్చి ప్రదక్షిణంబు గావించి నిత్యంబును దదుదకంబు శిరంబునం బ్రోక్షించుకొనువానిజన్మంబు సఫలంబు. గృహమందు శంఖంబును గరుడాన్వితం బగుఘంటయును వాసుదేవునిపురోభాగంబున నుంపనివాఁడు భాగవతుండు కానేరఁడు.

—: ద్వాత్రింశదపరాధస్వరూపకథనము —

యానపాదుకలచే భగవన్మందిరమున కేఁగుటయు దేవోత్సవముల సేవింపకుండుటయు భగవంతుని యెదుట నమస్కరింపకుండుటయు నుచ్ఛిష్టసమయంబున వందనాదు లొనర్చుటయు నాశౌచకాలంబునఁ బ్రణామంబు గావించుటయు నేకహస్తప్రణామంబును భగవత్పురోభాగంబునఁ బ్రదక్షిణంబు గావించుటయు భగవంతునియెదుటఁ బాదప్రసారంబును బర్యంకసేవనంబును శయనంబును భక్షణంబును మిథ్యాభాషణంబును నుచ్చైర్భాషణంబును మిథోజల్పంబును రోదనంబును విగ్రహంబును నిగ్రహంబును ననుగ్రహంబును గ్రూరభాషణంబును గంబలావరణంబును బరనిందయును బరస్తుతియును నశ్లీలభాషణంబును నపానవాయువిమోచనంబును శక్తి యున్నను గౌణోపచారంబు గావించుటయును ననివేదితభక్షణంబును దత్తత్కాలోద్భవఫలాద్యనర్పణంబును వినియుక్తావశిష్టప్రదానంబును స్పష్టీకరించి భుజించుటయును గురుస్తోత్రంబున మౌనంబును నిజస్తోత్రప్రవృత్తియును దేవతానిందయును నను నీముప్పదిరెండును భగవద్విషయకాపరాధంబులుగాఁ జెప్పంబడియె. 2685

క. అపరాధసహస్రము లె, ల్లపుడును గావించు చుంటి నవి యన్నియు న
స్రపదమున సైఁచి నను నీ, కృపకుం బాత్రునిఁగఁ జేయు మే నీవాఁడన్. 2686

వ. అని ప్రార్థించి దండప్రణామంబు గావించె నేని సర్వాపరాధంబులను క్షమించి నారాయణుండు భక్తునకు హస్తావలంబనంబు నొసంగు. 2687

క. ననుఁ జేరొక్కనుచును గబళం, బునకుం గబళంబునకును భుజియించెడిస
జ్జను లన్నదోషలేపం, బును జెంద రటంచు మధురిపుండు వచించెన్. 2688

వ. వర్తులం బగునలాబువును సవల్కలం బగులశునంబును దాళఫలంబును శుక్లవృంతాకంబును వైష్ణవుండు భక్షింపరాదు. వటాశ్వత్థార్కపత్రంబులందును గుంభీతిందుకపత్రంబులందును గదంబకోవిదారపత్రంబులందును వైష్ణవుండు భుజియింపందగదు. శ్రావణమాసంబున శాకంబును భాద్రపదమాసంబున దధియును నాశ్వినమాసంబున దుగ్ధంబును గార్తికమాసంబున నామిషంబును వైష్ణవుండు పరిత్యజింపవలయు. గంద్రతిలయవకలాయకంగునీవారధాన్యంబులును హిలమోచికావాస్తుకమూలకకాలశాకంబులును వైష్ణవుండు వర్జింపవలయు. వైష్ణవుండు హవిష్యాన్నంబు భుజింపందగు. అతిలపక్వం బగునది హవిష్యాన్నంబుగాఁ జెప్పంబడియె. పుష్కరమాలికయును దులసీమాలికయును నామలకమాలికయును వైష్ణవునకు ధార్యంబులు. తులసికాష్ఠమాలికాధరుండై చేయుపితృదేవతాకార్యంబులు కోటిగుణఫలోపేతంబు లగు. 2689

క. శిరమునఁ దులసీపత్రము, ధరియించి యొనర్చుకర్మతతులకుఁ బొందున్
నరుఁ డక్షయ మగుఫలమును, బురుషోత్తమసంప్రసాదమునకున్ గుఱియై. 2690

—: న్యాసమంత్రమంత్రార్థకథనము :—

వ. న్యాసంబునందును నర్చనంబునందును నేకమంత్రం బాశ్రయింపందగదు. ద్వయం బేని న్యాసమంత్రం బేని వైష్ణవగురునివలనఁ గైకొనందగు. 2691

గీ. గురుని సేవించి యొక్కవత్సరమువఱకుఁ, బొంది తద్దయ సంస్కారములను జెంది
కైకొనందగు మంత్రయుగ్మమును నితర, విష్ణుమంత్రంబులను గూడ వైష్ణవుండు.

క. మొదట ద్వయంబును గైకొని, పదపడి మంత్రాంతరములఁ బడయఁగ నొప్పున్
మొదటఁ గొనకున్న ద్వయమును, దదితరమంత్రాంతరములఁ దగదు గ్రహింపన్.

క. న్యాసము ముఖ్యము వైష్ణవ, దాసుల కిద్దాన శ్రేష్ఠతను వహియించున్
న్యాసపరుం డండజలో, న్యాసమనువు దానఁ దగు వినంగను నీకున్. 2694

గీ. న్యాసమంత్ర మష్టాక్షర మగుట దాని, విషయ మంతయు వినిచెద విశదముగను
బ్రణవ ముండుట మొదట స్వభావముననె, యమ్మహామంత్రమునకు శ్రేష్ఠ్యావహంబు.

ఆ. బ్రహ్మరూప మైనప్రణవంబు సర్వమం, త్రములలోన మొదటఁ దగును గూర్ప
మంత్రసిద్ధి గలుగ మంత్రంబుననె యది, యున్నఁ దత్ప్రభావ మెన్నఁదరమె. 2696

గీ. సర్వమంత్రంబులకును నైసర్గికముగఁ, బ్రణవ మొదవమి నష్టాక్షరమునఁ బోలె
వాని కన్నింటికిని గూడ దీని కున్న, తేజు లే దనియెడిమాట తేటపడియె. 2697

సీ. ఆది నో మనుప్రణవాక్షరం బొకటియు, నవల నమో యనుద్వ్యక్షరములు
నటుతరువాత నారాయణాయ యటన్న, పంచాక్షరములును భాసిలంగ
నష్టాక్షరోపేత మైనమంత్రం బయ్యె, నామంత్రము పదత్రయాత్మకంబు
నారాయణుండ తన్మంత్రరాజమునకు, దీపించు ఋషిగను దేవతగను
గీ. దనరు గాయత్రి ఛందస్సుగను నెలర్చు, బీజముగఁ బ్రణవంబు శ్రీ తేజరిల్లు
శక్తిగను దానిన్యాసంబు సలిపికొనిన, వాఁడు నారాయణుం డగువాఁడ చూవె.

వ. అకారోకారమకారాత్మకం బగుప్రణవంబు వేదత్రయాత్మకంబును బ్రహ్మపురంబునుం గాఁ జెప్పంబడియె. అకారంబుచే లక్ష్మీశుండును జగద్బీజంబును బరమపురుషుండును నిర్గుణుండును సగుణుండును జగత్కర్తయును జగద్భర్తయును జగదీశ్వరుండును నగు మహావిష్ణువును నుకారంబుచే జగదీశ్వరియును విష్ణునకు నిత్యానపాయినియును జగదాధారభూతయును జగన్మాతయును విష్ణుపత్నియును నగుమహాలక్ష్మియును మకారంబుచే క్షేత్రజ్ఞుండును దేహేంద్రియమనఃప్రాణాదివ్యతిరిక్తుండును ననన్యసాధనుండును భగవచ్ఛేషభూతుండును సచేతనుండును బంచవింశుండును నిత్యుండును నగుజీవుండును జెప్పంబడియె. ఇయ్యది ప్రణవార్థంబు. ఇంక నమశ్శబ్దార్థంబు వివరించెద. మకారం బహంకారార్థకంబు. నకారంబు నిషేధార్థకంబు. నమఃపదంబు విపర్యాసంబుచే మనఃపదం బయ్యె. కావున నహంకారయుక్తం బగుమనస్సును విడువవలయు నని భావంబు. అహంకారవిమూఢాత్ముం డగుజీవుం డంధతమసంబునం బడు. ఇంక నారాయణపదార్థంబు వివరించెద. నారశబ్దంబునకు నరసమూహం బని యర్థంబు. నరసమూహం బన జీవసంఘంబు. అయన మన స్థాన మని యర్థంబు. జీవసంఘంబునకు నివాసస్థాన మగుటచేతను జీవస ఘంబు నివాసస్థానంబుగాఁ గలవాఁ డగుటచేతను నుభయవిధంబులను నారాయణుం డని చెప్పంబడియె. మఱియును నారశబ్దంబునకు నరసమూహం బనియు నయనశబ్దంబునకు గతి యనియు నర్థంబు. జీవసంఘంబున కెల్లది క్కగుటంజేసి నారాయణుం డయ్యె. 2699

సీ. అఖిలలోకేశ్వరుం డఖిలలోకవ్యాపి, యఖిలలోకాతీతుఁ డవ్యయుండు
భూతభవ్యాత్ముఁడు పురుషుఁ డచ్యుతుఁడు స, హస్రలోచనుఁడు సహస్రపదుఁడు
హరి మహేశ్వరుఁడు సహస్రశీర్షుఁడు విరా, డ్రూపుఁడు వేదనిరూపితుండు
పరమాత్ముఁడు శివుండు ప్రణవస్వరూపుఁడు, సవిత యనంతుఁడు శాశ్వతుండు
గీ. ప్రకృతిపరుఁ డీశ్వరుండు హిరణ్మయుండు, యజ్ఞపురుషుఁడు యజ్ఞంబు యజ్ఞకర్త
యజ్ఞపతి యజ్ఞఫలదాత యజ్ఞభోక్త, యద్వితీయుఁడు సాక్షి నారాయణుండు.
గీ. మొదట నొక్కనారాయణమూర్తి దక్క, నీకనంబడులోకంబు లెవియు లేవు
లేఁడు విధి పంచభూతముల్ లేవు సురలు, లేరు లేరు మహర్షులు లేను నేను. 2701
గీ. తంతువుల నూర్ణనాభిచందమున లోక, ములను వెడలించుచును వెలుపలికి మరలఁ
గొనుచు నుండుట లోనికిఁ గుతుక మొదవ, హరి యనెడి పేరు వొందె నారాయణుండు.

వ. నారాయణశబ్దంబున నుండుచతుర్థికి దాస్యం బని యర్థంబు. 2703

ఆ. వారికి దాసభూతుం డగుట స్వాతంత్ర్యంబు, లేమి జీవుం డెదను లేశ మేని
చన దహంతం దాల్పగను నిజబుద్ధిచే, గార్యముల నొనర్పంగఁ డగుటయును. 2704

వ. దీనిచే లక్ష్మీనారాయణు లనపాయు లనియు వారి కిరువురకును జీవుండు నిత్యసన్నిహితుం డనియును జీవున కహంకారంబు విడిచి సర్వకాలంబులందును లక్ష్మీనారాయణకైంకర్యంబు గావించు చుండుటయే మోక్షం బనియును ఫలితార్థంబు. 2705

గీ. ఇట్లు మంత్రార్థమును గ్రహియించి ద్విజుఁడు
మంత్రవినియోగ మొనరింప మహిమ మొదవు
నర్థ మెఱుంగక చేయుజపాదులెల్ల
వ్యర్థములు గాన సిద్ధి నీయంగలేవు. 2706

వ. అట్టినారాయణునకు భోగార్థంబు పరమవ్యోమమును లీలార్థంబు సర్వజగంబులును నేర్పడియె. పరమవ్యోమంబు త్రిపాద్విభూతి యనియు సర్వజగంబులు నేకపాద్విభూతి యనియుం బరగె. త్రిపాద్విభూతి త్రిపాదమాత్రంబు నిత్యంబు. ఏకపాద్విభూతి యేకపాదమాత్రంబు నిత్యంబు. నారాయణుండు భోగవిభూతియందు విహరించునప్పుడు లీలావిభూతిని దనగర్భంబునం దాల్చు. 2707

సీ. నారాయణుండు వోలె నారాయణియు సర్వ, తోముఖకరాంఘ్రిశిరాస్య యగుచు
సచరాచరం బగుసర్వజగంబున, కాశ్రయం బగుచుం దదాది యగుచు
సృష్టిలయంబులఁ జేయుచు నస్మల, నంబుచేత నిమీలనంబు చేతఁ
బోషించుచును సర్వభువనంబులను నాత్మ, కరుణాకటాక్షవీక్షణముచేతఁ

గీ. త్రిభువనవ్యాప్త యగుచును త్రిగుణ యగుచు, దీపిలుచును లక్ష్యాలక్ష్యరూపమునను
బరగు చుండుఁ దదీయరూపంబ సకల, భామినీజనరూపసౌభాగ్య మెల్ల. 2708

క. ఆ మెకటాక్షముచేతనె, సామర్థ్యము నొంది రవియు శశియును నమర
స్తోమమును నేను బ్రహ్మయు, నోముచు నుంటిమి జగత్సమూహము నెల్లన్.

సీ. నిత్య భూతేశ్వరి సత్య విష్ణుప్రియ, క్షీరోదతనయ శ్రీ సీత లక్ష్మి
పద్మ సుందరి సతి పద్మాక్షి రుక్మిణి, విష్వనపాయిని విష్ణుపత్ని
గౌరి సరస్వతి కమల పద్మాలయ, సర్వసుఖప్రద స్వాహా శాంతి
సర్వవేదవతి భూ స్వధ లీల శుభ విద్య, రతి మహాదేవి సర్వగత మాత

గీ. పద్మహస్త హిరణ్మయి భద్రమూర్తి, శోకసంహారిణి యనంత లోకనాభి
రమ దురాధర్ష చంద్ర హిరణ్యవర్ణ, భువననేత్రి నారాయణభోగదాత్రి. 2710

క. అనిమెడిలక్ష్మీనామము, లను బ్రాతఃకాలమునఁ దలంచెడివారల్
ధనధాన్యభోగభాగ్యము, లను జెందుదు రవిరతముగ లక్ష్మీకృపచేన్. 2711

గీ. ఆమహాలక్ష్మి ప్రభవోలె నగ్నియందు, రాజిలుచు నుండు నెవనియురంబునందు
నట్టినారాయణునకు దాస్యంబు సేయు, భాగ్యమునకంటె లే దొండు పరమపదము.

వ. నారాయణుండు నిర్గుణుం డనఁ బ్రాకృతహేయగుణరహితుం డనియుఁ బ్రపంచంబు మిథ్యాభూతం బన దృశ్యమానం బగునేకపాద్విభూతి యనిత్యం బనియు నెఱుంగ వలయు. నారాయణుండు ప్రకృతి యగుమహాలక్ష్మియందు సృష్టిస్థితిలయంబులం గావించు చుండుటంజేసి తాను జగత్పితయును మహాలక్ష్మి జగన్మాతయు నయ్యె. స్వభోగార్థంబు నారాయణునిచే మహాలక్ష్మి సృజంపంబడియె. అవిద్య ప్రకృతి మాయ మహావిద్య జగన్మయి యోగనిద్ర మహామాయ త్రిగుణ యవ్యక్తము ప్రధానము ననునామంబులచేఁ బరగి మహాలక్ష్మి సర్గస్థితిలయహేతుభూత యయ్యె.

—: ఏకపాద్విభూతిస్వరూపకథనము :—

ప్రకృతినిర్మితం బగుబ్రహ్మాండం బంతయును నేకపాద్విభూతి గాఁ జెప్పంబడియె.

—: త్రిపాద్విభూతిస్వరూపకథనము :—

ప్రధానంబునకును బరమవ్యోమంబునకును నడుమ విరజానది కలదు. అయ్యది వేదాంగస్వేదజనితతోయప్రస్రావిత యై యుండు. దానిపరపారంబునఁ ద్రిపాద్విభూతి కలదు.

—: వైకుంఠవ్యూహకథనము :—

సీ. అదియె నారాయణపదము బ్రహ్మపదం బ, సంఖ్యంబు శుద్ధంబు సత్త్వమయము
ప్రళయవర్జితము హిరణ్మయం బజరంబు, శాశ్వతం బమృత మక్షరము శుభము
సర్వవేదమయంబు సపత్న్యవైశ్వానర, శతకోటిసమధికచ్ఛవియుతంబు
జ్ఞానదృశ్యంబు బ్రహ్మానందసుఖనామ, ధేయం బనంతంబు దివ్యతమము
ఆ. పరమపదము మోక్షపదము జాగ్రత్స్వప్న, వర్జితము సుషుప్తివర్జితంబు
వేదగోపితం బనాది వైకుంఠంబు, మహిమసంభృతము తమఃపరంబు. 2714

క. ఆవిష్ణుపదము నొందిన, పావనులకు లేదు మరలఁ బ్రభవము వారల్
సేవించు చుందు రచట మ, హావిష్ణుని నిత్యమును మహానందమునన్. 2715

ఆ. అమ్మహాపదంబునందుఁ బ్రవేశింపఁ, గాదు సాధ్య మబ్జజాదులకును
సర్వమును నెఱుంగఁజాలిననాకను, దానిమహిమ మెఱుఁగఁ దరము గాదు. 2716

గీ. శాస్త్రమార్గోపలబ్ధవిజ్ఞానమునను, గాంతు రద్దాని యోగిపుంగవులు రవియు
శశియు నగ్నియు నెట్టితేజంబు గూడఁ, దత్ప్రభాసన్నిధిని బ్రదీప్తములు గావు. 2717

ఆ. ఆత్రిపాద్విభూతియందు హిరణ్మయం, బులును నిర్వికారములును నిత్య
ములును శుద్ధసత్త్వములు వేదమయములు, గల వనేకలోకములు భవాని. 2718

సీ. కానరా వచ్చుటఁ గామంబు క్రోధంబు, మదలోభములు మోహమత్సరములు
విలసిల్లు చుండును వేదరసాంబుపూ, రమనోహరము లైనహ్రదము లచటఁ
బొలుపారు చుందురు పురుషులు స్త్రీలును, నతులితశ్రుతిమయాకృతుల నచటఁ
గావించు చుండును గలకాలమచ్చోట, సామగానరవంబు శ్రవణసుఖము

గీ. కనఁబడుచు నుండు భువనపావనము లైన
గోవు లచ్చట జనియును జావు జరయు
దుఃఖమును నీతిబాధలు దురితములును
నామయములును భయమును నచట లేవు. 2719

క. హరినామామృతపానము, నిరతంబును జేయుచుండునిష్కలుషుల కా
పరమపద మబ్బు దొరకదు, పరుల కొనర్చినను నెట్టిబహుపుణ్యములన్. 2720

వ. అవ్యక్తబ్రహ్మోపాసకులకుఁ బరమపదవిరజామధ్యప్రదేశంబు గమ్యస్థానంబు. 2721

సీ. అనుపమజనపదవ్యాకీర్ణమును మణి, ప్రాకారతోరణరాజితమును
గాంచనప్రాసాదకమనీయమును నవ, రత్నవిమానవిభ్రాజితమును
నిశ్శ్రేయసంబును నిర్వాణమును నైన, మహితవైకుంఠధామంబునఁ దనరఁ
గలదు దివ్యపురంబొకం డయోధ్య యనంగ, మణిగోపురద్వారమండితంబు

గీ. భానుకోటిసహస్రప్రభావిభాస
మానమును నిత్యకల్యాణమంజులమును
ననితరప్రాప్యమును మహాహ్లాదదమును
సకలసురగణమునిజనసంస్తుతమును. 2722

వ. పంచపంచాశద్యోజనవిస్తారాయామంబును సహస్రయోజనతుంగప్రాసాదకోటివిభూషితంబును నారూఢనిత్యయౌవనదివ్యస్త్రీపురుషశోభితంబును నై యుండునప్పురంబునకుఁ బ్రాగ్ద్వారంబునఁ జండప్రచండులును దక్షిణద్వారంబున భద్రసుభద్రులును బశ్చిమద్వారంబున జయవిజయులును నుత్తరద్వారంబున ధాతృవిధాతలును ద్వారపాలకులుగను గుముదకుముదాక్షపుండరీకవామనశంకుకర్ణసర్వనిద్రసుముఖసుప్రతిష్ఠితు లష్టదిక్పాలకులుగను నుండి రక్షించు చుందురు. తత్పురమధ్యంబున జగన్మోహనం బగు దివ్యాంతఃపురంబు గలదు. తన్మధ్యంబున మాణిక్యస్తంభసహస్రవిరాజమానంబును రత్నమయంబును నిత్యముక్తసమాకీర్ణంబును సామగానోపశోభితంబును నగునొక్కదివ్యమండపంబు గలదు. తన్మధ్యంబునఁ బాదవిగ్రహులును ఋగ్యజుస్సామాధర్వరూపులును నిత్యులును నగుధర్మజ్ఞానైశ్వర్యవైరాగ్యదేవతలచేతను శక్తి యాధారశక్తి చిచ్ఛక్తి సదాశివ యనుధర్మాదిదేవతాశక్తులచేతను బరివేష్టితంబును నగునొక్కదివ్యసింహాసనంబు గలదు. తన్మధ్యంబున సర్వాక్షరమయం బగుయోగపీఠంబు గలదు. రవియును జంద్రుఁడును వైనతేయుండును వహ్నియును గూర్మంబును నాగేంద్రుండును సర్వమంత్రంబులును సకలచ్ఛందస్సులును దద్యోగపీఠత్వముం జెంది యుండె. తన్మధ్యంబున నుదయార్కసమప్రభం బగునొకయష్టదళపద్మంబు గలదు. తన్మధ్యంబున సావిత్రి యనుకర్ణికయందుఁ గోటిసూర్యప్రకాశమానుం డగునారాయణుండు హిరణ్యవర్ణయును సువర్ణరజతస్రగలంకృతయును సర్వలక్షణసంపన్నయును జతుర్భుజయును గరద్వయగృహీతపద్మయుగ్మయును నితరకరద్వయగృహీతమాతులుంగ

జాంబూనదపాత్రయును నిత్యానపాయినియును నగుమహాలక్ష్మితోడ నాసీనుండై మహాలక్ష్మిరూపాంతరంబులుగా స్వపార్శ్వభాగంబులందు సమాసీనలై భూలీలలును నష్టదిగ్గజాగ్రంబులయందుఁ జామరగ్రాహిణు లయి విమల యుత్కర్షిణి జ్ఞాన క్రియ యోగ ప్రహ్వి సత్య యీశాన యనునష్టశక్తులును నంతఃపురనివాసినులును బంచశతసంఖ్యాకలును నగుదివ్యాప్సరస్త్రీలును ననంతవిహగాధిపముఖపరిజనులును నిత్యముక్తు లగునితరభక్తులును బరివేష్టించి కొలుచు చుండ సతతంబును నానందవార్ధిం దేలు చుండు. వైకుంఠలోకంబునను బ్రాగ్దిక్కునందు వాసుదేవలోకంబును నాగ్నేయదిక్కునందు లక్ష్మిలోకంబును దక్షిణదిక్కునందు సంకర్షణలోకంబును నైరృతదిక్కునందు సారస్వతలోకంబును బశ్చిమదిక్కునందుఁ బ్రద్యుమ్నలోకంబును వాయుదిక్కునందు రతిలోకంబును నుత్తరదిక్కునం దనిరుద్ధలోకంబును నీశానదిక్కునందు శాంతిలోకంబును బ్రథమావరణంబుగను బ్రహ్లాదాదిమహాభక్తలోకంబులు ద్వితీయావరణంబుగను మత్స్యకూర్మాదిలోకంబులు తృతీయావరణంబుగను సత్యాచ్యుతానంతదుర్గావిష్వక్సేనగజాననశంఖపద్మనిధిలోకంబులు చతుర్థావరణంబుగను సర్వవాఙ్మయస్వరూపంబు లగుఋగ్యజుస్సామాథర్వసావిత్రీఖగేశధర్మముఖలోకంబులు పంచమావరణంబుగను సకలశస్త్రాస్త్రయంత్రసంయుతంబు లగుశంఖచక్రగదాపద్మఖడ్గశార్ఙ్గహలముసలలోకంబులు షష్ఠావరణంబుగను నింద్రాగ్నియమనిరృతివరుణవాయుకుబేరేశానలోకంబులు సప్తమావరణంబుగను నుండె. మఱియును వైకుంఠంబునందు విశ్వేదేవసాధ్యమరుద్గణాదినిర్జరు లసంఖ్యాకంబుగా నిత్యులై యున్నవారు. ప్రాకృతస్వర్గలోకంబునం దుండుమహేంద్రాదినిర్జరు లెల్లరును ననిత్యు లని తెలియందగు. 2723

ఆ. అట్లు నిత్యముక్తు లగుదివ్యభామినీ, దివ్యపురుషు లెల్లఁ దేజరిలుచు
నుండ మోక్షధామ మొప్పారు నుక్తికి, మదికి న దరానిమహిమతోడ. 2724

సీ. అనివచించుటయు ని ట్లనియెఁ బార్వతి నాథ, యకలుషుం డైననారాయణుండు
పరమపదంబున భాసిల్లువాఁ డేక, పాద్విభూతిని వేరుపఱుప నేల
యతనికి ఫల మేమి యద్దానఁ దెలుపుము, నావుడు శర్వుఁడు దేవి వినుము
పరమేశ్వరుండు త్రిపాద్విభూతిపదంబు, నం దుండఁగను మహానందమునను

గీ. బ్రకృతి నుతియించి యాతనిఁ బ్రబలముగను, దేవ జ్ఞానవిహీనులు దిక్కు లేని
వారు హీనశరీరులు ఘోరదుఃఖ, పతితు లగుజీవు లుండి రపారముగను. 2725

గీ. సర్వశక్తివి సర్వవిజ్ఞాననిధివి, సర్వసంరక్షకుండవు సర్వభూత
హితుఁడవు కృపాంబునిధివి సర్వేశ్వరుఁడవు, వారల నుద్ధరింపంగవలదె నీకు. 2726

సీ అని నివేదించుటయును వాసుదేవుండు, ప్రకృతిసంస్థుం డయి ప్రకృతియంద
పంచభూతముల సృజించి భూాదిని గాల్ప, ము ను దరువాత సర్జన మొనర్చి

సర్వజగత్సృష్టిసంకల్పమున యోగ, నిద్రతో శయనించె నీట నంత
ముకుళితస్వీయనాభికమలంబు వికాస, మును జెందఁ గాలసంయోగమునను

గీ. దానిలోనుండి పుట్టె విధాత హరినిఁ, బ్రస్తుతింపంగ లేచి నారాయణుండు
నై జనాభిపయోజమునను హిరణ్మ, యాండమును సృజియించి తా నందుఁ జేరి.

క. ఒనరించు చుండ ధ్యానం, బును బుట్టె తదీయఫాలమున స్వేదము భూ
మిని బడియె దానిలోపల, జనియించితి నేను శూలసహితము గాఁగన్. 2728

గీ. అట్లు జనియించి నేను భయంకరముగ, వినయమున మ్రొక్కి దేవదేవునకు స్వామి
యానతి మ్మేమి చేయంగ నగునో నాకు, ననుచు నిట్లానతిచ్చె నారాయణుండు.

గీ. మామకీనసంకర్షణాంశమున రుద్ర, నిన్నుఁ బుట్టించితిని గాన నీవు సేయు
మఖిలలోకసంహారంబు ననుచు నేను, దాల్చినాఁడఁ దదాజ్ఞ నౌఁదలను నంత. 2730

వ. నేత్రంబులనుండి చంద్రసూర్యులను శ్రోత్రంబులనుండి వాయువును దిక్కులను ముఖంబునుండి యింద్రాగ్నులను బ్రాహ్మణులను నాసికారంధ్రంబులనుండి మిత్రావరుణులను బాహువులనుండి యఖిలదేవతలను క్షత్త్రియులను రోమకూపంబులనుండి యోషధివనంబులను ద్వచమునుండి శైలసముద్రంబులను దిర్యగ్జాతులను నూరువులనుండి వైశ్యులను పాదంబులనుండి శూద్రులను సృజియించి జగం బంతయును నచేతనంబుగా నుండుటంజేసి విశ్వరూపంబునం దాను దదంతర్యామి యై ప్రవర్తింపఁ జేయం దొడంగె. మఱియును నచ్యుతుండు దాను ద్రిగుణభావంబు నవహించి

—: నారాయణాంతర్యామ్యవస్థాకథనము :—

ప్రద్యుమ్నాంశంబున విధిప్రజాపతికాలజనాంతర్యామి యై బ్రహ్మకుఁ బురాణేతిహాససహితసాంగవేదంబులం బ్రసాదించి తన్ముఖంబున జగత్సర్గంబును ననిరుద్ధాంశంబున మనుపార్థివకాలజనాంతర్యామి యై మనుముఖంబున జగత్స్థితియును సంకర్షణాంశంబున రుద్రకాలయమసర్వభూతాంతర్యామి యై రుద్రముఖంబున జగత్సంహారంబును గావింపం దొడంగె. పరమాత్మున కివి యన్నియును నంతర్యామ్యవస్థలుగను

—: నారాయణవిభవావస్థాకథనము :—

మత్స్యకూర్మవరాహనృసింహవామనపరశురామరామకృష్ణబుద్ధకల్కిరూపంబులు విభవావస్థలుగను జెప్పంబడియె.

—: నారాయణపరావస్థాకథనము :—

ఇంక నారాయణునిపరావస్థం దెలిపెద వినుము. అయ్యది దీపోత్పన్నదీపంబువంటిది. అందు వైకుంఠలోకంబు విష్ణులోకంబు శ్వేతద్వీపంబు క్షీరసాగరంబు నను నాలుగు వ్యూహంబులు గలవు. పూర్వోక్తం బయినవైకుంఠలోకవ్యూహంబు ప్రథమవ్యూ

హాంబు. అచ్చట నుండువా రెల్లరును విష్ణుసమరూపులును దత్సమానసుఖభోగులును బునరావృత్తిరహితులును గర్మబంధవిముక్తులును నై యుందురు. వారలు తమ కిచ్ఛ గలిగినప్పుడు సౌమిత్రి భరతసంకర్షణాదులుంబోలె భూమియందుఁ బుట్టి మరల నిచ్ఛ చేతన వైకుంఠంబునకుఁ జేరుచుందురు. వారలకు విష్ణుదాస్యంబ మోక్షంబు. బ్రహ్మ లోకాదిసకలలోకంబులును బునరావృత్తిలక్షణంబులును గర్మబంధమయంబులును దుఃఖమిశ్రసుఖంబులును భయప్రదంబులును బహ్వాయాససాధ్యంబులును నై యుండు. అచ్చట నుండు సుఖభోగంబు విషమిశ్రాశనతుల్యంబు. 2731

సీ. పుణ్యంబు క్షీణత్వమును బొందినంతనె, స్వర్గసంస్థితు లైనవారి కెల్లఁ
దప్పదు కర్మబంధంబున సంసార, పతనం బనిత్య మాకతన దివము
దానికై యాసించి తపియింపక మహాత్ము, లగువారు హరిభక్తి నాశ్రయించి
పరమపదంబును బడసి శాశ్వతముగా, ననుభవించుచు నుండు రభయసుఖము

గీ. నిత్యముక్తు లనంగను నిర్విషాదు
లనఁగ సంసారవర్జితు లనఁగ విష్ణు
సేవకు లనంగ నిర్మలభావు లనఁగ
వైష్ణవోత్తము లనఁగను వార చూవె. 2732

—: విష్ణులోకవ్యూహకథనము :—

వ. ఇంక ద్వితీయవ్యూహముం జెప్పెద వినుము. 2733

సీ. విష్ణులోకంబు నా వెలయు చుండును మహా, లోకంబు నిత్యభోగైకభూమి
సలిలమధ్యప్రదేశమ్మునఁ దన్మధ్య, మున దేవవతి యనుపురము గలదు
తన్మధ్యమందు నంతఃపురం బొక టుండు, దివ్యాప్సరస్త్రీనప్రదీపితంబు
తన్మధ్యమునఁ గల్పతరు వుండు సర్వేష్ట, సంధాయకంబు తచ్ఛాయయందుఁ

గీ. దనరుఁ బద్మాసనం బొండు దానియందు, రాజిలుచు నుండుఁ బుష్పపర్యంక మొండు
దానిపై లక్ష్మితోడ నాసీనుఁ డగుచు, దేవదేవుఁడు సతతంబుఁ దేజరిల్లు. 2734

గీ. కౌఁగిటను జేర్చి బాహుయుగ్మమున లక్ష్మి
నితరభుజయుగ్మమున ధరియించి పాంచ
జన్యచక్రంబులను శౌరి సొరుమీఱు
హ్రాదినీయుతనీలనీరదమువోలె. 2735

వ. అచ్చట రమ రుక్మిణి సీత పద్మ పద్మాలయ శివ సులక్షణ సుశీల యనునష్టశక్తులు మహాలక్ష్మిరూపాంతరంబులుగా లక్ష్మీనారాయణులం బరివేష్టించి యుందురు. 2736

గీ. శంఖచక్రగదాఖడ్గశార్ఙ్గముఖ్య, హేతిజాలంబు పౌరుషాకృతులఁ దాల్చి
సంతతంబును నంగరక్షకులువోలె, నొక్కమొగి విష్ణులోకంబు నోము చుండు. 2737

క. ఆలోకమునకు నేఁగన్, జాలుదు రతిసులభముగను నారాయణమం
త్రాలంబను లగుధీరుల, యాలోకింపఁగను జాల రన్యులు దానిన్. 2738

—: శ్వేతద్వీపవ్యూహకథనము :—

వ. ఇంకఁ దృతీయవ్యూహముం జెప్పెద వినుము. తోయసాగరోత్తరకూలంబు శ్వేతద్వీపంబుగాఁ జెప్పంబడియె. బ్రహ్మపుత్రు లగుసనకసనంద సనాతన సనత్కుమార జాతవోఢు పంచశిఖు లనుసప్తయోగీంద్రులు సర్వభోగవిరక్తిం బొంది భగవన్నిత్యసందర్శనాకాంక్షులై నరనారాయణులతోడ శ్వేతదీపంబునందు నివసించు చుండ విష్ణుభక్తాగ్రేసరు లగువారలకు నిత్యదర్శనం బొసంగ వాసుదేవుండు శ్వేతదీపంబునం బ్రవేశించె.

సీ. రాజిల్లు చుండు నైరావతి యనుమహా, పురము శ్వేతద్వీపమున నొకండు
తన్మధ్యమందు నంతఃపురం బొకఁ డుండు, రమణీయసౌధవిరాజితంబు
దివ్యమండప మొండు దీపించు చుండుఁ ద, న్మధ్యంబునందుఁ దన్మధ్యమునను
నొక్కసింహాసనం బుండుఁ దన్మధ్యంబు, నం దుండు నష్టదళాబ్జ మొండు
ఆ. కలదు దానినడుమఁ గర్ణిక యొకఁడు త, త్కర్ణికాసనమునఁ గ్రాలు చుండు
నఖిలగుణసమేత యగులక్ష్మితోడను, నప్రమేయుఁ డగుజనార్దనుండు. 2740

క. ఒకకేలను వసుపాత్రము, నొకకేలను దర్పణంబు నొకకేలను హే
మకమలము మాతులుంగము,నొకకేలను దాల్చి లక్ష్మి యొప్పుచు నుండున్. 2741

వ. అచ్చట నీశావాస్య మహాదేవి జాహ్నవి కమలాలయ సావిత్రి సర్వగ పద్మ యను శక్తులును శ్రద్ధ మేధ ధృతి ప్రజ్ఞ ధారణ శాంతి శ్రుతి స్మృతి మతి వన్య వృద్ధి వృష్టి మనీషిణి యనుపరిచారికలును లక్ష్మిని సేవించు చుందురు. మఱియును ననంతవైనతేయమరుద్గణాదినిత్యదేవత లందఱును విష్ణునిత్యకింకరులై యుందురు. 2742

క. హరినామకీర్తనంబును, హరిమంత్రజపంబుఁ జేయునట్టినరుల కా
హరిపదము దొరకు దొరకదు, పరులకుఁ జేసినను నెట్టిబహుపుణ్యములన్. 2743

—: క్షీరసాగరవ్యూహకథనము :—

వ. ఇంకఁ జతుర్థవ్యూహముం దెలిపెద వినుము. 2744

ఆ. క్షీరసాగరమున శేషపర్యంకంబు, నందుఁ బద్మనాభుఁ డధివసించి
యుండు లక్ష్మితోడ నుత్సాహమున దాన, వులను గూల్చి నిర్జరులను బ్రోవ. 2745

గీ. కరయుగంబున హేమపంకజయుగంబుఁ, దాల్చి శౌరి నితరకరద్వయముచేత
గాఢముగ గ్రుచ్చి కౌఁగిటఁ గాంచు చుండు, నమరులను లక్ష్మి సకరుణాపాంగములను.

క. తమ కసురబాధగల్గిన, సమయంబున నెల్ల సురలు శరణార్థులు గాఁ
గమలాక్షుఁ డవతరించుచు, క్షమపై వధియించు చుండుఁ గ్రవ్యాశనులన్. 2747

క. శరణాగతిమంత్రంబును, నిరతంబు జపించుచును వినిర్మలభక్తిన్
హరిని భజించుచు నుండెడి, నరులకుఁ దత్పదము దొరకు నళినదళాక్షీ. 2748

వ. ఈవ్యూహంబు లన్నియు వైకుంఠసమంబు లగుటంజేసి తద్విశేషంబు లన్నియును వీనియందునుం గలవు. 2749

ఉ. ఇంకను నేదియైన విన నిచ్చ జనించినఁ గోరు మేను ని
శ్శంకముగా వచించెదను సర్వము నీకు లతాంగి నావుడున్
శాంకరి సమ్మదం బెసఁగ నాథ వచింపుము వేడ్క లోన నా
కంకురిలెన్ వినంగ నసురార్యవతారకథావిధానమున్. 2750

—: దశావతారచరిత్రకథనము :—

సీ. అనవుడు శర్వుఁ డి ట్లనియెఁ గాత్యాయని, హరినాభికమలజుం డైన యజుండు
సలిపె ముందు నవప్రజాపతిసర్గంబు, నందు మరీచి కశ్యపునిఁ గనియెఁ
గలరు కశ్యపునకు నలువు రదితిదితి, కద్రూవినత లనుకాంత లందు
నదితికి దేవత లావిర్భవించిరి, సంభవించిరి నిశాచరులు దితికి

గీ. నందు మకరాఖ్యుఁ డొక్కమహాసురుండు, బ్రహ్మలోకంబునకుఁ బోయి పద్మభవుని
నంచితునిఁ జేసి నిజమాయవలన సర్వ, నిగమములఁ గొని మ్రింగి వార్నిధినిఁ జొచ్చె.

గీ. అంతటను లోక మెల్ల మహాంధకార, బంధురం బయ్యె వర్ణనిబంధనంబు
భ్రష్ట మైపోయె నరులకుఁ బశువులకును, గానఁబడదాయె భేదంబు దానివలన. 2752

వ. అది యంతయు సర్వలోకవినాశహేతు వగుటంజేసి చతుర్ముఖుండు సకలదేవతలతోడం గూడి క్షీరసాగరంబున కరుదెంచి యందు మహాలక్ష్మితోడ ననంతపర్యంకంబునం బవళించియుండుపుండరీకాక్షునిం గాంచి చేతులు జోడించుకొని నిలువంబడి. 2753

సీ. సర్వవేదాత్మక సర్వేశ యచ్యుత, విశ్వసృష్టిస్థితివిలయకారి
సర్వలోకముల కాశ్రయభూతుఁడవు నీవె, పరమేశ్వరుఁడ వీవె భవుఁడ వీవె
త్రిగుణాత్ముఁడవు నీవె భగవంతుఁడవు నీవె, పంచభూతస్వరూపంబు నీవె
త్వత్ప్రేరణమునఁ బ్రవర్తించు సర్వంబు, త్వచ్ఛక్తి యైన నంతయు నశించు

గీ. దేవ శ్రుతు లెల్ల హరియించి దితిజుఁ డొకఁడు, చొచ్చెఁ గడలిని జగమెల్ల శూన్యమయ్యె
హవ్యకవ్యంబు లొదవమి నమరు లెల్లఁ, బస్తుపడియున్నవారు నీపాదమాన. 2754

గీ. జంగమస్థావరాత్మకజగము లెల్ల, నండగొని వేదముల నిల్చియుండె నట్టి
వేదముల కొడఁగూడె నుచ్ఛేద మిపుడు, విన్నవించితి జరిగినవిషయ మెల్ల. 2755

సీ. అని యూరకుండుటయును హృషీకేశుండు, బ్రహ్మాదివిబుధవర్గమున కెల్ల
నభయం బొసంగి చయ్యన మత్స్యరూపంబు, ధరియించి చొచ్చి సాగరములోన
మకరాసురునిఁ బరిమార్చి చీలిచి వాని, యుదరంబు దానిలో నున్నశ్రుతులఁ
గైకొనివచ్చి పంకజసంభవున కిచ్చి, జగదార్తిఁ దీర్చి స్వస్థలముఁ జేరె

గీ. నంత నన్యోన్యమిశ్రంబు లై నవేద, సంతతుల నెల్ల వ్యాసుండు చక్కఁబఱిచి
లోకమునకుఁ బ్రసాదింప లోక మెల్ల, నిలిచి పూర్వస్థితిని బ్రవర్తిలఁదొడంగె. 2756

వ. ఇంకఁ గూర్మావతారవృత్తాంతంబు నెఱింగించెద వినుము. 2757

సీ. అత్రితనూభవుం డైన దుర్వాసుండు, చనుదెంచి యొకదివసమున దివికిఁ
దనకుఁ గిన్నరు లొసంగినపారిజాతమా, లికను గానుకగ వజ్రికి నొసంగె
నది మహేంద్రుఁడు గొని యైరావతముమీఁద, వైవంగ దాని నావారణంబు
తొండంబుతో లాగి త్రొక్కి కాలను ద్రెంచి, విసరివైచెను నలుదెసలఁ బడఁగ

గీ. నది కనుంగొని దుర్వాసుఁ డాగ్రహమున, శాపము నొసంగి నశియింప స్వర్గలక్ష్మి
చనియె శీఘ్రంబుగా వనంబునకు నంత, నుడిగి దివము నంతర్ధాన మొందె లక్ష్మి.

ఆ. అపుడు క్షుత్పిపాస లతిశయిల్లగ దేవ, తాగణంబు లెల్లఁ దల్లడిల్లి
స్రష్టకడకుఁ బోయి శరణాగతులు గాఁగ, వారితోడఁ గూడి వనజభవుఁడు. 2759

క. అరుదెంచి క్షీరవార్ధ్యు, త్తరతటమున కచట విష్ణుదర్శనకాంక్షా
పరుఁడయి సలుపుచు నష్టా, క్షరమంత్రజపంబు ధ్యానసరణిని నుండెన్. 2760

సీ. అపుడు ప్రసన్నుఁడై హరి దర్శనం బిచ్చి, బృందారకుల కెల్ల నిట్టు లనియె
ననిమిషులార మీ కామతిల్లినదుఃఖ, మంతయు విజ్ఞాతమయ్యె నాకు
నత్రిసూనుం డిచ్చినట్టి శాపంబున, సంపూర్ణముగఁ బోయె స్వర్గలక్ష్మి
యామె లేకుండిన నమరలోకమె కాదు, లుప్తంబులగు సర్వలోకములును

గీ. గాన బుట్టింపవలయు నె ట్లైన మరల, నాయమను దాని కొక్కయుపాయ మేను
జెప్పెదను మీకు మందరక్షితిధరంబు, కవ్వముగఁ జేసి వలయుఁ బాల్కడలిఁ దరువ.

క. దానిం దాల్చెదఁ గూర్మం, బై నేను బయోబ్ధిఁ జొచ్చి యటు నీటఁ దొలఁగం
గానీక పృష్ఠదేశము, పైనిం దరువుండు మీరు భయపడకుండన్. 2762

క. అని చెప్పి యదృశ్యత్వం, బును బొందఁగ వార లెల్లఁ బోయి రయమునన్
గొనితెచ్చి మందరాద్రిని, నునిచిరి క్షీరాబ్ధిలోన నుత్సాహముతోన్. 2763

గీ. అంతటను గూర్మమై విష్ణు నబ్ధిఁ జొచ్చి, మునిఁగిపోకుండ మందరాద్రిని ధరింప
మందరమునకు శేషదామమును జుట్టి, తరువఁదొడఁగిరి పాలసంద్రమును సురలు.

ఆ. అట్లు త్రచ్చుచుండ హరివాసరంబున, నమరు లెల్లఁ గూడి యంబురాశి
నందుఁ బుట్టె మొదట హాలాహలము పుట్టె, నవల జ్యేష్ఠ పిదప నమృత మొదవె.

వ. అటుతరువాత నైరావతోచ్చైశ్శ్రవోధన్వంతరికామధేనుపారిజాతాదిబహుశ్రేష్ఠ
వస్తువు లావిర్భవించె. 2766

గీ. అంతటను ద్వాదశీదినమందు సూర్యుఁ
డుదయ మగుచుండఁగను లక్ష్మి యుద్భవించెఁ
గరయుగంబునఁ బద్మయుగ్మమును గరయు
గమున వసుపాత్రమాతులుంగములు వెలయ. 2767

క. ఆయమ వెంటనె యుద్భవ, మాయెను దులసీద్రుమంబు హరిపూజార్థం
బై యంతఁ దొడఁగి రమరులు, సేయఁగ లక్ష్మీస్తవంబు శ్రీసూక్తమునన్. 2768

సీ. అపుడు మహాలక్ష్మి యనిమిషస్తోత్రంబు, నకుఁ జిత్తమున మహానంద మొంది
సురలార వరమును వరియింపుఁ డిచ్చెద, ననవుడు నమరు లాయమకు మ్రొక్కి-
యమ్మ యస్మద్రక్షణార్థంబు హరివక్ష, మం దుండు మీ వనపాయముగను
నని వేఁడుటయు నట్ల యగుఁగాక యన లక్ష్మి, వెంటనె విష్ణువు వెడలివచ్చి

గీ. స్వస్వరూపంబుతోడ దర్శన మొసంగఁ, గురిసె నాకసముననుండి కుసుమవృష్టి
మొరసె దుందుభు లుప్పరంబునను నంత, నమరు లత్యంతసంతోష మావహిల్ల.

క. తులసీదళములచేతను, జలజాక్షున కర్చనంబు సలిపి తదిచ్ఛన్
దెలిసికొని లక్ష్మి నొసఁగిరి, కలకాలముఁ బ్రోవఁగను జగంబుల నెల్లన్. 2770

ఉ. అంతట శార్ఙ్గి వక్షమున నామెను దాల్చి సుపర్వకోటికిన్
స్వాంతములందు ధైర్య మొదవంగఁ గరం బభయం బొసంగి లో
నెంతయుఁ గౌతుకంబు జనియింప నదృశ్యత నొందె నంత ని
శ్చింతముగా దివంబునకుఁ జేరిరి నిర్జరు లాప్తకాములై. 2771

వ. ఇంక వరాహావతారవృత్తాంతముం జెప్పెద వినుము. 2772

సీ. మున్ను శ్వేతద్వీపమునఁ జేయుచును విష్ణు, మందిరద్వారసంరక్షణంబు
నుండిరి జయవిజయులు నాఁగ నిరువురు, విష్ణుభక్తులు మహావీర్యయుతులు
హరిదర్శనము సేయ నరుదెంచుసనకాది, మునులను వా రొక్కదినమునందు
వారించి రద్దానఁ బారికాంక్షులు శపి, యించిరి వారల నిలను బుట్ట

గీ. నంతటను జయవిజయు లత్యంతశోక, మావహిల్లగ నది యెల్ల హరికిఁ జెప్ప
నంబుజాక్షుఁడు వారి కి ట్లనియె భృత్యు, లార చేసితి రనివార్య మైనతప్పు. 2773

గీ. తత్ఫలంబు భుజింపక తప్ప దేఁగు, డనుటయును వార లేడ్చుచు నచ్యుతాంఘ్రి
పద్మములపైనిఁ బడఁ జక్రపాణి కరుణ, నెడఁదలోఁ గల్గ వారల కిట్టు లనియె.

సీ. సప్తజన్మములు దాస్యము సేయుచును నాకు, నవనిలోపలనుండి యవల మరల
నన్నుఁ జేరుదురో లేకున్న మద్వైరులై, జన్మత్రయంబును క్షమను గడపి
యరుగుదెంతురో మత్సమక్షంబునకుఁ జెప్పుఁ, డేది యిష్టమొ మీకు నేర్పడంగ
ననవుడు వార లి ట్లనిరి మాధవ చిర, కాలంబు త్వద్వియోగమున నిలను

గీ. నుండఁజాలము రిపులమై యుండి మూఁడు, జన్మముల నెట్టులేని భూస్థలిని గడపి
త్వరితముగను భవత్సన్నిధానమునకు, వచ్చునట్లు కటాక్షింపవలయు మమ్ము. 2775

సీ. అని వేఁడుటయు నట్ల యగుఁగాక పొం డని, యంబుజాక్షుం డదృశ్యతను జెంద
వారలు దితిగర్భవాసంబునం జేరి, జనియించి రిలను రాక్షసులు గాఁగ

వారిలోపలఁ బెద్దవాఁడు హిరణ్యాక, శిపునామధేయుంబుచేత నొప్పెఁ
దనరె హిరణ్యాక్షుఁ డనుపేరఁ జిన్నవాఁ, డాయిర్వురును నైరి యధికబలులు
గీ. వారిలో నప్రమాణశరీరుఁ డగుట, నమితగర్వంబునను హిరణ్యాక్షుఁ డదరి
యొక్కదినమునఁ జాపగా నుర్విఁ జుట్టి, తలపయిం బెట్టికొని రసాతలముఁ జొచ్చె.
సీ. అంతట ననిమిషు లతిభయంబున క్షీర, సాగరంబును జేరి సత్వరముగ
విష్ణుసన్నిధిలోన విన్నపం బొనరింప, నాలించి సర్వంబు నచ్యుతుండు
తాల్చి వరాహావతారంబుఁ బాతాళ, మును జొచ్చి రాత్రించరుని వధించి
ధరను లేవఁగ నెత్తి దంష్ట్రిచే నిలిప య, థాపూర్వముగ నద్భుతంబు దోఁప
గీ. నపుడు బ్రహ్మాదిదేవత లరుగుదెంచి, ప్రస్తుతింపంగ శౌరిని బహువిధముల
వారలకు నెల్ల విష్ణువు వరము లొసఁగి, యెల్లరును జూచు చుండ నదృశ్యుఁ డయ్యె.
వ. ఇంక నృసింహావతారవృత్తాంతముం జెప్పెద వినుము. 2778
సీ. తమ్ముఁడు మ్రందినపిమ్మటను హిరణ్య, కశిపుఁడు శౌరినిగ్రహ మొనర్ప
సంకల్ప మొనరించి సత్వరంబుగ మేరు, శిఖరిపార్శ్వంబును జేరి యచట
దివ్యవర్ష సహస్రదీక్షఁ గైకొని వాయు, భక్షుఁడై శైవపంచాక్షరంబు
జపియించుచును ఘోరతపముఁ గావింపఁ ద, త్తపమునకు జగంబు తల్లడిల్లె
గీ. నపుడు దర్శన మొసఁగి నే నాశరునకుఁ, గోర్కె దీర వరం బిత్తుఁ గోరుమంటి
నంతట హిరణ్యకశిపుఁ డాహ్లాద మొదవ, మత్పదాంభోజములకు నమస్కరించి.
వ. దేవాసురమనుష్యదేవయోనిఫణిపక్షిక్రిమిపశుమృగరోగాయుధంబులలో దేనివలనను స్థలజలంబులలో నెచ్చటనుం దనకు మరణంబు లేకుండ వరంబు గోర నే నట్లె వరం బిచ్చి యంతర్ధానంబు నొందితి. 2780
సీ. వాఁ డంతట మదీయవరలబ్ధధైర్యుఁడై, సులువుగా ముజ్జగంబుల జయించి
త్రైలోక్యనాథుఁడై తన కడ్డు లేకుండ, సంచరించుచు నిర్విశంకముగను
నుత్తానపాదున కుద్భవం బైనక, ల్యాణినిఁ గైకొని యాత్మసతిగఁ
బ్రహ్లాదుఁ డనెడిపుత్రకుని నొక్కనిఁ గని, యామెయందు జగత్ప్రహర్షకరుని
గీ. జాతకర్మాదివిధులను సక్రమముగఁ, జేసి యుపనయనంబును జేసి యుక్త
కాలమున వేదశాస్త్రాదికళల నెల్ల, నభ్యసింపంగఁ జేర్చె గుర్వంతికమున. 2781
అ. అంతఁ గొంతకాల మరుగంగ నొకనాఁడు, దనుజనాథుఁ డాత్మతనయుఁ డఖిల
విద్యలను గ్రహించి విద్వాంసుఁడై యుండు, నని తలంచి పిలువనంపె నతని. 2782
సీ. అప్పుడు ప్రహ్లాదుఁ డరుదేరఁ దనయొద్ద, కసురాధిపతి మహాహ్లాద మొదవఁ
గొడుకుఁగుఱ్ఱను జేర్చికొని కౌఁగిటను ముద్దు, గొని యంకమున నుంచుకొని కుమార
గురుసన్నిధికిఁ బోయి చిరకాల మాయె నీ, వే మేమి చదివితో యెఱుఁగఁ జెపుమ
యని యడుగుటయు నిట్లనియెఁ బ్రహ్లాదుండు, విష్ణుభక్త్యావేశవివశుఁ డగుట.

గీ. చదివితిని దండ్రి సకలశాస్త్రములు గురువు, చెప్పఁగను సక్రమంబుగాఁ జిట్టచివర
కందులోఁ దెలిసినట్టిసారాంశ మిదియె, విష్ణు వొక్కఁడె దైవంబు వేఱు లేదు. 2783

చ. అనవుడు వానిమాటలకు నాగ్రహ మేర్పడ మానసంబునన్
దనుజవిభుండు పుత్ర మనదాయ యుపేంద్రుఁడు దేశికుండు నీ
కనుచితబోధముం జలిపె నాతని కిప్పుడె శిక్ష సేసెదన్
గను మని విప్రునిం గనియెఁ గన్నుల నిప్పులు రాలు చుండఁగన్. 2784

గీ. అపుడు జనకునిఁ జూచి ప్రహ్లాదుఁ డిట్టు, లనియెఁ దండ్రి నివారింపు మాగ్రహంబు
గురునిదోషంబు గా దిది హరియె నాకుఁ, బ్రేరకుం డయ్యె నాపదుద్ధారకుండు.

క. హరికంటె నాకు దేవుఁడు, గురువును లేఁ డన్యుఁ డిదియె కొనమాట నిరం
తరమును నతఁడె మదీయాం, తరమ్మునను వెలుఁగు చుండుఁ దపనుఁడువోలెన్.

క. అనుటయు రోషావేశం, బున నంకమునుండి త్రోసి భూమికిఁ బ్రహ్లా
దుని దైత్యవల్లభుం డి, ట్లనియెను నాకంటె దేవుఁ డన్యుఁడు గలఁడే. 2787

గీ. నన్నుఁ బూజింపు మన్యునినామ ముడిగి, నీకు సర్వంబు నిచ్చెద నేనె యనుడు
నట్లు చేయుము ప్రహ్లాద యదియె మనకు, నెల్లరకు హిత మని పురోహితులు పల్క.

మ. కని ప్రహ్లాదుఁడు వారి నెల్లరను దుష్కాలంబు ప్రాప్తించె నే
మనువాఁడన్ సకలంబు గుర్తెఱిఁగి ధర్మాధర్మముల్ చెప్పఁగ
ల్గినవిద్వాంసులె యిట్లు లోభమునకున్ గేలొగ్గి భాషింప నై
నను గోవిందుఁడు లేఁడె సర్వగతుఁ డన్యాయంబు శిక్షింపఁగన్. 2789

సీ. నారాయణుండె సనాతనుం డనియును, బద్మనాభుఁడె పరబ్రహ్మ మనియు
వాసుదేవుండె విశ్వము లెల్ల ననియును, దామోదరుఁడె జగత్కర్త యనియు
నచ్యుతుండె యథార్థ మగువస్తు వనియును, జక్రహస్తుఁడె సర్వసాక్షి యనియుఁ
బురుషోత్తముఁడె సర్వభూతేశుఁ డనియును, హరియె విరించిహరాత్ముఁ డనియుఁ

గీ. బరమపదము జనార్దనాస్పదమె యనియు
నభయహేతువు విష్ణుదాస్యంబె యనియు
భావనీయంబు శార్ఙ్గిరూపంబె యనియుఁ
జాటు చుండవె వేదముల్ శాస్త్రములును. 2790

క. సనకాదిమహామునులును, ననిశంబును నెవనిఁ గాంచ నాత్మధ్యానం
బున మునిఁగితేలు చుందురొ, కనుఁగొన నాతండు దైత్యఘాతియ కాఁడే. 2791

గీ. ఎవనిభయమున భూమియు నినుఁడు శశియు
వరుణుఁ డగ్నియు వాయువు వాసవుండు
మృత్యువు హరుండు బ్రహ్మయు స్వేచ్ఛ నుండ
వణఁకు చుందురొ యతఁడు శ్రీవరుఁడ కాఁడె. 2792

ఆ. ఎవఁడు రక్షకుండొ యీజగంబుల కెల్ల, నెవని నాశ్రయింప భవపయోధి
గట్టుఁ జేరఁగలరొ యెట్టివా రైనను, నమ్మహాత్ముఁ డొక్క హరియ కాఁడె. 2793
క. అనుఁడు పురోహితు లేమియు, ననఁజాలక యూరకున్న నంతటఁ గ్రోధా
గ్నిని నుడుకు చుండ నొడలె, ల్లను దనుజేంద్రుండు భృత్యులను జూచి వెసన్.
ఉ. కింకరులార వీఁడు రిపుకింకరుఁ డింక నుపేక్షసేయరా
దంకురకాలమందె తెగటార్పఁగ నొప్పు విషద్రుమంబు ని
శ్శంకము గాఁగ నాయెదుటఁ జంపుఁడు వీని నరాతికీర్తనా
పంకమలీమసాకృతి నభాగ్యుని మత్కులకీర్తికర్తనున్. 2795
క. హరి గాచునొ గిరి గాచునొ
దరిసించెదఁగాక వీనిధౌర్త్యము నెల్లన్
ద్వరితంబుగఁ దఱుగుఁడు మీ
కరవాలంబులను వీనిఁ గడికండలు గాన్. 2796
క. అని యాజ్ఞాపించుటయును, దనుజాధిపభటులు శస్త్రధరులై పరివే
ష్టన మొనరించిరి ప్రహ్లా, దుని భయదాకృతుల శమనదూతలువోలెన్. 2797
క. అపు డష్టాక్షరమంత్రము, జపియించుచుఁ జిత్తమందు శైలమువోలెన్
వ్యపగతచలనుండై య, ప్రపవిభునందనుఁడు నిలిచె సంతోషముతోన్. 2798
ఉ. అంతట దానవేంద్రభటు లాగ్రహ మేర్పడ నొక్కసారె వి
క్రాంతి మెలర్ప శస్త్రనికరంబున వ్రేయఁగ వానిమేన నొ
క్కంతయుఁ గల్గదాయె క్షతి శ్రీశకటాక్షమునన్ శరీర మా
ద్యంతము వజ్రతుల్య మయి యస్త్రము లెల్లను మొక్కవోవుటన్. 2799
ఉ. అప్పుడు యోధు లెల్లరు ద్రపావనతాననులై నిలంబడన్
నిప్పులు రాలఁ గన్నులను నిర్జరవైరివిభుండు చూచుడున్
సప్పములన్ ఫణీశముఖసర్పము లెల్లఁ దదాత్మసూతిపై
గుప్పున దూఁకి కాటు లిడి కోరలు డుల్లఁగ నిర్విషంబులై. 2800
క. గ్రక్కున గ్రిందంబడియెను, జొక్కుచు సోలుచును నోటఁ జొంగలువాఱన్
గ్రక్కుచు రుధిరము నది గని, రక్కసిఱేఁ డౌడుగఱచి రక్కొనుకనుకన్. 2801
శా. ఆదేశింపఁగ దిగ్గజంబులను నత్యౌద్ధత్య మేపారఁగా
రోదస్యంతర మెల్ల నిండఁగ మహారోషంబునన్ జేయుచున్
నాదంబుల్ ప్రళయాంబుదంబు లన దిఙ్నాగంబు లేతెంచి ప్ర
హ్లాదున్ ద్రొక్క మరుద్ధతద్రుమములచాయన్ గూలి నేలం బడెన్. 2802
గీ. అంతట హిరణ్యకశిపుఁ డంతంత కాత్మ, రోషవహ్ని జ్వలింప రుద్రుండువోలె
మండిపడుచుఁ బ్రహ్లాదుని మంటలోనఁ, ద్రాళ్ళతోఁ గట్టిత్రోయించె దారుణముగ.

ఆ. అంత వీతిహోత్రుఁ డసురారిభక్తుని, గాత్రమును స్పృశించుమాత్రముననె
చల్లఁబడియె దైవసాహాయ్య ముండిన, వాని కెందు నేని హాని గలదె. 2804

చ. అపుడు నిశాటనాథుఁ డెటు లైనను వానిని సంహరింపఁగన్
శపథము సేసి ప్రాణహరణక్షమ మైనవిషంబు వెట్ట ని
ష్కృపముగ నాకుమారుఁ డది మ్రింగి గుటుక్కునఁ ద్రేఁచె గఱ్ఱునన్
త్రప గలుగంగ రాత్రిచరరాజవరేణ్యునకున్ మనంబునన్. 2805

చ. అది గని దైత్యనాథుఁ డెద నచ్చెరియంబును నాగ్రహంబునున్
బొదలఁగఁ జూచి పుత్రునిఁ గుబుద్ధి యుపేంద్రుఁడె దేవుఁ డంచు నీ
వదరెడిపల్కె యైనయెడ వాస్తవ మిప్పుడు చూపె దేని నా
యెదుటను వాని నోర్తు వధియించెద ని న్నటుగాక తక్కనన్. 2806

వ. అని తర్జించుటయుఁ బ్రహ్లాదుం డాతని కిట్లనియె. 2807

సీ. వాసుదేవుం డయ్యె వసియించుటనుజేసి, సర్వభూతములందుఁ జక్రపాణి
జంగమస్థావరజగములం దెల్లెడ, వ్యాపించుటను విష్ణు వయ్యె శౌరి
హరి కయ్యె నేకాంఘ్రి యఖిలజగంబులు, చరణత్రయం బయ్యెఁ బరమపదము
శ్రీనాథుఁడె సమస్తచిదచిత్పదార్థముల్, తద్భిన్న మగుపదార్థంబె లేదు
గీ. కానఁబడు నెందు నేనియు దానవారి, నీయెదుట నన నేటికి నిక్కనముగఁ
జూడఁగలిగినఁ జూడు మిచ్చోట నుండె, నిచట లేఁ డని చెప్ప నే నెంతవాఁడ.

చ. అనవుడు దానవాధిపుఁ డహంకృతి మీఱఁగ నోరి వంశపాం
సన బహుళోక్తు లేమిటికి శార్ఙ్గధరుం డఖిలస్థలంబులన్
గనఁబడు నంచుఁ బ్రేలితి కనంబడునే యిట నంచుఁ బ్రోజ్ఝితా
సనుఁ డయి దూఁకె గ్రుద్దెఁ బరిషద్ధరణిం గలయుక్కుకంబమున్. 2809

క. గ్రుద్దినవెంటనె దిక్కులు, దద్దరిలన్ ధరణి వడఁకఁ దారలు రాలన్
బెద్దరొద వుట్టె గుండెలు, బ్రద్దలుగా నసురులకు సభాస్తంభమునన్. 2810

క. ఆనాదము వినఁబడఁగనె, దానవు లెల్లరును సడల ధైర్యము చేష్టా
హీనముగఁ బడిరి సమితి, స్థానంబున ఛిన్నమూలతరువులువోలెన్. 2811

సీ. ఆవల నాస్తంభమందు నృసింహుండు, ప్రాదుర్భవించె నాస్యంబునందు
హరిరూపమును మేన నరరూపమును దాల్చి, సవితృకోటిప్రకాశంబుతోడ
నతిఘోర మైనతదాకారముం గాంచి, దడదడ వుట్టంగ నెడఁదలోన
నిశ్చేష్టుఁ డై రజనీచరాధీశుండు, క్షితిపైనిఁ బడియెఁ బర్వతమువోలె
గీ. నంతఁ బ్రహ్లాదుఁ డుద్గతహర్షబాష్ప, పూరితవిలోచనుం డయి నారసింహ
మూర్తికి నమస్కరించి తన్మూర్తియందు, నఖిలభువనంబులను గాంచి యద్భుతముగ.

క. పురుషోత్తమసందర్శన, పరవశభావమున మేను పరిగతపులకాం
కురమై వెలయఁ దొడంగెన్, నరహరి సంస్తవముసేయ నానాగతులన్. 2813

ఆ. అపుడు దైత్యయోధు లపగతమూర్ఛులై, లేచి చూచి ప్రజ్వలించుచున్న
నరమృగాధిపతిని హరి వీఁడె కొట్టుఁడు, కొట్టుఁ డని వడంకఁ గుతల మార్చి. 2814

ఉ. సాయుధపాణులై మిడుత లగ్నిపయిం బడి చచ్చునట్లు నా
రాయణమూర్తిమీఁదను దురాగ్రహ మేర్పడ దూఁకి భస్మమై
పోయిరి తత్సటాపటలభూహుతభుక్సముదగ్రకీలలన్
జే యని మ్రోగుచుండఁగను నిర్జరదుందుభు లాకసంబునన్. 2815

గీ. అట్టితఱి స్వస్వపాధీశుఁ డాప్తసంజ్ఞఁ, దై తఁగాలున లేచి బిట్టార్చి కేల
ఖడ్గమును బట్టి యెదుట లెఱుంగనిసివంబు, తోడ నరసింహమూర్తిపై దూఁకె నంత.

క. హరి గజము నొడిసి పట్టిన, కరణి నృసింహుఁడు హిరణ్యకశిపునిఁ గేలన్
బోరిఁ బట్టి లాగి యూర్వం, తరమునఁ బడవైచికొని ప్రతాప మెలర్పన్. 2817

క. చీలిచి తదురస్స్థలమున్, వాలమ్ములఁ బోలుకరజవర్గముచే నా
భీలముగ వానిప్రేవులు, దాలిచి ప్రళయాంతకునివిధంబున నొప్పెన్. 2818

సీ. అంతటఁ దద్రూప మాలోకనముసేయఁ, దరము గామిని దేవతావ్రజంబు
వినుతింప లోకమాతను లక్ష్మి యేతెంచి, నరసింహమూర్తిముందఱను నిలిచె
నిలుచుటయును లక్ష్మి తిలకించి యామెను, బొంది శాంతిని నారసింహమూర్తి
తనయంకమునఁ జేర్చికొని వినోదించుచు, నుండంగ ననిమిషు లొక్కమొగిని

గీ. జయనినాదంబు లొనరించి జగదధీశ, భయద మగుతావకీనరూపమును జూడఁ
జాలకున్నార మిటమీఁద శాంతరూప, మును వహించి భవద్భక్తజనులఁ గనుము.

మ. అని ప్రార్థించుటయున్ నృసింహుఁడు ప్రసన్నాకారముం దాల్చి చ
య్యన వీక్షింపఁ గృపాకటాక్షముల దేవానీకమున్ నిర్జరుల్
గని సంతోషముఁ దత్ప్రభావమును సంశ్లాఘింప వేనోళ్ల వా
రిని గావించి నృసింహుఁ డిష్టవరసంతృప్తాత్ములన్ బిమ్మటన్. 2820

క. ఒనరించి దైత్యరాజ్యం, బున కధినాథునిఁగ సురలు పొగడఁగఁ బ్రహ్లా
దునిఁ బొందె నకృశ్యత్వం, బును దానవబాధ దొలఁగె ముజ్జగములకున్. 2821

సీ. అంతటఁ బ్రహ్లాదుఁ డాత్మలోపల విష్ణు, భక్తి వర్ధిలఁగ నపారముగను
విష్ణుప్రసాదాప్తవైష్ణవరాజ్యంబు, ధర్మమార్గంబును దప్పకుండఁ
బాలించుచును బహుకాలంబు భగవద, ర్పణముగా వివిధాధ్వరములు సేసి
కని విరోచనుఁ డనుతనయుని స్వసతియం, దంతంబునను జెందె హరిపదంబు

గీ. నీనృసింహమహత్త్వంబు నెవ్వరేని, వినినఁ బఠియించినను గతవివిధపాప
పంకలేపనులై తుదిఁ బరమపదముఁ, జెందుదురు లేదు దీనిలో సందియంబు. 2822

వ. ఇంక వామనావతారవృత్తాంతముం జెప్పెద వినుము. 2823

క. కలిగెను విరోచనునకున్, బలి యనెడికుమారుఁ డాతఁడు బహుధర్మములన్
దెలిసినహరిభక్తుఁడు దై, త్యులకున్ ఱేఁ డయ్యె నతఁడు దోర్బలముమెయిన్.

సీ. ఆతఁడు బలశాలి యగుటను జైత్రయా, త్రను జేసి త్రైలోక్యమును జయించి
తనకుఁ గింకరులుగా నొనరించుకొని మహేం, ద్రాదిసమస్తసుధాశనులను
బాలించు చుండంగఁ ద్రైలోక్యమును నప్పు, డఖిలసస్యసమృద్ధి యలర ధాత్రి
దున్నకయె ఫలింపఁ దొడఁగె గోవులు బహు, క్షీరప్రదానంబు సేయఁ దొడఁగెఁ

గీ. పాదపము లెల్ల ఫలపుష్పభారమునను, వఱలఁ దొడఁగెను బ్రజ లెల్ల స్వస్వధర్మ
వర్తులై చేయఁ దొడఁగిరి వాసుదేవ, నామసంకీర్తనాభ్యర్చనలు సతంబు. 2825

సీ. అట్టు లుండంగఁ గశ్యపుఁ డాత్మసుతుఁ డైన, బలవైరిరాజ్యవిభ్రంశమునకు
నమరుల కొదవినహైన్యంబునకును లోఁ, జింతించి వారికి క్షేమ మొదవఁ
దపముఁ గావింపఁగఁ దలఁచి కానను బయో, వ్రతమున వేయిసంవత్సరములు
విష్ణురూపధ్యానవివశుఁ డై కడపంగ, నతనిదీక్షకు మెచ్చి యచ్యుతుండు

గీ. వైనతేయాధిరూఢుఁ డై వచ్చి యొక్క-, నాఁడు కశ్యపునకు దర్శనం బొసంగఁ
గశ్యపుఁడు హర్షపులకితగాత్రుఁ డగుచు, జలజనేత్రుని మనసార సన్నుతించె. 2826

ఉ. ఆనుతికిన్ జతుర్భుజుఁడు హర్షము నొంది మునీంద్ర కోరు మే
దేని వరంబు నీ కిపుడె యిచ్చెద నాపుడుఁ గశ్యపర్షి స్మే
రాననుఁ డై జనార్దన మదంతరసంభవ మైనదుఃఖమున్
మానుపు మీవు నాయదితిమానినియందు జనించి పట్టి నై. 2827

సీ. అని వేఁడుటయును జనార్దనుం డట్టులె, యగుఁగాక యని వరం బతని కిచ్చి
పొందె యదృశ్యత్వమును జేరి యదితిగ, ర్భమున సహస్రవర్షంబు లందు
నివసించి యొకశుభదివసంబునను వామ, నాకృతితోడను నవతరించి
యింద్రానుజుఁడుగా నెసఁగుటను నుపేంద్రుఁ, డనియెడినామధేయంబు వడసి

ఆ. దీర్ఘసత్త్రయాగదీక్షలో నుండిన, బలిసమక్షమునకు బ్రహ్మచారి
వేషమునను బోవ విష్ణుభావమున న, భ్యాగతునకుఁ బూజ బలి యొనర్చె. 2828

గీ. బ్రాహ్మణోత్తమ తావకార్చనమువలన, ధన్యతను జెందె నాజీవితంబు నీవు
దేనికై వచ్చినాఁడవో తెలుపు మిత్తు, దాని నవిశంకముగను నేతత్క్షణంబ. 2829

చ. అనవుడు వామనుండు స్మిత మాస్యమునన్ దొలుకాడ నాబలిం
గనుఁగొని యిట్లనున్ మధురకంఠముతో దనుజేంద్ర నేను ని
ర్ధనుఁడను దానపాత్రుఁడను బ్రాహ్మణవర్యుఁడ నగ్నికుండముం
బొనరిచికొంటకై ధరణి మూఁ డడుగుల్ నిను వేఁడ వచ్చితిన్. 2830

గీ. దానములలోన నెల్ల భూదాన ముత్త, మం బగుట దాని నంగుష్ఠమాత్ర మేని
యిచ్చినను బుచ్చుకొన్నను నిరువురకును, శాశ్వతబ్రహ్మలోకవాసంబు గలుగు. 2831

గీ. మఱియును నకించనుం డైన నత్కొ్మసురునకు, ధాత్రి యేమాత్ర మేనియు దానమిచ్చు
నాతనికి సంఘటిల్లు జన్మాంతరమున, నుర్వి యెల్లను నేలెడియోగ మధిప. 2832
ఆ. ఇంతస్వల్పభూమి నె ట్లిత్తు నని నీవు, సంశయింప వలదు స్వాంతమందుఁ
గలుగు నీకు దీనివలన జగత్త్రయం, బును నొసంగి నట్టిభూరియశము. 2833
క. అని వచియించుటయును బలి, యనవధికం బైన హర్ష మామతిలంగన్
మనమున నట్టులె యిచ్చెద, నని పల్కె కడంగు చుండ నవని నొసంగన్. 2834
సీ. ఏతెంచి తత్పురోహితుఁ డైన శుక్రుఁ డి, ట్లనియె నాతనిఁ జూచి దనుజనాథ
దేవత లెల్లఁ బ్రార్థింపంగ నిన్ను వం, చించి నీమహి యెల్లఁ జేకొనంగ
నరుదెంచినట్టినారాయణుం డితండు, విప్రమాత్రుండు గాఁడు వేగపడకు
త్రిపదభూమి నొసంగఁ ద్రిజగంబుల నితండు, హరియించి నినుఁ గ్రింది కడఁగఁ ద్రొక్కు
గీ. నీయవల దొక్కయడుగు గైన నితని కర్వి, యిచ్చెదవుగాక మఱి యింక నేమి యైనఁ
జెప్పితిని శిష్యుఁడవు గానఁ జెప్పవలసి, నట్టిసమయంబునందు క్షేమార్థ మగుట. 2835
మ. అని బోధింపఁగ నాలకించి బలి శుక్రాచార్య ప్రహ్లాదపౌ
త్రున కీబోధము సేయ నొప్పునె భవత్ప్రోక్తప్రకారంబునన్
వనజాక్షుం డగునేని యీద్విజుఁడు సర్వస్వంబుతోఁ బ్రాణ మి
మ్మనినన్ నే నిపు డిచ్చువాఁడ హరి మత్ప్రాణాధికుం డౌటచేన్. 2836
క. అని పల్కుటయును శుక్రుఁడు, విని యూరకయుండె నంత విప్రుని దర్భా
సనమున బలి యుపవిష్టుని, నొనరిచి హరిబుద్ధి నతని కొనరిచి పూజన్. 2837
ఆ. ధారవోసి కలశవారిచే విప్రుని, హస్తమునఁ బదత్రయప్రమాణ
మైనభూమి దక్షిణాన్వితంబుగ మొక్కె, హర్ష మామతిల్ల నాత్మలోన. 2838
ఉ. భూసురవర్య ధన్యతను బొందెను నాజననంబు నీకు నేఁ
జేసినభూమిదానముఁ జేకొను మింక నభీష్టసిద్ధి గా
నీసకలప్రపంచముల నెం దయినన్ ధర నాఁగ మోమునన్
హాసము గుల్క శౌరి దనుజాధిప చూడుము భూమి గొల్చెదన్. 2839
సీ. అని వచించి త్రివిక్రమాకారమునను మి, న్నంటంగఁ బెరిఁగి యత్యద్భుతముగ
ససముద్రకాననశైలసప్తద్వీప, మును బహువిధజంతుపూరితమును
నతివిశాలమును నత్యాయామయుతమును, నగుధర నెల్ల నేకాంఘ్రిచేత
నాక్రమించి యుదగ్రమహర్బ్రహ్మలో, కాద్యూర్ధ్వపదము సంఘ్ర్యంతరమున
గీ. నాక్రమింపఁగఁ జక్రపద్మాదిచిహ్న, భరిత మగువిష్ణుపదమును బ్రహ్మ చూచి
హర్షమున స్వకమండలుస్థాంబువునను, గడుగ నప్పాదతీర్థ మక్షయ్య మగుచు.
వ. మేరుశిఖరంబునం బడి జగత్పావనతీర్థంబు నాల్గుదిక్కులకును బ్రవహించి సీత యలక
నంద చక్షువు భద్ర యని యథాక్రమంబుగా నామంబులం దాల్చి మేరువునకు దక్షిణ

భాగంబున నలకనంద యనియును నూర్ధ్వభాగంబున మందాకిని యనియును నధో
భాగంబున భోగవతి యనియును మధ్యభాగంబున వేగవతి యనియును బ్రసిద్ధిం గాంచె.

గీ. అమ్మహాగంగ మేరుమధ్యంబునుండి, ప్రస్రవించుచునుండ మూర్ధమున నేను
దాల్చి దానిని దివ్యవత్సరసహస్ర, మంది పూతత్వము శివుండ నైతి దాన. 2842

సీ. అంతట గౌతముం డనుమహర్షియు భగీ, రథుం డనెడివసుంధరాధవుండు
గంగానిమిత్తంబు గావింపంగం దపంబు, దానికి నేను సంతసము నొంది
సర్వలోకములకు సమకూర భద్రంబు, విడిచితి గంగను జడలనుండి
యది తదుభయనీత యగుటచే గౌతమి, యనియు భాగీరథి యనియుం బరగెం

గీ. జెప్పితిం బ్రసంగవశమునం జెప్పవలసి, వచ్చుటను గాంగసంభవవార్త నీకు
నట్లు విష్ణువు లోకము లాక్రమించి, యంఘ్రియుగ్మముచేత నత్యద్భుతముగ. 2843

క. బలి నంటంగం ద్రొక్కి రసా, తలమునకుం దృతీయపాదతలమున శ్రితవ
త్సలుం డగుటను యాదఃఫణి, పలలాదసమూహములకుం బ్రభువుగం జేసెన్. 2844

క. అంతట సుర లెల్లరు బహు, సంతోషముతోడం బొగడ స్వారాజ్యశ్రీ
కాంతునిగం జేసి యింద్రుని, నంతర్ధానంబు నొందె హరి చిత్రముగన్. 2845

వ. ఇంకం బరశురామావతారవృత్తాంతముం జెప్పెద వినుము. 2846

సీ. కలండు విశ్వంభరాతలమున జమదగ్ని, యనియెడిభృగుమహానితనయుం డొకండు
తపము గావింప నాధర్మాత్ముం డింద్రునిం, గూర్చి గంగానదీకూలమందు
నబ్దసహస్రపర్యంత మచ్చెరువుగా, నమ్మునికొకదినమందు వజ్రి
ప్రత్యక్షమై ద్విజప్రవర కోరుము వరం, బిచ్చెద ననుడు నాఋషివరుండు

గీ. పాకశాసన కరుణ నాపైని నీకు, నెనంగునేని గామధేనువు నిమ్ము నాకు
ననవుడుం బురందరుండుం బ్రీతి యావహిల్ల, నిచ్చి సురభిని మాని కదృశ్యుం డయ్యె.

సీ. అంతట జమదగ్ని యమరధేనువుతోడ, నాత్మాశ్రమంబున కరుగుదెంచి
తత్కామధేనుప్రదత్తమహైశ్వర్యం, బై సుఖించుచు హరిహయుండుపోలె
రేణుకసుత యైనరేణుకాదేవినిం, గైకొని పత్నిగాం గాంచుదీరం
బౌలోమితో దివస్పతిపోలె నామెతో, నతులభోగంబుల ననుభవించి

గీ. పుత్రకామేష్టి గావించి పుత్రకాంక్షం, గనియె రేణుకయందు శక్రప్రసాద
మునను విష్ణ్వంశమున నొప్పుపుత్రు నొకని, నమితవిక్రమవీర్యబలాభ్యధికుని. 2848

గీ. అంతటను దత్పితామహుం డైనభృగువు, రాముం డనుపేరు వెట్టె నారాయణాంశ
భవున కతనికి సకలతాపసవరేణ్య, సంసదంగణమున జగచ్ఛ్లాఘ్యముగను. 2849

గీ. అతండు జమదగ్నినందనుం డగుట జామ, దగ్న్యసంజ్ఞయు నతనికిం దనరె నతండు
శ్రద్ధతో విద్దియల నెల్లం జదివి తపము, సేయువాంఛ సాలగ్రామశిఖరి కరిగి. 2850

సీ. అచ్చటం గశ్యపుం డనెడిబ్రహ్మర్షినిం, గని వందనము సేయంగను నతండు
విష్ణుషడక్షరాన్వితమహామంత్రంబు, నుపదేశ మొనరింప యుక్తముగను

జామదగ్న్యుఁడు దాని జపియించుచును సర్వ, కాలంబులందు నక్కడనె యుండె
నట్టు లుండఁగను హైహయాధీశ్వరుం డగు, కార్తవీర్యుఁడు కొంతకాలమునకు
గీ. సర్వరాష్ట్రంబుల జయించి సైన్యయుక్తి, ముగిను జమదగ్నియాశ్రమంబునకు వచ్చి
ప్రణతి గావింప మౌనిసిఁ బార్థివునకుఁ, దగినగౌరవమును జమదగ్ని సేసి. 2851
సీ. ప్రార్థించి సురభి నయ్యాది షడ్రసోపేత, మృష్టాన్నపేయముల్ సృష్టిచేయ
పార్థివునకును హైహయేశ్వరునకుఁ ద, చ్చతురంగిసేనకుఁ జలిపె విందు
కార్తవీర్యుం డది గాంచి విస్మయ మొంది, జమదగ్నికడ నిల్చి సవినయముగ
మౌనీంద్ర నాకు నీధేనువున్నప్పుడె గాంచె, యుక్కవించెను దాని నొసఁగ దేని
గీ. యీవు కోటిసగోవుల నిచ్చువాఁడ, నన్నిటిని నేని నాయొద్ద నున్నవానిఁ
గోరుకొ మ్మన జమదగ్ని కువలయేంద్ర, తగిదు కోరంగి దేవతాధనము నీక. 2852
క. అనుటయును గార్తవీర్యా, ర్జునుఁ డాగ్రహ మొదవ నొక్కగ్రుద్ధున జమద
గ్నిని జంపి పట్టుకొనుటకుఁ, జనియెను దద్గోవు నాల్కసైన్యముతోడన్, 2853
క. ఆప్పుడు సురధేనువు మది, నప్పాలఁగఁ గ్రోధ మెంతయును దత్సేనన్
జప్పలుగఁ గ్రుమ్మి కొమ్ములఁ, గుప్పలుగాఁ గూల్చి చనియె గొబ్బున దివికిన్. 2854
గీ. అంతటను హైహయాధిపు డపగతాత్మ, సైన్యుఁడై వేరె వెంటనె స్వపురమునకు
నది యరుగఁడెఁగి నపుడు నారాయణుండు, రామునకు స్వస్వరూపదర్శనము నొసఁగి.
సీ. రామ చెందిలిఁ బ్రహ్మమును నీచేసిన, తపమున కేను స్వాంతంబునందుఁ
గావింప హితెమును దేవతలను ధర, త్రిభార మెల్లను దీర్చుటకును
నిచ్చితి మహాస్త్రవిప్రుఁ నీ కేతిదా, విష్ణుండనై సర్వదుష్టనృపుల
వధియించి యేలి భూవలయ మంతయు ధర్మ, సంస్థాపనము చేసి జగమునందు
గీ. సర్వ లైనట్టివారికై నవపిభరము, గనిచి చివరకు మత్పదంబునకుఁ జేరు
మని పలికి పరశువు వైష్ణవాస్త్రములను, నిచ్చి జమదగ్నిసుతున కదృశ్యుఁ డయ్యె.
సీ. అంతట రాముఁడు హర్షంబుతోడను, స్వాశ్రమభూమిక నరుగుదెంచి
యాలించి తనతండ్రి హైహయాధిపునిచే, హతుఁ డయ్యె ననెడి యంతటివార్త
ప్రళయాగ్నికైవడిఁ బ్రజ్వరిల్లుచు లేచి, విష్ణుశక్త్యావేశవివశుఁ డగుట
నొకకేలఁ బరశువు నొకకేల వైష్ణవా, స్త్రములను దాల్చి యత్యద్భుతముగఁ
గీ. జలుప నెంచి ధరిత్రి నిఃక్షత్రియముగఁ, బయన మై పోయి హైహయనృపతిపురంబుఁ
జేరి నిలుచుండెఁ దత్పురద్వారమునను, బంట్లు పటపటఁ గొరుకుచు భయదముగను.
ఉ. ఆతనిఁ జూచి పౌరులు భయాకులులై వడి నేఁగి హైహయ
క్ష్మాతలనేతకున్ దెలుపఁగా నతఁ డాగ్రహదుర్నిరీక్షుఁ డై
యాతనిఁ బట్టితేరఁగ మహాబలశాలులఁ బంప యోధుల్
గాతుక మొప్ప వారు ధృతిఖడ్గగదాశరచాపహస్తులై. 2858

క. చని రాముఁ డున్నచోటికి, ననలునివలెఁ బ్రజ్వరిల్లునమ్మహితునిమీఁ
దను గవిసి శలభములచా, యును భస్మం బైరి తద్భయానకదృష్టిన్. 2859

క. అది యెఱిఁగి కార్తవీర్యుఁడు, మదమున నొడ లెఱుఁగ కునికి మండెడుచూడ్కిన్
రదములు పటపటఁ గొఱుకుచు, నెదుటను జనుదెంచె రాముఁ డుండెడుకడకున్.

క. అరుదెంచిన వానిం గని
హరి గజమునుబోలె రాముఁ డతిరోషమునన్
ధరణీధవాధమ క్షత్రియ
నరపశుబలి వలయు మద్రణక్రతువునకున్. 2861

సీ. జమదగ్నినామునికిఁ గొమరుండ భృగుమహా, మునికిఁ బౌత్రుండను రాముఁడను నేను
నాజననికిని నొనర్పంగ మొదటను, ద్విడ్రక్తధారచేఁ దర్పణంబు
త్వచ్ఛిరఃకమలంబువలనఁ బిండప్రదా, నంబును నేతెంచినాఁడ నిటకు
నిలువుము నావుడుఁ దిలకించి రామునిఁ, గార్తవీర్యుఁడు మహాఘూర్ణదృష్టి

గీ. బ్రాహ్మణాధమ నీతండ్రిపగిది నీవు
నాశ మొందంగ నేతెంచినాఁడ విటకుఁ
గాల మాసన్న మగుటను గాక యున్నఁ
బ్రేలుదువె కార్తవీర్యునిమ్రోల నిట్లు. 2862

క. అని పలికి నిశితబాణము, లను జాపమునందు సంధిలఁగఁజేసి తలా
లున నేసె జామదగ్న్యునిఁ. దనపాపము ఫలము నిచ్చుతరుణం బగుటన్. 2863

ఉ. అంతట జామదగ్న్యుఁడు లయాంతకుఁ డేమొ యితం డటన్నవి
భ్రాంతిని గల్గఁజేయుచును బ్రాణుల కెల్లఁ గుఠారధారచే
నింతగఁ గూల్చి రాజభటవీరుల నెల్లను గార్తవీర్యభూ
కాంతునివేయిచేతులను గంతమునన్ దునిమెన్ గఱుక్కునన్. 2864

అ. అట్లు దునిమి హైహయాధీశ్వరుని రాముఁ, డాగ్రహంబు లోన నాఁగ కునికి
క్షత్రియులను నెల్ల సంహార మొనరింప, నరుగు చుండెఁ బ్రళయహరుఁడువోలె.

గీ. అప్పుడు రేణుక మార్గమధ్యమున వచ్చి, తండ్రి యిక్ష్వాకువంశ్యులఁ దగదు చంప
వారు నీకు మాతామహవంశ్యు లగుట, ననుచు నర్థింపఁగను రాముఁ డభయ మొసఁగి

గీ. సమధికాటోపమున నేఁగి సకలధరణి, పాలకుల నూఁచముట్టుగాఁ బరశువునను
నఱకె యిక్ష్వాకువంశభూనాయకులను, భ్రష్టరాజ్యులఁ జేసి చంపకయె విడిచి. 2867

గీ. ఉడిగి యావేశమును శాంతి నొంది సర్వ, వసుమతీచక్రనాథుఁ డై వాజిమేధ
యాగము నొనర్చి దానిలో ననిసురుల, కందఱకు దక్షిణగ నిచ్చి యఖిలధరణి.

క. చని బదరికాశ్రమమునకు, నొనరింపఁ దొడంగెఁ దపము నుగ్రంబుగ రా
మునిమహిమము సంపూర్ణము, గను బ్రహ్మకు నైన నలవి గాదు వచింపన్. 2869

వ. విష్ణుశక్త్యావేశావతారం బగుటంజేసి పరశురామావతారం బుపాసనార్హంబు గాదు. విష్ణుపూర్ణావతారంబు లగురామకృష్ణావతారంబు లుపాసనార్హంబులు గాఁ జెప్పం బడియె. 2870

క. అంతట బ్రాహ్మణు లెల్లరు, సంతసమున రఘుకులాభిజాతు లగుమహీ
కాంతుల కిచ్చిరి మేదిని, యంతయుఁ ధర్మమున నేల సానుగ్రహు లై. 2871

వ. ఇంక శ్రీరామావతారవృత్తాంతముం జెప్పెద వినుము. 2872

సీ. పూర్వము భూతలంబునను స్వాయంభువుఁ, డనుపేర మను వొక్కఁ డవతరించె
నైమిషారణ్యంబునను గోమతీతట, స్థలిని సహస్రవత్సరము లతఁడు
తపము గావింపఁ దత్తపమున కాహ్లాద, మొదవంగ నచ్యుతుం డొక్కనాఁడు
స్వస్వరూపంబున స్వాయంభువునకుఁ బ్ర, త్యక్ష మై కోరుకో మ్మనఁగ వరము

గీ. సంతసము నొంది యాతఁడు చక్రపాణి, నాకుఁ బుత్రుండ వగుము జన్మత్రయంబు
వఱకు నినుఁ బుత్రునిఁగఁ బొందువాంఛతోడఁ, జలిపితి సహస్రవత్సరంబులు తపంబు.

సీ. అనవుడు శౌరి యి ట్లనియె స్వాయంభువ, త్వద్వాంఛ నాకు సంతసముఁ గొల్పె
శిష్టరక్షణమును దుష్టశిక్షణమును, గావింపవలసినకాలమందు
నీవు కోరినయట్ల నీకు నే జన్మించి, సలుపుదు ధర్మసంస్థాపనంబు
నని వచించి యదృశ్యుఁ డగుటయు మనువు మ, హానందమును బొంది నాత్మలోన

ఆ. నవలఁ గొంతికాల మరుగఁగ రఘువంశ, మునను దశరథుఁడుగ మనువు పుట్టె
నచ్యుతుండు పుట్టె నతనికి మున్ను దా, ననినయట్ల రాముఁ డనెడిపేర. 2874

సీ. ఆరామునిచరిత్ర మాలింపుము వచింతు, నఖిలపాతకహరం బగుటఁ జేసి
ధరను మున్ను పులస్త్యతనయుఁ డొక్కరుం డుండె, విశ్రవుం డనుపేర విదితయశుఁడు
నెలఁత యయ్యెను నాతనికిఁ గేశి యనుసు, మాలిదైత్యకుమారి యొకతె
యామె సంధ్యాకాలమందుఁ గామాంధ్యంబు, నను నిజధవునితోడను రమించి

గీ. కాంచి రావణుఁ డనఁ గుంభకర్ణుఁ డనఁగ, శూర్పణఖ యనఁగను రక్కసులను బిదపఁ
గనియెను విభీషణుని శీలధనుని నొక్క, మంచిమూర్తంబునను దనమగనిఁ గూడి.

వ. అంతట రావణకుంభకర్ణులు నన్నుం గూర్చి హిమవత్పర్వతంబున ఘోరతపంబు గావించిరి. 2876

సీ. అందు రావణుఁడు సాహసమున మత్పూజ, గావింప నిజశిరఃకమలములను
దానికి నే నద్భుతం బొంది వానికిఁ, బ్రత్యక్ష మై స్వరూపంబుతోడ
వరముఁ గోరు మనంగ వాఁడు గోరెను దన, కవధంబు దేవదానవులవలన
వాఁడు గోరినయట్లె వానికి వరము నొ, సంగి చెందితి నదృశ్యతను నేను

గీ. రావణుం డంతటను మద్వరప్రభావ, గర్వితుం డయి మూఁడులోకముల బాధ
పెట్టుచుండంగ సుర లెల్ల భీతితోడ, శరణుచొచ్చిరి హరిని నిశ్శరణు లగుట. 2877

సీ. అపుడు జనార్దనుం డతని వధింపంగఁ, దగినయుపాయంబుఁ దా నెఱింగి
సురలార దశరథనరపతికి నరుండ, నై నేను రఘువంశమందుఁ బుట్టి
వధియించువాఁడ రావణుని సమూలంబు, గను బ్రహ్మశాపంబుకతన మీరు
ధరణిపైఁ బుట్టి వానరులుగా సాయంబు, గావింపవలయు మత్కార్యమునకు
గీ. నని వచించి యంతర్ధాన మగుడు నమరు, లందఱును గ్రోఁతులుగఁ బుట్ట రవనియందు
నపుడు పుత్రార్థి యై యజ్ఞ మాచరింపఁ, దొడఁగె దశరథుఁ డనిమొడిపుడమితేడు.
ఆ. అట్లు దశరథుండు యజ్ఞంబు గావింప, నుండ శౌరి యజ్ఞకుండమందు
దెసలు పదియు వెలుఁగ దివ్యతేజంబుతో, నుదయమంది కరుణ యుట్టిపడఁగ. 2879
సీ. వసుమతీంద్ర వరంబు వాంఛింపు మిచ్చెద, నని పల్క దశరథజనవరుండు
ప్రాంజలి యై మ్రొక్కి యచ్యుత పుత్రుండ, వగుము నా కిదియె మత్ప్రార్థనంబు
నావుడు సస్మితాననుఁ డయి దైత్యారి, పాయసాన్విత హేమభాజనంబు
దశరథున కొసంగి ధరణీంద్ర యీపాయ, సము విభజించి నీసతుల కిమ్ము
గీ. పుత్రరూపంబునను నేను బుట్టువాఁడ, నని వచించి యంతర్ధాన మయ్యె నంత
దశరథుఁడు హర్ష మొంది తత్క్షణమునందె, దరిని నిలిచినసతుల నిర్వురను జూచి.
గీ. రెండుభాగంబులుగ నొనరించి పాయ, సంబుఁ గౌసల్య కొక్కభాగంబు నొసఁగి
యొక్కభాగంబు గైకేయి కొసఁగి చనియె, నంతలో వచ్చి మ్రొక్కెను యాసుమిత్ర.
గీ. కోరఁగిను పాయసంబును వార లామె, కాత్మభాగంబులం దర్ధ మర్ధ మీయ
నామె భాగద్వయంబును నారగించె, నారగింపఁగ భాగద్వయంబు వారు. 2882
క. అంతట ముువ్వురు గూడను, నంతర్వత్ను లయి నూత్న మగుతేజముతో
నెంతయును వెలుఁగఁ జొచ్చిరి, సంతస మొదలంపఁ గొదల సకల జనులకున్. 2883
సీ. అట్లు కాలము కొంత యరుగంగఁ జైత్రమా, సంబున శుక్లపక్షంబునందు
దితిదైవతర్క్ష సంయుత మైననవమిని, సమున మధ్యాహ్నకాలమునయందు
సర్వశుభగ్రహసహితలగ్నమునందు, జగదేకపతిని గౌసల్య కనియె
నపుడు చల్లఁగ వీచె ననిలముల్ దెసలును, నదులును సుప్రసన్నంబు లయ్యె
గీ. మ్రోఁగె సురదుందుభులు వ్యోమమున నటించి, రచ్చరలు పాడ గంధర్వు లాకసమున
మునులు బ్రహ్మాదులును నభంబున విమాన, గాము లై యుండి పొగడి రక్కైటభారి.
సీ. అపుడు కౌసల్య దీపావిర్భవద్దీప, మట్లు విష్ణ్వాద్యుం డైనవాని
శంఖచక్రగదాంబుజధ్వజవజ్రల, క్షణలక్షితాంఘ్రిహస్తములవాని
శ్రీవత్సకౌస్తుభశ్రీవనమాలికా, లంకృతవక్షస్స్థలంబువాని
రవికోటిదీప్తివిరాజితుం డగువాని, బ్రహ్మాండపూర్ణోదరంబువాని
గీ. వేదనిశ్వాసములవాని ద్వీపశైల, వార్ధిజఘనంబువాని వివస్వదగ్ని
నయనములవాని మారుతనాసవాని, బ్రహ్మశివకర్ణములవానిఁ బట్టెఁ గాంచి. 2885

గీ. భీత యై యిట్టు లనియెఁ గంజాతనేత్ర, ధన్యతను జెందితిని నిన్నుఁ దనయునిఁగను
గనుటచే నింక నీరూపు గాంచఁజాల, భయముఁ బాపుము పుత్రరూపమున నాకు.

క. అని వేఁడుటయును దత్క్షణ, మున మాయా మానుషత్వమును బొంది జనా
ర్దనుఁడు శిశురూపమున రో, దనముం గావించె ముదము దల్లికిఁ గలుగన్. 2887

గీ. అంతట నొనర్చి జాతకర్మాదివిధుల, నఖిలవిదుఁడు వసిష్ఠుఁ డనంతరంబ
యక్కుమారునకు శ్రీరాముఁ డనెడిపేరు, వెట్టె శ్రీరమణుం డయినట్టికతన. 2888

క. అంతట దశరథుఁ డెంతయు, సంతోషముతోడ నిచ్చె బ్రాహ్మణులకు దై
త్యాంతకసంప్రీతిగ భూ, దంతికనకగోధనాదిదానము లెల్లన్. 2889

గీ. ఆదినంబునఁ బురిజను లాదరమునఁ, జేసిరి మహోత్సవంబులు చిత్రముగను
దశరథున కంబుజాక్షుఁడు తనయుఁడుగను, బుట్టె ననియెడిసంతోష ముట్టిపడఁగ.

వ. అటుపిమ్మటఁ గైకేయికిఁ బాంచజన్యాంశంబున భరతుండును సుమిత్రకనంతాంశంబున
లక్ష్మణుండును సుదర్శనాంశంబున శత్రుఘ్నుండును బ్రాదుర్భవించిరి. 2891

సీ. వారలెల్లరును వైవస్వతమనుకులం, బునకు నలంకారభూతులుగను
వృద్ధిని బొందుచు వేదశాస్త్రపురాణ, చాపవిద్యాదుల సాఁదిరి
నాఁడునాఁటికి మహానందంబుగొలుపంగ, సాగిరి చూచెడిజనుల కెల్ల
నటు లుండఁగ నయోధ్య కరుదెంచి కౌశికుం, డనుమునీంద్రుం డొకదినమునందు

గీ. దశరథుఁడు సేసినట్టిసత్కారమునకు, మిగుల సంతోషమును బొంది మేదినీంద్ర
క్రతువు నొనరించుచుండ గంగాతటంబు, నందు సిద్ధాశ్రమంబునయందు నేను. 2892

క. దనుజులు మాంసము రక్తం, బును వైచుచు నగ్నికుండములలో యజ్ఞం
బును బాడుచేయఁ దొడఁగిరి, కనలి శపింపంగఁ దగనికాలం బగుటన్. 2893

క. ఆయసురబాధ తొలఁగం, జేయఁగఁ బంపంగవలయు శ్రీరాముని నా
సాయంబున మీ కెల్లను, శ్రేయంబులు గలుగు నేల చెప్ప బహూక్తుల్. 2894

క. అని వచియింపఁగ దశరథ, మనుజాధీశ్వరుఁడు మాఱుమాటాడక య
మ్మునివెంటఁ బనిచె శ్రీరా, ముని లక్ష్మణసహితముగఁ బ్రమోదముతోడన్. 2895

సీ. అంతటఁ గౌశికుం డానంద మొదవ న, ల్లమునఁ దోడ్కొని రామలక్ష్మణులను
దనయాశ్రమమునకుఁ జనుచుండ మార్గమ, ధ్యంబునఁ బుష్పవర్షంబు గురిసె
నేతెంచి తార్క్ష్యుఁ డదృశ్యరూపమున ది, వ్యాస్త్రంబులను దివ్యశస్త్రములను
నక్షయతూణసాయకముల దివ్యకా, ర్ముకమును నిచ్చి రామునకు నేఁగె

గీ. దాశరథి వానిఁ గైకొని తపసివెంట, నరుగుచును నొక్కవిపినమునందు మౌని
యానతిని జంపెఁ దాటక యనెడిక్రూర, రాక్షసిని నొక్కనిశితనారాచమునను. 2896

క. ఆతాటక శ్రీరాముని, చేత నిహత యగుట విడిచి స్వీయతనువు లో
కాతీతదివ్యరూపస, మేతముగను దివికి నేఁగె నెల్లరుఁ జూడన్. 2897

వ. అంతట విశ్వామిత్రుండు రామలక్ష్మణులతోడ నిజాశ్రమంబునకుం జేరి దీక్షితుం డై లోకకల్యాణార్థంబు యజ్ఞంబు నారంభించె. 2898

సీ. జరుగు చుండంగ యజ్ఞంబు వైభవముతో, వీతిహోత్రంబులు వెలుఁగు చుండ
నరుదెంచి మారీచుఁ డనురాక్షసుండు సు, బాహుండు నాఁబడు భ్రాతతోడ
సవనవిధ్వంసంబు సలుప శిలావర్ష, మును ముందుఁ గురియంగ మున్నువోలె
నాజాడ రాఘవుం డరసి సుబాహుని, నొక్కమార్గణముచే నుర్విఁ గూల్చి

ఆ. మారుతాస్త్రమునను మారీచుని సముద్ర, మందుఁ బాఱవైచె నద్భుతముగ
స్పర్శనంబు శుష్కపర్ణంబునుం బోలె, రామభద్రుశక్తి యేమి చెప్ప. 2899

గీ. అబ్ధిలోఁ బడి మారీచుఁ డట్లు కదల, మెదలఁ జాలక యెట్టులో బ్రదికి తుదకు
నెవరికిని గానఁబడకుండ నేఁగి తపముఁ, గడఁగె నొనరింప నొక్కకాఱడవిలోన. 2900

గీ. అంతటను గౌశికుఁడు చేసె యాగపూర్తి, హర్షమున రాఘవునిశక్తి నభినుతించె
రాముఁ డనఁగను నాదినారాయణుండె, యని గ్రహింపఁగ నట నుండుమనుజు లెల్ల.

సీ. అది య టుండఁగ మిథిలాధీశ్వరుఁడు వాజ, పేయయాగంబును జేయ నెంచి
యాహ్వాన మంప బ్రాహ్మణులకు రామల, క్ష్మణసమేతంబుగాఁ గౌశికుండు
పయనమై మిథిలకు రయమునఁ జను చుండఁ, గను సవమును నొక్కవనములోన
నశ్మమై యున్నయహల్య చిత్రంబుగా, రామపాదము సోఁకి రమణి యయ్యె

గీ. నవల మిథిలాపురంబున కరుగుటయును, గౌశికమహర్షి రామలక్ష్మణులతోడ
జనకుఁడు యథావిధిని గౌశికునకుఁ బూజ, సలిపి రామునివదనాంబుజమును జూచి.

క. తనహృదయంబున సతతం, బును ధ్యానంబునను జూచుపురుషోత్తమునిన్
గనినట్టులు ప్రత్యక్షము, గను దనియుచు విని తదీయకథ మునివలనన్. 2903

ఆ. లక్ష్మివోలెఁ దనకు లాంగలముఖమున, నవనిలోనఁ బ్రాప్తయైనసీతఁ
బత్నిగా నొసంగ భావంబునఁ దలంచి, యతని కుచితపూజ లాచరించి. 2904

క. శివచాపంబును జూపఁగ, నవనిజను గ్రహించునట్టి యర్హత గల రా
ఘవుఁ డొకత్రుటిలో దానిని, జివుకునను విఱిచి కొనియె సీతను సతిగాన్. 2905

వ. అంతట జనకుఁ డత్యానందముం జెంది యయోధ్యానగరంబునకు విప్రోత్తములం బనిచి సపరివారంబుగా దశరథుని రావించి తత్పుత్రు లగులక్ష్మణభరతశత్రుఘ్నులకు యథాక్రమంబుగాఁ దనపుత్రిక యగునూర్మిళను దనతమ్మునితనూజ లగుమాండవీశ్రుతకీర్తులను నొసంగి వివాహమహోత్సవంబు గావించి యథార్హంబుగా మహర్షులకును మహీపతులకును సకలజనంబులకును సత్కారంబు లొనర్చె. 2906

సీ. ఆవల దశరథభూవరుండు గ్రహించి, పరిబర్హమును బహుప్రమద మొదవఁ
దనయస్నుషాబంధుజనపురోహితమంత్రి, పరిజనయుతముగా బయలుదేఱి
చనుదెంచు చుండఁగ స్వపురంబునకు జామ, దగ్న్యుండు మార్గమధ్యంబునందు
సామర్షమైనసింహమువోలె నెదురుగా, నరుదెంచి నిలిచి భీకరము గాఁగ

గీ. రాఘవ ధరాపతుల నెల్లరను వధించి, ధరణి నెల్లను భూసురతతి కొసంగి
వనమునను నేను గావించుచును దపంబు, త్వన్మహావీర్యమును విని వచ్చినాఁడ. 2907
గీ. వీర్యవత్తరుఁ డైనపృథ్వీధవుండు, గలఁడు ధర ననుమాట నాకర్ణములకు
సైఁపరా కున్నయది శివచాపభంగ, మొనరిచినమాత్రమున గర్వ మొందవలదు.
గీ. ఈధనువు నెక్కు వెట్టితి వేని చాలు, నిర్జితుఁడ నయిపోవుదు నేను నీవు
దీని నెక్కిడలే వైతి వేని నన్ను, శరణుచొచ్చి త్యజింపుము శస్త్రములను. 2909
సీ. అని పల్కి తనహస్తమున నున్నవైష్ణవ, చాపంబు నొసఁగ దాశరథి దానిఁ
గైకొని దానితోఁ గైకొని తద్విష్ణు, శక్తియుఁ దచ్ఛరాసనము వంచి
యవలీలగను బాణ మందు సంధానించి, స్మిత మాననంబునఁ జిందులాడ
నిగితకర్ముం డైన నష్టిప్రునివలె గన, త్కాంతి నై యున్న భార్గవునిఁ జూచి
గీ. బ్రాహ్మణోత్తమ రామమార్గణ మమోఘ
మేమి లక్ష్యంబు చూపెదొ యెఱుఁగఁ జెపుమ
యనుడు భార్గవుఁ డతివిస్మయంబు నొంద
యతనిఁ బరమాత్మునిఁగఁ గాంచి యాత్మలోన. 2910
సీ. రాఘవ నిన్ను నారాయణమూర్తిగాఁ, దెలిసికొంటిని భవద్వీర్యమునను
నీ వాదిపురుషుఁడ వీ వచ్యుతుండవు, నీ వనంతుండవు నీవు హరివి
నీ వచింత్యుండవు నిర్గుణుండవు నీవు, సగుణుండ వీవు శాశ్వతుఁడ వీవు
స్రష్టవు నీవు పరాత్పరుండవు నీవు, కర్తవు నీవు సంహర్త వీవు
గీ. ప్రణవమును వేదమును నధ్వరమును గాల
మును బరబ్రహ్మమును నజుండును హరుండు
సకలభువనంబులును దదీశ్వరులు నీవ
యెఱుఁగ నీదివ్యశక్తి నే నెంతవాఁడ. 2911
క. క్షమియింపుము నాయపచా, రము నని ప్రార్థించి తచ్ఛరమునకు స్వస్వ
ర్గముఁ జూపి లక్ష్యముగ స్వా, స్త్రము లెల్ల నొసంగి తపము సలుపఁగ నేఁగెన్. 2912
సీ. అంతట దశరథుం డానందమున నయో, ధ్యకుఁ జేరి సకలబాంధవులతోడ
స్వతనూజులకు రత్నసౌధంబుల నొసఁగి, నివసింప స్వస్వపత్నీయుతముగ
బహుమానము లొనర్చి బాంధవప్రతతికిఁ, బనుపంగ వా రెల్లఁ జనిరి వేడ్క
నది మొదలుగ ద్వాదశాబ్దముల్ దశరథ, తనయులు స్వస్వకాంతలను గూడి
గీ. యనుభవించిరి సకలసౌఖ్యముల నంత, దశరథుం డొక్కదినమునఁ దలఁచి రామ
చంద్రునకు యౌవరాజ్య మొసంగఁ జాటఁ, బనిచె భటులను నిజరాష్ట్రజనుల కెల్ల.
సీ. అది విని కైకేయి యతిశీఘ్రముగ వచ్చి, దశరథమేదినీధవునికడకు
దేవ పూర్వము నాకు నీ విచ్చెద'న టన్న, వరముల కిప్పుడు తరుణ మొదవె

నాడి తప్పనివాఁడ వగుటచే నిచ్చెద, వన్న ధైర్యమున ని న్నడుగుచుంటి
రాఘవునకుఁ జతుర్దశవర్షములదాఁక, నడవిలో నివసింప నాజ్ఞ యిచ్చి

గీ. యౌవరాజ్యంబునను నిల్పు మాతవఱకు, భరతుని న టంచుఁ గోర విభ్రాంతి నొంది
దశరథుఁడు సత్యబద్ధుఁ డై తప్ప కునికి, నానతిచ్చెను రాముని కడవి కేఁగ. 2914

గీ. అంతటను రాఘవుఁడు రావణాదిదైత్య, వధనిమిత్తము పితృవచోవ్యాజమునను
బయలుదేఱుచు నడవికి బయలుదేఱె, రవనిజయు లక్ష్మణుండును నతనివెంట. 2915

సీ. అపుడు సీతాలక్ష్మణాన్వితుండుగ దాశ, రథి చని యొక్కయరణ్యమునకు
నచ్చటఁ జిత్రకూటాద్రిపై నివసించి, యుండంగ నంత నయోధ్యలోన
రామవియోగదుఃఖామయగ్రస్తుఁ డై, తనువును విడునంగ దశరథుండు
భరతుండు రాజ్యంబుఁ బాలింప నొల్లక, భ్రాతృవియోగార్తుపేతుఁ డగుచు

గీ. నడవి కేతెంచి రామునియడుగులందు, వ్రాలి కన్నీటఁ దత్పాదవనజములను
గడిగి రాజ్యంబు నర్పింపఁ గై కొనంగ, సమ్మతింపక రాముఁ డాసమయమందు. 2916

క. భరతునకు స్వపాదుకలను, గరుణించి యొసంగ నతఁడు గై గొని వానిన్
మరల నయోధ్యాపురమున, కరుదెంచి నిజాగ్రజాజ్ఞ యవిలంఘ్యము గాన్. 2917

గీ. రామపాదుకలం దుంచి రాజ్యభరము, దాల్చి మునివేషమును భక్తి దార్కొనంగ
ననుదినముఁ జేయుచును బాదుకార్చనంబు, ప్రజల నేలంగఁ దొడఁగెను భటుఁడువోలె.

వ. ఆది మొదలుకొని పౌరజనులును భరతుని తెఱంగున నియతవ్రతము బూని రామాగమనముం గోరుచు రామనామసంకీర్తనంబులు గానింపం దొడంగిరి. 2919

సీ. ఆది యటుండ నరణ్యమందు రాఘవుఁ డొక్క, తఱిని మందాకినీతటమునందు
శయనించి యుండంగ జనకజాంకంబునఁ, గని యింద్రసుతుఁ డైన దనుజుఁ డొకఁడు
జానకీసౌందర్యసమ్మోహితాత్ముఁ డై, కాకరూపమున నక్కడకుఁ బోయి
సంచరించుచును దత్సవిషమం దెగిసి ఱీ, వ్వనఁ జీల్చె మైథిలీస్తనము గోళ్ళ

గీ. నది గనుంగొని రాఘవుం డాగ్రహమునఁ, గుశను మంత్రించి విడువ నాకుశ భయంక
రముగ బ్రహ్మాస్త్ర మై కడుఁ బ్రజ్వరిలుచుఁ, గాకివెంటను బడఁగ నక్కాకి యడలి.

ఆ. తిరిగి తిరిగి సర్వదేశంబులును సర్వ, భువనములును దన్నుఁ బ్రోవఁగలుగు
నట్టివారు లేమి నం దెందునుం గూడ, రామపదములందె వ్రాలెఁ దుదకు. 2921

సీ. అపుడు జానకి కరుణాయత్తచిత్త యై, కావుము నాథ యీకాకి ననుచుఁ
బ్రార్థింపఁగఁ గృపార్ద్రభావుఁ డై రాముఁడు, బ్రదుకుము పొమ్మని వదలె దాని
నవల నావాయసం బవనిజాశ్రీరామ, చరణంబులకు మ్రొక్కి చనియె దివికి
రాఘవుం డంత భరద్వాజముఖతపో, ధనజనకృతసమర్చనల నొంది

గీ. యరిగి యత్ర్యాశ్రమమునకు నచట నొక్క, దినము వసియించి యత్రిపూజను గ్రహించి
తదనుమతి గొని పిమ్మటఁ దాపసౌఘ, పూర్ణ మగుదండకారణ్యమునకుఁ జేరి. 2922

గీ. పారికాంక్షుల కచట నుపద్రవంబు, సలిపెడివిరాధుడై త్ర్యుని సంహరించి
క్రమముగను శరభంగాశ్రమమును జేరి, దర్శనం బీయ శరభంగతాపసునకు. 2923

క. శరభంగమౌని రాముని, దరిసెన మొనరించి దాన ధన్యుం డై స
త్వరముగ బ్రహ్మపురంబున, కిరిగె మునులు చూచు చుండ నాశ్చర్యముగన్. 2924

వ. అంతట రామచంద్రుండు సుతీక్ష్ణాశ్రమంబునకును నగస్త్యాశ్రమంబునకును నగస్త్యభ్రా
త్రాశ్రమంబునకును నరిగి తత్తన్మహర్షిపూజితుం డై పంచవటికిం జేరి యందు దుష్ట
రాక్షసశిక్షణంబును మునిజనతపోరక్షణంబును గావించుచు సీతాలక్ష్మణులతోడఁ
త్రయోదశాబ్దంబులు సుఖంబుగాఁ గడపె. 2925

గీ. అప్పు డచటికి లోకభయంకరముగ, రావణస్వస యైనశూర్పణఖ వచ్చి
మారశతకోటిసుందరాకారుఁ డైన, రాఘవునిఁ జూచి సంజాతరాగ యగుచు. 2926

ఉ. ఎవ్వఁడ వీవు భీతహరిణేక్షణ యెవ్వతె యీపె ధన్వి వీఁ
డెవ్వఁడు మీరు వచ్చుటకు నిచ్చటి కేమి కతంబు చెప్పుమా
యువ్విళులూరు మన్నయది యుల్లము నాకు వినంగ నావుడున్
నవ్వుచు రాముఁ డుత్తరము న్యాయ్యముగా వచియించి యాపెకున్. 2927

గీ. అతివ నీ వెవ్వతెవో యిట కరుగుదేర, నేమి హేతువో యిపుడు నీ వేమి చేయ
నున్నదానవో వచియింపు మున్నయట్టి, వార్తనంబును విన నాకు వాంఛ గలిగె.

చ. అనవుడు నాపె యి ట్లనియె నాస్యమునన్ జిఱునవ్వు గుల్కఁగన్
మనసిజరూప శూర్పణఖ నాయభిధానము నేను విశ్రవ
స్తనయను రావణాసురవతీసముచెల్లెల దండకావనం
బున కధినేత్రి నామది విమోహిత మయ్యెను నిన్నుఁ గాంచుటన్ 2929

ఉ. ఈతనుగాత్రి నీకుఁ దగి దింతిగ నుండఁగ దీని మ్రింగి నీ
చేతము పారవశ్యమును జెందఁగఁ బత్తిజకేళిఁ దేల్చెదన్
జూతువుగాక యిప్పు డని క్షోణిజపైఁ బడఁబోవ రాముఁ డా
ఘాతుకురాలిఘ్రాణమును గర్ణములున్ దెగఁగోసెఁ గత్తిచేన్. 2930

క. అంతటను శూర్పణఖ ది, గ్దంతులు కంపంబు నొందఁగను నేడ్చుచు న
త్యంతజవంబునఁ జని తమ, దంతిను నెఱిఁగించె ఖరనిశాటాగ్రణికిన్. 2931

సీ. అది విని ఖరుఁడు మహోగ్రహోదగ్రుఁడై, సకలదానవసైన్యసహితముగను
దూషణత్రిశిరులు తోడుగాఁ బయన మై, రామునికడకు శీఘ్రముగ వచ్చి
నాల్గుదిక్కులను సైన్యముఁ బన్ని రాముని, భూపెసాయకవర్షమునను ముంచె
నంత రాఘవుఁడు కాలాగ్నితుల్యము లైన, శరములు సంధించి చాపమందు

గీ. సులభముగ రాక్షసుల నెల్లఁ బిలుకుమార్చి, దండకారణ్యమును నిరాతంకముగను
జలిపి నిర్విఘ్నముగఁ దాపసులతపంబు, లోమ్ముచు సుఖంబుగా నట నుండె నంత.

సీ. రావణాసురుఁడు శూర్పణఖాపరాభవం, బును ఖరాద్యసురనిర్మూలనమును,
నాలించి క్రోధతామ్రాక్షుఁ డై మారీచ, సహితంబుగను జనస్థానమునకుఁ
జనుదెంచి రామలక్ష్మణుల మారీచుఁడు, మృగరూపమునను దూరీకరింప
నదె సమయం బని యవనిజాతను గొని, పోవుచు నుండంగఁ ద్రోవలోన

గీ. రామసౌహార్ద్రమున సంగరంబు సేయఁ, దొడఁగిన జటాయువును దుష్పదూలఁ గొట్టి
యరిగి లంక కశోకవనాంతరమున, నునిచి జనకాత్మజను గృహంబునకుఁ జేర. 2933

సీ. అంతట మృగరూపుఁ డైనమారీచునిఁ, జంపి రాఘవుఁడు స్వస్థానమునకుఁ
జనుదెంచి జానకి కినఁబడమిని నంపు, విలపించుచును దిక్కు దెలియనట్లు
వెదకుచు సీతను విపినంబునం దెల్ల, సౌమిత్రితోడనుఁ జనుచుఁ జనుచు
నొక్కచోటను గొనయూపిరితో జట, యువు నేలపైఁ బడియుండఁ జూచి

గీ. కనికరంబునఁ దత్సమక్షమున కరిగి
యడుగ నాతనిగాథను నతఁడు సవ్యగ్ర
హముగఁ దనగాథ యెఱిఁగించి యవనిజాత
గాథయు వచించి బాధచేఁ గాయ ముడిగె. 2934

సీ. అంతట రాఘవుం డాగృధ్రమున కంత్య, సంస్కార మొనరించి శాస్త్రవిధిని
బరమపదంబును బ్రాపింపఁగాఁ జేసి, తరువాత మాల్యవద్గిరికిఁ జేరి
తచ్ఛైలమందు మాతంగాశ్రమంబున, ఫలము లియ్యఁగి మహాభక్త శబరి
యవి భుజించి యొసంగి యామెకు మోక్షంబుఁ, బదపడి చేరి పంపాసరస్సు

గ. క్రూరతమునిఁ గబంధునిఁ గూల్చి యచట, నవల గోదావరికిఁ జేరి యమ్మ గంగ
యవనిజను జూచితివె యని యడిగి యామె, తమముచే నూరకున్నఁ గ్రోధవశుఁ డగుచు

గీ. శాపము నొసంగుటయు రక్తసలిల గాఁగ, గంగ వడఁకుచుఁ జనుదెంచి కాళ్ల మీఁదఁ
బడుటయును రాముఁడు కృపార్ద్రభావుఁడగుచు, నాయమను లేవ నెత్తి స్వహస్తములను

వ. శార్ఙ్గకోటిచే గోదావరియందు శబరీస్నానస్థలంబున గంగాగమనంబును భాగవత తీర్థోదరంబును నగుశబరీతీర్థంబు నేర్పఱిచి యేతత్పుణ్యతీర్థతోయసంగంబున నీకు మచ్ఛాపవిముక్తి యగు నని యనుగ్రహించి యటనుండి ఋశ్యమూకపర్వతంబునకుం జని యచటఁ బంపాసరస్తీరంబున హనూమత్సందేశంబుచే సుగ్రీవస్నేహంబు గావించి తత్ప్రార్థనంబున వానరేశ్వరుం డగువాలిని వధించి కిష్కింధాపురరాజ్యంబునకు సుగ్రీవునిఁ బట్టాభిషిక్తునిం జేసె. 2937

సీ. అంతట సుగ్రీవుఁ డవనిజాక్షేమంబు, నరయంగ నంచి వానరుల నెల్లఁ
బనుపంగ వారిలోఁ బవమానసూనుఁడు, వాయువేగంబున వార్ధిఁ దాఁటి
లంకిణి నుఱుమాడి లంకాపురముఁ జొచ్చి, భూమిజ కెఱిఁగించి రామవార్త
వనమును భంజించి వనపాలురను బంచ, సైన్యాధిపతుల సప్తసచివసుతుల

గీ. రావణతనూజు నొకని మారణ మొనర్చి, తోరణస్తంభమును గూల్చి తోయజోద్భ
వాస్త్రమున బద్ధుఁడై రావణాంతికమున, కరిగి బోధించి సుఖమార్గ మసురపతికి.
గీ. కాల్చి నిజవాలవహ్ని లంకాపురంబు, జానకీదత్త మగు నభిజ్ఞాన మొంది
మరల వార్ధిని దాఁటి దాశరథికడకు, వచ్చి జనకాత్మజాక్షేమవార్తఁ దెలిపి. 2939
క. ఇచ్చుటయు నభిజ్ఞానముఁ, జెచ్చెర రాఘవుఁడు ప్లవగసేనాయుతుఁడై
వచ్చి మహోదధితటమున, కచ్చట సైన్యమును నిలిపె నంబుధి దాఁటన్. 2940
సీ. అప్పుడు హరిభక్తుఁ డగు విభీషణుఁడు ని, జాగ్రజుం డగు రావణాసురునకు
నిర్భయంబుగఁ జెప్పి నీతివాక్యంబుల, నవమానితుం డయి యతనిచేతఁ
ద్యజియించి భార్యాసుతాదుల రాఘవ, చరణాంబుజంబుల శరణువేఁడ
శరణుచొచ్చినయెడ నరి నైనఁ బ్రోచువాఁ, డగుట రాముఁడు వానికభయ మొసఁగి
గీ. యసురరాజ్యాభిషేకంబు నపుడె చేసి, పదపడి పయోనిధిని నొక్కబాణమునను
శోషిలఁగఁ జేసి శరణుచొచ్చుటయు జలధి, జలము పూరించి వారుణాస్త్రమున నురల.
సీ. నలునిచే సేతువు జలధికిఁ గట్టించి, యవలీలగను దాఁటి యంబునిధిని
గపిసేనతోడ లంకను జొచ్చి రాక్షస, వ్యూహంబు నెల్లను నుక్కడంచె
నింద్రజి యపుడు విజృంభించి రామల, క్ష్మణులను నాగపాశములచేత
బంధింప నేతెంచి పతగనాథుఁడు వాని, ఛిన్నభిన్నము చేసి చెదరఁగొట్టె
గీ. నంతటను వానరులకును నసురులకును, ఘోరసంగ్రామ మగుటయుఁ గుంభకర్ణుఁ
డరుగుదెంచి మహాబలుఁ డగుట రామ, లక్ష్మణులమీఁది వాఁడికోలలను వైచె.
ఉ. అప్పుడు రాముఁ డెంతయును నాగ్రహ మేర్పడఁ గుంభకర్ణునిన్
నిప్పులఁ జిమ్ము బాణముల నిర్గతవీర్యునిఁ జేయ నేలపైఁ
గుప్పునఁ గూలె వాఁడు గిరి కూలినయట్లది గాంచి యింద్రజి
త్తుప్పర మంటఁగాఁ బెరిగి యుగ్రుఁడువోలె భయంకరాకృతిన్. 2943
క. విడువఁగ బ్రహ్మాస్త్రంబును, గిడగిడ నడఁకుచును గూలెఁ గపిబల మెల్లన్
బుడమిపయి నంత నీఁదర, కొడుకు నెడలి ద్రోణగిరిని గొనితెచ్చి వడిన్. 2944
గీ. ప్రథనభూమిని నిలుప నప్పర్వతమునఁ, గ్రాలుచుండిన సంజీవకరణిగాలి
సోఁక నిశ్చేష్టముగ రణక్షోణిపైని, బడినకపు లెల్ల మేల్కన్నపగిది లేచి. 2945
చ. దనుజబలంబుతోడఁ బ్రవిదారణముం బొనరించుచుండఁగాఁ
గనుఁగొని రావణాత్మజుఁడు గాల్పదొడంగె నిశాతబాణవ
హ్నిని గపిసేనఁ గాంచి యది యెల్లను లక్ష్మణుఁ డంతకాలరు
ద్రునిపగిదిన్ జెలంగి యొకరోపమునన్ దెగటార్చె నింద్రజిన్. 2946
సీ. అంతట రావణుం డాత్మజనిధనంబు, నాలించి రోషతామ్రాక్షుఁ డగుచుఁ
జతురంగసైన్యసంయుతముగా యుద్ధరం, గమున కేతెంచి లక్ష్మణునిమీఁద

శక్తి వైచుటయు లక్ష్మణుఁడు తదాహతి, కోర్వక మూర్ఛిల్లి యుర్విఁ గూలె
నపుడు రాఘవుఁడు కోపారుణనయనుఁడై, కాలదండోపమ కాండములను
గీ. నాశ మొనరించి దైత్యసైన్యంబు నెల్ల, రావణుని ముంప విశిఖవర్షమున వాఁడు
విదళితశరీరుఁడై రామవిశిఖహతిని, బఱచె నిజమందిరమునకుఁ బిఱికివోలె. 2947
గీ. అపుడు వాయుసుతుండు ద్రోణాచలమును, మరలఁ గొనివచ్చి సంగరక్షమస్థాని నిల్ుపఁ
దద్గతౌషధివాయువు దాఁకి లబ్ధ, సంజ్ఞుఁడై లక్ష్మణుండు తత్క్షణమ లేచె. 2948
క. అది చూచి రామచంద్రుఁడు, ముద మొందుచునుండఁ గపిసమూహం బెల్లన్
గదనక్షితి మ్రాఁగ్రోఁగఁగఁ, జద లంటఁగఁ జలుపఁ దొడఁగె జయనాదములన్
సీ. అంత దశగ్రీవుఁ డరిమారణంబున, కై రహస్యస్థలమందుఁ జేరి
యాభిచారికహోమ మాచరించుచు నుండ, నది వానరు లెఱింగి యచటి కేఁగి
కావింప హోమభంగంబును బౌలస్త్యుఁ, డపరిమితక్రోధ మావహిల్ల
. దివ్యరథంబు నధిష్ఠించి బహుదైత్య, సేనతోడను రణక్షితికి వచ్చె
గీ. నపుడు త్రిదివంబునుండి హర్యశ్వయుక్త, దివ్యరథమును మాతలి దెచ్చి యొసఁగ
రాఘవుఁడు దానిపై నెక్కి రణ మొనర్పఁ, జొచ్చె డీకొని రావణాసురునితోడ.
ఆ. రామరావణులకు రణ మయ్యె నప్పుడు, విస్మయంబుఁ జెంద విశ్వ మెల్ల
నేమి చెప్ప నింక రామరావణయుద్ధ, మొకఁడె సాటి దాని కొండు లేదు. 2951
సీ. ఖండించు చుండ రాఘవుఁ డద్భుతంబుగా, వాఁడి కోలలను రావణునితలలు
వెంటనె మరల నావిర్భవించుచు నుండఁ, దస్మ్రస్త్రకంబు లత్యద్భుతముగ
నెల్లలోకంబులు తల్లడిల్లుచు నుండ, నే డహోరాత్రంబు లేఁగుటయును
రాముఁ డుపేక్షింపరా దింక నీపాపి, నని యెంచి మదిని నత్యాగ్రహమున
గీ. నేసె బ్రహ్మాస్త్రమును గుఱిచేసి వాని, వక్షమును నది ఛిద్రమొనరించి నాశనంబు
యరిగి తద్వక్షమును జీల్ప నాశ లదర, నవనిపైఁ గూలి రావణుం డసువు లుడిగె.
సీ. అంతట బ్రహ్మాస్త్ర మవనిని భేదించు, కొని పోయి పాతాళమునకు నచట
భుజగాధిపతిచేతఁ బూజితం బయి వచ్చి, జవమునఁ జేరె రాఘవుని కేల
నాకాశముననుండి యపు డద్భుతంబుగాఁ, గురిసె రామునిపైనిఁ గుసుమవృష్టి
సలిపిరి వానరుల్ జయనినాదములను, దిక్కు లన్నియుఁ గూడఁ బిక్కటిల్ల
గీ. సంగరశ్రమ మెడలంగ సౌరభమును, జల్లుచును వీవఁ దొడఁగెను జల్లగాలి
యంతట విభీషణునకు లంకాధిపత్య, మిచ్చి రాఘవుఁ డతనితో నిట్టు లనియె. 2953
చ. దనుజవరేణ్య నాకథయు ధాత్రియు భాస్కరుఁడున్ హిమాంశుఁడున్
దనరెడునంతకాలమును ధర్మము దాఁటక రాజ్య మేలుచున్
దనయులఁ బౌత్రులం బడసి తత్సుతుల మభ్యుదితంబు గాఁ దుదిన్
గొనెదవుగాక యోగులకుఁ గూడ లభింపనివిష్ణుధామమున్ 2954

ఆ. అని యనుగ్రహించి యవనిజను గ్రహింప, సంశయించు చున్నసమయమందు
నజముఖాదితేయు లరుదెంచి రాముని, యెదుట మ్రొక్కి నిలిచి యిట్టు లనిరి.

సీ. రాఘవ నీవు నారాయణుండవు పర, బ్రహ్మమూర్తివి జగత్పాలకుఁడవు
భువనహితార్థంబు పుడమిపై నవతరిం, చినమహాలక్ష్మి యీజనకజాత
రావణ కుంభకర్ణనిశాచరేంద్రులు, త్వద్ద్వారపాలకుల్ ధాత్రిమీఁద
సనకాదిమునిశాపమున జనించిరి వారి, నుద్ధరింపఁగ నీమె బద్ధ యయ్యె

గీ. నాకతంబున నీ వానిశాటవిభులఁ, జంపుటయుఁ జచ్చి వారలు స్వర్గమునకుఁ
బోవుటయును దటస్థించె దేవదేవ, జానకిని గైకొనుము నిర్విశంకముగను. 2956

గీ. అని వచించుచు నుండఁగ ననలశుద్ధ, యైనసీతను గొనివచ్చి హవ్యవహుఁడు
రామ పూతచరిత్ర యీభూమిజాత, కైకొనుము నాఁగ నామె రాఘవుఁడు గొనియె.

సీ. అంతట సంగ్రామహతు లైనకపు లెల్ల, బ్రహ్మవరంబున బ్రదికి లేవఁ
గపిసేన నెల్లను గనుఁగొని రాముఁ డ, త్యంతహర్షము నొంది యాత్మలోనఁ
బుష్పకంబున నెక్కి భూమిజతోడ ల, క్ష్మణునితోడను విభీషణునితోడఁ
బ్లవగభల్లూకదానవబలంబులతోడఁ, బయన మై సుర లెల్లఁ బ్రస్తుతింప

గీ. మరల వచ్చి భరద్వాజమౌనియాశ్ర, మంబునకుఁ దత్కృతోపచారంబుఁ బడసి
హనుమవలనను భరతవర్తనము నెఱిఁగి, మొదటఁ జేరె నందిగ్రామమునకు నంత.

సీ. అరుదెంచి యెదురుగా భరతుండు పురజన, సచివపురోహితసహితముగను
రామచంద్రునకుఁ బ్రణామంబు గావించి, తోడ్కొనివచ్చి సంతోషమునను
నర్పించె రాజ్యంబు నఖిలలోకంబును, మునులును సురలును వినుతిసేయ
నంతట భద్రవాద్యములు మ్రోఁగుచు నుండ, రాముఁడు సపరివారంబు గాఁగ

గీ. వచ్చి సాకేతపురమును జొచ్చె నంత, దాసదాసీజనంబు లుత్సాహమునను
మంగళస్నానముల నొనర్పంగఁజేసి, వారలకుఁ గట్టఁబెట్టిరి వస్త్రములను. 2959

సీ. అపు డొకశుభలగ్నమందు నానారత్న, మండితమాణిక్యమండపమున
హైమభద్రాసనమం దుపవిష్టునిఁ, జేసి దాశరథిని సీతతోడ
వామదేవుండు పర్వతుఁడు నారదుఁడు మా, ర్కండేయమౌద్గల్యకశ్యపులును
జాబాలియు వసిష్ఠసంయమియును నను, నష్టమహర్షు లత్యద్భుతముగఁ

ఆ. బుణ్యతీర్థతోయపూర్ణసువర్ణకుం, భములతోడ వేదమంత్రఘోష
మావరింప దెసల నభిషేక మొనరించి, రఖిలజనులుఁ జూచి హర్ష మొంద. 2960

సీ. ఛత్రచామరములు సౌమిత్రి వహియింప, భరతశత్రుఘ్నులు పార్శ్వములను
దాళవృంతంబులఁ దాల్చి వీచుచు నుండఁ, బవనసుతుండు దీపమును బట్టఁ
గపినాయకుఁడు పూర్ణకలశంబుఁ దాల్పఁ జూ, పింప దర్పణము విభీషణుండు
పుష్పమాలను గంఠమున జాంబవంతుఁడు, వైవ సుషేణుండు ధ్వజము నూనఁ

గీ. దమ్మలంబును వాలినందనుఁ డొసంగ, నఖిలభూపతులును నుపాయనము లీయఁ
బ్లవగదానవబలములు బలిసికొలువ, రాజిలెఁ బురందరుఁడువోలె రాఘవుండు.

గీ. అఖిలమునిజనవేష్టితుఁ డై వెలింగె
రామచంద్రుఁ డయోధ్యాపురంబునందు
నక్షయసనాతనపదంబునందు నిత్య
ముక్తపరివృతుఁ డగువిష్ణుమూర్తివోలె. 2962

ఆ. సమితిలో జయంతసౌరాష్ట్రిరాష్ట్రివ, ర్ధనసుమంత్రవిజయధర్మపాల
సృష్ట్యకోపు లనెడియెనమండ్రు మంత్రులు, గొలువ రాఘవుండు కొమరుమిగిలె.

సీ. అప్పుడు నేను లో నాఁగక పొరలెడి, హర్షంబు ప్రేరేప నవశముగను
విశ్వరూపంబున వెలిఁగెడిరాముని, ముంగలఁ జేతులు మోడ్చి నిలిచి
సృష్టిస్థితిక్షయహేతవే నిర్గతో, పాధిరూపాయ నారాయణాయ
విశ్వస్వరూపాయ విష్ణవే సచ్చిదా, నందాత్మనే జగన్నాయకాయ

గీ. బ్రహ్మణే శాశ్వతాయ రుద్రాయ సర్వ
సాక్షిణే వేదవేద్యాయ సాత్త్వికాయ
సాధురక్షణదుష్టశిక్షణపరాయ
భానుకులభూషణాయ తుభ్యం నమోఽస్తు. 2964

ఆ. అని నమస్కరించి హర్షమంతంతకు, హెచ్చు గాఁగఁ బులక లెసఁగ మేన
నిట్టు లంటి రామ యీవు పంకేరుహ, లోచనుఁడవు సీత లోకమాత. 2965

సీ. సావిత్రి జానకి నీవు విధాతవు, శ్రీకంఠుఁడవు నీవు సీత గౌరి
శతమన్యుఁడవు నీవు జనకజ పౌలోమి, వైశ్వానరుఁడ వీవు స్వాహ సీత
యముఁడవు నీవు సంహారదేవత సీత, రోహిణి సీత చంద్రుఁడవు నీవు
వైదేహి సంజ్ఞ దివాకరుండవు నీవు, పవలు నీవు త్రియామ యవనిజాత

గీ. యింక బహుళోక్తులు వచింప నేల దేవ, ముజ్జగంబులలోన స్త్రీమూర్తి యెల్ల
ధరణిజయె పుంస్వరూప మంతయును నీవె, యెంతవారము మీతత్త్వ మెఱుఁగ మేము.

క. ఎపుడును నీతారకమును, జపియించుచు నుందు నేను శర్వాణియు నె
ల్లపుడును నీనామంబును, జపియించుచు నుండు మోక్షసాధన మగుటన్. 2967

క. అందుననె లోకపూజ్యతఁ. జెందంగలిగితిమి మేము చేకుఱె యుష్మ
త్సందర్శనలబ్ధమహా, నందంబును నాకు నేఁడు నళినదళాక్షా. 2968

క. వారాణసిలో మ్రందెడి, వారలకున్ బ్రాణములను వదలెడితఱి నీ
తారకమంత్రమును భవో, ద్ధారకముగ నుడువుయోగ్యతయు నా కొదవెన్. 2969

క. అని నేను బహువిధంబుల, వినుతించుచు నుండఁ జూచి విశ్వాత్ముం డై
కనఁబడురాముని భయమున, వనజాసనముఖ్యు లెల్ల వణఁకుచు నుండన్. 1970

సీ. అపుడు రాఘవుఁడు మాయామానుషాకార, మును దాల్చి మరలను బూర్వమట్ల
కానంగఁబడుచు నేత్రానందకరముగా, బ్రహ్మాదిదేవవర్గంబునకును
మునులకుఁ గపులకు జనపతులకు దాన, వులకును నర్హపూజల నొనర్ప
వారు సంతుష్టులై స్వస్వధామంబుల, కరిగిరి పడసి రామానుమతిని
గీ. నంతటను రాముఁ డవనిజాకాంతతోడ, ననుభవించుచు భోగంబు లవని నెల్ల
నేలుకొను చుండఁ గడచె వే యేండ్లు సీత, గర్భవతియును నయ్యె నాకాలమందు.
సీ. దనుజునియింట నుండినజానకిని రామ, చంద్రుఁడు గొనివచ్చి సాహసమునఁ
దనయింటిలో నుంచికొనె నన్నయపవాద, ముద్భవింపంగ నయోధ్యలోన
మానుషధర్మంబు గానంగఁబడ రాముఁ, డవనిపుత్రిక నరణ్యమున కనిచె
నంతట వాల్మీకియాశ్రమంబున సీత, కుశలవు లనుకొడుకులను గాంచె
గీ. రఘుకులేశుండు బ్రహ్మచర్యవ్రతంబుఁ, బూని విశ్వంభరాచక్రమున సమస్త
జనులు గీర్తింపఁగా నేలసాగె రాజ, ధాని యైనయయోధ్యలోఁ దా వసించి. 2972
వ. అంతట శత్రుఘ్నుండు లవణాసురసంహారంబు గావించి యిరువురుపుత్రులం బడసి దేవనిర్మితం బగుమధురాపురంబుం బాలింపం దొడంగె. భరతుండు గంధర్వులను వధించి సింధూభయపార్శ్వంబులందుఁ దనకుమారుల నిరువురను బ్రభువులుగా స్థాపించె. లక్ష్మణుండు మద్రులను వధించి మద్రదేశంబునకుఁ దనపుత్రుల నిరువురను నధిపతులం గావించి తాను సాకేతంబున రామపాదారవిందసన్నిధానంబున నివసించె.
సీ. అపుడు రాఘవుఁడు ధర్మాతిక్రమంబుచే, తను దపియించుశూద్రుని వధించి
మరణించినట్టిబ్రాహ్మణతనూభవుని జీ, వింపఁజేసి యశేషవిబుధు లెన్న
నైమిషారణ్యంబునను గౌతమీతీర, మందు మహర్షిసమక్షమందుఁ
గావించికొని స్వర్ణకల్పితం బైనసీ, తామహాదేవిని ధర్మసతిగ
గీ. నయుతహయమేధవాజపేయాయుతముల, విశ్వజిద్యాగగోమేధవివిధసత్త్ర
తంతువులఁ జేసి సంపూర్ణదక్షిణలను, సర్వజనుల సమ్మానించుసమయమందు.
సీ. వాల్మీకి తోడ్కొనివచ్చి సీతను గుశ, లవులను రామునిసవిధమునకు
రామచంద్ర వసుంధరాపుత్రి శ్రీదేవి, భవదేకమానస పరమసాధ్వి
కైకొను మీజగత్కల్యాణధాత్రినిఁ, బూతచరిత్రను బుత్రవతిని
ననవుడు రాముఁ డి ట్లనియె మహాభాగ, నీవు చెప్పినమాట నిక్కువంబ
గీ. కాని లోకాపవాద మీఁగంగ నేఁడు, పృథ్వీసుత ప్రత్యయము చూపె నేని సకల
జనయుతం బగునీమహాసమితిలోన, గ్రాహ్య యగు లేనియెడలను గ్రాహ్య గాదు.
క. అని పల్కుటయును జానకి, విని రామునివాక్యములను విశదముగ మహా
జను లెల్లఁ జూచు చుండఁగ, వినమితముఖి యగుచు నిట్లు వేఁడె ధరిత్రిన్. 2976
గీ. తల్లి భూదేవి రామునిఁ దక్క నొరునిఁ, దలఁపులో నేని యెపు డేని తలఁప నేని
సర్వసాక్షిణి వగునీ వఖర్వమహిమ, నిమ్ముగా నిప్డె వివరమ్ము నిమ్ము నాకు. 2977

సీ. అని సభాసదు లెల్ల వినఁ బల్కుటయు ఖగే, శ్వరునితోఁ జనుదెంచి ధరణిదేవి
సీతను గరములచే నెత్తి తార్క్ష్యవా, హనముపై నెక్కింప నద్భుతముగఁ
గను చుండ నట నున్నజను లెల్ల దివినుండి, కురియుచు నుండంగఁ గుసుమవృష్టి
గరుడి జివ్వున నేఁగె గగనమార్గమునుండి, క్షోణిజతోడ వైకుంఠమునకు
గీ. నంత రాముఁడు దుఃఖితస్వాంతుఁ డగుచుఁ, దనయులను గొని సాకేతమునకుఁ జేరి
యేలు చుండంగ నిలఁ గొంతకాలమునకుఁ, జనిరి దశరథపత్నులు స్వర్గమునకు.
ఆ. అవలఁ గొంతకాల మరుగంగఁ దాపసా, కారమునను వచ్చి కాలుఁ డొక్క-
దినమునందు రాఘవునిఁ గాంచి దీవించి, యిట్టు లనియె స్నేహ ముట్టిపడఁగ. 2979
సీ. రాఘవ ననుఁ బంప బ్రహ్మ నీయొద్దకు, వచ్చితి నొకగోప్యవార్తఁ దెలుప
నెవఁడును రాఁగూడ దిటకు నే నున్నంత, వఱకు వచ్చినఁ జంపవలయు వాని
ననుడు రాఘవుఁ డట్లె యని నియోగించి ల, క్ష్మణుని ద్వారాభిరక్షణము సేయ
నావార్త నాలింప నభిముఖుం డై యుండ, గాలుఁ డి ట్లనియె రాఘవునిఁ గాంచి
గీ. రామ పదొకొండువేలేండ్లు రాజ్య మేల, నసురసంహార మొనరింప నవనియందు
నవతరించితి వాకార్య మయ్యె నింక, బయలుదేఱుము వైకుంఠభవనమునకు. 2980
ఆ. అని వచించు చుండ నంతలో దుర్వాసుఁ, డరుగుదెంచి ద్వారమందు నిలిచి
ద్వార్స్థ రామచంద్రదర్శన మొనరించు, వాంఛతోడ నేను వచ్చినాఁడ. 2981
క. అని పల్కుటయును దుర్వా, సున కప్పుడు రాఘవానుజుఁడు మ్రొక్కి భయం
బెనయ మది రామదర్శన, మున కిది సమయంబు గాదు మునివర యనియెన్.
సీ. అంతట దుర్వాసుఁ డాగ్రహావిష్టుఁ డై, దర్శింప నీకున్న దాశరథిని
శపియించువాఁడ ని న్నిపుడె నా లక్ష్మణుం, డరిగి యన్నకుఁ దెల్పె నతనిరాక
వీక్షించి వాని నదృశ్యుఁ డయ్యెఁ గృతాంతుఁ, డపుడు రాముఁడు మౌని నాదరింప
నానందభరితుఁ డై యరిగె దుర్వాసుండు, సౌమిత్రి రామునిశపథ మెఱఁగి
ఆ. సత్వరముగ నరిగి సరయూమహానదీ, తీర్థమందు మనుజదేహ ముడిగి
తాల్చి నిజఫణీంద్రతనువు విమానంబు, నెక్కి స్వపదమునకు నేఁగె నంత. 2983
సీ. తమ్ముఁడు చనినయుదంతంబు నిజకర్ణ, తాడితం బగుటయుఁ దత్క్షణంబ
స్వపదంబునకు రామచంద్రుఁ డేఁగఁ దలంచి, కుశవతీపురమును గుశున కొసఁగి
లవున కొసంగి ద్వారవతీపురంబును, రాజధానులు గాఁగ రాజ్య మేల
నభిషేక మొనరించి యఖిలజనంబులు, సమ్మతింపఁగ నిచ్చె స్వధన మెల్ల
గీ. నపుడు తద్భావము నెఱింగి యఖిలజనులు, వచ్చి రాఘవ నీతోడ వచ్చువార
మందఱము గూడ మేము నీయట్టిప్రభుని, విడిచి బ్రతుకంగఁజాలము పుడమిలోన.
వ. అని వేఁడుటయు రామచంద్రుండు తదభ్యర్థనంబు నంగీకరించి విభీషణునకు శార్ఙ్గం
బును నిక్ష్వాకుకులదైవతం బగుశ్రీరంగశాయిమూర్తిని నొసంగి హనుమంతునకు

రామాయణగాథ లోకమం దుండునంతవఱకును భూమండలంబున వసించి యంతం
బున నిజపరమపదముం జెందునట్లు వరంబుఁ బ్రసాదించి ద్వాపరయుగంబున భూభార
నివారణార్థంబు యాదవవంశంబునఁ దుదయించి నీతోడ సంగ్రామంబు గావించి
నిన్ను ధన్యునిం జేయుదు నని జాంబవంతునకుం జెప్పి తాను శుక్లాంబరధరుం డై
కుశలు హస్తంబులందు ధరించి రమాధరణీసమేతంబుగా బయలుదేఱె నంత. 2985

సీ. ప్రణవంబు వేదశాస్త్రములు పురాణేతి, హాసాదిసకలవిద్యాగణంబు
సావిత్రియును నస్త్రశస్త్రకార్ముకమార్గ, ణములును బురుషదేహములతోడ
భరతశత్రుఘ్నులు పురజనులును మంత్రి, వర్గంబులును భృత్యవర్గములును
ఋక్షవానరపశుపక్షిగణంబులు, జంగమస్థావరసంఘ మెల్ల

గీ. బయలుదేఱంగఁ దన వెంటఁ బాయలేక, రాముఁ డఖిలసమేతుఁ డై ప్రేమమునను
సరిగి మూఁ డామడలు పశ్చిమాస్య మైన, సరయువును జొచ్చె సోదరసహితముగను.

క. వనజభవుం డపుడు నభం, బుననుండి సుపర్వసహితముగ రాఘవ ధా
త్రిని విడిచి రమ్ము నీపద, మునకుం గృపతోడ శీఘ్రముగ నని వేఁడన్. 2987

సీ. రాముఁడు విడిచి మర్త్యశరీరమును స్వకీ, యం బైనవిష్ణుదేహమును దాల్చి
భరతశత్రుఘ్నులు ప్రాపింపఁగను దన్ను, నాత్మీయశంఖచక్రాకృతులను
దేవీయుగంబుతోఁ దేజరిల్లుచు దివ్య, యాప్యయానంబున నధివసించి
సరయూనదీజలస్పర్శోపగతదివ్య, కాయు లైననిజానుగతుల నెల్లఁ

గీ. దనవిమానంబు నెక్కించుకొని విముక్త, జనయుతం బైననిజధామమునకుఁ జేరె
దేవతాబృంద మెల్ల నుతించు చుండఁ, గురియు చుండంగ దివినుండి కుసుమవృష్టి.

క. ఏతద్రామచరిత్రము, శ్రోతలకును బాఠకులకు సుతధనదార
ఖ్యాతిసుఖారోగ్యములను, బాతకనాశమును బరమపదమును నొసఁగున్. 2989

వ. ఇంకఁ గృష్ణావతారచరిత్రముం జెప్పెద వినుము. 2990

సీ. దేవమీఢుం డనుభూవరుం డొకఁ డుండె, వసుధలో మును యదువంశమందు
నతనికి వసుదేవుఁ డనుసుతుం డొకఁ డుండె, హరిపదాంబుజపరాయణుఁ డతండు
వరగుణ యైనదేవకి నుగ్రసేనపు, త్రినిఁ బెండ్లియాడి యాదేవితోడ
నుగ్రసేనునితనయుం డగుకంసుండు, రథచోదకుండుగా రథము నెక్కి

గీ. రమ్యముగ మధురాపురరాజమార్గ, మందుఁ జను చుండఁ బార్శ్వములందు బంధు
వర్గ మేతేరఁ దద్రాజవైభవంబు, చూచు చుండంగఁ బ్రజ లెల్లఁ జోద్యముగను.

గీ. కంస దేవకియష్టమగర్భమునను, నీకు మరణంబు ప్రాప్తించు నిక్కముగను
ననెడిమాటలు దివినుండి వినఁబడంగఁ, గంసుఁ డది విని వెంటనె ఖడ్గ మెత్తి. 2992

సీ తనచెల్లె లగుదేవకిని నఱకంగ రా, నప్పుడు వసుదేవుఁ డడ్డగించి
స్త్యాలక నిలువుము చన దాఁడుదానిని, జంపంగ నీబోఁటిశౌర్యనిధికి

నదిగాక నీ కీమె యనుజాత యవిచార, ముగ నిట్టికార్యంబు తగునె చేయ
భయము నీ కాకాశభాషణంబున నేరు, పడినచో నీమెగర్భముల నెల్ల

గీ. సంహరింపుము పుట్టినసమయమంద, యనుచు బతిమాలఁగను గంసుఁ డాగ్రహంబు
నుడిగి చెఱసాలలో నపు డుంచి వారి, నిరువురను గూడ భోగ్యంబు లెల్ల నొసఁగి.

క. మునులను దేవతలను స, జ్జనులను బాధించుచును నిశాచరకోటుల్
తన కనుచరు లై యుండఁగ, ననుచితముగ నడువసాగె నతిబలుఁ డగుటన్. 2994

సీ. అంతట నొక్కనాఁ డరిగి మేదిని బ్రహ్మ, సన్నిధానమునకు సాఁగి మ్రొక్కి
పరమేష్ఠి రాక్షసబాధ నానాఁటికిఁ, బ్రబలంబు గాఁ జొచ్చెఁ బ్రజల కెల్ల
సత్యశౌచంబులు సమసె లోకములోన, భరియింపఁజాలను భార మింక
నని తెల్పి యరుగుటయును సురజ్యేష్ఠుండు, సకలనిర్జరగణసహితముగను

గీ. జేరి క్షీరాబ్ధియుత్తరతీరమునకు, బహువిధంబుల శార్ఙ్గిని బ్రస్తుతింప
నంబుజాక్షుండు ప్రత్యక్ష మై విరించి, యిచ్చటికి మీర లెల్ల రా నేల చెపుమ.

క. అని యడుగుటయును నజుఁ డి, ట్లనియెను వనజాక్ష ధరణి యాఁగఁగ లేమిన్
దనుజులు పెట్టెడిబాధకు, వనరుచు నున్నయది నీవె వలయును బ్రోవన్. 2996

గీ. అని నివేదించుటయును జనార్దనుండు, వనజసంభవ మీ రేఁగవచ్చు నింక
నేను యదువంశమందు జన్మించి భార, మపనయించెద నని పల్కి యనిపె వారి.

సీ. కని నిజమాయ ని ట్లనియె మాయాదేవి, యవనితలంబున కరిగి నీవు
సరగ హిరణ్యాక్షషట్తనూభవులను, గ్రమముగా దేవకగర్భమందుఁ
జొనిపి యనంతాంశమునఁ గల్గుదేవకీ, సప్తమగర్భంబు సమయకుండ
నసమయంబున లాగి యామెసపత్ని యై, నట్టిరోహిణిగర్భమందు నునిచి

గీ. నందగోపసతీగర్భమందుఁ జేరి, కంసభగినికి నష్టమగర్భమందు
నేను జనియించువేళను నీవు గూడ, జనన మొందుము నందునిసదనమందు. 2998

క. అటుమీఁదఁ గంసునకు ను, త్కటమగుభయ ముప్పతిల్లగాఁ జేసి మహో
ర్భటి నేఁగి వింధ్య మనియెడి, యటవికి వధియింపు మచటియసురుల నెల్లన్. 2999

వ. అని యాజ్ఞాపించుటయు మాయాదేవి తత్క్షణంబ ధరణి కరుదెంచి హిరణ్యాక్షసుత షట్కంబును గ్రమంబుగా దేవకీగర్భంబునందుఁ బ్రవేశింపంజేసి తజ్జననకాలంబునంద వారల నెల్లరను యథాక్రమంబుగఁ గంసుండు సంహరింపఁ బిదప ననంతాంశసంభూతం బగు దేవకీసప్తమగర్భంబును బలాత్కారంబున లాగి రోహిణీగర్భంబునం దుంచి తద్గర్భశిశువు పెరిఁగి భాద్రపదకృష్ణాష్టమీదినంబున జన్మించి మాయాసంకర్షితుం డగుటవలన సంకర్షణనామముం బడసి వర్ధిల్లుచుండఁ దాను నందగోపపత్ని యగు యశోదాదేవి గర్భముం జొచ్చె. 3000

సీ. అంతటఁ బుండరీకాక్షుండు సుముహూర్త, మందు దేవకిగర్భమందుఁ జొచ్చి
నిండంగఁ దొమ్మిదినెల లందు వసియించి, పదియవమాసంబు ప్రాప్త మగుడుఁ
ప్రభవించె నర్ధరాత్రమునందు శ్రావణ, మాసకృష్ణాష్టమీవాసరమున
వసుదేవుఁ డప్పుడు భాస్వత్కోటిదేదీప్య, మానవిగ్రహు మధుమథనుఁ జూచి
గీ. చేతు లొగ్గి ప్రణామంబు చేసి పులకి, తాంగుఁ డై కృష్ణ ధన్యుండ నైతి నిన్నుఁ
బట్టిగను గాంచుభాగ్యంబు ప్రాప్తమగుటఁ, గన్నులారంగ నీవిష్ణుకళను గనుట. 3001
క. అని బహువిధముల సంస్తవ, మొనరించుచు నుండఁ గృష్ణుఁ డుడిగి స్వరూపం
బును మానవరూపంబునఁ, గనఁబడ వసుదేవుఁ డపుడు కని బాలకునిన్. 3002
ఆ. కంసుబారినుండి కాపాడుమార్గంబు, తోఁప కునికి నెడఁదఁ ద్రొక్కటపడ
విష్ణుమాయవలన విడిపోయెఁ దలుపులు, భటులకనులు మూఁతవడియెఁ నంత. 3003
సీ. ఆనకదుందుభి హస్తంబులం దుంచు, కొని బాలకుని గుండె కొట్టుకొనఁగ
నటు నిటుఁ జూచుచు నాఁగుచు నూర్పుల, నల్లనల్లనఁ గ్రింద నడుగు లిడుచుఁ
జోరునితెఱఁగునఁ గారాగృహద్వార, ములను మెల్లఁగ దాఁటి వెలికి వచ్చి
కడచె నిప్పటి కొక్కగండం బని తలంచి, పురవీథిలోఁ బడి యరిగియరిగి
గీ. చేరి శీఘ్రంబుగను బురద్వారమునకుఁ
దత్కవాటంబు బాలుపదంబు తాఁకి
వివృతముగఁ దద్భటులు తమోవివశులుగను
నదియునుం దాఁటి సుఖముగా నరుగుచుండ. 3004
వ. మార్గమధ్యంబున వర్షంబు ధారాపాతంబుగాఁ గురియంజొచ్చుటయు నాగేంద్రుండు నిజఫణాసహస్రంబుచే వర్షబిందువునుం బయిం బడకుండ దేవకీనందనుని నాచ్ఛాదించి తత్కృపాపాత్రుం డయ్యె. 3005
సీ. అంతట వసుదేవుఁ డధికంబుగాఁ బాఱు, యమునలోపలఁ జొచ్చి యరుగు చుండ
నమ్మహానది ప్రవాహం బంతయును దగ్గి, తత్క్షణంబున జానుదఘ్న మయ్యె
నది చూచి వసుదేవుఁ డాశ్చర్య మొందుచు, దాఁటి కాళింది నుత్సాహమునను
యమునాతటస్థిత మైనవ్రజంబున, కరిగి నందునినికాయ్యమును జొచ్చి
గీ. మాయచేఁ దద్గృహస్థితమనుజు లెల్ల, మోహమును జెంది నిద్రలో మునిఁగియుండ
బాలుని యశోదప్రక్కలోఁ బవ్వళింపఁ, జేసి తత్కన్యకను గొని శీఘ్రముగను.
గీ. తెల్లవాఱకమున్నె యేతెంచి మధుర, కకుక్కమారిని దేవకిప్రక్కలోనఁ
బండుకొనఁ బెట్ట నప్పు డబ్బాల యేడ్చె, నేడ్పు విని మేలుకొని లేచి యెల్లభటులు.
గీ. చని రయంబునఁ గంసునిసవిధమునకు, దేవ నీళ్ళాడె దేవకీదేవి యనుచుఁ
దత్తఱమున నివేదింపఁ దత్క్షణంబ, కంసుఁ డేతెంచి కేల ఖడ్గమును బట్టి. 3008
సీ. దేవకిప్రక్కలోఁ దేజరిల్లుచుఁ బండు, కొనియున్నబాలను గ్రూరముగను
నొకకేలఁ గొనిపోయి యూరెల్ల వడఁకంగఁ, బెట్టి మారణశిలాపృష్ఠమందు

ఖండింపఁగా నెత్తఖడ్గంబు నంతలో, నాబాల లేచి యత్యద్భుతముగఁ
దనకాలితో వానితలఁ దన్ని పై కేఁగి, యష్టబాహువులతో నచట నిలిచి
గీ. పండ్లు పటపటఁ గొఱుకుచుఁ బ్రళయకాల
పావకజ్వాలవలె మండిపడుచు నోరి
రాక్షసాధమ కంస నారాయణుండు
పుట్టియున్నాఁడు నినుఁ జంపఁ బుడమిలోన. 3009

క. అని చెప్పి మాయమయ్యెను, గనుఁగొనియెడివార లెల్లఁ గడు నాశ్చర్యం
బును జెంద నంతఁ గంసుఁడు, మనమున నుదయింప భయము మాత్సర్యంబున్.

సీ. తనయాజ్ఞలో నున్నదనుజవీరుల నెల్ల, రావించి దానవప్రవరులార
క్షీరసాగరమును జేరి దేవత లెల్ల, నస్మత్ప్రభావంబు హరికిఁ జెప్ప
నతఁడు ధాత్రిని మానవాకారమునఁ బుట్టె, మనకు హాని యొనర్ప మదిని నెంచి
మీ రందఱును నింక మేదినిలో బలో, త్తరులుగా నున్న బాలురను నెల్ల
గీ. సంహరింపంగఁ బొండు స్వచ్ఛందముగను, నని నిదేశించి కారాగృహంబునుండి
దేవకీవసుదేవులఁ బోవ విడిచి, చేరెఁ దనమందిరమునకుఁ జింతతోడ. 3011

వ. అంతట వసుదేవుండు రోహిణీగర్భసంభూతుం డగుసంకర్షణునిం గైకొని వ్రజంబునకుం
జని నందగృహంబునం దున్ననిజనందనునిం గాంచి యపరిమితానందభరితమానసుం
డై యశోదం జూచి. 3012

సీ. కల్యాణి వీఁడు సంకర్షణుం డనుపేరు, గలవాఁడు నాపట్టి కంసభీతి
నిచటికిఁ గైకొని యేతెంచినాఁడ నీ, బిడ్డతోడను వీనిఁ బెంపవలయు
నని పల్కుటయు నామె యట్ల పెంచెద నని, సంకర్షణునిఁ గొనె సంతసమున
నంతట వసుదేవుఁ డాత్మశాంతి ఘటిల్లఁ, జనుదెంచి మధుర కచ్చటనె యుండి
గీ. యాత్మసుతులకు జాతకర్మాదివిధుల, నాచరింపంగ గర్గుని ననుప నాతఁ
డేఁగి ఘోషంబునకు నందునింట నున్న, రాజసుతులకు జాతకర్మంబు సేసి. 3013

వ. జ్యేష్ఠపుత్రునకు రౌహిణేయుం డనియు బలభద్రుం డనియు రాముఁ డనియుఁ గనిష్ఠ
సూనునకు శ్రీధరుం డనియు వాసుదేవుం డనియుఁ గృష్ణుం డనియు నామకరణంబులం
గావించి యీకుమారులు లోకంబునందు రామకృష్ణు లనుఖ్యాతిం బడయుంగల రని
దీవించి నందయశోదాపూజితుం డై తిరిగి మధురాపురంబునకుం జేరె. 3014

గీ. అంతటను గొన్నినాళ్లకు నతిబలిష్ఠుఁ, డైనబాలుఁడు ఘోషమునందు నున్న
వాఁ డని యెఱింగి కంసుఁడు వానిఁ జంపఁ, బనిచెఁ బూతన యనునొకబాలహంత్రి.

క. చని యాపూతన ఘోషం, బున కొక్కనిశీథకాలమున మానవిరూ
పునఁ దనవిషలిప్తస్తన, మును బెట్టెను నోటఁ గృష్ణమూర్తికిఁ గుడువన్. 3016

ఆ. అప్పు డెఱిఁగి కృష్ణుఁ డాపె నాసురిగను, నవ్వి పెట్టికొని స్తనంబు నోటఁ
బాలతోడఁ బీల్చెఁ బ్రాణంబులను సైత, మంత నాపె యార్చి యవనిఁ గూలె.

సీ. ఆఘోరనాదంబు నాలించి బిరబిర, వ్రజవాసు లెల్లరు వచ్చి యటకు
వీక్షించి యా క్రూరరాక్షసిఁ దదురంబు, నందు నాడుచు నున్న నందసుతుని
నాశ్చర్యపడు చుండ నపుడు తద్దృష్టిదో, షంబును భూతభయంబుఁ బాయ
మూర్ధంబు గోమయంబున మోము గోవాల, మునను యశోద మార్జనము సేసి
గీ. యెత్తికొనఁగను శౌరి నుపేంద్రనామ, ములను మార్జించె నందుఁడు మొలకనవ్వు
లొలయు ముఖమున వీక్షించు చుండ శార్ఙ్గి, యంత నొకనాఁడు కృష్ణుఁ డత్యద్భుతముగ.

క. చనుదెంచి శకటరూపం, బున మీఁదం బడినయస్రపుని నొక్కనిఁ బె
ళ్లున విఱుగఁ గాలఁ దన్నిన, దనుజుఁడు బిట్టార్చి కూలి ధరపై మడిసెన్. 3019
గీ. ఒకదినంబున దోఁగాడు చుండ రామ, కృష్ణు లిరువురుఁ గుక్కుటాకృతిని దాల్చి
చంపరా నొక్కరక్కసి శౌరి కేల, నీడ్చికొట్టంగ వాఁ డార్చి యిలను గూలె. 3020
సీ. నడువంగ నేర్చి కొన్నాళ్ళకు రామకృ, ష్ణులు చరించుచు నుండఁ గులుకునడలఁ
గృష్ణుఁడు గోపికాగృహములలోఁ జొచ్చి, పాలు మీఁగడ వెన్న గ్రోలఁ దొడఁగె
నది యెల్లఁ దెలుప గోపాంగనలు యశోద, కామె కృష్ణునిఁ బిల్చి యనునయమున
గట్టిగా ఱోటికిఁ గట్టె దామంబుతో, దధి యమ్ముకొనుటకుఁ దాను బోయెఁ
ఆ. కృష్ణుఁ డంత ఱోటి నీడిచికొని యమ, ళార్జునములమధ్యమందుఁ బోవఁ
దత్ప్రఘాతమునను ధరణీరుహంబులు, పెళ్ళు మనుచు విఱిగి వ్రాలె నిలను.
ఆ. అపుడు గోపు లెల్ల నాశ్చర్యమును జెంది, కాంచు చుండఁ దరుయుగంబు కిన్న
రాకృతులను దాల్చి యభివాదనము కృష్ణు, నకు నొనర్చి చనియె నాకమునకు.
క. దామనిబద్ధుం డగుటను, దామోదరుఁ డనెడిపేరు దాలిచెఁ గృష్ణ
స్వామి మహోత్పాతంబుల, నామాడ్కిని నచటఁ గని భయంపడి గోపుల్. 3023
సీ. యమునాతటంబున రమణీయముగ నున్న, బృందావనంబున కేఁగి యచట
వసియించి యుండంగ వత్సపాలయుతంబు, గను రామకృష్ణులు కాన కేగి
కాచుచు గోవత్సకంబులఁ దన్మధ్య, దేశంబునం జేరి తిరుగు చుండ
బకరూపమును దాల్చి యొకరాక్షసుఁడు వచ్చి, కృష్ణునిఁ గెడప నుంకించు చుండ
గీ. వాసుదేవుఁ డెఱింగి తద్వర్తనమును, వానిపై నొక్కలోష్టంబు వైచె నగుచు
నంత నా బకదానవుం డార్చి దెసలు, దద్దఱిల నేలపైఁ బడి తనువు విడచె. 3024
సీ. అంతఁ గొన్నిదినంబు లరుగంగ నొకదినం, బున రామకృష్ణులు వనమునందు
గోపబాలురతోడఁ గూడి మేపుచును గో, వత్సంబులను నెండవలన నలసి
శయనించి యజ్ఞవృక్షచ్ఛాయ నిదురింప, వనజోద్భవుఁడు వచ్చి వారిఁ జూచి
తలఁచి తన్మహిమంబుఁ దెలుప లోకుల కెల్ల, గోవత్సయుతముగా గోపసుతుల
గీ. నపహరించి దివంబున కరిగె నవల, మేలుకొని రామకృష్ణులు బాలకులును
ధేనువత్సంబులును నందుఁ గానఁబడమిఁ, గళవళముఁ జెంది రొకక్షణకాల మంతె.

ఆ. అది యెఱింగి కృష్ణుఁ డజునికృత్యంబుగా, మరలఁ బూర్వ మున్నకరణి నుండ
గోపబాలకులను గోవత్సముల సృష్టి, చేసె మానసమునఁ జిత్రముగను. 3026

సీ. అంతట సాయాహ్న మగుటయు మునుపోలె, గోవత్సగోపార్భకులను గూడి
రామకృష్ణులు జయ రావముల్ చేయుచు, బృందావనంబున కేఁగుదెంచి
కలిగింప సాగిరి కౌతుకాశ్చర్యముల్, నిజబాల్యచేష్టలఁ బ్రజల కెల్ల
జరుగుటయును నొక్కసంవత్సరము బ్రహ్మ, చనుదెంచి కృష్ణునిసవిధమునకు

గీ. విరచితాంజలి యై మ్రొక్కి విశ్వరూప, తరమె నాకు భవన్మహత్త్వంబుఁ దెలియఁ
ద్వద్విభూతుల భూజలవహ్నివాయు, గగనములును సమస్తలోకములు గూడ.

క. పురుషోత్తమ నీవె మహా, పురుషుండవు నీవె శుద్ధపురుషుఁడవు వపుః
పురుషుఁడవు నీవె నైగమ, పురుషుండవు నీవె నీవె భువనము లెల్లన్. 3028

సీ. త్వత్ప్రాణమునఁ బుట్టె వాయ్వంతరిక్షముల్, త్వద్వాక్కుచేత భూవహ్ను లొదవె
శశియును దెసలు నీశ్రవణంబున జనించెఁ, బ్రభవించె నీకంట రవియు దివముఁ
ద్వన్మానసంబున వరుణుఁ డుద్భవ మొందె, నివి యవి యన నేల నెల్లజగము
ప్రాదుర్భవించె నీయవయవములనుండి, యఖిలంబుఁ జేరు నీయందె తుదకు

గీ. నాకసంబున నోషధులందు గ్రహము
లందు నక్షత్రములయందు నఖిలవిబుధ
నివహములయందు నాయందు భవునియందుఁ
దేజరిల్లుచు నుండెడి తేజ నీవ. 3029

గీ. అఖిలవస్తువులందును నన్నియెడల, నిండి యుండెడిబ్రహ్మంబు నీవ జ్ఞాన
మాన సర్వోపనిషదర్థ మీవ యమృత, శబ్దవాచ్యుఁడ వీవ శాశ్వతుఁడ వీవ. 3030

గీ. నీవ చక్షుర్మయుండవు నీవ వాఙ్మ, యుండవును నీవ ఛందోమయుఁడవు నీవ
శ్రోత్రమయుఁడవు హంసవాచ్యుఁడవు నీవ, పంచకోశస్థుఁడవు నీవ పరమపురుష.

క. క్షమియింపుము నాయపరా, ధము నని ప్రార్థించి బహువిధంబుల గోవ
త్సములను గోపార్భకులను, సమర్పణముచేసి చనియె స్వపదంబునకున్. 3032

చ. అమరులు పంకజాసనసమర్పితగోశిశుగోపబాలసం
ఘమునకు బాలకృష్ణపరికల్పితగోశిశుగోపబాలసం
ఘమునకు భేద మించుకయుఁ గానఁగరామిని నెందుఁ గూడఁ జో
ద్యము గలుగంగ నాత్మలకుఁ దన్మహిమంబుఁ దొడంగి రెన్నఁగన్. 3033

సీ. అవలఁ గొన్నిదినంబు లరుగంగ నొకనాఁడు, గోపబాలకులతోఁ గూడి శౌరి
లీలమై నరిగి కాళిందీహ్రదమునకు, బాలురు వల దని గోలవెట్ట
నందులోపల దూఁకి యచటఁ గాళియ మను, కాలసర్పంబును గాల నడిచి
సలిపి నిర్విషముగ శరణుపొందఁగ నది, యాత్మీయపుత్రదారాన్వితముగ

గీ. దానిమూర్ధసహస్రంబుపైని స్వపద, చిహ్నములు గానఁబడ నొత్తి చెదరఁగొట్ట
నది రసాతలమున కేఁగె హ్రదము విడిచి, తొలఁగి తద్బాధ ప్రజలు సంతోషపడఁగ.

గీ. అంతఁ గృష్ణుఁడు విచ్చేసి హ్రదమునుండి, చూడ నల్లడఁ జల్లనిచూపుతోడ
యమునతటసవిషదగ్ధభూమిజంబు, లన్నియును బల్లవించె నత్యద్భుతముగ. 3035

సీ. అటుపైనిఁ గొన్నినాళ్లరుగంగ నొకనాఁడు, గోపబాలురతోడఁ గూడిమాడి
యాడుచు శైశవక్రీడల నన్నతో, దనుజారి యొకతాళవనికి నేఁగి
యందు ధేనుకుఁ డనునమరారి యొక్కఁడు, ఖరరూపమును దాల్చి తిరుగు చుండఁ
బట్టి తత్పదములు గట్టిగా గిరగిరఁ, ద్రిప్పి కొట్టఁగఁ దాళవృక్షమునకు

గీ. నాప్రఘాతంబుచేత వాఁ డార్చి మిన్ను
బ్రద్ద లగునట్లు దైత్యరూపమునఁ గొండ
కూలినట్టులు నేలపైఁ గూలి మడిసెఁ
గృష్ణుమహిమంబు నిర్జరు లెల్లఁ బొగడ. 3036

వ. అంత నచ్చటనుండి రామకృష్ణులు గోపబాలురతోడం గూడి భాండీరవటంబునకుం
జని యాచెట్టుక్రింద నాడుకొను చుండ. 3037

సీ. అరుగుదెంచి ప్రలంబుఁ డనుదైత్యుఁ డొక్కఁడ, చ్చటికి నాభీరవేషంబుతోడ
నాడుచు వారితోఁ గూడి హలాయుధు, నెక్కించుకొని తనపృష్ఠమందు
నెగిరి యాకసమున కేఁగు చుండఁగ వాని, రాముఁడు గ్రహియించి రాక్షసుఁగ
ముష్టిచేఁ దన్మూర్ధమున గాఢముగ నొక్క, గ్రుద్దు గ్రుద్దఁగ వాఁడు గుండె చెదరి

గీ. భైరవంబుగఁ జేయుచు నారవంబు, దైత్యరూపంబుతోఁ గూలి ధరణిమీఁద
విడిచెఁ బ్రాణంబులను నభోవీథియందుఁ, జేరి సురలు జయధ్వనుల్ చేయు చుండ.

సీ. ఏతెంచి యంతట బృందావనమునకు, రామకృష్ణులు బహుప్రమదమునను
గోపకన్యలతోడఁ గూడియాడుచు గోవ్ర, జమున నుండఁ బ్రదోషసమయమందు
నరుగుదెంచి యరిష్టుఁ డనురాక్షసుఁ డొకండు, కృష్ణునిఁ గెడపంగ వృషభ మగుచు
అంకవేయఁగ దెసల్ అంపిల్ల నాధ్వని, కెల్లగోపాలురుఁ దల్లడిల్లఁ

గీ. గృష్ణుఁ డొకతాళమును బెల్లగించి దాన, నడువఁ దచ్ఛృంగమధ్యమునందు వాఁడు
బ్రద్దలయి తల దైత్యరూపమున నార్చి, భూతలంబునఁ బడి ప్రాణములను విడిచె.

సీ. అంతటఁ గొన్నినాళ్ళరుగంగ నొకనాఁడు, కేశి నాఁబడునొక్క-యాశరుండు
గోవ్రజంబున నాడుకొనుచున్నకృష్ణునిఁ, గెడపంగ ఘోటకాకృతిని వచ్చి
హేషారవంబున నిలయు నాకసమును, బూరింపఁగఁ ద్రిలోకములును బెగడ
గొల్ల లెల్లరును భీతిల్లు చుండఁగ వారి, కందఱకును గృష్ణుఁ డభయ మొసఁగి

గీ. పెటికి యొక్క-మహాశిల పెల్లు మనఁగ, హయముపైనైవ నది చూర్ణితాంగ మగుచు
దానవాకారమున నార్చి ధరను బడియె, నమరజయనాదపూరితం బయ్యె నభము.

క. ఈకరణిని బహుదైత్యా, నీకంబును బిలుకుమార్చి నిర్భయులను ము
ల్లోకములకుఁ గరుణించెను, శ్రీకృష్ణుఁడు బాల్యముననె చిత్రము గాఁగన్. 3041

వ. అటుపైని రామకృష్ణులు గర్గమహర్షిచే నుపనీతులై సాందీపనియొద్ద సకలవిద్యలను గ్రహించి గురువాంఛానుసారంబుగాఁ దన్మృతపుత్రుని లోకాంతరమునుండి సజీవునిగాఁ దోడ్కొని వచ్చి గురుదక్షిణగా సమర్పించిరి. అంతఁ గొంతకాలంబునకు బృందావనంబునం దొక్కనాఁటినిశీథకాలంబున. 3042

సీ. శిరమున నెమలిపించెము గ్రాల మోమునఁ, గస్తూరికాతిలకం బెలర్పఁ
గర్ణంబులందు మకరకుండలము లొప్ప, గళమున గ్రైవేయకములు వెలయ
వక్షస్థలమున శ్రీవత్సంబు గౌస్తుభం, బును వనమాలికయును జెలంగ
భుజములఁ గేయూరములు విలసిల్లంగఁ, గరముల భాసిల్లఁ గంకణములు

గీ. భర్మచేలంబు గటియందుఁ బదములందు
నూపురంబులు మేనను నూత్నశోభ
మొనయఁ జెలువొందుచును జగన్మోహనముగ
వేణుగానంబు శౌరి గావింపఁదొడఁగె. 3043

సీ. అంతట నాగాన మాలించి వల్లవాం, గన లెల్ల నార్ధరాత్రికాలమంద
వ్యాకీర్ణమూర్ధజవస్త్రలై లేచి శ, య్యలనుండి లజ్జాభయంబు లుడిగి
పతిసుతబంధుసంతతులను విడనాడి, గణనసేయక కులగౌరవంబు
దర్పకశరపీడితస్వాంతలై వచ్చి, జవమున వెన్నునిసవిధమునకు

గీ. నతని గ్రుచ్చి కవుంగిళులందు నదిమి, కొని యురోజములందును గ్రోలి తదధ
రామృతంబు నతండును నట్లె చేసి, సురతసుఖమునఁ దేల్పంగ సొక్కి సోలి. 3044

క. అనుదినమును నాతీరున, నొనరించుచు సౌఖ్యవార్ధి నోలాడుచుఁ గృ
ష్ణునిఁ బాయలేమి నొకత్రుటి, యును నాతనికడనె యుండి రుడిగి గృహముల్.

క. అని చెప్పుటయును బార్వతి, విని సర్వము నాథ తగునె విశ్వోద్ధారం
బొనరింప నవతరించిన, జనార్దనున కన్యదారసంగము చెపుమా. 3046

చ. అనవుడు నవ్వి శంకరుఁ డగాత్మజపై కది క్రీడకై వడిన్
గనఁబడఁగాని మూఢులకుఁ గన్గొన వాస్తవముల్ జగచ్ఛరీ
రునకుఁ బరాత్మభేదము నిరూపిత మెట్లగు నీవె చెప్పు మే
ననుటయె కాదు వాని జగదాత్మునిఁగా శ్రుతు లుగ్గడించెడిన్. 3047

క. అని నుడువుటయును శాంభవి, తనసంశయ ముడుగ సమ్మదము నొందుచు నా
త్మను నాథ యవలిగాథను, వినిపింపుము నాఁగ భూతవిభుఁ డిట్లనియెన్. 3048

వ. అంతట శరత్కాలంబు సంప్రాప్త మగుటయు నందాదిగోపాలకు లందఱునుం గూడి గోకులంబున మహేంద్రున కుత్సవంబు గావింప నుద్యమింప గోవిందుఁడు తదుద్యమంబు మాన్చి గోవర్ధనాద్రిరాజంబునకు నుత్సవంబు నారంభింపఁజేసె. 3049

సీ. అపుడు సహస్రాక్షుఁ డాగ్రహోదగ్రుఁడై, తన్మహోత్సవము ధ్వస్తంబు సేయ
సంకల్ప మొనరించి సంతతధారగా, సప్తరాత్రములు వర్షంబు కురిసె
నాయుత్సవము కృష్ణుఁ డాఁగిపోకుండఁగా, గోవర్ధనాద్రిని గోట నెత్తి
యాసప్తరాత్రంబు లట్టులె నిలఁబెట్టి, దానిక్రిందను దదుత్సవము జరిపె
గీ. నంతటను భీతుఁడై యింద్రుఁ డాఁపి వర్ష, మవని కరుదెంచి నుతియించి హరిని జనియె
నిలిపి యాయద్రి నపుడు స్వస్థలమునందు, వల్లవులతోడఁ గృష్ణుఁడు వ్రజముఁ జేరె.
సీ. అప్పుడు నారదుం డమరకార్యంబును, నెఱవేర్పఁగా నెంచి నిపుణముగను
గ్రన్నన మధురాపురంబున కేతెంచి, యరిగి కంసునికడ కలపిచేత
నర్చితుండయి కృష్ణుఁ డావిర్భవించిన, దాదిగా జరిగినయట్టిగాథ
యాప్తుండువోలె గోప్యముగ సర్వంబును, వినిచి బ్రహ్మసదనమునకుఁ జనియె
గీ. నంతఁ గంసుఁడు వసుదేవుఁ డాచరించి, నట్టివంచనమును గృష్ణుఁ డాదినుండి
సలిపినయమానుషక్రియల్ తలఁచి తలఁచి, దిటముచెడి గుండెలోపల దిగులువుట్ట.
సీ. రావించి మంత్రివర్గము నెల్ల వినిపించి, వారికి నారదవాక్యములను
గృష్ణవధంబున కేది యుపాయంబొ, వచియింపుఁ డనఁగను వార లెల్ల
మంత్రం బొనర్చి యేమాడ్కి నైనను గోప, కులంతోడ రామకృష్ణులను నిటకు
రావించి మత్తవారణమల్లనిహతులఁ, జలుపంగవలె నని తెలియఁజేయ
గీ. నపుడు తాను ధనుర్యాగ మాచరింపఁ, దలఁచి ప్రకటించి రామకృష్ణులను గోప
సహితముగఁ దోడుకొని రాఁగ నవనమునకు, బ్రాజ్ఞుఁ డైనయక్రూరున కాజ్ఞ యొసఁగె.
సీ. అంతట భాగవతాగ్రేసరుం డైన, యక్రూరుఁ డామోద మావహిల్ల
దివ్యభూషణముల దివ్యాంబరంబులఁ, గైకొని వారికిఁ గానుకలుగ
నధివసించి రథంబున నగోకులమున, కరిగి శలాగంబు నపట డిగ్గి
పుండరీకంబులఁబోలికన్నులవాని, మొలకనవ్వులు గుల్కుమోమువాని
గీ. గోపభామలంతోఁ గూడుకొనినవాని, ధేనుసందోహమధ్యస్థుఁ డైనవాని
సుజనులను బ్రోచుచల్లనిచూపువానిఁ, గాంచి కృష్ణుని హర్షాశ్రుకణము లురల.
గీ. అరిగి యొద్దకు వజ్రచక్రాబ్జరేఖ, లలరుతత్పాదముల మూర్ధమందుఁ దాల్చి
కన్నులకు నద్దుకొని మ్రొక్కి గాత్రమంతయుఁ, బులకలొలయంగ మఱిమఱిఁ జలిపి ప్రణతి.
క. బలరామునకుఁ బ్రణామము, సలిపి నిలంబడఁగ వారిసన్నిధిలో వా
రలు వానిఁ దోడుకొని తమ, నిలయమునకు వచ్చి నందునికిఁ జూపింపన్. 3055
సీ. నందగోపుఁడు మహానందంబునను యదూ, త్తమునకు నర్ఘ్యపాద్యము లొసంగి
ప్రణమిల్లి తత్పాదపంకేరుహములకు, నుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి
పూజించి వస్త్రముల్ భూషణంబులును స, మర్పింప నక్రూరుఁ డవి గ్రహించి
తాను దెచ్చినపరిధానభూషణములు, ప్రేమతోడను రామకృష్ణులకును

గీ. నందునకును యశోదకు డెంద మలర, నొసఁగి క్షేమంబు నడిగి కృష్ణోదయంబు
మొదలుకొని సర్వవృత్తాంతమును వచించి, సక్రమంబుగ వారు విస్మయము నొంద.

సీ. కృష్ణుఁడు సేసినకృత్యంబు లెల్లను, నారదుండు వచింప నాఁటినుండి
యతిభీతుఁడై కంసుఁ డాచరింపఁగ ధను, ర్యాగంబుఁ దలపెట్టి యందులోన
మల్లులచేతను మాతంగములచేత, నీల్గింపఁ గృష్ణుని నిశ్చయించి
నన్నుఁ బంపె మి మ్మెల్లరను దోడుకొనిరాఁగ, నతిశీఘ్రముగ ధనుర్యాగమునకు

గీ. రండు మీ రెల్లరును మధురకు భయంబు, నొందవలదు మహీభార ముడుప నిలను
నవతరించినయాదినారాయణుండ, కృష్ణుఁ డనఁగను గంసుని నితఁడు గెడపు. 3057

క. దానను భూభారము చన, మానసదుఃఖమును దీఱు మంచికి వచ్చెన్
గాని యిది కాదు చెడ్డకుఁ, దా నొకటి దలఁప నొండు దైవము దలఁచున్.

క. అని చెప్పియూరకుండుటయు, విని సర్వము నెల్లగోపవృద్ధులు దుఃఖం
బును జెందు చుండఁ గృష్ణుఁడు, కని వారల నెల్ల మోము కళకళలాడన్. 3059

ఆ. గోపులార మీరు కొందలపా టొంద, వలదు దుష్టుఁ డైన వానిఁ గెడపి
భూభరంబుఁ దీర్పఁ బోదము రం డింక, నిదియె కాదె కార్య మిలను నాకు. 3060

చ. అనవుడు గోపు లెల్లరును నాతనిమాటలు [illegible] దవ్వాడు చె
ప్పినవచనంబులున్ దమకు భీతిని బాఁపఁగఁ గోలి ధైర్యమున్
జొనుపఁగ మానసంబులను శోకము మాని నృపాజ్ఞ తప్పమిన్
జనుటకు నిశ్చయించుకొని స్వస్వగృహంబుల కేఁగి రత్తఱిన్. 3061

సీ. యాదవోత్తముఁ డైన యక్రూరునకు యశో, దాదేవి సమధికాదరముతోడ
షడ్రసోపేతభోజనము వెట్టఁగ రామ, కృష్ణులపంక్తిలోఁ బ్రీతి యలర
నతఁ డారగించి మహాభాగ్యము లభించె, నని సంతసించుచు నాత్మలోన
హరిభక్తుఁ డగుటచే నా రేయి రామకృ, ష్ణులు పవళించెడినిలయమందుఁ

గీ. బండుకొని యొక్కశయ్యపైఁ బరవశుండు, గాక తామసనిద్రకుఁ గాంచు చుండఁ
గనఁబడక రామకృష్ణులు కానఁబడియె, శేషతల్పగతుం డైన శ్రీధరుండు. 3062

ఆ. అపుడు పులకరింప నంగంబు లక్రూరుఁ, డమితహర్షమునను నవశుఁ డగుచు
సెజ్జనుండి లేచి శీఘ్రంబుగను శేష, శాయి దరికిఁ జేరె సంభ్రమమున. 3063

సీ. కమలనాభునిపాదకమలంబులను బట్టి, కన్నులొత్తుచు నిరుగేల నొత్తుచుండ
నిదియె ధర్మము నాకు నిదియె సామ్రాజ్యభో, గము నాకు నిదియె మోక్షంబు నాకు
బ్రహ్మాదులకుఁ గూడ, బడయశక్యముగాని, హరిపదాబ్జములు సంప్రాప్తమయ్యె
సాఫల్య మొదవె నాజన్మంబునకు నేఁడు, నాపూర్వజన్మపుణ్యము ఫలించె

గీ. నని తలంచుచు నెద నవాఙ్మనసగమ్యుఁ, డైనయానందవార్ధి నోలాడు చుండఁ
గడచె రే యంత మునుపోలెఁ గానఁబడిరి, రామకృష్ణులు తూలపర్యంకమందు.

సీ. అది చూచి యక్రూరుఁ డంతరంగంబున, నాశ్చర్యపడు చుండ నంతలోన
నమరులు భద్రవాద్యములు మ్రోఁగింపంగ, నాకాశముననుండి యద్భుతముగ
శయ్యాతలమునుండి చయ్యన రామకృ, ష్ణులు లేచి స్నానసంధ్యల నొనర్చి
యక్రూరసహితులై యరిగి తల్లికి మ్రొక్కి, యాజ్ఞ యిమ్మనఁగఁ బ్రయాణమునకుఁ
గీ. గనులలోఁ గ్రుక్కికొనుచుండఁ గన్నునీరు, గ్రిందఁబడకుండఁగ యశోద ఖేదమునను
జూచి యక్రూరుఁ డామెను సుమతి భీతి, వలదు కృష్ణుఁ డనంగఁ గేవలుఁడు గాఁడు.
క. జనపీడాకరుఁ డగుకంసుని నిర్మూలించి మునులు సురలును ద్విజగ
జ్జనులును ముద మొందఁగ నీ, తనయుం డేలంగలాఁడు ధాత్రిని నెల్లన్. 3066
క. అని యనునయించి యాయమ, యనుమతి గొని శీఘ్రముగను నధిరోహింపం
గనుజేసి రామకృష్ణులఁ, దనరథమున నేఁగినన్న తరుణమునందున్. 3067
ఆ. గోపకాంత లెల్ల గుంపులుగా వచ్చి, కృష్ణ నిన్ను విడిచి యిచట మేము
నిలువఁజాల మొక్క నిమిష మేనియు నని, స్యందనంబు నడ్డి ముందు నిలువ. 3068
చ. కనుఁగొని కృష్ణుఁ డెల్ల వ్రజకాంతల భామినులార దుష్టవ
ర్తనుఁ డగుకంసునిన్ గెడపి తప్పక వచ్చెద రేపె మీరు రాఁ
జనదు భయంకరం బయినసంగరభూమిక నాఁడువారలౌ
టను నని చెప్పి వారలకడంకను మాన్చి కాంచె సూతునిన్. 3069
క. సారథి యంతట రథమును, మారుతవేగమున నిమిషమాత్రములోనన్
జేరిచి కాళింద్యుత్తర, తీరమునకు నిలిపె నచటఁ దీర్పఁగ విధులన్. 3070
వ. అప్పు డక్రూరుండు రథంబు డిగ్గి యమునాజలంబున స్నానంబు గావించి విష్ణుమంత్ర
జపంబు సేయుచుఁ దజ్జలంబునందు బలరామకృష్ణులం దిలకించి సంశయించి స్యందనం
బుం జూడ నందును వారలు గానంబడుటం జేసి యాశ్చర్యానందభరితుండై మరలఁ
దత్తోయంబున మునింగి లేచి చూచుటయు నందు శేషపర్యంకశాయి యగురమాపతి
కానంబడియె. 3071
సీ. అక్రూరుఁ డప్పు డత్యాశ్చర్యమును బొంది, కాంచుచు నుండఁగఁ గన్నులారఁ
జక్రధరుం డదృశ్యత నొందె నంత న, క్రూరుండు చనుదెంచి తీరమునకు
రథమునం దుండినరామకృష్ణులకుఁ దే, యఁగి వందనముఁ గృష్ణుఁ డతనిఁ జూచి
విష్ణుభక్తాగ్రణి వీక్షించితివె యేమి, వైనవిశేషంబు యమునలోన
గీ. నని యడుగ యాదవోత్తముఁ డంబుజాక్ష, సర్వగతుఁడవు నీవ విశ్వములు నీవ
త్వత్పరం బేదియును లేదు వాస్తవముగ, యమునలోనివిశేష మియ్యది యచూనె.
ఆ. అని వచింపఁ గృష్ణుఁ డాలించి తద్వాక్య, మొప్పిదముగ నవ్వి యూరకుండె
నంత రథము నెక్కి యాదవాగ్రణి పత్సు, మెల్లముగను మధుర కేఁగుదెంచి. 3073
వ. రామకృష్ణులను బురద్వారభవనంబునం బ్రవేశింపంజేసి తాను రాజభవనంబున కరిగి
కంసునకు రామకృష్ణాగమనవార్త నెఱింగించి తత్పూజితుండై నిజగృహంబునకుం జేరె.

సీ. అంతట గోపాలు రందఱుఁ బెరుఁగుకా, వళ్లతోఁ బాలకావళ్లతోడ
బృందావనమునుండి యేతెంచి రచటికి, రాజాజ్ఞ లంఘింపరాని దగుట
రామకృష్ణులు రాజరథ్యలోఁ జేఁగుచు, నాదివసమున సాయాహ్నమందుఁ
గొని దివ్యవస్త్రంబులను రాజగృహమున, కొకరజకుఁడు పోవుచుండఁ జూచి
గీ. వస్త్రముల నీయు మని కోర వాఁడు పొగరుఁ, దనమునను మాటలాడె న త్తఱిని వానిఁ
బట్టుకొని కృష్ణుఁ డొకచెంపపెట్టు పెట్టఁ, గ్రక్కు రక్తంబు నటఁ బడి మ్రందె వాఁడు.
ఆ. అంత రామకృష్ణు లావస్త్రములఁ దామ్ము, కొన్ని దాల్చి మిగిలియున్నవాని
నెల్ల గోపకులకుఁ గొల్లలుగా నిచ్చి, యవల బయలుదేఱి యచటనుండి. 3076
క. ఒకమాలాకారునియింటికిఁ జని వాఁ డెదను భక్తి దెచ్చిన సుమమా
లిక లొసఁగఁ దాల్చి యవి వా, నికి మోక్షము గలుగ నొసఁగి నెనరున వరముల్.
సీ. మరల నేఁగుచు రాజమార్గంబునను నిర్వి, శంకంబుగను బరస్పరము నగుచు
ధృతగంధపాత్రయై యెదురుగాఁ జనుదెంచు, చున్నకుబ్జను జూచి యొక్కరితను
గోరి చందనము నాకుబ్జ వినమ్రయై, భక్తితోఁ జందనపాత్రి మీఁయ
నందులోఁ గలగంధ మంతయు మేనుల, యం దలందికొని యా నందమునను
గీ. నావిరూపకు దివ్యదేహంబు నొసఁగి, యందఱును విస్మయము నొంద నచటనుండి
చనుచుఁ జనుచును నృపయజ్ఞశాలలోనఁ, గాంచి రద్భుత మగునొకకార్ముకంబు.
గీ. అంతటను గృష్ణుఁ డవలీల నాధనుస్సు, నెత్తి యొకకేలఁ ద్రుంపఁ జూపఱు లెల్లవారు
విస్మయం బొందుచుండఁగ విఱిచివైవ, నిట్టువుఱుమోలెఁ దద్ధ్వని యిలను నిండె.
సీ. అది విని కంసుండు బెదరి చాణూరాది, మల్లాగ్రణుల స్వసమక్షమునకు
రావించి యెల్లి మీరలు రామకృష్ణుల, నడఁగార్పవలె నని యాజ్ఞ నొసఁగి
యనుజమంత్రిసమేతుఁడై మహాప్రాసాద, మారసి ధ్వాగారమునను జేరి
తన్ని కేతనచతుర్ద్వారంబులం దుంచె, వీరమల్లుల మత్తవారణముల
గీ. నది యెఱింగియు నాఁడేయి యజ్ఞశాల
యంద వసుదేవనందను లధివసించి
యుదయ మగుటయు నాగము వదలి గుహను
బాసి వెడలెడిహరులట్లు బయలుదేఱి. 3080
సీ. రాజగృహద్వారరక్షకంబుగ నున్న, దాని మహోన్నత మైనదాని
హిమశైలశిఖరసామ్యమున శోభిలుదాని, నమితమదోత్కట మైనదాని
నైరావతమదంబు నడఁగాఱచినదాని, నారితేఱినదాని నాజులందుఁ
గువలయాపీడాఖ్య గొన్నదానిని ద్రిలో, కములందు విఖ్యాతి గన్నదాని
గీ. గజవతంసము నొకదానిఁ గాంచి రాముఁ, డెదను విస్మయపడు చుండఁ గృష్ణుఁ డెగసి
కేలఁ గొని దానితొండంబు గీఁకవెట్టి, గిరగిరం ద్రిప్పి పడఁగొట్టి ధరను గెడపె. 3081

సీ. అంతట నాదంతిదంతంబులను బీకి, రామకృష్ణులు పరాక్రమము మెఱయు
నవి యిర్వురును గొని యాయుధంబులుగ మ, ల్లులతోడ యుద్ధంబు సలుపఁబూని
సింహగర్జనములు సేయ మల్లులు గుండె, లవిసిపోవఁగఁ దదారవము వినుటఁ
బరువిడి నృపశస్త్రభవనంబులోఁ జొచ్చి, బంధించికొని తత్కవాటములను
గీ. వడఁకుచును డాఁగి యుండ నావసువు నెఱిఁగి, సత్వరము రామకృష్ణులు శస్త్రశాల
కడకుఁ జని తత్కవాటముల్ ఖండములుగఁ, దన్ని పదములచేతను ధరను గూల్చి.
క. తలుపులు కూలుటయును లోఁ, బల నుండిన దైత్యయోధబలమును బాదం
బులచేత నాగదంతం, బులచేతను బొడిచిపొడిచి పొడిపొడి గాఁగన్. 3083

ఉ. అచ్చటనుండి త్రిప్పుచును హస్తిరదంబులఁ గంససద్మమున్
జొచ్చి భయంకరాకృతుల నుగ్గులు సేయుచు నడ్డగింపఁగా
వచ్చినవీరమల్లులను వారణరాజములన్ గవాటముల్
వ్రచ్చుచుఁ బోయిపోయి పదిలంబుగఁ గంసునిమేడలోనికిన్. 3084
ఆ. కానఁబడఁగఁ బ్రళయకాలాంతకులవోలెఁ, గాంచి కంసుఁ డడలి కంపిలుచును
శక్తిశాలులైన చాణూరముష్టిక, మల్లవరులఁ జూచి యుల్లమలర. 3085
ఉ. ఇప్పుడె మల్లులార వధియించిన మీరలు రామకృష్ణులన్
దప్పక మీకు నే నొసఁగెదన్ రవిసాక్షిగ నర్ధరాజ్యమున్
జప్పునఁ బట్టుకొండు మనసన్నిధికే రిపు లేగుదెంచి యు
న్నప్పుడు పోవనీయఁదగ దంచు సధైర్యముగన్ వచింపఁగన్. 3086
సీ. సన్నద్ధు లగుటయుఁ జాణూరముష్టికుల్, వాసుదేవులఁ బట్టి వధ యొనర్పఁ
గనిపించెఁ గృష్ణుఁ డాకాలంబునను మహా, మేరువులై వడి వారలకును
గాలాగ్ని తెఱఁగునఁ గంసునకును బంచ, బాణువిధమునఁ బడఁతులకును
దలిదండ్రులకు బిడ్డవలె గోపులకుఁ జెలి, తీరున హరివోలెఁ ద్రిదశులకును
గీ. నంతటను గంసుఁ డడలుచు నతనుతాప, మతివ లొందుచుఁ దలిదండ్రు లశ్రుపూర్ణ
నయను లగుచును గోపులు భయమునందుచు, నమరు లానందభరితాత్ము లగుచు నుండ.
గీ. అమ్మహామేరురూపంబు నవగణించి, రాజ్యలోభంబునను జేసి రాజమల్లు
లిరువురును హుంకరించుచు నెదిరిపోర, నిలువఁబడుటయు రామకృష్ణులు చెలంగి.
గీ. చేసి యాయోధనంబు విచిత్రముగను, దమకుఁ గలమల్లరంగకౌశలము వెలార్ప
శౌరి చాణూరుని వధించె సీరపాణి, ముష్టికుని సంహరించె నక్లిష్టముగను. 3089
క. అంతటఁ గంసుఁడు ధైర్యం, బంతయును దొలంగ భీతి నటు నిటుఁ బోవన్
గంతు లిడుచుండఁగను గా, లాంతకుఁ డనవచ్చి కృష్ణుఁ డతిరభసమునన్. 3090
క. కాలం దన్నఁగ వాని గు, బేలున సౌధంబునుండి పృథ్వీస్థలిపైఁ
గూలి సమీరోన్మూలిత, సాలము తెఱఁగునను వాఁడు సంక్షయ మొందెన్. 3091

గీ. అప్పుడు సునాముఁ డనెడికంసానుజుండు, ప్రబలరోషంబునను సంగరం బొనర్ప
వారిపై కేఁగుదేరంగ సీరపాణి, యొక్కగ్రుద్దున నాపాపి నుక్కడంచె. 3092

ఆ. ఇటులు గెడపి రాక్షసాగ్రేసరుల రామ, కృష్ణు లాఁగకుండ నెచటఁగూడఁ
దీవరముగ దేవకీవసుదేవుల, సవిధమునకు వచ్చి సాగిమ్రొక్క. 3093

క. తనయప్రేమమువలనను, దనకుచములనుండి క్షీరధారలు గురియం
గను వారిపైని దేవకి, కనియెన్ గనులార సుతులఁ గన్నీ రొలుకన్. 3094

క. కనుఁగొని వసుదేవుండును, గనుగవ నశ్రువులు గ్రమ్మఁగను జేరిచె వా
రినిఁ గౌఁగిట నపుడు నభం, బున మ్రోఁగెను దేవదుందుభులు దెస లలరన్. 3095

ఆ. అప్పు డమరు లెల్ల నరుదెంచి రామకృ, ష్ణుల నుతించి వారివలనఁ బూజఁ
బొంది స్వర్గలోకమున కేఁగి రంతట, రామకృష్ణు లొక్కరథము నెక్కి. 3096

వ. కారాగృహంబునకుం జని యచ్చట నిబద్ధుండై యున్ననిజమాతామహుండగు నుగ్రసేనుని బంధవిముక్తునిం జేసి బహూకరించి వ్యపగతవ్యథునిం గావించి తద్రాజ్యంబున కభిషిక్తునిం జేసి యక్రూరప్రముఖయదుశ్రేష్ఠుల మంత్రివర్గంబుగా స్థాపించి నందాదిగోపబృందంబున కెల్ల దివ్యాంబరభూషణంబుల నొసంగి గోకులంబునకుం బనిచి ద్విజులచేఁ గంసున కౌర్ధ్వదైహికకృత్యంబులు నిర్వర్తింపంజేసి తద్రాజ్యంబున ధర్మంబు నెలకొల్పి మథురాపురంబున ద నివసించి యుండఁ గంసశ్వశురుం డగుజరాసంధుండు కంసవధంబు నాలించి యాగ్రహోదగ్రుండై రామకృష్ణులఁ బరిమార్ప నెంచి యక్షౌహిణీసహస్రసేనాపరివృతంబుగాఁ జనుదెంచి మథురాపురంబు ముట్టడించె. 3097

సీ. కృష్ణుఁ డప్పుడు స్మరియింపంగ దారుకుఁ, డను నిజపూర్వసూతుని నతండు
స్మరణమాత్రంబునఁ జనుదెంచి ధరణికిఁ, బ్రాఁకిల్లి కృష్ణునిపాదములకు
దివ్యపుష్పాద్యశ్వదేదీప్యమానంబు, పతగేశ్వరధ్వజభ్రాజితంబు
సురపూజితము నైనసుగ్రీవపుష్పక, స్యందనంబును గదాద్యాయుధములు

గీ. నప్పన మొనర్చుటయును గదాసిశంఖ, చక్రశోభితభుజచతుష్టయసమేత
ముగను గృష్ణుఁడు రాముఁడు ముసలలాంగ, లాయుధయుతంబుగను నెక్కి స్యందనంబు.

క. ద్రుమగుల్మలతాద్యాక్రాం, త మగువనంబువను నగ్ని దార్కొలిపినచం
దమున జరాసంధునిపై, న్యమునఁ బోనిప దారుకుఁడు శతాంగము నంతన్. 3099

క. చెలరేఁగి జరాసంధుని, బలమును సర్వమును నొక్కప్రహారార్థమునన్
బలివెట్టి యుద్ధభూమికి, నలువుగఁ గృష్ణుండు శంఖనాదము సేయన్. 3100

క. అతికోపంబున బాణ, ప్రతతులఁ గురియించుచును జరాసంధుం డు
ద్ధతితోడం బైకొన న, చ్యుతాగ్రజుఁడు సేసి ఘోరయుద్ధ మతనితోన్. 3101

ఆ. కడకు లాంగలమునఁ బడఁగొట్టి సారథి, తురగయుక్తముగను నరద మిలను
బట్టి వానిఁ గేలఁ బలిమిచేఁ దెగటార్చ, నెంచి మదిని ముసల మెత్తుచుండ. 3102

ఉ. ఆసమయంబునందు విదితార్థుఁడు గావునఁ గృష్ణుఁ డన్న యీ
దోసము సైచి ప్రాణములతోఁ ద్యజియింపుము వీని నీపయిన్
జేసిన నిట్టిదోషమును జీలిచివైచెదుగాక నావుడున్
బాసి యమర్షమున్ విడిచె నవ్వుచు రాముఁడు వాని సంతటన్. 3103

సీ. అరిగి జరాసంధుఁ డతిబలుం డగుకాల, యవనునిసన్నిధి కాతఁడంబ
రామకృష్ణులపరాక్రమమును గంసాది, వధమును స్వపరాభవమును దెలుప
వాఁడు క్రుద్ధుండయి స్వమ్లేచ్ఛకోటిస, హస్రసైన్యముతోడ నద్భుతముగఁ
బ్రస్థితుండై మధురాపురం బరికట్టఁ, దలఁచి కృష్ణుండు పౌరులను గావ

గీ. నబ్ధినడుమను ద్వారక యనెడిపత్త, నమును గట్టి త్రింశద్యోజనములవిరివి
గలప్రదేశంబునందు సంకల్పమాత్ర, ముననె యటఁ జేర్చె నేయి సుప్తులను నెల్ల.

సీ. అంతటను బ్రభాత మగుటయుఁ గొంతసే, పునకు మేల్కాని పురజనము లెల్లఁ
గనుఁగొని రత్నకాంచనగృహప్రాసాద, గోపురప్రాకారకుడ్యములను
ధనధాన్యవైభవంబును గామధేనువు, లనఁ దేజరిలు చుండు నాలకదుపు
స్వస్వకర్మములందుఁ జరియించుబ్రాహ్మణ, క్షత్త్రియోరువ్యజఘన్యజులను

గీ. జెంది యాశ్చర్యమును మహానందమును
ద్రిదివమున దేవతలువోలె దివ్యసుఖము
లనుభవింపఁదొడంగి రెందును గొఱంత
యనెడిమాటయె యా పురమందు లేమి. 3105

గీ. అంతటను రామకృష్ణు లత్యద్భుతముగఁ, గాలయవనునిబల మెల్ల గడియలోన
నాశ మొనరించి రమరు లాకాశమందు, నిలిచి విజయనినాదముల్ సలుపుచుండ.

క. అది చూచి కాలయవనుఁడు, హృదయంబున వేఁడిపుట్టఁ గృష్ణునిమీఁదన్
గదిసి యొనరింపఁదొడఁగెను, గదారణము దేవతలును గంపము నొందన్. 3107

సీ. అతనితో బహుకాల మని కృష్ణుఁ డొనరించి, యుద్ధవై ముఖ్యంబు నొంది కడకుఁ
బ్రధనరంగమునుండి పఱచు చుండఁగఁ గాల, యవనుఁడు గద నెత్తి హస్తమునను
నాఁగుమాఁగు మటంచు నార్చుచుఁ బరువెత్తు, చుండ వెంబడిఁబడి యుగ్రుఁ డగుచుఁ
బరువువాఱుచుఁ బట్టుపడకుండఁ జని తటా, లునఁ గృష్ణుఁ డొకగుహలోనఁ దూఱె

గీ. నప్పు డాతనివెంటనె యరిగి కాల, యవనుఁడును దూఱి గుహలోన నచట యోగ
నిద్రలో నున్నముచుకుందనృపతివరునిఁ, గృష్ణుఁ డనుభ్రాంతిచేఁ గాల నొగిసి తన్నె.

గీ. తత్పదాఘాతమున నవాప్తప్రబోధుఁ, డగుచు ముచుకుందుఁ డాగ్రహం బావహిల్ల
హుంకరించి కనుంగొన నుగ్రముగను, గాలయవనుఁడు భస్మమై నేలఁ గూలె. 3109

వ. అప్పుడు కృష్ణుఁడు విష్ణురూపముం దాల్చి ముచుకుందునకుఁ బ్రత్యక్షంబై తత్ప్రా
ర్థితం బగుమోక్షముం బ్రసాదింప నారాజర్షి తత్క్షణంబ మానుషదేహముం బరిత్య

జించి విష్ణుసమానరూపంబుతోడఁ దార్క్ష్యవాహనంబు నధిష్ఠించి పునరావృత్తిరహితం
బగుపరమపదముం జెందె. 3110

గీ. కృష్ణుఁ డంతట నగ్రజాన్వితము గాఁగ, విడిచి మధురాపురంబును విబుధు లెల్లఁ
జలుపు చుండఁగ జయనాదములను హర్ష, భరితుఁ డగుచును ద్వారకాపురికిఁ జేరె.

గీ. అప్పు డింద్రుఁడు కాన్కగా నంపె వాయు,ముఖమునను గృష్ణునకు వజ్రములును మణులు
ఛత్రములు చామరములును సంఘటిల్ల, విశ్వకర్మరచించిన విబుధసభను. 3112

క. ఆసమాన మైనయాదే, వసభను గృష్ణుఁడు గ్రహించి వాయు వొసఁగ ధ
ర్మసభగ ద్వారకలో ను, గ్రసేనముఖు లెల్ల నబ్బురంపడ నిలిపెన్. 3113

గీ. అంత నిక్ష్వాకువంశభూకాంతుఁ డైన, రైవతుఁడు సర్వలక్షణరాజమాన
మైనరేవతి నిజపుత్రి నచ్యుతాగ్ర, జున కొసఁగి పెండ్లిగావించె సురలు పొగడ. 3114

క. ఆమెను గొని పత్నిగ బల, రాముఁడు ద్వారవతిలోన రాజిల్లెను బౌ
లోమిని గొని దారగ సు, త్రాముఁడు త్రిదివంబునను విరాజిలుపగిదిన్. 3115

వ. జయ విజయులు ద్వాపరయుగంబునఁ జైద్యాన్వయమందు శిశుపాలదంతవక్త్రులుగాఁ
బ్రభవించి మహాబలపరాక్రమములతోఁ బ్రవర్తిల్లు చుండ విదర్భదేశాధిపతి యగు
భీష్మకునకు రమాంశంబున జన్మించి విష్ణ్వవతారం బగుకృష్ణునకు భార్య గానున్న
రుక్మిణీదేవిని భీష్మకమహారాజపుత్రుం డగురుక్మి శిశుపాలున కొసంగఁ దలంచి జన
కానుమతిం బడసి సుముహూర్తంబు నిర్ణయించి వివాహప్రయత్నంబు గావించు
చుండ. 3116

సీ. బాల్యంబుమొదలుగా బహుళానురాగంబు, తోడఁ గృష్ణునిఁ బెండ్లియాడ నెంచి
కాంక్షించు చుండుట దేవతాపూజలు, దానముల్ వ్రతములు ధర్మములును
శిశుపాలు నొల్లమిఁ జిత్తంబు భర్తగాఁ, జేకొన రుక్మిణి చింతపడుచుఁ
దమపురోహితుసుపుత్రకుఁ డైనవిప్రునిఁ, బనిచె ద్వారకకుఁ గృష్ణునకుఁ దెలుప

గీ. నంత నతఁ డేఁగి ద్వారక కామెచింత, యంతయును దెల్పఁ గృష్ణున కాలకించి
సర్వమును గృష్ణుఁ డగ్రజసహితముగను, దారుకానీత మైనరథంబు నెక్కె. 3117

క. చనుదెంచి విదర్భాపుర, మునకు రయంబునను సకలభూపతులును బెం
డ్లిని జూడవచ్చి మూఁగఁగఁ, గనుచును నెల్లరను నుండి కాలజ్ఞుండై. 3118

ఆ. సాంధ్యకాలమందుఁ జనుచుండ రుక్మిణి, రథము నెక్కి రాజపథమునందు
దుఃఖదుఃఖముగను దుర్గాలయమునకు, నాచరింపఁ బరిణయాదిపూజ. 3119

ఆ. అపుడు శీఘ్రగతిని నరుదెంచి యామెను, గూరుచుండఁబెట్టుకొని రథంబు
నందుఁ బోవుచుండ నాత్మపురంబున, కచటినృపతు లెల్ల నడ్డగించి. 3120

చ. నిలునిలు వాసుదేవ ధరణీధవు లెల్లరుఁ జూచు చుండఁగాఁ
జలుపఁగ నీయకార్యమును సైతురె నావుడు సీరపాణి లాం

గలముసలాయుధంబులను గైకొని డిగ్గి రథంబునుండి రా
ట్కులభవులార శక్తిగలక్రోశిపి భల్ కొనిపొందు రుక్మిణిన్. 3121

చ. అనవుడు రాజు లెల్లరును నాహవముం బొనరింపఁ బూనుటన్
గనుఁగొని రేవతీధవుఁడు కన్నులనిప్పులురాల లాంగలం
బున ముసలంబునన్ బ్రధనభూమిని నిల్చినశత్రువర్గమున్
దునుముచు నుండ రుక్మి ధృతితోడను వింటను గూర్చి బాణముల్. 3122

సీ. కృష్ణునిపైఁ బ్రయోగింపంగఁ గృష్ణుఁడు, నవ్వుచు నొకమార్గణమున వాని
ఖండించి మఱియొకకాండఁబునను రుక్మి, తురగసారథిరథాదులను గూల్చ
విరథుఁడై రుక్మి సోద్వేగంబుగను నొక్క, కరవాలమును గొని కవిసిరాఁగ
దిగ్గున రథమును డిగ్గి కృష్ణుండు త, త్ఖడ్గంబు నొకసాయకమునఁ దునిమె
గీ. నంతటను రుక్మి యార్చుచు నరుగుదెంచి, కృష్ణునియురంబుపైఁ బిడికిటను గ్రుద్దఁ
బట్టుకొని వానిఁ గృష్ణుఁడు బావ యగుట,క్షురముచేఁ దచ్ఛిరము గొంత గొఱిగి విడిచె.

క. కొందఱు చచ్చిరి పాఱిరి, కొందఱు దిక్కులకు మఱియుఁ గొందఱు శరణం
బొందిరి బలదేవాయుధ, సందళితాంగులయి ఘోరసంగ్రామమునన్. 3124

గీ. అంతటను రుక్మి కృష్ణకృతావమానుఁ, డగుటఁ దలయెత్తికొని యింటి కరుగలేక
యుండె నురగంబువోలె నిట్టూర్పు లిడుచుఁ, గదలకుండంగ నారణాంగణమునంద.

ఆ. అపుడు వాసుదేవుఁ డచ్యుతాగ్రజుఁడును, స్యందనంబు నెక్కి సంతసమున
రుక్మభూప యైనరుక్మిణితోడను, జనిరి ద్వారవతికి క్షణములోన. 3126

వ. అంతటఁ గృష్ణుండు బృందావనంబునుండి నందగోపయశోదాదిసకలగోపగోపికాబృందంబును ద్వారకకు రావించి వసుదేవబలభద్రోగ్రసేనాక్రూరాదియదుపుంగవులును దేవకీరేవతీరోహిణీప్రముఖయోషిద్బృందంబును నందయశోదాదిగోపబృందంబును సకలరాజబంధువర్గంబునుం గలవివాహమండపంబున నొక్కశోభలగ్నంబునందు. 3127

సీ. అమరు లెల్లరు మహాహ్లాదంబుతోడను, గురియుచు నుండఁగఁ గుసుమవృష్టి
దివమున మంగళదేవతాదుందుభుల్, మ్రోఁగుచు నుండఁగ మారుమ్రోఁగ దెసలు
భూసురాశీర్వాదములు గొల్పు చుండ మ, హానందమును నంతరంగములకుఁ
గావించు చుండంగఁ గర్ణసుఖంబును, వందిమాగధసంస్తవస్వనంబు
గీ. నాడు చుండంగ నచ్చర లందముగను, బాడుచుండ గంధర్వులసారముగను
నందఱును జూచు చుండ నత్యద్భుతముగ, భీష్మకన్నృపాలపుత్రినిఁ బెండ్లియాడి. 3128

ఆ. అవల బ్రాహ్మణులకు నవనీశ్వరులకును, గోపబృందమునకుఁ గొల్లలుగను
దివ్యభూషణముల దివ్యాంబరంబుల, నుల్లములు చిగుర్ప నొసఁగి పనిచి. 3129

క. ప్రణుతింప నెల్లప్రజలును, గణుతింపఁగ నమరు లెల్లఁ గౌతుక మొదవన్
మణిమయహర్మ్యంబున రు, క్మిణితోడను గూడుకొని సుఖించుచు నంతన్. 3130

వ. దుర్దమవీర్యంబులును ననితరసాధ్యంబులును నగుసప్తవృషభంబుల నొక్కపాశంబునం
గట్టి తచ్ఛుల్కప్రాప్యయును పృథివ్యంశసంభూతయును సత్రాజిన్మహీపాలతనూజ
యును నగు సత్యభామను లీలాంశసంభూతయును వివస్వత్తనూజయును నగుకా
ళిందిని విందానువిందునికుమారియును స్వయంవరసముపలబ్ధయును నగుమిత్ర
విందనుం బెండ్లియాడి వారలతోడం గూడి సుఖంబుండె. 3131

సీ. సత్రాజితుం డొకసమయంబునందు స్య, మంతకం బను నొక్కమానికంబు
తనతమ్ముం డగుప్రసేనున కీయ నతం డది, దాల్చి భాసిలుచుండం దరణినోలె
నది గని కృష్ణుం డత్యాశ్చర్యమును బొంది, తన కది యిమ్మని తాను గోర
నతం డిట్టు లనియె నియ్యది యొసంగుదు నుండు, నష్టభారసువర్ణ మనుదినంబుం
గీ. గాన నెవనికిం గూడ నిద్దాని నీయ, ననుచు గోపించుం డేమియు ననక చనియె
నావలను గొన్నిదివసంబు లరుగం గృష్ణుం, డడవి కేగంగ మృగయార్థమాత్మ నెంచి.

వ. మృగయాప్రవీణు లగుప్రసేనాది వీరాగ్రేసరులతోడం గూడి యొక్క మహారణ్యముం
బ్రవేశించి మృగంబుల వేటాడంబోయెంగ. 3133

సీ. అపుడు ప్రసేనుం డత్యంతసాహసమున, నతిదూరవనంగి నేగి యడవిలోన
నొక్కండ వధియించుచుండ మెకంబుల, నాకస్మికంబుగ హర్యక్ష మొండు
చనుదెంచి తీవ్వనం జంపి ప్రసేనునిం, దద్రక్తము గ్రావి తనివిదీర
నతనియురస్స్థలమందు వెలిగెడిరత్న, మును గొని యడవిలోం జనుచు నుండ
గీ. జాంబవంతుండు దానిని సంహరించి, మానికము గొని తనగుహాలోనం జొచ్చె
నంతటను నస్తమింపంగ నర్కుండు చ, బయలుదేఱెం జతురీక్షపాకరుండు. 3134

ఉ. అప్పుడు వాసుదేవుం డనుయాయులతోడను గూడి వేడ్క నో
నుప్పురమందు భాసిలుచునున్నహిమాంశునిం గాంచుచున్ జనన్
జప్పున వేటలోనిశ్రమ సర్వము వచ్చి పురంబుం జేరి తా
నెప్పటియట్ల సౌఖ్యమున నింతులతోడను గూడియుండెఁగన్. 3135

క. వనముననుండి ప్రసేనుండు, చనుదేడమిం గృష్ణుం డతనిం జంపి స్యమంతం
బును గొనె ననునపవాదము, జనియించెను ద్వారకాప్రజావర్గములోన్. 3136

చ. అది విని కృష్ణుం డజ్ఞజను లాడెడిమాటలకున్ విభీతుండై
యదువులతోడం గూడి గహనాంతరభూమికి నేఁగి యచ్చటన్
వెదకి వధింప సింహ మవనిం బడియున్నప్రసేనదేహమున్
బదుగురికిన్ గనంబఱచి ప్రాప్తమనఃపరితాపశాంతి యై. 3137

సీ. అంతటం బోక స్యమంతకరత్నంబు, వెదకంగ నెంచి యవ్విపినమందుం
జను చుండ నొకగుహ కనంబడుటయు నందుం, జొచ్చి నిర్భయముగాం జూచు చుండ
ధాత్రి డోలను స్యమంతకమణిం గట్టి జాం, బవదాత్మజుని నందుం బండం బెట్టి
యూంచుచు మెల్లంగా నోయికుమార యే, డ్వకు మేడ్వకుము స్యమంతకము నీదె

గీ. కొనియెఁ బంచాననము ప్రసేనుని వధించి, జాంబవంతుఁడు కొనె దాని సంహరించి
యాడుకొనుమయ్య యిఁక నని పాడుచున్న, పాట వినఁబడెఁ జెవులకుఁ బ్రమద మొదవ.
గీ. అంతటను వాసుదేవుఁ డత్యద్భుతముగ, శంఖనాదంబు గావించెఁ జదలుముట్ట
దాని విని జాంబవంతుఁడు తత్క్షణంబ, యాగ్రహంబున గుహనుండి యరుగుదెంచె.
ఆ. అపుడు వారి కయ్యె నాయోధనము పది, దినము లొక్కమొగిని దెఱపిలేక
యవల జాంబవంతుఁ డడలి తచ్ఛక్తికి, నతని నచ్యుతునిగ నాత్మ నెంచి. 3140
సీ. చాలించి యుద్ధంబు స్వామి నీ వెవ్వండ, వేమికార్యంబు నీ కిటకు రాఁగ
నానతి మ్మని వినయంబున వేఁడి త, త్ప్రత్యుత్తరము విని పరమపురుష
ధన్యుండ నైతి నీదర్శనంబున నేఁడు, రామభద్రావతారమున మున్ను
నాతోడఁ జెప్పిన ట్లేతెంచితివి రణ, స్పృహ తీర్చి మోక్షంబు నీయ నాకు
గీ. నని వచించి తదీయపదాబ్జములను, తాఁకొళన మొనర్చి తనపుత్రి జాంబవతిని
నొసఁగె సతిగ స్యమంతకయుక్తముగను, దానిఁ బ్రమోదమును బొంది దానవారి.
క. ఆకన్యారత్నంబులఁ, గైకొని వర మిచ్చి ముక్తి గలుగఁగ నాథ
ల్లోకపతి కరుగుదెంచి వి, లోకించుచు నుండ బంధులోకం బెల్లన్. 3142
వ. స్యమంతకమణి సత్రాజిత్తున కొసంగి జనాపవాదవిముక్తుం డయ్యె. సత్రాజిత్తుం డామాణిక్యంబు తనతనూజ యగుసత్యభామకుఁ బుత్రికాప్రేమంబున నొసంగె. కావున భాద్రపదశుక్లచతుర్థీదినంబునఁ జంద్రదర్శనంబు మిథ్యాప్రవాదకారణం బగు టంజేసి వర్జనీయంబయ్యె. 3143
క. ఆనాఁడు చంద్రదర్శన, మైనయెడల నెవని కేని యతఁడు స్యమంతా
ఖ్యానము విననగు దానను, వానికిఁ గలుగదు జనాపవాదం బెపుడున్. 3144
వ. అటుమీఁద నొక్కనాఁడు సులక్షణ నాగ్నజితి సుశీల యనుమద్రరాజకన్యకలు మువ్వురు స్వయంవరంబున వరింపఁ గృష్ణుండు వారలం బత్నులుగాఁ గైకొని యష్టమహిషీజనంబులతోడం గూడి నానాభోగంబు లనుభవింపం దొడంగె. 3145
సీ. అటు లుండ భూపుత్రుఁ డగునరకాసురుం, డమితపరాక్రముఁ డగుటఁజేసి
యోడించి యమరుల యుద్ధంబునను దేవ, పతిని సింహాసనచ్యుతునిఁ జేసి
యదితికుండలములు హరియించి ధనదుని, నిధుల నెల్లను గొని నిర్భయముగ
మయవినిర్మిత మైనమాయాపురంబునం, దధివసించుచు గగనాంగణమున
గీ. బాధవెట్టుచు నుండంగఁ బ్రజల నెల్ల, సురలు విచ్చేసి కృష్ణునిదరికి నరక
బాధ లెఱిఁగింప శౌరి సుపర్వకోటి, కభయము నొసంగి తార్క్ష్యుని నాత్మఁ దలఁచె.
సీ. తలఁచినవెంటనె తార్క్ష్యుఁడు చివ్వునఁ, జనుదెంచి మ్రొక్కె కృష్ణునకు నిలువ
వాసుదేవుఁడు తార్క్ష్యవాహనంబును సత్య, తోడ నధిష్ఠించి తూర్ణముగను
రవిమండలమువోలె దివిని వెలుచునున్న, రాక్షసపురము చేరంగ నేఁగి
యజముఖామరులకు నైన భేద్యముగాని, తత్పురావరణసంతతుల నెల్లఁ

గీ. ధరణి నిజదీప్తిచేఁ దమస్తతులఁ బోలెఁ, జక్రధారను ఛేదించె విక్రమించి
యంతటఁ దదంతరస్థితు లైన దైత్య, భటులు సంఖ్యాధికంబుగా బయలుదేఱి. 3147

క. ఒనరించి శౌరితోడను, నని ఘోరంబుగను జక్రహతిచేతను దు
త్తునియలయి కూలి రిలమీఁద, దను వజ్రచ్ఛిన్నభూమిధరములువోలెన్. 3148

సీ. అంతటఁ బాంచజన్యంబుఁ బూరింపఁగఁ, గృష్ణుండు దిక్కరుల్ గిఁక వెట్ట
నది విని నరకుఁ డత్యాటోపమునను గై, కొని శరాసనము స్యందనము నెక్కి
రణభూమి కేతెంచి గణనాతిగము లైన, శరములఁ గురియింప శౌరిమీఁదఁ
జక్రధరుం డర్ధచంద్రబాణముచేతఁ, ద్రుంచి తచ్చాపంబుఁ దునియలుగను

గీ. నతనియురమున నొక్క దివ్యాస్త్ర మేయఁ, దత్ప్రఘాతంబునను వాఁడు ధరను గూలె
నపుడు ప్రార్థింప భూదేవి యచ్యుతుండు, కనికరంబున వానిదగ్గఱకుఁ బోయి. 3149

సీ. రాత్రించరేంద్ర వరంబు గోరుము నాఁగ, నరకుఁ డాతనిఁ జూచి పరమపురుష
నీచేతిలో మరణించుటె ముక్తిదా, యక మన్నవర మేల యంతకంటెఁ
గోరెద నైనను గోరు మంటివి గాన, సర్వలోకహితంబు సలుప నెంచి
నామృతదివసంబునను మంగళస్నాన, మాచరించెడిజను లందఱకును

గీ. నిరయసంప్రాప్తి లేకుండ వరము నీయు, మనుడు నట్టులె యగుఁగాక యనియె శౌరి
యంత నరకుఁడు చూచుచు హరిపదములఁ, బ్రాణములు వీడి వైకుంఠపదముఁ బడసె.

వ. అప్పుడు వాసుదేవుండు నరకాలయముం జొచ్చి తదపహృతపదార్థంబుల నెల్లం గైకొని తత్తత్స్వాముల కొసంగి నరకాసురుండు పార్థివుల నెల్ల జయించి సర్వరాష్ట్రంబుల నుండి కైకొనివచ్చి తనయంతఃపురంబున నిరోధించి యునిచినషోడశసహస్రరాజకన్యకలను దన్నిరోధవిముక్తలం గావించి. 3151

గీ. అప్పు డాకన్య లెల్ల ననంగతాప, తప్తలై తన్ను వరియింప దారలుగను
నేకలగ్నంబునను వారి నెల్లఁ గొనియెఁ, దాల్చి బహుదేహములను నత్యద్భుతముగ.

సీ. అయ్యెడ నరకాసురాత్మజు లేతెంచి, శరణుచొచ్చుటయును శార్ఙ్గపాణి
భూదేవిప్రార్థనంబున వారి నెల్లను, స్థాపించి జనకరాజ్యంబునందు
నింద్రవిమానంబు నెక్కించి యారాజ, సుతల నెల్లను ద్వారవతికిఁ బనిచి
తా నెక్కి సత్యతోఁ దార్క్ష్యవాహనమును, దేవమాతను జూడ దివికి నేఁగి

గీ. యదితిసందర్శనము సేసి యామె కీయఁ, గుండలములను నామె యఖండముగను
సంతసించుచుఁ బుత్రవాత్సల్యమునను, నమృతభోజనము నొసంగి యాదరించె. 3153

గీ. అంత నాదిత్యులును మహేంద్రాదిసురులు, వసువులును రుద్రులును గౌరవం బెలర్ప
స్వర్ణపుష్పంబులను బూజ సలిపి హరికిఁ, దన్మహత్త్వంబుఁ బొగడి రత్యద్భుతముగ.

సీ. శచినిఁ జూడఁదలంచి సత్య యంతటఁ దదీ, యావసథంబున కరుగ నామె
సత్యభామను మహాసంతోషమున గౌర, వించుచు నుండ నవ్వేళయందు

పౌలోమి కింద్రుఁడు పారిజాతసుమంబు, లనుపంగఁ దనభృత్యజనులవలనఁ
జేకొని వాని శచీదేవి తుఱుముపై, ముడియుచుఁ జక్కఁగాఁ జెరివికొనియెఁ

గీ. దన కొసంగక యామెయె తాల్చుకతన, సూనముల నెల్లఁ దన్నవమానపఱిచె
ననుచుకినుకను సత్య చివ్వనను లేచి, వచ్చి యటనుండి శౌరి కావార్తఁ దెలిపె.

సీ. ఆమెపలుకుల నెల్ల నాలించి కృష్ణుండు, తలయూఁచి మదిలోనఁ గలుగఁ గినుక
గరుడవాహనము నాకాంతతోడను నెక్కి, చని నందనోద్యానమునకు వేగ
పారిజాతంబు నుత్పాటించి తార్క్ష్యుని, పై నుంచికొని కడుభద్రముగను
నరుదెంచి ద్వారకాపురికి స్థాపించె నా, పాదపంబును సత్యభామయింట

గీ. నది యెఱింగి పురందరుఁ డధవపించి, యభ్రమాతంగమును గేల నశనిఁ దాల్చి
యమరయూథంబుతోడను నరుగుదెంచి, ముట్టడించెను ద్వారకాపట్టనమును. 3156

గీ. అంతటను బురుహూతున కచ్యుతునకు, నత్యుగ్రంబైన సంగ్రామ మయ్యె నందు
శౌరి కోటమి గలుగమి శక్రుఁ డపరి, విడిచె వజ్రంబు రుక్మిణీధవునిమీఁద. 3157

క. ఆవజ్రము నొకకేలను, గోవిందుఁడు పట్టి సురలగుండియ లవియన్
గావించు చుండ హాసము, దేవేంద్రుఁడు గజమునుండి దిగి నమ్రుండై. 3158

క. చనుదెంచి పాదచారం, బునఁ గృష్ణునిసన్నిధానమునకుఁ బ్రణామం
బొనరించి నిలిచి సంస్తవ, మును జేసి బహుప్రకారముల వినయమునన్. 3159

క. గోవింద పారిజాతము, దేవతలకు నీవె యిచ్చితివి మును దానిన్
భూవలయస్థాపితముఁ, గావింపఁ గనగునె నేఁడు క్రతుభుజ లోకులన్. 3160

చ. అని పలుకంగఁ గృష్ణుఁడు సురాధిప భూమికిఁ బారిజాతమున్
గొని చనుదెంచినాఁడను మనుష్యహితార్థము నేఁడు నేను భూ
మినిగలయంతదాఁక నిది మేదినిలో నగునుండ నావలన్
గొని చనవచ్చు స్వర్గమునకున్ జనఁ జెప్పుఁడు రిక్తహస్తుతె. 3161

క. అని చెప్పి యొసఁగి వజ్రం, బును బురుహూతుఁడు ప్రమోదమునఁ గొని దానిన్
జనియెను గృష్ణునిమహిమము, వినుతించుచు సురలతోఁ ద్రివిష్టపమునకున్. 3162

గీ. అంతఁ గృష్ణుఁ డనేకదేహములతోడ, నఖిలభార్యాగృహంబులయందు నేల
వర్తిలుచు సర్వగతుఁ డయి వారి నెల్ల, నంగజసుఖాబ్ధిలో నోలలార్పఁ దొడఁగె.

వ. అట్లు కొంతకాల మరుగుటయుఁ గృష్ణునకు రుక్మిణీదేవియందు మదనాంశంబునఁ బ్రద్యుమ్నుఁ డుదయించి శంబరాసురుని సంహరించె. ప్రద్యుమ్నునకు రుక్మితనూజయం దనిరుద్ధుండు ప్రభవించె. 3164

సీ. బాణాసురునిసుతనూషన యగునుష యొక, నాఁటిరాతిరిని స్వప్నంబున నను
సుందరుఁ డగుపురుషుని నొక్కరుని మహో, బాహుని షోడశాబ్దములవానిఁ
గని వానితోడను గామసౌఖ్యాబ్ధిలో, నోలాడి యొంటాడి మేలుకాంచి
స్వప్నలబ్ధుం డైనవాఁడు గానఁగరామిఁ, గందర్పశరబద్ధగాత్రి యగుచుఁ

గీ. జింతిలుచు నుండఁ దత్సఖి చిత్రలేఖ, తద్విషాదనిదాన మంతయును నాతి
వలనను నెఱింగి సౌందర్యవంతు లైన, వారలను నెల్లఁ బటమున వ్రాసి చూపె.

క. కని వారల నెల్లర నుష, యనిరుద్ధునిఁ జూచి యితఁడె యతఁ డని చెప్పం
గని చిత్రలేఖ మాయా, తనువున ద్వారకకు నేఁగి దానవి యగుటన్. 3166

వ. నిశీథకాలంబున నొక్కయంతఃపురమ్ముం జొచ్చి యందు మనోజ్ఞపర్యంకంబునం బవ
ళించినిద్రించు చున్నయనిరుద్ధుని నిజమాయాప్రభావంబునం గైకొనివచ్చి బాణాం
తఃపురచైత్యప్రాసాదంబున నుషాశయ్యాతలంబునం బవళింపంజేసి చనియె. 3167

సీ. ఆవలమేల్కని యనిరుద్ధుఁ డతిమనో, జ్ఞం బైనశయ్యాతలంబునందుఁ
దనపార్శ్వమునఁ బండుకొని యున్నదాని వి, భ్రాజితహేమవర్ణంబుదాని
నీలోత్పలంబుల నేలుకన్నులదాని, సోమునిగో మోముమోముదాని
బింబాధరముదాని శంబరారిశరాస, నమును శాసించుకన్బొమలదానిఁ

గీ. గఠినవక్షోజములదానిఁ గాను గలదొ, లేదొ యనుసంశయంబు గల్గించుదాని
బిసమృదులబాహువులదానిఁ బిన్నదాని, నుచితలక్షణములదాని నుషను గాంచి.

గీ. కామశరతాడితాంగుఁ డై గాఢముగను, గౌఁగిటను జేర్చికొని కామకళల నొత్తి
తమిని గ్రోలుచు నధరామృతమును మదన, కేళిసౌఖ్యపయోధిలో నోలలార్చె.

గీ. అట్లు లోకమాసము నిరంతరాయముగను
గడవఁగను గోప్యముగ నేమి యిడుమ గలుగఁ
గలదొ యీవార్త స్వామికిఁ దెలుప కున్న
నని యడలి యొక్కదాసి బాణునకుఁ దెలిపె. 3170

సీ. అంతట బాణుఁ డత్యంతరోషంబున, నంతఃపురద్రోహి యైనవానిఁ
గొనిరండు శీఘ్రంబుగను నుషాప్రాసాద, మున కేఁగి యని చెప్పి యనుప భటులఁ
జని వార లెల్లరు స్వామి చెప్పినయట్లు, సత్వరంబుగ నుషాసౌధమునకు
ననిరుద్ధుని నిబద్ధు నొనరించుకొని పోవఁ, దగినసామగ్రితో దరికి రాఁగ

గీ. నప్పు డనిరుద్ధుఁ డవలీల నచట నున్న, స్తంభమును బెల్లగించి యాదైత్యభటుల
నెల్లరను దాన వధియింప నెఱిఁగి బాణుఁ, డాతనిపరాక్రమముఁ దాన యరుగుదెంచి.

క. అనిరుద్ధుని బంధింపం, గను జూచుచు నుండ నతఁడు గ్రక్కునఁ బరిఘం
బును లాగి త్రిప్పి గిరగిర, దనుజేంద్రునిమీఁద వైచె ధరణి చలింపన్. 3172

వ. అయ్యెడ బాణుం డాపరిఘంబు నొక్కనిశితాశుగంబునం దునిమి యురగాస్త్రంబుచే
ననిరుద్ధుని నిరుద్ధునిం జేసి నిజాంతఃపురంబునం దుంచె. 3173

సీ. నారదుం డంతట ద్వారకాపురి కేఁగి, యనిరుద్ధువార్తఁ గృష్ణునకుఁ దెలుప
వైనతేయుని నెక్కి వాసుదేవుఁడు హలి, ప్రద్యుమ్నసహితుఁ డై బలములతోడ
నరుదెంచి బాణునిపురికిఁ దద్ద్వారంబు, నను గావలిగ నున్నహరు నెదిర్చి
కావింపఁ దొడఁగ సంగ్రామంబు ఘోరంబు, గను నీలపాణికి గజముఖునకు

ఆ. బాణాలేయునకు బ్రద్యుమ్ననకును యా, దవబలంబునకును భవగణంబు
లకును యుద్ధ మయ్యె సకలలోకములును, దల్లడిల్లఁ దత్ప్రతాపములకు. 3174

సీ. జయ్యెడ విఘ్నేశు డచ్యుతాగ్రజునిపై, కుపితుండై గాటముగ దంతమునఁ బొడువఁ
దాళధ్వజుండును తద్రదనంబుపైఁ గొట్టె, ముసలాయుధంబున వసుధ యదర
నాగ్రేటునను భగ్నమగుటను దంతంబు, దంతిముఖుం డేకదంతుఁ డయ్యె
నావల బలరాముఁ డడరి రుద్రగణంబు, లను బాఱఁగొట్టఁగ లాంగలమున

గీ. యాదవబలంబు చెలఁగి చెర్లాడఁ దొడఁగె, నంత నది యెల్లఁ గాంచి నేనాగ్రహమునఁ
బ్రభవ మొందింపఁ దాపజ్వరంబు దానిఁ, గెడప శీతజ్వరంబుఁ గల్గించె శౌరి. 3175

వ. అంత నాజ్వరంబులు రెండునుం గొట్టుకొని యస్మదాజ్ఞచే మర్త్యలోకంబునం బ్రవేశించె.

సీ. అనలఁ గృష్ణుండు మోహనాస్త్రంబు నేయంగ, నాపైకి నది దారుణముగ వచ్చి
నను మూర్ఛితునిఁ జేయఁగను షణ్ముఖుండు ప్ర, ద్యుమ్నునితోఁ జేయుదురము నాఁపి
కైకొని శక్తి నాగ్రహమున శౌరిపై, కేతేరఁగను బంకిజేషుండు
వారించి యొక్కహుంకారంబునను వానిఁ, జవలు ముట్టఁగఁ బాంచజన్య మూఁదె

గీ. శ్రవణములఁ దాఁక నాశంఖరవము కఠిన, కఠినముగ బాణుఁడు సహస్రకరములందుఁ
దాల్చి బహుళాయుధముల స్యందనము నెక్కి, కదనభూమికి సైన్యయుక్తముగ వచ్చి.

క. కురియింప శౌరిమీఁదను, శరవర్షము నచ్యుతుండు చక్రముచేఁ ద
చ్ఛరములనె కాక యాతని, కరములనుం దునిమె ఖండఖండంబులు గాఁ. 3178

వ. అట్టియెడ నీ వరుగుదెంచి కృష్ణునకు మ్రొక్కి దేవా పూర్వజన్మంబున నేను నీకు దాసి నై కౌశలపర్వతంబున నుండుతరుణంబున సుప్రసన్నహృదయంబుతోడ నాకు శాశ్వతసౌభాగ్యసిద్ధి యగునట్లు నీవు వరం బొసంగుటంజేసి నీనామసహస్రంబులో గౌరీసౌభాగ్యదాత యనునొక్కముఖ్యనామంబు మహర్షులచేఁ బేర్కొనంబడియె.

క. ఆవరము సార్థకంబుగఁ, గావింపఁగ నిదియె తగినకాలం బని వా
పోవఁగను మోహనాస్త్రము, గోవిందుఁడు ద్రిప్పె మేలుకొని నే నంతన్. 3180

సీ. ప్రాంజలి నై కృష్ణపరమాత్మయెదుటను, నిలువంగఁబడి సంస్తుతుల నొనర్చి
యచ్యుత బలిసుతుం డైనయీబాణుండు, నన్నుఁ గూర్చి ము న్నొనర్చి తపము
నమరణత్వంబును బ్రార్థింపఁగను నట్లు, యితనికి వరము నిచ్చితిని నేను
క్షమియించి మాయపచారంబులను నెల్ల, నదలుము వీని జీవములతోడ

గీ. నని వచింప మదీయవాక్యమునఁ జేసి, వాసుదేవుఁడు బాణుని వదలివైచె
నెఱుకలేదె సతీ యంత వృషభ మెక్కి, యరుగుదెంచితి మీరౌప్యగిరికి నాఁడు.

వ. అప్పుడు బాణాసురుండు సప్రశ్రయంబుగా రామకృష్ణప్రద్యుమ్నుల నిజభవనంబునకుం దోడ్కొనిపోయి స్వర్ణసింహాసనంబులం దుపవిష్టులం జేసి పూజించి సుప్రసన్నులం గావించికొని తదనుమతిం బడసి తనపుత్రి యగు నుష ననిరుద్ధున కొసంగి సర్వజనశ్లాఘ్యంబుగా వివాహంబు గావించె. 3182

గీ. అంతఁ గృష్ణుఁ డుపానిరుద్ధాన్వితముగ, స్యందనము నెక్కి యన్నయు నందనుఁడును-
పార్శ్వమున నుండ యాదవబలముతోడ, ద్వారకకుఁ జేరె సురలతో వజ్రిఁబోలె.

వ. ఇవ్వల పౌండ్రకవాసుదేవుం డనుకాశీరా జొకండు వారాణసీపురంబున ద్వాదశవర్షం
బులు నిరాహారుం డై పంచాక్షరజపంబు గావించుచు నన్ను నిజనేత్రపద్మంబుచేఁ
బూజింప నేను సుప్రసన్నుండ నై వానికి దర్శనం బొసంగి వరంబుం గోరు మన
వాఁడు తనకు వాసుదేవసమానరూపంబు నర్థింప నే నాతనికిఁ దద్రూపంబు ననుగ్ర
హించి యదృశ్యుండ నైతి. 3184

సీ. అంతట వాఁడు గర్వాంధుఁ డై నాకంటె, వాసుదేవుం డను వాఁడు లేఁడు
వలయు నాకె సపర్య సలుపఁగా నెల్లరు, లేకున్నఁ గూల్తు ముల్లోకములను
నని బలాత్కారంబునను లోకుల నెల్ల, బాధించి ప్రజలఁ బడయుచుండ
నారదుం డొక్కదినంబునఁ దద్దర్పి, మడఁపంగ నేతెంచి యతనికిట్లు

గీ. భూతలాధిప ద్వారకాపురిని వాసు, దేవనామంబునను వసుదేవపుత్రుఁ
డున్నవాఁ డొక్కరుఁడు వాని నుక్కడంప, కున్న నీపేరు జగమున నుండ దనియె.

సీ. ఆమ్మహామునిపలుకు లాలించి పౌండ్రక, వాసుదేవుఁడు క్రోధవశతచేతఁ
దార్క్ష్యపతాకాన్వితస్యందనారూఢుఁ, డై చతురంగసైన్యంబుతోడ
ద్వారకాపురముపై దండెత్తి శంఖంబు, పూరింప నవ్వుచు శౌరి వచ్చి
సంధించి బాణపంచకము శార్ఙ్గంబున, బలము నెల్లను నేలపాలు చేసి

గీ. యొక్కశరమున శార్ఙ్గంబు నొక్కకోల, గరుడకేతనమును నొక్కకాండమునను
శంఖచక్రాదులను జతుస్సాయకములఁ, నాల్గుభుజముల ఖండఖండములు సేసి. 3186

సీ. వదలంగఁ జక్రంబు వానిపై నది యేఁగి, తచ్ఛిరంబును ద్రుంచి దాని నపుడె
పడవైచి కాశిలోఁ బౌండ్రకవాసుదే, వాంతఃపురంబున నడుగుడెంచె
నాశీర్షమును జూచి కాశీశ్వరునిపట్టి, యైనమృత్యువు క్రోధ మూనవిల్లఁ
దనతనూజుం డై నదండపాణికిఁ జెప్పు, వాసుదేవునిఁ జంపవలయు ననుచు

గీ. నతఁడు ననుఁ గూర్చి మాహేశ్వరాధ్వరంబు, సలుపఁ గృష్ణునివధియించుతలఁపుతోడఁ
దన్మఖంబున నేను సంతసము నొంది, కృత్య నొకదాని నాతని కిచ్చినాఁడ. 3187

వ. అంతట దండపాణి జ్వాలామాలాపరీతయును సందీప్తసటాకలాపయును బింగళలోచన
యును జ్వలత్కరాళవదనయును త్రిశూలహస్తయును భస్మభూషితయును నరశిరో
మాలాలంకృతయును సర్వలోకభయంకరాకారయును నగుమాహేశ్వరకృత్యను
గ్రహించి సపుత్రకళత్రబాంధవుం డగు వాసుదేవుని దహింపు మని యభిమంత్రించి
పంచె. 3188

సీ. అంతట నాకృత్య యాత్మతేజంబుచే, దహియించుచును మహీతలము నెల్లఁ
బ్రళయకాలానలనిభగతిఁ గడురనా, దంబు సేయుచును రోదసులు నిండ

వాయుజవంబున ద్వారకాపురి కేఁగి, చొచ్చు చుండంగఁ గృష్ణునిగృహంబు
శౌరి తత్క్షణమంద చక్రంబు దానిపై, విడువంగఁ గృత్య యవ్వేళఁ జూచి

గీ. గజగజ వడంకుచును భీతికతన మరలి, పఱచి కాశికిఁ జని దండపాణిగృహముఁ
జొచ్చుటయు దానివెంబడిఁ జొచ్చి విష్ణు, చక్రము లయానలజ్వాలజ్వాల లొలయ.

క. దహియించి దండపాణిన్, సహపరివారముగ వారణాసీపురమున్
సహనరపశుఖగపాదప, గృహహర్మ్యసమేతముగ దహించి సలీలమున్. 3190

క. అరుదెంచి వాయుజవమున, హరికరముం జొచ్చె నంత నబ్జాక్షుఁడు సో
దరపుత్రపౌత్ర భార్యా, పరివారసమేతముగను భాసిలు చుండెన్. 3191

సీ. మగధదేశాధీశుఁ డగుజరాసంధుఁడుఁ, యుద్ధంబునను క్షత్త్రియులను నెల్ల
నోడించి కారాగృహోపబద్ధులఁ జేసి, వారి నెల్లను బలాత్కారమునను
ప్రతిమాసమును గృష్ణపక్షచతుర్దశి, నాఁ డొక్కొకనిఁ జంపి నాఁటిరేయిఁ
దద్రక్తమును నివేదనము సేయుచు భైర, వునకుఁ బూర్వద్వేషమునను జేసి

గీ. యు దవ్వుల నెల్లఁ బట్టి పాలార్చు చుండ, వానిదుర్వర్తనము విని వాసుదేవుఁ
డవనిభారంబుఁ దీర్పంగ నవతరించి, నటినారాయణుం డాట నాగ్రహించి. 3192

వ. జరాసంధుండు మద్వారంబున శస్త్రావధ్యుం డగుటం జేసి మల్లయుద్ధంబునం దక్క నతనిం గెడప సాధ్యంబు గా దని నిశ్చయించి భీమార్జునులతోడం గూడి విప్రవేషంబునం దత్పురంబుం బ్రవేశించి యాతనికి దర్శనం బీయ జరాసంధుండు వారలకు భక్తి ప్రణామంబు గావించి. 3193

గీ. భూసురోత్తములార యుష్మత్పదాబ్జ, రేణుసంస్పర్శమునను మద్గృహముపరమ
పావనం బయ్యె ధన్యతఁ బడసె మిమ్ముఁ, గాంచుటను జేసి నాజన్మకర్మములును.

క. కోరుండు మీర లెయ్యది, కోరిన నది యిచ్చువాఁడ, గొంకక యనుడున్
స్మేరాననంబుతోడను, వారిజనాభుండు చూచి వానిమొగంబున్. 3195

గీ. ఇతఁడు భీముఁడు ఫల్గునుఁ డితఁడు నేను, గృష్ణుఁడను ద్వంద్వయుద్ధార్థ మేఁగుదెంచి
యున్నవారము నీతోడ నొసఁగు మఁటయె, యిచ్ఛకొలఁదిని మాలోన నెవని కేని.

క. అనుడు జరాసంధుఁడు భీ, ముని తోడను మల్లయుద్ధమును ఘోరముగా
నొనరించెఁ బంచవింశతి, దినములు సురలకును గుండె దిగ్గురనంగన్. 3197

గీ. అంతటను గృష్ణచోదితుఁడై సమీర, సూనుఁ డమ్మగధేశునిమేను రెండు
చీలికలు గాఁగఁ జీల్చి నేలమీఁద, విసరివైచినఁ బ్రాణముల్ విడిచె వాఁడు. 3198

వ. అటుమీఁదఁ గృష్ణుండు జరాసంధనిరుద్ధులగు పార్థివుల నెల్ల బంధనిర్ముక్తులం జేసి భీమార్జునుల తోడం గూడి యింద్రప్రస్థంబున కరుదెంచి యుధిష్ఠిరునిచే రాజసూయ మహాక్రతువుం జేయించె. [illegible]99

సీ. ఆయధ్వరంబు సమాప్తి నొందినమీఁద, సకలధాత్రీనాథసమితిలోన
శ్రీకృష్ణునకు యుధిష్ఠిరుఁ డగ్రపూజ గాం, గేయానుమతమునఁ జేయు చుండ

న్నగ్రపూజకుఁ గృష్ణుఁ డర్హుండు గాఁ డని, శిశుపాలుఁ డనుచితశీలయుతుఁడు
దూషించు చుండంగ రోషంబునను జక్ర, ధరుఁడు చక్రమునఁ దచ్ఛిరముఁ ద్రుంచె

గీ. నంతటను శిశుపాలుఁడు హరిపదంబుఁ, జెందె జన్మత్రయాంత మైనందువలన
నవలఁ గృష్ణుఁడు ద్వారక కరిగెఁ జనిరి, సకలపార్థివులును స్వస్వసదనములకు. 3200

గీ. అవల మధురాపురంబున నని యొనర్చి, దంతవక్త్రుఁడు శౌరితోఁ దద్గదాప్ర
హారణమున దేహముఁ ద్యజించి పరమపదముఁ, జెందె జన్మత్రయాంత మైనందువలన.

వ. ఇట్లు జయవిజయులు సనకాదిమహామునిశాపవ్యాజంబున భగవల్లీలార్థంబు మర్త్య
లోకంబున హిరణ్యకశిపుహిరణ్యాక్షులుగను రావణకుంభకర్ణులుగను శిశుపాలదంత
వక్త్రులుగను నవతరించి భగవానునిచేతన నిహతులై జన్మత్రయావసానంబునఁ బరమ
పదముం జెందిరి. 3202

సీ. అటుమీఁదఁ గృష్ణుఁడు యమునానదిని దాఁటి, ప్రమదంబునను గోకులమున కేఁగి
వందనం బొనరించి నందునకు యశోద, కును మిగిలినవృద్ధగోపులకును
దివ్యభూషణముల దివ్యవస్త్రంబుల, నర్పించి వ్రజవాసు లందఱకును
యమునానదీపులినమునఁ బ్రేమక్రీడ, గావించుచును వ్రజాంగనలఁ గూడి

గీ. యొక్కమాసద్వయం బట నుండి యచటి, నిఖిలజీవుల వైకుంఠనిలయమునకుఁ
బనిచి దేవవిమానంబుపైని నమర, వర్గము నుతింపఁగను ద్వారవతికిఁ జేరె. 3203

వ. అట్లు శ్రీకృష్ణుఁడు ద్వారకాపురంబునకుం జేరి వసుదేవోగ్రసేనసంకర్షణప్రద్యుమ్నాని
రుద్ధాక్రూరాదులచేఁ బ్రతిదినంబునుం బూజింపంబడుచు విశ్వరూపధరుం డై యష్ట
మహిషీజనంబులను షోడశసహస్రకళత్రంబులను దివ్యరత్నమయనానాగృహాంతరంబు
లందు సురతరుకుసుమసమంచితమృదులపర్యంకంబులందుఁ గుసుమశరకేళీసుఖాంభోధి
నోలలార్చుచు మహానందంబున నుండ. 3204

సీ. ఒకనాఁడు బ్రాహ్మణుం డొకఁడు కుచేలాఖ్యుఁ, డతిదరిద్రుఁడు ద్వారవతికి వచ్చి
తనసతీర్థ్యుం డైనదైత్యారి దర్శింపఁ, దలఁచి భైష్మీగృహద్వారమందు
నిలువంగఁబడుటయు జలజాక్షుఁడు గ్రహించి, చనుదెంచి యటకుఁ దత్క్షణమున నంద
కొనిపోయి యాతనిఁ దనచంద్రశాలకు, నుచ్చాసనమునఁ గూర్చుండఁబెట్టి

గీ. కలశమున రుక్మిణీదేవి జలము వోయఁ, దత్పదంబులు గడిగి మూర్ధమునఁ జల్లు
కొని తదంబుకణంబులు గుశలవార్త, లడిగి యాతని సంతసంపడ నొనర్చె. 3205

వ. తన కర్పింప యాచించి తెచ్చినపృథుకంబు లాతనిజీర్ణవసనంబునం దుండ స్నేహభావం
బున మందహాసంబుఁ జేయుచు నవి స్వయముగాఁ గైకొని భుజించి కుచేలున కరుగ
నాజ్ఞ యొసంగె. 3206

సీ. అపుడు కృష్ణుం [illegible] నని, చింత నొందుచును గుచేలుఁ డదను
స్వపురంబునకు వచ్చి స్వగృహాంబులోఁ గల, ధనధాన్యవస్తుసంతతులఁ జూచి

యాశ్చర్యమును జెంది యవి యెల్ల శౌరిద, యాగమాగతములె యని తెలిసి
విష్ణుసంప్రీతికై వివిధయాగములను, గావించి మోక్షంబు గాంచె దుదకు

గీ. నవల ధృతరాష్ట్రనందనుం డగుసుయోధ, నుండు పాండునృపాలసూనులను మాయ
జూదమున గెల్చి గళితరాజ్యుల నొనర్చి, వెడలగొట్టంగ వా రెల్ల నడవి కరిగి. 3207

వ. ద్వాదశాబ్దంబు లరణ్యవాసంబును నొక్కహాయనంబు మత్స్యదేశాధిపతి యగు విరా
టునిపురంబున నజ్ఞాతవాసంబును గావించి కృష్ణసాహాయ్యంబున ధార్తరాష్ట్రులతోడ
సంగ్రామంబునకుం దొడంగిరి. 3208

సీ. అపుడు కురుక్షేత్రమందుఁ బాండవులకు, ధార్తరాష్ట్రులకు యుద్ధంబు జరుగఁ
బార్థసారథి యయి భగవానుఁ డతనిలో, స్వీయశక్తిని బ్రవేశింపఁజేసి
యడఁగార్చి యేకాదశాక్షౌహిణీయుతం, బగను దుర్యోధనముఖుల నెల్ల
స్థాపించి పాండునందనుల రాజ్యమునందు, క్షితిభార ముడిపి నిశ్శేషముగను

గీ. గురియుచుండంగ సుర లెల్లఁ గుసుమవృష్టి, యాకసమునుండి తనమీఁద హర్షమునను
ద్వారకకుఁ జేరి బంధుసంతతుల కెల్ల,సంతసము గొల్పుచుండ నాసమయమందు.3209

వ. ఒక్కబ్రాహ్మణుండు మృతుండై నపంచవార్షికబాలకుని నొక్కనిం గొనివచ్చి కృష్ణ
భవనద్వారంబునం దుంచి కృష్ణుండు నాపుత్రుని బ్రదికింపకున్న నే నిచ్చోటన ప్రాణం
బుల నుజ్జగించెద నని యేడ్చుచుండ. 3210

సీ. ఆసమయంబున నర్జునుం డేతెంచి, వాసుదేవునిఁ జూచువాంఛతోడ
నావిప్రువిలాప మాలించి నీయర్భకుని బ్రతికింతు నే నని వచించి
సకలసంజీవనాస్త్రములఁ బ్రయోగించి, యవి యెల్ల వ్యర్థంబు లగుటఁజేసి
తత్ప్రతిజ్ఞకు భంగ మొనగూడుటను దాను, మేను వాయుట కుద్యమించుచుండ

గీ. నపుడు భవనంబులోనుండి యరుగుదెంచి, శౌరి దర్శన మీయ నాభూసురుండు
కృష్ణ నాపుత్రు లార్వురు మృతిని జెంది, రింక నేనును మరణింతు నిటనె యనియె.

క. అనవుడుఁ గృష్ణుఁడు కనికర, మొనయఁగ భూసురవరేణ్య యేడ్వకుము భవ
త్తనయుల నెల్ల నొసంగెద, నని యభయము నిచ్చి యతని కతిశీఘ్రముగన్. 3212

గీ. అర్జునునితోడఁ దార్క్ష్యవాహనము నెక్కి, విష్ణులోకంబునకు నేఁగి విప్రసుతుల
మాధవాజ్ఞచేఁ గొని మహికి వచ్చి, భూసురున కిచ్చెఁ బ్రజల కాశ్చర్య మొదవ.

క. అంతట నాబ్రాహ్మణుఁ డ, త్యంతామోదమున సుతుల నార్వురఁ గొని దై
త్యాంతకునకు బహుళాశీ, స్సంతతు లొనరించి చనియె స్వగృహంబునకున్. 3214

వ. కృష్ణుండు తనభార్యలయందుఁ బదివేలమందిపుత్రులం గాంచి తత్పుత్రపౌత్రపరంపరచే
మరల భూభారం బగు నని తలంచి యాదవుల నెల్ల ఋషిశాపవ్యాజంబున సంహ
రింప సంకల్పించె. 3215

సీ. అపుడు కృష్ణకుమారు లందఱు నర్మదా, తటమున విహరింపఁ దలఁచి యేఁగి
యచటఁ దపంబు సేయుచు నున్నకణ్వుని, గాంచి తచ్ఛక్తిని గాంచ నెంచి

జాంబవతీతనుజన్ముఁ డై నట్టిసాంబుఁ, బునకు స్త్రీవేషంబుఁ దనరఁ జేసి
యాయనముసలంబు నతిగుప్తముగఁ బెట్టి, తత్కుక్షిసంస్థవస్త్రంబులోన

గీ. వానిఁ గొనిపోయి యాకణ్వమౌనికడకు, స్వామి యీగర్భిణికి మగవాఁడు పుట్టఁ
గలఁడొ యాఁడుది పుట్టునో తెలుపుమనుడుఁ, దెలిసికొని సర్వమును దివ్యదృష్టినతఁడు.

సీ. మూఢాత్ములార యీముసలంబె యాదవా, న్వయనాశకర మగు నని శపింప
వారలు ఖిన్నులై ద్వారక కేతెంచి, కృష్ణునకావార్త నెఱుఁగఁజేయ
నాముసలము నొక్కహ్రదములోఁ గలిపెఁ జూ, ర్ణీకరింపఁగఁజేసి కృష్ణుఁ డంత
నమ్ముసలము కనిష్ఠాంగుళిమాత్రశేషముతోడ నుండఁ దజ్జలములోన

గీ. దాని నొకచేప మ్రింగ నద్దాని నొక్క, వ్యాధుఁడు వధించి తద్గర్భమందుఁ జొచ్చి
నట్టిముసలావశేషంబు స్వాశుగాగ్ర, ఫలకముగఁజేసికొని సంతసిలుచు నుండె. 3217

సీ. అటుమీఁద నొకనాఁడు యాదవు లెల్లరు, వాసవప్రేషితాసవమును
ద్రావి తన్ముసలచూర్ణప్రభూతము వజ్ర, సమమును నగుపేరణమును జొచ్చి
యొకళ్ళు లెఱుంగక యుద్ధ మన్యోన్యంబు, సలిపి యచ్చట మ్రందఁ జనిరి దివికి
శౌరి యామానపరిశ్రాంతుఁ డై శయనించి, యొకచెట్టునీడ నిట్టూర్పు లొలయ

గీ. నుంచికొని జానువునఁ బాద ముల్లమందుఁ
దలఁచు చుండంగ నిజమూర్త్యతనువు నుడుగ
నప్పు డావ్యాధుఁ డటకు వేటాడ వచ్చి
దూరమునఁ గాంచి తత్పదాంభోరుహంబు. 3218

గీ. దాని మృగముగ నెంచి తత్క్షణమునంద, చాపమునఁ గూర్చి ముసలశేషఫలకాంచి
తాశుగము దానిపై నేసి యశనిఁబోలె, శీఘ్రముగ నేగుదెంచి యాచెట్టుకడకు.

క. కనుఁగొని కృష్ణుని మానస, మున నుద్భవిలంగ భీతి పురుషోత్తమ నా
యొనరించినయపరాధం, బును సైఁపు మ టంచు మ్రొక్కి ముంగల నిలిచెన్. 3220

గీ. అట్టియెడ శౌరి వ్యాధుని నాదరించి, కాల మొనగూడుటను నిట్టిఘటన యొదవెఁ
జింతిలకు మని పలుకుచుఁ జేత నిమిరి, వానిమేను వైకుంఠంబు వానిఁ గొనఁగ. 3221

గీ. అనల శౌరి మనుష్యదేహంబు విడిచి, యాత్మవిష్ణుస్వరూపంబు నధిగమించి
యష్టమహిషీయుతంబుగా నధివసించి, గరుడిపై నిజవిష్ణులోకమున కరిగె. 3222

సీ. మును దండకారణ్యమున రామచంద్రునిఁ, గామించిన ఋషిప్రకాండు లెల్ల
గోపిక లై పుట్టి గోకులంబున శౌరి, నావిర్భవిలినరాఘవునితోడఁ
దమి దీరఁ గూడి కామముచేత మోక్షంబుఁ, జెంది రసురపులు ద్వేషించి హరిని
నొనసిరి ముక్తి నాతనిచేత హతు లయి, కలిగె ద్వేషమున దైత్యులకు ముక్తి

గీ. కామమును ద్వేషమును నరకమునఁ గూల్చు, నట్టి వయ్యును భగవదుపాశ్రితంబు
లగుటచే మోక్షసాధన మయ్యె నింక, భక్తియోగంబునను ముక్తిఁ బడయు టరుదె.

వ. అంత బలరామదేహంబుతోడ రేవతియును బ్రద్యుమ్నశరీరంబుతోడ రుక్మిపుత్త్రి
యును ననిరుద్ధకళేబరంబుతోడ నుషయును వసుదేవకాయంబుతోడ దేవకియును
స్వస్వభర్తృదేహంబులతోడఁ దత్తద్యాదవాంగనలును ద్వారకాపురసర్వజనంబులును
నగ్నిప్రవేశంబు గావించి కృష్ణసాన్నిధ్యముం బడసిరి. 3224

గీ. అంతటను వారలకు నెల్ల నాచరించె, నౌర్ధ్వదైహికకర్మంబు నర్జునుండు
దారుకుఁడు వచ్చి దివ్యరథంబుమీఁద, నునిచికొని పారిజాతంబుఁ జనియె దివికి.

సీ. అట్లు కృష్ణహీన మై ద్వారకాపురం, బుండంగ నందులో నుండలేక
శౌరిషోడశసహస్రకళత్రములతోడఁ, బార్థుఁ డచ్చటనుండి బయలుదేఱె
నంతటఁ ద్వారక యంబుధిలో మునిఁగె, శౌరివియోగార్తి సైఁపలేమిఁ
బ్రస్థితుం డై హరిప్రస్థంబునకుఁ బార్థుఁ, డరుగు చుండంగ మార్గాంతరమునఁ

గీ. చోరు లేతెంచి కొంద ఱర్జునునిఁ గొట్టి, శౌరికాంతలఁ గొనిపోవ సవ్యసాచి
యేమియును జేయఁజాలక యేఁగె శౌరి, తోడనె మదీయబల మని దుఃఖపడుచు.

వ. సాయంసమయమార్తండుండువోలె వినష్టతేజుం డై యింద్రప్రస్థంబునకుం జేరె.

సీ. మును దేవగంధర్వవనిత లష్టావక్ర, పారికాంక్షినిఁ జూచి పరిహసించి
యతఁడు శపింప వేశ్యలు గాఁగ భయపడి, వానిపాదంబులపైని వ్రాలి
యపరాధమును సైఁపు మని వేఁడి తత్ప్రసా, దమున మాధవుని భర్తగను బడసి
తచ్ఛాపవశమున దస్యులపాలైరి, కలుగదె కీడు పెద్దలను నవ్వ

గీ. శాపఫలమును వార లాచందమునను
ననుభవింపంగ వలసియుంటనె కిరీటి
శక్తియును జాలదయ్యెఁ దస్కరుల గెలువ
నగజ మునులప్రభావ మే మనఁగవచ్చు. 3228

సీ. వేదోక్తవిధులఁ గావించుచుఁ దద్బలం, బునను మహోన్నత్యమును వహించి
గర్వంబునను గన్ను గానక రాక్షసుల్, బాధించు చుండఁ బ్రపంచములను
బుండరీకాక్షుఁడు బుద్ధరూపంబున, నవనితలంబునం దవతరించి
రచియించి బౌద్ధశాస్త్రమును దానను వారి, కభిరుచి గల్గించి యధికముగను

గీ. ధర్మవిముఖులఁ జేయంగఁ దగ్గిపోయె
స్వల్పకాలంబునను దైత్యశక్తి యెల్ల
నదియె తఱి యని నారాయణాస్త్రమునను
బిలుకుమార్చితి నాదురాత్ములను నేను. 3229

ఆ. జలజలోచనుండు గలియుగాంతంబున, నవతరించి కల్కి యనెడిపేర
క్షితిసురాన్వయమునఁ జెంపాడి మ్లేచ్ఛుల, నుర్వరాభరంబు నుడుపఁగలఁడు. 3230

క. భగవదవతారచరితము, లగరాజతనూజ సంగ్రహంబుగ నీకున్
మిగులంగనీక చెప్పితి, విగళితమగు నఘము లెల్ల వినుటను వీనిన్. 3231

ఉ. ఇంకను నేమి యైన విన నిచ్చ జనించిన నీకు నాత్మలో
శాంకరి కోరు మేర్పడఁగ సర్వముఁ దెల్పెద నాఁగ గౌరి యే
ణాంకకిరీటు నాపయి దయామతి గల్గిన-చో వచింపుమీ
పంకజపత్త్రనేత్రునిసపర్యకు వైష్ణవమార్గ మంతయున్. 3232

—: వైష్ణవసపర్యామార్గకథనము :—

క. అని యడుగుటయును హరుఁ డి, ట్లనియెను శర్వాణి వినుము స్వయవ్యక్తము స్థా
పన మనియు రెండుతెఱఁగులఁ, దనరారుచు నుండు విష్ణుధామము తరుణీ. 3233

వ. శిలామృద్దారులోహాదులచే విష్ణుప్రతికృతిం గావించి దాసిని శ్రౌతస్మార్తాగమక్రియాకలాపంబుచే స్థాపించిన నయ్యది స్థాపనంబు. పాషాణదారువులలో దేనియందు నారాయణుండు స్వయముగనే సన్నిహితుండై యుండు నయ్యది స్వయంవ్యక్తంబు. 3234

క. ఆరెండుధామములు నై, త్యాగిని బూజింప నమ్యోన్నత్వంబులు వే
కూరని దేవియు లేకు తి, దారాధనమునను భక్తులగువారలకున్. 3235

గీ. శౌరి యా విర్భవించె నిచ్ఛవశత్వమున, భూవసిద్ధులలోపమువచే గొంతలందు
నదు శ్రీరంగశాయి యై యవనిఁ గల్గు, వాటిలో ముఖ్యములు కొన్ని గుణాగారు వినుమ.

ఆ. అవతరించెఁ గాన యాతని మాహాత్మ్యం బెన్న, గిరి నగాత్మజ వినుము నీరజాక్షి
యావి గొలువ నచరిక్కిన పాదనంబును నేను, సురసమూహములకు సరుగ నొనఁగు. 3237

గీ. ఉందు నేను స్వయంవ్యక్తము నుండు చోట, నమ్మి తార్చన సేయుచు నమ్మతింపు
తదపచితి సేయువారికి దర్శనంబు, నొసఁగుదును కాని యుస్థాపితములందు నొసఁగనెప్పుడు.

క. కావున సర్వమూర్తిని, సేవింపఁగవలయు నెల్లఁ బ్రొద్దులఁ గడుఁ గిన్
గోవిందునిసాన్నిధ్యము, గావలయు నభీష్టవాంఛ గలిగినయెడలన్. 3239

క. వనజాక్షి భరితవర్షం, బున సర్వమూర్తులందుఁ బురుషోత్తముఁ డుం
డినపగిది నితరధామం, బున నుండఁడు తత్ప్రభావమును నేమందున్. 3240

వ. ఇంద్రద్యుమ్నంబును కూర్మంబును సింహాద్రియును గరవీరకంబును గాశీప్రయాగసాలగ్రామంబులును ద్వారవతియును నైమిషంబును బదరికాశ్రమంబును గృతశౌచంబును పౌండరీకంబును దండకారణ్యంబును మాథురంబును వేంకటాద్రియును శ్వేతాద్రియును గరుడాచలంబును గాంచియును ననంతశయనంబును శ్రీరంగంబును భైరవాచలంబును నారాయణాచలంబును సౌమ్యంబును వారాహంబును వామనాశ్రమంబును మున్నగుమహాస్థలంబులు స్వయంవ్యక్తస్థానంబులుగాఁ జెప్పంబడియె. సాలగ్రామశిలార్చనంబు గృహంబులందును విహితంబు. అర్చనంబును మంత్రపఠనంబును యాగంబును యోగంబును నామసంకీర్తనంబును వందనంబును సేవయును భగవచ్ఛిహ్నాంకనంబును దదీయారాధనంబును ననునవవిధకర్మంబులు వైష్ణవునకు విహితంబులు. తాపాదిపంచసంస్కారియును నవేజ్యాకర్మకారకుండును నర్థపంచకవిదుండును

బ్రాహ్మణుండును నగు వైష్ణవుండు మహాభాగవతుండుగాఁ జెప్పంబడియె. అతండు భగవంతుండువోలె సర్వలోకపూజ్యుం డగుట గురుశబ్దవాచ్యుం డయ్యె. నవకర్మ విధానయాగంబు క్షత్రియునకును భగవచ్ఛిహ్నాంకనంబును సేవయుఁ దదీయారాధనంబును మంత్రరత్నజపంబును నామసంకీర్తనంబును వందనంబును నను షట్కర్మయాగంబు వైశ్యునకును నామసంకీర్తనంబును సేవయుఁ బూజయు వందనంబును దదీయారాధనంబును ననుపంచకర్మయాగంబు శూద్రునకును విధియింపఁబడియె. మానసయాగంబు [illegible] సమానంబు. వర్ణాశ్రమానురూపంబుగా శ్రుతిస్మృత్యుక్తకర్మంబు లాచరించుచు వైష్ణవుండు విష్ణుయాగంబు గావింపవలయు. శ్రుతిస్మృతిపురాణోక్తాచారంబుల నుల్లంఘించిన వైష్ణవుండు పంచపాతకత్వముం జెంది రౌరవనరకంబునకుం బోవు. 3241

క. శమమును [illegible]యును [illegible], [illegible] నహింసయును నా[illegible]త్యాగంబుల్
దమమును సత్యముఁ దపమును, సమస్తజనులకును ధర్మసాధనము లగున్. 3242

వ. నిశాంతంబున [illegible] వైష్ణవుండు గరుడవ[illegible]రంబున హరిస్మరణంబును గావించి [illegible] తులసీమూలమృ[illegible] పవిత్రయుతంబుగాఁ [illegible] మంత్ర[illegible] గాయత్రిచేతను నభిమంత్రించి మృత్తికామంత్రంబు[illegible] జలంబున [illegible] స్నానంబు గావించి పురుష[illegible] మార్జనంబు చేసి [illegible] మంత్రంబు [illegible] మూలమంత్రించి [illegible] సలిలప్రా[illegible] పవిత్రధరుండై [illegible] మూలమం[illegible] నభిమంత్రించి దాన[illegible] పుండ్రంబులం దాల్చి [illegible] గృహంబున కేఁగి [illegible] విష్ణుముఖము [illegible] ప్రసూనాలంకృత[illegible] గాని స్వయంవ్యక్తంబు గాని లక్ష్మీనారాయణుని [illegible] విధానంబునఁ [illegible] లోపంబు లేకుండ యథాశక్తి నారాధింపవలయు. [illegible]తంబు. వాసిష్ఠంబు [illegible]ర్తంబు. పాంచరాత్రాగమంబు. [illegible] వైదికాగ్నియందుఁ బురుషసూక్తశ్రీసూక్తమంత్రంబులచే నాజ్య[illegible] నష్టోత్తరశతవారంబులు గాని యష్టావింశతివారంబులు గాని హోమంబు గావించి విష్ణునామంబులచే [illegible] నాహుతి [illegible]. పిమ్మట భూనీళావిమలాదిశక్తులను ననంతవిహగేంద్రాదులను వాసుదేవాదులను కేశవాదిమూర్తులను సంకర్షణాదిమూర్తులను మత్స్యకూర్మాదులను చక్రాద్యాయుధంబులను కుముదాదులను చంద్రాదిదేవతలను నింద్రాదిలోకపాలురను ధర్మాదిదేవతలను నుద్దేశించి హోమంబును నర్చనంబును గావింపవలయు. ఇట్లు నిత్యార్చనంబు [illegible] భాగవతోత్తముండు. గృహార్చనమునందు గృహద్వారంబున [illegible]యజ్ఞవిధానంబుచే బలి నొసంగి పిదప నాచ

మించి కృష్ణాజినకుశోత్తరం బగునాసనంబు నధిష్ఠించి పద్మాసనాసీనుం డై భూతశుద్ధిం గావించి మూలమంత్రంబుచేఁ బ్రాణాయామత్రయంబు చేసి హృత్పద్మంబు నూర్ధ్వముఖంబు గావించి విజ్ఞానభానునిచే వికసింపం జేసి తత్కర్ణికయందు వహ్న్యర్కశశిబింబంబులను వానిపైని నానారత్నమయపీఠంబును దానిపైని బాలార్కసదృశప్రభంబును మంత్రాక్షరమయంబును నగునష్టదళపద్మంబును దానిపైని సర్వలక్షణలక్షితం బగులక్ష్మీనారాయణమూర్తిని ధ్యానించి మూలమంత్రంబు సహస్రవారంబులు గాని శతవారంబులు గాని జపించి మానసికార్చనంబు గావించి తత్కాలాగతు లగువైష్ణవాతిథుల నర్చించి యన్నపానాదులచేఁ దృప్తి నొందించి తాను బుత్రకళత్రాదులతో భుజింపం దగు. బ్రహ్మరాక్షసబేతాళయక్షభూతార్చనంబును మద్యమాంసభుగ్దేవతార్చనంబును గుంభీపాకమహానరకపతనకారకం బగుటం జేసి తదర్చనంబు గావింపం జనదు. తామసదేవతలకును బిశాచాదులకును నివేదించినయన్నంబు దినువాఁడు పూయశోణితంబుల భుజియించినవాఁ డగు. యజ్ఞదానాదులవలనఁ గోటిజన్మంబులనుండియు వాఁడు సంపాదించినపుణ్యం బంతయును దత్క్షణంబ నశియించి చండాలత్వమ్ముం జెందు. విష్ణుభుక్తావశేషాన్నంబున నితరదేవతలకు హోమద్వారంబునను బలిద్వారంబునను బ్రాహ్మణద్వారంబునను సంతృప్తి గావింపం జను. విష్ణునివేదితాన్నంబు పితృదేవతలకును సంతృప్తిదాయకంబు. అవైష్ణవాన్నంబును బతితాన్నంబును హరికి నివేదింపనియన్నంబును శ్వమాంససదృశంబులు. యక్షరాక్షసాదినివేదితాన్నంబును మద్యంబును లశునంబును మూలకంబును గృంజనంబును దలపిష్టంబును శిగ్రువును బిల్వంబును గోశాతకియును నలాబువును శ్వేతవృంతాకంబును నభక్ష్యంబు లగుటం జేసి వానిం దినువారును వారిసంసర్గంబు గావించువారును ఘోరనరకముం జెందువారు. పతితపాషండవికర్మస్థసంసర్గంబును పతితసంసర్గిసంసర్గంబును నిరయహేతువులుగాఁ జెప్పంబడియె. అభక్ష్యభక్షణాగమ్యాగమనహింసాపరద్రవ్యాపహరణంబులు నిరయదాయకంబులు.

—: వైష్ణవభక్తదాసైకాంతిపరమైకాంతిస్వరూపనిరూపణము :—

వేదవేదాంగపారగుండును బ్రహ్మక్రియారతుండును శంఖచక్రాంకితుండును సత్యశౌచక్షాంతియుక్తుండును రాగద్వేషవర్జితుండును నగ్నిహోత్రియును నతిథిపూజకుండును బాపపరాఙ్ముఖుండును దయాధర్మశీలుండును దులసీమాలాధరుండును విహితతిలకధారియును విష్ణువిగ్రహారాధకుండును శివనిందావిముఖుండును నగుబ్రాహ్మణుండు వైష్ణవుండు. బాల్యంబు మొదలుకొనియును విష్ణుభక్తి గలవాఁడు భక్తుండు. విప్రసేవారతుండును విష్ణుపూజకుండును వేదసమ్మితపురాణశ్రోతయును నగుశూద్రుండు దాసుండు. నారదాదులు వైష్ణవులుగను బ్రహ్లాదధ్రువాంబరీషాదులు భక్తులుగను విదురాదులు దాసులుగను జెప్పంబడిరి. శాస్త్రదూషణభాషణంబులం బరిత్యజించి

భగవత్కైంకర్యలోలుండై యుండువాఁ డేకాంతి. సమస్తలోకంబును హేయబుద్ధిచేఁ బరిత్యజించి కేవలనారాయణధ్యానపరుండై యుండువాఁడు పరమైకాంతి. పాపయుక్తం బయ్యెనేని వైష్ణవుండు తత్కాలంబును నేకాంతి తద్గ్రామంబును బరమైకాంతి తద్దేశంబును విడువవలయు. కృత్యాకృత్యవివేకంబును బరలోకచింతనంబును దత్ప్రాప్తిసాధనంబును విష్ణుస్వరూపజ్ఞానంబును వైష్ణవునకు నత్యావశ్యకంబులు. చక్రాంకనోర్ధ్వపుండ్రధారణంబును విష్ణుమంత్రజపంబును విష్ణ్వర్చనంబును విష్ణుస్మరణంబును విష్ణుకీర్తనంబును విష్ణుసేవయు విష్ణువందనంబును వైష్ణవారాధనంబును విష్ణుప్రసాదతీర్థసేవయు ననునవవిధభక్తి వైష్ణవునకు ముఖ్యంబు. వైష్ణవుండు నారాయణునిఁ బ్రపత్తిచే శరణుపొందం దగు. ప్రపత్తి సాత్త్వికరాజసతామసరూపంబునఁ ద్రివిధంబు. తత్సిద్ధియుఁ ద్రివిధంబ. వైష్ణవునకు నిత్యనైమిత్తికకామ్యరూపంబునఁ గృత్యంబు త్రివిధంబు. గోవిందుని భక్తిచేఁ ద్రికాలంబులందును బ్రతిదినంబును నర్చించుట నిత్యంబు. విశేషమాసదినంబులందుఁ జేయువిశేషార్చనంబు నైమిత్తికంబు. కోర్కెచేఁ గావించువిష్ణుకైంకర్యంబు కామ్యంబు. ధనుర్మాసంబునఁ బ్రతిదినంబును నుషఃకాలంబున నుత్పలకరవీరకుసుమంబులచే హరి నర్చించి మాసాంతంబున బ్రాహ్మణసంతర్పణంబు చేయువాఁ డశ్వమేధసహస్రపుణ్యముం బడయు. మాఘమాసంబున భానూదయకాలంబున స్నానంబు గావించి ప్రతిదినంబును నుత్పలాదిపుష్పంబులచే మాధవుని నర్చించుచు మాసాంతంబున బ్రాహ్మణసంతర్పణంబు గావించువాఁడు విష్ణులోకముం జెందు. మధుమాసంబున వకుళచంపకంబులచే మాధవుని నిత్యంబును బూజించి గుడాన్నంబు నివేదించుచు మాసాంతంబున విప్రసంతర్పణంబు గావించువాఁడు సహస్రవార్షికపూజాఫలంబుం జెందు. మాధవమాసంబున శతపత్త్రంబులచే హరిని బూజించి దధ్యన్నంబును ఫలంబులను గంధోదకంబును బ్రతిదినంబును నివేదించుచు మాసాంతంబున భాగవతసంతర్పణంబు గావించువానిసదనంబున నారాయణుండు లక్ష్మీసమేతుండుగాఁ బ్రీతుండై నివసించు. జ్యేష్ఠమాసంబున శుక్లకమలపాటలకుముదంబులచే హృషీకేశుని నర్చించి ప్రతిదినంబును జూతిఫలయుతాన్నంబు నివేదించి మాసాంతంబున బ్రాహ్మణసంతర్పణంబు గావించువాఁడు కోటిగోదానంబులు గావించినఫలముం జెందు. ఆషాఢమాసంబున ననుదినంబును శౌరిని శ్రీపుష్పంబులచే నర్చించి పాయసాన్నంబు నివేదించుచు మాసాంతంబున భూసురసంతర్పణంబు చేయువాఁడు షష్టివర్షసహస్రపూజాఫలముం జెందు. శ్రావణమాసంబునఁ గేశవునిఁ బున్నాగకేతకీదళంబులచేఁ బూజించి నిత్యంబును ఘృతశర్కరామిశ్రితాపూపనివేదనంబు గావించుచు మాసాంతంబున బ్రాహ్మణసంతర్పణం బొనర్చువాఁడు జన్మరాహిత్యముం బడయు. భాద్రపదమాసంబునఁ గుందకరవీరంబులచేఁ బుండరీకాక్షునిం బూజించి నిత్యంబును గుడమిశ్రితక్షీరాన్నంబు నివేదించుచు మాసాంతం

బున ద్విజసంతర్పణంబు గావించువాఁడు ప్రతిదినంబును గోటిగోదానంబులు చేసిన ఫలముం జెందు. ఆశ్వయుజమాసంబునఁ బురుషోత్తముని నీలోత్పలంబులచేఁ బూజించి నిత్యంబును నపూపమిశ్రితక్షీరనివేదనంబు గావించుచు మాసాంతంబున విప్రసంతర్పణంబు గావించువాఁడు నిజజనావృతుండై కల్పకోటిసహస్రంబు వైకుంఠంబునందు నివసించు. కార్తికమాసంబున నఖండదీపంబు నుంచి జాతీపుష్పకోమలతులసీదళంబులచే నచ్యుతునిఁ బూజించి క్షీరాజ్యశర్కరోపేతమిష్టాన్నపాయసాపూపనివేదనంబు నిత్యంబును గావించుచు మాసాంతంబున బ్రాహ్మణసంతర్పణంబు చేయువాఁడు విష్ణుసాయుజ్యముం జెందు. అమావాస్యామందవారవైష్ణవర్క్షరవిసంక్రమణవ్యతీపాతచంద్రసూర్యగ్రహణంబులందు విశేషనైమిత్తికార్చనంబు గావింపం జనుఁ గురూత్క్రాంతిదినంబునను జన్మనక్షత్రదినంబునందును వైష్ణవేష్టి గావించి వైష్ణవసంతర్పణంబుం జేసె నేని కులకోటి నుద్ధరించి విష్ణుసాయుజ్యంబు నొందంగలుగు. మంత్రరత్నంబుచే సప్తరాత్రంబు లష్టోత్తరసహస్రహవిర్హోమంబులు గావించి యంతంబున వైష్ణవానువాకంబుచే నవభృథంబు చేసి మహాభాగవతార్చనసంతర్పణంబులు గావించె నేని వైష్ణవలోకంబున శాశ్వతంబుగా నివసించు. ఇవ్విధి బుధ [illegible] ద్విజవిత్తంబును వైష్ణవుండు విష్ణుకైంకర్యంబు యథాశక్తిని గావింపవలయు. విష్ణ్వారాధనంబు కంటెఁ విష్ణుభక్తారాధనంబు పరతరంబుగాఁ జెప్పంబడియె. వారిని బూజించి వైష్ణవార్చనంబు గావింపఁ డేని వాఁడు భాగవతుండు గాఁడు దా[illegible]. 3243

క. కావున వైష్ణవపూజను, గావింపఁగ వలయు విష్ణుకైంకర్యముఁ గా
గావించువాఁడె సత్తము, గోవిందున కిదియె తృప్తిఁ గొలుపుఁ [illegible]. 3244

వ. సర్వజగదీశ్వరుం డగు నారాయణునికంటె నన్యదేవత నుత్కృష్టంబుగాఁ జెప్పువారును గపాలభస్మాస్థిధారులును నవైదికలింగధారులును వానప్రస్థాశ్రమస్థులు గాక జటావల్కలంబుల ధరియించువారును నవైదికకర్మకారులును శ్రుతిస్మృతిపురాణోక్తాచారవర్జితులును భగవత్ప్రతిమాన్యులును వేదోక్తకర్మంబులు స్వచ్ఛందంబుగా నాచరించువారును సమస్తయజ్ఞభోక్తయును బ్రహ్మరుద్రాదిదైవతంబును నగువిష్ణుని విడిచి యన్యదేవతల నుద్దేశించి హోమంబులును దానంబులును జేయువారును నారాయణుని బ్రహ్మాద్యన్యదేవతాసమానునిఁగా దర్శించువారును జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలయందును మనోవాక్కాయకర్మంబులచేతను నారాయణుని నెఱుంగనివారును బాషండులుగాఁ జెప్పంబడిరి. పాషండపతితశ్వపచదర్శనసంభాషణస్పర్శంబులు వైష్ణవునకు నింద్యంబులు. విష్ణుభక్తి లేనివిప్రుండు పాషండుండు. శిఖోపవీతత్యాగి వికర్మస్థుండు. మహాపాతకోపపాతకయుక్తుండు పతితుండు. అంత్యజుండు శ్వపచుండు.

గీ. అని వచించుటయును నిట్టు లనియె గౌరి, స్వామి యిప్పు డొక్క ప్రశ్నంబు నడుగఁ
దలఁచితిని స్త్రీస్వభావంబువలన నిన్ను, నీవు పాషండుఁడవో కావో నిజము చెప్పుమ.

—: ఈశ్వరపాషండవేషహేతుకథనము :—

సీ. అనవుడు శంభుం డిట్లనియెం గాత్యాయని, నీసంశయము దీర్తు నిజముం దెలిపి
యీరహస్యంబు నీ వెవ్వరికిని దెల్పఁ, దగదు సుమీ [illegible] మునను
నముచిప్రముఖు లై నదనుజపుంగవులు స్వా, యంభువాంతరమునయందు మున్ను
శ్రుత్యుక్తవిధులను [illegible] సేయుచు, ధర్మమార్గంబున [illegible]
గీ. సంచరించుచు నుంట నసాధ్యు లైన, బలముచు బరాక్రమంబున గలుగ వాని
వలన గర్వితు లై [illegible] దేవతల జయించి, [illegible] క్రమించిరి స్వర్గరాజ్యంబు నంత. 3247
సీ. ఇంద్రాదిదేవత లెల్ల భయంబుచే, [illegible] కేగి దనుజబాధ
నెఱిఁగింపఁగను హృషీకేశు [illegible] చి, తత్క్షణంబ [illegible] తలంచె నన్నుఁ
దలంచినంతనె నేను [illegible] కేగి, హరి నన్నుఁ బిలకించి [illegible]
చంద్రశేఖర [illegible] ధర్మంబల [illegible], వలన [illegible] మున్నవారు సురల
గీ. వారలను ధర్మముల [illegible]
సంహరింపంగ జాల నేసరణి [illegible]
గాన [illegible]
[illegible] . 3248
వ. [illegible] వేదబాహ్యమతంబు నవ
లంబించి [illegible] శాస్త్రంబు
స్వయముగా [illegible]
దురాచారు [illegible] సమహర్షులయ్యును
భవచ [illegible] శాస్త్రంబులును గామస
స్మృతులను రచించి [illegible] పుము. [illegible] మహంబున
వార [illegible] వేదధర్మవిహీను
లగుదు రని పలికెను. 3249
సీ. ఆభాషణంబులు నే నాలకించి [illegible], [illegible] ముకు [illegible]
నంగీకరింపక [illegible] దాఁట, [illegible] బగుట [illegible]
యెటు సేయుటకుఁ గూడ నేమియుఁ దోఁపక, చింతించుచుండంగ శ్రీధరుండు
గ్రహించి సర్వ [illegible], [illegible] కార్యము [illegible] సంశయింప వలదు
గీ. దేవతాకార్య మగుటను దీని [illegible], స్వామి [illegible] సున్మదాజ్ఞ
దాఁటం దగదని [illegible] పాతకము గూడ, సంఘటిల్లదు నీ కిందు సత్యమునను. 3250
గీ. కలుష [illegible] లోఁ గలుగు నని, సంశయం బున్నయెడ నీకు సర్వపాప
మథన [illegible] నామములను జపింపుము క్షేమ మొదవు.
వ. సహస్రనామములకు [illegible] “శ్రీరామాయ నమ” యను
మామకషడక్షరమహామంత్రంబు జపింపుము. సర్వదుఃఖంబులును నశేషపాతకంబు

లును. దానం దొలంగు నని యాజ్ఞాపింప నేను దదాజ్ఞ నొందలం దాల్చి కపాలచర్మ
భస్మాస్థిధారణంబుం జేసి పాషండవేషముం దాల్చి పాషండశైవశాస్త్రంబులును స్వాయ
ముగా రచియించి గౌతమాదిమహర్షులయందు మచ్ఛక్తి నావేశింపంజేసి వేదబాహ్య
శాస్త్రస్మృతిపురాణంబులను రచియింపంజేసి తద్బోధంబు గావింపం దొడంగితి. సర్వ
రాక్షసులును నావేషంబును నామతంబునుం దిలకించి మద్బోధమోహితులై వేద
ధర్మచ్యుతిం జెంది నావలన వరంబులం గొని మదమత్తులై సత్త్వహీనులును నిర్వీ
ర్యులును సర్వధర్మభ్రష్టులును నై దేవతలచే సులభంబుగా జయింపంబడి యధో
గతిం జెందిరి. నేను భగవదాజ్ఞచే దేవహితార్థంబు రాక్షసుల మోహింపంజేయ వేద
గర్హితవేషంబుం దాల్చినను హృదయమధ్యంబునం బరమేశ్వరుం డగునారాయణుని
ధ్యానించుచు విష్ణుసహస్రనామరామతారకమంత్రజపంబులం గావించుచు ననవరతం
బును బ్రహ్మానందంబు ననుభవించు చుందు. కావున నన్ను బహిర్వేషంబుచే
బాషండునిఁగను నంతర్వృత్తిచే వైష్ణవునిఁగను నెఱుంగుము. రాక్షసమోహనార్థంబు
నేనును గౌతమాదులును రచించినతామసపురాణశాస్త్రస్మృతులను విశ్వసించువారు
దానవులువోలె నధోగతిం జెందువార. 3252

క. అని చెప్పుటయును బార్వతి, విని సర్వముఁ బ్రాణనాథ వినిపింపుము నీ
వును గౌతమాదిమునులును, బొనరిచినపురాణశాస్త్రములనామములన్. 3253

—: తామసశాస్త్రస్మృతిపురాణనిరూపణము :—

వ. అని యడుగుటయు సదాశివుండు పార్వతి కిట్లనియె. మొదట నేను పాశుపతాది
శైవశాస్త్రంబుల రచియించితి. పిదప గణాదుండు వైశేషికశాస్త్రంబును గౌత
ముండు న్యాయశాస్త్రంబును గపిలుండు సాంఖ్యశాస్త్రంబును బృహస్పతి చార్వాక
శాస్త్రంబును జైమిని నిరీశ్వరవాదంబును రచియించిరి. మఱియును నష్టాదశమహా
పురాణములలో మాత్స్యము కౌర్మము లైంగము శైవము స్కాందము నాగ్నే
యము ననునాఱుపురాణంబులు తామసంబులు. బ్రహ్మాండము బ్రహ్మవైవర్తము
మార్కండేయము భవిష్యము వామనము బ్రాహ్మము ననునాఱుపురాణంబులు రాజ
సంబులు. వైష్ణవము నారదీయము భాగవతము గారుడము పాద్మము వారాహము
ననునాఱుపురాణంబులు సాత్త్వికంబులు. ఇట్లే గౌతమము బార్హస్పత్యము సాంవ
ర్తము యమము శార్ఙ్గము నౌశనసము ననునాఱుస్మృతులు తామసంబులు.
యాజ్ఞవల్క్యము నాత్రేయము తైత్తిరము దాక్షము కాత్యాయనము వైష్ణవము
ననునాఱుస్మృతులు రాజసంబులు. వాసిష్ఠము హారీతము వ్యాసము పారాశరము
భారద్వాజము కాశ్యపము ననునాఱుస్మృతులు సాత్త్వికంబులు. 3254

ఆ. సాత్త్వికములు మోక్షసంధాయకంబులు, స్వర్గదములు రాజసములు దామ
సములు నరకదాయకములు గావున క్షేమ, కామి విడువవలయుఁ దామసముల.

క. అని నుడువుటయును బార్వతి, విని సర్వము నాథ నాకు విష్ణుసపర్యన్
జొనరింప వాంఛ పొడమెడి, ననుమతి యి మ్మనుచు వేడ హరుఁ డిట్లనియెన్

సీ. గౌరి నీకోర్కెకుఁ గడు సంతసించితిఁ, బురుషోత్తమునిపూజ పుణ్యదంబు
వైష్ణవి వగునిన్ను వనితఁగాఁ గొనుట నా, చేసినతప మెల్ల సిద్ధి నొందెఁ
జనదు గురూపదేశంబు లేకుండఁగ, నంబుజాక్షునిపూజ యాచరింపఁ
ద్వద్గురూత్తముఁ డైన వామదేవునికడ, కరిగి తదుపదేశ మంది రమ్ము

గీ. నావుడు భవాని మిగుల సంతసము నొంది, వామదేవునికడ కేఁగి వాసుదేవ
మంత్రనామార్చనాదు లవశ్యమని చెప్ప, నంతయు గ్రహించి రజతాద్రి కరుగుదెంచి.

క. అది మొదలు విష్ణుపూజను, మొదటను గావించి మంత్రమును నామముల్
విదప జపించుచు నిత్యము, వదలక నైకంఠభక్తివశ యై యుండెన్. 3258

సీ. అని వచింప దిలీపుఁ డాశ్చర్యమును జెంది, గురువర నేను నీకరుణవలన
ననఁదగినవిశేషవిషయంబులను నెల్ల, నాలించి ధన్యుఁడ నైతి నింకఁ
దొకసంశయముమాత్ర మున్నది మదిలోన, నది తీర్ప దక్షుఁడ వగుదు వీవ
బ్రహ్మవిష్ణుమహేశ్వరత్రిమూర్తులలోనఁ, దథ్యంబుగను బరదైవ మెవరొ

గీ. చెప్పు మనుడు వసిష్ఠుఁడు క్షితివరేణ్య, యనుఁగఁ దగినరహస్యంబు నడిగి నాకు
సంతసముగొల్పితివి బుద్ధిశాలి వగుదు, వినిచెదను సర్వమును విను విశదముగను.

—: పరదైవనిర్ణయకథనము :—

సీ. మున్ను మందరశైలమునకు స్వాయంభువ, మనువేఁగి బహుతపోధనులతోడ
సంకల్ప మొనరించె జలుప సచ్చట దీర్ఘ, సత్త్రయాగంబు నాసమయమందుఁ
జనుదెంచి రఖిలదేశంబులనుండి వి, ద్వాంసులు యోగులు తాపసులును
నప్పు డాసభలోన నయ్యె వివాదంబు, పరదైవ మెవ్వ డనుప్రశ్నమందుఁ

గీ. గొందఱు వచించి రజుఁ డని కొందఱు క్రాగి
రిందుధరుఁ డని హరి యని కొంద ఱనిరి
యంతయును విని శుద్ధసత్త్వాత్ముఁ డెవఁడొ
యతఁడె పరదైవ మని మను వానతిచ్చె. 3260

గీ. అపుడు ఋషు లెల్ల మను వాడినట్టిమాట, సత్య మని సమ్మతించి తత్సత్త్వగుణము
భృగుమహర్షి యొకండె పరీక్షసేయ, దక్షుఁ డని యెంచి యతనిఁ బ్రార్థనమొనర్చె.

సీ. భృగుమౌని యంగీకరించి తత్ప్రార్థన, కైలాసమునకు శీఘ్రముగ నేఁగి
హరమందిరద్వారమం దుండునందినిఁ, గాంచి గిరీశ శంకరునిఁ జూడ
నరుగుదెంచితి భృగు వనుబ్రాహ్మణుఁడ నేను, శివునకు నారాక చెప్పు మనిన
నది విని నంది యనాదరంబున వానిఁ, గానిచి విప్రుఁడ వైన నేమి

గీ. వేళ గా దిది బొఱ్ఱు మా శూలపాణి, కేళిలో నున్నవాఁ డని కినుకఁ బడంగ
భృగువు శాంతి వహించి యనేకదినము, లచ్చటనె వేచికొనియుండి హరునికొఱకు.

సీ. సర్వజ్ఞుఁ డయ్యును శర్వుఁ డజ్ఞుఁడువోలె, సంగనాసంగలౌల్యమునఁ జిక్కి
తనగతి యేమియుఁ గనుఁగొన కునికి లో, నావిర్భవింపంగ నాగ్రహంబు
యోనిలింగాకార మొందంగ శంభునిఁ, దిట్టి నందిని జూచి తీవ్రముగను
శైవుల కెల్లఁ బాషండత్వ మొదవంగ, శాపంబు నొసఁగి తత్క్షణమునంద

గీ. బ్రహ్మలోకంబునకుఁ బోయి బ్రహ్మ కెఱఁగి, నిలువఁబడ ధాత యేమియుఁ బలుకఁడయ్యె
దాని కవమానిని కోపించి ధాత కెందు, నర్చనము లేకపోవుఁగా కని శపించి. 3263

సీ. విష్ణులోకమునకు వెంటనె చని శార్ఙ్గి, మందిరద్వారంబులందుఁ దన్ను
వారింప కునికి నెవ్వరును గోవిందుని, యంతఃపురంబునయందుఁ జొచ్చి
పద్మ యొత్తుచు నుండఁ బదములు శయ్యపైఁ, బవళించియున్నమాధవునిఁ జూచి
దరి కేఁగి బిరబిరఁ దదురఃప్రదేశంబు, నెడమపాదంబున నెగసి తన్నె

గీ. నపుడు సంభ్రమమున లేచి యచ్యుతుండు, పట్టికొని యొత్తుచుఁ దదంఘ్రిపద్మములను
స్వామి ధన్యుఁడ నైతిఁ దావకపదాబ్జ, రేణువులు సోఁకుటను మచ్ఛరీరమందు. 3264

గీ. వివిధసంపదవాప్తిహేతువు లపార
భవజలధిసేతువులు విప్రపాదపద్మ
పాంసువులు వేనిమేనను బడునో వాని
తనువునం దుండుఁ బుణ్యతీర్థంబు లెల్ల. 3265

క. అని పలికి స్వర్ణకలశం, బునను మహాలక్ష్మి జలముఁ బోయుచు నుండం
గను గడిగి తత్పదంబులు, తనశిరమునఁ జల్లుకొనియెఁ దజ్జలకణముల్. 3266

గీ. అది గనుంగొని భృగువు హర్షాశ్రుపూర్ణ, లోచనుం డయి పంకజలోచనునకు
వందన మొనర్చి శుద్ధసత్త్వప్రధాన, మయినతద్గుణమునకు విస్మయము నొంది. 3267

గీ. ఔర రూపంబు విజ్ఞాన మౌర శాంతి, యౌర క్షమ యౌర కారుణ్య మౌర శుద్ధ
సత్త్వగుణ మౌర కలదె యీశక్తి ముజ్జ, గంబులం దెందు నేని యొక్కనికి నైన.

సీ. అని మెచ్చుకొని పంకజాక్షునిగుణముల, నంతరంగమున నత్యద్భుతముగఁ
దిలకించి శార్ఙ్గిని దేవాదిదేవ నీ, వంటి దేవుఁడు లేఁడు వాస్తవముగ
బ్రహ్మణ్యుఁడవు నీవు పరమాత్ముఁడవు నీవు, సర్వలోకావనక్షముఁడ వీవు
సర్వజ్ఞుఁడవు నీవు సర్వశక్తివి నీవు, సర్వబృందారకస్వామి వీవు

గీ. సత్త్వమూర్తివి నీవు నీసత్త్వ మెఱుఁగఁ
దలఁచి యపచారమును నేను జలిపినాఁడఁ
దప్పు సైఁపుము టంచుఁ దత్పదములందు
భక్తిభరితాంతరంగుఁడై పడియె మౌని. 3268

గీ. అప్పు డాదరమేదురస్వాంతుఁ డగుచు, భృగుమహర్షిని లేవంగ నెత్తి శౌరి
ఋషివతంసమ నీయం దొకింత యేని, నేర మనునది లే దని యూరడించె. 3270

వ. అంతట భృగుమహాముని వాసుదేవానుమతిం గైకొని మందరపర్వతంబున కరుదెంచి మహర్షిజనసభామధ్యంబునం జేరి తపోధనపూజితుం డై యి ట్లనియె. 3271

గీ. శంకరుఁడు తామసుండు రాజసుఁడు బ్రహ్మ, సాత్త్వికుఁడు వాసుదేవుఁడు సత్యముగను
జని త్రిమూర్తులకడకు నే ననుభవించి, తెలిసికొనినట్టివిషయంబుఁ దెలిపినాఁడ. 3272

వ. తామసుం డైనరుద్రుండు మచ్ఛాపంబున యోనిలింగాకారముం జెందె. తద్భక్తు లగుశైవు లెల్లరును బాషండు లై భస్మలింగాస్థిధారణంబుం జేయుచు వేదబాహ్య మతంబుల నవలంబించిరి. రాజసుం డైనబ్రహ్మ మచ్ఛాపంబుచేతన జగంబులందుఁ బూజానర్హుం డయ్యె. సాత్త్వికమూర్తి యగునారాయణుం డొక్కఁడ మత్పూజ్యత్వముం బడసె నని చెప్పుటయు మనువును దపోధనులును సంశయరాహిత్యముం జెంది సాత్త్వికమూర్తి యగువాసుదేవుని నొక్కనినె పరదైవంబుగా నిశ్చయించి విష్ణునైవేద్యతీర్థనిర్మాల్యాదు లన్నియును గ్రాహ్యంబు లనియును మహేశ్వరున కర్పితము లైనవస్తువు లగ్రాహ్యంబు లనియును సిద్ధాంతీకరించి మాధవారాధనంబు గావింపం దొడంగిరి. 3273

క. కావున జనవల్లభ నీ, భావంబునఁ గోర్కి పరమపద మొందంగా
నావిర్భవించు నెడఁ బర, దైవం బగుహరిని గొలిచి ధన్యుఁడ వగుమా. 3274

క. అని నుడువుటయు దిలీపుఁడు, మనమున సంతసము నొంది మాధవుసేవల్
బొనరించుచుఁ గాంచి యిహం, బున సౌఖ్యము లెల్లఁ దుదకు మోక్షము నొందెన్.

క. ఇది పద్మోత్తరఖండము, విదితం బొనరించినాఁడ విశదము గాఁగన్
దుదిది యగుటఁ బాద్మమునకు, గుదిగ్రువ్వంబడియె నిందు గోప్యము లెల్లన్. 3276

—: పద్మపురాణపఠనశ్రవణాదిఫలకథనము :—

సీ. సాత్త్వికంబును వేదసమ్మితంబును నైన, యీపురాణము నిల నెవ్వ రేని
వినినఁ బఠించిన వినిచినఁ బాత్రు లై, హరికృపాపూర్ణకటాక్షములకు
ననుభవించి యిహంబునందు సౌఖ్యము లెల్ల, నపవర్గ మొందుదు రంతమందు
శ్రవణర్క్షపూర్ణిమాగ్రహణకాలములందు, ద్వాదశియం దమావాస్యయందుఁ
గీ. గాని దినదినంబునఁ గాని దీని నర్థ, పద్యమో పాదపద్యమో భక్తిఁ జదువ
నశ్వమేధసహస్రంబు నాచరించి, నట్టిఫల మొందుదురు సంశయంబు లేదు. 3277

క. కనకకలశసముపేతము, గను బద్మపురాణపుస్తకమును సమర్పిం
చినఁ బౌరాణికుఁ డగువి, ప్రున కెపుడును దాత విష్ణుపురమున నుండున్. 3278

వ. అని వచియించుటయు శౌనకాదిమహామునులు పరమానందముం జెంది సూతున కుచితసత్కారంబు గావించి యథేచ్ఛంబుగం జనిరి. 3279

క. శ్రీనాథహృదయ హృదయ, శ్రీనాథ మురాద్యభిన్న చిన్మయరూపా
యానందకాననాధీ, శానా శ్రీవిశ్వనాథ సద్గురునాథా. 3280

క. స్మరహర కాశీవిశ్వే, శ్వర సంసారవ్యథానివారణనిపుణా
హరివిధిమహేంద్రముఖని, ర్జరకోటికిరీటరత్నరంజితచరణా. 3281

—: వాణీవృత్తము :—

శమధనహృన్నివాస బుధసన్నుతిప్రభావా
కమలజముఖ్యనిర్జరనికాయదుర్లభాత్మా
సుమశరగర్వనిర్మథనశూర యు శ్రితాప
త్తిమిరవిభేదచండకర దేవ విశ్వనాథా. 3282

గద్యము

శ్రీమచ్చిదంబరకవీంద్రప్రణీతం బైన
శ్రీమదాంధ్రపద్మపురాణంబున
నుత్తరఖండంబు సర్వంబును
సంపూర్ణంబు.

శ్రీకాశీవిశ్వేశ్వరార్పణమస్తు.

శతావధాని శ్రీ పిసుపాటి చిదంబరశాస్త్రికృతగ్రంథములు

1.	శ్రీమదాంధ్రపద్మపురాణము (ప్రథమసంపుటము)	క్యాలికోబైండు	8-0-0
	,, ,, (ద్వితీయసంపుటము)	,,	4-0-0
	,, ,, (తృతీయసంపుటము)	,,	5-0-0
	,, ,, (చతుర్థసంపుటము)	,,	6-0-0
2.	హైమవతీవిలాసము (ప్రబంధము)		0-8-0
3	కపోతకిరాతము (ప్రబంధము)		0-6-0
4.	శ్రీరామాంజనేయము (నాటకము)		1-0-0
5.	శ్రీకృష్ణసందేశము (నాటకము)		0-12-0
6.	భారతీయప్రబోధము (నేటిపరిస్థితుల విమర్శించుకావ్యము)		0-6-0
7.	పీఠికాపురశతావధానము		0-4-0
8.	సబాబుపేటశతావధానము		0-4-0
9.	బెజవాడ శతావధానము		0-4-0
10.	రాజసభావిహారము (అచ్చుకానున్నది)		
11.	పంచాయతనపంచశతి (సంస్కృతము)		1-0-0
12.	అవధానాదర్శము (సంస్కృతము) పి. సుబ్రహ్మణ్యశాస్త్రికృతభావబోధినీవ్యాఖ్యాసమలంకృతము		0-2-0
13.	రాజధర్మకావ్యము (సంస్కృతము - అచ్చుకానున్నది) విద్వాన్ పి. విశ్వేశ్వరశాస్త్రికృతజయవ్యాఖ్యాసమలంకృతము		

పిసుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రికృతులు

14.	శంకరవిజయము (గద్యము)	1-8-0
15.	త్యాగరాజనాటకము (అముద్రితము)	
16.	మాయావిలాసము (ప్రబంధము - అముద్రితము)	

విద్వాన్ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రికృతులు

17.	శ్రీరత్నపాంచాలిక (శ్రీసర్వజ్ఞసింగభూపాలునిసంస్కృతకృత కాంధ్రీకృతి)	1-8-0
18.	దూతవాక్యము (అచ్చుకానున్నది - భాసకృతి కాంధ్రీకృతి)	
19.	ప్రద్యుమ్నాభ్యుదయము ,, (శ్రీరవివర్మభూపాలునిసంస్కృతకృత కాంధ్రీకృతి)	

వ్యాకరణవిద్యాప్రవీణ, ఉభయభాషాప్రవీణ, సాహిత్యాలంకార

పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రికృతులు

20.	పాణినీయము–కావ్యవాఙ్మయము	1-8-0
21.	ఆంధ్రవాఙ్మయవిమర్శము	0-6-0

ప్రాప్తిస్థానము
శ్రీ చిదంబరగ్రంథమాల
రామారావుపేట
కాకినాడ

ప్రాప్తిస్థానము
విద్వాన్ పి. విశ్వేశ్వరశాస్త్రి
ఆంధ్రాధ్యాపకుఁడు వి. ఆర్. కాలేజి
నెల్లూరు

UNIVERSITY OF HYDERABAD
LIBRARY

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean